
## యాగా వేణుగోపాలరెడ్డి

# నా జ్ఞాపకాలు

సామాన్యుని మేలునే తన జీవనసాఫల్యంగా మలుచుకున్న ఆర్థికవేత్త ఆత్మకథ



ఎమెస్కో

సహకారం : అరుణ పప్పు

# నా జ్ఞాపకాలు

సామాన్యుని మేలునే తన జీవనసాఫల్యంగా మలుచుకున్న ఆర్థికవేత్త ఆత్మకథ


## యాగా వేణుగోపాల రెడ్డి

సహకారం: **అరుణ పప్పు**



ఎమెస్కో

**NAA JNAAPAKAALU**
**Yaga Venugopala Reddy**

**నా జ్ఞాపకాలు**
**యాగా వేణుగోపాల రెడ్డి**

సహకారం: **అరుణ పప్పు**

సంపాదకులు: **డా॥ డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ : **జనవరి, 2017**

మూల్యం : రూ. **175/-**

ISBN: 978-93-86327-27-7

కవర్ డిజైన్ : **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్ ప్రై.లి.**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ -500 029, తెలంగాణ.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028.
e-mail : emescobooks@yahoo.com
www.emescobooks.com

పంపిణీదారులు
**సాహితి ప్రచురణలు**
33-22-2, చంద్ర బిల్డింగ్స్
సి.ఆర్. రోడ్, చుట్టుగుంట
విజయవాడ-520 004, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail : sahithi.vja@gmail.com
www.sahithibooks.com

## అంకితం

మా అమ్మానాన్నలకు

# తినబోతూ రుచెందుకు అంటే...

ఢిల్లీ, బొంబాయిల్లోని ఆర్థికవర్గాలకు చెందిన మిత్రులు కొందరు నన్ను నా అనుభవాలతో పుస్తకం రాయమని కొన్నేళ్లుఈగా అడుగుతూ ఉన్నారు. 90ల్లో ఆర్థిక సంక్షోభానికి దారితీసిన పరిస్థితులేమిటి, అప్పుడు ఏం చేశాం, ఎలా బయటపడ్డాం.. ఆ తర్వాత నేను రిజర్వ్‌బ్యాంక్ గవర్నరుగా ఎదుర్కొన్న పరిస్థితులేమిటి, తీసుకున్న నిర్ణయాలకు నేపథ్యం ఏమిటి – వీటన్నిటినీ గుదిగుచ్చి రాస్తే కొత్త విషయాలు తెలుస్తాయి, ఆసక్తికరంగా ఉంటుందని వాళ్లు అడిగేవారు.

మా బంధువుల్లో కొందరు – నా జీవిత ప్రయాణం, అందులో నేను ఎదుర్కొన్న ఆటుపోట్లు, గడించిన అనుభవాలను పంచుకుంటే యువతరానికి ఉపయోగపడుతుందని అనేవారు.

ఇక నా స్నేహితులు కొందరు 'వేణూ, నువ్వు బలే తమాషాగా మాట్లాడతావు. నీ జీవితంలో సరదా సంఘటనలన్నీ ఒకచోట రాస్తే బాగుంటుంది..' అనేవారు.

వీళ్లందరి ప్రేరణతో నా జీవితాన్ని పుస్తకంగా రాయాలని నిశ్చయించుకున్నాను. 2014 డిసెంబరులో పద్నాలుగో ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా నివేదిక సమర్పించాక, ఈ పనికి తగిన తీరిక దొరికింది నాకు.

ఆత్మకథలో ఏమేమి రాయాలి, ఎంత రాయాలి అన్నది నా ముందున్న పెద్ద ప్రశ్న.

విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో జరిగే లోపాలు, ఆచరణలో పెడుతున్నప్పుడు జరిగే అవకతవకల గురించి దినపత్రికలు ప్రతిరోజూ బోలెడంత సమాచారాన్ని కుమ్మరిస్తుంటాయి. తెర వెనుక బాగోతాలను ఎత్తి చూపించాల్సిన పనిలేదు నాకు.

ఏ పనయినా సాఫీగా సాగిపోయినప్పుడు అది వార్త కాదు, ఎవరి దృష్టినీ ఆకర్షించదు. కాని నూటికి తొంభై పనులు సాఫీగా సాగడంలో ప్రభుత్వ అధికారులు

ఎలాంటి కృషి చేస్తారో చెప్పాలని నేను అనుకున్నాను. తమ విధి నిర్వహణలో వారు ఎదుర్కొనే ఇబ్బందులు, గందరగోళాలు, సవాళ్లు, ఒత్తిళ్లు – వీటిని తెలియజెయ్యాలనుకున్నాను.

చెప్పుడు మాటలు – 'అట' కబుర్లు – అనవసరమైన అంశాలు – వేటినీ రాయకూడదని నియమం పెట్టుకున్నాను. నా జీవితంలో కొన్ని సంఘటనలకు కారణాలు తెలిసినా, నిదర్శనాల్లేనందువల్ల వాటిని రాయలేదు. అలాగే ఎవరినీ నొప్పించాలనుకోలేదుగనక కొన్ని ఆసక్తికరమైన అంశాలను సైతం చెప్పలేదు.

విధినిర్వహణలో ఉన్నప్పుడు కొన్ని దాచవలసిన విషయాలుంటాయి. రిటైరయ్యాను కదా అని ఆధికారిక రహస్యాలను బయటపెట్టలేను. అఫిషియల్ సీక్రెట్స్ యాక్ట్ అని కాదు, పబ్లిక్ ఇంటరెస్ట్ దృష్ట్యా సున్నితమైన విషయాలు కొన్ని చెప్పడం కన్నా, చెప్పకపోతేనే మేలు.

నైతిక విలువలకు సంబంధించిన ఈ గుంజాటన వల్ల – అంటే ప్రతిదీ ఎంత చెప్పాలి – ఎంత చెప్పరాదు – ఈ వివేచనకే రెండేళ్ల సమయం పట్టింది. ఏదయినా, కథనం సాఫీగా సాగడానికి అవసరమైనంతే చెప్పానని మీకు అర్థమవుతుంది.

అందువల్ల ఈ పుస్తకంలో ఆటంకాలను ఎదుర్కొని గెలిచిన నాయకులు, రాజకీయ నాయకులు కనిపిస్తారుగాని ప్రతినాయకులు (విలన్లు) కనిపించరు.

వ్యక్తులే కాదు, సందర్భాలూ అటువంటివే. ఆ సమయానికి అవి మంచివో చెడ్డవో అవుతాయి తప్ప వాటికవే మంచివీ కాదు, చెడ్డవీ కాదు. అలా చూసినప్పుడు ఈ రచనలో కొన్ని సంక్షోభ సందర్భాలు కనిపిస్తాయిగాని సందేశాలు కనిపించవు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ పుస్తకం నా అనుభవాల మాలిక. ఇది చదివాక – నా వ్యక్తిత్వం ఎలాంటిది, జీవితంలో నేను ఏయే విషయాలకు ప్రాధాన్యమిచ్చాను, ఏ విలువలను విశ్వసించాను, వేటిని తుదకంటా నిలబెట్టుకున్నాను – వీటిని మీరు అవగాహన చేసుకుంటారు.

ఇక పుస్తకం ఏ భాషలో రాయాలన్నది నాకు మరో పెద్ద ప్రశ్నార్థకమై కూర్చుంది.

నేను తెలుగువాణ్ణి. నా మాతృభాష తెలుగు. ఇంటర్మీడియెట్ వరకూ తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నాను. పై చదువులు ఇంగ్లిష్ మీడియమ్‌లో చదివినా, ఐఏఎస్ పూర్తయ్యాక ఆంధ్రా కేడర్‌కే వచ్చాను. వీటివల్ల నా వ్యక్తిగత, సామాజిక

జీవితమంతా తెలుగుమయం. కాని వృత్తిరీత్యా వ్యవహారమంతా ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.

నా ఆలోచన తెలుగులో ఉంటే – విశ్లేషణ ఇంగ్లిష్‌లోనూ ఉంటుంది.

నా ఇంగితజ్ఞానం (విజ్‌డమ్) తెలుగులోనూ, పరిజ్ఞానమంతా (నాలెడ్జ్) ఇంగ్లిష్‌లో ఉంటుంది.

నా మెదడు ఇంగ్లిష్ మాట్లాడినా, నా హృదయం మాట్లాడే భాష తెలుగే.

అందువల్ల నా జీవితానుభవాలను నేను ముందుగా తెలుగులోనే రాయాలనుకున్నాను.

అయితే నేను తెలుగులో మాట్లాడగలను, చదవగలను కాని రాసే అలవాటు లేదు. అదీగాక వ్యక్తిగత జీవితం వేరు, వృత్తిపరమైన అంశాలు రాయాలనుకుంటే తగిన భాష ఉండాలి. ఆ పరంగా నాక్కొన్ని పరిమితులున్నాయని నాకు తెలుసు. అందువల్ల ఆత్మకథ రాయడానికి మంచి సాయం అవసరమయ్యింది. అప్పుడు నా స్నేహితులు ఆరికెపూడి ప్రేమచంద్ అరుణ పప్పు పేరు చెప్పారు.

నేను చెబుతుంటే విని, రికార్డు చేసుకుని కొంత, నేను ఇచ్చిన మెటీరియల్ చదివి మరికొంత ఆమె రాశారు. పుస్తక రచనలో ఆమె నాకు సాయపడ్డారని అనడం కన్న, మేం ఈ పుస్తకం గురించి కలిసి పనిచేశామనడం సమంజసంగా ఉంటుంది. ఎన్నో జ్ఞాపకాలను ఒకచోట చేర్చడంలో, విభిన్న అంశాలను ఒక వరుస క్రమంలో పేర్చడంలో – మేం చేసిన సంభాషణలు ఉపయోగపడ్డాయి. కథనం సాఫీగా రావడానికి అర్థవంతమైన చర్చలు ఉపకరించాయి.

అరుణ పప్పు సరదాగా ఉంటారు, ఆసక్తిగా వింటారు. సందర్భానికి తగిన, సమయోచితమైన ప్రశ్నలు వేస్తారు. నేను చెప్పదలచుకున్నదానికీ, పాఠకులు నా జీవితం నుంచి తెలుసుకోవాలనుకునే దానికీ మధ్య ఆమె కథన శైలి ఒక విలువైన వారధిగా నిలిచింది. మా పని పూర్తయ్యేటప్పటికి నా తెలుగు మెరుగయ్యింది, ఆమెకు ఆర్థికశాస్త్రం కొంతయినా ఒంటపట్టిందనే అనుకుంటాను!

నేను కడపవాణ్ణేగాని, ఈ పుస్తకాన్ని పూర్తిగా కడప మాండలికంలోనే రాయడం కష్టమనిపించింది. అందుకని వీలైనంతవరకూ అందరికీ అర్థమయ్యే భాషనే ఉపయోగించాం. దీనితో పాటే ఇంగ్లిష్‌లోనూ నా ఆత్మకథను వెలువరిస్తున్నాను.

పబ్లిక్ పాలసీలో సుదీర్ఘ కాలం సాగిన నా జీవితాన్ని, అనుభవసారాన్నీ తెలుగు పుస్తకం ప్రతిఫలిస్తే, పబ్లిక్ పాలసీలో నా పనితీరు, ఆలోచనలు, వృత్తిపరమైన సాధకబాధకాలు – ఇంగ్లీష్ పుస్తకం తెలియజెబుతుంది.

నా బంధువులు, స్నేహితుల్లో చాలామంది తెలుగులో మాట్లాడగలరు, విని అర్థం చేసుకోగలరు కాని చదవడం రాదు. ఇప్పుడు తెలుగువారు చాలామంది పరిస్థితీ అదే. అందువల్లనే ఈ పుస్తకంతో పాటు, నా ఆత్మకథను ఆడియోపుస్తకంగా కూడా తీసుకొస్తున్నాం.

ఐఏఎస్ అధికారి మొదలు, రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ వరకూ, ఆపైన పద్నాలుగో ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా వరకూ సాగిన నా ఉద్యోగ ప్రస్థానంలో కొన్ని మంచి నిర్ణయాలు తీసుకున్నానంటే అది నా ఒక్కడి ప్రతిభే అని చెప్పలేను. ఎంతోమంది సహోద్యోగుల సమష్టి కృషి వాటిలో దాగి ఉంది. తమ పరిజ్ఞానం, చర్చల ద్వారా కొత్త కోణాల్లో ఆలోచనను సాగిస్తారు, సరైన నిర్ణయాలు తీసుకునేందుకు దిశానిర్దేశం చేస్తారు. పేరుపేరునా వాళ్లందరి గురించీ చెప్పాలనే ఉందిగాని, దానికి ఈ పుస్తకం సరిపోదు! వాళ్లందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా తెలుగు పుస్తకాన్ని రాయడంలో సమయమిచ్చి, సాయం చేసి, సంభాషణలు జరిపిన మిత్రులు ఆరికెపూడి ప్రేమ్‌చంద్, ఎస్. వీరనారాయణరెడ్డి, చీమలవాగు నరేంద్రరెడ్డి, వి. భాస్కర్, దుర్గానందస్వామిలకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. రిటైర్డ్ ప్రభుత్వ అధికారి కాటా చంద్రహాస్ ఈ పుస్తకం బాగా రావడానికి విలువైన సలహాలూ సూచనలూ చేశారు. ఆయనకు నా ధన్యవాదాలు.

నా పనిలో నిత్యం సహకరించే సునీల్ నాగ్‌పాల్, సుధాకర్ రెడ్డిలకు థాంక్స్.

ఈ రూపంలో నా పుస్తకం మీ ముందుకు రావడానికి కారకులైన ఎమెస్కో అధినేత విజయకుమార్‌గారికి, ఎడిటర్ చంద్రశేఖరరెడ్డిగారికీ నా కృతజ్ఞతలు.

ఇది చదివాక మీకు ఏమనిపించిందో తెలియజేస్తే సంతోషిస్తాను.

నా వెబ్‌సైట్ www.yvreddy.com

మీ

**యాగా వేణుగోపాల రెడ్డి**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అందుకని వేణుగోపాలుణ్ణి! | 11 |
| 2. | బళ్లారిలో స్వాతంత్ర్యం | 15 |
| 3. | నాలాగా రైఫిల్ పొడుగవుతుందా? | 22 |
| 4. | వివేకానంద కాలేజీ – మా స్వామీజీ | 27 |
| 5. | నిజమైన చదువు మొదలైంది | 32 |
| 6. | నాన్న నమ్మకమే నడిపించింది! | 39 |
| 7. | జ్ఞానంతో పాటు విలువలు | 47 |
| 8. | వేణుగోపాలరెడ్డిని కాస్తా వైవీరెడ్డినయ్యాను | 58 |
| 9. | వాళ్లు ప్రజలు, మనం ప్రజాసేవకులం! | 63 |
| 10. | పెరిగిన ఆత్మవిశ్వాసం | 68 |
| 11. | పెళ్లి 'గీత' కుదిరింది | 75 |
| 12. | రాయలసీమ అభివృద్ధికి... | 79 |
| 13. | గురు ఉపదేశాలు | 90 |
| 14. | జై ఆంధ్రకు దారి తీసిన ప్రత్యేక తెలంగాణ | 96 |
| 15. | ఆఫ్రికా నేర్పిన పాఠాలు | 106 |
| 16. | హైదరాబాద్ చిత్రాలెన్నెన్నో... | 112 |
| 17. | సముద్రంలో నీటిబొట్టును | 119 |
| 18. | లక్ష్మీసరస్వతులిద్దరూ కరుణించిన వేళ | 127 |
| 19. | కథానాయకుడితో కార్యనిర్వహణ ... | 145 |
| 20. | బుద్ధుడికి ఉడతాసాయం | 160 |

21. మార్పును అర్థం చేసుకోవాలని 171

22. మహాలక్ష్మి చెంతకు చేరాను కానీ.. 179

23. రాజకీయమూ ఆర్థికమూ కలిస్తే 185

24. బంగారు తల్లి 191

25. సంస్కరణల పథంలో... 200

26. ముచ్చటలేని మూడేళ్లు 207

27. ఆర్‌బీఐలో అడుగుపెట్టాను 214

28. నా శిష్యరికం 221

29. గవర్నర్లు మారారు 236

30. కొత్త దిశానిర్దేశం 243

31. ఐఎమ్ఎఫ్‌కు స్వాగతం – వీడ్కోలు 251

32. తొలి తెలుగు గవర్నర్ 258

33. అందరివాడు – ఒంటరివాడు 267

34. అందరూ ఆర్థికనిపుణులే 283

35. సంస్థకు నాయకుడిగా.. 295

36. సామాన్యుడికి సేవకుణ్ణి 307

37. శ్రమిస్తేనే అదృష్టం 317

38. క్షణం తీరిక లేదు... 323

39. ఆటతీరు మారిందా? 334

40. కలిసి ఎదుగుదాం 347

# అందుకని వేణుగోపాలుణ్ణి!

నేను 1941 ఆగస్టు 17న పాటూరు అనే పల్లెటూళ్లో పుట్టాను. కడప జిల్లా, రాజంపేట తాలూకాలోని ఊరది. అది మా అమ్మమ్మగారి ఊరు. మా తాత పేరు కసిరెడ్డి గంగిరెడ్డి. ఆ ఊళ్లో మా తాతగారు ఆస్తిపరులే. నాకు ముగ్గురు మేనమామలు, ముగ్గురు పెద్దమ్మలు. వాళ్లందరిలోనూ ఆఖర్న పుట్టింది మా అమ్మ. పేరు అమ్మణ్ణమ్మ. నేను పుట్టేనాటికి ఆమెకు పదిహేడు సంవత్సరాలు.

నాన్నను 'అయ్యా' అని పిలవడమే మాకలవాటు. మా అయ్య పేరు పిచ్చిరెడ్డి. మా తాత యాగా కొండారెడ్డిది కడప జిల్లాలోనే, కొమ్మనవారిపల్లె అనే గ్రామం.

అప్పట్లో బిడ్డలు పుట్టి చనిపోతూ ఉంటే, బతికినవారికి ఇలాంటి పేర్లు పెడతామని మొక్కుకుంటే బతికేవారట. అందుకని మా తాత, నాయనమ్మలు మా అయ్యకు పిచ్చయ్య (పిచ్చిరెడ్డి) అని పేరు పెట్టుకున్నారు. కాని మా అయ్య పుడుతూనే తల్లిని పోగొట్టుకున్నారు. అందువల్ల నాకు మా నాయనమ్మ గురించి అసలేమీ తెలియదు. మా అయ్యకంటే ముందే వాళ్లకు మా పెదనాన్న వెంకట సుబ్బారెడ్డి పుట్టాడు.

మా నాయనమ్మ పోయిన తర్వాత తాత మరో పెళ్లి చేసుకున్నారు. అలా మా నాన్నకు ఒక తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు పుట్టారు. తాను వ్యవసాయదారుడే అయినా, తన కొడుకులు బాగా చదివి ఉద్యోగాలు చెయ్యాలని మా తాత కోరుకునేవారు. ఆస్తిపాస్తులు, వ్యాపారాలు, రాజకీయాల కన్నా పైచదువులకు, ఉద్యోగాలకు పెద్దపీట వేసే మనస్తత్వం ఆయనది. అదే తర్వాత తరాల్లో మమ్మల్నందర్నీ ప్రభావితం చేసింది. అందుకే ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో, మా కుటుంబాల్లో మద్రాసు వెళ్లి చదువుకుని డిగ్రీ పూర్తి చేసినవాళ్లు మా పెదనాన్న, నాన్న, చిన్నాయినలే. మా పెదనాన్న యాగా వెంకటసుబ్బారెడ్డి బీయేబీఎల్ చదివారు, కొన్నాళ్లు ప్రాక్టీస్ చేసి తర్వాత కొమ్మనవారిపల్లెకు వెళ్లిపోయి వ్యవసాయంలో స్థిరపడ్డారు. మా చిన్నాయిన

శివశంకర్‌రెడ్డి, ఎమ్మేఎమ్‌లిట్ చదివారు, ప్రభుత్వ సర్వీస్‌లో చేరి, సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌గా రిటైరయ్యారు. మా నాన్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలోకి ప్రవేశించారు.

1937లో వాళ్ల పెళ్లి అయ్యేదాకా మా అమ్మ ఇంట్లోనే తెలుగు, లెక్కలు నేర్చుకున్నది. పెళ్లయ్యాక వాళ్లు అనంతపురం టౌన్లో ఉండేవారు. అక్కడ ఆమె ట్యూషన్ పెట్టుకుని ఇంగ్లీషు నేర్చుకున్నది. మహిళా క్లబ్బులో చేరి బ్యాడ్మింటన్ వంటివి ఆడేది. మా అమ్మ చాలా హుషారైన మనిషి. మా అయ్య స్వభావరీత్యా చాలా నెమ్మది. మితభాషి. వినడానికి ప్రాముఖ్యమిచ్చేవారు. మంచికి పొంగిపోవడం లేదు, చెడుకు కుంగిపోవడం లేదు.

నేను పుట్టేముందు కాన్పు కోసమని మా అమ్మ పాటూరొచ్చింది. నేను తల్లి పేగు మెడలో వేసుకొని పుట్టానట. మేనమామలకు గండమని, శాంతి చేసేదాకా వాళ్లు నన్ను చూడకుండా, ఇంట్లోకీ బయటకీ దొడ్డిదారిన వెళ్లొస్తూ తమ పనులు చక్కబెట్టుకునేవారట.

కొమ్మనవారిపల్లెకు దగ్గర్లో కొత్తపల్లి అనే అగ్రహారం ఉంది. అక్కడి వేణుగోపాలస్వామి ఆలయం చాలా పురాతనమైనది. కర్ణాటక నుంచి వచ్చిన బ్రాహ్మణులు కొంతమంది ఆ దేవాలయ అర్చకులుగా మా ఊరి చుట్టుపక్కల స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. ఆ దేవుడి పేరు మీద, శ్రీకృష్ణుడిలాగా పేగు మెడలో వేసుకుని పుట్టానని – ఈ రెండు కారణాల వల్ల నాకు వేణుగోపాలరెడ్డి అని పేరు పెట్టారు మా అమ్మా, అయ్యా.

పుట్టిన కొద్దిరోజుల తర్వాత నాకు గాడిద పాలు పట్టేవారట. అవి చనుబాలను పోలిన రుచితోను, పసిపిల్లలకు అవసరమైన అన్ని పోషకాలతోను ఉండటం వల్ల, అవి తాగితే రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్న కారణంతోనూ – అప్పుడే కాదు, ఇప్పటికీ పల్లెల్లో తల్లిపాలు లేని పిల్లలకు గాడిద పాలు పట్టడం తెలుగునాట అలవాటే. మూడు నెల్ల తర్వాత ఆవు పాలలోకి వచ్చానని మా అమ్మ చెప్పేది.

మా చెల్లి సరళ 1943లో పుట్టింది. ఆ పేరు ఇంట్లో ఇంతకుముందు ఒకరికి పెడితే అచ్చిరాలేదని ఆమెను స్కూల్లో చేర్చేటప్పుడు మాత్రం ప్రమీల అని రాయించారు. అయితే ఇప్పటికీ మాకందరికీ ఆమె సరళనే, బయటివారికి ప్రమీల! మా పెద్ద తమ్ముడు మధు (మధుసూదన్‌రెడ్డి) 1945లో పాటూరులోనే పుట్టాడు. కాన్పుల కోసం మా అమ్మ ఎక్కువగా పుట్టినింట్లో ఉండటంతో నాకు ఆరేళ్లు వచ్చేవరకూ

పాటూర్లోనే ఎక్కువగా పెరిగాను. నేను గడగడా, ఎక్కువగా మాట్లాడతానని ఇంట్లో నన్ను 'వాయాడి' 'వదరుబోతు' అనేవారు. అయితే, 'అతి' చేసేవాణ్ణి కాదు. పాటూర్లో మా అమ్మకు చిన్నప్పుడు చదువు చెప్పిన పెద్దయ్యవారే నాకూ అక్షరాలు అంకెలు నేర్పించారు.

మా పెద్దమ్మలు, మేనమామల పిల్లలతో పాటు హాయిగా పెరిగాన్నేను. పొద్దున్నే టిఫిన్ తిని, రోజంతా ఆడుకునేవాళ్లం. నడుముకు సొరకాయ బూర కట్టుకుని బావుల్లో ఈదడం, పండ్ల తోటల్లో తిరుగుతూ మామిడి, చీనీకాయలు కోసుకుతినడం... ఇదే మా పని. చిన్నప్పుడు బావుల్లో ఈదిన అలవాటు వల్ల ఇప్పటికీ ఎంత పెద్ద స్విమ్మింగ్ పూల్లోనైనా బావిలో ఈదినట్టు గుండ్రంగా తిరుగుతూ ఈదుతుంటానే తప్ప నేరుగా పోవడం నాకు రాదు!

పాటూరుకు దగ్గర్లో 'చెయ్యేరు' అనే ఏరు ఉండేది. అక్కడకెళ్లి మిగిలిన పిల్లలతో పాటు ఆడుకోవడం, ఎండ్రకాయలను పట్టుకొని అక్కడికక్కడే ఎండుపుల్లలతో కాల్చుకుని తినడం బాగుండేది. ఐఏఎస్ అధికారిగా మంచి పేరు సంపాదించిన ఏవీఎస్ రెడ్డి నాకన్నా నాలుగేళ్లు చిన్నవాడు. ఏటి ఇసుకలో బొమ్మలేసేవాడు. మేం కలిసి ఆడుకునేవాళ్లం. ఊళ్లో, నీటిలో పరిశుభ్రత తక్కువ కావడం వల్ల నాతో సహా పిల్లలందరికీ తరచుగా కళ్ల కలకలు, చేతివేళ్ల మధ్య దురదల్లాంటివి, గజ్జి వచ్చి ఇబ్బంది పెడుతూ ఉండేవి.

కోడి కాలుతున్న వాసన వచ్చిందంటే చాలు – ఊళ్లో ఎవరింటికో బంధువులు వచ్చారని మాకు ఇట్టే అర్థమయిపోయేది. ఎప్పుడైనా ఎవరైనా పొట్టేలును కోస్తే, ఊరందరూ ముందుగా 'మాకిది కావాలి' అని చెప్పుకోవలసిందే. ఇప్పట్లాగా ఎప్పుడంటే అప్పుడు కోరినవన్నీ దొరికే రోజులు కావవి.

మా వీధిని 'కాపు వీధి' అనేవారు. అటూఇటూ ఆరేసి ఇళ్లు. ఇంగ్లీషు అక్షరం టి ఆకారంలో ఉండే దాని చివరన ఒక సీతారామాలయం ఉండేది. అక్కడ కొలువులు, పండగలు బాగా చేసేవారు. పాటూర్లో రెండుమూడు కమ్మ నాయుడు కుటుంబాలుండేవి. వాళ్లలో ధర్మయ్యనాయుడుగారికి ఊరి కరణంగా మంచి పేరుండేది.

ఊళ్లో ముస్లిములుండే ప్రాంతాన్ని తురకపల్లి, ఇతరులుండే ప్రాంతాన్ని బలిజపల్లి అనేవాళ్లు. మొహర్రం సమయంలో ముస్లిములు చేసే పీర్ల పండగ

హడావిడి అంతాఇంతా కాదు. కణకణ మండే నిప్పుల గుండాన్ని అవలీలగా ఎలా దాటేస్తారో నాకు అర్థమయ్యేది కాదు. ఊరికి కాస్త అవతలగా ఒకవైపు బ్రాహ్మణపల్లి, మరోవైపు మాలపల్లి ఉండేవి. బ్రాహ్మల్లో ఎక్కువమంది ఉపాధ్యాయులుగా, పురోహితులుగా పనిచేసేవారు. చాకలి, మాలమాదిగలు తమ కులవృత్తులతో పాటు వ్యవసాయ పనులున్నప్పుడు కూలీలుగా పనిచేసేవారు. కలిగిన వాళ్ల ఇళ్లలో పనులకు ముస్లిములనో, బలిజలనో పెట్టుకునేవారు.

పాటూరుకు దగ్గర్లో ఏరు, ఊళ్లో బావులు ఉండటం వల్ల వ్యవసాయం బాగా సాగేది. ఏతాలతో తోడి నీళ్లు పెట్టేవారు పంటలకు. అన్ని రకాల కూరగాయలు, పండ్లతో పాటు, నువ్వులు, పసుపు, అరటి, తమలపాకులు కూడా పండేవి. ఆ ఊళ్లో నీలి మందు తయారు చేసేవారని, బెల్లం కాచేవారని నాకు గుర్తుంది. '48 తర్వాత అవి తగ్గుముఖం పట్టాయి, 1953లో సంభవించిన కరువుతో అక్కడి పండ్ల తోటలు బాగా దెబ్బ తిన్నాయి.

ఊరికి కరెంటుండేది కాదు, మా మావయ్యలింట్లో కిరసనాయిలుతో నడిచే ఫ్రిజ్ ఉండేది! రాత్రిపూట వెలుతురు కోసం పెట్రోమాక్స్ లైట్లుండేవి. మా పెద్దమ్మలుండే సీతారాంపురం, కొర్లకుంటలే కాదు, మా తాతగారి ఊరు కొమ్మనవారిపల్లెకు వెళ్లాలన్నా ఎడ్లబండే శరణ్యం. అంతకుమించి మరో ఊరేదైనా వెళ్లాలంటే పాటూరుకు మూడు కిలోమీటర్ల దూరంలోని నందలూరు రైల్వే స్టేషన్ దాకా వెళ్లి రైలెక్కాలి. మద్రాస్ – బొంబాయి లైన్లో ఉండే నందలూరు స్టేషన్‌లో ఆవిరి ఇంజన్లకు అవసరమైన నీరు నింపేవారు. అక్కడికెళ్లినప్పుడు రైళ్లలో వచ్చిపోయే జనాల వేషభాషలు చూడటం మాకు సరదాగా ఉండేది.

# బళ్లారిలో స్వాతంత్ర్యం

అనంతపురంలో చాలాకాలం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసిన మా అయ్యకు ప్రమోషన్ వచ్చింది. బళ్లారిలో కలెక్టరుకు వ్యక్తిగత కార్యదర్శిగా చేరారు. అప్పటికి అది డిప్యుటీ కలెక్టరు స్థాయి. మా అమ్మ పిల్లలు ముగ్గుర్నీ తీసుకుని పాటూరు నుండి బళ్లారి వచ్చేసింది. అప్పటికి నాకు ఐదేళ్లు నిండాయి.

మా అయ్య ఎంత సిన్సియర్‌గా ఉండేవారంటే, ఆఫీసుకు సంబంధించిన పేనా, పేపరు, రబ్బరు, పెన్సిలు – ఎంత చిన్నవస్తువైనా సరే, ఇంట్లో ముట్టుకోవడానికి వీల్లేదు. ఆయన కోసం జీపు వస్తే చూస్తూ నిల్చోవాల్సిందే తప్ప ఎక్కడానికి వీల్లేదు. ఎప్పుడైనా రైలు దిగి ఇంటికి వచ్చేటప్పుడు మాత్రం జీపెక్కించుకుని ఇంటికి తెచ్చి దిగబెట్టేవారు.

బళ్లారిలో నేను చదివింది వార్డ్‌లా స్కూలు. అక్కడ కన్నడ, తెలుగు భేదాలేం ఉండేవి కాదు. నిజానికి తెలుగువాళ్లే ఎక్కువని చెప్పుకోవాలి. ఒకసారి స్కూలుకు జట్కాలో వెళుతున్నప్పుడు ఎందుకో ఉన్నట్టుండి గుర్రం కూలబడింది. అప్పట్నుంచి జట్కా ఎక్కాలంటే చాలా భయంగా ఉండేది నాకు. స్కూల్లో ఒక ఉపాధ్యాయిని నా పట్ల చాలా అభిమానం చూపేవారు. ఇంటికొచ్చే ట్యూషన్ అయ్యవారు కూడా మృదువుగా మాట్లాడేవారు. హోమ్‌వర్క్ పూర్తి చేస్తే తప్ప ఆయన ట్యూషన్ మొదలుపెట్టేవారు కాదు. ఎట్లాగో అట్లా చేసేస్తే కుదరదు, అన్నీ సవ్యంగా వచ్చేవరకు మళ్లీమళ్లీ చేయించేవారు. పనులను సకాలంలో పూర్తి చెయ్యడమనే అలవాటు ఆయన నుంచే అలవడింది నాకు.

అంకె 5 రాయడం రాకపోతే మా అమ్మ నా చెవి మెలిపెట్టడం ఒక్కటి తప్ప స్కూల్లో ఉపాధ్యాయులుగాని, ఇంట్లో అమ్మానాన్నలుగాని ఎప్పుడూ నన్ను కొట్టిన జ్ఞాపకం నాకు లేనేలేదు.

1947 ఆగస్టు 15న 'స్వాతంత్ర్య ఉత్సవం' అంటూ ఒక ఊరేగింపు జరిగితే దాన్లో ఒక ఏనుగు వెనకాల మా స్కూలు పిల్లలందరం కలిసి జెండాలు పట్టుకుని నడిచినట్లు జ్ఞాపకం.

## మద్రాసులో తొలి రిపబ్లిక్ డే..

మా నాన్నకు బదిలీ కావడంతో మా కుటుంబం బళ్లారి నుంచి మద్రాసుకు మారింది. అక్కడ రైలెక్కి మద్రాసులో దిగేసరికి - పెద్ద పండగ వాతావరణం కనిపించింది. నేను ఆశ్చర్యపోతూ ఉంటే మా నాన్న వివరంగా చెప్పారు... 'ఇవాళ జనవరి 26, 1950. ఈరోజు మన దేశం రిపబ్లిక్ దేశంగా అవతరించింది. అందుకే అందరూ సంబరాలు చేసుకుంటున్నారు' అని.

మద్రాసులో మొదట మేం ట్రిప్లికేన్‌లో ఉండేవాళ్లం. ఇంటికి దగ్గరని, తెలుగు మీడియమ్ ఉందని నన్ను హిందూ హైస్కూల్లో చేర్పించాలనుకున్నారు ఆయన. ఎంట్రన్స్ టెస్ట్ రాసి పాసయి ఆరో తరగతిలో చేరాను. 2008లో నేనా స్కూలును సందర్శించినప్పుడు నేనక్కడి పూర్వ విద్యార్థినని తెలుసుకుని వాళ్లు ఆశ్చర్యపోయారు! కాని 1949-50 నాటి రికార్డులు తీసి నా మార్కులు, అటెండెన్స్ వంటి వివరాలను కొన్ని నిమిషాల్లో నా ముందుంచారు. అప్పటి నా బొటాబొటి మార్కులు చూస్తే నేను చాలా మామూలు విద్యార్థినని ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. ఆ స్కూల్లోని ఉపాధ్యాయులు, నా తోటి విద్యార్థులు - నాకెవ్వరూ గుర్తు లేరు.

ఆ సమయంలో నాకు ఇంట్లో చాలా పని ఉండేది. ఎందుకంటే అప్పుడు మా అమ్మ గర్భవతి. మా తాత ఏదో జబ్బు పడి మద్రాస్ జనరల్ హాస్పిటల్లో చేరారు. ఆయన్ని చూడ్డానికని మా ఇంటికెప్పుడూ ఎవరో ఒకరు చుట్టాలుపక్కాలు వచ్చిపోతూ ఉండేవారు. నేను పెద్దవాణ్ణి కనుక ఇంట్లోకి నీళ్లు తెచ్చేవాణ్ణి. చిన్నచిన్న పనులు చేసేవాణ్ణి. ఆస్పత్రిలో ఉన్న మా తాతకు బస్సెక్కి దిగి భోజనం కారియర్ తీసుకెళ్లేవాణ్ణి. ఆయన్ను చూడ్డానికి వచ్చిన చుట్టాలను ఆస్పత్రికి తీసుకెళ్లి తీసుకురావడమూ నా పనే. ఆ కాలంలో మధ్యతరగతి కుటుంబాల్లో ఎనిమిది పదేళ్ల పిల్లలకు ఇటువంటి పనులు మామూలే. పెద్ద విశేషం కాదు. ఇప్పుడు ఇది కొంత వింతగా అనిపించవచ్చు.

వీటితో నాకు ఆడుకోవడానికి సమయమే దొరికేది కాదు. నేను మొదటిసారి చిన్న బంతిని చూసినప్పుడు 'ఇది దేని గుడ్డు?' అని ఆశ్చర్యపోయాను. కొంచెం టైమ్ దొరికితే క్రికెట్ బాట్, టెన్నిస్ బాల్‌తో వీధిలో ఆడుకునేవాణ్ణి. తమిళపిల్లలు బంతిని పంది అంటే నాకు తెగ నవ్వొచ్చేది. 1949లో మా చిన్న తమ్ముడు బాబు (రమేశ్ కొండారెడ్డి) పుట్టాడు.

అప్పుడే మా పెద్దమ్మ కొడుకు రాజగోపాల్ పల్లెను వదిలి చదువు కోసమని మా ఇంటికి వచ్చాడు. పెద్దయ్యాక న్యాయశాస్త్రం చదువుకుని, ఆంధ్రప్రదేశ్

ప్రభుత్వానికి అడ్వొకేట్ జనరల్‌గా, కేంద్ర ప్రభుత్వానికి అడిషనల్ సొలిసిటర్‌గా, ఇండియన్ బార్ కౌన్సిల్ ఛైర్మన్‌గా పనిచేశాడు.

నేనూ మా అన్నా కలిసి కొద్ది దూరం నడిచి, అక్కడ బస్సెక్కి స్కూలుకు వెళ్లి మళ్లీ సాయంత్రం తిరిగొచ్చే వాళ్లం.

నాకన్నా మూడేళ్లు పెద్దయిన అతను తన స్నేహితులతో క్రికెట్ ఆడుతూ ఎప్పుడైనా నన్ను కూడా ఆడించేవాడు. అప్పుడే నేనొక క్రికెట్ మ్యాచ్, మరో కుస్తీ మ్యాచ్ చూశాను. మా ఇంట్లో రేడియో ఉండేదిగాని, దానిమీద అధికారమంతా మా పెద్దవాళ్లదే. తొలిసారి ఎలక్ట్రిక్ ఇంజిన్ను చూసినప్పుడు, 'పొగ రాకుండా ఈ ఇంజిన్ ఎట్లా నడుస్తుంది' అని ఆశ్చర్యపోయా. మా అంకులొకాయన సినిమాకి తీసుకెళ్లారు. లోపల అడుగుపెట్టేసరికి చల్లగా ఉంటే భయం వేసింది. 'ఈ హాలుకు ఏసీ ఉంది. ఏసీ వల్ల చల్లగా ఉంది..' అని చెప్పారాయన.

1952 – 53 కాలానికి మా నాన్న రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డుకు డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసేవారు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా మా నాన్నకు కోపమూ, విసుగూ వంటివేమీ ఉండేవి కాదు. సాయంత్రం పూట కూర్చుని మేమంతా ఏదో ఒకటి మాట్లాడుతుంటే వినేవారు. వినడమే ఆయనకు ఆనందంగా ఉండేది.

మా అమ్మ కష్టపడి పనిచేసేది. చాలా హుందాగా, ఆత్మవిశ్వాసంతో ప్రవర్తించేది. ఆమెకు చదువంటే చాలా శ్రద్ధ. నన్ను పొద్దున నాలుగ్గంటలకే లేపి కూర్చోబెట్టి చదవమనేది. అలాంటప్పుడు మా నాన్నగానీ చూస్తే 'అప్పుడే ఎందుకు ఇంత కష్టం...' అనేవారు. ప్రోగ్రెస్ కార్డు తీస్కెళ్లి చూపెడితే, 'అరె అప్పుడే నువ్వు పెద్ద క్లాసులోకి వచ్చావా...' అని సంబరపడుతూ ఆశ్చర్యపోతూ అడిగేవారు. అప్పుడే ఆయన హిందుస్థాన్ మోటర్స్ వారి మారిస్ మైనరు కారు కొన్నారు. మా కుటుంబమంతా కలిసి దానిలో తిరుపతి వెళ్లి రావడం నాకు బాగా గుర్తుంది.

మా నాన్నతో ఉన్న పరిచయం వల్ల రాయలసీమకు చెందిన యువకులు మద్రాసులో మా ఇంటికి వచ్చి వెళ్లేవారు. మా చిన్నాన్న, మేనమామలకు క్లాస్‌మేట్లయిన వాళ్లు నన్ను ముద్దుగా చూసేవారు. అలా నేను కోట్ల విజయభాస్కరరెడ్డి, దామోదరం సంజీవయ్య, కె.బి.నర్సప్పలాంటి వాళ్లను చాలా దగ్గరగా చూశాను. వాళ్లు సాయంత్రం బీచ్‌కి వెళితే, నన్నూ తీసుకెళ్లేవారు. తర్వాత వాళ్లు రాజకీయాల్లో ఉన్నతస్థానాలకు వెళ్లారు, నేను ఉద్యోగపరంగా ఎదిగాను. కాని చిన్నప్పటి అభిమానమే తప్ప ఏ పరిచయాన్నీ వృత్తిగతంగా దగ్గర కానివ్వలేదు నేను.

లక్ష్మీపురంలో మా ఇంటికి దగ్గరగా ఉన్న కోవెల్లో జరిగే రకరకాల సేవలు, కార్యక్రమాలను చూడటం, సంప్రదాయ సంగీతాన్ని వినడం నాకు బాగా ఇష్టంగా ఉండేది. ఆ కోవెల దగ్గరగానే ఒక హాల్లో 'లక్ష్మీపురం యంగ్‌మెన్స్ అసోసియేషన్' వారు రకరకాల కార్యక్రమాలు నిర్వహించేవారు. వాటికి కొందరు ప్రముఖులను ఆహ్వానించేవారు. అలా నేను కుస్తీ వీరుడు కింగ్ కాంగ్ ను దగ్గరగా చూశాను.

అప్పట్లో అన్నిటికీ రేషన్ పద్ధతి అమలవుతూ ఉండేది. గోధుమలు కొంటేగాని బియ్యం ఇచ్చేవారు కాదు. ఆ పరిస్థితి ఉండటం వల్లనే చపాతీలు, పూరీలు, ఉప్మా వంటివి తెలుగువారికి పరిచయమయ్యాయి. పోనీ పల్లెటూళ్లో పండే బియ్యాన్ని తెచ్చుకుందామంటే అదీ కుదిరేది కాదు. సోదాలు చేసేవారు.

తర్వాత మైలాపూర్‌లోని లక్ష్మీపురంలో బంగళా వంటి పెద్ద ఇంటికి మారాం. దాంతో నేను కూడా స్కూల్ మారవలసి వచ్చింది. మా ఇంటికి ఓ కిలోమీటరు దూరంలో ఉన్న కేసరి హైస్కూల్లో సెకెండు ఫామ్ అంటే ఏడో తరగతిలో చేరాను. ఆ స్కూలు పూర్తిగా తెలుగువారి కోసమే ఉద్దేశించినది. అక్కడ పిల్లల తీరు కొంత రఫ్‌గా ఉండటంతో నాకా స్కూలు పెద్దగా నచ్చలేదు. దాంతో నన్ను వేరే స్కూల్లో వెయ్యమని మా నాన్నను అడిగాను.

'నాకేమీ అభ్యంతరం లేదు. కాని వేరే స్కూలుకు నువ్వు సిటీ బస్సెక్కి పోయి రావాల్సుంటుందేమోనని ఆలోచిస్తున్నా...' అన్నారు మా నాన్న.

'నేను జాగ్రత్తగా వెళ్లొస్తా. నన్నీ స్కూలు నుంచి మార్చెయ్యండి' అని అడిగాను.

అలా నేను టి. నగర్‌లోని పానగల్ పార్కుకు ఎదురుగా ఉన్న రామకృష్ణ మిషన్ హైస్కూల్లో ఎనిమిదో తరగతిలో చేరాను.

రామకృష్ణ మిషన్ హైస్కూల్లో మా లెక్కల అయ్యవారు సుబ్రమణియన్ నాకు బాగా గుర్తున్నారు. అందరూ ఆయన్ని అన్నా అని పిలిచేవారు. రవీంద్రనాథ్‌టాగూర్ రాసిన గీతాంజలి నుంచో, మరేదైనా మంచి పుస్తకం నుంచో ఒక కొటేషన్ చెప్పి, దాని అర్థాన్ని చెప్పాకే ప్రతిరోజూ లెక్కల పాఠాన్ని మొదలెట్టేవారాయన. శివభక్తుడైన మా తెలుగు అయ్యవారు కూడా విద్యార్థుల పట్ల ఎంతో అభిమానంగా ఉండేవారు, పాఠాలు బాగా చెప్పేవారు.

1952లో రాయలసీమలో చాలా పెద్ద కరువు వచ్చింది. కరువు బాధితుల కోసం మా రామకృష్ణ మిషన్ గంజి కేంద్రాలు ఏర్పాటు చేసింది. వాటికి సాయం చెయ్యడానికి విద్యార్థులమంతా జోలెపట్టి విరాళాలు సేకరించాం.

ఆ రోజుల్లో నాకు అత్యద్భుతమైన జ్ఞాపకం ఏదంటే – 1953 అక్టోబర్ ఒకటో తేదీన నేను ఇచ్చిన తొలి ఉపన్యాసం. మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి విడివడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయినది ఆనాడే!

అంతకు ముందు కొద్ది రోజులుగా ప్రత్యేక రాష్ట్రం కోసం ఘర్షణ జరుగుతోంది, నెమ్మదిగా అది పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష రూపం దాల్చింది. ఆయన ప్రాణత్యాగం తర్వాత కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటయింది.

ఈ నేపథ్యంలో మా స్కూల్లో తెలుగు మాస్టారు ఒక ఆవిర్భావ సభ నిర్వహించాలనుకున్నారు. అది తమిళ విద్యార్థులు ఎక్కువగా ఉండే స్కూలయినప్పటికీ, ప్రతి క్లాసులోనూ తెలుగు పిల్లల సెక్షన్ ఒకటి ఉండేది. నన్ను మాట్లాడమని మా ఉపాధ్యాయులు అడిగినప్పుడు నేను సరేనన్నాను. మా తెలుగు మాస్టారు రాసిచ్చిన దాన్ని కంఠతా పట్టి ఏమాత్రం తడుముకోకుండా నిర్భయంగా మాట్లాడేశాను ఆ రోజు. అప్పటివరకూ ఎప్పుడూ చెయ్యని పనిని విజయవంతంగా చేసినందుకు నేను గొప్పగా ఫీలయ్యాను. తర్వాతర్వాత నేను వక్తృత్వంలో రాణించడానికి ఆ ప్రసంగం ఎంతో స్ఫూర్తినిచ్చిందని అనిపిస్తుంది.

1953 అక్టోబరు నాటికల్లా మా నాన్నకు ఆంధ్రరాష్ట్ర రాజధాని కర్నూలుకు బదిలీ అయింది. అప్పటికి కర్నూల్లో ప్రభుత్వ నిర్వహణకు కావలసిన కార్యాలయాలు, భవనాలు ఏమీ ఉండేవి కాదు. మిలిటరీవాళ్లు గుడారాలు వేసి వాటికి ఎ, బి, సి క్యాంపులంటూ పేర్లు పెట్టారు. కుటుంబాలతో నివసించడానికి అందరికీ అవసరమైనన్ని ఇళ్లు కూడా ఉండేవి కాదు. అందుకని మా అమ్మ చిన్నపిల్లలను తీసుకొని మా తాతగారి ఊరు పాటూరుకు వెళ్లిపోయింది.

నా చదువు పాడవకూడదని నన్ను మాత్రం మద్రాసులోనే ఉంచి రామకృష్ణ మిషన్ హైస్కూల్ హాస్టల్లో పెట్టారు.

నేను 'అక్కడ ఉండలేను, మీతో తీసుకెళ్లిపోండి' అని గోల పెడుతూ మా నాన్నగారికో జాబు రాశాను. 'వీలైనంత త్వరలో వస్తాను' అని ఆయన జవాబు రాశారు. రెండు వారాల తర్వాత ఆయన వచ్చేసరికి నేనక్కడ బాగానే కుదురుకున్నాను.

### స్వామీజీకి 'బేణుగోపాల్'ని

మా హాస్టల్లో గదికి 15 – 20 మంది విద్యార్థులుండేవారు. నేల మీద దుప్పటి పరచుకుని పడుకునేవాళ్లం. లేచాక దాన్ని మడత పెట్టి ఓ మూలకు పెట్టాలి. ఉదయాన్నే వ్యాయామం, ప్రార్థన తప్పనిసరి. పాకెట్‌మనీ, చిరుతిళ్లు నిషిద్ధం. మా గదే కాకుండా ప్రార్థన మందిరం, తోట వంటివి కూడా వంతుల వారీగా శుభ్రం చేసే పని మాదే. ఒక్కోరికీ ఒక్కో కంచం, గ్లాసు ఉండేవి. అవి కలిసిపోకుండా వాటి మీద మా నెంబర్లుండేవి. తిన్నాక వాటిని కడుక్కోవాల్సిన పనీ మాదే.

హాస్టలుకు ఓ కిలోమీటరు దూరంలో బడి. అక్కడికి నడిచి వెళ్లిరావాలి. సాయంత్రం గ్రౌండుకెళ్లి ఆడటం కూడా తప్పనిసరి. తర్వాత ప్రార్థన.

హాస్టలును స్వామి చిన్మాత్రానంద పర్యవేక్షించేవారు. ఆయన బెంగాలీ వ్యక్తి. ఇంజినీరింగ్ చదువుకున్నారు, అప్పట్లో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. దానికి గుర్తుగా ఆయన శరీరం మీద బుల్లెట్లు తగిలిన గాయాలు కూడా ఉండేవి. ఆయన పిల్లలతో ఎంత ఆప్యాయంగా ఉండేవారో, అంతే స్ట్రిక్టుగా ఉండేవారు. ఆయనకెందుకో నేనంటే తెగని ప్రీతి. బెంగాలీ ఉచ్చారణలో నన్ను 'బేణుగోపాల్' అని పిలిచేవారు.

అక్కడ వేకువనే లేపగానే లేవాలి. ఆలస్యంగా లేచినా, బొట్టు, విభూతి ఏదో ఒకటి పెట్టుకోకపోయినా ఒకరోజు పాలివ్వకుండా దండించేవారు. ఇంకాస్త అల్లరి చేస్తే ఒక పూట భోజనం కట్.

బుధవారం నాడు చిన్న చాక్లెట్ ఇచ్చేవారు. దానికోసం వారమంతా ఎదురుచూసేవాళ్లం. మాకు చిరుతిండి అంటే అదే. మొత్తమ్మీద రామకృష్ణ మిషన్ స్కూల్లో జీవితం నన్ను క్రమశిక్షణాయుతమైన వ్యక్తిగా తీర్చిదిద్దిందనిపిస్తుంది.

ఆ స్కూల్లో 1955 ఏప్రిల్‌కల్లా నా ఎస్‌ఎస్‌ఎల్సీ (పదకొండో తరగతి) పూర్తి చేశాను.

'మద్రాసు యూనివర్సిటీ నిబంధనల ప్రకారం – మార్కులపరంగా చూస్తే సరేకానీ, వయసుపరంగా చూస్తే కాలేజీలో చేరడానికి ఈ కుర్రాడు అనర్హుడు' అని రాసుంది నా సెకెండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో.

అక్కడే ఉంటే నా చదువుకు అంతరాయం తప్పని పరిస్థితి ఏర్పడింది.

## టూత్‌బ్రష్‌నెట్లా దాచాలబ్బా?

*మద్రాసులో ఉన్నప్పుడు పళ్లు తోముకోవాలంటే పళ్లపొడి, చేతి వేళ్లే మా పనిముట్లు. కాని మా అన్న రాజగోపాల్ అంత పల్లెటూరు నుంచి వచ్చినా టూత్‌బ్రష్షును వాడేవాడు. వాణ్ణి చూసి నాకూ ఓ బ్రష్షుంటే బాగుండనిపించింది. 'అవన్నీ ఎందుకు పో' అనేసింది అమ్మనడిగితే. బ్రష్షు కొనాలంటే డబ్బు కావాలి. ఎలా అని ఆలోచించి మా అన్న నాతో రాని రోజుల్లో బస్సు ఓ స్టేజి ముందు వరకూ నడిచి వెళ్లి ఎక్కేవాణ్ణి. అలా రోజుకో అర్ధణా చొప్పున పొదుపు చేసేవాణ్ణి. టూత్‌బ్రష్షు కొనగలిగినంత డబ్బు పోగయ్యాక మా ఇంటికి దగ్గర్లోని అన్వర్ స్టోర్‌కు వెళ్లాను. తీరా ఆ సమయానికి నాకో సందేహం వచ్చింది.*

*'నీకీ డబ్బు ఎలా వచ్చింది' అని మా అమ్మానాన్నలు అడిగితే?*

*నేను చేసింది చెబితే తంతారని భయపడి మరోసారి అన్వర్ స్టోర్ వైపు దృష్టి సారించాను.*

*అక్కడ సీసాల్లో అందంగా పేర్చిన చాక్లెట్లు కనిపించాయి. ఇక నా మనసు గెంతులేసింది. టూత్‌బ్రష్షు కోరికని గాలికొదిలేసి నా దగ్గరున్న డబ్బుతో చాక్లెట్లు కొనుక్కుని పక్కనే ఉన్న అరుగు మీద కూర్చుని తినేసి సంబరంగా ఇంటికెళ్లిపోయాను.*

## ఐ వాంట్ టు బై ఎ కార్...

*ఇంట్లో ఉన్నప్పుడు నాకు ఎవరైనా ఉత్తరాలు రాస్తే బాగుండునని బలంగా అనిపించేది. ఒకసారి ఒక దినపత్రికలో ప్రకటన చూసి ఒక కార్ల కంపెనీ వాడికి 'ఐ వాంటు బై ఎ కార్...' అని ఉత్తరం రాసి పంపేశాను. వాడేదైనా జవాబు రాస్తాడేమోనని ఎదురుచూస్తుంటే 'హూ ఈజ్ మిస్టర్ వేణుగోపాల్? హి వాంట్స్ టు బై ఎ కార్.. లెట్ మీ టాక్ టు హిమ్...' అని ఆ కార్ కంపెనీ మనిషొకడు నేరుగా మా ఇంటికొచ్చేశాడు. మా నాన్న వాడితో మాట్లాడి సర్దిచెప్పి పంపించారు!*

# నాలాగా రైఫిల్ పొడుగవుతుందా?

**1955** కల్లా మా నాన్న తుంగభద్ర ప్రాజెక్టుకు స్పెషల్ కలెక్టరుగా చేరారు. దాని ప్రధాన కార్యాలయం ఆదోనిలో ఉండేది.

అక్కడి రైతులు ప్రాజెక్టు నిర్మాణానికి, కాలువల తవ్వకానికి సహకరించేవారు కాదు. 'మాకు కాలవలొద్దు, నీళ్లొద్దు. ఉన్న వ్యవసాయం చాలు, మేం భూములివ్వం...' అంటూ పట్టుపట్టేవారు. వాళ్లను నీళ్లకు ఒప్పించడం, ఆయకట్టు అభివృద్ధికి కృషి చెయ్యడం, కాలవలకు కావలసిన భూమిని సేకరించడం – ఇదీ మా నాన్న పని. దానికోసం ఆయన గ్రామాల్లో ఎక్కువగా తిరిగేవారు.

అప్పట్లో కలెక్టరంటే కాళ్లు కింద పెట్టనిచ్చేవారు కాదు సామాన్య ప్రజలు. ఆయన నడిచినంత మేరా తమ పైగుడ్డలు పరుస్తూ వెళ్లేవారు. అది నాకు విచిత్రంగా ఉండేది. ఆ తంతు అంతా ఇష్టం లేక, మా నాన్న ఏ గ్రామానికి వెళ్లినా ఏదో ఒక చెట్టు కింద కూర్చుని అక్కడ గ్రామస్థులందరినీ సమావేశపరిచేవాళ్లు.

తర్వాత చాలా ఏళ్లకు ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కర్నూల్లో ఒక బహిరంగ సమావేశంలో ప్రసంగిస్తూ ప్రాజెక్టు కోసం మా నాన్న చేసిన కృషిని గుర్తుచేస్తూ ప్రశంసించారట. నేనప్పుడు ఢిల్లీలో ఉంటే మా గురువుగారు బి.పి.ఆర్. విఠల్ నాకు హిందూ పత్రిక క్లిప్పింగును పంపారు!

ఎస్ఎస్ఎల్సీ పాసయ్యాక మద్రాసులో ఉండేట్టయితే అక్కడి నిబంధనల రీత్యా కాలేజీ మెట్లు ఎక్కడానికి నా వయసు సరిపోదు. దాంతో నేను మన రాష్ట్రానికి వచ్చేశాను.

### కాలేజీకెళ్తే స్కూలుకెళ్లమంటారేం?

అప్పటికి మా కుటుంబం ఆదోని పట్టణంలో ఉంది. అక్కడకు దగ్గరగా ఉన్నది అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ ఒక్కటే. రాయలసీమ ప్రాంతంలో చాలా ఏళ్ల

నుంచి ఉన్న కాలేజీ అదొక్కటే కావడం వల్ల, అంతకుముందు మా నాన్న ఆ ఊళ్లో పని చేసి ఉండటం వల్ల – నన్ను ఆ కాలేజీలో చేర్చాలని నిర్ణయించారు.

మా చిన్నాయిన యాగా శివశంకరరెడ్డి అక్కడ జిల్లా లేబర్ ఆఫీసర్‌గా పనిచేస్తుండేవారు. వాళ్లింట్లో నా మకాం. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు, ఇంగ్లీషు మీడియం చదువు. నేను కాలేజీకి వెళుతున్నానని మా మేనమామ తను వాడుతున్న చేతి గడియారాన్ని నాకిచ్చారు.

అడ్మిషన్ ప్రక్రియ ముగిశాక, ఫీజు కట్టడానికి కాలేజీ ఆఫీసుకు వెళ్లాను. వాళ్లేమో రోడ్డు దాటి అవతల వైపున్న హైస్కూలు ఆఫీసుకు వెళ్లమంటారు. నేను కాలేజీలో చేరడానికే వచ్చానని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. అప్పటికి నా వయసు 14. నిక్కరు వేసుకుని చిన్నపిల్లాడిలా కనిపించడంతో – స్కూలుకెళ్లడానికి బదులు పొరపాటున కాలేజీ ఆఫీసుకు వచ్చానని అనుకున్నారు.

వాళ్లకు నచ్చచెప్పడానికి నేనెంతో ప్రయాస పడవలసి వచ్చింది. చివరకు అక్కడి క్లర్కు ఒకాయన నా మార్కుల షీటు చూసి మా నాన్న పేరు చూసి గుర్తు పట్టి ఫీజు కట్టించుకున్నాడు. 'నిక్కర్లు కాదు, పైజామాగాని, ప్యాంటుగాని వేసుకుని రావాలి కాలేజీకి' అని సలహా కూడా ఇచ్చాడు.

అప్పట్లో ర్యాగింగ్ అనేది ఉండేది కాదు. జూనియర్లను స్వాగతిస్తూ సీనియర్లు ఉపన్యసించేవారు. అంతే హుందాగా జూనియర్లు కూడా స్పందించేవారు. ఆ సందర్భంగా జూనియర్ల తరఫున నేను మాట్లాడతానని ముందుకెళ్లాను. అప్పుడు నేను తొలిసారిగా ఇంగ్లిష్‌లో మాట్లాడాను. ఆ ఏడాదే నేను పుట్టపర్తి సాయిబాబాను చూసింది కూడా.

ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది మా చిన్నాన్న ఇంట్లో ఉండి చదువుకున్నా. మా పిన్నమ్మ స్నేహలత నాకన్నా మూడునాలుగేళ్లే పెద్ద. అందువల్ల ఆమె నాతో చాలా స్నేహంగా ఉండేవారు. మా చిన్నాయినకు బదిలీ అవుతుందని తెలియడంతో నేను రెండో ఏడాదికి హాస్టల్లో చేరాను.

**జీవితమంటే తెలిపిన మిత్రులు...**

ఆ ఏడాది (1956) అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ హాస్టల్లో ఉండటం అనేది జీవితం, సమాజం పట్ల నా దృక్పథాన్ని పూర్తిగా మార్చేసింది. భిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన ఎంతోమంది మిత్రుల వల్ల నా దృష్టి విశాలమయింది.

నాకు ముగ్గురు రూమ్మేట్లు. గుంతకల్ నుంచి వచ్చిన మూర్తికి పాఠ్యపుస్తకాల కన్నా తెలుగు డిటెక్టివ్ నవలలు చదవడమంటే పిచ్చి. మరో మిత్రుడు ఎన్.హెచ్. వివేకానంద చాలా వెనుకబడిన నేపథ్యం నుంచి వచ్చినా, ప్రవర్తనలో, చదువులో చాలా గొప్పగా ఉండేవాడు. తర్వాత అతను మెడిసిన్ చదివి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసులకు ఎంపికయ్యాడు. మూడో రూమ్మేట్ పేరు వీరన్న. అతను కూడా వెనుకబడిన వర్గాలకు చెందినవాడే. వాళ్ల నాన్న ఆవిరి ఇంజన్లలో బొగ్గు వేసే పని చేస్తుండేవారు. వీరన్న మంచి అథ్లెట్, బాగా చదువుకుని ఇంజినీరయ్యాడు.

కాలేజీలో నాకన్నా మూడేళ్లు పెద్దయినప్పటికీ నాకు ఆత్మీయుడైన మిత్రుడు సంపత్. తన అసలు పేరు కె.ఎస్.ఎల్. నరసింహాచారి. తనూ నేనూ కలిసి జుట్టుకు రాసుకునే బ్రిల్ క్రీమ్ తయారీని సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాం! మా సంపత్ ప్రభుత్వ కాలేజీల్లో ప్రిన్సిపాల్‌గా పని చేసి రిటైరయ్యాడు.

ఒకేడాది సీనియర్ అయిన జెడ్. వీరారెడ్డి ఎన్‌సీసీ వల్ల నాకు మంచి స్నేహితుడయ్యాడు. పల్లెటూరి నుంచి వచ్చి, మొరటుగా ఉండే వీరారెడ్డి వల్ల ప్రపంచాన్ని ఒక కొత్త కోణంలో చూడటమెలాగో నాకు తెలిసింది. బీడీలు కాల్చే అలవాటున్నా, వ్యాయామం బాగా చేసేవాడు. నన్ను కూడా తీవ్రమైన వ్యాయామాల వైపు మళ్లించాలని ప్రయత్నించాడు కాని నేను పడనివ్వలేదు. కాలేజీలో మంచి ఫుట్‌బాల్ ఆటగాడైన వీరారెడ్డి రాష్ట్ర స్థాయిలో కూడా ఆడాడు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్ట్ ఉద్యమాలతో బాగా ప్రభావితుడైన అతను పెద్దయ్యాక మంచి నాయకుడిగా ఎదిగాడు. 'మాటలు వేరు, చేతలు వేరు' అన్నట్టు కాకుండా ఒక పేదపిల్లను చదివించి డాక్టరు చేసి, తర్వాత ఆమెనే పెళ్లి చేసుకున్నాడు. ఆమె కుటుంబాన్ని పోషిస్తూ ఉంటే ఆయన ప్రజాసేవకు అంకితమయ్యాడు.

మరో స్నేహితుడు వీసీ కాటన్న నెమ్మదస్తుడు, చాలా అభిమానస్తుడు. స్కూల్ టీచర్‌గా పని చేస్తూనే తన విద్యార్హతలు పెంచుకుని ఎంతోమంది గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దాడు. జీవితంలో ఎన్ని సవాళ్లు, ఆటంకాలు ఎదురైనా తట్టుకుని నిలబడి విజయం సాధించడమెలాగో మా కాటన్న వంటి మిత్రుల జీవితాల ద్వారా తెలుసుకున్నానంటే అతిశయోక్తి కానే కాదు. ఆ రెండేళ్లలో మన సామాజిక, రాజకీయ అంశాలు ఎన్నో నాకు అర్థమయ్యాయి. ప్రతి అంశానికీ అనేక కోణాలుంటాయన్నది అప్పుడే తెలుసుకున్నాను.

## మా గురువులు

మాకు కెమిస్ట్రీ చెప్పే వై. విశ్వనాథం అనే లెక్చరర్ ఎన్‌సీసీలో కూడా కమాండింగ్ ఆఫీసర్‌గా ఉండేవారు. ఆయన కెమిస్ట్రీ పాఠాలతో పాటు నైతిక విలువలు, మంచి ప్రవర్తనల గురించి కూడా తరచుగా చెబుతుండేవారు. ఆ రకంగా కొన్ని తరాల విద్యార్థుల మనస్సుల్లో ఆయన చెరగని ముద్ర వేశారు.

ఇక మాకు ఫిజిక్స్ చెప్పిన రమేశ్‌మూర్తి ప్రతిభావంతులు. నా మీద ఆయన ప్రభావం ఎంతంటే – ముప్ఫయ్యేళ్ల తర్వాత మా అమ్మాయిని, అబ్బాయిని కూడా ఎమ్‌సెట్ రాయడానికి ముందు ఆయన దగ్గరకే తీసుకుని వెళ్లాను. మా అబ్బాయి వెళ్లేనాటికి రమేశ్‌మూర్తి నెల్లూరు దగ్గర తన సొంతూళ్లో స్థిరపడ్డారు. మా అబ్బాయిని ఆయన తన ఇంట్లో పెట్టుకుని మరీ చదువు చెప్పారు. గడచిన 60 ఏళ్లుగా ఆయనకూ నాకూ మధ్య గురుశిష్య సంబంధం అంతే పదిలంగా కొనసాగుతోంది.

నాకు కాలేజీలో తెలుగు చెప్పిన రామకృష్ణారెడ్డి మాకు బంధువులే. ఆయన్ని విద్యార్థులందరూ తమ అన్నలాగా భావించి అభిమానించేవారు. ఇక మా ఇంగ్లిష్ ఉపాధ్యాయులు పురుషోత్తమ్ అయితే జూలియస్ సీజర్ వంటి పాఠాలు చెప్పేటప్పుడు తనను తాను మర్చిపోయేవారు.

అప్పట్లో నామీద కమ్యూనిస్ట్ పార్టీ ప్రభావం ఎక్కువగానే ఉండేది. పబ్లిక్ మీటింగులకు వెళ్లేవాణ్ణి. గోవా విముక్తి కోసమని రైలు పట్టాల మీద పడుకున్నాను కూడా! ఎప్పుడూ పోలీసులకు మాత్రం దొరకలేదు. అప్పట్లో వేదాంతం లక్ష్మయ్య అనే ఆయన 'దేవుని పార్టీ' అని పెట్టి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేశాడు. అప్పటికే భాగవతకథలు చెబుతూ పాపులర్ అయిన ఆయన చాలా హాస్యంగా ప్రసంగించేవాడు. 'అటు కాంగ్రెస్ వాళ్లు విశ్వాసఘాతకులు, ఇటు కమ్యూనిస్టులు దేశద్రోహులు. ఇక మనకు దేవుడే దిక్కు.. అందుకే మన పార్టీ దేవుని పార్టీ' అనేవాడు!

ఆ రోజుల్లోనే నాకు తెలుగు సాహిత్యమంటే ఇష్టం పెరిగింది. కథలు విరివిగా చదువుతుండేవాడిని. కాలేజీలో మొదటిసారి డ్రామాలో నేను ఆడపిల్లగా వేషం వేశాను. తర్వాత ఏడాది పోలీసు కానిస్టేబుల్‌గా వేశాను.

నాకు ఎన్‌సీసీలో చేరాలని పట్టుదలగా ఉండేది. అప్పట్లో ఎన్‌సీసీలో తక్కువ సీట్లు ఉండటంతో, చేరడానికి పోటీ తీవ్రంగా ఉండేది. కాని అక్కడ కూడా నేను

చాలా చిన్నవాణ్ణని ప్రవేశం నిరాకరించారు. నేను పట్టువదలకుండా సెలెక్షన్లు జరిగే గ్రౌండ్‌కు రోజూ వెళ్లేవాణ్ణి.

'ఏమోయ్, రైఫిల్ (.303) అంత పొడుగైనా లేవు. నీకెందుకు ఎన్‌సీసీ?' అని వేళాకోళమాడారు అక్కడి కమాండింగ్ ఆఫీసర్ ఒకరోజు.

'నేను పెరిగి పొడుగవుతాను. కాని రైఫిల్ ఇంతకన్నా పెరగదుగా' అని వెంటనే సమాధానమిచ్చాను.

ఆయనకు నా సమాధానం నచ్చి సెలెక్షన్‌లో పాల్గొనమన్నారు. మొత్తానికి నేను ఎన్‌సీసీలో స్థానం సంపాదించుకున్నాను. ఎన్‌సీసీలో భాగంగా తిరుపతి, చిత్తూరు వంటి చోట్ల జరిగిన క్యాంపుల్లో పాల్గొనడం, నాకన్నా పెద్దవాళ్లయిన క్యాడెట్లతో తిరగడం వల్ల నా పరిధి విశాలమైంది.

# వివేకానంద కాలేజీ – మా స్వామీజీ

**1956** నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. హైదరాబాద్ నగరం రాజధాని అయ్యింది. అప్పటివరకూ కర్నూలు క్యాంపుల్లో నడిచిన ప్రభుత్వ కార్యాలయాలు, ఉద్యోగులు హైదరాబాద్‌కు తరలివెళ్లడం ప్రారంభమైంది. మా నాన్న మాత్రం తుంగభద్ర ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా ఆదోని నుంచి కర్నూలుకు మారారు. తర్వాత ఆయన 1959లో రెవెన్యూ బోర్డు సెక్రెటరీగా హైదరాబాద్‌కు వచ్చినప్పుడు మా కుటుంబం కూడా హైదరాబాద్‌కు వచ్చింది. మా చెల్లి రెడ్డి కాలేజ్ ఫర్ విమెన్‌లో చేరింది. మా తమ్ముళ్లిద్దరూ అబిడ్స్‌లోని మెథడిస్ట్ స్కూల్లో చేరారు.

1957లో నేను మంచి మార్కులతో ఇంటర్మీడియెట్ పాసయ్యాను. కోరుకున్న బ్రాంచిలో ఇంజినీరింగ్‌లో ప్రవేశించవచ్చనుకున్నాను. కాని అక్కడ కూడా నా వయసే నాకు అడ్డంకిగా మారింది. మామూలు డిగ్రీ కన్నా ఆనర్సు కోర్సులో చేరి, ఏడాది తర్వాత దానిలో కొనసాగడమో లేదా ఇంజినీరింగ్‌లోకి మారడమో చెయ్యవచ్చునన్నారు మా నాన్న, చిన్నాన్న.

ఆనర్సు కోర్సు కేవలం తిరుపతి, విశాఖపట్నం, మద్రాసుల్లో మాత్రమే అందుబాటులో ఉంది. తిరుపతి అప్పుడే పెట్టిన యూనివర్సిటీ. ఇక విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో విద్యార్థి రాజకీయాలు ఎక్కువని వినిపించడంతో మా నాన్న ఇష్టపడలేదు. మద్రాసయితే తెలిసిన ఊరే గనుక మంచిదనుకున్నాం. లయోలా కాలేజీలో చేరేందుకు దరఖాస్తు చేద్దామని మద్రాసు వెళ్లి ముందుగా రామకృష్ణమిషన్ హైస్కూలు చిన్మాత్రానంద స్వామీజీని మర్యాదపూర్వకంగా కలిశాను.

‘వేణుగోపాల్, నువ్వు వేరే కాలేజీలో చేరడం ఏమిటి? వివేకానంద కాలేజీలో చేరు. నేనక్కడ ట్రెజరర్‌ని కూడాను..’ అంటూ ఆయన కార్లో కూర్చోబెట్టుకుని అప్పటికప్పుడు నన్ను ఆ కాలేజీకి తీసుకెళ్లారు. ‘మన స్కూల్లో చదివినవాడే’నంటూ ప్రిన్సిపాల్ సుందరం అయ్యర్‌గారికి పరిచయం చేశారు. లెక్కలు, ఇంగ్లిష్‌లలో నాకు మంచి మార్కులు వచ్చాయి గనుక ఎకనామిక్స్ ఆనర్స్‌లో చేరితే బాగుంటుందని

అన్నారాయన. తర్వాత స్వామీజీ స్వయంగా అక్కడి వార్డెన్‌తో మాట్లాడి నాకో గది కేటాయింపజేశారు. అలా అప్పటికప్పుడు నా అడ్మిషన్, వసతి అన్నీ ఖరారైపోయాయి.

వివేకానంద కాలేజీలో క్లాసులో నలభై మందుంటే, అందరూ సీరియస్‌గా చదివేవాళ్లే. లెక్చర్ జరుగుతున్నప్పుడు సూది పడ్డా వినిపించేంత నిశ్శబ్దంగా ఉండేది. లెక్చరర్లు గొప్ప అంకితభావంతో ఉండేవారు. వర్షాలు ఎక్కువ పడినప్పుడు పైకప్పు కారడం వల్ల తరగతులు జరిగేవి కాదు. విద్యార్థులు ఎక్కువమంది మధ్యతరగతి బ్రాహ్మణులు. అందువల్ల పౌర్ణమి, అమావాస్య రోజుల్లో క్లాసులు ఆలస్యంగా మొదలయ్యేవి.

వివేకానంద హాస్టల్ నిబంధనల పుట్ట. పొగతాగడం నేరం, మద్యం ఆలోచనల్లోకి కూడా రావడానికి వీల్లేదు. సాదాసీదా చొక్కాలే వేసుకోవాలి. ఒకసారి ఎవరో గాఢమైన రంగు, డిజైన్ ఉన్న చొక్కా వేసుకొస్తే, దాన్ని ఆ కుర్రాడి ముందే కాల్చేశారు. హాస్టల్లో ఉదయాన్నే పూజకు హాజరు తప్పనిసరి. రాత్రి 10 తర్వాత మాటన్నది వినిపించకూడదు. నేల మీద పద్మాసనం వేసుక్కూచుని భోజనం చెయ్యాలి. కేవలం శాకాహారమే. పండగల్లో పిండివంటలతో భోజనం చేస్తాం గనుక అది అరగడానికి మా వార్డెన్ ప్రొఫెసర్ ఎ.వి.నాథన్ ఏవో ఆయుర్వేద మాత్రలు ఇచ్చేవారు.

ఈ సమయంలోనే తమిళనాట ద్రవిడ ఉద్యమం ఊపందుకుంది. రోడ్ల పక్కన హిందూ దేవతల్ని, బ్రాహ్మణుల్ని అపహాస్యం చేస్తూ ఊరేగింపులు జరిగేవి. బ్రాహ్మణులు వాటిని ఖండించేవారుగాని, ఈ గొడవలు హింసాత్మకంగానైతే మారలేదు.

వివేకానంద కాలేజీ హాస్టల్ యూనియన్ జనరల్ సెక్రెటరీగా నేను ఎన్నికయ్యాక కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టాను. మొదటిది – హిందువులు కాని వాళ్లను కూడా లెక్చర్లిచ్చేందుకు ఆహ్వానించడం. అలా నేను ఉమన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి మోనా హెస్మన్, న్యూసైన్స్ కాలేజీ వ్యవస్థాపకుడు సయ్యద్ అబ్దుల్ వహాబ్ బుఖారీ సాహిబ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కామరాజ్ నాడార్ వంటి వారిని మా కాలేజీకి ఆహ్వానించగలిగాను. ప్రత్యేక కారణమేదీ లేదుగానీ, మేం ద్రవిడ ఉద్యమ నాయకులెవర్నీ ఆహ్వానించలేదు. బుఖారీకి కింద కూర్చుని తినే అలవాటుండదేమో అన్న ఉద్దేశంతో మా వార్డెన్ ఆయనకో కుర్చీ టేబుల్ ఏర్పాటు చేశారు. హిందూయేతరుణ్ణి సహపంక్తిన కూర్చోబెట్టడం ఇష్టం లేకే కాలేజీ వర్గాలు

టేబుల్ ఏర్పాటు చేసి ఉంటారని గుసగుసలు బయల్దేరాయి. బుఖారీ మాతోపాటే కిందకూర్చుని భోజనం చేశారు. మా హాస్టలు దగ్గర్లో ఉన్న ఒక పెద్ద హోటల్లో కూడా నేల మీద కూర్చుని భోజనం చేసే సంప్రదాయ బ్రాహ్మణుల కోసం విడిగా ఓ హాలుండేది.

కాలేజీ హాస్టల్లో ఉంటున్నప్పుడు బాహ్యప్రపంచంతో సంబంధమంటే అక్కడ ఉండే ఒక్క ఫోనే. అదికూడా కేవలం ఇన్‌కమింగ్ కాల్స్ అందుకోవడం వరకే. మరీ అత్యవసరమైనప్పుడు డబ్బు కడితే ఫోన్ చెయ్యనిచ్చేవారు. మామూలు క్షేమసమాచారాల కోసం ఉత్తరప్రత్యుత్తరాలే గతి. అక్కడ కందసామి అనే ఒక అటెండర్ ఉండేవాడు. వచ్చిన ఫోన్లన్నీ రిసీవ్ చేసుకునేది ఆయనే. ఫోన్ రాగానే, 'హలో, వివేకానంద స్పీకింగ్' అనేవాడు. 'హూమ్ డు యు వాంటింగ్' అని అడిగి అవతలివాళ్లు ఫలానా అని చెప్పాక, 'ఓకే. ప్లీజ్ బీ హ్యాంగింగ్' అనేవాడు!

కాలేజీలో ఉన్న మూడేళ్లలో ఒకేడాది దగ్గర్లోని మురికివాడలో రాత్రిపూట స్కూలు నడపడంలో సాయం చేశాను. వక్తృత్వ పోటీల్లో దాదాపుగా ఎక్కడ పాల్గొన్నా ప్రైజులు నాకే వచ్చేవి. నిజానికి నేను ఆనర్స్ మొదటి ఏడాది తర్వాత దాన్ని వదిలేసి ఇంజినీరింగ్ చెయ్యాలని అనుకునేవాణ్ణి. కాని నేను ఎకనామిక్స్ కోర్సులో బాగానే కుదురుకోవడం వల్ల దాన్నే కొనసాగించమన్నారు మా నాన్న.

ఇంటర్మీడియెట్‌లో ఎన్‌సీసీ బి సర్టిఫికెట్ ఉంది కనుక డిగ్రీ చదువుతున్నప్పుడు ఎన్‌సీసీలో ప్రవేశం నాకు సులభమైంది. అప్పటి మైసూరు రాష్ట్ర గవర్నర్ వీవీ గిరిగారు మా కాలేజీకి వచ్చినప్పుడు విద్యార్థుల గౌరవ వందనానికి నేనే నాయకత్వం వహించాను. నా పట్ల సంతృప్తి చెందిన కెప్టెన్ హారిసన్ నన్ను ఆర్మీలో చేరమని చెప్పారు. అది మా నాన్నగారే నిర్ణయించాలని నేనాయనకు చెప్పాను.

నేను ఆర్మీలో చేరాలని సూచిస్తూ అప్పటికే ఆయన మా నాన్నగారికో ఉత్తరం రాసి పంపారట. 'దాన్ని నిర్ణయించుకోవడానికి ఇంకా టైముంది' అని మా నాన్న ప్రత్యుత్తరం రాసినట్టు కూడా చెప్పారు. మా నాన్నగారు చనిపోయిన తర్వాత నేనా ఉత్తరాన్ని చూసి భద్రంగా దాచుకున్నాను.

కాలేజీవాళ్లు మమ్మల్ని బోంబే, ఢిల్లీ, కలకత్తాలకు ఎక్స్‌కర్షన్ తీసుకెళ్లారు. విద్యార్థులమంతా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను కలుసుకున్నాం. ఆయన మా అందరికీ షేక్‌హ్యాండ్లు, ఆటోగ్రాఫులు ఇచ్చారు. దాన్ని నేనిప్పటికీ జాగ్రత్తగా

దాచుకున్నాను. మేమంతా ఆయనతో కలిసి ఫోటో కూడా తీసుకున్నాం. రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్‌గారిని, ఉపరాష్ట్రపతి ఎస్. రాధాకృష్ణన్‌ను కూడా కలిశాం. ఇప్పుడు ఆలోచిస్తే, ఒక కాలేజీ విద్యార్థులు అంత పెద్దవారిని కలుసుకోవడం అంత సులభంగా జరిగిందా అనిపిస్తుంది. హాస్టల్ జీవితం నుంచి, ఎన్‌సీసీ నుంచి, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఏక్టివిటీల నుంచి మరీ ముఖ్యంగా స్నేహితుల నుంచి నేనెన్నో విషయాలను నేర్చుకున్నాను.

నేను మంచి విద్యార్థిని అయినప్పటికీ సంవత్సరాంత పరీక్షల్లో ఎందుకనో మార్కులు నేనూహించినంత గొప్పగా కాకుండా, మామూలుగా వచ్చాయి. 1960లో నేను మద్రాసు యూనివర్సిటీ సెనేట్ హాల్లో స్నాతకోత్సవంలో పట్టా పుచ్చుకున్నాను. దానికి మా అన్న రాజగోపాల్‌నడిగి సూటూ, టై తెచ్చుకున్నా. కె. కృష్ణమూర్తి అనే స్నేహితుణ్ణడిగి బూట్లు తెచ్చుకున్నా. ఎ. లక్ష్మారెడ్డి అనే మిత్రుడు మర్నాటికని తెచ్చుకున్న గౌను అడిగి వేసుకున్నా. మరో ఆర్నెల్లలో ఎమ్మే పట్టా కూడా వచ్చేసింది.

అప్పటికి నా వయసు 20లోపే. దాంతో నేను బాగా చదువుకున్నవాణ్ణని మిడిసిపడేవాణ్ణి. నాకొచ్చిన తక్కువ మార్కులు నా మిడిసిపాటును కొంత తగ్గించాయి!

వివేకానంద కాలేజీలో ఎకనామిక్స్ ఆనర్సు చదువు పూర్తయ్యాక కొందరు సివిల్ సర్వీసు పరీక్షలు రాసేవారు. మిగిలినవారు ఏజీ ఆఫీసులో యూడీసీ (క్లర్కు) లేదా ఏదైనా కాలేజీలో లెక్చరర్‌గా చేరేవారు. సివిల్ సర్వీసు పరీక్షలు రాయాలంటే నా వయసు చాలదు. మరో మూడేళ్లు ఆగాలి. అందువల్ల నేను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చేరాలనుకున్నాను. ప్రయాణానికి సొమ్ము సమకూర్చుకోగలిగితే, మిగిలినదంతా సులువేనని తెలుసుకున్నాను. నా ఆలోచనను మా నాన్న కజిన్ ఒకాయనతో చెబితే, ఆయన నాకు అవసరమైన ఏర్పాట్లు చేస్తానన్నారు.

కాని మా నాన్న నేను లండన్ వెళ్లడానికి ఇష్టపడలేదు. మా మేనమామ శివరామరెడ్డి ముఖ్యస్నేహితుడు డాక్టర్ హెచ్.టి. వీరారెడ్డి నన్ను పిలిచి మాట్లాడారు. 'మీ నాన్న ఆరోగ్యం సరిగా లేదు. నువ్వు ఆయనతో ఉంటే బాగుంటుంది. అందువల్ల హైదరాబాద్‌లోనే ఏదైనా చూసుకోవడం మంచిదేమో ఆలోచించు...' అని సూచించారు. ఆయన చెప్పినదాని గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. అప్పటివరకూ నేను అమ్మానాన్నలతో ఉన్నదానికన్నా వాళ్లకు దూరంగా హాస్టల్లో గడిపిన సమయమే ఎక్కువ.

నాకు బాగా ఊహ తెలిశాక, మా నాన్నతో నేను గడిపిన విలువైన కాలం ఏదంటే 1960 నుంచి 63 వరకే. అప్పట్లో మేం చిరాగలీలేన్‌లో ఉండేవాళ్లం. మా నాన్న ప్రతి ఉదయమూ పబ్లిక్ గార్డెన్స్‌లో నడిచేవాళ్లు. నేనూ ఆయనతో వెళ్లేవాణ్ణి. ఆ సమయంలో మేం ఏదో ఒకటి మాట్లాడుకునేవాళ్లం. అందులో రకరకాల విషయాలు దొర్లేవి.

ఒకసారి తనకు తెలిసినవారిని ఆస్పత్రికి తీసుకెళ్లమన్నారు నన్ను. 'సరే, నేను ఫోన్ చేసి చెబుతాలెండి, ఫలానావాళ్లు వస్తున్నారని' అన్నాను. దానికాయన ఒప్పుకోలేదు. 'స్వయంగా తీసుకెళితే వచ్చే ఫీలింగ్ ఫోన్లో చెబితే వస్తుందా' అంటూ నేను వెళ్లేవరకూ ఊరుకోలేదు.

పూర్వం పనిచేసిన ఒక ఊళ్లో ఆయన్ని రోజూ ఒక మనిషి బిచ్చమడిగేవాడట. 'పోయి పనిచేసుకోవచ్చు కదా' అంటే, 'ఇస్తే ఎందుకు చెయ్యను' అన్నాడట వాడు. అంతే, వాణ్ణి ఇంటికి తీసుకొచ్చి పనులు చెప్పి చేయించడం మొదలుపెట్టారు. వాడికి పెళ్లి చేసి. ఆ కుటుంబాన్ని కూడా మాతోపాటు హైదరాబాద్ తీసుకొచ్చి స్థిరపడేలా చేశారు!

సాటివారి పట్ల కరుణ, దయ, నెమ్మదితనం, నిజాయితీ, ప్రేమాభిమానాలు, సంతోషం – అన్నీ మూర్తీభవించిన వ్యక్తిత్వం మా నాన్నది. ఆయన కోపగించడం మాట అటుంచి, కనీసం విసుక్కోవడం కూడా చూడలేదు మేమెవ్వరం. అలా ఉండటం అరుదని, అందరికీ సాధ్యమయ్యేది కాదని అనిపిస్తుంది.

# నిజమైన చదువు మొదలైంది

**అ**మ్మానాన్నలకు, కుటుంబానికి దగ్గరగా ఉండాలని నేను లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చేరే ఆలోచన విరమించుకున్నాను. వివేకానంద కాలేజీ నుంచి ఎమ్‌యే ఎకనామిక్స్ పట్టా పుచ్చుకున్నాక మద్రాసు నుంచి హైదరాబాదు వచ్చేశాను.

మద్రాసు వాతావరణంలో పెరిగిన నాకు హైదరాబాద్ విచిత్రంగా అనిపించేది. మద్రాసుతో పోలిస్తే ఇక్కడ రోడ్లు విశాలంగా ఉండేవి. అక్కడ ఉక్క, ఇక్కడ స్వెట్టర్ అవసరం. సైకిళ్లు, సైకిల్ రిక్షాలు ఎక్కువగా కనిపించేవి. మద్రాసులో ఉదయం ఐదింటికే ఆలయాలు, కాఫీ హోటళ్లు, అన్నీ తెరుస్తారు. మరి ఇక్కడ? ఉదయం తొమ్మిది పదింటికిగానీ రోడ్ల మీద జనసంచారం మొదలయ్యేదికాదు. కాఫీ దొరకడం అరుదు. ఇడ్లీ సాంబారు కాకుండా హైదరాబాదులో చీటీవాలా అరటిపండ్లు, మిర్చీబజ్జీలు దొరికేవి. ఎక్కువమంది ఉర్దూ, హిందీ మాట్లాడేవారు. తెలుగు మాట్లాడగలిగినవాళ్లలో కూడా తెలుగు రాయడం, చదవడం వచ్చినవారు తక్కువ. నాంపల్లిలో ఏడాదికోసారి జరిగే ఎగ్జిబిషన్ అంటే అందరికీ ఆసక్తి. దసరాల్లో విజయదశమి రోజున జమ్మి ఆకులను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడం తప్పనిసరి. మొత్తమ్మీద నాకు వింతగా ఉండేది.

1960 ఆగస్టులో పీహెచ్‌డీ కోసమని ఉస్మానియా విశ్వవిద్యాలయం మెట్లెక్కే వరకూ నాకు నిజమైన చదువంటే ఏమిటో తెలియలేదనే చెప్పొచ్చు. అప్పటివరకూ పరీక్షలకు సిద్ధమవడమే చదువని అనుకునేవాణ్ణి. అప్పటికి మా చిన్నాయిన యాగా శివశంకర్‌రెడ్డి ఎకనామిక్స్‌లో పరిశోధన పూర్తి చేసి మన రాష్ట్ర కార్మిక శాఖలో పనిచేస్తుండేవారు. ఆయన ద్వారా నేను ఉస్మానియా ప్రొఫెసర్ వీవీ రామనాథంగారిని కలుసుకున్నాను.

'రీసెర్చ్‌కి ఏం తీసుకోవాలనుకుంటున్నావు?' అని అడిగారు ఆయన.

'మన దేశంలో బ్లాక్ మార్కెట్, నల్లధనం – ఈ రెండు విషయాల మీదా అయితే బాగుంటుంది అనిపిస్తోంది సర్' అన్నాన్నేను తడుముకోకుండా.

'అది కుదరకపోవచ్చేమో. వీటికి సంబంధించిన విషయ సమాచారం నీకు చాలా తక్కువ దొరుకుతుంది. ముందు మోనోపలీ – ఇంపర్ఫెక్ట్ కాంపిటీషన్‌ల మీద ఒక పేపర్ రాసుకుని రా, చూద్దాం' అన్నారాయన.

దానికోసమని చదవడం మొదలుపెడితే అప్పుడు అర్థమయింది – అప్పటిదాకా నాకు తెలిసింది పైపైనే అని! అదే నా నిజమైన అధ్యయనానికి మొదటి మెట్టు. నా పేపర్‌తో సంతృప్తి చెందిన ప్రొఫెసర్ రామనాథం నాకు గైడ్‌గా ఉండటానికి అంగీకరించారు. ఆనర్స్‌లో నా మార్కులు తక్కువే అయినా, దాన్ని పెద్ద పట్టించుకోకుండా నేను ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ స్కాలర్‌గా చేరేలా ప్రోత్సహించారు ఆయన.

వేమూరి వేంకట రామనాథం చాలా పేద బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారు. చల్లపల్లి రాజావారి సాయంతో ఆయన పై చదువులు చదవగలిగారట. అయితే ఆయన తన నేపథ్యాన్నీ, పడిన కష్టాలనూ ఎప్పుడూ చెప్పేవారు కాదు. అలాగే అన్య కులమతాల పట్ల ఎలాంటి దురభిప్రాయమూ ఉండేది కాదు.

రామనాథంగారు ఉస్మానియా యూనివర్సిటీలో మంచి ప్రొఫెసర్‌గా రాణిస్తూనే అటు తెలుగు సాహిత్య కార్యక్రమాల్లో, మరోవైపు నాటక ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొనేవారు. దాంతో ఆయన ఎప్పుడూ క్షణం తీరిక లేకుండా ఉండేవారు. నేనుగాక మరో ముగ్గురు పరిశోధక విద్యార్థులం ఆయన దగ్గరుండేవాళ్లం. బద్ధకం, ఈసురోమని పనిచెయ్యడం – వంటివి ఎవరిలోనైనా కనిపిస్తే ఆయనలో అసహనం కట్టలు తెంచుకునేది.

అప్పట్లో ఉస్మానియా యూనివర్సిటీ అంటే సిటీ శివారు ప్రాంతాల్లో ఉన్నట్టే. నేను అబిడ్స్ నుంచి రెండు బస్సులు మారి వెళ్లాల్సి వచ్చేది. మా ప్రొఫెసర్‌గారు టైమంటే టైమే. ఆయన ఉదయం 8.55 లేదా 9.05కల్లా రమ్మనేవారు.

ఒకసారి ఆయన నన్ను ఉదయం 8.10 కల్లా కలవమన్నారు. నేను వెళ్లేసరికి 8.20 అయింది.

నేను ఆలస్యానికి క్షమాపణలు చెబుతూ 'మొట్టమొదటి బస్సుకే వచ్చాను సర్...' అన్నాను.

'నువ్వు నిన్న సాయంత్రమే బయల్దేరి ఉండాల్సింది. మన బస్సులెలా నడుస్తాయో నీకు తెలీదా?' అన్నారు సీరియస్‌గా.

ఆయన గదిలో గోడ మీద గేలానికి చిక్కుకున్న చేప బొమ్మ ఉండేది. దానికింద 'నోరు మూసుకుని ఉంటే చేప కూడా గాలాన్ని తప్పించుకోగలదు' అన్న వాక్యం రాసుండేది. మరొక వాక్యం ఆయన టేబులు మీద ఉండేది. 'మీ సమయం విలువైనది. దయచేసి దాన్నిక్కడ వృథా చేసుకోకండి' అని.

వాటి నుంచి నాకు మూడు విషయాలు ఒంటపట్టాయి. ఒకటి : సమయపాలన. రెండు : ముఖ్యమైనవే మాట్లాడు. మూడు : పనయిపోగానే ఉన్నచోటి నుంచి బయటపడు.

ఏదైనా ఒక రీసెర్చ్ నోట్ లేదా పేపర్ రాసి ఇస్తే దాన్ని ఆయన చాలా శ్రద్ధగా చదివేవారు. ఒక్క పదం లేదా వాక్యం ఎక్కువయినా ఆయన ఒప్పుకొనేవారు కాదు. పేపర్ రాయడానికి ముందే దాని పరిధి ఎంత, లక్ష్యం ఏమిటి, పరిశోధన పద్ధతి ఏమిటి – ఇవన్నీ నిర్ణయించుకోవాలి. రాసే ప్రతి వాక్యమూ ప్రతిపాదించే విషయానికి ఆధారమయ్యేలా ఉండాలే తప్ప ఊరికే రాయడం కుదరదు. అలా రాస్తున్నప్పుడు నాకు కొన్నిసార్లు చాలా విసుగ్గా అనిపించేదిగాని, ఆయన ఓకే చేసిన తర్వాత చూసుకుంటే నా పనిలోని ప్రయోజనం ఎంతో తెలిసి అప్పటివరకూ చేసింది స్పష్టంగా అర్థవంతంగా అనిపించేది. ఇదిగాక, ఆయన పరిశోధనలో కూడా మేం కొంత సాయం చెయ్యాల్సి వచ్చేది. అదికూడా ఎంతో పనికొచ్చేది.

ప్రొఫెసర్ రామనాథం ప్రతి సోమవారం సాయంత్రం అప్లయిడ్ ఎకనామిక్స్‌లో ఒక సెమినార్ నిర్వహించేవారు. దానికి చాలామంది పరిశోధకులు, ఉన్నతాధికారులు పేపర్లు రాసి పంపేవారు. అలా పంపేలా ఆయన ఎంతోమందిని ప్రోత్సహించేవారు. 1961, 62ల్లో నేను కూడా రెండు పేపర్లు రాశాను. వివిధ వ్యక్తులు రాసిన పేపర్లు చదవడం, ప్రూఫ్ రీడింగ్ చెయ్యడం వల్ల నాకెన్నో విషయాలు తెలుస్తుండేవి. పనిలో ప్రతి చిన్న విషయం మీద శ్రద్ధ, అత్యుత్తమ నాణ్యతలకు పెద్ద పీట వెయ్యాలన్నది నేను నేర్చుకున్నది అప్పుడే.

ఆ సమావేశాల సమయంలో నేను ఎంతోమంది ప్రముఖులను కలుసుకున్నాను. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ సెక్రెటరీ బి.పి.ఆర్. విఠల్‌గారిని అప్పుడే కలిశాను. ఆ తర్వాత కాలంలో వారు నాకు గురువు, బాస్ అయ్యారు! అప్పుడే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి తిరిగి వచ్చి, మన దేశంలో దూరవిద్యావిధానం కోసం ఎనలేని కృషి చేసిన ప్రొఫెసర్ జి. రామిరెడ్డి, చీఫ్ ఎకనామిక్ ఎడ్వైజర్ డాక్టర్ ఐ.జి. పటేల్, అప్పటి కేబినెట్ సెక్రెటరీ ఎస్.ఎస్. ఖేరా వంటి వారిని చూశాను.

ఈ పరిచయాలే నాకు ఎకనామిక్స్‌తో పాటు ఇంకొన్ని సబ్జెక్టుల మీద ఆసక్తి పెరిగేలా చేసింది.

పీహెచ్‌డీకి అవసరమైన మెటీరియల్ కోసం నేను ఢిల్లీ వెళ్లినప్పుడు ఎంపీ టీవిఎన్ విశ్వనాథరెడ్డి ఇంట్లో (మీనాబాగ్) దిగాను. ఆయన బంధువైన చీమలవాగు నరేంద్రరెడ్డితో అక్కడ నాకు పరిచయమైంది, కాలక్రమంలో అది మంచి స్నేహంగా పరిణమించింది. నరేంద్ర వాళ్లది అనంతపురం, వాళ్ల నాన్న మున్సిపల్ అధికారిగా పనిచేస్తూ ఉండేవారు. మరో కుర్రాడు ఎస్.కె.గోయల్‌తోనూ నాకు పరిచయమయ్యింది ఢిల్లీలోనే.

నేను ఉస్మానియాలో రీసెర్చ్ స్కాలర్‌గా ఉండగానే, ప్రొఫెసర్ జి. రామిరెడ్డి నేను లెక్చరర్‌గా చేరేలా ప్రోత్సహించారు. అలా నేను 1961 ఆగస్టులో ఉస్మానియా ఈవెనింగ్ కాలేజీలో ఆర్నెల్ల కోసం తాత్కాలిక లెక్చరర్‌గా చేరాను. నా నెల జీతం 250రూపాయలు!

పేస్లిప్ ఇస్తే జీతం ఇచ్చేవారు. అక్కడి క్లర్కులకు తెలుగు రాదు, నాకు హిందీ, ఉర్దూ రావు. వెళ్లి 'పేస్లిప్' అని అడిగాను.

'పరసూ ఆవో భాయ్..' అన్నాడు క్లర్కు.

పరసూ అంటే ఎల్లుండి అని అర్థం. అది నాకు తెలీదు. రేపు రమ్మంటున్నాడేమో అనుకుని, 'యూ మీన్ టుమారో?' అడిగాన్నేను.

'నై, ఔర్ ఏక్ మారో...' అన్నాడతను. ఇప్పుడు తల్చుకుంటే నవ్వొస్తుంది.

నా తొలి జీతంలో కొంత డబ్బు పెట్టి మా చెల్లికి ఆల్విన్ బీరువా కొన్నాను. ఆమె ఇప్పటికీ దాన్ని భద్రంగా ఉంచింది!

ఈవెనింగ్ కాలేజీలో విద్యార్థులందరూ ఉదయం ఏదో ఒక ఉద్యోగం చేసుకుంటూ సాయంత్రం చదువుకునేవాళ్లే. అందుకని అందరూ చదువు పట్ల, తమ అర్హత పెంచుకోవడం పట్ల సీరియస్‌నెస్ ఉన్నవాళ్లే. ఆదిలోనే అటువంటి విద్యార్థులు దొరికినందుకు నేను అదృష్టవంతుణ్ణనే చెప్పుకోవాలి.

వాళ్లకు బాగా పాఠం చెప్పాలంటే నేను ముందు సబ్జెక్ట్ బాగా చదివి వెళ్లవలసి వచ్చేది. దానివల్ల నా అధ్యయనం లోతు పెరిగింది. ఆ రకంగా ఆ ఉద్యోగం నాకు మేలే చేసింది.

నేను చాలా చిన్నవాణ్ణవటం వల్ల మొదట్లో విద్యార్థులు కొంచెం ఆశ్చర్యంగా చూసేవాళ్లు కాని, కొద్ది నెలల్లోనే మా మధ్య మంచి బంధం ఏర్పడింది. కాని సహోద్యోగులు మాత్రం నాతో కొంచెం ఎడంగానే ఉండేవారు. దానికి రెండు ముఖ్య కారణాలు. ఒకటి నేను చాలా చిన్నవాణ్ణి కావడం, రెండు నేను తెలంగాణవాణ్ణి కాకపోవడం.

స్టాఫ్‌లో ఇద్దరే నాకు మిత్రులయ్యారు. వారిలో ఒకరు పొలిటికల్ సైన్స్ లెక్చరర్ టి. సురేందర్. హనుమకొండ నుంచి వచ్చిన అతను పేదరికాన్ని ఎదిరించి ఉన్నత విద్యలో గోల్డ్ మెడల్ సంపాదించుకున్నాడు. తనదైన గొప్ప వ్యక్తిత్వంతో, విధుల పట్ల అంకితభావంతో ఉండేవాడు. రెండో వ్యక్తి షమీమ్ అఖ్తర్. ఆమె మధ్యప్రదేశ్‌కు చెందిన అమ్మాయి, నాగపూర్ యూనివర్సిటీలో చదువుకుంది. సాధారణంగా ఆ రోజుల్లో స్టాఫ్‌రూమ్‌లు కూడా విడివిడిగా ఉండేవి కనుక స్త్రీ – పురుష లెక్చరర్లు కలిసి మాట్లాడుకోవడం అసాధారణంగానే ఉండేది. ఆమె ఉస్మానియాలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ బోధించేది.

మిగిలిన వాళ్లంతా దూరం పెట్టడం వల్లనేమో, మేం ముగ్గురం మంచి స్నేహితులమయ్యాం. వాళ్లిద్దరి విభిన్న నేపథ్యాలు, వ్యక్తిత్వాల నుంచి నేనెంతో నేర్చుకున్నాను.

సురేందర్ సివిల్ సర్వీస్ పరీక్షలు వద్దనుకున్నాడు. తన తమ్ముళ్లను చదివించాడు, అమెరికాలో మాస్టర్స్, యూకేలో డాక్టరేట్ చేసి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా స్థిరపడ్డాడు. బ్రహ్మచారిగా మిగిలిపోయిన సురేందర్ మా కుటుంబానికి మంచి మిత్రుడు. షమీమ్ అఖ్తర్ తర్వాత ఉస్మానియాలోనే పీహెచ్‌డీ చేసి ప్రొఫెసరయింది. తన సహోద్యోగినే పెళ్లి చేసుకుంది. పిల్లలతో పాటు అమెరికాలో స్థిరపడింది. పీహెచ్‌డీ సమయంలోనే నాకు ఈ.ఎస్.శాస్త్రి అనే సహ పరిశోధకుడు మంచి మిత్రుడయ్యాడు. ప్రొఫెసర్ జె. సత్యనారాయణ నాతో ఆత్మీయంగా వ్యవహరించేవారు.

కొద్ది నెలల తర్వాత నాకు నిజామ్ కాలేజీకి బదిలీ అయింది. ఇది ఈవెనింగ్ కాలేజీ ప్రాంగణంలోనే ఉండేది కాని చాలా పేరున్న కాలేజీ. నగరంలో అత్యుత్తమ విద్యార్థులంతా దానిలోనే చేరేవారు. నాకు మొదట్లో కొంచెం గాభరాగా అనిపించేదిగాని, త్వరలోనే నాకూ విద్యార్థులకూ మధ్య గౌరవాభిమానాలు నెలకొన్నాయి. కొందరు ఆడపిల్లలు మాత్రం నన్ను ఆటపట్టించడానికి ప్రయత్నించేవారు!

## ఐఏఎస్ చదవడం కట్నం కోసమా?

*నిజామ్ కాలేజీలో టి. సుబ్బిరామిరెడ్డి నాకు స్టూడెంట్.*

*'సర్, మీరు ఐఏఎస్ పరీక్షకు సిద్ధం అవండి. అది ప్రాసవడం కష్టంలెండి. కాని, మరేం ఫర్లేదు. నాకు తెలిసిన నెల్లూరు రెడ్లున్నారు. వాళ్లతో మాట్లాడతాను. మీరు ఐఏఎస్‌కు వెళుతున్నారంటే వాళ్లు పిల్లనిచ్చి బోల్డంత కట్నం ఇస్తారు. ఆ డబ్బుతో మీరు మంచి వ్యాపారం ఏదైనా ప్రారంభించి అభివృద్ధిలోకి రావచ్చు. మీరొక మంచి, తెలివైన రెడ్డి కుర్రాడు అయుండి లెక్చరర్‌గిరీతో సరిపెట్టుకోవడం ఏమిటి?' అని సలహానిచ్చాడు!*

*నేను అతనికి పబ్లిక్ ఫైనాన్స్ బోధించబోతే అతను ప్రైవేటు ఫైనాన్స్‌లో ఉద్దండపిండమయ్యాడు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రముఖుడయ్యాడు!*

## ముఖ్యమంత్రిని డ్రాప్ చేశాం

*ఆరోజుల్లో ఒకసారి మా అమ్మానాన్నలను చూడడానికి ఎంపీ పార్థసారథి మా ఇంటికొచ్చారు. మాటల్లో మాటగా 'లేక్‌వ్యూకు పోయి బెజవాడ గోపాలరెడ్డిని కలవాలన్నా' అన్నారు. అప్పుడు నేనూ మా అన్నా ఆయన్ని దింపడానికి లేక్‌వ్యూ అతిథిగృహానికి వెళ్లాం. పార్థసారథిగారిని డ్రాప్ చేస్తుండగా ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కనిపించారు.*

*'అసెంబ్లీకి పోవాల, సెషన్ మొదలవుతోంది, కారెవరికో పంపించాను ఇంకా రాలేదు..' అని ఆయన అనగానే పార్థసారథిగారు, 'మా పిల్లోళ్లు ఉన్నారు కదా, అసెంబ్లీ దగ్గర వదులుతార్లేండి' అన్నారు.*

*అసెంబ్లీ దగ్గర ఆయన్ని దింపేసి మేం ఇంటికెళ్లిపోయాం. కాని ఆయన కమిట్‌మెంట్, పంక్చువాలిటీ, సింప్లిసిటీ – ఇవి మా మనసుల్లో నాటుకుపోయాయి!*

## ఖాదర్ సర్ మంచి రోల్ మోడల్

*ప్రొఫెసర్ రామనాథం వ్యక్తిత్వానికి పూర్తి వ్యతిరేకంగా ఉండేది మా ప్రొఫెసర్ అబ్దుల్ ఖాదర్ తీరు. ఆయన ఎకనామిక్స్ శాఖ హెడ్‌గా ఉండేవారు. ఖాదర్ కూడా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్నారు. చాలా మంచి వ్యక్తి. కాని ఆయనకు పరిశోధనా వ్యాసంగం పట్ల పెద్ద ఆసక్తి ఉండేది కాదు.*

*డిపార్ట్‌మెంట్ హెడ్‌గా ఉంటూనే ఆర్ట్స్ ఫాకల్టీ డీన్‌గా, ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా కూడా చేశారు. హెడ్‌గా తీసుకున్న నిర్ణయాన్ని డీన్ సీట్లో కూర్చుని రివైజ్ చేసేవారు, ప్రిన్సిపాల్ సీట్లోకి మారగానే ఆయనే దాన్ని రిజెక్ట్ చేసేవారు.*

*అది జోకా లేదా ఆయనకు తిక్కా అనేది అర్థం కాక అప్పట్లో మేం నవ్వుకునేవాళ్లం. కాని ఇన్నేళ్లు ఒక బ్యూరోక్రాట్‌గా పనిచేసిన అనుభవంతో చూస్తే... వ్యక్తి తీసుకోవలసిన నిర్ణయాలు కూర్చున్న స్థానాన్ని బట్టి మారిపోతూ ఉంటాయన్నది నాకిప్పుడు అర్థమయింది. ఈ దృష్టితో చూస్తే, ఖాదర్‌గారు మంచి రోల్‌మోడల్ అనుకుంటాను.*

# నాన్న నమ్మకమే నడిపించింది!

**ఉ**స్మానియా యూనివర్సిటీలో ఫుల్‌టైమ్ లెక్చరర్ల కోసం 1962లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలో నెగ్గి ఉస్మానియా ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీలో లెక్చరర్‌గా చేరాను. అప్పుడు నా జీతం నాలుగు వందల రూపాయలు!

పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్, డెవలప్‌మెంట్ ప్లానింగ్ అనే రెండు సబ్జెక్టులను పీజీ విద్యార్థులకు బోధించాలి. నాకైతే అవి అంత బాగా తెలియవుగాని మా ప్రొఫెసరు రామనాథం నేను బాగా చదివి చెప్పేలా ప్రోత్సహించారు. తర్వాత కొత్తగా చేరిన పీహెచ్‌డీ విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ చెప్పమన్నారు. క్రమంగా అటు ప్రొఫెసర్ రామనాథం వివిధ పనులతోను, నేను పాఠాలు చెప్పడంలోనూ తలమునకలు అయిపోవడంతో నా పీహెచ్‌డీ ముందుకు కదల్లేదు.

అప్పట్లో హైదరాబాద్‌లో డబుల్‌డెక్కర్ బస్సులు చాలా ఫేమస్. మా ఇంటి నుంచి ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీకి రోజూ వెళ్లిరావడంతో నాకు చాలామంది కండక్టర్లు పరిచయస్థులయ్యారు. వాళ్లలో ఎక్కువమంది యువకులు, యూనివర్సిటీలో చదువుకున్నవాళ్లూనూ. కోఠీలో బస్సు కోసం వెయిట్ చేస్తున్నప్పుడు కొంతమంది టాక్సీ డ్రైవర్లు పరిచయమయ్యారు. ఉర్దూ పదాలు నిండిన వారి భాష నన్నెంతో ఆకట్టుకునేది. నాకు తెలిసినవి చెబుతుంటే వాళ్లు శ్రద్ధగా వినేవాళ్లు! నాది తెలంగాణ తెలుగు కానప్పటికీ మా మధ్య కబుర్లకు అది అడ్డు కాలేకపోయేది. ఒకోసారి కోఠీ విమెన్స్ కాలేజీ దగ్గర ఖాదీ బోర్డ్ అమ్మే నీరా తాగేవాణ్ణి. మధ్యాహ్నం తర్వాత అయితే అది పులిసిపోయి కల్లుగా మారిపోతుంది. అందుకని అందరూ మధ్యాహ్నంలోపే తాగేవారు.

అప్పుడే నేను టోస్ట్‌మాస్టర్స్ ఇంటర్నేషనల్ అనే సంస్థలో సభ్యత్వం తీసుకుని నా ఉపన్యాస శైలికి మెరుగులు దిద్దుకునేవాణ్ణి. వైఎమ్‌సీఏలో జరిగే సమావేశాలకు ప్రతి వారం వెళ్లడం వల్ల నాకు ఎంతోమంది పరిచయమయ్యారు. ఆ సమయంలో హైకోర్టులో అడ్వకేట్ అయిన కె.వి.రఘునాథరెడ్డి ఇంటికి నేను వెళుతూ

ఉండేవాణ్ణి. ఆయనకు వామపక్ష రాజకీయాలంటే ఇష్టం. మేం ఎన్నో విషయాలు చర్చించుకునేవాళ్లం. ఆయన ద్వారా నేను ఎంతోమంది కమ్యూనిస్ట్ నాయకులను కలిశాను. తర్వాత ఆయన కేంద్ర మంత్రి అయ్యారు, గవర్నర్‌గా పనిచేశారు.

## మా మేజర్ భలే మేనేజర్

1962 అక్టోబరులో వచ్చిన చైనాతో యుద్ధం భారతీయులకు పెద్దదెబ్బగానే అనిపించింది. దేశప్రధానమంత్రి నెహ్రూ అప్పటివరకూ చెబుతూ వచ్చిన 'హిందీ – చీనీ భాయిభాయి' అన్న నమ్మకం వీగిపోవడంతో మన యువతలోని ఆత్మవిశ్వాసం దెబ్బతింది. అందరిలోనూ దేశభక్తి పెల్లుబికింది. యుద్ధం తర్వాత భారత ప్రభుత్వం ఆర్మీని మరింత బలోపేతం చెయ్యదలచింది. దానికి తొలిమెట్టుగా ఎన్‌సీసీని దృఢం చెయ్యడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సెకెండ్ లెఫ్టినెంట్‌గా చేరి విద్యార్థులకు శిక్షణనివ్వడానికి లెక్చరర్లు కావాలని యూనివర్సిటీ ద్వారా కబురొచ్చింది. నేను ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా చేరిపోయాను. నా జీవితంలో మొదటిసారి కేంద్ర ప్రభుత్వ గెజెట్‌లో నా పేరు చూసుకుని సంతోషపడ్డాను. ఈ ఉద్యోగం ద్వారా నాకు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులు, లెక్చరర్లు పరిచయమయ్యారు.

అలా పరిచయమైనవారిలో ఆంగ్లో ఇండియన్ అయిన మేజర్ కార్‌ఫీల్డ్ ముఖ్యుడు. అందమూ, ఆకర్షణా కలిసిన కార్‌ఫీల్డ్‌కు సీరియస్ పనులు చెయ్యడం ఇష్టముండేది కాదు. తన స్ఫురద్రూపంతో, మాటకారితనంతో అందరి చేతా పనులు చేయించుకునేవాడు. అతని ఉత్తరప్రత్యుత్తరాలు భలేగా సాగేవి. ఫలానా సబ్జెక్టు, ఫలానా తేదీ అని చెప్పి, 'ఇక మిగిలిందంతా మీకు తెలిసిందే కదా, ఆ ప్రకారం రాసి తీసుకొచ్చేయండి...' అని చెప్పేవాడు. స్టెనోగ్రాఫర్లు అనుభవజ్ఞులు కనుక వాళ్లు చక్కగా రాసి తీసుకొచ్చాక, చివర్లో ఈయన అవతలివాళ్ల మనసును తాకేలా రెండు మూడు వాక్యాలు అభిమానపూర్వకంగా రాసేవాడు. 'మీ నడుం నొప్పి తగ్గిందా, మీ ఆవిడకు నమస్సులు తెలియజేయండి, మీ పిల్లలకు నా ముద్దులు...' అని రాసి సంతకాలు పెట్టేవాడు. దానితో ఆయనంటే అవతలివాళ్లు ముచ్చటపడేవారు.

## అన్నీ ఒకేసారి...

కడప జిల్లా కొమ్మనవారిపల్లెలో మా నాన్నకు పిత్రార్జితమైన ఉమ్మడి ఆస్తిలో భాగంగా కాస్త పొలం ఉండేది. మా మేనమామ నంద్యాల దగ్గర పొలం కొంటున్నారని తెలిసి, మా అమ్మ ధైర్యం చేసి కాస్త పొలం కొన్నది. మాకంటూ ఒక ఇల్లుండాలనే

ఉద్దేశంతో తన బంగారం అమ్మేసి మరీ హైదరాబాద్ శాంతినగర్‌లోని ఆఫీసర్స్ కాలనీలో స్థలం కొని ఇంటి నిర్మాణం ప్రారంభించింది. ఆ రోజుల్లో లైసెన్స్ పెర్మిట్ల రాజ్యం నడిచేది. ప్రతిచిన్నదానికీ ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలి. దానికోసం కాళ్లరిగేలా తిరగాలి. ఉదాహరణకు ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఉక్కు – ఏదీ బజారుకు పోయి నేరుగా కొనడానికి లేదు. అన్నిటికీ పెర్మిషన్లు తెచ్చుకోవాలి.

మా నాన్న స్నేహితుడొకాయనకు బాగా లేదంటే చూడటానికి ఉస్మానియా ఆస్పత్రికి వెళ్లాం నేనూ నాన్నా. బయటకొస్తూనే మా నాన్న వాంతి చేసుకుని గుండె పట్టుకుని కూలబడ్డారు. ఆస్పత్రి ఆవరణలోనే కనుక వెంటనే పరుగెత్తుకెళ్లి డాక్టరును తీసుకొచ్చాను. 'హార్ట్ అటాక్' అంటూ ఆయన్ని వెంటనే ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఆ తర్వాత ఆయన అంతగా కోలుకోలేదు.

అంతకు ఐదారేళ్ల ముందే ఆయనకు బ్లాడర్‌కు సంబంధించిన క్యాన్సర్ ఉన్నట్టు తెలిసింది. మేం ఆదోనిలో ఉన్న సమయంలో వెల్లూరు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించాం. యుక్తవయసులో హార్ట్‌ఎన్‌లార్జ్‌మెంట్, తర్వాత వరుస అనారోగ్యాలతో 63కల్లా మా నాన్న క్షీణించిపోయారు. అందువల్ల అప్పటికి బియ్యే చదువుతున్న మా చెల్లెలికి త్వరగా పెళ్లి చేద్దామనుకున్నారు. సంబంధాలు వెతికితే కర్నూల్లో తెలిసినవారి కుటుంబంలో ఎంబీబీఎస్ కుర్రాడొకరున్నట్టు తెలిసింది. అలా డాక్టర్ చల్లా ప్రభాకర్‌రెడ్డికి మా చెల్లి ప్రమీలనిచ్చి 1963 మే నెలలో పెళ్లి చేశారు. నాన్న అనారోగ్యం, చెల్లి పెళ్లి పనులు, ఇంటి నిర్మాణ పర్యవేక్షణ, నా ఉద్యోగం.... వీటన్నిటి మధ్యా నాకు ఊపిరాడేది కాదు!

## నాన్న కోసమే...

నా చిన్నప్పుడు ఎప్పుడో ఒకసారి మా నాన్న నా జాతకం చూపించారట.

'మీవాడు అయితే పెద్ద ఇంజినీరవుతాడు. లేదంటే మీ ఉద్యోగ ప్రస్థానం ఎక్కడైతే ఆగుతుందో, అక్కణ్ణుంచి అతనిది మొదలయి చాలా పైస్థాయికి వెళతాడు...' అని చెప్పాడట ఆ జ్యోతిష్యుడు.

ఇక నేను ఇంజినీరయ్యే అవకాశం లేదుగనుక, తాను చేస్తున్న కలెక్టర్ ఉద్యోగం నుంచి నేను మొదలై ఇంకా పైకి ఎదుగుతానని మా నాన్నగారు నమ్మడం మొదలెట్టారు. అది నమ్మకమా, మూఢనమ్మకమా అని వితర్కించలేను కాని, నేను ఉస్మానియాలో లెక్చరర్‌గా పనిచేస్తూ ఉండగా మా నాన్నగారు నన్ను సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయమన్నారు.

నాకు పెద్దగా ఇష్టముండేది కాదు, కాని ఆయన పట్టు వదల్లేదు.

ఈ సంగతి మా ప్రొఫెసర్ రామనాథంగారితో చర్చిస్తే, ఆయనా పెదవి విరిచేశారు. 'మీవాడు ఎకనామిక్స్‌లో బాగా రాణిస్తున్నాడు... అందులోనే కొనసాగనివ్వండి...' అని ఆయన ఇంటికొచ్చి మా నాన్నతో మాట్లాడారు. కాని ఆయన నిర్ణయం పెద్దగా మారలేదు.

'ఐఏఎస్ వస్తే చేరు. అదిగాక ఇంకేది వచ్చినా అప్పుడు నువ్వు సొంత నిర్ణయం తీసుకోవచ్చు...' అని కొద్దిగా సడలింపునిచ్చారంతే.

అప్పటికి ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ఐఏఎస్ అధికారి బి.పి. ఆర్. విఠల్ ఉండేవారు. ఆయన కూడా నన్ను సివిల్ సర్వీసులకు వద్దని, పరిశోధన రంగంలోనే కొనసాగమని సలహానిచ్చారు. అప్పటి వీసీ డి.ఎస్.రెడ్డి అభిప్రాయమూ అదే.

'మా నాన్నగారి కోరిక మేరకు రాయాలనుకుంటున్నాను' అన్నాను.

'నీ గురించి నిర్ణయించుకునేంత వయసు నీకుంది..' అన్నారు ఆయన.

'నేను మా నాన్న కోరికను మన్నించడానికే నిర్ణయించుకున్నాను. అందుకే ఆ పరీక్షకు వెళ్తాను...' అని దృఢంగా చెప్పాను.

అప్పటికి తాను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబరు కనుక, నన్ను రాష్ట్ర సర్వీసు పరీక్షలు రాయొద్దన్నారు మా నాన్న. కేవలం సివిల్స్ మాత్రమే నా లక్ష్యం. అందులోనూ ఐఏఎస్ వస్తే వెళ్లాలి, లేదంటే లెక్చరర్‌గా స్థిరపడమని ఆయన చెప్పారు.

1963 సెప్టెంబర్‌లో పరీక్షలు. ప్రిపరేషన్‌కు అప్పట్లో కోచింగ్ సెంటర్ల వంటివేమీ లేవు. స్టడీ మెటీరియల్ ఎవరికి వాళ్లు తయారుచేసుకోవలసిందే తప్ప, సిద్ధంగా ఏదీ దొరికేది కాదు. నేను 1948 నుంచి ఉన్న ప్రశ్నపత్రాలను సంపాదించాను, వాటిని విశ్లేషించి, సిలబస్‌ను మూడు భాగాలుగా విభజించుకున్నాను. ఒక భాగాన్ని బ్రహ్మాండంగా, రెండో భాగాన్ని శ్రద్ధగా, మూడో వంతును మామూలుగా చదివాను. ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు నాకు నేనే పరీక్ష పెట్టుకునేవాణ్ణి. మర్నాడుదయం లేవగానే నా సమాధాన పత్రాన్ని నేనే దిద్దుకునేవాణ్ణి. అప్పటికి లెక్చరర్‌గా పనిచేశాను కనుక, నా సమాధానాలు నచ్చకపోతే నేనే 'యూజ్‌లెస్' 'లాంగ్వేజ్ ఈజ్ బ్యాడ్...' ఇలా తిట్టేసి రిమార్క్స్ కూడా రాసేసేవాణ్ణి.

పరీక్షలకు నెల రోజుల ముందు మా నాన్న ఆరోగ్యం మరింత దిగజారిపోయింది. దానివల్ల ఇంట్లో ఉంటే నా చదువు అంత బాగా కుదరదని నేను న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఓ గది అద్దెకు తీసుకున్నాను. ప్రతి ఉదయం ఇంటికెళ్లి నాన్నను చూసి వచ్చి, చదువుకుని మళ్లీ సాయంత్రం వెళ్లి మరోసారి చూసేవాణ్ణి. నా పరీక్షల సమయంలో ఆయన ఆరోగ్యం విషమించింది. దాదాపు మరణం అంచుకు చేరుకున్నారు.

పరీక్షల్లో నేను బ్రిటిష్ హిస్టరీ బాగా రాయలేదని నిరాశపడ్డాను. అప్పుడు మా అమ్మ నన్ను నామాలగుండులో అంబాదాస్ విట్ఠోబా అనే తన గురువుగారి దగ్గరకు తీసుకెళ్లింది. ఆయన మాత్రం 'ఏం పర్లేదు, నువ్వు అనుకున్నది సాధిస్తావు' అని నాలో ధైర్యం నింపారు.

చివరి రోజు పరీక్ష రాసి ఇంటికొచ్చాను. మా నాన్న 'సినిమాకు వెళ్లరా' అన్నారు. నేను వెళ్లొచ్చాను.

మర్నాడుదయం నా గది ఖాళీ చేసి ఇంటికొచ్చేసి, నాన్నను తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించాను. ఇక చనిపోతారనగా అరగంట ముందు... 'పరీక్షలు బాగానే రాశావు కదరా?' అనడిగారు.

'నేను పరీక్షలు బాగా రాశాను. ఇంటర్వ్యూ తప్పకుండా వస్తుంది' అని భరోసాగా చెప్పాను. 'మనకెవరుండార్రా?' అని అడిగి, మళ్లీ ఆయనే 'దేవుడుండాల్లే...' అన్నారు. తర్వాత పదిపదిహేను నిమిషాలేం మాట్లాడలేదు.

ఈలోగా మా అమ్మ, తమ్ముళ్లు, చెల్లి అంతా వచ్చారు. అందరివైపూ చూశారు. 'కొంచెం విభూతి ఇవ్వరా' అన్నారు. కొద్దిగా తీసి నుదుటికి పెట్టి, కొంచెం నోట్లో వేశాను. ఆ తర్వాత కొద్దిక్షణాలకు ఆయన చనిపోయారు!

తాను మృత్యువుముఖంలో ఉన్నట్టు మా నాన్నకు కొంత ముందుగానే తెలుసు. అయితే తన పిల్లలు చిన్నవాళ్లు అన్న విషయం ఆఖరు రోజుల్లో ఆయనను కలత పెట్టింది. ఇరవైరెండేళ్ల లేత వయసులోనే నేను కుటుంబ బాధ్యతను భుజానికెత్తుకోవలసి వస్తోందని ఆయన బాధపడ్డారు.

అనారోగ్యం వల్ల ఆయన మృత్యువుకు చేరువవుతున్నట్టు మాకూ ముందుగానే తెలుసు. అయినప్పటికీ కుటుంబ పెద్ద మరణం అనేది ఎవరికైనా తట్టుకోలేనిదే. లెక్కపెట్టుకుంటే, అప్పటిదాకా నేను ఆయనకు దగ్గరగా పట్టుమని పదేళ్ల సమయం

కూడా గడపలేదు. కాని నాన్న వ్యక్తిత్వం, జీవితం నా మీద వేసిన ముద్ర చెరిగిపోయేది కాదు.

### జీవితం పెట్టిన ఇంటర్వ్యూలు

తన కళ్ల ముందే పోయినప్పటికీ మా నాన్న చనిపోయిన విషయాన్ని గుర్తించలేనంత షాక్‌లోకి వెళ్లిపోయింది మా అమ్మ. మూడు రోజుల పాటు ఆమెలో ఆ భ్రాంతి కొనసాగింది. నాలుగో రోజున ఆమె ఆధ్యాత్మిక గురువు అంబాదాస్ విట్ఠోబాగారు వచ్చి చెప్పాక ఆమె వాస్తవాన్ని గుర్తించింది, ఆమె లోపల గూడు కట్టుకున్న దుఃఖం ఒక్కసారిగా బద్దలయింది.

నాన్న మరణం మా కుటుంబాన్ని మానసికంగా అతలాకుతలం చేసింది. అప్పటికింకా మా తమ్ముళ్లు చిన్నవాళ్లు, చదువుకుంటున్నారు. నేను సివిల్స్ రాశాను, అదేమవుతుందో తెలీదు. ఇటువంటి పరిస్థితిలో మా బావ మాత్రమే మాతో పాటు ఉండి అన్నిటా అండగా నిలిచాడు.

అప్పటిదాకా మేముంటున్నది ప్రభుత్వ క్వార్టర్‌లో. దాన్ని మూడు నెలలలోపు ఖాళీ చెయ్యాలి. మా సొంతింటికి మారాలంటే, అప్పటివరకూ అద్దెకుంటున్న బాంకు అధికారి సుబ్రమణ్యం కుటుంబాన్ని ఖాళీ చేయించాలి. వాళ్లనడిగితే 'ఇప్పటికిప్పుడు కుదిరే పని కాదు' అన్నారు. అప్పుడు వాళ్లింటి పక్కనే ఉంటున్న రిజ్వీ అనే ఆయన వాళ్లను తమ ఇంట్లో, తమతో పాటు ఉండమని, మా ఇంటిని ఖాళీ చేయించి మాకిప్పించారు. మాసాబ్‌ట్యాంక్ దగ్గర శాంతినగర్ కాలనీలోని మా సొంతింటికి మారాం. అప్పటివరకు మా నాన్న వాడిన కారును అమ్మేసి నేను హెర్క్యులస్ సైకిల్ కొనుక్కున్నాను.

కారమ్మడం – అదొక పెద్ద ప్రహసనం. ఆ రోజుల్లో కారు అమ్మాలంటే ప్రభుత్వ అనుమతి ఉండాలి. ముందు దాన్ని మా అమ్మ పేరు మీదికి మార్పించడం, తర్వాత అమ్మడం – తల ప్రాణం తోకకొచ్చింది.

మా ఇంట్లోని టెలిఫోన్‌ను మేమే ఉంచుకోవాలనుకున్నాం. దానికి చేంతాడంత వెయిటింగ్ లిస్ట్! ఇక మా అమ్మకు పెన్షన్ వస్తుందో రాదో తెలియదు. ఎన్నో నెలల పాటు ఆఫీసుల చుట్టూ తిరిగాక ఆమెకు నెలకు 150 రూపాయల పెన్షన్ మంజూరయింది. అదికూడా పిల్లలు మేజర్లయ్యే వరకు. ఆ తర్వాత అది

75రూపాయలకు పరిమితమవుతుందని తెలిసింది. ఆ సమయంలో ఒక్కో పనీ పూర్తి కావడానికి ఒక సామాన్య పౌరుడిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాను!

## **అదొక పెద్ద పాఠం**

నిజానికి ఇంటర్వ్యూ బాగా చెయ్యకపోయినా కూడా ర్యాంకు వచ్చేంత బాగా రాత పరీక్షలో మార్కులు సంపాదించాలన్నది నా ఆలోచన. దాన్నే అమల్లో పెట్టాను కూడా.

1964 ఫిబ్రవరిలో నాకు ఐఏఎస్ ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది! లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తూనే ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యాను. గడచిన రెండు నెలల దినపత్రికలు, మ్యాగజీన్లు పిడి కొట్టేశాను. ఉస్మానియా యూనివర్సిటీలో నా సహోద్యోగులు ముగ్గుర్ని ఎంచుకుని, ఎలాంటి ప్రశ్నలడగాలో నేనే చెప్పాను. వాటి ఆధారంగా వాళ్లు నాకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ వ్యూహం బాగానే పనిచేసింది.

వెళ్లేముందు మా వీసీగారికి చెబితే, 'నువ్వు ఇంటర్వ్యూలో నెగ్గుతావనడంలో నాకెలాంటి సందేహమూ లేదు. దేశంలో టాప్ టెన్‌లో ఒకడిగా వస్తావు కూడాను. అయినా సరే, ఐఏఎస్ నీకు సరైనది కాదనే నా అభిప్రాయం. ఏదేమైనా, వచ్చాక నిర్ణయించుకోవచ్చులే...' అన్నారాయన.

నేను ఇంటర్వ్యూకు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నానో చెప్పలేను. ప్రయాణంలో అవకతవకలు జరగ్గూడదని, ఐదు రోజుల ముందే ఢిల్లీ చేరుకున్నాను. అనారోగ్యం బారిన పడకూడదని ప్రయాణం రెండు రోజులకు సరిపడా తిండి, మంచినీళ్లు కూడా ఇంటి నుంచే తీసుకెళ్లాను. ఢిల్లీలో ఎంపీ జేసీ నాగిరెడ్డి ఇంట్లో దిగాను. అప్పటికి మా ఫ్రెండ్ నరేంద్ర అక్కడ ఉండి ఏఐసీసీ ఎకనామిక్ జర్నల్ బాధ్యతలు చూస్తున్నాడు. ఉన్న రెండ్రోజుల్లో బడ్జెట్ గురించి వ్యాసం రాసివ్వమంటే ఇచ్చాను కూడా.

కేపీఎస్ మీనన్ అనే అధికారి సారథ్యంలో బోర్డు నన్ను ఇంటర్వ్యూ చేసింది. ఆంధ్ర రాష్ట్ర విభజన ఎందుకు మంచిదని వాళ్లడిగారు. భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేస్తామన్నది స్వాతంత్ర్య వాగ్దానాల్లో ఒకటని, మద్రాసు రాష్ట్రంతో కలిసి ఉంటే తమనెవరూ పట్టించుకోలేదని ఆంధ్రులు భావించారని, ఇలాంటి నేపథ్యంలో విభజన మంచిదని – ఇలా ఇరవై నిమిషాలపాటు సమాధానం చెప్పాను.

నా కష్టమేదీ వృథాపోలేదు. నాకు పన్నెండో ర్యాంకు వచ్చింది.

పరీక్ష ఫలితాలు వచ్చినప్పుడు నేను తిరుపతిలో మా పెద్దమ్మ కూతురు, మేనమామ భార్య అయిన సరస్వతక్క వాళ్లింట్లో ఉన్నాను. ముందురోజు రాత్రి రేడియోలో ప్రకటించారట, నాకా సంగతి తెలియలేదు. మర్నాడు మా అక్క దినపత్రిక తీసుకొచ్చి పరీక్ష ఫలితాలొచ్చాయి చూడమన్నది. నేను లోపలికి పోయి ఒక్కణ్ణే రహస్యంగా చూసుకుని, బయటకొచ్చి పాసయ్యానని అందరికీ చెప్పాను!

హైదరాబాద్ తిరిగొచ్చాక నడి వేసవిలో నా హెర్క్యులస్ సైకిల్ తొక్కుకుంటూ పోస్టాఫీస్ కెళ్లి నాకొచ్చిన ఆర్డర్ తెచ్చుకున్నాను. అక్కడి పోస్ట్‌మ్యానేమో 'నువ్వు పోస్టల్ సర్వీసులో చేరితే బాగుంటుందేమో'నన్నాడు!

నేను 1964లో సివిల్ సర్వీస్‌లో చేరాను.

తండ్రి మరణం ఒకవైపు – సివిల్స్‌లో విజయం మరోవైపు – ఇరవైరెండేళ్ల వయసులో కలిగిన ఆ అనుభవం – మానవ స్వభావాల గురించిన అవగాహనను ఇచ్చింది. జీవితానికి సరిపడా పాఠాలు నేర్పించింది.

ఆ తర్వాత మా పెద్దమేనమామ 'ఏమిరా, నీకు ఐఏఎస్ వచ్చేసిందే... ఎలా వచ్చిందీ?' అని పలకరించారు.

'అవును మామా, నాకన్నా తెలివైనవాళ్లు ఎంతోమంది ఉండింటారు. కాని మా నాయిన చేసుకున్న పుణ్యం వల్ల నాకు ఐఏఎస్ వచ్చింది...' అని జవాబిచ్చాను!

# జ్ఞానంతో పాటు విలువలు

**1964** మే 27 తేదీన మన తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మరణించారు. దేశంలో ఒకవిధమైన శూన్యం అలముకుంది. దేశ భవిష్యత్తు ఏమిటని విద్యావంతుల్లో ఆలోచనలు సుళ్లు తిరుగుతూ ఉండేవి. తాత్కాలిక ప్రధానిగా గుల్జారీలాల్ నందా ఉన్నారు – జూన్ తొమ్మిదో తేదీన ప్రధానమంత్రిగా లాల్‌బహదూర్‌శాస్త్రి పగ్గాలు చేపట్టారు.

1964 జూన్‌లో నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో మా బ్యాచ్ ఐఏఎస్ ట్రెయినింగ్ మొదలైంది. అది హిమాలయ పర్వతశ్రేణిలోని ముస్సోరి హిల్‌స్టేషన్‌లో ఉంది. సుందరమైన ప్రదేశంలో నిర్మించిన ఛార్లివిలే హోటల్‌ను 1959లో మన ప్రభుత్వం తీసుకుని, దాన్ని అత్యున్నత స్థాయి అధికారులకు శిక్షణ కేంద్రంగా మార్చింది. దానికి సమీపంలోనే కనుచూపు మేరా పచ్చదనం పరచుకున్న ఒక అందాల లోయ ఉంటుంది. దాన్ని హాపీవేలీ అంటారు. దాన్ని కూడా ప్రభుత్వమే తీసుకుని అకాడమీకి అనుబంధంగా స్పోర్ట్స్ క్లబ్ ప్రదేశంగా వాడుతోంది. నీతినిజాయితీలకు పెట్టింది పేరైన ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రిగారి గౌరవార్థం 1966 తర్వాత నుంచి అకాడమీకి ఆయన పేరు పెట్టారు.

వేడి ప్రాంతాల నుండి వెళ్లిన నాలాంటి వాళ్లకు ముస్సోరీలోని చల్లటి వాతావరణం కొత్తగా అనిపించేది. అక్కడి స్థానికులు నిష్కల్మషంగా ఉండేవారు. మేమెవ్వరం ఎప్పుడూ గది తలుపులు వేసేవాళ్లమే కాదు!

శిక్షణలోని మొదటి నాలుగు నెలలు ఫౌండేషన్ కోర్స్. ఇది ఐఎఫ్ఎస్, ఐఏఎస్, ఐపీఎస్ మొదలు అందరికీ కలిపే ఉంటుంది. విభిన్న ఆర్థిక – సామాజిక నేపథ్యాల నుంచి వచ్చిన యువతరంగాలు.. అందరూ బాగా చదువుకున్నవారే... అందరినీ కలవడమే ఒక ఎడ్యుకేషన్ అన్నట్టుండేది.

ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, కలకతా, ముంబై వంటి నగరాల్లో చాలా పేరున్న కాలేజీల్లో చదువుకుని వచ్చిన విద్యార్థులకు, పల్లెటూరి నేపథ్యాల నుంచి వచ్చిన వాళ్లకు మధ్య తేడా స్పష్టంగా తెలిసేది. అలాగే ఉత్తరాది, దక్షిణాది తేడాలూ బాగానే కన్పించేవి. ఎందుకనో పశ్చిమం వైపు నుంచి ఎక్కువమంది లేరు. మొత్తం ప్రొబేషనర్లలో అమ్మాయిలు పది శాతానికి మించి ఉండేవారు కాదు.

సివిల్ సర్వీస్ పరీక్షల్లో అప్పటికి ఓబీసీ రిజర్వేషన్స్ లేవు. పరీక్ష రాయడానికి వయోపరిమితి తక్కువ. 21 నుండి 24 నిండకుండానే ఉన్న ఛాన్సులు ఉపయోగించుకోవాలి. ఉన్నవేమో రెండే ఛాన్సులు. దీంతో సివిల్స్ రాసి పాసయినవాళ్లలో ఎక్కువమంది బ్రాహ్మణులు, నగరాల నుండి వచ్చినవారు ఉండేవారు. ఉదాహరణకు 1948 నుండి చూస్తే నాకు ముందు ఐఏఎస్‌లోకి ప్రవేశించిన మొదటి రెడ్డి జయభారత్‌రెడ్డి!

ఫౌండేషన్ కోర్సు సమయంలో మాకు భారత రాజ్యాంగం, చరిత్రలకు సంబంధించిన క్లాసులు చెప్పేవారు. హిందీ క్లాసులు కూడా జరిగేవి. ఆ భాషలో మాకున్న సౌలభ్యాన్ని బట్టి కొన్ని బృందాలుగా విభజించారు. ఇక ఐఏఎస్‌లకు గుర్రపు స్వారీ నేర్చుకోవడం తప్పనిసరి. కేవలం నేర్చుకుంటే సరిపోదు, దానికి సంబంధించిన పరీక్షలో చచ్చినట్టు నెగ్గాల్సిందే.

సినిమాల్లోనో టీవీల్లోనో చూస్తే గుర్రపు స్వారీ చాలా ఆకర్షణీయంగా కన్పిస్తుంది కాని, నేర్చుకుందామని గుర్రం మీద ఎక్కి కూర్చోగానే అర్థమవుతుంది – అదెంత కష్టమో! నాకు ఎందుకో అది ముందునుంచీ ఇష్టం అన్పించలేదు. గుర్రపుస్వారీ చెయ్యాల్సి వచ్చేసరికి – దేవుడున్నాడని విపరీతంగా నమ్మడం మొదలుపెట్టాను. దేవుడు నాలోనూ, గుర్రంలోనూ కూడా ఉన్నాడని, అందువల్ల ప్రమాదమేం జరగదని నమ్మి, గట్టిగా దండం పెట్టుకుని గుండె దడదడలాడుతుండగా ఆ పరీక్ష ఎలాగోలా గట్టెక్కాను.

ముస్సోరీ నుంచి హరిద్వార్, ఋషికేశ్ చాలా దగ్గర. నేనొకసారి బస్సులో ఆ ప్రదేశాలన్నీ తిరిగి వచ్చాను. ఆ బ్యాచ్‌లో నా స్నేహితుడు వాసుదేవన్‌కు హిందీ మీద బ్రహ్మాండమైన పట్టుండేది. అతని హిందీ మా అందరికీ చాలా ఉపయోగపడింది. అదెలాగంటే మన దేవాలయాల్లో, ఊళ్లలో అందరినీ ఆకట్టుకునేలా పురాణశ్రవణం చేస్తుంటారు చూడండి... అలాగ మా వాసుదేవన్ సరసమైన హిందీ నవలలను మాకు మంచి ఇంగ్లీషులోకి అనువాదం చేస్తూ రసవత్తరంగా చెప్పేవాడు.

ఫౌండేషన్ కోర్సు మొదలైన ఒక నెల తర్వాత అనుకుంటాను, మా అందరినీ అకాడమీ గురించి మా అనుభవాన్ని, అభిప్రాయాలను పంచుకోమన్నారు. నేను చెప్పింది జోకులాగా అనిపించింది కాని అది నిజమేనని అందరూ ఒప్పుకున్నారు. ఇంతకూ నేనేం చెప్పానంటే – 'మొదటిసారి అకాడమీలోకి అడుగుపెట్టినప్పుడు ఇంత కష్టమైన పోటీ పరీక్షలో నేనెలా నెగ్గానా అని నాకే ఆశ్చర్యంగా అనిపించింది. గడిచిన నెల రోజుల్లో నా తోటివారిని చూస్తుంటే వీళ్లంతా ఇక్కడికెలా రాగలిగారోనని అబ్బురంగా అనిపించింది. చూడబోతే అందరూ నావంటి సామాన్యులే..' అన్నాను.

అది నిజమే కూడా. అప్పుడే కాదు, ఇప్పటికీ సరైన తీరులో పరిశ్రమిస్తే ఎవరైనా అత్యున్నత సివిల్ సర్వీసుల్లోకి వెళ్లగలరు. దానికి ప్రత్యేక ప్రతిభాపాటవాలు ఉండాలనుకోవడం అపోహ మాత్రమే.

మొత్తమ్మీద మొదటి నాలుగు నెలలూ చాలా సరదాగా, చాలా విజ్ఞానాత్మకంగా సాగాయి. ఉద్యోగం ఉంది, జీతం వస్తుంది, చెయ్యాల్సిన పనేమీ లేదు, మా మీద బాధ్యతంటూ ఏమీ లేదు. అందువల్ల ఒత్తిడి లేదు. ఆడుతూపాడుతూ అన్ని విషయాలనూ తెలుసుకోవడమే మేం చెయ్యాల్సిన పని.

## పాక్ కాల్పులు చూశాం

ఫౌండేషన్ కోర్సు తర్వాత ఐపీఎస్, ఐఎఫ్ఎస్, రెవెన్యూ, ఇన్‌కమ్‌టాక్స్, పోస్టల్ సర్వీస్ వంటి కోర్సులను విడగొట్టేస్తారు. వాళ్లంతా వివిధ ప్రదేశాల్లోని తమతమ ప్రత్యేక శిక్షణ కేంద్రాలకు వెళ్లిపోయేవారు. ఐఏఎస్‌లకు మాత్రం ముస్సోరీ అకాడమీలోనే శిక్షణ కొనసాగేది. దానిలో భాగంగా ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్ మొదలైన వాటి పట్ల అవగాహన కలిగించారు.

ఐఏఎస్ శిక్షణలో భాగంగా కొద్ది నెలల తర్వాత – మా ప్రొబేషనర్లలో 20 మంది చొప్పున ఒక బృందంగా 5 గ్రూపులు చేసి మన దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపారు. దక్షిణాది వాళ్లను ఉత్తరాది వైపు, అటువాళ్లను ఇటువైపు అలా అప్పటివరకూ తెలియని విషయాలు తెలుసుకునేలా పంపుతారు. దాదాపు రెండు నెలల పాటు సాగిందీ యాత్ర. మా బృందంలో ఎక్కువమంది దక్షిణాదివాళ్లమే. అందులోనూ శాకాహారులెక్కువ. నాకేమీ ఇబ్బంది లేకపోయేదిగాని, వాళ్లకు నచ్చే ఆహారం దొరక్క, ఆయా ప్రాంతాల్లో దొరికేది తినలేక ఎన్ని పాట్లు పడ్డారో. ఈశాన్య రాష్ట్రాల్లో శాకాహారం దొరకడమే అరుదన్నట్టుండేది. దాంతో ఎక్కడికెళ్లినా ముందుగా

వాళ్లు చేసే పనేంటంటే మంచి సౌతిండియన్ లేదా శాకాహార భోజనం ఎక్కడ దొరుకుతుందో వెతుక్కోవడం!

ఈ యాత్ర ద్వారా మాకు గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కొన్ని అంశాలు అర్థమయ్యాయి. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలుసుకున్నాం. నాగాలాండ్ అప్పుడే కొత్త రాష్ట్రంగా అవతరించింది. అక్కడి ముఖ్యమంత్రి మమ్మల్ని ఆయన ఇంటికి పిలిచి, తన కుటుంబంతో సహా మాకు ఆతిథ్యమిచ్చారు!

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమ్మల్ని ప్రఖ్యాత 'రైటర్స్ బిల్డింగ్'లో కలిసి సరదాగా మాట్లాడారు. అదే ఉత్తరప్రదేశ్ చీఫ్ సెక్రెటరీ మాత్రం తన హోదా, జ్ఞానం, ఇంగ్లీషు పరిజ్ఞానం... ఇలా అన్నీ మా ముందు ప్రదర్శించాలని తహతహలాడటం నాకింకా గుర్తుంది.

మా భారత దర్శన్‌లో భాగంగా మేం – పాకిస్తాన్‌కు చేరువగా ఉన్న పూంఛ్ సెక్టార్‌లో గూర్ఖా బెటాలియన్‌తో కలిసి రెండు వారాల పాటు ఉన్నాం. అక్కడి పరిస్థితులు దుర్భరం. అయినా అక్కడి అధికారులు, సిపాయిలు తమదైన ప్రపంచాన్ని సృష్టించుకుని ఉన్నంతలో సరదాగా ఉంటూ చాలా జాగ్రత్తగా విధులు నిర్వర్తించేవారు. ఆశ్చర్యమేమంటే సరిహద్దుకు అవతల ఉండే పాకిస్తాన్ ఆర్మీతో వాళ్లకు మంచి స్నేహం ఉండేది. గస్తీ తిరుగుతున్నప్పుడు ఒకరినొకరు పలకరించుకుంటూనే ఉండేవాళ్లు.

'భారత్ – పాకిస్తాన్ మధ్య కాల్పులను చూస్తారా?' అని అడిగారు అక్కడి ప్రధాన అధికారి. ఆశ్చర్యం, ఆసక్తి నిండిన స్వరాలతో మేం తప్పకుండా చూడాలనుందని చెప్పాం. వెంటనే అటూఇటూ సైనికాధికారులు దానికి ఏర్పాట్లు చేశారు. ఉత్తుత్తినే జరుగుతున్న ఈ కాల్పుల గురించి అక్కడ విషయాలు చూసుకునే ఐక్యరాజ్యసమితి అధికారికి కూడా విషయాన్ని చేరవేశారు, మళ్లీ వాళ్లు వాటిని నిజం కాల్పులని పొరబడకుండా ఉండేందుకు!

ఆ ఏడాది మా దసరా అక్కడే జరిగింది. దుర్గా పూజల సందర్భంగా గూర్ఖా బెటాలియన్‌లో మద్యం, నాట్యం రెండు రోజులపాటు ఎడతెగలేదంటే నమ్మండి! వాళ్లు ఒక్కవేటుతో జంతువుల్ని చంపి దుర్గామాతకు బలిచ్చేవాళ్లు.

1965 జనవరి 26న మన అధికార భాషగా హిందీని ప్రకటించారు. దానికి వ్యతిరేకంగా కొన్ని రాష్ట్రాల్లో ఉద్యమాలు చెలరేగాయి. హిందీకి వ్యతిరేకంగా

తమిళనాట ఒక ఉద్యమకారుడు తనని తాను కాల్చుకుని చనిపోయాడు. ఉద్యమకారులు తమను తాము అంటించుకుని చనిపోయి నిరసన వ్యక్తం చెయ్యడం అదే తొలిసారి.

అకాడమీ పరీక్షల్లో కూడా బాగా రాయడం, డైరెక్టర్స్ అసెస్‌మెంట్‌లో మంచి మార్కులు రావడం వల్ల ఐఏఎస్‌లో నాలుగో స్థానానికి చేరుకున్నాను. నేను ఐఏఎస్ శిక్షణకని వెళ్లిపోయినప్పటికి మా తమ్ముళ్లిద్దరూ ఇంకా చిన్నవాళ్లు. మా అమ్మేమో మా నాన్నగారు పోయిన దుఃఖం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదు. అలాంటి సమయంలో మా బావ ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో ఉండి మా కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచాడు.

మా పెద్ద తమ్ముడు మధుసూదన్‌రెడ్డి న్యూసైన్స్ కాలేజీలో బీఎస్సీ జియాలజీలో చేరాడు. చిన్న తమ్ముడు రమేశ్ కొండారెడ్డి మెథడిస్ట్ హైస్కూల్లో చదువుతుండేవాడు. పెళ్లయిన తర్వాత మా చెల్లి డిగ్రీ పూర్తి చేసింది, మా బావ కూడా మెడిసిన్ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయన సొంతంగా స్కూటర్ కొనుక్కుని ఇంటికి తెచ్చిన రోజు మాకందరికీ పెద్ద పండగే! ఎందుకంటే ఆ రోజుల్లో ప్రతిదానికీ పెద్ద వెయిటింగ్ లిస్ట్ ఉండేది. టెలిఫోన్ కనెక్షను, స్కూటరు, వంట గ్యాస్ కనెక్షను – మూడూ సంపాదిస్తే గొప్పవాళ్లనే లెక్క.

నాకు పోస్టింగ్ వచ్చేనాటికి మా చెల్లికి కొడుకు పుట్టాడు. మా నాన్న ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారని, వాడికి శ్రీనాథ్‌ప్రశాంత్‌రెడ్డి అని పేరు పెట్టారు. తర్వాత వాణ్ణిక్కడ మాతో వదిలిపెట్టి మా చెల్లి, బావ లండన్‌కు వెళ్లారు. వాడివల్ల మా అమ్మలో దిగులు తగ్గింది. ఐదేళ్ల పాటు వాణ్ణి మా అమ్మే పెంచింది. తర్వాత వాడు కూడా తల్లిదండ్రుల దగ్గరకు లండన్ వెళ్లిపోయాడు.ఆ తర్వాత మా పెద్ద తమ్ముడు మధు బీఎస్సీ పూర్తి చేసి లా కోర్సులో చేరాడు. తను సివిల్స్ పరీక్ష మొదటిసారి రాసినప్పుడు రాలేదు.

## వైజాగ్‌లో అసిస్టెంట్ కలెక్టర్ని!

ఐఏఎస్ పరీక్షలో మంచి ర్యాంకు వచ్చింది కనుక, నేను కోరుకున్న ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు నన్ను అలాట్ చేశారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు సొంత రాష్ట్రానికి రావడం అభ్యర్థులకు కష్టం.

ఐఏఎస్ అంటే – ఏడాది పాటు అకాడమీలో ట్రెయినింగ్ ముగిసిన తర్వాత మరో ఏడాదిన్నర – రెండేళ్ల పాటు ట్రెయినింగ్ క్షేత్ర స్థాయిలో ఉంటుంది. దానిలో భాగంగా మొదటేడాది ఒక జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా చెయ్యాలి, తర్వాత ఆరు నెలలు బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా, మరో మూడు నెలలు జిల్లా పరిషత్ అసిస్టెంట్ సెక్రటరీగా చెయ్యాలి. వీటి మధ్యలో రెవెన్యూ, అకౌంట్స్, జ్యుడిషియరీ, స్థానిక భాషల్లో డిపార్ట్‌మెంట్ పరీక్షలుంటాయి. అవి పాసవాలి. మన రాష్ట్రంలోనైతే ఉర్దూ కూడా పాసవాలి! ఆ తర్వాతే సబ్–కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తారు. ఇదీ పద్ధతి.

1965 జులైలో నాకు విశాఖపట్నం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పోస్టింగ్ వచ్చింది.

విశాఖపట్నం జిల్లాకు అప్పటి కలెక్టర్ ఆబిద్ హుస్సేన్. అందరూ ఆయన్ని ఆబిద్ సాబ్ అనేవాళ్లు అభిమానంగా. ఆయన గదికి వెళితే ఎంతో ఆప్యాయంగా స్వాగతించారు నన్ను. అప్పటికి ఆయన నా గురించి విన్నదాని ఆధారంగా నన్ను బాగా ప్రశంసించారు. తర్వాత నా కుటుంబం, నేపథ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈలోగా ఆయన సహాయకుడు వచ్చి ఆయన వేరే చోటికి వెళ్లాల్సి ఉందని గుర్తు చేశాడు. అలాగే ఒక ఇరిగేషన్ వివాదం విషయంలో వాదనలు వినాల్సి ఉందని చెప్పాడు. అంటే ఆబిద్‌గారు ఒక్కటే సమయానికి మూడు పనులు పెట్టుకున్నారన్న మాట!

'నేను బయట కార్యక్రమానికి వెళతాను. ఈలోగా ఇరిగేషన్ వివాదానికి సంబంధించిన వాదనలు మీరు వినండి. నేను తయారుచెయ్యాల్సిన జడ్జిమెంట్ డ్రాఫ్ట్ మీరే సిద్ధం చెయ్యండి...' అని అక్కడికక్కడే చెప్పేశారు. అక్కడితో ఆగకుండా ఆ న్యాయవాదులిద్దరిని పిలిచి నన్ను పరిచయం చేసి 'మన అసిస్టెంట్ కలెక్టరు చాలా తెలివైనవాడు. మీ విషయంలో ఇతను చాలా న్యాయంగా నడుచుకుంటాడు..' అని చెప్పేసి వెళ్లిపోయారు.

కలెక్టర్ మాటను కాదనలేక ఆ న్యాయవాదులిద్దరూ నాతో పాటు నా గదిలోకి వచ్చారు. అలా నేను విధుల్లోకి చేరిన మొదటి రోజే ఒక వివాదంలో వాదనలు వినాల్సి వచ్చింది. ఆ రోజంతా దానికి సంబంధించిన రికార్డులు పరిశీలించి మర్నాటికల్లా కలెక్టర్ కోసం డ్రాఫ్ట్ తయారుచేశాను. ఆయన ఆ ఫైలును ఏమాత్రం చదవకుండానే సంతకం చేశారు!

''ఈ కేసు బాగా వివాదాస్పదమైంది. కొత్తవాళ్లయితే నిష్పక్షపాతంగా ఉంటారని వాళ్లనుకుంటారు. అందుకే మిమ్మల్ని వినమన్నాను. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి కావలసింది న్యాయశాస్త్రమో, సబ్జెక్టు పరిజ్ఞానమో కాదు, నమ్మకం, నిజాయితీ. అవి మీకున్నాయని వాళ్లు నమ్మడం ముఖ్యం..'' అంటూ చెప్పారు.

ఆబిద్‌గారి పనితీరు ఎంత విలక్షణమైనదో నాకప్పుడే అర్థమైంది. దాంతో నేనాయన అభిమానిగా మారిపోయాను. ఆయన చాలా ఉత్సాహంగా, చురుగ్గా పనిచేసేవారు. గొప్ప ఆకర్షణీయంగా ఉండేవారు. సానుకూల దృక్పథం ఆయన బలం. ఆబిద్‌గారికి చిన్నచిన్న విషయాలేం పట్టేవి కాదు. దూరదృష్టితో భవిష్యత్తులో పనికొచ్చే ఆలోచనలు చేసేవారాయన.

ఉదాహరణ చెప్పాలంటే ఆ రోజుల్లో విశాఖపట్నంలో బీచ్ వెంబడి సుందరమైన పార్కులు, విశాలమైన రహదారి ఉండాలన్నది ఆయన ఆలోచనే. మేం అక్కడ పనిచేసేనాటికి సముద్రతీరం అంతా కంపుకొడుతూ ఉండేది. ఇవాళ అందరూ మార్నింగ్ వాక్‌కు ప్రశాంతంగా ఉంటుందని అనుకుంటున్న ఆ ప్రదేశం ఆనాడు కేవలం బహిర్భూమిగా ఉపయోగపడేది. దాన్ని సంస్కరించి అమెరికా మాదిరిగా సుందరీకరించాలని ఆయన ఎంతో తపన పడేవారు.

విశాఖలో ఉక్కు కర్మాగారం కోసం ఆందోళన తీవ్రంగా జరుగుతూ ఉన్న రోజులవి. అది విశాఖపట్నానికి వచ్చేలాగా ఆబిద్ హుసేన్ కృషిచేశారు. అందుకే వైజాగ్‌వాసులకు ఇప్పటికీ ఆయనంటే చాలా గౌరవం. ఆబిద్‌గారికీ ఆ పట్నమంటే అంతే ప్రేమ. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె. విశాఖపట్నంలో ఉండగా పుట్టిందని, ఆ ఊరు పట్ల ఇష్టంతో ఆయన ఆమెకు 'విశాఖ' అని పేరు పెట్టారు!

**అతి మంచికి పోతే....**

ఒకసారి ఆయన ఒక ధనవంతుల ఇంట్లో పెళ్లి విందుకు వెళుతూ నన్నూ రమ్మన్నారు. నేను రానన్నాను. ''పేదల పక్షం వహించడం అంటే– డబ్బున్నవారి పట్ల వ్యతిరేకత అని అర్థం కాదు. నిజమైన పబ్లిక్ సర్వెంట్ ఇద్దరి పట్లా సమానంగా వ్యవహరించాలి...'' అంటూ నూరిపోశారు.

అప్పట్నుంచి ఆ వాక్యాలు నా బుర్రలో నాటుకుపోయాయి. వ్యక్తిగతంగా నాకు సంపదను ప్రదర్శించడం ఇష్టం ఉండదు. కాని వృత్తిరీత్యా అవసరమైనప్పుడు నేను ఎవరితోనైనా ఒకేలాగా ప్రవర్తించడం అలవాటు చేసుకున్నాను.

ఆబిద్ గారు మంత్రులతో వ్యవహరించే తీరు సరదాగా, చిత్రంగా ఉండేది. ఒక్కసారి మాత్రం ఆయన బోల్తా పడ్డారు. అదెప్పుడంటే – అప్పట్లో ఎ.సి.సుబ్బారెడ్డి పౌరసరఫరాల శాఖా మంత్రిగా ఉండేవారు. ఒకసారి ఆయన ఆ శాఖ డైరెక్టర్‌తో కలిసి విశాఖపట్నం వచ్చారు. ప్రతి జిల్లాకూ ఆహారధాన్యాలెన్ని కావాలో తెలుసుకుని ఆ ప్రకారం పంపకం చెయ్యడం వాళ్ల ఉద్దేశం.

మొత్తమ్మీద రాష్ట్ర అవసరాలకు సరిపడినన్ని లేవని అందరికీ తెలుసు. అయినా సరే, 'మీకెన్ని కావాలి' అని అడగ్గానే ఆబిద్‌హుసేన్ బోలెడన్ని చార్టులు, గ్రాఫులు మంత్రి ముందు పరిచి సప్లై, డిమాండ్‌ల మధ్య అంతరాన్ని ఆయనకు వివరించడానికి పూనుకున్నారు.

మంత్రికి చిరాకెత్తి 'ఎన్ని కావాలో అంచనా చెప్పమంటే ఇవన్నీ ఎందుకండీ' అన్నారు.

కలెక్టరు చెబుతుండగానే ఆయన మధ్యలో అడ్డుతగిలి 'కలెక్టరుగారూ మీరు జిల్లా పరిషత్ ఛైర్మన్‌లాగా మాట్లాడకండి. ఒక బాధ్యత కలిగిన కలెక్టరుగా మీకేమేం కావాలో సరిగ్గా చెప్పండి' అన్నారు.

ఆ మాటలోని విసురుకు ఆబిద్‌గారు నొచ్చుకున్నారు. వెంటనే తన పేపర్లన్నీ సర్దేసి, 'మంత్రిగారికి ఈ విషయం చర్చించే మూడ్ లేదనుకుంటాను. మళ్లీ కలుద్దాం లెండి...' అంటూ గదిలోంచి బయటికెళ్లిపోబోయారు.

వెంటనే మంత్రి ఆయనవైపు త్వరత్వరగా నడిచి, జబ్బ పట్టుకుని మళ్లీ గదిలోకి తీసుకొచ్చారు. వస్తూనే తన విసురుకు క్షమాపణ కూడా చెప్పారు. 'నాకు మూడ్ లేకపోవడం ఏం లేదు. విషయం పూర్తిగా చెప్పండి' అన్నారు కూల్‌గా.

ఆబిద్‌హుసేన్ కూలంకషంగా అంతా వివరించారు. ఎంత బాగా చెప్పినా, అంతకు ముందు కన్నా డిమాండ్ కాస్త తగ్గించినా, అవసరమున్న దానికన్నా ఎక్కువగా అడుగుతున్నారని అందరికీ అర్థమయింది.

మంత్రిగారు కాసేపు ఆలోచించారు. సివిల్ సప్లయిస్ డైరెక్టర్ వైపు తిరిగారు.

'గోపాలకృష్ణగారూ, మీరు విశాఖపట్నానికి ఆబిద్‌హుసేన్ అడిగినన్నీ కేటాయించండి..' అని చెప్పి 'కలెక్టరుగారూ, ఇప్పుడు మీకు ఓకేనా' అని అడిగారు. కలెక్టరు పరమానంద భరితుడైపోయారు. ఇక తన సీట్లోంచి లేచి వెళ్లబోయారు.

'ఒక్కమాట...' అంటూ పిలిచారు మంత్రివర్యులు.

'ఆబిద్‌గారూ మీరు సివిల్ సప్లయిస్ డైరెక్టర్‌గా వెళ్లండి. అన్ని వివరాలూ మీకు బాగా తెలుసుగనక మిగిలిన జిల్లాలకు సరిపడా ఆహారధాన్యాలివ్వడం సంగతి మీరు చూసుకోండి. గోపాలకృష్ణగారు ఇక్కడ కలెక్టరుగా వస్తారు. నేను ముఖ్యమంత్రితో మాట్లాడాక మీకు ఆర్డర్లు వస్తాయి...' అని చెప్పేసి అక్కణ్ణుంచి చకచకా తన గదిలోకి వెళ్లిపోయారు.

అందరం ఆశ్చర్యంతో నోట మాట రాకుండా అయిపోయాం.

ముందు తేరుకున్నది ఆబిద్‌గారే. మినిస్టర్ గదిలోకి వెళ్లి మాట్లాడుకుని తాను ముందు అడిగిన దానికన్నా తక్కువ ఆహారధాన్యాలకు ఒప్పుకొని వచ్చారు! ఆ సంఘటనతో నేను ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో నేర్చుకున్నాను. అంకెలు చేసే మాయాజాలం ఏమిటో, వాటిని సరిగ్గా ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకున్నాను.

ఆర్థికశాస్త్రంలో నాకు మక్కువ ఎక్కువ కనుక, దానికి సంబంధించి ఆంధ్రా యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కొందరు మంచి ప్రొఫెసర్లతో పరిచయాలు స్నేహంగా పరిణమించాయి. ప్రొఫెసర్ సర్వేశ్వర్రావు, డీవీ రమణ, జి. పార్థసారథి, కె.వి.రమణలతో పాటు, సోషల్ వర్క్ డిపార్టుమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ కె.వి.రమణ కూడా నాకు మంచి మిత్రులయ్యారు. ఆయన తర్వాత ఏ.యూ.కు వైస్ ఛాన్సలర్ అయ్యారు. పైన చెప్పిన వాళ్లంతా తర్వాత అంతర్జాతీయ సంస్థల్లో పని చేశారు.

1965 ఆగస్టులో భారత్ – పాకిస్తాన్ యుద్ధం మొదలైంది. రేవు పట్టణం గనుక విశాఖపట్నం మీద నిఘా పెరిగింది. అనుకున్నట్టుగానే పాక్ నేవీకి చెందిన ఘాజీ అనే జలాంతర్గామి విశాఖపట్నం మీద దాడిచేసే ప్రయత్నం చేసింది. దాన్ని మన నేవీ తిప్పికొట్టింది. ఆ సమయంలోనే పాకిస్తాన్‌కు చెందిన ఒక సాధారణ వాణిజ్యనౌక విశాఖ రేవుకు వచ్చి చేరింది. తమపైన దాడులు జరుగుతాయని అందులోనివారు భయపడుతుంటే అలాంటివేమీ జరగవని భరోసానివ్వడానికి ప్రభుత్వం తరఫున నేను వెళ్లాను. సెప్టెంబరులో లాహోర్‌పైన భారతసైన్యం దాడి చేసింది. ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ యు. థాంట్ జోక్యంతో సెప్టెంబరులో యుద్ధం ముగిసింది. ఆ తర్వాత డిసెంబరులో సరిహద్దు భద్రతా దళం (బోర్డరు సెక్యూరిటీ ఫోర్సు – బీఎస్ఎఫ్) ఆవిర్భవించింది.

ఆ ఏడాదే బర్మా నుంచి శరణార్థులుగా వచ్చినవారి కోసం విశాఖపట్నంలో కొన్నిచోట్ల క్యాంపులు, కాలనీలు ఏర్పాటు చేసింది ప్రభుత్వం. వాళ్లంతా తెలుగువాళ్లే అయినప్పటికీ ఒకటిరెండు తరాలకు పూర్వం ఆ దేశంలో స్థిరపడినవారు కావడంతో వాళ్లిక్కడ మళ్లీ ఇమడటం కష్టమయ్యేది. రోజూ ఏదో ఒక గొడవ రేగుతూనే ఉండేది. వాళ్లకు సర్దిచెప్పడానికి నన్ను పంపేవారు కలెక్టర్.

**మళ్లీ చదివానని రాస్తాను..**

*సూక్ష్మమైన అంశాల పట్ల శ్రద్ధ పెట్టడం, తగిన పరిజ్ఞానాన్ని సంపాదించడం అనేది నేను జాయింట్ కలెక్టర్ ఎస్వీ సుబ్రమణియన్ నుంచి నేర్చుకున్నాను. ఆయన నాకన్నా నాలుగేళ్లు పెద్ద. ముభావంగా, నిశ్శబ్దంగా, హుందాగా ఉండేవారాయన. పర్యవసానాలను పట్టించుకోకుండా కేవలం నిబంధనల ప్రకారం క్రమశిక్షణగా పనిచేసుకుపోవడమే ఆయన తీరు. రెవెన్యూ ఆర్డర్లు డ్రాఫ్ట్ చెయ్యడంలో, మరీ ముఖ్యంగా భూసేకరణకు సంబంధించిన విషయాలను రాయడంలో సుబ్రమణియన్‌గారిది అమోఘమైన నైపుణ్యం. ఆయనంటే అందరికీ భయం, గౌరవం.*

*సుబ్రమణియన్, ఆయన భార్య బైషిమి మంచి ఆతిథ్యం ఇచ్చేవారు నాకు. నేను వైజాగులో ఉన్నన్నాళ్లూ ప్రతి సాయంత్రమూ వాళ్లింటికి వెళ్లేవాణ్ణి. వాళ్లు నన్ను అభిమానంగా చూసుకునేవారు. నిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణ కుటుంబం వారిది. కర్ణాటక సంగీతమూ, తెలుగు సినిమాలూ – ఈ రెండే ఆ దంపతులకు కాలక్షేపం. మరి నేనేమో బ్రాహ్మణ్ణి కాను, విపరీతంగా పొగతాగుతాను! మా ముగ్గురివీ విభిన్న వ్యక్తిత్వాలయినా, మంచి స్నేహితులమయ్యాం. వివిధ మాన్యువల్స్, బోర్డు స్టాండింగ్ ఆర్డర్లు నేను చదివేలా ప్రోత్సహించేవారాయన.*

*ట్రెయినింగ్‌లో ఉన్నప్పుడు ఆదివారం కూడా మాకు పనిదినమే. ఎప్పుడైనా సెలవు తీసుకుంటే అన్నిరోజుల పాటు శిక్షణ పొడిగిస్తారు. ప్రతిరోజూ ఏం చేశామన్నది వారానికోసారి డైరీ పంపాలి పై అధికారులకు.*

ఇక్కడొక సరదా సంఘటన చెప్పాలి.

ఒక ఆదివారంతో నాకిచ్చిన రెవెన్యూ బోర్డు స్టాండింగ్ ఆర్డర్లు నాలుగూ చదవడం అయిపోయింది. 'ఈ ఆదివారం ఏం చేశానని రాస్తావు?' అనడిగారాయన.

'స్టాండింగ్ ఆర్డర్ వాల్యూం 5 చదివానని రాస్తాను సర్' అన్నా.

ఆయన గట్టిగా నవ్వి 'అసలు అది ఉంటే కదా చదవడానికి?' అన్నారు.

దానిదేముంది సర్, 4 వాల్యూమ్స్ మళ్లీ చదివానని రాస్తాను' అన్నాన్నేను కొంటెగా.

## నాకన్నా సమర్థులుంటారు, కాని..

ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో నాకు వ్యక్తిగత కార్యదర్శిగా ఒక కుర్రాణ్ణిచ్చారు. అప్పుడే హైస్కూలు చదువు పూర్తిచేసిన ఆ అబ్బాయికి స్టెనోగ్రఫీ, టైపింగ్ బాగా వచ్చు. అతని నైపుణ్యాలు చూస్తే నాకు ఆశ్చర్యంగా ఉండేది.

'మంచి మార్కులు వచ్చాయి కదా, ఎందుకు యూనివర్సిటీలో చదువుకోకుండా ఇటు వచ్చావు?' అని అడిగాను.

'మా కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితి దానికి సహకరించవు' అన్నాడా కుర్రాడు.

మన దేశంలో ఉన్నత విద్యను అందుకోగలిగే తక్కువమంది అదృష్టవంతుల్లో నేనొక్కణ్ణని నాకు అర్థమయింది. అంతేకాదు, ఉద్యోగంలో నాకు తోడ్పడే ఎంతోమంది నాకన్నా తెలివైనవాళ్లు, సమర్థులు అయి ఉండే అవకాశం ఉందని నాకు ఆ క్షణానే అర్థమయింది.

అప్పుడే నిర్ణయించుకున్నాను – ఎక్కడైనా అందరం కలిసి పనిచెయ్యాలే తప్ప, ఎవరూ ఎవరి కిందా పనిచెయ్యడం కూడదని. అధికారం, హోదా అనేవి కేవలం పనులు సజావుగా సాగడానికి పనికొచ్చే ఉపకరణాలు మాత్రమేనని.

# వేణుగోపాలరెడ్డిని కాస్తా వైవీరెడ్డినయ్యాను

**ఆ** తర్వాత రెండు వారాల పాటు ఒక గ్రామ కరణానికి అసిస్టెంట్‌గా పనిచెయ్యడం మొదలుకొని, రెవెన్యూ, పోలీసు వంటి కొన్ని కీలక విభాగాల పనితీరును అర్థం చేసుకోవాలి. కొన్ని నెలల పాటు జిల్లా కోర్టుకు వెళుతూ అక్కడి న్యాయమూర్తితో పాటు కేసుల హియరింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది.

న్యాయవాదులు న్యాయస్థానం ముందు సరైన వాదనలు వినిపించడం కన్నా తమ కక్షిదారులను సంతోషపెట్టడానికే ఎక్కువ ప్రయత్నించడాన్ని నేనప్పుడు గమనించాను. పేదలు తమ కేసులను సరైన రీతిలో చెప్పుకోలేకపోవడాన్ని కూడా గమనించాను. ధనికులకు వ్యతిరేకంగా ఫైల్ అయిన కేసులు అసలు కోర్టు దగ్గరకే రావు.

ఆ సమయంలో జిల్లా జడ్జిగా జగన్నాథరావుగారుండేవారు. ఆయన చాలా స్ట్రిక్ట్ అని పేరు. సాధారణంగా ఆయన దగ్గర ఐఏఎస్ ట్రెయినీల జ్యుడీషియల్ శిక్షణకు ఎక్కువ కాలం పడుతుందని చెప్పుకొనేవారు. ఆయన నన్ను ఒకసారి ఇంటికి ఆహ్వానించారు.

'మా ఇంట్లో కాఫీ, టీ వంటి వాటికి స్థానం లేదు. కేవలం మజ్జిగ అయితే ఇవ్వగలం' అన్నారు.

అదే ఇవ్వమన్నాను. మజ్జిగ తాగిన తర్వాత నేను సిగరెట్ వెలిగించడానికి ఆయన అనుమతి అడిగాను మర్యాదగా.

ఆయన వద్దనలేదుగాని, 'నీకెందుకీ చెడు అలవాట్లు' అన్నారు సీరియస్‌గా.

'అనుభవం కోసం. వయసులో ఉన్నప్పుడే ఇలాంటివన్నీ తెలుసుకోవాలి...' అన్నాను పెంకిగా.

'ఓహో, అలాగా. ఈ వయసులోనే జెయిలుకెళితే మంచిదేమో ఆలోచించుకో. అటువంటి అనుభవం కూడా నీకిప్పుడే ఉండాలి కదా మరి?' అన్నారాయన. ఆ మాటతో నా పెంకితనానికి అడ్డుకట్ట పడింది.

తర్వాత నా శిక్షణ జిల్లా ట్రెజరీ ఆఫీసులో. అక్కడ నేను రోజూ వందల కొద్దీ కాగితాలు, బిల్లుల మీద సంతకాలు పెట్టాల్సి వచ్చేది. వై. వేణుగోపాలరెడ్డి.. అంటూ పెట్టలేక, వైవీరెడ్డి అంటూ పొట్టి సంతకం పెట్టడం అక్కడ, అలా మొదలయిందే. అప్పట్నుంచే నేను అందరికీ వైవీరెడ్డినయిపోయా!

శిక్షణలో భాగంగా నేనొక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు తిరిగేవాణ్ణి. ఆ సమయంలో ఓ విషయాన్ని గమనించాను. వాళ్లు తిరగడానికి ప్రభుత్వం ఇచ్చే ఖర్చులు వాళ్లకు రానే రావు. అవన్నీ తాసీల్దారు దగ్గర జమయ్యి ఉంటాయి. ఎవరైనా పై అధికారులు వచ్చినప్పుడు పళ్లు, టీ, కాఫీ వంటివి అమర్చడానికి వాటిని ఖర్చుపెడతారు. ఎవరైనా నిజాయితీపరులైన అధికారులు తమ ఖర్చంతా తామే పెట్టుకుంటామన్నా, కిందివారు అలా చెయ్యనివ్వరు. అవినీతి మూలకారణాలు నాక్కొంత అర్థమయ్యాయి. నేను వ్యక్తిగతంగా అలాంటి ఖర్చు నాకిందివారితో పెట్టనివ్వకూడదని అప్పుడు తీర్మానించుకున్నాను.

మొదటి ఏడాది శిక్షణలో ఉన్నప్పుడు జిల్లాలోనే కాకుండా, సెక్రెటేరియట్ ట్రెయినింగ్, సర్వే, సెటిల్‌మెంట్, ట్రైబల్ అంశాలు, డిపార్ట్‌మెంటల్ పరీక్షల కోసమని హైదరాబాద్ కూడా తెగ తిరగాల్సి వచ్చేది.

ఒక సారి ఆరుగురు ట్రెయినీలం మంత్రి ఏసీ సుబ్బారెడ్డిని కలిశాం.

''ప్రభుత్వం విరాళాలు వసూలు చెయ్యమంటుంది. లోపాయికారీగా టార్గెట్లు కూడా పెడుతుంది. అధికారులు డబ్బున్నవారి దగ్గరకు మరీ ముఖ్యంగా రైస్ మిల్లర్లను అడుగుతారు. కాని సివిల్ సప్లయిల్లో ఏమాత్రం తేడా వచ్చినా అదే అధికారులు ఆ మిల్లర్ల మీదే విరుచుకుపడాల్సి వస్తుంది. ఏ మొహం పెట్టుకొని డబ్బులడుగుతాం, మళ్లీ వాళ్లమీదే రూల్సూ రెగ్యులేషన్సూ అని ఎలా అధికారం చేస్తాం సార్'' అని ఒక ప్రొబేషనర్ ఆయన్ని అడిగాడు.

దానికి మంత్రి చాలా కూల్‌గా సమాధానం చెప్పారు.

''ప్రభుత్వ అధికారికి ఒక మొహం అంటూ ఉండదు. ప్రభుత్వం చెప్పిన పనులు చెయ్యడమే తప్ప వాళ్లకంటూ ఒక ప్రత్యేకమైన పేరూ, మొహమూ ఉండవు. అలాగని తప్పుడు పనులు, అన్యాయాలు చెయ్యమంటే మీరు చెయ్యనవసరం లేదు'' అన్నారాయన!!

అసిస్టెంట్ కలెక్టరుగా పనిచేస్తున్న మరొక ట్రెయినీ ''పంచాయితీ సమితి ప్రెసిడెంట్లతో వేగడం చాలా కష్టమండీ. వాళ్లకు స్థానికంగా పట్టుంటుంది, అదీగాక అన్నిటినీ రాజకీయం చేస్తారు... వాళ్లనెలా డీల్ చెయ్యాలో తెలియడం లేదు....'' అంటూ మొరపెట్టుకున్నాడు.

''మీరంతా తెలివైనవాళ్లు. దేశంలో అత్యంత కఠినమైన పరీక్షలో నెగ్గి, అత్యుత్తమమైన శిక్షణ పొందిన యువతీయువకుల్లో మీరూ ఒకరు. అటువంటి మీకు – ఇప్పుడు ఈ వయసులో స్థానిక లీడర్లతో ఎలా డీల్ చెయ్యాలో తెలియకపోతే రేప్పొద్దున మీరు సెక్రెటరీలయ్యాక నాలాంటి సీనియర్ నాయకులతో, మంత్రులతో ఎలా డీల్ చేస్తారు? ఆలోచించండయ్యా...' అన్నారాయన ఘాటుగా.

''మీ చదువు, తెలివి, శిక్షణ, పరిశీలన – అన్నిటినీ వాడండి. స్థానిక రాజకీయ నేతలతో ఎలా వ్యవహరించాలో ఇప్పట్నుంచే నేర్చుకోండి...'' అని సలహానిచ్చారాయన.

1966 మధ్యలో – బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారిగా పోస్టింగు కోసం తగిన అర్హత వచ్చింది నాకు. కొన్ని గ్రామాల అభివృద్ధికి సంబంధించి ముఖ్యకార్యనిర్వహణాధికారిగా సొంతంగా ఆరు నెలలు పనిచెయ్యాలి. ఆరునెలల కోసం ఉన్న బీడీఓను వదులుకోవడం ఎందుకని స్థానిక రాజకీయ నాయకులు ఆలోచిస్తుంటారు. మొదట నన్ను పెందుర్తి వేశారు. నేను వద్దంటూ పెందుర్తి సమితి ప్రెసిడెంటు అభ్యంతరం చెప్పారట. ఆబిద్ హుసేన్ నన్ను భీమునిపట్నం వేశారు. అక్కడి జిల్లాపరిషత్ ఛైర్మన్ కూడా వద్దన్నారట.

భీమునిపట్నంలో చేరకుండానే నన్ను కొన్నాళ్లు సెలవులో వెళ్లమని సూచించారు కలెక్టర్. నేను సెలవు పెట్టేసి మా అమ్మను తీసుకుని శ్రీకాకుళం, పూరి వంటి క్షేత్రాల్లో యాత్రలకు వెళ్లిపోయాను. సెలవైపోయేసరికి నాకు హైదరాబాద్ శివార్లలోని హయత్‌నగర్‌కు పోస్టింగ్ వచ్చింది.

చాలామంది రాజకీయ నాయకులకు, ధనవంతులకు, కొందరు సీనియర్ బ్యూరోక్రాట్లకు అక్కడ ద్రాక్ష తోటలు, గెస్ట్‌హౌస్‌లూ ఉండేవి. అందువల్ల హయత్‌నగర్ చాలా కీలకమైన డివిజన్. వాళ్లందరితో సమితి ప్రెసిడెంట్‌కు మంచి సంబంధాలుండేవి. మంత్రిగా పనిచేస్తున్న మర్రి చెన్నారెడ్డికి సన్నిహితంగా ఉండేవాడతను. పంచాయితీ సమితి ప్రెసిడెంటు చదువుకున్నవాడే. యువకుడు, ఉత్సాహవంతుడు. ఆయనకు,

అక్కడున్న ఇతర అధికారులకూ కూడా బీడీఓగా నా పదవీ కాలం ఆర్నెల్లేనని ముందే తెలుసు. ఆర్నెల్లూ నామానాన నేనుండి జరిగేవాటిని గమనిస్తూ ఉండాలా.... లేదంటే ఉద్యోగాన్ని సీరియస్‌గా తీసుకుని నాకు మంచివని తోచిన మార్పుచేర్పులు చెయ్యాలా – అనేది నిర్ణయించుకోవలసిన సమయం అది. నేను యువ ఉత్సాహంతో మార్పుచేర్పులకు శ్రీకారం చుట్టాను. అది వాళ్లకు అనవసరంగా తోచింది.

సమితి ఆఫీసు నుంచి జారీ అయ్యే ప్రతి చెక్కులోనూ పది శాతం డబ్బు లబ్ధిదారుల నుంచి తీసుకోవడం రివాజుగా ఉండేది. అది సమితి ప్రెసిడెంటుకు చేరేది. రైతులకు మంజూరు చేసే రుణాలకూ ఇది వర్తిస్తుంది. రెండోది – గ్రామసేవికలకు కూడా జీతం అందాలంటే వారి పనితీరు తృప్తికరంగా ఉన్నట్టు సర్పంచ్ సర్టిఫికెట్ ఇవ్వాలి. ఇక మూడోది – ఏ పని చేసినా, ఆ పనికి తగిన బడ్జెట్ కేటాయింపు ఉందాలేదా, నిధులున్నాయా లేవా అనేది చూడకుండా నిధులు జారీ చేసెయ్యడమే సమితి ఆఫీసు పనిగా ఉండేది. ఇది నిబంధనలకు విరుద్ధం. అదేమంటే 'ముందు ఇచ్చెయ్యండి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా నేను చూస్తాను కదా' అనేవారు సమితి ప్రెసిడెంటు.

ఈ మూడింటినీ నేను అడ్డుకున్నాను. చెక్కు అందుకున్నవాళ్లు డబ్బు కట్టనవసరం లేదు. గ్రామాధికారుల జీతాల కోసం సర్పంచ్ ఏమీ సర్టిఫికెట్లు ఇవ్వనవసరం లేదు. ఇక నిధులు మంజూరైతేనే పనులు చేయించాలి... అని. ఆయనకు చిరాకెత్తింది. ఫలితం – నాకు కలెక్టరు నుంచి ఫోనొచ్చింది. 'ఒకసారి వెళ్లి మంత్రిగారిని కలవండి' అంటూ.

'నేను బీడీఓని. జిల్లాకు అధికారి కలెక్టర్. నా పనిలోని మంచిచెడ్డల గురించి నేను కలెక్టరుకు నివేదిస్తాను. అంతేగాని మంత్రిగారిని కలవాల్సిన పనేముంది?' అని అడిగాను.

నా సమాధానం మంత్రిగారికి చేరింది. తక్షణమే వేరే జిల్లాకు బదిలీ చేయించాలని పట్టుపట్టారు. కాని ముఖ్యకార్యదర్శి చెప్పిన మీదట – నా ఆర్నెల్ల పదవీ కాలం ముగిసిన తర్వాత నన్ను బదిలీ చేయొచ్చనని ముఖ్యమంత్రి అన్నారట.

దాంతో సమితి ప్రెసిడెంటుకు నా మీద కోపం పెరిగిపోయింది. ఆఫీసులో నేనేం చేసినా ఆయనకు తెలిసే ఏర్పాటు చేసుకున్నాడు. ఆయనా నేనూ కలిసి వాడుకోవలసిన జీపును ఆయనే వాడుకోవడం మొదలుపెట్టాడు. అంతేనా, నేను దాన్ని దుర్వినియోగం చేస్తున్నట్టు పై అధికారులకు ఫిర్యాదులు చేసేవాడు. దానిమీద విచారణ మొదలైంది.

ఈ వేధింపులకు అడ్డుకట్ట వెయ్యడానికి రెండువారాలు సెలవు పెట్టి వెళ్లిపోయాను. నేను సెలవు నుంచి వచ్చిన కొన్ని రోజులకే నా పదవీకాలం ముగిసినట్టు, నా తర్వాత అధికారిని నియమించినట్టు ఉత్తర్వులొచ్చాయి.

ప్రతి అధికారానికి పరిధులనేవి ఉంటాయి. మనం ఎంత సరిగా చెయ్యాలన్నా అందరూ సహకరించకపోతే కుదరదు. అలాగే రాజకీయ నాయకులను ఢీకొని బ్యూరోక్రసీ మనవైపు నిలబడుతుందని గట్టిగా నమ్మకోకూడదని నేర్చుకున్నాను. నా ఉద్దేశం మంచిదే అయినా, అధికార పరిధి ఎంతవరకో తెలుసుకోకుండా, ఆర్నెల్లలో అద్భుతాలు సాధ్యపడవని తెలుసుకోకుండా బీడీఓ ఆఫీసులో అత్యుత్సాహం ప్రదర్శించానని ఇప్పుడనిపిస్తుంది.

ఇలాంటి సందర్భాలలో ఎలా నెగ్గుకురావాలో తెలియలేదన్న బాధ కలిగింది అప్పట్లో. మంత్రి ఎ.సి.సుబ్బారెడ్డిగారు పూర్వం చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. సమితి ప్రెసిడెంట్లతోనే వేగలేకపోతే, ఉత్తరోత్తరా మంత్రులతోనూ ముఖ్యమంత్రులతోనూ ఎలా నెగ్గుకు రాగలనని మనసుకు నచ్చజెప్పుకున్నాను.

బీడీఓ తర్వాత న్యాయమూర్తిగా అర్హతను సంపాదించడానికి మిగిలిన శిక్షణను పూర్తిచెయ్యాలి. దానిలో భాగంగా ఉర్దూలో డాక్యుమెంట్లు చదవాల్సి వచ్చేది. 'పైరవీకార్' అనేవాళ్లుంటారని నాకు తెలిసింది అప్పుడే. మొదట్లో నేను వాళ్ల గురించి తక్కువగా అనుకునేవాణ్ణి. కాని తర్వాత్తర్వాత నాకు అర్థమయిందేమంటే – ఎక్కువ ఫీజులిచ్చి న్యాయవాదులను పెట్టుకోలేని పేదసాదలకు పైరవీకారులు న్యాయవాదుల్లాగా పనిచేస్తారని, చిన్నాచితకా కేసుల్లో వాళ్లే అధికారులను కలిసి పనయ్యేలా చూస్తారని, దానిలో వాళ్ల జోక్యాన్ని తప్పు పట్టాల్సిన పనేం లేదని!

# వాళ్లు ప్రజలు, మనం ప్రజాసేవకులం!

హయత్‌నగర్ తర్వాత నేను చిత్తూరు జిల్లాకు జిల్లాపరిషత్ సెక్రెటరీగా శిక్షణకు వెళ్లాను. 'హమ్మయ్య' అనుకున్నాను. ఛైర్మన్ నాగిరెడ్డి పాతకాలపు మనిషి. ధనిక భూస్వామి. ఆయనకు సొంత బస్సులుండేవి, వ్యాపార దక్షతగలవారు.

ఆయన మదనపల్లిలో ఉండేవారు. ఆఫీసులో ఉన్నప్పుడు మద్యం ప్రభావం ఉండకూడదని, వారానికి ఒక్కరోజు మాత్రం చిత్తూరులో ఆఫీసుకు వచ్చేవారు. ఆ ఒక్కరోజే పనంతా చక్కబెట్టేసేవారాయన. ఆయనకు వచ్చిన రికమెండేషన్లు, అభ్యర్థనలూ అన్నీ ఉదయాన్నే నాకప్పచెప్పేవారు. స్టాండింగ్ కమిటీ మీటింగ్‌లన్నీ అయ్యాక, మధ్యాహ్నానికి వాటిలో ఏవి చెయ్యదగినవో ఏవి కావో నేను ఆయనకు వివరంగా చెప్పాలి. వీలున్నవన్నీ వెంటనే చేసేసేవారు. తన ప్రయోజనాలు, బాధ్యతలు, అనుయాయుల విషయంలో కచ్చితంగా ఉండేవారు. ఆయన తీరు వల్ల నాకు ఆఫీసులో పనిచెయ్యడం సులువైంది.

ఒకసారి సీనియర్ రాజకీయ నాయకుడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి వచ్చారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ సహా ఎంతోమంది రాజకీయ నాయకులు చుట్టూ ఉండగా 'ఎట్లుండారు మా నాయకులు?' అని అడిగారు నన్ను. 'అందరిముందూ అడిగితే నిజం ఎట్ల చెప్పేదన్నా?' అన్నాన్నేను. అందరూ నవ్వులేనవ్వులు.

కలెక్టర్ సీతాపతితో కలిసి ఆ ఏడాది (1967) ఎన్నికల నిర్వహణలో పాల్గొన్నాను. ఊళ్లలోని పోలింగ్ బూత్‌లను సందర్శించడం, ట్రెయినింగ్ క్లాసులు నిర్వహించడం, భద్రత, రవాణా, లెక్కింపు ఏర్పాట్లను పర్యవేక్షించడం వంటివి చేశాను. గ్రామస్థాయిలో రాజకీయాలను, ప్రజల ఆలోచనలను, అధికార యంత్రాంగాన్ని అర్థం చేసుకోవడానికి అదెంతో ఉపయోగపడింది.

ఆ సమయంలో మదనపల్లి డీఎస్పీగా చేస్తున్న వీరనారాయణరెడ్డి, చిత్తూరు ఎస్పీ ఆర్. ప్రభాకరరావులతో స్నేహం కుదిరింది. నాకు సర్వీసులో ఒకేడాది జూనియర్ అయిన యు.బి.రాఘవేంద్రరావుతోనూ స్నేహం పెంపొందింది అప్పుడే.

మేం కలిసి ఉండేవాళ్లం. అతనంత తెలివైనవాడు, నిజాయితీపరుడు, విశ్వసనీయమైన వ్యక్తిస్నేహితుడిగా దొరకడం అదృష్టం.

తర్వాత నన్ను అండర్‌స్టడీ సబ్‌కలెక్టరుగా తూర్పుగోదావరి జిల్లాకు వేశారు. పూర్తి బాధ్యతలు చేపట్టే ముందు, అప్పటివరకూ విధులు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ దగ్గర ఒక నెల పాటు ఉంటూ వాళ్ల పనిని పరిశీలించాల్సి ఉండేది. అలా నేను కె. ఆర్. వేణుగోపాల్‌తో పని చెయ్యడం మొదలెట్టాను. అప్పటికింకా ఆయన క్కూడా పెళ్లి కాలేదు కనుక సబ్‌కలెక్టర్ బంగళాలో నేను ఆయనతో పాటే ఉండేవాణ్ణి. సర్వీసులో ఆయన నాకు రెండేళ్లు సీనియర్. వామపక్ష భావజాలమున్న వ్యక్తి. పనివిషయంలో నిక్కచ్చిపరులు, నిజాయితీపరులు. ప్రతి విషయాన్నీ కూలంకషంగా పరిశీలించేవారు. ఏదడిగినా నాకు విడమరచి చెప్పేవారు.

ఆ తర్వాత కాలంలో ఎన్టీఆర్ ప్రకటించిన 'రెండు రూపాయలకే కిలోబియ్యం' వంటి పథకాలకు రూపకర్త వేణుగోపాల్‌గారే. అటుపైన ఆయన ప్రధానమంత్రి పీవీ నరసింహారావుగారికి సెక్రెటరీగా పనిచేసి రిటైరయ్యారు.

అప్పటికి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా అసదుల్లా సయీద్ వచ్చారు. పనిచేసిన అన్నిచోట్లా ఆయనకు మంచిపేరుండేది. నేను 'సర్, మీ విజయ రహస్యం ఏమిటి?' అని అడిగాను ఒకసారి.

దానికాయన చెప్పిన సమాధానం : 'ఏముంది? నేను ప్రజాసేవకుణ్ణి అన్న విషయాన్ని నేనెప్పుడూ మర్చిపోను. ఎమ్మెల్యేలు, ఎంపీలు నన్ను కలిసినప్పుడు – వాళ్లు ప్రజలు, నేను వాళ్లకు సేవకుణ్ణి అని గుర్తొస్తుంది. అందువల్ల వాళ్లేం అడిగినా చేసి పెడతాను. అంతే...' అన్నారు!!

అప్పుడు నాకు మా ఐఏఎస్ శిక్షణలో ఉపాధ్యాయుడు రామస్వామి చెప్పిన సూత్రం గుర్తొచ్చింది. 'మీరు ప్రజలకు సేవ చెయ్యండి. ప్రజలంటే ఐఏఎస్ కానివాళ్లు. అతి సామాన్యులు. అది ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి' అని. ఆ సూత్రమే నా సర్వీస్ అంతటికీ దిశానిర్దేశం చేసింది.

నేను సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ఒక్కరోజు ముందు 'మళ్లీ ఆదేశాలు వచ్చే వరకూ విధుల్లోకి చేరవద్దు...' అని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. సాధారణంగా ఒక అండర్‌స్టడీ సబ్‌కలెక్టర్ విషయంలో అలా జరగడం చాలా అరుదు. నాక్కొంచెం చిరాగ్గా అనిపించిందిగాని, చేసేదేం లేదు కదా. కొన్ని రోజుల తర్వాత – 1967 ఉగాది ముందు రోజనుకుంటాను, నన్ను ఒంగోలు

సబ్–కలెక్టరుగా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వెంటనే నేను కారు తీసుకుని బయల్దేరాను. ముందుగానే వార్త తెలిసిన తాసీల్దారు నన్ను రిసీవ్ చేసుకున్నారు.

గెస్ట్‌హౌస్ లోపలికి వెళ్లగానే అక్కడ ఫ్లాస్కు నిండా బోర్నవిటా, గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు, అగ్గిపెట్టె – వాటి బిల్లు సిద్ధంగా ఉన్నాయి! అప్పట్లో సెల్‌ఫోన్లు, ఫోన్లు.. ఏవీ ఇంతగా లేవు. అయినా ఆ తాసీల్దారు నా వ్యక్తిగత అలవాట్లన్నటినీ కొన్ని గంటల్లోనే ఎలా కనుక్కున్నాడో మరి?

అక్కడ పని ఎక్కువగానే ఉన్నా సరైన శిక్షణ ఉండటం వల్ల నాకది కష్టంగా అనిపించేది కాదు. కాలేజీలో నా సహాధ్యాయి కె. కృష్ణమూర్తి అక్కడ డీఎస్పీగా ఉండటం వల్ల నాకు మంచి కంపెనీ దొరికింది. ఒంగోలులో ఆఫీసర్స్ క్లబ్ ఉండేదిగాని, అక్కడ అయిన పరిచయాలేమీ లేవు. కమ్యూనిస్ట్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అయిన డాక్టర్ బీవీఎల్ నారాయణతో నాకు ఆ సమయంలో అయిన పరిచయం మాత్రం వ్యక్తిగత స్నేహంగా పరిణమించింది. ఆయన చాలా మటుకు ఉచితంగా లేదా అతి తక్కువ ఫీజుతో పేదలకు వైద్యం చేసేవారు.

ఒంగోల్లో పనిచెయ్యడం వల్ల కుల రాజకీయాల గురించి బాగా అర్థమయింది. అక్కడ కొన్ని ప్రాంతాల్లో రెడ్లు, కొన్ని ప్రాంతాల్లో కమ్మ, మరికొన్ని ప్రాంతాల్లో నేతపనివారు బలవంతులు.

నేను అక్కడ పనిచేస్తున్నప్పుడు ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పర్యటనకు వచ్చారు. ఆయన రావడానికి ముందు మా తాసీల్దారు నాకో సలహానిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటించే అన్ని గ్రామాలూ నేను ముందే తిరిగి, అక్కడ ప్రజలు ఇవ్వదలచుకున్న వినతిపత్రాలు, ఫిర్యాదుల గురించి తెలుసుకుని సిద్ధంగా ఉండటం మంచిదని.

నేనాయన సలహాను పాటించాను. ముఖ్యమంత్రి వచ్చినప్పుడు నాకు ప్రతిదీ తెలియడం ఆయనకెంతో నచ్చింది. ముఖ్యమైన వ్యక్తుల విషయంలో అధికారులు ఇలా పనిచెయ్యడం వల్ల, తగిన సమాచారంతో సిద్ధంగా ఉండటం వల్ల వాళ్ల సమయం ఎంతో ఆదా అవుతుంది, వాళ్ల పర్యటన అర్థవంతమవుతుందని కూడా నేనప్పుడు నేర్చుకున్నాను. ప్రతి సమస్యకూ పరిష్కారం లభించకపోవచ్చు కాని, అధికారులు తమ గురించి పట్టించుకుంటున్నారనే సంకేతం గ్రామస్థులకు అందుతుంది.

తాసీల్దార్లు ఎంత ముందుచూపుతో ఉంటారనేది నాకు మరొకసారి కూడా అర్థమయింది.

నేను అక్కడ తాసీల్దార్లతో మొదటిసారిగా సమావేశమయ్యాను. రెవెన్యూ విషయంలో ఎరియర్లు, కలెక్షన్, డిమాండ్ వంటి వాటిని సమీక్షిస్తూ... అన్నీ సరిగ్గా సమయం ప్రకారం ఉండాలన్నాను.

అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు, సరేనంటూ తలాడించారు. చివరికి ఒక పెద్దాయన లేచి నిలబడ్డాడు.

'అయ్యా, నేను తాసీల్దారుగా ఒక నెలలో రిటైరవబోతున్నాను. అందువల్ల నేను మీకు నిజం చెప్పక తప్పదు. రెవెన్యూ ఎరియర్లు ఉంటాయి. కరెంట్ డిమాండ్ ఉంటుంది. కరెంట్ కలెక్షన్ ఉంటుంది. మళ్లీ ఎరియర్లుంటాయి. ఇదిలా నడుస్తూనే ఉంటుంది. సబ్ కలెక్టర్లు వస్తుంటారు, వెళుతుంటారు. వాళ్లు ఇవన్నీ క్లియర్ చెయ్యాలనుకుంటారు కానీ ఇదింతే.. ఈ వలయం ఇలా నడుస్తూనే ఉంటుంది.. దాన్ని మీకు చెప్పాలనుకున్నా...' అన్నాడు!

అనుభవం ఇచ్చిన జ్ఞానమంటే అదే. ఎప్పట్నుంచో ఉన్న సమస్యలను ఒక్కసారిగా మార్చెయ్యడం కుదరదని, మరీ అనుకుంటే కాస్త త్వరగా పనులయ్యేలా చూడగలమంతేనన్న సత్యం నాకప్పుడు అర్థమయింది!

అనుభవ సంపన్నులైన తాసీల్దార్ల తెలివి యువ అధికారులకు చాలా సందర్భాల్లో అక్కరకొస్తుంటుంది.

మరొకసారి రెవెన్యూ బోర్డ్ మెంబర్ ఒకాయన ఒంగోలు వచ్చారు. విచిత్రం ఏమంటే – ఆయన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌కి ఇన్‌ఛార్జి. అంటే, తెలంగాణ ప్రాంతంలో మద్యం అమ్మకాలను పెంచడం ద్వారా ఆదాయం పెరిగేలా చూడాల్సింది ఆయనే. మరోవైపు, ఆంధ్ర ప్రాంతంలో మద్యనిషేధం సరిగ్గా అమలవుతోందా లేదా నిఘా పెట్టాల్సిందీ ఆయనే!

'ఆయన రాత్రి కొద్దిగా మందు పుచ్చుకుంటారని తెలిసింది. తమ సెలవయితే ఆ ఏర్పాట్లు చేస్తాను' అన్నారు మా తాసీల్దారు.

నేను మాత్రం 'ఠాక్, వీల్లేదు. నిషేధం అమల్లో ఉన్న చోట అలాంటివి కుదరవు...' అంటూ కయ్యిమన్నాను. రాత్రయ్యేసరికి ఊళ్లోని ఓ వ్యాపారవేత్త, న్యాయవాది 'సరుకు'తో పాటు వచ్చి బోర్డు మెంబర్‌కు ఆతిథ్యమిచ్చారు. సబ్–కలెక్టర్‌ను ఆ హంగామాకు దూరంగా పెట్టారు! ప్రపంచం తీరు ఇలా ఉంటుందన్న మాట!!

నేను ఒంగోలు సబ్–కలెక్టరుగా ఉన్న రోజుల్లో ఆ ప్రాంతంలో తీవ్రంగా కరవు వచ్చింది. మనుషులకు తాగునీరు, తిండి లేక కటకటపడేవాళ్లు. ఉపాధి పనుల్లేవు. పశువులకు గడ్డి లేదు, నీళ్లు లేవు. దేనికీ నిధులొచ్చేవి కాదు. గ్రామాల్లో తిరుగుతూ మనుషులకు మంచినీరు, ఉపాధినిచ్చే పనులు, పశువులకు గడ్డి దొరికేలా చూడటం వంటి పనులను పర్యవేక్షించేవాణ్ణి.

కరువు నేపథ్యంలో ధాన్యం సేకరణ అనేది ప్రాముఖ్యం సంతరించుకుంది. బయట అమ్మితే మార్కెట్ రేటొస్తుంది, కష్టపడి పనిచేసి పండించుకున్న పంటను ప్రభుత్వానికి తక్కువ రేటుకు ఇవ్వడం దేనికి అని రైతుల అభిప్రాయం. కరువు సమయంలో స్థానిక రైతులు సహకరించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

కారంచేడు గ్రామానికి రాజకీయ, వ్యాపారపరమైన పలుకుబడి చాలానే ఉండేది. ధాన్యం కొనుగోలుకు అక్కడి పెద్ద రైతులు తాసీల్దార్లతో సహకరించకపోగా, వివాదాస్పదంగా వ్యవహరించారు.

ఒకనాటి ఉదయం ఆ గ్రామంలో సినీ నిర్మాత దగ్గుబాటి రామానాయుడి ఇంట్లో ఆయన సోదరి వివాహం జరిగింది. దానికి హాజరయి ఆశీర్వదించి వచ్చేశాను. దాంతో ప్రభుత్వ అధికారులు తమకు వ్యతిరేకమేం కాదన్న భరోసా వారిలో కలిగింది. మధ్యాహ్నం తర్వాత ఊళ్లోకి పోలీసులను రప్పించాను కాని, నా అనుమతి లేనిదే వాళ్లు వారి వాహనాల్లోంచి దిగకూడదని షరతు పెట్టాను డీఎస్పీ వీరనారాయణరెడ్డికి. అతను నా స్నేహితుడే కనుక అర్థం చేసుకున్నాడు. రైతులు పోలీసు వాహనాలను చూశారు, అభ్యంతరాలేమీ పెట్టకుండా మాకు సహకరించారు. ధాన్యం సేకరణ పూర్తవుతూనే పోలీసు బలగాలను వెనక్కు పంపేశాను.

'ఇంతకూ పోలీసులను ఎందుకు తీసుకెళ్లినట్టు, ఎందుకు పంపేసినట్టు?' అని ఆశ్చర్యపోతూనే విసుక్కున్నాడు డీఎస్పీ.

నయానోభయానో పని జరగడమే ముఖ్యం. దానికోసం బల ప్రయోగం చెయ్యనవసరం లేదు, ప్రదర్శన చేస్తే చాలని నా ఉద్దేశం. అదీగాక ఇటు రైతుల అభిప్రాయమూ సరైనదే, సామాన్యుణ్ణి ఆదుకోవాలనే ప్రభుత్వ ఆశయమూ మంచిదే. కర్ర విరగకుండా, పాము చావకుండా – కారంచేడు పెద్దమనుషులతో నేను బాగా డీల్ చేశానని జిల్లా అధికారులు సంతోషించారు.

# పెరిగిన ఆత్మవిశ్వాసం

**నే**ను ఒంగోల్లో ఉన్నప్పుడు మా తమ్ముడు మధుసూదన్ లా చదువుతుండేవాడు. రెండో తమ్ముడు రమేశ్ కొండారెడ్డి కాలేజీ మెట్లెక్కాడు. దాంతో మా అమ్మ ఎక్కువగా హైదరాబాద్‌లో వాళ్లతో పాటే ఉండేది, అప్పుడప్పుడు నా దగ్గరకొచ్చి ఉండేది.

అప్పటికి నేను ఉద్యోగంలో స్థిరపడ్డాను కనుక, మా అమ్మతో పాటు దగ్గర బంధువులు కూడా నన్ను పెళ్లికి త్వరపెట్టసాగారు. ఐఏఎస్ చదివిన కుర్రాడని డబ్బు, అధికారమూ ఉన్న పెద్ద కుటుంబాల నుంచి అమ్మాయినిస్తామంటూ వచ్చేవాళ్లు. కాని నాకు అదంతా నచ్చేది కాదు. సమాజంలో నాదైన ఒక గుర్తింపు ఉండాలి, నా పని ద్వారా దాన్ని సంపాదించుకోవాలిగాని, ఎవరో ఒక గొప్పింటి వాళ్ల అల్లుడని పేరు తెచ్చుకోవడం ఏమిటి? అనిపిస్తూ ఉండేది.

నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరంలో ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో డిప్లమా కోర్సు చెయ్యడానికి స్నేహితుడితో పాటు నేనూ ఒక అప్లికేషన్ పెట్టాను. రెండుమూడు నెలల తర్వాత ఇంటర్వ్యూకు ఢిల్లీ రమ్మని పిలుపొచ్చింది.

నేను మా అమ్మతోపాటు హైదరాబాద్‌కు కార్లో బయల్దేరాను. కొద్ది దూరం వెళ్లేసరికి మా కారు ప్రమాదానికి గురై ఏకంగా బోల్తా కొట్టింది! మాకు పెద్ద గాయాలు కాలేదుగాని, మా అమ్మ పక్కటెముకలు విరిగిపోయాయి. ఎలాగోలా మేం మళ్లీ వెనక్కి ఒంగోలు వచ్చేశాం. 'బాగయ్యేదాకా నేనిక్కడే ఉంటాను కాని, నువ్వు వెళ్లిరా...' అంటూ నన్ను హైదరాబాద్ పంపింది మా అమ్మ. ఢిల్లీ ఇంటర్వ్యూలో నేను సెలెక్టయ్యాను. జీతం లేని సెలవు (లాస్ ఆఫ్ పే) ఇచ్చింది మన ప్రభుత్వం.

### క్విడ్ ప్రో కో?

నెదర్లాండ్స్ వెళ్లేముందు కొంత డబ్బు అవసరమని నేను ఒంగోలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దగ్గరకెళ్లాను. విషయమంతా చెప్పి ఐదు వేల రూపాయలు

అప్పుగా ఇప్పించమని అడిగాను. ఆయన నా అభ్యర్థనను మన్నించలేదు. అక్కడితో అది ముగిసింది.

అప్పుడు సబ్-కలెక్టర్ బంగళాలో బ్యాడ్మింటన్ కోర్టు ఉండేది. అక్కడ ఆడుకుంటామని కొందరు యువకులు అడిగారు. నేను సరేనన్నాను. వీలు కుదిరినప్పుడు నేను కూడా వాళ్లతో కలిసి ఆడుకుంటూ ఉండేవాణ్ణి. కొన్ని రోజులయ్యాక నాతో ఆడుతున్నవాళ్లలో ఇద్దరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నారని తెలిసింది. ఏదో పిచ్చాపాటీగా మాట్లాడుతూ నేను నెదర్లాండ్స్ వెళుతున్న సంగతి, అలాగే నాకు లోన్ రాని సంగతీ చెప్పాను. వాళ్లు కొద్దిగా ఆశ్చర్యపోయారు.

మర్నాడు ఉదయానికల్లా వాళ్లు లోన్ ఇవ్వడానికి అవసరమయ్యే పేపర్లు పట్టుకొని వచ్చారు! ఇప్పటికీ నాకు అర్థం కానిదేమంటే – నాకు లోన్ ఎలా వచ్చింది? నా మంచితనం వల్లనా? వాళ్లను ఆడుకోనిచ్చాను కనుక క్విడ్ ప్రో కోగానా? నా అధికార హోదాను అనుసరించా? ఏమో!!

ఢిల్లీ నుంచి నెదర్లాండ్స్‌కు విమానం. అప్పటికి కేంద్ర మంత్రిగా పనిచేస్తున్న కె.వి. రఘునాథరెడ్డి ఢిల్లీలో ఎయిర్‌పోర్టులో నన్ను దింపుతానన్నారు. నేను మొహమాటపడి వద్దన్నాను. ఆయన ఏదో డిన్నరుందని వెళ్లిపోయారు. నేనూ, మా స్నేహితుడు నరేంద్ర కలిసి ఎయిర్‌పోర్టుకు బయల్దేరాం, దారిలో మా కారు చెడిపోయింది. ఎంత టెన్షన్ పడ్డామో! ఎలాగోలా చివరి నిమిషంలో చేరుకుంటే నాకు సెండాఫ్ ఇవ్వడానికి అక్కడ రఘునాథరెడ్డి వేచిచూస్తున్నారు! నాపట్ల ఆయన ఆప్యాయతను అలా వెల్లడించారు.

## తొలిసారి విదేశానికి

1968 జనవరి ఒకటిన నేను నెదర్లాండ్స్‌లో పాదం మోపాను. అది చాలా అందమైన దేశం. సైక్లింగ్ మార్గాలు, టులిప్ పూల వనాలు, గాలిమరలతో ఎంతో సుందరంగా ఉండే ప్రదేశమది. ఈ దేశానికి ఒకవైపు జర్మనీ, మరోవైపు బెల్జియమ్, మూడోవైపు సముద్రం సరిహద్దులు. ఆ దేశ రాజధాని నగరం ద హేగ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ స్టడీస్ (ఐఎస్ఎస్ – ద హేగ్)లో మా చదువు మొదలైంది.

ఒక రాజప్రాసాదం మాకు హాస్టల్‌గా ఇచ్చారు. అమ్మాయిలు, అబ్బాయిలు అందరికీ అక్కడే వసతి. అందరికీ డైనింగ్ హాల్ ఒక్కటే. దేశదేశాల నుండి వచ్చిన వాళ్లంతా కలిసేది అక్కడే. అందువల్ల భోజనాల వేళప్పుడు అందరూ ఇతర దేశాల గురించి తెలుసుకునే వీలు కలిగేది.

ఒక దేశంలో బ్రేక్ ఫాస్ట్ ఎక్కువగా తింటారు, మరో దేశంలో మధ్యాహ్న భోజనం ఎక్కువగా, మిగిలినవి తక్కువగా తింటారు... ఇవన్నీ చెబుతూ 'మరి మీ దేశం సంగతి ఏమిటి?' అని అడిగారు నన్ను. వాళ్లలాగా మన దేశమంతటా ఆహారపుటలవాట్లు ఒకేలాగా ఉండవు. కులమతాలు, జాతి, ప్రదేశాలను అనుసరించి ఎవరి అలవాట్లు వారివి. అదంతా వారికి ఒక్కముక్కలో ఎలా చెప్పగలను?

అందుకే 'మాకు ఆహార సమస్య ఎక్కువ. అందుకని ఎప్పుడు, ఎక్కడ, ఎంత దొరికితే అప్పుడు, అక్కడ, అంతంత తింటాం..' అని జోకేశాను. తర్వాత వివరంగా చెప్పానులెండి.

మరొకరోజు భోజనాల సమయంలో 'అమెరికాకూ ఇండియాకూ చాలా పోలికలున్నాయి తెలుసా?' అంటే అందరూ నోరెళ్లబెట్టారు.

'ఎలాగంటే రెండు చోట్లా ఉన్నది ప్రజాస్వామ్యమే. అలాగే రెండు చోట్లా తిండి సమస్యలే... వాళ్లకు తిండి ఎక్కువై ఇబ్బంది, మాకు తిండి తక్కువై ఇబ్బంది...' అని చెప్పాను.

అప్పట్లో మన దేశం నుండి విదేశాలకు వెళ్లేవాళ్లు ఎక్కువగా బ్రాహ్మణులు, అగ్రవర్ణాలవారు. అందువల్ల భారతీయులంతా పూర్తి శాకాహారులనే అభిప్రాయం విదేశీయుల్లో ఉండేది.

ఇక్కడ చలి ప్రదేశం ముస్సోరీని చూసినప్పటికీ, నెదర్లాండ్స్‌లో మంచు కురవడం చూసినప్పుడు నాకు ఆశ్చర్యంగా అనిపించింది. మెట్రో రైలును, డబ్బులు వేస్తే వస్తువులొచ్చే స్లాటింగ్ మెషీన్ వంటివాటిని నేను తొలిగా చూసిందక్కడే.

ఒకసారి ఒక మిత్రుడు 'మీ దేశంలో పెద్దలు కుదిర్చిన పెళ్లి ఎలా చేసుకుంటారు? అసలది సాధ్యమేనా?' అని అడిగాడు. వాళ్లకది పట్టరాని ఆశ్చర్యకరమైన సంగతి.

'యూ డోంట్ చూజ్ యువర్ వైఫ్ బట్ హౌ కెన్ యూ లవ్ హర్..' అన్నాడు ఇంగ్లీష్‌లో.

'యూ డోంట్ చూజ్ యువర్ మదర్. బట్ స్టిల్ ఆర్ యూ నాట్ లవింగ్ హర్?' అన్నాన్నేను.

అతను కొంతమేరకు అర్థం చేసుకున్నాడు.

ఇక అక్కడ నేను చేసింది ఎకనామిక్ ప్లానింగ్‌లో ఆర్నెల్ల డిప్లమా కోర్సు. దానిలో భాగంగా నేను ఇన్‌పుట్ / అవుట్‌పుట్ అనాలిసిస్, మాక్రో మోడల్ బిల్డింగ్,

కాస్ట్ బెనిఫిట్ అనాలిసిస్ వంటివి నేర్చుకున్నాను. అలాగే మొట్టమొదటిసారిగా మేథమెటికల్ ఎకనామిక్స్ గురించి తెలుసుకున్నాను!

ఈ కోర్సులో భాగంగా శ్రీలంక ఆర్థికవ్యవస్థకు మాక్రో మోడల్ గురించి అధ్యయనం చేసిన బృందంలో నేనూ ఒకణ్ణయ్యా. ఆ నివేదికను ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో కొందరు ప్రముఖుల ముందు ప్రెజెంట్ చేశాం.

నెదర్లాండ్స్‌లో మాకు క్లాసులు చెప్పినవారిలో జాన్ టిన్బర్‌గాన్‌ను నేను ఎప్పటికీ మర్చిపోలేను. 'ఏ ఆర్థికవ్యవస్థకయినా, మీరు ఒకసారి మోడల్ తయారు చేసిన తర్వాత, అది సరిగా నడుస్తుందా లేదా అని మీ కామన్‌సెన్స్‌తో ఆలోచించండి. నడవదనిపిస్తే, మరొకసారి తయారుచెయ్యండి తప్ప దాన్నే గుడ్డిగా అనుసరించొద్దు...' అని ఆయన చెప్పిన మాటలు నాకు వేదవాక్యాలయ్యాయి.

మా కోర్సు పూర్తయిన కొద్దికాలానికే అంటే 1968లో ఆర్థికశాస్త్రంలో తొలిసారి నోబెల్ బహుమతి ప్రకటించారు. దాన్ని అందుకున్నది మాకు పాఠాలు చెప్పిన జాన్ టిన్బర్‌గాన్ గారే. ఆ వార్త తెలిసినప్పుడు 'నేను నోబెల్ గ్రహీత విద్యార్థిని' అని సంతోషంతో ఉప్పొంగిపోయాను.

ఆ క్లాసుల్లో ఆఫ్రికా, లాటిన్ అమెరికా, తైవాన్, ఐర్లండ్ వంటి వివిధ దేశాల నుంచి వచ్చిన సహాధ్యాయులు ఉండటం నాకు చాలా మంచి అనుభవాన్నిచ్చింది. వివిధ సంస్కృతుల గురించి తెలిసింది. ముఖ్యంగా చెప్పుకోవలసింది ఏమంటే – ఆడవారిని సాటి మనుషులుగా చూసే దృష్టి అబ్బింది. మన దేశ సంస్కృతిలో ఆడపిల్లలు, మగపిల్లల మధ్య దూరం ఉంచడం వల్ల ఎవరికి వాళ్లు, ఎదుటివాళ్లను చూసే తీరు వేరే ఉంటుంది. విదేశీ విద్య వల్ల అలాంటి భావనలు నాలో పల్చబడ్డాయి.

నెదర్లాండ్స్‌లో చదువు నా జీవిత ప్రయాణంలో ఒక పెద్ద మైలురాయి అని చెప్పుకోవాలి. ఎందుకంటే నా జ్ఞానాన్ని విస్తృతపరచుకోవడానికి, నాకెంతో ఇష్టమైన ఆర్థిక శాస్త్రంలో అధ్యయనానికి అది వీలు కల్పించింది.

సెలవుల్లో స్నేహితులతో పాటు నేను స్కాండినేవియన్ దేశాలు, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, గ్రీస్ వంటివి చూశాను. కొద్ది వారాల పాటు రష్యన్ నేర్చుకునే ప్రయత్నం చేశాను. నెదర్లాండ్స్‌లో నాకు ఆంధ్రకు చెందిన ఫారిన్ సర్వీస్ అధికారి డి.ఆర్. రాజు, ప్రొఫెసర్ మీరాఖాన్ స్నేహితులయ్యారు.

కోర్సు పూర్తయ్యేసరికి నాకు ఐక్యరాజ్యసమితి ప్రాజెక్టులో మంచి ఉద్యోగ అవకాశం వచ్చింది. కాని నేను నా జ్ఞానాన్ని స్వదేశానికే ఉపయోగించాలన్న పట్టుదల వల్ల దాన్ని వదులుకున్నాను.

మొత్తమ్మీద నెదర్లాండ్స్‌లో ఆర్నెల్ల చదువు నా జీవితాన్ని మార్చేసిందని మాత్రం చెప్పగలను. నా వ్యక్తిత్వం, దృక్పథం, కెరీర్... ఒకటని కాదు, ప్రతి విషయంలో నేనెంతో మెరుగయ్యాను.

ఆ మార్పుకు దోహదం చేసిన నెదర్లాండ్స్ ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞుడినై ఉంటాను.

## శంకరన్‌తో పనిచేశా

1968 జులైలో నెదర్లాండ్స్ నుండి తిరిగి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో పోస్టింగ్ వస్తే, నేను నా చదువును కొనసాగించవచ్చని ఆశించాను. అదే ఉద్దేశంతో నేను ఉస్మానియాలో పాత పరిచయాలన్నిటినీ తిరగదోడుకున్నాను.

అయితే నన్ను నెల్లూరు జిల్లాలోని గూడూరులో సబ్ కలెక్టరుగా వేశారు. గూడూరు సబ్ డివిజన్ ఒంగోలంత సంక్లిష్టమైనది కాదు. అక్కడ నా కలెక్టర్ ఎస్.ఆర్. శంకరన్. సివిల్ సర్వీస్ అధికారుల్లో ఆయనకు గొప్ప పేరుంది. తన జీవితాన్నంతా పేద, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ధార పోసిన అధికారిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. ఆయనతో కలిసి పనిచెయ్యడం ద్వారా నేనెన్నో విషయాలు నేర్చుకున్నాను.

ముఖ్యంగా ఎస్సీల కోసం ఆయన ఒక్కరే ఒక సైన్యంలాగా పనిచేసేవారు. తాను నమ్మిన ఆశయం కోసం ఆయన పెళ్లి కూడా చేసుకోకుండా, ఒక ఋషిలాగా చాలా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు.

'పెద్ద కులాలవారితోను, డబ్బున్నవారితోనూ కలిసి తిరిగినా, కనిపించినా, పేదల్లో మనపట్ల నమ్మకం ఉండదు' అంటూ అక్షరాలా దాన్ని పాటించేవారు. చాలాసార్లు, పేదలకు అధికారులను కలిసే ధైర్యం ఉండదని, అధికార వర్గాలే దాన్ని కలిగించాలని, వెనుకబడినవారి కష్టసుఖాలను తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలని – నేను శంకరన్ దగ్గరే నేర్చుకున్నాను.

అయితే, రాజకీయ నాయకుల పట్ల ఆయనకు ప్రత్యేక ద్వేషం ఉండేది. వాళ్లు ఏది చెప్పినా 'స్వలాభం ఉండక మానదు' అనే ఆలోచనతో దాన్ని చేసేవారు కాదాయన.

ఒకసారి ఒక ఊళ్లో వాటర్ ట్యాంకు కట్టించాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ కోరారు. శంకరన్ అక్కడికెళ్లి దాన్ని చూసి, కేవలం రిపేరు చేస్తే చాలని సిఫారసు చేశారు. నిజానికి అక్కడ వాటర్ ట్యాంకు అత్యవసరం. రిపేరు అనేది చాలదు. నేను ఊరుకోలేదు. 'సర్, మనమిద్దరం అక్కడికెళ్లాం. ట్యాంక్ దగ్గర ఒక అందమైన అమ్మాయి ఉండటాన్ని చూశాం. మీరు ఆ అమ్మాయిని పదేపదే చూడటం కోసమే రిపేరు వర్కు పెడుతున్నారని నేనెందుకు అనుకోకూడదు...?' అని ప్రశ్నించాను కొంటెగా.

అంతటితో ఆగలేదు. 'ఆ ట్యాంకు కట్టడంలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌కేదో స్వలాభం ఉందని మీరనుకున్నట్టే, మీకేదో స్వలాభం ఉందని ఇతరులు అనుకోవచ్చు. కాని అన్ని సందర్భాల్లోనూ రాజకీయ నాయకులు స్వార్థం కోసమే పని చేస్తారనుకోవడం తప్పేమో ఆలోచించండి...' అంటూ వివరంగా చెప్పాను.

ఆయనకు పిచ్చి కోపం వచ్చింది. అయినా ఆగి, ఆలోచించారు.

## రాజకీయాలు వద్దని చెప్పండి

ఆ రోజుల్లో కలెక్టర్లకు ప్రభుత్వం నుండి అతి ముఖ్యమైన, రహస్యమైన సందేశాలు వైర్‌లెస్‌లో వచ్చేవి. వాటిని మామూలుగా చదివితే అర్థం కాదు. దాన్ని డీకోడ్ చెయ్యడానికి ఒక కీ కూడా వస్తుంది. దాన్ని గుర్తుపెట్టుకుని తర్వాత చించెయ్యాలి. ఆ కీని అనుసరించి డీకోడ్ చేసుకుని చదివితే అర్థమవుతుంది.

ఒకసారి అలాంటి సందేశం వచ్చినప్పుడు నన్ను పిలిచారు శంకరన్.

డీకోడ్ చేస్తే 'మీ జిల్లాలో వాకాడుకు చెందిన నేదురుమల్లి బాలకృష్ణారెడ్డిగారికి పద్మశ్రీ ఇవ్వాలనుకుంటున్నాం, ఆయన అంగీకారం తీసుకుని తెలియజెయ్యండి' అని ఉంది.

పేదవాళ్లకు మరీ ముఖ్యంగా హరిజనులకు చదువు చెప్పడం కోసం పాటుపడిన బాలకృష్ణారెడ్డిగారికి మంచి పేరుంది. తాను ఎన్నుకున్న మార్గంలో సమాజం కోసం అహర్నిశలూ శ్రమించిన వ్యక్తిగా ఆయన పట్ల అందరికీ గౌరవం ఉండేది. నేను గూడూరు సబ్ కలెక్టరుగా చేసేనాటికి, బాలకృష్ణారెడ్డి కుమారుడు జనార్దనరెడ్డి బీఈడీ చేసి వాళ్ల పాఠశాల కరెస్పాండెంట్‌గా పనిచేసేవారు.

ఒకరోజు బాలకృష్ణారెడ్డి నా దగ్గరకొచ్చారు. 'మా వాడు రాజకీయాల్లో చేరుతానంటున్నాడు. రాజకీయబలం ఉంటేనే విద్యాసంస్థలు నడపగలం, ఒక స్కూలు నడపాలన్నా కూడా ప్రభుత్వంలో పరపతి ఉండాలని వాదిస్తున్నాడు. నా అభిప్రాయం దానికి విరుద్ధం. సేవ చెయ్యడానికి, మంచి విద్యాసంస్థ నడపడానికి రాజకీయాలెందుకండీ. అవన్నీ పెట్టుకోవద్దని మీరు మా వాడికి చెప్పండి కాస్త...' అన్నారు.

ఆయనేం చిన్నపిల్లాడు కాదు. నాకు తెలిసిన సబ్జెక్టూ కాదు. నేనేం చెబుతాను లెమ్మని నవ్వేసి వదిలేశాను.

తర్వాత నేదురుమల్లి జనార్దనరెడ్డి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. అప్పుడు గెలవలేదుగాని, అటుపైన అంచెలంచెలుగా ఎదిగి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు!

**నొప్పి ఇప్పటికీ..**

*నేను ఒంగోల్లో ఉన్నప్పుడు మా అమ్మ పంటి నొప్పితో బాధ పడింది. నేను అక్కడే ఒక డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాను. అక్కడ సరైన వైద్యం అందక, మా అమ్మ మరీ ఎక్కువ బాధ పడింది. ఆమె నొప్పి అని చెప్పినప్పుడే మద్రాసో, హైదరాబాదో తీసుకెళ్లి, మంచి వైద్యం ఇప్పించనందుకు తర్వాత నేను చాలా బాధపడ్డాను. ఆ నొప్పి ఇప్పటికీ నన్ను మనసులో గుచ్చుతుంటుంది.*

# పెళ్లి 'గీత' కుదిరింది

నెదర్లాండ్స్ నుంచి తిరిగి వచ్చాక మా అమ్మ నా పెళ్లి ప్రయత్నాలు తీవ్రం చేసింది.

'నీకు తెలిసిన మంచి అమ్మాయి ఉంటే చూడు...' అన్నానొకసారి నా స్నేహితుడు సీతారామ్‌రెడ్డితో. ఆయన తనకు చెల్లెలి వరసయ్యే అమ్మాయి ఉందని చెప్పాడు.

అమ్మాయి వాళ్లది నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం అనే గ్రామం. అక్కడ పొన్నలూరి రామచంద్రారెడ్డిగారికి భూములుండేవి. వ్యవసాయం చేయించేవారు. ఆయన సోదరులు 'పొన్నలూరి బ్రదర్స్' పేరుతో 'భాగ్యరేఖ' లాంటి సినిమాలు నిర్మించారుగాని, తర్వాత్తర్వాత సినిమా రంగం నుండి వైదొలగి వ్యవసాయానికే పరిమితమయ్యారు. మొత్తానికి పొన్నలూరి వారి కుటుంబానికి నెల్లూరు జిల్లాలోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా మంచి పేరుప్రతిష్ఠలున్నాయి. రామచంద్రారెడ్డిగారి భార్య పద్మజమ్మ అందరి బాగోగులూ చూసుకునే ఇల్లాలు. వాళ్లమ్మాయి గీత. అప్పటికి గీత తమ్ముడు అమర్‌నాథ్‌రెడ్డి ఎంబీబీఎస్ చదువుతూ ఉండేవాడు.

నేనూ సీతారామ్‌రెడ్డి ఊరికే వాళ్లింటికి వెళ్లాం. పెళ్లిచూపులు, హడావుడి ఏమీ లేదు. ఆ పిల్ల గీతకు పెళ్లి చూపులని కూడా తెలియదు. 'ఏమన్నా బాగున్నావా..?' అంటూ మా సీతారామ్‌ను పలకరిస్తూ మామూలుగా వచ్చింది. నేను చూశాను. నచ్చింది. అప్పటికి ఆమె బిఏ పూర్తి చేసింది.

వాళ్లింటి నుండి వచ్చేసిన తర్వాత సీతారామ్‌రెడ్డి 'ఏం చెప్పమంటావు?' అని అడిగాడు.

'ఒకసారి చూసిన తర్వాత వద్దనేదే లేదు.. ముహూర్తం పెట్టించమని చెప్పు' అన్నాన్నేను.

గీత ఇంకా పైచదువుల కోసమని అప్పుడే పెళ్లి వద్దనుకున్నదట, తర్వాత ఏమనుకున్నదో మరి పెళ్లికి ఒప్పుకున్నది. 'పెళ్లి తర్వాత చదువుకోవడానికి నాకేమీ

అభ్యంతరం లేదు' అని నేను చెప్పానుకాని, పెళ్లి తర్వాత ఆమె చదువు సంగతేమీ ఎత్తలేదు.

పెళ్లి సందర్భంగా కట్నకానుకల ప్రసక్తే రానివ్వలేదు నేను. పెళ్లి కుదిరిన తర్వాత 'నీక్కాబోయే కోడలు ఎట్లుంటాదని అందరూ అడుగుతున్నారు. నేనొకసారి వెళ్లి చూసొస్తాను...' అన్నది మా అమ్మ. నెల్లూరులో నివాసముంటున్న రామచంద్రారెడ్డిగారి కుటుంబాన్ని, గీతనూ చూసొచ్చిన తర్వాత మా అమ్మకు తృప్తి కలిగింది.

నేను నెదర్లాండ్స్ వెళ్లకముందు మా కారమ్మేశాను. వచ్చిన తర్వాత నేను కారు కొందామనుకునే లోపలే పెళ్లి కుదిరింది. పెళ్లికి ముందు మా కాబోయే మామగారు నాకు కారు కొనిస్తామన్నారు. అప్పట్లో కారు కావాలంటే డబ్బు కట్టి ఏళ్లకేళ్లు వేచి చూడాలి. ప్రభుత్వ అధికారులకు మాత్రం విడిగా కోటా ఉండేది, ప్రభుత్వం వాళ్లకు కాస్త త్వరగానే అలాట్ చేయచ్చు.

దాంతో నేను ఆగమేఘాల మీద హైదరాబాద్ వెళ్లి హోమ్ సెక్రెటరీ ఎ. కృష్ణస్వామిగారిని కలుసుకున్నా. 'సర్, నాకు అర్జెంటుగా కారు అలాట్‌మెంటు కావాలి..' అన్నా.

'అయితే మధ్యాహ్నం రా...' అన్నారు. అన్నట్టుగానే మధ్యాహ్నానికల్లా అలాట్ చేసేశారు. అది తీసుకోవడానికి వెళ్లినప్పుడు 'ఎప్పుడూ ఏమీ అడగవు కదా, ఇప్పుడు ఎందుకింత అర్జెంటుగా?' అడిగారాయన.

'నాకు పెళ్లి కుదిరింది. పెళ్లి కానుకగా కారు కొనిస్తామని మా మామగారు బెదిరిస్తున్నారు. వాళ్ల దగ్గర తీసుకోవడమెందుకు? నేనే కొనుక్కుంటే మంచిది కదాని...' అని చెప్పాను.

అలాగే మధ్యాహ్నం ఫైనాన్స్ డిప్యుటీ సెక్రెటరీ సూర్యనారాయణగారి దగ్గరకెళ్లి 'అర్జెంటుగా కారు లోను కావాలి...' అని అడిగి మర్నాటికల్లా శాంక్షన్ చేయించుకున్నా. ఆయన కూడా శాంక్షన్ చేశాక, 'ఏవిటోయ్ విశేషం' అని అడిగితే పెళ్లి కథంతా చెప్పాను. టీఆర్ ప్రసాద్ అనే స్నేహితుడు ఆ కారును డెలివరీ తీసుకున్నాడు, పెళ్లికి ఒకరోజు ముందు దాన్ని తీసుకుని మా తమ్ముడు గూడూరొచ్చాడు!

పెళ్లికి నేను ఒక్కరోజు మాత్రమే సెలవు పెట్టాను. మా మామయ్యలు వచ్చాక, పెళ్లి రేపనగా 'పెళ్లి బట్టలేవిరా?' అంటే అప్పుడు వెళ్లి రాత్రికి రాత్రి బట్టలు కుట్టించుకున్నా. 1969 ఏప్రిల్ 24 తేదీన మా పెళ్లి నెల్లూరులో జరిగింది. పెళ్లికి

కలెక్టర్ శంకరన్‌గారు రానేలేదు! మూడోరోజున కొత్త పెళ్లికూతురిని తీసుకుని గూడూరులోని బంగళాకు వచ్చాను. మా పీఏకు ముందుగా ఫోన్ చేస్తే మాతో పాటు వచ్చిన పెళ్లివారికి భోజనాలు పెట్టడానికి ఏర్పాట్లన్నీ అతను చేశాడు. అంతే.

గీత తరపు దగ్గరి బంధువుల్లో కొందరు గూడూరు చుట్టుపక్కలే ఉంటారు. భార్యవైపు చుట్టాలు కదానని నేను వాళ్లకు లేనిపోని సాయాలేమైనా చేస్తానేమోనని శంకరన్‌గారికి అనుమానం వచ్చింది. దాన్ని నేను పసిగట్టాను. వెంటనే లాంగ్ లీవ్ పెట్టి హైదరాబాద్‌కు ప్రయాణం కట్టేశాను.

అంత ఆదరాబాదరాగా వెళితే ఆ రోజు కొత్త కోడలు ఇంట్లో అడుగుపెట్టడానికి మంచి రోజు కాదన్నది మా అమ్మ. ఇక చేసేదేం లేక, గ్రీన్‌లాండ్స్ అతిథి గృహంలో ఒకటిరెండు రోజులుండి మంచి ముహూర్తానికి మా ఇంట్లో అడుగుపెట్టాం.

అప్పటిదాకా మాకు హనీమూనేం లేదు. 'ఎలాగూ సెలవు పెట్టావు కదా, హనీమూన్‌కు పోయి రండి' అన్నది మా అమ్మ. దాంతో మేమిద్దరం ఢిల్లీ, కులూమనాలీ బయల్దేరాం. అదీ సవ్యంగా అవలేదు. జారిపడటంతో నా కాలు ఫ్రాక్చరయింది. అర్థాంతరంగా ఢిల్లీ నుంచి తిరిగొచ్చేశాం.

ఇక్కడికొచ్చి చూస్తే తెలంగాణ ఉద్యమంతో హైదరాబాద్ అట్టుడికి పోతోంది. కర్ఫ్యూ విధించారు. విమానాశ్రయం నుండి ఇంటికి వెళ్లే వీలు లేదు. అప్పుడు నా స్నేహితులు కలగజేసుకుని, ప్రత్యేక అనుమతి సంపాదించి మమ్మల్ని ఇంటికి చేర్చారు!

## ముఖ్యమంత్రి పొగుడుతున్నారంటే..

సెలవు పూర్తయిన తర్వాత నేను గుంటూరులో జిల్లా రెవెన్యూ అధికారిగా అడుగుపెట్టాను. ఈ పదవి అంతకు ముందు లేనిది. అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్‌లో భాగంగా మొదలుపెట్టారు. రెవెన్యూ అధికారి పనేమిటంటే – కలెక్టరు చేసే రెవెన్యూ, మెజిస్ట్రేట్ వ్యవహారాలన్నిటినీ చక్కబెట్టడం. కలెక్టర్ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తే సరిపోతుంది. ఈ చర్య ద్వారా అధికార వికేంద్రీకరణ జరుగుతుందని భావన.

తర్వాత కొద్ది రోజులకే జిల్లా రెవెన్యూ అధికారికి బదులు, జాయింట్ కలెక్టర్ అని వ్యవహరించడం మొదలుపెట్టారు.

మొత్తమ్మీద గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా పనిచేసిన ఆర్నెల్లూ బాగానే గడిచాయి. అంతకు ముందే వరదలొచ్చి పోవడంతో వాటికి సంబంధించిన పనులు

కొనసాగించాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను ఎంతో కాలంగా ఆక్రమించుకున్న పేదవారికి పట్టాలివ్వడానికి గట్టిగా కృషి చేశాను. ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని నిరూపించడానికి శాయశక్తులా కృషి చేశాను. దానికోసమే, అప్పటి రాష్ట్రపతి వి.వి. గిరి ఒంగోలు గుండా ప్రయాణం చేస్తూ ఉన్నప్పుడు ఆయన్ని ఆపి మరీ కొందరికి ఆయన చేతుల మీదుగా పట్టాలిప్పించాను కూడా.

నేను గుంటూరులో పని చేస్తున్నప్పుడు గాంధీ శత జయంతి ఉత్సవాలు జరిగాయి. నాకు గుర్తుండి, ఆ రోజే రాష్ట్రంలో మద్య నిషేధాన్ని ఎత్తేస్తూ ప్రభుత్వం ఆర్డరు వేసింది! గాంధీ శత జయంతి ఉత్సవాల ఏర్పాట్లలో నేను చురుగ్గా పాల్గొన్నాను. ఒక ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశాం. అదిగాక మరో బహిరంగ సభ కూడా పెట్టాం. దానికి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి వచ్చి ప్రసంగించారు.

ఆయన మాటల్లో నన్ను తెగ పొగిడారు. నా పనితీరు, తెలివితేటలు, వ్యక్తిత్వం... అన్నీ గొప్పవని ఆకాశానికెత్తేశారు. నాకు రెక్కలు మొలిచాయి, సంతోషపడ్డాను. అప్పుడే ఎస్పీ హనుమంతనాయుడు పక్కకు లాగాడు.

''ముఖ్యమంత్రి అంతగా పొగుడుతున్నారంటే దానిలో ఏదో మతలబు ఉండే ఉంటుంది. మీరు మరీ ఆకాశానికెగరకండి... తర్వాతేం జరుగుతుందో ఏమిటో.. జాగ్రత్తగా చూసుకోండి...'' అన్నాడు!

ముఖ్యమంత్రి హైదరాబాదు బయల్దేరబోయే ముందు గెస్ట్‌హౌస్‌లో నన్నాయన గదికి పిలిపించారు. మా అమ్మ బాగోగుల గురించి, మా తమ్ముళ్లు ఎక్కడున్నారని అడిగారు. నేను గుంటూరులో స్థిరపడినట్టేనని, అమ్మ కూడా నాతో ఇక్కడే ఉన్నదని చెప్పాను. అయినా ఆయన ఆ టాపిక్ మార్చలేదు.

''మీరు హైదరాబాద్‌లో మీ తల్లిగారితో, తమ్ముళ్లతో ఉంటే కుటుంబమంతా ఒకచోట ఉన్నట్టుంటుంది కదా...'' అన్నారు. ''అయినా మీకు హైదరాబాదే సరైనది... ముందే మీకు అక్కడకు పోస్టింగ్ ఇచ్చుండాల్సింది...'' అన్నారాయన.

నేను గుంటూరు వదిలేసి వెళ్లాల్సిన సమయం ఆసన్నమయిందని నాకు అర్థమయింది. మరికొద్దిసేపటిలోనే పోలీస్ వైర్‌లెస్ ద్వారా నాకు బదిలీ వార్త వచ్చేసింది! నన్నంత హఠాత్తుగా బదిలీ ఎందుకు చేశారో అర్థం కాలేదు. అయితే బదిలీకి విచారించకపోగా, నేను సంతోషించాను కూడా. ఎందుకంటారా? నేను ట్రాన్స్‌ఫర్ అయింది – హైదరాబాద్‌లోని ప్లానింగ్ విభాగానికి!

# రాయలసీమ అభివృద్ధికి...

ఇంతకూ నన్ను ఆకస్మికంగా ప్లానింగ్ విభాగానికి ఎందుకు బదిలీ చేసినట్టు?

ఆ కారణం నాకు తర్వాత తెలిసింది. ప్లానింగ్ సెక్రెటరీగా పనిచేస్తున్న బి.పి. ఆర్. విఠల్ నా ట్రాన్స్‌ఫర్ నేపథ్యాన్ని నాకు చెప్పారు. జరిగిందేమంటే – అప్పటి చీఫ్ సెక్రెటరీగా పనిచేస్తున్న ఎమ్.టి.రాజు విఠల్‌కు మంచి స్నేహితుడు. ఆయన వచ్చి ఈయన దగ్గర వాపోయారట.

''ఈ వేణుగోపాలరెడ్డిని ఏం చెయ్యాలయ్యా? చూస్తే మంచి ఆఫీసరే. కాని అతనితో వేగడం చాలా కష్టంగా ఉందయ్యా. అతన్నేం చెయ్యాలో, ఎక్కడ పోస్ట్ చెయ్యాలో తెలియడం లేదు...'' అని.

అప్పుడు విఠల్ ''ఉస్మానియాలో లెక్చరర్‌గా ఉన్నప్పటి నుంచీ అతను నాకు తెలుసు. ప్లానింగ్ డిప్యుటీ సెక్రెటరీగా తీసుకుంటాను..'' అని చెప్పి నన్ను అక్కడికి రప్పించారు! అప్పటివరకూ నేను పని చేసిన చోట్ల ఎవరి ప్రయోజనాలకు ఏం ఇబ్బంది కలిగిందో మరి? నేను ప్లానింగ్ విభాగంలోకి రావడం వెనక కథ అది. అది నాకు వరంగానే పరిణమించింది. ఎందుకంటే ఆ కాలంలో నా అధ్యయనాన్ని కొనసాగించగలిగాను.

కలెక్టర్లుగా జిల్లాల్లో పని చేసినవాళ్లు హైదరాబాద్ వచ్చి కుదురుకోవడం అంత తేలికేం కాదు. జిల్లాల్లో కలెక్టరంటే అత్యున్నత అధికారి. దానికి తగినట్టే బోలెడంత హంగామా ఉంటుంది, అందరూ సలామ్ కొడతారు. నివాసానికి పెద్ద బంగళా ఉంటుంది, ప్రతి అవసరాన్నీ కనిపెట్టి చూసుకునే సిబ్బంది ఉంటారు.

హైదరాబాద్‌కు వచ్చేసరికి ఆ చిత్రమంతా ఒక్కసారిగా మారిపోతుంది. అద్దెకు ఇల్లు చూసుకోవడం, పిల్లలను స్కూల్లో చేర్పించడం మొదలు బజారుకెళ్లి సరుకులు, కూరగాయలు తెచ్చుకోవడం వరకూ అన్ని పనులూ వాళ్లే స్వయంగా చేసుకోవాలి.

ఆఫీసుకెళితే అదింకా చిత్రంగా అనిపిస్తుంది. స్టాఫ్ అంతా ఐదున్నరకు వెళ్లిపోతారు. కారుండదు. సలామ్ కొట్టేవాళ్లు, వేచి చూసేవాళ్లూ ఎవరూ ఉండరు. అంతెందుకు, ఒకోసారి వాళ్లకు కేటాయించిన ఆఫీసు గదికి బాత్రూమ్ కూడా ఉండకపోవచ్చు, కామన్ బాత్రూమ్ వాడుకోవలసిందే.

జిల్లాలో మంత్రివర్యులు వచ్చినా 'కలెక్టరుగారూ కాస్త చూడండి' అనో, 'చేసిపెట్టండి' అనో మర్యాదగా అడుగుతారు. అదే హైదరాబాద్‌లో మంత్రులను చూసే అవకాశమే ఉండదు. ఒక్కసారిగా అధికారమంతా తలకిందులైపోయిన భావన కలుగుతుంది. దానివల్ల ఐఏఎస్ అధికారులకు ఇక్కడ కుదురుకొని పనిచెయ్యడానికి కాస్త సమయం పడుతుంది. రాష్ట్రాల నుండి కేంద్ర సర్వీసులకు ఢిల్లీ వెళ్లేవాళ్లకూ ఈ పరిస్థితి తప్పదు.

అయితే నేనీ చిత్రానికి కాస్త మినహాయింపే. ఎందుకంటే నాకు హైదరాబాద్‌తో సుదీర్ఘ పరిచయం ఉంది. నా చదువంతా అక్కడే సాగింది కనుక అప్పటికే కొందరు స్నేహితులు, పరిచయస్థులూ ఉన్నారు. సొంతిల్లుంది, మా అమ్మ, తమ్ముళ్లు అంతా ఉన్నారు. వీటన్నిటితోపాటు, మా నాన్న సమయంలోనే నేను నగరంలోని అధికారుల లోప్రొఫైల్ జీవితాలు చూశాను. అందువల్ల గుంటూరు నుండి హైదరాబాద్‌కు మారడంలో నాకెలాంటి ఇబ్బందీ అనిపించలేదు.

అప్పటికి శాంతినగర్‌లో మా ఇంటి కింది వాటా ఒక ఆర్మీవాళ్లకు అద్దెకిచ్చి ఉంది. పై పోర్షన్లో మా అమ్మ, తమ్ముళ్లు ఉండేవారు. నేను, గీత ఉండటం కోసమని కింది భాగాన్ని ఖాళీ చెయ్యమంటే వాళ్లు చెయ్యలేదు. ఆఖరికి నేను మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ దాకా వెళ్లి గట్టిగా పోరాటం సాగిస్తే... ఏడాది తర్వాత ఖాళీ చేశారు!

అది ఇల్లూ సంసారం సంగతి.

ఇక నేను పనిచెయ్యవలసింది రాష్ట్ర ప్రణాళిక శాఖలో. దాని బాధ్యత ఏమంటే – భవిష్యత్ కాలంలో రాష్ట్ర అభివృద్ధికి బాటలు వెయ్యడం. దానికోసం ప్లానింగ్ కమిషన్, ఇతర స్థానిక సంస్థలతో సంప్రదింపులు జరిపి కొద్ది కాలంలో పూర్తయ్యే ప్రణాళికలు రూపొందించడం. అంతేకాకుండా, బడ్జెట్‌లో వార్షిక ప్రణాళికలను పరిశీలించి ఆమోదించడం, వివిధ ప్రాజెక్టులు, కార్యక్రమాలకు అనుమతులివ్వడానికి ఆర్థిక శాఖకు సలహాలివ్వడం కూడా ప్రణాళిక శాఖ పనే. వీటికితోడు ముఖ్యమంత్రి

లేదా మంత్రిమండలి ఏవైనా అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టడానికి ప్రణాళిక శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేస్తుంది.

నాకు మీడియమ్ టెర్మ్ ప్లానింగ్‌తో పాటు రాయలసీమ ప్రాంత అభివృద్ధిని కూడా కేటాయించారు.

## ఘనమైన చరిత్ర

కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి వంటి ప్రాంతాలన్నీ కలిసి విజయనగర సామ్రాజ్యం (1336 – 1649)లోని భాగాలు. ఆ రోజుల్లో ఆ ప్రాంతాన్ని సందర్శించిన అబ్దుల్ రజాక్ వంటి చరిత్రకారులు అదంతా పొలాలు, దట్టమైన అడవులు, పండ్ల తోటలతో సస్యశ్యామలంగా ఉన్న ప్రాంతమనే వర్ణించారు.

ఆంధ్రలోని కోస్తా ప్రాంతం బ్రిటిష్‌వారి ఏలుబడిలోకి త్వరగా రావడం వల్ల వారికి రైల్వే లైన్లు, ఆనకట్టలు, సాగునీటి కాలువలు వంటివి ముందుగా సమకూరాయి. విద్యావకాశాలూ ఎక్కువయ్యాయి. తద్వారా అభివృద్ధి సాధ్యమైంది. కోస్తా తర్వాత రాయలసీమ బ్రిటిష్‌వారి అధీనంలోకి వచ్చింది. ఆ ప్రాంతంలోని కొన్ని ప్రదేశాలను హైదరాబాద్ నిజామ్ ఆంగ్లేయులకు దత్తత ఇవ్వడంతో వాటిని దత్తమండలాలు (సీడెడ్) అని పిలిచేవారు. శ్రీకృష్ణదేవరాయలేలిన సీమగనుక రాయలసీమ అని కూడా అంటారు. 19వ శతాబ్దం చివర్లో, 20వ శతాబ్దపు మొదట్లో వరసగా కొన్నేళ్ల పాటు కరవు సంభవించడంతో దుర్భిక్ష పరిస్థితులేర్పడ్డాయి. అడవులు హరించుకుపోవడంతో వర్షపాతం తగ్గిపోయింది. వ్యవసాయం, పశుసంపద క్షీణించాయి. ఫ్యాక్షన్ గొడవలు బలపడటంతో నెమ్మదిగా సామాజికాభివృద్ధి కుంటుపడుతూ వచ్చింది.

1938లో మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ కరవు మీద ఒక కమిటీని వేసింది. అది సహాయక చర్యలతో పాటు, సీడెడ్ జిల్లాలకు ప్రత్యేకంగా ఒక ఆర్థికాభివృద్ధి బోర్డును ఏర్పాటు చెయ్యాలని సూచించింది. సాగునీటి ప్రాజెక్టులు, గనులు, పరిశ్రమలు, అడవులు, వ్యవసాయం, పశుపోషణలపై సూచనలు చేస్తూ ఆ బోర్డు 1941 నుంచి జులై 1949 వరకూ మనుగడలో ఉంది. తర్వాత దాన్నే రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు అని వ్యవహరించేవారు. ఒక మంత్రి దానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించేవారు. అయితే నిధుల కొరతతో పనులేమీ ముందుకు జరిగేవి కాదు.

కోస్తా, రాయలసీమలతో పోల్చితే తెలంగాణ ప్రాంతంలో భూస్వాముల పెత్తనం అధికంగా ఉండేది. కాని ప్రభుత్వ బడ్జెట్ మిగులుతోనే ఉండేది! మిగిలిన రెండు ప్రాంతాలకూ స్వపరిపాలన ఏదో ఒక స్థాయిలో ఎంతో కొంత తెలుసు. నైజాములో ఆ ఊసే లేదు.

భాషాప్రయుక్త రాష్ట్రాలకు సంబంధించిన కమిటీ తన నివేదికను 1955లో ఇచ్చింది. హైదరాబాదు రాష్ట్రంలో కన్నడ, మరాఠీ మాట్లాడే కొన్ని ప్రాంతాలను ఆయా రాష్ట్రాలతో కలిపెయ్యాలని సూచించిన కమిటీకి తెలుగు మాట్లాడే ప్రాంతాలను ఏం చెయ్యాలో తోచలేదు. చివరకు ఆ కమిషన్ ఆ ప్రాంతాలతో ఉన్న హైదరాబాద్ రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు – 1961 వరకు విడిగా ఉంచాలని, ఆ తర్వాత వారి మనోభావాల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కలపాలని సూచించింది.

కాని అప్పుడు కేంద్రంలో ఉన్న రాజకీయ నాయకత్వం హైదరాబాద్ వెంటనే కలవాలని ఆశించింది. తెలంగాణ ఆదాయాన్ని ఏం చెయ్యాలి, విద్య – ఉద్యోగ అవకాశాలు ఎలా కల్పించాలి వీటన్నిటినీ వివరంగా చర్చించి ఒక 'పెద్దమనుషుల ఒప్పందం' తయారుచేసుకున్నారు కోస్తా – తెలంగాణ నాయకులు. అలా 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించింది.

పదేళ్లు గడిచేసరికల్లా 'పెద్దమనుషుల ఒప్పందం'లోని అనేక అంశాలు అమలుకు నోచుకోవడం లేదని తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి మొదలయింది. ఫలితంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. ప్రత్యేక రాయలసీమ ఉద్యమం కూడా ఊపందుకుంటుందేమోనన్న భయం ప్రభుత్వంలో ఏర్పడింది. అలా కాకుండా ఉండేందుకు రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక బోర్డు వేసింది.

దానికి నేను సెక్రెటరీని.

## తరతరాలుగా అదే పని

మా నాన్న మద్రాసు రాష్ట్రం ఏర్పాటు చేసిన రాయలసీమ బోర్డులో పనిచేశారు. ఆయన చేసిన కృషి పట్ల అందరికీ గౌరవం ఉండేది. ఆయన కొడుకుని, రాయలసీమలో పుట్టిపెరిగినవాణ్ణి కావడంతో రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డులో నా పట్ల అభిమానముండేది.

రాయలసీమ అభివృద్ధి బోర్డు సెక్రెటరీగా నేను నిర్వహించిన మొట్టమొదటి సమావేశంలో 'స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే రాయలసీమ అభివృద్ధి కోసమంటూ

మా నాన్న కష్టపడి పనిచేశారు. ఇప్పుడు నేను కూడా కష్టపడి చేస్తున్నాను. బహుశా నా కొడుకు కూడా రాయలసీమ అభివృద్ధికి కష్టపడతాడేమో...' అని చెప్పాను.

అది కొందరికి జోకులాగా అనిపించింది, మరికొందరికి అందులోని అంతరార్థం అర్థమయింది.

ఎవరేమనుకున్నా నాకిచ్చిన కొత్త అసైన్‌మెంట్ పట్ల నేను ఉత్సాహంగా ఉండేవాణ్ణి. బాగా చదువుకున్న వ్యక్తి, సరదాగా ఉండే విఠల్ నాకు బాస్ కావడం నా అదృష్టమనే చెప్పాలి.

పని ప్రారంభించే ముందు పంచవర్ష ప్రణాళికలకు సంబంధించి ప్లానింగ్ కమిషన్ గైడ్‌లైన్స్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకున్నాను. అలాగే వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి కమిషన్‌వి, రాష్ట్ర ప్రభుత్వానివి – ఆలోచనలేమిటో అర్థం చేసుకున్నా. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్‌కు దగ్గరయ్యాను. దాని హెడ్ ఆర్.ఎన్. హల్దీపూర్ అభివృద్ధి పట్ల నిబద్ధత కలిగిన సివిల్ సర్వెంట్. అధ్యయనంలో నాకు అప్పటి ప్లానింగ్ కమిషన్ సభ్యులు బుర్రా వెంకటప్పయ్య చాలా సాయం చేశారు.

రాయలసీమ బోర్డుకు నేను ఇన్‌ఛార్జిని. అక్కడి శాసనసభ్యులంతా దానిలో సభ్యులు. బి.వి. సుబ్బారెడ్డి ఛైర్మన్. మొట్టమొదటి సెమినార్‌లో ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, డిప్యుటీ చీఫ్ మినిస్టర్, ప్లానింగ్ మినిస్టర్ అయిన జె.వి. నర్సింగరావు, రాయలసీమ బోర్డు ఛైర్మన్ బీవీ సుబ్బారెడ్డి మాట్లాడారు.

రాయలసీమ వెనుకబడిన ప్రాంతమంటూ ప్రారంభించి అక్కడి సమస్యలను, ప్రభుత్వ సాయం తగినంత లేకపోవడాలను ప్రస్తావిస్తూ తీసుకోవల్సిన చర్యల గురించి మాట్లాడారు ఛైర్మన్. ఇక ప్రణాళికశాఖ మంత్రిగారేమో రాష్ట్రంలో ఇతరచోట్ల కూడా వెనకబడిన ప్రాంతాల గురించి సమానంగా శ్రద్ధ పెట్టాలని చెప్పారు. ఆపైన ముఖ్యమంత్రి మాట్లాడుతూ వెనుకబాటుతనం ఎక్కడున్నా దానిమీద దృష్టి పెట్టాలని, దానికి అనుగుణమైన ఆర్థిక, సాంకేతిక సాయాలను ప్రణాళిక సంఘం అందించాలని చెప్పారు.

ఏదో న్యూస్ పేపర్‌లో వార్త చదువుతున్నట్టు ఉంది కదా ఇది చదువుతుంటే?

విచిత్రమేమంటే – వాళ్ల ముగ్గురు ప్రసంగాలను తయారుచేసిందీ నేనే! వాళ్లు లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాల్సిన వెంకటప్పయ్యగారి ప్రసంగం

కూడా కొంతమేరకు నా అధ్యయనం మీదే ఆధారపడింది!! అధ్యయనం చేస్తేనే ఒక అంశానికుండే బహుముఖాలు అర్థమవుతాయి.

ఇక్కడో చిన్న గమ్మత్తు చెప్పాలి.

సెమినార్ ముగిసిన వెంటనే మీడియా ప్రతినిధులంతా ప్రణాళిక మంత్రిగారి చుట్టూ చేరి 'చాలా బాగా మాట్లాడారు సార్' అని అభినందించారు. వాళ్లంతా ఉండగానే, ఆయన నన్ను పిలిచి ఆయన ప్రసంగంలోని ముఖ్యమైన పాయింట్లన్నిటినీ నోట్ చేసుకుని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోమన్నారు!

అంటే ఆ ప్రసంగమంతా ఆయన కృషేనని ఆయన మీడియావాళ్లకి చెప్పదలచుకున్నారన్నమాట.

రాయలసీమ బోర్డు సెమినార్ తర్వాత కొందరు రవీంద్రభారతి ఎదురుగా ఉన్న గోపి హోటల్లో భోజనానికి వెళ్లారు. ఆ విషయాలే మాట్లాడుకుంటూ తినడం పూర్తిచేశారట. బిల్లు తెమ్మంటే సర్వర్ వచ్చి, 'సార్ మీరంతా మా రాయలసీమ అభివృద్ధి గురించి ఆలోచిస్తున్నారు. మాకంతకన్నా కావలసింది ఏముంటుంది? మీ దగ్గర ఏమీ తీసుకోం...' అంటూ బిల్లు తీసుకోలేదట! వాళ్లు వచ్చి నాకా విషయం చెప్పారు.

ఆ హోటలు యజమాని రామిరెడ్డితో సహా, అక్కడ పనిచేసేవాళ్లంతా రాయలసీమవాళ్లే మరి.

గోపి హోటలు గురించిన సరదా సంగతొకటి ఇక్కడ చెప్పాలి. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో గొడవలు పడేవాళ్లు, ఆఖరుకు హత్యలు చేసినవాళ్లు కూడా కేసుల కోసం హైదరాబాదు వచ్చినప్పుడు ఆ హోటల్లోనే బస చేసేవాళ్లు! బాధితులు – నిందితులు – ఇరుపక్షాలే కాకుండా, వాళ్లతో వచ్చిన పోలీసువాళ్లు కూడా అక్కడే బసా భోజనాలూనూ. తెలిసినవాళ్లు ఎదురైతే 'ఏమప్పా అంటే ఏమప్పా, ఎట్లున్నారు' అనుకుని సాగిపోయేవారు.

అలాగే అసెంబ్లీ సమావేశాలు నడిచేటప్పుడు టిఫిన్లు, టీలకు అక్కడే చేరేవారు.

రాయలసీమ బోర్డు – అభివృద్ధికి నిధులంటే నాకింకో సంగతి జ్ఞాపకం వచ్చి నవ్వొస్తోంది. అదేంటంటే – రాయలసీమ అభివృద్ధికి కేటాయించిన నిధులతో ఏం చెయ్యాలని ఆలోచిస్తుంటే కొంతమంది కడపలో సెంట్రల్ జైలు కావాలని అడిగారు!

ఎందుకంటే రాయలసీమలో హత్య కేసులు ఎక్కువ. నిందితులను అటు వరంగల్లుగాని ఇటు రాజమండ్రి జైల్లోగాని పెడతారు. వాళ్లను చూసి రావడానికి రాయలసీమ నుంచి పోయిరావాలంటే కష్టం. వెళ్లినా ఆ రెండుచోట్లా ఆహార పద్ధతులు మా ప్రాంతీయులకు పడేవి కావు! అందుకని ఒక సెంట్రలు జైలు కడపలోనే కట్టేసుకుంటే సరిపోతుందనుకున్నారు మావాళ్లు!!

## ఐక్యరాజ్యసమితి కేస్ స్టడీ

ప్రాంతీయ అభివృద్ధి అనేది ఒక ప్రత్యేకమైన సబ్జెక్టు. నేనా విభాగంలో చేరగానే శాస్త్రీయంగా అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టాను. బ్రెజిల్, ఇటలీ, ఇంగ్లాండ్ వంటి చోట్ల వెనకబడిన ప్రాంతాలపై చేసిన అధ్యయనాలు, వాటి అభివృద్ధికి చేపట్టిన చర్యలు ఇవన్నీ ఆకళింపు చేసుకున్నాను.

రాయలసీమ అభివృద్ధికి ఆ తరహాలో శాస్త్రీయంగా పనిచెయ్యాలని ఆలోచన చేశాను. ముందుగా అక్కడున్న వనరులేమిటి, వాటితో ఏ రకమైన అభివృద్ధి సాధించవచ్చో సేకరించాం.

మా పనికోసం ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ బ్యూరో, టౌన్ ప్లానింగ్ డైరెక్టరేట్, వ్యవసాయ విశ్వవిద్యాలయం వంటి అనేక ఇతర డిపార్ట్‌మెంట్లతో కలిసి పనిచెయ్యవలసి వచ్చేది. చదువుకున్న, సమర్థులైన వ్యక్తులు మాకు సహకరించేవారు. తర్వాత వ్యవసాయం, గనులు, పరిశ్రమలు.. ఇలా అన్ని విభాగాలూ చొరవచూపాయి.

వివిధ విభాగాలను సమన్వయం చేస్తూనే జాతీయ స్థాయి నిపుణుల సలహాలూ సూచనలూ తీసుకున్నాం. ఆ సమాచారం ఆధారంగా 'రాయలసీమ పర్‌స్పెక్టివ్ ప్లాన్' అనేదొకటి తయారుచేశాం. ప్రభుత్వం దాన్ని రెండు వాల్యూమ్‌లుగా ముద్రించింది కూడా.

ఉదాహరణకు రాయలసీమలో పాల కేంద్రాలు పెట్టాలన్నది ప్రతిపాదన. మామూలుగా అందరూ అక్కడ గడ్డి లేదు, నీళ్లు లేవు, వర్షం లేదు, పశువులకే దిక్కులేదు, ఇక పాలు ఎక్కణ్ణుంచి వస్తాయి అని పెదవి విరిచేశారు. కాని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డును సంప్రదిస్తే వాళ్లు వచ్చి స్టడీ చేసి పాల కేంద్రాలను పెట్టొచ్చని, అవి బాగా నడుస్తాయని చెప్పారు!

అలాగే కరువు ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఇండస్ట్రియల్ కారిడార్ అని ప్రతిపాదించాం.

ఒక ప్రాంత అభివృద్ధి కోసం రాష్ట్ర స్థాయిలో అంత శాస్త్రీయంగా కృషి జరగడం మన దేశంలో అదే మొదటిసారి. అప్పటివరకూ కేంద్రం చెప్పింది చెయ్యడమే తప్ప, రాష్ట్రాల నుంచి ఒక శాస్త్రీయమైన ప్రణాళిక రూపొందడం అరుదు. దాంతో కేంద్ర ప్రభుత్వంలోనూ, బయట కూడా మేధావులు దాన్ని గుర్తించారు. ఫలితంగా రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డుకు కేంద్రం నుండి నిధులు రావడం మొదలయింది.

నిధులు రావడంతో అందరిలోనూ రాయలసీమ అభివృద్ధి మీద ఉత్సాహం వెల్లువెత్తింది. ఎంతంటే – రాయలసీమ అభివృద్ధి కోసం ఎంతోమంది తమకు తోచిన ఆలోచనలను రాసి పంపేవారు.

వచ్చిన నిధులను బోర్డు ఎగ్జిక్యూటివ్ కమిటీ కేటాయిస్తుంది. ప్రాంతాల వారీ పథకాలున్నా, నిధులు జిల్లాలకే వెళతాయి. దేనికేది, ఎంత కేటాయించాలన్నది నామీదే వదిలేశారు నా బాస్ విఠల్‌గారు, అటు రాయలసీమ నాయకులు కూడా.

శాఖల వారీగా సబ్ కమిటీల్ని నియమించి, క్షేత్రస్థాయిలో ప్రతిపాదనలను, అవి పాటించవలసిన గైడ్‌లైన్స్‌ను తయారుచేశాను. ఇటు అధికారులు, అటు రాజకీయులు సమానంగా భాగస్వాములయ్యారు. ప్రణాళికా సంఘం విశ్లేషణ, అధికారులు, ప్రజలు, నాయకులు – అంతా కలిసి పారదర్శకంగా పనిచెయ్యగల వినూత్న విధానం అది. దీనికి అందరి నుంచీ మంచి స్పందన లభించింది.

ఈ పరిణామాలన్నీ ప్లానింగ్ కమిషన్ దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా ప్లానింగ్ డివిజన్ సభ్యుడు డాక్టర్ సుఖమొయ్ చక్రవర్తి, మల్టీలెవెల్ ప్లానింగ్ డివిజన్ ఆనంద్ సరూప్‌లు దీని మీద ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాయలసీమ అభివృద్ధి బోర్డు ఎలా పనిచేసిందన్నదాని మీద జపాన్‌లోని ఐక్యరాజ్యసమితి విభాగం ఓ కేస్ స్టడీ చేసింది.

**అందరూ అందుకోసమే...**

రాయలసీమ అభివృద్ధి బోర్డుకు పనిచేసిన వాళ్లల్లో కొందరు నాయకులు అక్కడి ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతారు. ముఖ్యంగా నివర్తి వెంకటసుబ్బయ్యగారంటే సీమలో పెద్ద పేరు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆయన సమాజ సేవలోనూ ముందుండేవారు. ముఖ్యంగా నంద్యాల్లో ఆయన చాలా సేవ చేశారు. సౌమ్య స్వభావంగల ఆయన బాగా చదువుకున్న వ్యక్తి.

మరో నాయకుడు కె.వి. వేమారెడ్డికి కూడా సీమలో మంచి పేరుండేది. వీళ్లతో పాటు చల్లా సుబ్బరాయుడుగారితో పనిచెయ్యడం భలే ఉండేది. అనంతపురానికి చెందిన ఆయన కాంగ్రెస్‌వాది. తాడిపత్రి ఎమ్మెల్యేగా ఉండేవారు, తర్వాత మంత్రిగా కూడా చేశారు. సీమలో నీటిపారుదల వ్యవస్థ, వనరుల గురించి ఆయనకు గొప్ప పరిజ్ఞానం ఉండేది.

ఆయన అలవాటుగా బీడీ తాగేవారు. నేను సిగరెట్ తాగుతానని తెలుసాయనకు. అందుకని అప్పుడప్పుడు నా ఆఫీసు గదిలోకి వచ్చి కులాసాగా కబుర్లు చెబుతూ బీడీ తాగేవారు!

## పిల్లనిచ్చినా పనవలేదు!

ఒంగోలు జిల్లా 1970లో ఏర్పడింది. నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాల నుండి రెండుమూడు తాలూకాల చొప్పున విడదీసి, వాటన్నిటినీ కలిపి ఆ జిల్లాను ఏర్పాటు చేశారు. నేను రాయలసీమ బోర్డు ఏర్పాటయిన వెంటనే చారిత్రకంగా రాయలసీమ ప్రాంతాలేవి అన్నది అధ్యయనం చేశాను. కర్నూలు జిల్లా నుంచి ఒంగోల్లో కలిపిన తాలూకాలను (గిద్దలూరు, మార్కాపురం) రాయలసీమ బోర్డు పరిధిలోకి తీసుకొచ్చారు. నిధులు వచ్చాక వాటిలోనూ అభివృద్ధి కార్యక్రమాలు మొదలయ్యాయి.

అయితే – నెల్లూరు జిల్లా పరిషత్ వాళ్లు ఒక మీటింగు పెట్టుకుని 'మమ్మల్ని కూడా రాయలసీమ బోర్డులో చేర్చా'లని ఒక వినతిపత్రం సమర్పించారు. ఆ ఫైలు వచ్చినప్పుడు నేను వద్దని రాశాను. బ్రిటిష్‌వాళ్లకిచ్చిన దత్తమండలాల్లో నెల్లూరు లేదని, అందువల్ల ఇప్పుడు దాన్ని రాయలసీమలోకి చేర్చడం తగదని తేల్చిచెప్పాను. ప్రభుత్వం నా మాటను అంగీకరించింది!

'మా నెల్లూరు జిల్లా పిల్లను పెళ్లి చేసుకున్నావు, అయినా మా ప్రాంతానికి పనికి రాలేదేమయ్యా...' అంటూ అక్కడి బంధువులు కొందరు నన్ను నిలదీశారు కూడా!

## అలా అడగడం మానేశా

ఒకరోజు చీఫ్ సెక్రెటరీ కార్యాలయం నుండి నాకో ఫోనొచ్చింది.

'సర్, మిస్టర్ అశోక్ మిత్రా వాంట్స్ టూ సీయూ...' అని. నేను ఫోను పెట్టేసరికి ఒక పెద్దాయన నా గదిలోకి వచ్చారు. నేను కూర్చోమని చెబుతూ 'వాట్ కెన్ ఐ దూ ఫర్ యూ, సర్' అన్నాను మామూలుగా, పెద్ద దృష్టి పెట్టకుండా.

‘నథింగ్ రియల్లీ. ఐ జస్ట్ వాంటెడ్ టు సే హెలో టు యు...’ అన్నారాయన.

నాకు ఆశ్చర్యంగా అనిపించింది. అప్పుడు పరికించానాయన్ని.

‘అయామ్ అశోక్‌మిత్రా, సెక్రెటరీ – ప్లానింగ్ కమిషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా. నేను మీ గురించి విన్నాను. ఇక్కడేదో పని మీద వచ్చాను. మిమ్మల్నోసారి చూద్దామని వచ్చానంతే..’ అన్నారాయన నవ్వుతూ. నేను చేసిన పొరపాటు అప్పుడు నాకు తెలిసొచ్చింది. ఆయన చాలా సీనియర్ ఐసీఎస్ అధికారి! ఇక అప్పట్నుంచి, ఎవ్వరొచ్చినా ‘వాట్ కెన్ ఐ డూ’ అని పొగరుగా అడగడం మానేశాను. మామూలు క్షేమసమాచారాలతో సంభాషణ ప్రారంభించడం నేర్చుకున్నాను!

## మేమైతే ఒకటి, మీరైతే ఒకటి

నెల్లూరు జిల్లాలో సమితి ప్రెసిడెంటుగా పనిచేస్తున్న భక్తవత్సలరెడ్డి ఒకరోజు నన్ను కలవడానికి వచ్చాడు. ఆయన మా పిన్నమ్మకు అన్నవుతాడు, మన రాష్ట్రానికి మంత్రిగా చేసిన ఏసీ సుబ్బారెడ్డి కొడుకు.

‘వేణూ నువ్వు డిప్యుటీ సెక్రెటరీ అని రాలేదు. రేపోమాపో కలెక్టరయి మా జిల్లాకొస్తావేమోనని కలిశాను’ అన్నాడు!

మరొకసారి వచ్చినప్పుడు ‘మా ఊళ్లో ఒక టీచరున్నాడు, అతనికి బదిలీ అవాలి, మా కలెక్టరు సుజాతారావుకు కొంచెం చెప్పు’ అన్నాడు.

‘అది చిన్న పనేగా. నువ్వు చెప్పినా అయిపోతుంది..’ అన్నాన్నేను.

‘అది నాకు తెలుసు. కాని మేం పోయి మాట్లాడితే దానికి ‘రాజకీయ జోక్యం’ అని పేరు పెట్టేస్తారు. అదే నువ్వు ఆమెకు చెబితే ‘ఓ మాట చెప్పడం’ అంటారు. చూడు ఎంత తేడా ఉందో...’ అన్నాడాయన!

## వాటిని నమ్ముకోవడమే మంచిది

ప్లానింగ్ బోర్డుకు ఒక సెక్రెటేరియట్ ఉంటుంది, దానిలో పనిచేసే ఉద్యోగులతో నాకొన్ని సరదా అనుభవాలున్నాయి. జగదీశ్ నీలరత్న అనే ఎకానమిస్ట్ ఒకాయన ఉండేవాడు. చాలా తెలివైనవాడు.

నేనొకసారి సాయంత్రం నాలుగున్నరకు ఒక పని చెప్పి, సాయంత్రంకల్లా పూర్తికావాలని చెప్పాను. ఆయన ‘సర్, నేను ఐదింటికి ఆఫీసు వదిలేసి

ఇంటికెళ్లిపోతాను.. మా ఇంట్లో పాడిపశువులున్నాయి. వాటి పోషణ చూసుకోవాలి..' అన్నాడు.

'అదేమిటయ్యా' అని అడిగితే, 'సార్, ఈ ఐఏఎస్ అధికారులను నమ్ముకొనే కంటే, మా బర్రెలను నమ్ముకొంటే మంచిది. మీరు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల మధ్యన ఏం చెప్పినా చేస్తా. ఆ తర్వాత మాత్రం ఆఫీసులో ఉండను..' అని కుండబద్దలు కొట్టినట్టు చెప్పాడు!

సంతానబాబు అనే మరో ఎకానమిస్ట్ ఉండేవాడు.

ఒకసారి బీవీ మోహనరెడ్డి మా ఆఫీసుకొచ్చారు. ఆయనకు హస్తసాముద్రిక శాస్త్రం తెలుసు. నా చెయ్యి చూస్తానన్నారు. ఈలోగా సంతాన బాబొస్తే, 'ఏమయ్యా, ఈయన నా చెయ్యి చూస్తానంటున్నాడు..' అన్నాన్నేను.

'సార్, ఎప్పుడూ ఎవరికీ చెయ్యి చూపించొద్దు' అన్నాడాయన సీరియస్‌గా. మా ఇద్దరికీ కుతూహలం పెరిగింది. 'ఎందుకలా?' అడిగాన్నేను.

'నేను పెళ్లి కాకముందు చెయ్యి చూపెట్టుకున్నా. కట్టుకున్న భార్య ఏడాదిలో చనిపోతుందని చెప్పారు. సరేలెమ్మని మా అమ్మనాన్నలు చూసిన పిల్లనే చేసుకున్నా. ఆమె ఇప్పటిదాకా పోలేదు! ఈ చెయ్యి చూసేవాళ్లెప్పుడూ నిజం చెప్పరు సార్' అన్నాడు. ఇక మా గదిలో నవ్వులే నవ్వులు.

# గురు ఉపదేశాలు

**ఒ**కసారి మా ఆవిడ ఏదో కొనుక్కుందామని షాపింగ్‌కని వెళ్లింది. నేనింటికి వచ్చేసరికి ఆమె లేదు. ఒకవేళ నేను వచ్చేశానేమో కనుక్కుందామని ఆమె మా ఇంటికి ఫోన్ చేసింది. నేను ఫోనెత్తాను, కాని ఆడగొంతు పెట్టి మాట్లాడాను. ఆమె కంగారు పడింది. నెంబరేంటి అంటే మా ఇంటి నెంబరే చెప్పాను. మరి మీరెవరని అడిగితే నా పేరు సుశీల అని చెప్పేశాను. గీత సుడిగాలిలా ఇంటికొచ్చేసింది. నేను హాల్లో కూర్చుని పేపరు తిరగేస్తున్నాను. ఎవరైనా ఉన్నారేమోనని ఆమె ఇల్లంతా వెతికింది. ఎవ్వరూ లేరు. నేను ఆమె కంగారును గమనిస్తూ నవ్వుకుంటున్నాను.

'మేడమ్ ఏమిటి వెతుకుతున్నారు?' అనడిగాను.

'ఏం లేదండీ. హైదరాబాద్‌లో 34349 ఫోన్ నెంబర్లు రెండు ఉంటాయా?' అడిగిందామె కంగారుగా. ఉండవని చెప్పాను. ఇంకా అటూఇటూ చూస్తోంది. ఇక నవ్వలేక, నేనే అసలు విషయం చెప్పేశాను!

మా అమ్మాయి కవిత 1970 ఏప్రిల్ 20న నెల్లూరులో పుట్టింది. ఆ సంతోషకరమైన వార్త అందే సమయానికి నేను ఢిల్లీలో ఉన్నాను. నేను మా అమ్మ, తమ్ముడు మధు ముగ్గురం నెల్లూరు వెళ్లి పాపను చూసి వచ్చాము. మా కుటుంబం అంతటికీ సంతోషం కలిగిన సమయం అది.

ఆ తర్వాత జూన్ నెలలో నేను కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉన్నతాధికారుల బృందంతో ఒక సమావేశానికి వెళ్లబోతున్నాను. ఇంతలో కర్నూలు నుంచి నాకో ఫోనొచ్చింది. నంద్యాల నుంచి హైదరాబాద్ వస్తున్న మా తమ్ముడు మధుసూదన్‌రెడ్డి వాహనం ప్రమాదానికి గురయ్యిందని, వెంటనే రమ్మని అన్నారు. ప్రమాదం చిన్నది కాదని వెంటనే అనిపించింది.

ఎందుకంటే ఎంతో ముఖ్యమైన సమయాల్లో తప్ప మా తమ్ముడు నన్ను డిస్టర్బ్ చేసేవాడు కాదు. తనే గనక స్పృహలో ఉంటే ఈ ఫోను చెయ్యనిచ్చేవాడు కాదని నాకు బాగా తెలుసు. నా మనసు కీడు శంకించింది.

మధుసూదన్ నా పట్ల చాలా అపేక్షగా ఉండేవాడు. చాలా జాగ్రత్తగా చూసుకునేవాడు. ఎంతంటే ఎప్పుడైనా నేను సెక్రెటేరియట్ పనిలో ఉండి రాత్రయిపోతే నాకు డిన్నర్ క్యారేజీ పట్టుకుని వచ్చేవాడు. నేను పనిలో పడి భోజనం వేళ మించిపోకూడదని అంత జాగ్రత్తగా ఉండేవాడు.

అలాగే మంచిచెడుల పట్ల చాలా కచ్చితంగా ఉండేవాడు. తానున్న చోట ఎవరైనా అమాయకులతో తగవుపెట్టుకుంటే వెళ్లి మాట్లాడి సర్దేవాడు. అంతేతప్ప నాకేమన్నట్టు ఉండేవాడు కాదు. పేదవాళ్లంటే చాలా అక్కర ఉండేదతనికి.

మా చిన్నప్పుడు ఒకసారి తనకు లెక్కలు చెబుతున్నాను. తను బాగా చెయ్యడం లేదని కోపం వచ్చి కొట్టాను. వాడి తల మీద గట్టి దెబ్బే తగిలింది. నొప్పితో విలవిలలాడిపోయాడు. నాకు చాలా భయం వేసింది. కాని తను ఏడవలేదు, ఎవ్వరికీ చెప్పలేదు! తలకు రక్తప్రసరణ పెరిగితే నొప్పి తగ్గుతుందంటూ శీర్షాసనం వెయ్యమంటే మారుమాట్లాడకుండా వేశాడు! అంత అభిమానం నేనంటే.

మా కజిన్ డాక్టర్ ఎన్.ఆర్.సి.రెడ్డితో పాటు కార్లో కర్నూలు చేరేదాకా నేనివన్నీ ఆలోచించుకుంటూ గడిపాను. నా సహనాన్ని పరీక్షిస్తూ కారు చాలా చోట్ల పంక్చర్లయింది. ఎలాగోలా రాత్రికి కర్నూలు చేరుకునేసరికి మమ్మల్ని నేరుగా మార్చురీకి తీసుకె ళ్లారు, మా తమ్ముడి మృతదేహాన్ని చూపించారు! నా ప్రియమైన తమ్ముణ్ణి పోగొట్టుకున్న దుఃఖాన్ని నేను మాటల్లో చెప్పలేను. అప్పటి నుంచి నాకు కారు డ్రైవింగ్ అంటే అయిష్టం.

### గురు సమానులు

రాష్ట్ర సర్వీసులో ఎక్కువ కాలం నేనున్నది పూర్తిస్థాయి ప్లానింగ్‌లోనే. నేను ఆ విభాగంలో చేరడానికి ముఖ్యకారకులు బీపీఆర్ విఠల్‌గారు. ఆయన నాకు బాస్ మాత్రమే కాదు, మార్గదర్శి కూడా.

ఉద్యోగవిధులు నిర్వహిస్తున్నప్పుడు కూడా నా అధ్యయనాన్ని కొనసాగించడానికి తగిన స్వేచ్ఛనిచ్చారాయన. సెమినార్లు, కాన్ఫరెన్సులకు హాజరవాలన్నా, ఎక్కడైనా ప్రసంగాలివ్వాలన్నా హాయిగా వెళ్లి రమ్మనేవారు. నా ఖర్చులు ఆయా నిర్వాహకులు కాకుండా, ప్రభుత్వం పెట్టుకోవాలన్నప్పుడు మాత్రం ఆయన ఒకటికి రెండుసార్లు ఆలోచించి అనుమతించేవారు.

విఠల్‌గారితో కలిసి పనిచెయ్యడం ద్వారా నేనెన్నో విషయాలను నేర్చుకోగలిగాను. ముఖ్యంగా సమతౌల్యం అంటే ఏమిటో ఆయన్ని చూసే తెలుసుకోవాలి ఎవరైనా. ఆయన చిరాకు పడటం, ముఖం చిట్లించడం చెయ్యగా చూసినవారు లేరంటే అతిశయోక్తి కాదు. ఏదైనా అంశంపై నాతో విభేదించాల్సి వచ్చినప్పుడు ముందు పిలిచి చర్చించేవారు. నా అభిప్రాయాలన్నీ విని, ఆయనవి చెప్పేవారు. ఇద్దరం ఏకీభవించలేం అనుకున్నప్పుడు మాత్రం ఆయన మాటే నెగ్గేది.

''నిన్ను ఓవర్ రూల్ చేస్తున్నానంటే దానర్థం నువ్వు చెప్పిందంతా తప్పు, నేను రైటు అని కాదు. ఒక అంశానికి అనేక దృష్టికోణాలుంటాయి. కాని వ్యవహారం ముందుకు నడవాలంటే నేనొక నిర్ణయం తీసుకోవాలి, దానికి బాధ్యత వహించాలి...'' అని చెప్పేవారు.

హోదాపరమైన హెచ్చుతగ్గులు, భేదభావాలేం లేకుండా అందరినీ గౌరవించడం అనేది ఆయన్నుంచి నేర్చుకున్న ముఖ్యమైన అంశం. తనతో పనిచేసేవాళ్ల నుంచి నమ్మకం, విశ్వసనీయత వంటి ఉదాత్తమైన లక్షణాలను మాత్రం కోరుకునేవారు. ఆయనలో చాలా సరదా మనిషి కూడా ఉన్నాడు.

''మీరు చీఫ్ సెక్రెటరీ అయితే ఈ రాష్ట్రం ఎంతో బాగుపడుతుంది'' అన్నానొకసారి.

''వేణూ, నీకు ఫలానా ఆయన తెలుసు కదా. ఆయనకు సగం పిచ్చి. ఆయన చీఫ్ సెక్రెటరీ అయ్యాడు. అయినా మన రాష్ట్రమేం చెడిపోలేదే. దీన్నే మరొక రకంగా కూడా చెప్పుకోవచ్చు. గొప్ప మేధావి చీఫ్ అయినంత మాత్రాన రాష్ట్రం బాగుపడిపోదు... ఏమంటావు...'' అని నవ్వేశారు.

విఠల్‌గారి డ్రాఫ్టింగ్ నైపుణ్యం అమోఘం. ఆ విషయంలో మాత్రం నేను పనిచేసిన కాలంలో ఎప్పుడూ ఆయన అంచనాలను అందుకోగలిగేవాణ్ణి కాదు! వివిధ సిద్ధాంతాలు, చరిత్ర.... వీటిని మించి మానవ స్వభావం మీద విఠల్‌గారికి మంచి అవగాహన ఉండేది.

ఆయనగాక, నాకింకో చిన్న గురువుగారుండేవారు. ఆయన పేరు ఆర్. రాజామణి. ఫైనాన్స్‌లో జాయింట్ సెక్రెటరీగా పనిచేసిన ఆయన తన బ్యాచ్ టాపర్. నీతినిజాయితీలకు, కృషికి నిలువెత్తు రూపం ఆయన. బ్యాంకులు, ఇతర అటానమస్ ఇన్‌స్టిట్యూషన్లతో వ్యవహరించడమెలాగో ఆయన నుంచే నేర్చుకున్నాను.

ఆ కళ నాకు తర్వాత్తర్వాత చాలా పనికొచ్చింది! వ్యక్తిగతంగా ఆయన నాపైన చాలా శ్రద్ధ పెట్టేవారు.

మన దేశంలో పంచవర్ష ప్రణాళికలకు ఒక రూపాన్నిచ్చినవారిలో సుఖమొయ్ చక్రవర్తి ముందువరుసలో ఉంటారు. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో చదువుకున్న ఆయన మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపక వృత్తిలో ఉంటూ దాన్ని వదిలేసి మన దేశానికి వచ్చారు. ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగా పని చేసిన ఆయన నాకు గురుతుల్యులు.

'ప్రణాళిక ప్రకారం అభివృద్ధి జరగాలి. అలాగని అన్నిటినీ వికేంద్రీకరించలేం, దేన్ని ఎక్కడ చెయ్యాలన్నది తెలియాలి కదా..' అంటూ నాకు చాలా అంశాలు విశదం చేస్తూ వెన్నుదన్నుగా నిలిచేవారాయన. అనంతర కాలంలో నేషనల్ టాస్క్‌ఫోర్స్ ఆన్ మల్టీలెవల్ ప్లానింగ్ మొదలుపెట్టినప్పుడు నేను చాలా జూనియర్ అయినా నన్ను దానిలో మెంబర్ చేశారు!

బుర్రా వెంకటప్పయ్య ఐసీఎస్ అధికారి. రిజర్వ్ బ్యాంకులో డిప్యుటీ గవర్నర్‌గా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా పనిచేశారు. ఢిల్లీలో ప్లానింగ్ కమిషన్ మెంబర్‌గా పనిచేసేవారు. నేను రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డు సెమినార్‌కు పిలిస్తే వచ్చారాయన. అప్పట్నుంచి మా మధ్య స్నేహం చిగురించింది. బ్యాంకులు నేషనలైజ్ అయ్యాక, అభివృద్ధి కార్యక్రమాలకు బ్యాంకులు రుణాలిస్తాయని, మరీ ముఖ్యంగా రాయలసీమ అభివృద్ధికి వాటిని సంపాదించడం ఎలాగ.... ఇలాంటి విషయాలు చెప్పి గైడ్ చేసేవారాయన.

అలాగే ఉత్తరప్రదేశ్‌కి చెందిన ఐఏఎస్ ఆనంద్ సరూప్ నన్ను 'భాయి' అని పిలుస్తూ అభిమానించేవారు. జై ఆంధ్ర ఉద్యమం తర్వాత 6 పాయింట్ ఫార్ములాకు గైడ్‌లైన్స్ రాయడానికి ఒక సమావేశం ఏర్పాటు చేశాం. అది అవలేదు. మరేం చెయ్యాలని ఆనంద్‌గారిని అడిగితే 'మీటింగ్ మీకూ నాకే కదా. మనిద్దరం దాని గురించి చాలాసార్లు మాట్లాడుకున్నాం. మీరు మినిట్స్ రాసేసి, గైడ్‌లైన్స్ రాసెయ్యండి...' అన్నారు!

నేను రాసేశాను. 'ఊరికే నాతో ఇంత పని చేయిస్తారా? కనీసం భోజనం పెట్టించండి...' అనడిగాను సరదాగా. 'తప్పకుండా భాయ్' అంటూ త్రీ స్టార్ హోటల్‌కు తీసుకెళ్లి మంచి విందు ఇచ్చారు.

తర్వాత చెప్పుకోవలసింది ప్రొఫెసర్ బి.ఎస్. మిన్హాస్ గురించే. పంజాబ్‌కు చెందిన ఆయన స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రం పాఠాలు చెప్పేవారు, తర్వాత మన దేశానికి వచ్చేసి ప్లానింగ్ కమిషన్ సభ్యుడయ్యారు. రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డులో ముఖ్యమైన మా డిస్కషన్స్ ఆయన దాకా వెళ్లాయి. దాంతో ఆయన 'నేను వైవీ రెడ్డిని చూడాలి' అంటూ నేరుగా నా గదికి వచ్చేశారు ఒకసారి! మా సాన్నిహిత్యం పెరిగిన తర్వాత ఆయన జోకేసేవారు, 'ప్లానింగ్ ఆంధ్రాలో బాగుంది, డెవలప్‌మెంట్ పంజాబ్‌లో బాగుంది. అంటే ప్లానింగ్ లేనిచోటే అభివృద్ధి ఉంటుందన్న మాట...' అని.

అలాగే 'రెడ్డీ, నువ్వు పాలిటిక్స్‌లో చేరు, నే నీకు ఫైనాన్స్ చేస్తా' అని జోకులు వేసేవారు. ఎన్నో కీలక పదవులు నిర్వహించిన ఆయనను 2003లో మన ప్రభుత్వం పద్మభూషణ్‌తో సత్కరించింది!

## అదీ కాసువారి తీరు

నేను ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో చేరినప్పుడు జె.వి.నర్సింగరావు ఉపముఖ్య మంత్రిగా, ప్లానింగ్ శాఖ ఇన్‌ఛార్జిగా ఉండేవారు. పనిపట్ల సీరియస్ దృక్పథమున్న ఆయనకు తెలంగాణలో మంచి నేతగా పేరుండేది.

ప్లానింగ్ కమిషన్‌తో చర్చలంటే, నిధులు మంజూరు చెయ్యాలంటే ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి కల్పించుకోవలసిందే. ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి ప్రాధాన్యాలన్నీ ఆయనకు కొట్టిన పిండి. సాగునీరు, పరిశ్రమల మీదే ఆయన దృష్టి కేంద్రీకృతమై ఉండేది. కాంగ్రెస్ పార్టీలోనూ, విపక్ష నేతలతో సైతం మంచి సంబంధాలుండేవి ఆయనకు. ఆయన పనితీరు అధికారులకు కూడా సుఖంగా, ఉత్సాహంగా ఉండేది. కొన్నిసార్లు మా బాస్ విఠల్‌గారితో కలిసి, కొన్నిసార్లు విడిగానూ కలిశానాయన్ని.

బ్రహ్మానందరెడ్డిగారికి మంత్రివర్గం మీద ఎంత పట్టుండేదంటే – ఒకసారి బడ్జెట్ చర్చకు వచ్చింది. ఆయన అందరివైపూ చూసి 'బడ్జెట్ మీద ఏమైనా చెబుతారా?' అన్నారు. ఒక్కరు కూడా లేచి మాట్లాడలేదు. ఆయన ఫైనాన్స్ సెక్రెటరీ రామేశన్ వైపు చూసి 'పంతులూ, మంచి ముహూర్తం' అన్నారు.

రామేశన్ తన బ్రీఫ్‌కేసు తెరిచి పంచాంగం తీసి రెండు ముహూర్తాలు చెప్పారు. ముఖ్యమంత్రి వాటిలో ఒకదాన్ని ఎంచుకున్నారు! అంతే – బడ్జెట్‌ను మంత్రివర్గం ఆమోదించినట్టే.

తెలివి, చాకచక్యం అన్నీ ఉన్న నాయకుడు కాసు బ్రహ్మానందరెడ్డి. ఆయన పెద్దగా ఏమీ మాట్లాడేవారు కాదు. అంగీకారసూచకంగానో, కాదంటేనో తలూపేవారంతే. ఒకసారి అసెంబ్లీలో 'అధ్యక్షా, ముఖ్యమంత్రిగారు అన్నిటికీ తలూపుతారు, ఆయన ఒప్పుకున్నారని మేం అనుకుంటాం. కాని అది రికార్డు అవడం లేదు. అలా చెయ్యకూడదు ఆయన' అంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి!

ఒకసారి 'మన రాష్ట్రంలో మూడే యూనివర్సిటీలున్నాయి, ఇంకా కావాలంటున్నారు విఠల్‌గారూ' అన్నారు కాసు.

దానికి విఠల్‌గారు 'వీసీ స్థాయి ఉన్నవాళ్లను ముగ్గుర్ని చూపెట్టండి సార్, యూనివర్సిటీలు పెట్టేద్దాం' అన్నారు!

# జై ఆంధ్రకు దారి తీసిన ప్రత్యేక తెలంగాణ

**1969**లో చెన్నారెడ్డి సారథ్యంలో ప్రత్యేక తెలంగాణ ఆందోళన పరాకాష్ఠకు చేరింది. ఆ ఏడాది ఏప్రిల్లో ప్రధానమంత్రి ప్రకటించిన ఎనిమిది సూత్రాల ప్రణాళిక తెలంగాణవారిని సంతృప్తి పరచలేదు. ఆ తర్వాత తెలంగాణ అభివృద్ధికి విద్యాసంస్థలు నెలకొల్పడం, పరిశ్రమలకు సబ్సిడీలివ్వడం వంటి ప్రత్యేక చర్యలెన్నో చేపట్టింది కేంద్రం.

తెలంగాణకు ప్రాముఖ్యమిస్తున్నామని జనానికి తెలియజెప్పడానికి కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావును ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. 1971 సెప్టెంబరు 30న ఆయన పదవీస్వీకారం చేశారు.

అప్పుడు బీవీ సుబ్బారెడ్డి డిప్యూటీ సీఎమ్. ప్రణాళికలు, రహదారులు భవనాల శాఖకు ఆయనే ఇన్ ఛార్జ్. బీవీ సుబ్బారెడ్డి రాయలసీమకు నిధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే, పీవీ తెలంగాణకు నిధుల పట్ల శ్రద్ధ పెట్టేవారు. ఆ ఏడాది బడ్జెట్లో పీవీ తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల ఆదాయం–ఖర్చులూ విడివిడిగా చూపించారు. పీవీని నేనెప్పుడూ నేరుగా కలవలేదు.

పీవీ ఏ నిర్ణయాలూ తీసుకోరని, ఆయన దగ్గరకు వెళ్లిన ఫైలు తిరిగి రావడం ఉండదని, ఆయన దేనిమీదా సంతకాలు పెట్టేవారు కాదని మాత్రం పేరొచ్చింది. నాకు తెలిసి, ఒక ఫైల్లో ఉన్న ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఒక పేరా రాశారు. దానికి అనుకూలంగా మరో పేరా రాశారు. సంతకం సగం పెట్టి ఆపేశారు! దాన్నేం చెయ్యాలో తెలియక ఆఫీసంతా జుట్టు పీక్కుంది!

### కాల్పులు, ఉద్రిక్తత

ప్రజల్లోంచి కాకుండా, అధిష్ఠానం అండతో సీఎమ్ అయ్యారంటూ పీవీకి సహచర ఎమ్మెల్యేల మద్దతు అంతగా ఉండేది కాదు. సీఎమ్‌గా ఆయన భూసంస్కరణలను అమల్లోకి తీసుకొచ్చారు. వాటివల్ల పెద్ద ఎత్తున భూములు కోల్పోయిన వాళ్లంతా

ఆయనకు వ్యతిరేకులయ్యారు. సీఎమ్ పట్ల వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు రాజీనామా చేశారు.

రాజకీయ పరిస్థితి గందరగోళంగా ఉండగా, తెలంగాణ ప్రాంతంలో పుట్టిపెరిగిన వాళ్లకే ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలనే ముల్కీ రూల్‌ను 1972 చివర్లో సుప్రీం కోర్టు సమర్థించింది. పీవీ ప్రభుత్వం వాటి అమలుకు నడుంకట్టడం వల్ల ఆంధ్ర ప్రాంతీయుల్లో అసంతృప్తి ఏర్పడింది. దాన్ని గమనించిన కేంద్రం రాజీ ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. ఆ బిల్లు 1972 డిసెంబరు 31 న పాసయింది. కాని ముల్కీ నిబంధనల రద్దు తప్ప మరేదీ వద్దని భీష్మించారు ఆంధ్రులు.

అభివృద్ధి అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైందని, దానివల్ల తమకు అన్యాయం జరుగుతోందని 'మా సొంత గడ్డ మీద మేం పరాయివాళ్లమయిపోయాం' అని కోస్తాంధ్ర, రాయలసీమ ఉద్యోగులు భావించారు. ముల్కీ నిబంధనల వల్ల తమ విద్యా ఉద్యోగావకాశాలు దెబ్బతింటాయనే భయం విద్యార్థులకూ కలిగింది.

ఫలితంగా జై ఆంధ్రా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. గౌతు లచ్చన్న, బసిరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, కాకాని వెంకటరత్నం, వసంత నాగేశ్వరావు వంటి నాయకులు దానికి సారథ్యం వహించారు. రైళ్లు, బస్సులు స్తంభించిపోయాయి, కమ్యూనికేషన్ నిలిచిపోయింది. శాంతిభద్రతలకు విఘాతం కలగడంతో ఆర్మీ రంగంలోకి దిగింది!

ఆర్మీకి – రాష్ట్రానికి మధ్య సమన్వయకర్త (లయజన్ ఆఫీసర్)గా ఎవరైనా ఒక బాధ్యత కలిగిన ఆఫీసర్ ఉండాలని పీవీ అభిప్రాయపడ్డారు. ఏదైనా జిల్లాలో కలెక్టరు, ఎస్పీ అడిగితే వెంటనే ఆర్మీని పంపించే బాధ్యత ఈ అధికారిది. ఇటు జిల్లా అధికారులు, ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారాన్ని, అటు ఆర్మీ అభిప్రాయాలను బేరీజు వేస్తూ, శాంతిభద్రతలను అదుపులో పెట్టడానికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవాలి.

ఆ పని నాకప్పగించారు. నేను విజయవాడలోని సర్క్యూట్ హౌస్‌లో మకాం వేశాను. శాంతిభద్రతలకు విఘాతం కలగడంతో ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు 1973 జనవరి 10న రాజీనామా చేశారు. రాష్ట్రపతి పాలన అమల్లోకి వచ్చింది. అప్పటి చీఫ్ సెక్రెటరీ వల్లూరి కామేశ్వరరావు, ఢిల్లీ నుంచి వచ్చిన ఉన్నతాధికారి హెచ్‌సీ సరీన్ – ఇద్దరినీ గవర్నర్‌కు సలహాదారులుగా వేశారు.

నాతోపాటు బ్రిగేడియర్ రామ్‌దాస్ ఉండేవారు. నేను తటస్థుణ్ణని కాకాని వెంకటరత్నం వంటి నాయకులకు నాపై నమ్మకం ఉండేది. ఉద్యమానికి సంబంధించిన

ప్రతి పరిణామాన్నీ నిశితంగా పరిశీలించడం నా విధి. అప్పుడు వివిధ ప్రాంతాలకు ఎవరికీ తెలియకుండా, అతి నిరాడంబరంగా వెళ్లొస్తూ ఉండేవాణ్ణి. యూనిఫామ్‌లో కాకుండా మామూలు దుస్తుల్లో ఉండే ఒక పోలీసు మాత్రం నాతో పాటు ఉండేవాడు. పరిస్థితి మరీ తీవ్రంగా ఉన్నప్పుడు కొన్నిసార్లు ఆర్మీ విమానాల్లో మా ప్రయాణం సాగేది. ఉద్యమం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో 'జై ఆంధ్రా' జెండా నా కారుకు కూడా పెట్టాల్సిన అవసరమొచ్చేది.

ఉద్యమంలో భాగంగా విద్యార్థులు బంద్‌కు పిలుపునిచ్చారు. అది అదుపు తప్పి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఎంతంటే ఆరోజు డిసెంబరు 23. విజయవాడ – కడప వంటి ప్రాంతాల్లో పరిస్థితిని అదుపుచెయ్యడానికి ఆర్మీ కాల్పులు జరిపింది. మొత్తం 13 మంది, ఒక్క విజయవాడలోనే ఎనిమిదిమంది చనిపోయారు!

కడప ఫైరింగ్‌కు సంబంధించి నాన్‌గెజిటెడ్ అధికారులు న్యాయవిచారణ కావాలని కోరారు. ఆ విషయంలో కలెక్టరును రక్షించడానికి అనేకమంది ప్రయత్నిస్తున్నారని వాళ్ల ఆరోపణ. మీడియా ఎన్జీఓల వాదనను యథాతథంగా ప్రచురించింది.

కడపలో ఆర్మీ ఫైరింగ్ పట్ల స్థానికుల్లో నిరసన వచ్చింది. హెచ్.సి.సరీన్‌గారు కలెక్టరు, ఎస్పీ వంటి ఉన్నతాధికారులతో మీటింగ్ పెట్టారు.

'ఏంటి ఇక్కడ జనాలు బాంబులు చేస్తున్నారట' అని అడిగారు సరీన్.

'ఇక్కడ బాంబులంటే వంటింట్లో కూరగాయల్లాగా వాడతారు సార్. వాటి పేర్లు కూడా అలాగే పెట్టుకుంటారు.. చిన్నవాటిని వంకాయ బాంబులని, కాస్త పెద్దవాటిని టెంకాయ బాంబులంటారు, వాటితో పెద్ద ప్రమాదం లేదు సార్..' అన్నాడు అప్పటి కలెక్టర్!

ఆ సమయంలోనే ఒక సెంట్రల్ రిజర్వ్ పోలీసు కానిస్టేబుల్ ఒక మహిళతో తప్పుగా ప్రవర్తించాడని అతనికి గుండు చేసి గాడిద మీద ఊరేగించారు జనాలు. సరీన్‌గారు దానిగురించి ప్రత్యేకంగా అడిగితే, ఎస్పీ అదేం లేదని దాటవేశాడు!

తర్వాత భోజనాల సమయంలో నేను 'ఏమయ్యా అందరికీ తెలిసిన విషయమేగా? అలా చెప్పావేం?' అనడిగాను ఎస్పీని. 'పెద్దవాళ్లు అడిగినప్పుడు ఎప్పుడూ నిజం చెప్పకూడదు సార్' అన్నాడు సింపుల్‌గా!

## చెప్పకుండా వచ్చేస్తారా?

పోలీసులు, ఆర్మీ అధికారులు, రాజకీయ కార్యకర్తలు, కేంద్ర–రాష్ట్ర– ఆర్మీలకు చెందిన ఇంటెలిజెన్స్ విభాగాలు, న్యాయవ్యవస్థల గురించి ఎన్నో విషయాలు ఆ సమయంలో నేను తెలుసుకున్నాను. అప్పట్లో ఆలిండియా రేడియో, ఒకటిరెండు దినపత్రికలు తప్పిస్తే, ప్రసారమాధ్యమాల విస్తృతి అంతగా ఉండేది కాదు. ఉన్నవాటిపై కూడా ఆంక్షలుండేవి. అందువల్లనే జై ఆంధ్రా ఉద్యమ సమయంలో విజయవాడ, కడప ఫైరింగ్ విషయాలుగాని, ఇతరత్రా వార్తలుగాని మీడియాకు పొక్కడం తక్కువ.

అల్లర్ల సమయంలో ముఖ్యకార్యదర్శి హెచ్‌సి సరీన్ విజయవాడ వచ్చారు. దాన్ని బయటకు పొక్కనివ్వలేదు. కనీసం విజయవాడ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అనుమతి కూడా లేకుండానే హైదరాబాద్‌లో ఆయన విమానం బయల్దేరింది! అప్పటికప్పుడు ఏటీసీ అధికారులను ఇళ్ల నుంచి తీసుకొచ్చి మరీ దాని ల్యాండింగ్‌కు అనుమతి ఇప్పించారు. ఇదంతా మూడో కంటికి తెలియనే తెలియదు. ఆయన వచ్చాక ఒక సమీక్షా సమావేశం పెట్టారు, తిరిగి వెళ్లారు.

మర్నాడు దినపత్రికల్లో వచ్చిన వార్త చూస్తే నాకు ఆశ్చర్యంతో నోట మాట రాలేదంటే నమ్మండి!

'ముఖ్య కార్యదర్శి హెచ్‌సీ సరీన్‌గారికి విజయవాడలో ఘన స్వాగతం పలికిన జనం, ఆయన సమావేశంతో ఎంతో సంతోషించిన సామాన్యులు....' ఇట్లా వచ్చాయి వార్తలు!!

జై ఆంధ్రా ఉద్యమ ఫలితంగా తెలంగాణలో ముల్కీ నిబంధనలను ఎత్తేశారు. అప్పటి ప్రతిపాదనలను అంగీకరించడంతో ఆరు సూత్రాల ఫార్ములా అమల్లోకి వచ్చింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయే వరకూ ఉద్యోగాలు, చదువులకు వర్తించిన ఆరు జోన్లు అమల్లోకి వచ్చింది నాటి ఉద్యమ ఫలితంగానే! మూడు ప్రాంతాల్లోని వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. వాటికి బోర్డులు ఏర్పాటయ్యాయి.

జై ఆంధ్రా ఉద్యమ ఉద్రిక్తత తగ్గడానికి కొన్ని నెలలు పట్టింది. పరిస్థితులు చక్కబడుతున్నాయనుకున్నప్పుడు ఆర్మీ వెనుదిరిగింది. నాకు మాత్రం విజయవాడలో పనేముంది? నేను హైదరాబాద్ వచ్చేశాను. చీఫ్ సెక్రెటరీ భగవాన్‌దాస్‌గారిని కలిశాను.

'ఏమీ చెప్పకుండా అలా వచ్చేశారేమిటి?' అడిగారాయన.

'ఇక నాకు అక్కడ పనేమీ లేదు కదా...'

'ఫార్మల్ ఆర్డర్లేమీ లేకుండా ఎలా వచ్చేస్తారు?'

నేనే సమాధానమూ చెప్పలేదు. నన్ను కలెక్టరుగా, జిల్లా మేజిస్ట్రేట్‌గా నల్గొండ జిల్లాకు వేశారు.

**తాతలిచ్చిన ఆస్తి**

1972 జనవరిలో నాకు మధుమేహం ఉన్నట్టు బయటపడింది. ఇప్పుడంటే అది సర్వసాధారణం కాని, అప్పట్లో అది చాలా పెద్ద విషయం కిందే లెక్క. మాత్రలు, ఇన్సులిన్ విరివిగా దొరకడం మాట అటుంచి, అసలు రక్తంలో చక్కెర స్థాయి ఎంత ఉందో తెలిసే పరీక్ష చేసే సదుపాయాలే అరుదుగా ఉండేవి మరి! పొద్దున ఆస్పత్రికి వెళితే సాయంత్రానికి ఫలితం తెలిసేది.

కొన్నాళ్లపాటు నేను గీతకు సైతం ఈ విషయం తెలియనివ్వలేదు. నా మధుమేహం సంగతి ఇంట్లో తెలిసేసరికి మా అమ్మతో సహా అందరూ తీవ్రంగా ఆందోళన చెందారు. అదొక పిడుగు పడినట్టు అనిపించింది అందరికీ. నేనేదో జబ్బు మనిషిననే భావన వాళ్లందరిలో రాకుండా ఉండేందుకు నేను వీలైనంత మామూలుగా ఉండటానికి ప్రయత్నించేవాణ్ణి. చక్కెర వ్యాధి అదుపు చెయ్యడానికి నేను చెయ్యంది లేదు! కొన్నాళ్లు రామానందయోగి దగ్గర యోగా క్లాసులు చేశాను, కాకరకాయ రసం తాగాను. మొలకెత్తిన గోధుమగడ్డి, మెంతులు తినడం, హోమియో వైద్యం.. ఒకటా రెండా. చివరకు రోజువారీ వ్యాయామం చెయ్యడం, తిండి పట్ల శ్రద్ధ పెట్టడం, ఇన్సులిన్ తీసుకోవడం – ఇవి చాలని నిర్ణయించుకున్నాను.

మధుమేహం నా ఉద్యోగంలో ఎలాంటి ఆటంకమూ కలిగించలేదుగాని, నేను నా పైవాళ్లకు, కిందవాళ్లకు కూడా దాని గురించి ముందస్తు జాగ్రత్తగా తెలియజేసేవాణ్ణి.

మా అమ్మమ్మ చక్కెర వ్యాధి వల్లనే నలభయ్యేళ్లకే చనిపోయింది. అప్పటికి నేను ఒక నెల పసిగుడ్డును. మా తాతక్కూడా మధుమేహం ఉండేది. దాన్ని అదుపులో ఉంచడానికి ఆయన మట్టిస్నానం, బురదస్నానం, ప్రకృతి చికిత్సల వంటివి ఎన్నో చేసేవారు. ఆయన డెబ్భయ్యేళ్ల వరకూ ఉన్నారు. ఇటువంటి కుటుంబ చరిత్ర ఉంది

గనుక 32 ఏళ్లకే నాకు డయబెటిస్ వస్తే నేను పెద్దగా ఆశ్చర్యపోలేదు. మా అమ్మమ్మ, తాతలతో పోలిస్తే నా సమయానికి, ఇప్పుడు మరింతగా వైద్యం అభివృద్ధి చెందింది.

1972 ఏప్రిల్ 12న మా అబ్బాయి ఆదిత్య నెల్లూరులో పుట్టాడు. వాడు పుట్టినప్పుడు నేను ఢిల్లీలో ఉన్నాను. ట్రెయిన్‌లో నెల్లూరుకు వెళ్లి వాణ్ణి చూశాను.

## దేవుడున్నాడా లేదా?

1973 సెప్టెంబరు ఏడో తేదీన నేను నల్గొండ కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించాను. ఆ డిసెంబరులో రాష్ట్రపతి పాలన ముగిసిపోయింది. తెలంగాణ ప్రాంతానికే చెందిన జలగం వెంగళరావు 1973 డిసెంబరు 10 తారీకున ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. ఆయన రెప్యుటేషనున్న అధికారులను ఎంచుకునేవారు. నమ్మితే ప్రాణమిచ్చే మనిషి. మృదుస్వభావి.

ముఖ్యమంత్రయ్యాక యాదగిరిగుట్ట నరసింహస్వామిని దర్శించుకుందామని వచ్చారు జలగం.

ప్రోటోకాల్ ప్రకారం నేను కూడా ఆయన వెంట వెళ్లాను. కాని గుడి లోపలికి మాత్రం రానన్నాను. ఎందుకని ఆయన అడిగితే, 'నేను దేవుణ్ణి నమ్మను. అందుకని గుడిలోకి రాను' అన్నాను. ఆయనేం మాట్లాడకుండా లోపలికెళ్లారు. ఆ సమయంలో నేను గెస్ట్‌హౌస్ దగ్గర పచార్లు చేస్తూ నాలో నేనే ఆలోచించుకున్నాను.

'అసలు దేవుడు లేదని నమ్మడం ఎలా? లేదన్నది నిశ్చయంగా తెలియదు. అసలు దేవుడి గురించి నాకేం తెలుసని? అలాంటప్పుడు నేను దూరంగా ఉండటం ఎందుకు?' ఇలా పరిపరి విధాల సాగాయి నా ఆలోచనలు.

అప్పట్నుంచి చాలాసార్లు యాదగిరిగుట్ట దర్శనానికి వెళ్లాను. ఎక్కడైనా గుడికి వెళ్లాల్సి వస్తే వెనకాడకుండా వెళ్తొస్తాను.

నల్గొండలో ఉండగా జరిగిన మరొక సంఘటన నా మనఃఫలకంపై చెదరని ముద్ర వేసింది.

ఒకసారి అక్కడ ప్రఖ్యాత వైద్యులు పెరుగు శివారెడ్డిగారు ఒక పెద్ద ఐ క్యాంప్ (కంటి శిబిరం) నిర్వహించారు. కలెక్టర్ని కనుక దాన్ని ప్రారంభించాల్సిందిగా

నన్ను ఆహ్వానించారు. నేను వెళ్లాను. ప్రారంభసూచకంగా ఒక కొబ్బరికాయ కొట్టి, శ్రీ వేంకటేశ్వరుడి చిత్రపటానికి హారతి ఇవ్వమన్నారు.

'నాకలాంటి వాటిలో పెద్ద నమ్మకం లేదు. మనం ఇప్పుడు శాస్త్రీయంగా, వైద్యపరంగా వాళ్లకు చికిత్స చెయ్యాలనుకుంటున్నాం. దానికి ఇవన్నీ ఎందుకు?' అని అడిగాను.

డాక్టర్ శివారెడ్డి ఓపిగ్గా సమాధానం చెప్పారు. 'సర్, ఈ పూజ మీ కోసం, నా కోసం కాదు. ఎంతోమంది రోగులు ఇక్కడ వేచి చూస్తున్నారు. వాళ్లలో నమ్మకం కలిగించడం కోసం మనం పూజ చెయ్యాలి. మన ప్రయత్నాలు మనం చేస్తున్నాం, వాటికి దేవుడి ఆశీస్సులు కూడా ఉంటాయన్న విశ్వాసం వాళ్లలో కలగాలి. అంతేకాదు, మనం వాళ్లకు మేలు చెయ్యడానికి కంకణం కట్టుకున్నామన్న భరోసా వాళ్లలో నిండాలి. అప్పుడే వాళ్లు ధైర్యంగా ఉంటారు. మీ కోసం కాకపోయినా, వాళ్లకోసమైనా చెయ్యలేరా?' అన్నారాయన.

నేను మారుమాట్లాడకుండా పూజ చేసి ఆ వైద్య శిబిరాన్ని ప్రారంభించాను.

## మళ్లీ ప్లానింగ్ గూటికి

ఒకసారి హైదరాబాద్ వెళ్లినప్పుడు ముఖ్యమంత్రి నన్ను పిలిపించారు.

'నల్గొండ కలెక్టరుగా ఉండటం మీకిష్టం లేదా' అని అడిగారు. నా ఆరోగ్య పరిస్థితి అంతా ఆయనకు వివరంగా చెప్పాను. 'రాజకీయ నాయకులు మీరే ఉండాలని పట్టుపడుతున్నారు మరి...' అంటూనే 'మీకు ఇబ్బందిగా ఉందంటే మార్చేస్తాం. ఇంతకీ మీరెక్కడ పని చెయ్యాలని అనుకుంటున్నారు?' అని ప్రశ్న కూడా సంధించారు.

నేను విఠల్‌గారిని సంప్రదించి చెబుతానన్నాను. ఆయన నవ్వి, విఠల్‌గారేం చెబుతారో తనకు తెలుసునన్నారు. 'ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌కేగా' అన్నారు. అంటే, విఠల్‌గారు నేను అక్కడకు రావడానికి అంతా సిద్ధం చేశారన్నమాటే.

అలా నేను 1974 ఏప్రిల్ 9న హైదరాబాద్‌కు వచ్చేశాను.

ఆ తర్వాత కొన్ని రాజకీయ పరిణామాల వల్ల కోస్తాంధ్రకు, తెలంగాణకు ప్రత్యేక డెవలప్‌మెంట్ బోర్డులు ఏర్పడ్డాయి. రాయలసీమ బోర్డులో అనుసరించిన విధివిధానాలనే వాటికీ పాటించారు. ఇది బాగా నడిచింది కనుక ఆ రెండు ప్రాంతాల

నాయకులు కూడా నా సలహాలూ సూచనలూ కోరుకున్నారు. తెలంగాణ బోర్డుకు ఛైర్‌పర్సన్ జగన్నాథరావు. కోస్తాంధ్ర బోర్డు ఛైర్‌పర్సన్ భవనం జయప్రద.

ఒకసారి తెలంగాణ బోర్డు సమీక్షా సమావేశం జరుగుతోంది. జగన్నాథరావు 'నా ప్రతిపాదనలు అమల్లోకి రాకుండా కావాలనే ఆలస్యం చేస్తున్నారు. దీనికి బోర్డు సెక్రెటరీ కూడా వంత పాడుతున్నారు..' అన్నారు అకస్మాత్తుగా.. సీఎమ్ జలగం వెంగళరావు సమక్షంలోనే! అనుకోకుండా మీద పడిన అభాండానికి నేను నిర్ఘాంతపోయాను.

'బోర్డు సెక్రెటరీని ఏమీ అనొద్దు. ఇక్కడ ఇన్‌చార్జిని నేనున్నాను...' అన్నారు విఠల్‌గారు. అంతలో సీఎమ్ సబ్జెక్ట్ మార్చేశారు. చర్చ వేరేవైపు వెళ్లిపోయింది. కాని నాకు కష్టంగా అనిపించింది. సెలవు పెట్టి ఇంటికెళ్లిపోయాను. మనస్తాపంతో రాజీనామా చేద్దామనుకున్నాను. ఆ విషయాన్ని విఠల్‌గారికి చెప్పాను. 'తొందరపడకు, ఉండు' అన్నారు.

తర్వాతి రోజు జగన్నాథరావు నాకు ఫోన్ చేశారు. 'నేనన్నది మీ గురించేం కాదు, మీరెందుకు ఆలస్యం చేస్తారు, మా రాజకీయ నాయకుల్నే అన్నాను..' అంటూ చెప్పుకొచ్చారు. జరిగిందేమంటే నేను మనస్తాపం చెందినట్టు విఠల్‌గారు వెంగళరావుగారికి చెప్పారట. ఎందుకలా అన్నారని ఆయన జగన్నాథరావుగారిని అడిగితే, ఆయన నాకు ఫోన్ చేశారు!

ఆ తర్వాత మరే ఇబ్బందీ లేకుండా నేను తెలంగాణ బోర్డు సెక్రెటరీగా పనిచేశాను. ఆ సమయంలో నాకు తెలంగాణ ప్రాంతీయులు ఆప్తులయ్యారు. వాళ్ల ఆకాంక్షలు, అవసరాలను నేను అర్థం చేసుకోగలిగాను.

అభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాలనూ జలగం బాగా పట్టించుకునేవారు. బ్రహ్మానందరెడ్డి ఛైర్మన్‌గా ఉన్న అప్పటి ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రానికి పుష్కలంగా నిధులివ్వడంతో అభివృద్ధికి పెద్ద పీట వెయ్యగలిగారు జలగం. సమావేశాలు పెట్టడం, అందరి అభిప్రాయాలూ వినడం, ఎవరు బాగా ఆలోచిస్తారో వాళ్ల అభిప్రాయాలకు విలువనివ్వడం, త్వరగా నిర్ణయాలు తీసుకోవడం – ఇదీ వెంగళరావుగారి తరహా. 'పీవీ నిర్ణయాలే తీసుకోలేదు. ఈయన నిర్ణయాలు తీసుకుంటారు, దేనికీ ఆగరు' అన్నారొక అధికారి ప్రశంసాపూర్వకంగా.

జలగం వెంగళరావు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లానింగ్ బోర్డు ఏర్పాటు చెయ్యాలనుకున్నప్పుడు విఠల్‌గారిని పిలిచి సభ్యుల పేర్ల గురించి సలహా అడిగారు. ఆయన వచ్చి నన్నడిగితే నిపుణులైనవాళ్ల పేర్లు కొన్ని రాశాను. తర్వాత ఆయన సీఎమ్‌గారి దగ్గరకెళ్లి 'వేణు వీళ్ల పేర్లు రాశాడు...' అని చూపిస్తే, 'అయితే ఇంకేం...' అంటూ వాళ్లను పెట్టేసి బోర్డు ఏర్పాటు చేసేశారాయన!

ఎమర్జెన్సీ సమయంలో దేశంలోని ఇతర ప్రాంతాల్లో కనిపించిన 'అతి' మన రాష్ట్రంలో లేకపోవడమే వెంగళరావు పనితీరుకు నిదర్శనం. అందువల్లే ఆ తర్వాత 1977లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్నిచోట్లా మట్టి కరిచినా, మన రాష్ట్రంలో ఒక్క నంద్యాల తప్ప అన్ని సీట్లూ గెలుచుకుంది!

## ప్లానింగ్ పదనిసలు

కేంద్ర ప్రభుత్వం ఐదో పంచవర్ష ప్రణాళికను ప్రకటించినప్పుడు 'ఆ.. ఇది ముందు ప్రణాళికలకు ఐదో రూపం.. అంతేతప్ప కొత్తదనం ఏముంది' అని ప్రొఫెసర్ రాజ్‌కృష్ణ వంటివారు పెదవి విరిచేశారు. కాని ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఐదో పంచవర్ష ప్రణాళిక (1974 – 79)లో అటువంటి విమర్శ తలెత్తకుండా మేం ఎంతో జాగ్రత్తపడ్డాం.

పంచవర్ష ప్రణాళికను ఐదు వార్షిక ప్రణాళికలుగా విడగొట్టి అందరితో చర్చించి బడ్జెట్‌లో చేరుస్తారు. మొట్టమొదటిసారి నేను వార్షిక ప్రణాళికను సిద్ధం చెయ్యబోయే ముందు విఠల్‌గారు నన్ను పిలిచి ముఖ్యమైన ప్రాజెక్టులేవి, దేనికెంత ప్రాముఖ్యాన్నివ్వాలి వంటివన్నీ చెప్పారు. చాలా పనుందని అనుకుంటూ లేవబోతుంటే రెండు పేజీలున్న డాక్యుమెంట్ నా చేతిలో పెట్టారాయన. 'వేణూ, ఇదేనయ్యా నీ ఏన్యువల్ ప్లాన్. దీన్ని అనుసరించి నీకిష్టమైనంత కవిత్వం రాసుకో. దీని ముసాయిదాను మనం ప్లానింగ్ కమిషన్‌కు పంపిద్దాం..' అన్నారు నవ్వుతూ.

దానర్థం – దేనికెంత ప్రాముఖ్యాన్నివ్వాలో ఎన్ని నిధులు కేటాయించాలో అప్పటికే ముఖ్యమంత్రి చెప్పేశారన్నమాట!

## పీహెచ్‌డీ పూర్తయ్యింది

వృత్తిలో తలమునకలుగా ఉన్నా, ఆర్థిక శాస్త్రంలో పీహెచ్‌డీ మాత్రం సగంలోనే ఆగిపోయిందే అన్న బాధ నన్ను వెంటాడుతూనే ఉండేది. హైదరాబాద్‌లోనే ఉన్నాను

కనుక దాన్ని పూర్తి చెయ్యాలని కంకణం కట్టుకున్నాను. 'ఐఏఎస్ సాధించి, మంచి ఉద్యోగంలో ఉన్నాక, ఇక పీహెచ్‌డీ చెయ్యడం ఎందుకు?' అనేవారు నా స్నేహితులు. నాకు మాత్రం ఎలాగైనా దాన్ని పూర్తిచెయ్యాలని పట్టుదలగా ఉండేది.

అంతకుముందు నేను పీహెచ్‌డీకి కావల్సిన అటెండెన్స్‌ను సాధించాను, కొన్ని ఆర్టికల్స్ పబ్లిష్ చేశాను. కాని ఇప్పుడు వ్యవహారమంతా మళ్లీ మొదటికి వచ్చింది. అప్పట్లో నాకు గైడ్‌గా వ్యవహరించిన వీవీ రామనాథం ఉస్మానియాని వదిలి ఐక్యరాజ్యసమితిలో పనిచెయ్యడానికి వెళ్లిపోయారు. పూర్వం నాకు పరిచయమున్న ప్రొఫెసర్లు జె. సత్యనారాయణ, జి. రామిరెడ్డిలను అడిగితే – భారతదేశంలో మల్టీ లెవల్ ప్లానింగ్ అనే అంశం ఎంచుకుంటే బాగుంటుందని సూచించారు. ప్రాంతీయ ప్రణాళికల తయారీలో నాక్కొంత అనుభవం ఉంది కాబట్టి నేను కూడా సరేనన్నా. అన్ని నిబంధనలనూ పూర్తి చేసి రీసెర్చ్ వర్క్ మొదలుపెట్టాను.

లండన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో ఉన్న ప్రొఫెసర్ హ్యూ గ్రే, కర్ణాటకకు చెందిన ప్రొఫెసర్ సుబ్బరామయ్య నాకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్లుగా వచ్చారు. మొత్తానికి నాకు పీహెచ్‌డీ పట్టా చేతికొచ్చింది! నా థీసిస్ ఆధారంగా వికాస్ పబ్లిషింగ్‌హౌస్ 1978లో 'మల్టీలెవెల్ ప్లానింగ్ ఇన్ ఇండియా' అనే పుస్తకాన్ని పబ్లిష్ చేశారు.

# ఆఫ్రికా నేర్పిన పాఠాలు

ఐక్యరాజ్యసమితిలోని సెంటర్ ఫర్ రీజనల్ అండ్ ఇంటర్మీడియెట్ డెవలప్‌మెంట్ – జపాన్‌లో ఉండేది.

ఆ కేంద్రం తమ పనికి సంబంధించి ఒక మాన్యువల్‌ను తయారుచెయ్యాలను కున్నది. దాన్ని సమగ్రంగా సమీక్షించి, అవసరమైన మార్పుచేర్పులు సూచించడానికి ఒక నిపుణుల బృందం ఉంటుంది. ఆ బృందంలో నేను సభ్యుడిగా ఉండాలంటూ ఐక్యరాజ్యసమితి నుంచి వర్తమానం వచ్చింది.

ఈ అవకాశం నాకెలా వచ్చింది?

అకడమిక్ జర్నల్స్‌లో నేను రాసిన వ్యాసాల వల్ల వారికి నా పేరు తెలిసింది. అంతేగాక, రాయలసీమ డెవలప్‌మెంట్ బోర్డులో నేను చేసిన పని వల్ల అంతర్జాతీయంగా మంచి గుర్తింపు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇద్దరు వైవీ రెడ్లున్నారు, ఒకరు ఐఏఎస్ అధికారి, మరొకరు మల్టీలెవల్ ప్లానింగ్‌లో నిపుణుడు... అనుకునేవారట. నేను ఆ బృందంలో సభ్యుణ్ణయ్యాక ఇద్దరు కాదు, ఒక్కరే అని తెలుసుకున్నారు.

మొత్తం పదిమంది సభ్యులున్న నిపుణుల బృందమంతా జర్మనీలోని బెర్లిన్‌లో సమావేశమయ్యాం. టేగల్ లేక్ తీరాన ఉన్న టేగల్ ప్యాలెస్‌లో మా విడిది. ఉన్న పదిమందీ పది దేశాలవాళ్లు. అందులో ఇరాన్ నుంచి వచ్చిన సభ్యుడి పరిజ్ఞానం చూసి నాకెంతో ఆశ్చర్యం అనిపించింది. ఆ తర్వాత ఆయన ఆ దేశానికి మంత్రి కూడా అయ్యారు.

మాన్యువల్ రూపొందించే పనిలో భాగస్థుడనవడం వల్ల ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. ఇండియా పట్ల అందరిలోనూ ఆసక్తి ఎక్కువగా ఉండేది. అందువల్ల మన దేశ విషయాలు, సంస్కృతీసంప్రదాయాలను వారికి వివరించే పని అప్పుడప్పుడు చేసేవాణ్ణి. గొప్పలు చెప్పకూడదు, తక్కువ చెయ్యకూడదు. అది కత్తి మీద సామే కదా.

మొత్తమ్మీద పుస్తక జ్ఞానాన్ని, ప్రపంచ జ్ఞానాన్ని సమన్వయం చేసే ఆ ప్రక్రియ నాకెంతో ఉపకరించింది.

ఐక్యరాజ్యసమితిలో పనిచెయ్యడం అనేది నేనెప్పటికీ మర్చిపోలేని అనుభవం. దానివల్ల అంతర్జాతీయ స్థాయి పాలసీల విషయంలో ఎలా వ్యవహరించాలో అర్థమయింది. బృందంలోని నిపుణుల అభిప్రాయాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవడం, మనవైన అభిప్రాయాలను పంచుకోవడం, ఇతర సంస్కృతీసంప్రదాయాల గురించి తెలుసుకోవడం, సమయానికి సందర్భానికి తగిన విధంగా మాట్లాడటం – ఇవన్నీ నా అవగాహనను పెంచాయి.

మాన్యువల్ పని పూర్తయిన తర్వాత నేను కొన్ని రోజులు సెలవు పెట్టాను. అంత దూరం వెళ్లాం కదాని నేను, గీత కలిసి ఫ్రాన్స్, నెదర్లాండ్స్, బ్రిటన్ వంటి దేశాలన్నీ తిరిగి ముఖ్యమైన ప్రదేశాలు చూశాం. కాని మా బడ్జెట్ చాలా తక్కువ. దానిలోనే సర్దుకుని వీలైనన్ని ప్రదేశాలు చూడాలనుకున్నాం. మా పొదుపు కార్యక్రమంలో భాగంగా పారిస్‌లోని ఎయిర్‌పోర్ట్‌లోనే నిద్రపోయాం! బ్రిటన్‌లోని వేల్స్‌లో మా చెల్లి, బావగారు ఉంటున్నారు కనుక వాళ్లింటికి వెళ్లిపోయాం.

## ఇటు ఫైవ్‌స్టార్ బస... అటు చక్రం తెలియని చోటు

తిరిగి వచ్చిన తర్వాత ప్లానింగ్ డిపార్ట్‌మెంట్లో నా పనిలో నేను మునిగిపోయాను. ఒకరోజు విఠల్‌గారు వచ్చి టాంజానియాలోని సింగిడా ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపకల్పన చేసే అవకాశం నాకు రాబోతోందని చెప్పారు. ఆ నిపుణుల బృందంలో వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, నీటిపారుదల, పరిశోధన, చిన్న తరహా పరిశ్రమలు, స్టాటిస్టిక్స్ – ఇలా కొన్ని రంగాలకు చెందినవారు సభ్యులుగా ఉన్నారు.

ఆ బృందానికి నాయకుడు ప్లానింగ్ కమిషన్‌కు సలహాదారైన ఆనంద్ సరూప్‌గారు. మన దేశం నుంచి ఒక బృందానికి ఒక ప్రాంతపు అభివృద్ధి ప్రణాళికను తయారుచెయ్యమని సూచించారు.

మొదట మేం దారుస్సలామ్ చేరుకున్నాం. అక్కడ మమ్మల్ని కిలిమంజారో హోటల్లో ఉంచారు. అదే మొట్టమొదటిసారి నేను ఫైవ్‌స్టార్ హోటెల్లో బస చెయ్యటం! ఏదో వెనుకబడిన ప్రాంతం అనుకుంటూ వెళ్లిన మాకు – అక్కడి మంత్రిత్వశాఖ

ముఖ్యంగా ఫైనాన్స్ సెక్రెటరీకున్న పరిజ్ఞానం చూస్తే ఆశ్చర్యమనిపించింది! ఆయన హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్నాడట! కొద్ది రోజులుండి, వాళ్ల నుంచి కావలసిన సమాచారాన్నంతా తీసుకున్న తర్వాత మా బృందం సింగిడాకు బయల్దేరింది.

అక్కడకు రోడ్డుప్రయాణంగాని, హెలికాప్టర్‌లోగాని వెళ్లాలి. ఆ ప్రదేశం గురించి బోధపడుతుంది కదాని మేం రోడ్డు ప్రయాణాన్నే ఎంచుకున్నాం. ఒక రోజంతా ప్రయాణించిన తర్వాత డడోమా అనే ప్రదేశంలో ఆగాం. అక్కడున్నది ఒకేఒక్క గెస్ట్‌హౌస్. రాత్రి బస చేసి మర్నాడుదయం బయల్దేరితే సాయంత్రానికి సింగిడా చేరుకున్నాం. చాలా కష్టతరమైన ప్రయాణం. పూర్తిగా అలసిపోయాం.

ఇంతాచేస్తే, సింగిడాలో ఉండటానికి ఓ వసతంటూ ఏమీ లేదు. ఉన్నదల్లా ఒక చర్చి. దానికి అనుబంధంగా చిన్న గెస్ట్‌హౌస్. అదికూడా మిషనరీలు ఎప్పుడైనా వస్తే ఉండటానికి. దానికి ఒక చిన్న వంటగది, డైనింగ్ హాలుండేవి. కొన్ని వారాల పాటు మేం అక్కడే ఉండాలన్నమాట.

స్థానిక అధికారులతో పాటు కలిసి పని మొదలుపెట్టాం. చిన్నచిన్న కుగ్రామాలను సైతం సందర్శించాం.

టాంజానియా ఆర్థిక వ్యవస్థ మూడు రకాలుగా ఉంది. ఒకటి : దారుస్సలామ్‌లో అంతా నగర సంస్కృతి. అక్కడ పాలపొడి కూడా యూరప్ నుంచి దిగుమతి చేసుకున్నదే. రెండో భాగం : తెల్లవాళ్లు నిర్వహిస్తున్న ప్లాంటేషన్లు. పనివాళ్లలో వివిధ జాతులవాళ్లుండేవారు. ఇక మూడో భాగం పై రెండిటి కన్నా పెద్దది. ఏ మాత్రం నాగరికత హంగులు తెలియని అడవి ప్రాంతం అది.

వాళ్లకు కనీసం చక్రం గురించి కూడా తెలియదు. వ్యవసాయానికి, రవాణాకు పశువులను ఉపయోగించుకోవచ్చని కూడ వాళ్లకు తెలిసేది కాదు. ఏ పనిముట్లూ లేకుండా, కేవలం చేతులతో ఆడవాళ్లే చేసేవారు! మగవాళ్ల పని కేవలం పశువులను మేపుకుని రావడం ఒక్కటే!

అప్పట్లో టాంజానియా ప్రభుత్వం 'ఉజమ్మా' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. సంచారులుగా జీవిస్తున్న బృందాలను ఒకచోట చేర్చి చిన్న ఊళ్లుగా తయారుచెయ్యాలనే లక్ష్యంతో అది మొదలైంది. గ్రామాలు ఏర్పడితే వాటికి విద్య, వైద్యం, తాగునీరు వంటి వసతులు కల్పించాలనే ఆలోచన ఉండేది. కాని అక్కడ సంచారులుగా జీవిస్తున్న మనుషుల కన్నా, వారి దగ్గరున్న పశువుల

సంఖ్య చాలా ఎక్కువ. వాళ్లంతా ఒకచోట ఉంటే పశువులు మెసలడానికి, మేతకు చుట్టుపక్కలున్న భూములు సరిపోవు. వ్యవసాయానికి, రవాణాకు పశువులను ఉపయోగించడం ఎలాగో మగవాళ్లకు నేర్పుదామనుకుంది ప్రభుత్వం. కాని అది నేర్పించాల్సింది ఆడవాళ్లకు. అలాగే వాళ్లకు అప్పటిదాకా పొదుపు అన్నమాటే తెలియదు. ఏ రోజుదారోజు సంపాదించుకోవడం, తినడం, తాగడం అంతే తప్ప, రేపటికి దాచుకోవడం అనేది లేదక్కడ. ఈ కారణాల వల్ల 'ఉజమ్మా' ఘోరంగా విఫలమయింది. ఒక వ్యక్తికి నలుగురు కన్నా ఎక్కువమంది భార్యలుండకూడదు అనే ఒక్క చట్టాన్ని మాత్రం అతి కష్టమ్మీద అమలుచెయ్యగలిగేవారు. అక్కడ భూమి మీద ఒక మనిషికని వ్యక్తిగతంగా కాకుండా కమ్యూనిటీలకు హక్కులుండేవి.

### మనవాళ్ల పెత్తనాలు

అంత దూరప్రాంతంలోనూ మన భారతీయులు కొందరు చిరువ్యాపారాలు చేసేవారు. కాని వాళ్లు తమను దోచుకుంటున్నారనే అభిప్రాయంతో స్థానికులు వీళ్లనంత ఆదరంగా చూసేవారు కాదు. అదొక్కటే కాదు, ఇండియన్లకు జాత్యహంకారం ఎక్కువని కూడా అక్కడివాళ్లు అభిప్రాయపడేవాళ్లు. ఉదాహరణకు అంతగా చదువు రాని భారతీయుడు ఒక డిగ్రీ ఉన్న ఆఫ్రికన్‌ని రంగు ఆధారంగా తక్కువగా చూసేవాడు!

టాంజానియాలో పని చేస్తున్నప్పుడు అందరితో కలిసిపోగలిగేవాణ్ణి. కిస్వాహేలీ భాషలో చిన్నచిన్న పదాలు కూడా నాకు ఒంటబట్టాయి. స్వాగతం అనడానికి 'కరిబా' అనాలని, కృతజ్ఞతలు చెప్పడానికి 'అసంతి సనా...' అనాలని తెలుసుకున్నాను. అక్కడివాళ్లు మొజాంబిక్ స్వాతంత్ర్యాన్ని సెలెబ్రేట్ చేసుకుంటుంటే నేనూ వాళ్లతో జత కలిశాను.

'మీరు ఇండియన్ కాదేమో. ఇండియన్ అయితే మాతో ఇంత ఆదరంగా ఉంటారా?' అని వాళ్లడిగినప్పుడు మాత్రం నాకు మనవాళ్ల మీద పట్టరానంత కోపం వచ్చేది.

మన వారాంతపు సంతల్లాగే వాళ్లకూ సంతలుండేవి. ఎక్కువమంది పళ్లూ ఫలాలూ తినేవారు. అదికాదంటే పశువులో ఏ భాగం కావాలంటే దాన్ని అప్పటికప్పుడు నిప్పుల మీద కాల్చిఇచ్చేవారు.

అలాగే వాళ్లకు ఏ రకమైన ఎక్కువతక్కువలూ లేవు. ప్రధానమంత్రయినా డ్రైవరు పక్కన కూర్చుంటాడు. ఒకరు కుర్చీలో, మరొకరు కిందన కూర్చునే పద్ధతి లేదు. చేతిలో బరువుతో ఎవరైనా కనిపిస్తే ఎదుటివాళ్లు దాన్ని అందుకుని మోస్తారు.

విచిత్రం ఏమంటే అక్కడ కొందరు సింహాలతో సమానంగా పరిగెత్తి, వాటి తోకలను కోసి తేగలిగేవారు. అలా కోసి తెచ్చినవాడు వీరుడంటూ ఒక ప్రత్యేకమైన ఈకనిచ్చి సత్కరించేవారు. అయితే వాళ్లకు ఏనుగులంటే మాత్రం చెప్పలేనంత భయం. వాటిని మచ్చిక చేసుకోగలిగే కళ వాళ్లకు అప్పటికి తెలియదు. ఏనుగులు సింహాలకన్నా క్రూరమైనవనే అభిప్రాయంలో ఉండేవారు.

మా బృందమంతా ఏదో సమావేశానికని అరుషా నగరానికి వెళ్లి కిలిమంజారో పర్వతాన్ని చూసొచ్చాం. అప్పుడే మేం గొరాంగొరో, సెరెంజెటీలను చూశాం.

క్షేత్రస్థాయి పర్యటన తర్వాత రిపోర్టు తయారు చెయ్యాలి. వివిధ రంగాల నిపుణులను కలిసి, మాట్లాడి చెయ్యాల్సిన పనది. బృందంలో ఎక్కువమందికి తమ పరిజ్ఞానాన్నంతా అక్కడ ప్రదర్శించాలనే తపన తప్ప, అక్కడి సమస్యలకు పరిష్కారాలను సూచించడంలో ఉండేది కాదు.

మా బృంద నాయకుడు ఆనంద్ సరూప్ వ్యక్తిగతంగా ఎంతో మంచివారు, ఆప్యాయంగా ఉంటారు. పని కచ్చితత్వం విషయంలో ఆయనకు సంతృప్తి కలిగించడం చాలా కష్టం! మేం తయారుచేసిన రిపోర్టుకు ఆయన ఆమోదం లభించడానికి మాకు చుక్కలు కనిపించాయి. ఆ ట్రిప్ ముగిసే సమయానికి నాకాయన పెద్దన్న మాదిరి అయ్యారు. టాంజానియా వంటి సుదూర ప్రాంతం, సంక్లిష్టమైన జీవనశైలి, చేపట్టినది బృహత్కార్యం... అయినా మేం పూర్తి చేసిన పని ఎంతో సంతృప్తినిచ్చింది.

**చివరి మజిలీ అదే కదా...**

నేను టాంజానియాలో ఉన్నప్పుడే హైదరాబాద్ బంజారాహిల్స్‌లో స్థలం కొని ఇంటి నిర్మాణం మొదలుపెట్టాం. ఇప్పుడంటే బంజారాహిల్స్ అత్యంత సంపన్న ప్రాంతం. కాని 1975 –76 ప్రాంతంలో అదంతా ఖాళీ ప్రదేశం. కొనడానికి బాగా చవగ్గా దొరికేది. ఎందుకంటే, అదంతా కొండలుగుట్టలుగా రాళ్లతో నిండి ఉండేది. సరైన రోడ్లు ఉండేవి కాదు. అంతేనా? రోడ్ నెంబర్ 12 మొదట్లో ఒకవైపు గుడిసెలుండేవి, మరోపక్క శ్మశానం ఉండేది. అందుకే అక్కడ ఎవరూ కొనడానికి

ఆసక్తి చూపించేవారు కాదు. కొందరు ఐఏఎస్‌లు మాత్రం చవగ్గా వస్తోంది కదాని ధైర్యం చేసి అక్కడ ఇళ్ల స్థలాలు కొనుక్కున్నారు. వాళ్లలో నేనూ ఒకణ్ణి.

'శ్మశానానికి దగ్గరగా ఇల్లేమిటి?' అని ఈసడించేవాళ్లు కొందరు.

'ఎవరికైనా చివరి మజిలీ అదే కదయ్యా. అందుకే నేను ముందుగానే దగ్గరగా కొనుక్కుంటున్నా...' అని సమాధానం చెప్పి పంపేసేవాణ్ణి.

ఆ ఇంటి కోసం మొజాయిక్ కొందామని పాతబస్తీలో ఒక దుకాణానికి వెళ్లాను. నా పేరు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అని చెబితే ఆ దుకాణదారుడు 'అచ్ఛా సాబ్, అడ్వాన్సు వద్దులెండి' అన్నాడు. నేను వెళ్లబోతుండగా 'మీ క్లినిక్ ఎక్కడ సాబ్?' అని అడిగాడు. నేను మెడికల్ డాక్టరును కానని చెప్పేసరికి 'అలాగైతే అడ్వాన్సు ఇచ్చి వెళ్లండి' అన్నాడు!

బంజారా హిల్స్‌లోని మా ఇల్లు బీపీఆర్ విఠల్‌గారింటికి ఎదురుగా ఉండేది. సినీనటి జమునగారిల్లూ మా ఇంటికెదురుగానే ఉండేది. ఒకసారి మా ఇంటికొకరు వచ్చి 'సినిమా హీరోయిన్ జమునగారిల్లేది' అని అడిగారు. మేం చూపెట్టాం.

అక్కడికెళ్లి 'వేణుగోపాలరెడ్డిగారిల్లు ఎక్కడండి?' అని అడిగి మా ఇంటికి వచ్చారు. నిజానికి వాళ్లు నాతో పనుండి వచ్చారు. నేనెవరో తెలియక జమునగారింటికి ఎదురిల్లు అంటూ కొండగుర్తు పెట్టుకున్నారు!

# హైదరాబాద్ చిత్రాలెన్నెన్నో...

**టాం**జానియా నుంచి తిరిగివచ్చాక రెండేళ్ల పాటు నేను ప్లానింగ్‌లో డిప్యుటీ సెక్రెటరీగా పనిచేశాను. ఒకరోజు ముఖ్యమంత్రి వెంగళరావుగారు పిలిపించి, హైదరాబాద్ జిల్లా కలెక్టరుగా బాధ్యతలు చేపట్టాలని చెప్పారు. అప్పట్లో ఇప్పుడున్న రంగారెడ్డి జిల్లా హైదరాబాదులో కలిసే ఉండేది. విడిగా ఉండేది కాదు.

'సర్ మీకు తెలుసు కదా, నాకు కలెక్టరుగా చెయ్యాలని లేదు. ఇంతకు ముందొకసారి చేశాను. ఇక్కడ చాలా రాజకీయ ఒత్తిడులుంటాయి. నేను వాటికి లొంగను. అందుకే ఆ పోస్ట్‌లో లేకపోతేనే నయం కదా...'

'ఆ భయమేం వద్దు. మీరు ఏ రికమెండేషన్లకూ లొంగనవసరం లేదు. మీరు ఒత్తిడిని తట్టుకోగలరనే మిమ్మల్ని రమ్మంటున్నా.. నేనున్నాగా..'

'మరి మంత్రులెవరైనా ఒత్తిడి పెడితే?'

'మీరు వాళ్లు చెప్పేదంతా వినండి చాలు, మంచివైతే చెయ్యండి, కానివి చెయ్యనవసరం లేదు..'

'అయితే సర్, ఒకవేళ మీరే ఏదైనా ఒత్తిడి పెడితే? అప్పుడేం చెయ్యాలి?' అన్నాన్నేను.

'నేను చేసినా సరే, మంచిదైతే తప్పకుండా చెయ్యండి. సరైనది కాదనిపిస్తే నాకు తెలియజెయ్యండి. మీకు సరైనది కాదనిపించిందేదీ మీరు చెయ్యనవసరం లేదు. ఏ సమస్య ఉన్నా నాకు వెంటనే చెప్పండి...' అని అభయమిచ్చారాయన. ఆయన మాట మీద నేను 1976 ఫిబ్రవరిలో హైదరాబాద్ జిల్లా కలెక్టరుగా విధుల్లో చేరాను.

ఆ సమయంలో హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల మీద అంతగా శ్రద్ధ పెట్టలేకపోతున్నామని నాకు అర్థమయింది. దాంతో దాన్ని నగర – గ్రామీణ జిల్లాలుగా రెండుగా విడగొట్టాలనే ప్రతిపాదన పెట్టాను. ఆ తర్వాత చాలా

ఏళ్లకు ఆ ప్రతిపాదన అమల్లోకి వచ్చింది, హైదరాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లా కొత్తగా ఆవిర్భవించింది!

## వెట్టిచాకిరి లేదంటే ఎలా?

నేను హైదరాబాద్ కలెక్టరుగా ఉండగా, దేశవ్యాప్తంగా వెట్టిచాకిరిపై ప్రభుత్వ సర్వే జరుగుతోంది. మన రాష్ట్రంలో వెట్టిచాకిరి ఉందా, ఉంటే దానిపై ఏం చర్య తీసుకున్నారని కలెక్టర్ల రిపోర్టు ఇవ్వమన్నది ప్రభుత్వం. మామూలుగా విచారణ చేస్తే అలాంటిదేం లేదని తేలింది, అదే నివేదిక నేను పంపేశాను.

ఆ తర్వాత ఒక ఊళ్లో ఒక భూస్వామి అప్పు తీర్చలేదని వ్యవసాయ కూలీల మీద చాలా ధాష్టీకాలు చేస్తున్నాడని తెలిస్తే అక్కడకు వెళ్లాను. ఆ విచారణలో – తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడానికి పేదలు జీవితాంతం కూలికి ఉంటారని తెలిసి నేను నివ్వెరపోయాను! కాని దాన్ని వెట్టి చాకిరి అంటారని వాళ్లకు తెలియదు. అందువల్లే ఆ తరహా కేసు ఒక్కటి కూడా బయటపడలేదు మా నివేదిక సమయానికి!

ఇక అప్పుడు మళ్లీ పని మొదట్నుంచి మొదలెట్టాను, మరో కోణంలో.

ప్రతి గ్రామంలో అప్పు తీసుకున్నవారెవరు, ఎవరి దగ్గర తీసుకున్నారు, ఎలా, ఎంత కాలంలో తీరుస్తున్నారు, ఎవరి దగ్గర పనిచేస్తున్నారు... ఇలా రుణాల కోసమంటూ విచారణ మొదలుపెట్టాను. అప్పుడు కనిపించింది నాకు – వెట్టి విశ్వరూపం!

పంటల కోసమో, పెళ్లో, చావో, అనారోగ్యమనో, కరువో... ఏదో ఒకటి, సామాన్యుడితో అప్పు చేయిస్తుంది, చాలీచాలని బతుకు దాన్ని తీర్చనివ్వదు. అది తీరే మార్గం – చాకిరి చెయ్యడమొకటే. చాలా హీనమైన, ఘోరమైన పరిస్థితుల్లో చేసే పనికి వాళ్లకి దక్కేది రోజూ గుప్పెడు తిండి, ఏడాదికో జత బట్టలు, చెప్పులు మాత్రమే. ఒకవేళ ఏ పరిస్థితిలోనైన అప్పు తీసుకుని పని చేస్తున్న మనిషి చెయ్యలేకపోయినా, చనిపోయినా వారి బిడ్డలు ఆ బాధ్యతను భుజానేసుకోవాలి తప్ప గత్యంతరం లేదు. ఈ తరహా అగ్రిమెంట్లు రాతపూర్వకంగా ఉండేవి.

మొత్తం జిల్లా యంత్రాంగాన్నంతా కదిలించాను. అధికారులు ఊరూరా, ఇల్లిల్లూ తిరిగారు. ఎక్కడైనా మామూలు అప్పులు కాక, వెట్టిచాకిరి ఉన్నట్టు తెలిస్తే చాలు, అక్కడికక్కడే ఆ పత్రాలను నాశనం చేసి, వాళ్లను దాన్నుంచి విముక్తులను

చేసేసేవాళ్లం. మళ్లీ అటువంటి వాటి జోలికి పోమని కూడా భూస్వాములతో రాయించుకుని తీసుకొచ్చేవాళ్లం.

మామూలుగానైతే వెట్టికి ఉంచుకున్నవాళ్లను న్యాయపరంగా విచారించవచ్చు. కాని నేనలా చెయ్యలేదు. ఎందుకంటే ఒక్కరా, ఇద్దరా? ఎంతమందినని విచారించగలం? దానికెంతో సమయం హరించుకుపోతుంది. అలాకాకుండా గ్రామస్థాయిలో పరిష్కారానికే కృషి చేశాను. అది మంచి ఫలితాలనే ఇచ్చింది. కొద్ది కాలంలోనే జిల్లాలో భూస్వాములు, పేదలు, అధికారులు – అందరి ఆలోచనల్లోనూ మార్పొచ్చింది. ముఖ్యంగా వికారాబాద్ డివిజన్‌లో రాజయ్య అనే రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఎంతో ఉత్సాహంగా ఆ పనిలో పాలుపంచుకునేవాడు.

ఆ రోజుల్లో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల హవా చాలా ఎక్కువగా ఉండేది. ఒకటి రెండు తారీకుల్లో జీతాలు రాగానే ఉద్యోగుల దగ్గర లాక్కున్నంత పని చేసేవారు. వరకట్న నిషేధ చట్టంలాగానే, మనీ లెండర్స్‌కు సంబంధించిన చట్టం కూడా ఉంది. కానీ దాన్ని పటిష్ఠంగా అమలుచెయ్యలేకపోయానని నా మీద నాకు అసంతృప్తిగా ఉంటుంది.

ఆ రోజుల్లో ఢిల్లీలో ఉండే సీహెచ్ హన్మంతరావుగారికి మంచి ఆర్థికవేత్తగా పేరుండేది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎకనమిక్స్ విభాగాన్ని బాగా పరిపుష్టం చేద్దామనే ఆలోచన ఉండేది. అప్పుడు ఆయన్ని సంప్రదించాను. 'నేనొక్కణ్ణే కాదు, ఒక బృందంగా వస్తాం' అని హామీనిచ్చారాయన. కాని ఎందుకో ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

## నేను కూడా సెలవు పెట్టగలిగితే

నేను హైదరాబాద్ కలెక్టరుగా ఉన్నప్పుడు ఎమర్జెన్సీ అమల్లో ఉండేది. సంజయ్‌గాంధీ పర్యటనకు వస్తున్నట్టు తెలిసింది. నేను విమానాశ్రయానికి వెళ్లి ఆయన్ని స్వాగతించాలని ప్రోటోకాల్ విభాగం నాకు తెలిపింది. నేను వెంటనే ముఖ్యమంత్రిగారిని కలిశాను.

'సర్, ఆధికారికంగా ఏ హోదా లేని వ్యక్తికి నేనెలా స్వాగతం ఇవ్వగలను? నన్నీ ఇరకాటం నుంచి తప్పించండి. నన్ను బదిలీ చేసేయండి...' అని అడిగాను.

'మిమ్మల్ని బదిలీ చెయ్యడం నాకిష్టం లేదు. కాని మీ ఇబ్బంది తప్పాలంటే, సెలవు పెట్టి వెళ్లిపోండి ఆ సమయానికి...' అన్నారు. నేను దానికి సమ్మతించాను.

నేను ఆ గది నుంచి బయటికొస్తుంటే ఆయనన్నారు కదా... 'నేను కూడా సెలవు పెట్టి వెళ్లిపోగలిగితే ఎంత బాగుండు...' అని!

ఎమర్జెన్సీ రోజుల్లో అధికారులు, నాయకులు – ఒకరనేముంది, అందరి ఫోన్ల మీదా నిఘా ఉండేది. 'నువ్వు ఫోన్లో కొంచెం తక్కువ మాట్లాడితే మంచిదేమో...' అని చెప్పారు మొహమాటంగా విఠల్‌గారు నాకొకరోజు.

అదేంటి సార్ అంటే సాక్షాత్తూ ముఖ్యమంత్రే 'ఆ వేణుగోపాలరెడ్డికి కొంచెం చెప్పవయ్యా...' అన్నారట ఆయనతో!

★ ★ ★ ★ ★

ఎమర్జెన్సీ నాటిదే ఈ ముచ్చట కూడా. మగవాళ్లకు తప్పనిసరిగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించమని జిల్లా అధికారుల మీద బోలెడంత ఒత్తిడి ఉండేది. హైదరాబాద్ జనాభాలో అధికులు ముస్లిములే. వాళ్ల ఆచారం ప్రకారం కుటుంబ నియంత్రణ మహా పాపం. దాంతో దాన్ని అమలు చెయ్యాల్సిన అధికారులకు చచ్చే చావొచ్చేది.

'నిర్బంధంగా కుటుంబనియంత్రణ అమలు చెయ్యకూడదు...' అని కలెక్టరుగా నేను వివిధ శాఖల అధికారులకు పదేపదే చెప్పేవాణ్ణి.

ఆ రోజుల్లో ఒకసారి మా అబ్బాయిని అత్యవసరంగా రాత్రిపూట ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లాం. పసివాడికి చికిత్స ప్రారంభించకుండా 'మీరు కుటుంబ నియంత్రణ చేయించుకున్నారా...' అని అడిగారు. 'ముందు పిల్లవాడి సంగతి చూడండయ్యా...' అన్నాను. ఈలోగా మా సిబ్బంది వచ్చి నేను కలెక్టరునని చెప్పాక మావాడికి చికిత్స చేశారు!

కలెక్టరు ఆదేశాలు కూడా అమలుకు నోచుకోనివి కొన్ని ఉంటాయని నాకు తెలిసొచ్చిన సంఘటన అది.

## సివిల్స్‌లో మనవాళ్లు

ఢిల్లీలో 'రావూస్ స్టడీ సర్కిల్' చాలా విజయవంతంగా నడుస్తోంది. దాన్ని చూశాక గ్రామీణ ప్రాంతాల యువతను సివిల్ సర్వీసుల్లో చేరేలా ప్రోత్సహిస్తే బాగుంటుందని అనిపించేది మా స్నేహబృందానికి. హైదరాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు ఆ ఆలోచన తీవ్రమయ్యింది. నా ప్రయత్నంలో ఆంజనేయరెడ్డి, యార్లగడ్డ

రంగనాయకులు, ఎన్వీజీ రెడ్డి వంటి కొందరు సీనియర్ సివిల్ సర్వెంట్లు కూడా వచ్చి కలిశారు. హైదరాబాద్‌లో ఏమాత్రం లాభాపేక్ష లేకుండా ఒక కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించాం. ఢిల్లీ నుంచి రావుగారు వచ్చేవారు, అభ్యర్థులకు కోచింగ్ ఇచ్చేవారు.

హైదరాబాద్ స్టడీ సర్కిల్ ఫీజు చాలా తక్కువ. ఎంతోమంది గ్రామీణ ప్రాంతాల యువకులు వచ్చి చేరేవారు. ఢిల్లీలాగా కాకుండా, హైదరాబాద్‌లో దాదాపు అందరికీ బంధువులో, మిత్రులో ఉండేవాళ్లు కనుక, వసతి కోసం ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వచ్చేది కాదు. కోచింగ్ పక్కాగా ఉండేలా మేం చూసుకునేవాళ్లం. దాంతో అక్కడ చదివిన అభ్యర్థులకు మంచి ర్యాంకులు వచ్చేవి. హైదరాబాద్ స్టడీ సర్కిల్ పేరు మారుమోగిపోయింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా అభ్యర్థులు ఇక్కడకు వచ్చి చేరేవారు.

సివిల్ సర్వీసుల్లో ఎక్కువమంది ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులే ఉన్నారనే పేరొచ్చింది! అంత ఎక్కువమంది గ్రామీణ విద్యార్థులు సర్వీసుల్లోకి ఎలా వస్తున్నారో అధ్యయనం చెయ్యడానికి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అడిషనల్ సెక్రెటరీ హైదరాబాద్ స్టడీ సర్కిల్‌కు వచ్చారు!

కొన్నేళ్లు స్టడీ సర్కిల్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌కు కూడా కోచింగ్ ఇచ్చేది. పదో తరగతి పూర్తిచేసిన పల్లెటూరి పిల్లల కోసం తక్కువ ఖర్చుతో వసతి, భోజనం ఏర్పాటు చేసేది. స్టడీ సర్కిల్ ప్రారంభించిన ఏడాదికి నేను ఢిల్లీకి వెళ్లిపోయాను. తర్వాత అంతా నా స్నేహితులే చూసుకున్నారు, ఎంతోమంది యువత అధికారులుగా రూపొందేలా శ్రమించారు. వాళ్ల కృషి ఫలితంగా పదిహేనేళ్ల కాలంలో హైదరాబాద్ స్టడీ సర్కిల్‌కు చాలా గొప్ప పేరూప్రతిష్ఠా లభించాయి. ఆ తర్వాత స్టడీ సర్కిల్లో పనిచేస్తున్న అధ్యాపకులు కొందరు బయటికెళ్లి విడిగా కోచింగ్ సెంటర్లు పెట్టుకున్నారు. అలా ఢిల్లీ వంటి నగరాలకు దీటుగా హైదరాబాద్ కూడా సివిల్స్ కోచింగ్‌కు చిరునామాగా మారింది.

**'ఈనాడు' పత్రిక ప్రారంభానికి....**

అప్పటికి – తెలుగులో మంచి దినపత్రిక లేని లోటు కొట్టొచ్చినట్టు తెలుస్తూ ఉండేది. దాన్ని పూరించేలా ఒక వార్తాపత్రికను తీసుకొస్తే బాగుంటుందన్న కోరిక మా స్నేహితుల్లో బలంగా ఉండేది. ఢిల్లీలో పాత్రికేయుడిగా పనిచేస్తున్న నరేంద్రరెడ్డితో

పాటు మరికొందరు మిత్రులూ ఆ ఆలోచన సరైనదేనని సమర్థించారు. వారంతా 'మిత్రబృందం ఎంటర్‌ప్రైజెస్' ఏర్పాటుచేసి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి రుణం తీసుకున్నారు. పెట్టబోయే పత్రిక పేరు 'ఈనాడు' అని రిజిస్టర్ అయింది. ఎడిటర్‌గా అబ్బూరి రామకృష్ణారావుగారిని అనుకున్నాక, ఆయన దగ్గరుండి పేపర్ లోగో, ఫార్మట్ అన్నీ తయారు చేయించారు. తొలి ఎడిషన్ కర్నూల్ నుంచి రావాలి, ఆ తర్వాత హైదరాబాద్ నుంచి రావాలన్నది వారి ఆలోచన. దానికి తగ్గట్టే కర్నూల్లో భవనం అద్దెకు తీసుకొని ముద్రణ యంత్రాలనీ కొనేసి తరలించారు. ఢిల్లీలో యూఎన్‌ఐ చీఫ్‌గా ఉన్న డి. సీతారామ్ పూనుకుని – వార్తల ప్రచురణకు యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూఎన్‌ఐ) కనెక్షన్ వచ్చేలా చేశారు.

అప్పుడు సర్వే చేయిస్తే, పాఠక ఆదరణ అపూర్వంగా ఉండబోతోందని తేలింది. డిమాండ్ ఉన్నన్ని ప్రతులు అచ్చువేసి అమ్మితే నష్టం. ఎందుకంటే పత్రిక మొదలుపెడుతూనే ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ గ్రేడింగ్ ఇవ్వదు. అందువల్ల పెద్ద వ్యాపార ప్రకటనలేమీ రావు. ప్రకటనల్లేకుండా పత్రిక ఎన్ని ఎక్కువ ప్రతులు అమ్మితే అంత నష్టం. పోనీ డబ్బున్నవాళ్లు, ప్రముఖుల సాయం తీసుకుందామంటే – 'అలా తీసుకుంటే పత్రిక సొంత వ్యక్తిత్వమంటూ నిలబడదు, స్వాతంత్ర్యం ఉండదు. అయిందానికీ కానిదానికీ తలొంచక తప్పని పరిస్థితి వస్తుంది, అందువల్ల ఎవరి సాయమూ వద్దు మనకి' అనుకుని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు!

అప్పటికే కర్నూల్లో ఉంచిన యంత్రాలన్నిటినీ అమ్మేసి, చేసిన అప్పులు తీర్చేశారు. విచిత్రమైన యాదృచ్ఛికం ఏమంటే – ఆ తర్వాత కొద్ది కాలానికే అదే పేరుతో, దాదాపు అటువంటి లోగోతో విశాఖపట్నం నుంచి కొత్త పత్రిక ప్రారంభమయింది!

## భూపరిమితిలో నా పరిమితులు

భూ పరిమితి చట్టం అమలు చెయ్యడం పట్ల నాకు చాలా ఆసక్తి ఉండేది. అయితే రాజకీయ నాయకుల బంధువులు, స్నేహితుల దగ్గరకు వచ్చేసరికి నా తీరు వాళ్లకు నచ్చేది కాదు. నా ప్రయత్నాలకు ఎలాగైనా అడ్డం కొట్టాలని వాళ్లు ప్రయత్నించేవారు. వెట్టి చాకిరి అంతమొందించడంలో నేనెంత విజయవంతమయ్యానో, ఇందులో అంతగా ఓటమి పాలయ్యే సూచనలు కనిపించేవి.

ఈ కేసుల్లో నాకు అండగా ఉన్న ప్రభుత్వ ప్లీడర్‌ను డిస్మిస్ చేసేదాకా వెళ్లింది వ్యవహారం.

ఒకరోజు సాయంత్రం ముఖ్యమంత్రిగారి ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణస్వామి రావుసాహెబ్‌గారిని కలిశాను.

'కేంద్ర ప్రభుత్వంలో డిప్యుటీ సెక్రెటరీగా పనిచెయ్యడానికి మీరు ఎంపికయ్యారు. ఇక్కణ్ణుంచి డిప్యుటేషన్ మీద వెళ్లాలి' అంటూ వర్తమానాన్ని అందించారాయన. 'ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ మన్మోహన్ సింగ్ ఆ మంత్రిత్వశాఖలో మీరుండాలని గట్టిగా కోరుకొంటున్నారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి వాటితో డీల్ చెయ్యడానికి ఒక ముఖ్యమైన స్థాయిలో సమర్థులు కావాలట ఆయనకు. అంత పెద్దవాళ్లు మీరుండాలని కోరుకున్నాక, రాష్ట్ర ప్రభుత్వం పంపకపోతే బాగుండదు. అదీగాక, ఢిల్లీలో... అంత ముఖ్యమైన అసైన్‌మెంట్‌లో పనిచెయ్యడం మీ కెరీర్‌కు చాలా మంచిది...' అంటూ చెప్పారాయన.

దాంతో నేను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని వదిలి వెళ్లాల్సిన సమయం ఆసన్నమయ్యింది.

# సముద్రంలో నీటిబొట్టును

సముద్రంలో నీటిబొట్టు అనే మాటను అంతకు ముందెన్నోసార్లు విన్నానుగాని, ఆ భావనెలా ఉంటుందో కేంద్ర ప్రభుత్వంలో చేరాకే నాకు అర్థమయిందంటే అతిశయోక్తి కాదు. 1977 మేలో నేను కేంద్ర ఆర్థికశాఖలోని ఎకనామిక్ అఫైర్స్ విభాగంలో డిప్యుటీ సెక్రెటరీగా చేరడంతో అది నాకు అనుభవానికి వచ్చింది!

అసిస్టెంట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్, కలెక్టర్.... ఇలా వివిధ హోదాల్లో జిల్లా కేంద్రాల్లో పని చేస్తున్నప్పుడు ఐఏఎస్ అధికారుల రోజువారీ సౌకర్యాలన్నీ చూసుకోవడానికో వ్యవస్థ ఉంటుంది. ఇంటి వసతి, పిల్లలకు స్కూళ్లు, ఆస్పత్రి సేవలు, రేషన్ కార్డులు, ఇతరత్రా గుర్తింపు కార్డులు... ఇలాంటివన్నీ చాలా సందర్భాల్లో ప్రభుత్వం సమకూర్చిన పర్సనల్ అసిస్టెంట్లే చేసిపెడతారు. వాళ్లు చూపించిన చోట ఐఏఎస్‌లు సంతకాలు చేస్తే చాలన్నట్టు ఉంటుంది. ఇలా వాళ్లీ పనులన్నీ చెయ్యాలని చట్టబద్ధంగా ఎక్కడా ఉండదు. కాని పై అధికారుల పట్ల గౌరవంతో, అదొక సంప్రదాయంగా అవి జరిగిపోతాయి.

అక్కణ్ణుంచి రాష్ట్ర రాజధానులకు వచ్చినప్పుడే ఐఏఎస్‌లకు సగం రెక్కలు విరిగినట్టవుతుంది. అధికార ప్రదర్శన, హంగూ ఆర్భాటం అంతా ఒక్కసారిగా మాయమైపోయినట్టనిపిస్తుంది. ఆ వైనమంతా నేను గుంటూరు కలెక్టరు పదవి నుంచి, హైదరాబాద్ ప్లానింగ్ కమిషన్‌కు వచ్చిన సందర్భంలో లోగడ చెప్పాను చూడండి, అచ్చం అలానే ఉంటుంది.

ఇక రాష్ట్రాన్ని వదిలి కేంద్ర సర్వీసుల్లో చేరినప్పుడూ అంతే. ఢిల్లీలో వందల మంది ఐఏఎస్‌లలో మనమూ ఒకరం. అక్కడ ఎవరి పనులు వాళ్లే చేసుకోవాలి. అప్పటిదాకా చిన్నాచితకా అన్నిటికీ వేరొకరిపై ఆధారపడటం అలవాటయిపోతుందేమో, అప్పటికప్పుడు సొంత పనులన్నీ స్వయంగా చక్కబెట్టుకోవాలంటే తల ప్రాణం తోకకొస్తుంది.

అద్దె ఇంటి కోసం, పిల్లల అడ్మిషన్ల కోసం... ఆఖరికి కూరగాయలు కొనడానికైనా సరే, ఐఏఎస్‌లు సొంతంగా... కాళ్లరిగేలా తిరగాల్సిందే. ఆ సమయంలో చాలామందికి ఒక్కసారిగా తాము దిక్కుమాలిన వాళ్లమయ్యామని అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదు.

కేంద్ర సర్వీసులకు ఢిల్లీ వచ్చిన ఐఏఎస్‌లకు తాత్కాలిక నివాసం ఒకటి పడేస్తారు. నాకూ అలాగే కర్జన్ రోడ్డులో ఓ సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ దొరికింది. ఒకటీరెండూ కాదు, పదిహేను నెలల దాకా దానిలోనే సర్దుకోవాల్సి వచ్చింది. ఎంత ప్రయత్నించినా మాకంటూ ఒక సదుపాయమైన ఇల్లు దొరకనే లేదు!

అదృష్టవశాత్తు నా స్నేహితుడు నరేందర్‌రెడ్డి, ఆయన భార్య కుల్సుమ్‌లు మాకు తోడుగా నిలిచారు. మేం ఇంటిమీద బెంగపెట్టుకోకుండా చూసేవారు. రఘునాథరెడ్డిగారి అబ్బాయి శ్రీనాథరెడ్డి ఎయిమ్స్‌లో కార్డియాలజిస్ట్‌గా పనిచేసేవారు. ఆయన కుటుంబమూ మాతో స్నేహంగా ఉండేది.

ఒక్క ఇంటి వేటతో అయిపోలేదు నా కష్టాలు.

అప్పుడు మా పాప కవితకు ఏడేళ్లు, బాబు ఆదిత్యకు ఐదేళ్లు. వాళ్ల స్కూల్ అడ్మిషన్ల కోసం నేను పడిన శ్రమ అంతాఇంతా కాదు. స్కూల్ ప్రిన్సిపాల్ అపాయింట్‌మెంట్ దొరకడానికే చుక్కలు కనిపించాయి. నరేందర్‌రెడ్డి భార్య కుల్సుమ్ ప్రొఫెసర్‌గా పనిచేసేవారు. ఆమె సాయంతో యూజీసీ ఛైర్మన్ రికమెండేషన్ సంపాదిస్తే మా పాపకు మోడర్న్ స్కూల్లో సీటు దొరికింది. ఆ స్కూల్లోనే రాహుల్ గాంధీ కూడా చదివేవాడు. అతన్ని స్కూలుకు దింపడానికి, తీసుకెళ్లడానికి రాజీవ్ – సోనియాలు తరచూ వచ్చి వెళ్లేవారని మా అమ్మాయి చెప్పేది.

ఒకసారి మా ఆవిడ గీత మా అమ్మాయి కవితని, నరేందర్ కూతురు సబీనానీ తీసుకుని ఎగ్జిబిషన్‌కు వెళ్లింది. అక్కడ పొరపాటున వాళ్లిద్దరూ తప్పిపోయారు. అయితే కంగారు పడకుండా తెలివిగా ఇద్దరూ వెళ్లి పోలీసులకు విషయం చెప్పారు. మా పేర్లు తప్ప, మేమేం చేస్తామో, ఎక్కడుంటామో.. ఏమీ చెప్పలేకపోయారు పిల్లలు. కాని ఇద్దరూ 'మేం రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిగారి మనవరాళ్లం' అని చెప్పేశారు! నీలం సంజీవరెడ్డిగారి కుటుంబంతో మాకు మంచి పరిచయమే ఉంది. ఆయన భార్య నాగరత్నమ్మగారు మా అమ్మ పట్ల చాలా అభిమానం చూపేవారు. ఒకసారి మేం పిల్లల్ని తీసుకుని వాళ్లింటికి వెళ్లొచ్చాం. అది గుర్తు పెట్టుకుని ఈ పిల్లలు 'ఆయన మా

తాతగారు' అని చెప్పేశారు! దాంతో అలెర్టయిన పోలీసులు పిల్లల్ని రాష్ట్రపతి భవన్‌కు అప్పజెబుదామనుకునేలోగా వీళ్లు కనిపించడం లేదంటూ గీత కూడా అక్కడికే చేరింది. దాంతో కవిత – సబీనాలు తప్పిపోయిన కథ సుఖాంతమయింది.

ఇక మా ఆదిత్యకు టైనీటాట్స్ స్కూల్లో ఏ సిఫార్సూ లేకుండానే సీటు దొరికింది. కాకపోతే స్కూలుకెళ్లి రావడానికి వాడు బస్సులో చాలా దూరం ప్రయాణం చెయ్యాల్సి వచ్చేది. ఒకరోజైతే ఇంటి దగ్గర స్టాపులో దిగకుండా అలాగే నిద్రపోయాడు! బస్సు డిపోకు వెళ్లిపోయింది. చివర్లో బస్సు అటెండెంట్ చూసుకుని మళ్లీ తీసుకొచ్చి దిగబెట్టాడు.

ఢిల్లీలో ఉన్నప్పుడు పని ఒత్తిడి, తరచూ విదేశ పర్యటనల కారణంగా నా కుటుంబం పట్ల చూపించాల్సినంత శ్రద్ధ చూపించలేకపోయేవాణ్ణి. అది తల్చుకుంటే నాకు ఇప్పటికీ బాధగా ఉంటుంది. అయితే ఆ కాలంలో కొన్ని మధురానుభూతులు లేకపోలేదు.

మా అమ్మాయి కవిత ఎప్పుడూ పుస్తకాల్లో, తన ఊహాలోకాల్లో తానుండేది. దానికి సరిగ్గా విరుద్ధంగా ఉండేవాడు మా అబ్బాయి ఆదిత్య. ఐదేళ్ల వయసులో అసలెవరూ పట్టుకోలేనంత చురుగ్గా ఉండేవాడు. వాడి అల్లరి గురించి ఐపీఎస్ అధికారిగా పనిచేస్తున్న నా ఫ్రెండ్ వి. అప్పారావు కథలుకథలుగా చెప్పేవాడు. 'ఆదిత్య రావడం పోవడం అంతా తుఫానులాగా ఉంటుంది. ఓ పిల్లగ్యాంగునంతా వేసుకొస్తాడు, ఫ్రిజ్జులోని తినే వస్తువులన్నీ మాయం చేస్తాడు...' అనేవాడాయన.

క్రమంగా మేం ఢిల్లీ జీవితానికి అలవాటుపడ్డాం. మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన జేకే సిబాల్ – సునీత దంపతులు, మహారాష్ట్ర కేడర్‌లో పనిచేసిన వల్లూరి నారాయణ – రజని దంపతులు మా కుటుంబ స్నేహితులయ్యారు. అలాగే ఎస్. వరదాచారిగారు, ఎస్.కె.గోయల్ కుటుంబాలతో పాటు, మా నాన్నగారి స్నేహితులు పైడి లక్ష్మయ్యగారబ్బాయి డాక్టర్ పిఎల్ సంజీవరెడ్డి కుటుంబమూ మాకు స్నేహమాధుర్యాన్ని పంచారు.

## మూడు నెలలు మూగనోము పట్టా

ఆర్థిక శాఖలో ఫండ్ డెస్క్ బాధ్యతలు చూడటమంటే అత్యంత ప్రతిష్ఠాత్మకం. ఫండ్ బ్యాంక్ డివిజన్‌లోని ఈ డెస్క్ ప్రధానంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వ్యవహారాలను చూస్తుంది, అలాగే ప్రపంచ బ్యాంకులతో భారత ప్రభుత్వ లావాదేవీలను చూస్తుంది.

నిజానికి ఈ సబ్జెక్టులు నాకు పూర్తిగా కొత్త. అత్యంత కీలకమైన డెస్కుకు అన్యమనస్కంగా వచ్చిన నన్ను చూసి డిపార్ట్‌మెంట్‌లో నా సహోద్యోగులకు అసౌకర్యంగా ఉండేది. నా పైన బాస్‌దీ అదే పరిస్థితి. ఎందుకంటే నన్నీ పోస్టుకు ఎంపిక చేసింది ఆర్థికవ్యవహారాల కార్యదర్శి (ఎకనామిక్ అఫైర్స్ సెక్రెటరీ) మన్మోహన్ సింగ్. ఆయన నా బాస్‌కు బాస్!

ఒకరోజు నన్ను సెక్రెటరీగారికి పరిచయం చేద్దామని నన్నాయన గదికి తీసుకెళ్లారు నా బాస్. వెళ్లగానే మన్మోహన్ సింగ్ నా చేతులు పట్టుకొని 'నా డిపార్ట్‌మెంట్‌లో చేరడానికి మీరు అంగీకరించినందుకు నాకెంతో ఆనందంగా ఉంది...' అంటూ అభిమానంగా షేక్‌హాండిచ్చారు!

ఆయన మాటలు నాక్కాస్త బలాన్నిచ్చాయిగానీ, బాస్‌తో బంధాన్ని మాత్రం బలపర్చలేకపోయాయి. డెస్కులో సహచరుల సహకారమూ అంతంత మాత్రంగానే ఉండేది. ఎవరి పని ఎంత వరకు చెయ్యాలో అంతవరకు చేసుకువెళ్లే వాళ్లు. వంద రోజుల పాటు నిశ్శబ్దంగా అన్నిటినీ గమనించి, పనిని ఆకళింపు చేసుకోవాలనే వ్యూహాన్ని ఎంచుకున్నాను.

నా దగ్గరకు వచ్చే ప్రతి ఫైలునూ క్షుణ్ణంగా చదవడం, దానికి సంబంధించిన మిగిలిన ఫైళ్ల గురించి అడగడం, సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలను ఔపోసన పట్టడం... ఇదే పని. వంద రోజుల పాటు! మొత్తం విషయాలన్నీ అర్థమయ్యేదాకా, వీలున్నంత వరకూ ఫైళ్లపై ఏమీ రాయకూడదని పెన్ను కట్టేశా.

నా అత్యంత సన్నిహిత మిత్రులతో తప్పిస్తే, ఎవ్వరితోనూ మాట్లాడేవాణ్ణి కాదు. ఆఫీసులో ఎవరేది అడిగినా 'చెక్ చేసి చెబుతాను...' అంటూ రికార్డెడ్ సమాధానం ఇచ్చేవాణ్ణి.

ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ మూడునెలలూ మూగనోము పట్టేశానంతే. నా తీరు చూసి కొంతమంది సహోద్యోగులు నిజంగానే నేను మూగవాణ్ణేమో అనుకునేంతగా మౌనం పాటించాను. ఆ మూడు నెలలూ పూర్తి స్థాయి అధ్యయనానికే కేటాయించుకున్నాను.

వంద రోజుల్లో – 'నాతో పాటు పనిచేస్తున్న వారికన్నా కాస్త ఎక్కువే తెలుసు' అన్న నమ్మకం నాలోనాకు కలిగింది. అప్పుడు ధైర్యంగా మాటల్లోనే కాకుండా, ఫైళ్లపై రాతల ద్వారానూ మాట్లాడటం మొదలుపెట్టాను.

## ఇద్దరి లక్ష్యమూ అభివృద్ధే, కాని...

ఫండ్ బ్యాంకు డిప్యుటీ సెక్రెటరీ ఐఎమ్ఎఫ్, వరల్డ్ బ్యాంక్‌తో మన దేశం తరఫున సమన్వయం చెయ్యాలి. ప్రపంచ బ్యాంకు నిధులిచ్చే ప్రాజెక్టులను గుర్తించడం, నిధులు, ప్రణాళికలపై సంప్రదింపులు జరపడం, వాటి అమలును తుదివరకూ పర్యవేక్షించడం మరో ముఖ్యమైన విధి.

ఇందులో భాగంగా ప్రణాళిక సంఘం, వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒక వంక, ప్రపంచ బ్యాంకు అధికారుల బృందాలతో మరోవంక మాట్లాడాల్సి వచ్చేది.

మన ప్రణాళిక సంఘం, ఆర్థిక మంత్రిత్వ శాఖలేమో అప్పటికే నిర్ణయించుకున్న ప్రాథమ్యా(ప్రయారిటీ)ల ఆధారంగా, తమ పద్ధతుల ప్రకారం ప్రాజెక్టులకు ప్రపంచ బ్యాంకు నుంచి నిధుల్ని సంపాదించాలని చూస్తూ ఉంటాయి. ప్రపంచ బ్యాంకు 'కేవలం నిధులు మంజూరు చేసి ఊరుకోవడం కాదు మా పని....' అనే భావనతో ప్రాజెక్టుల వారీగా తనవైన షరతులు విధించడానికి ప్రయత్నించేది.

సాధ్యమైనన్ని తక్కువ షరతులతో ఎక్కువ నిధులు పొందాలన్నది ప్రణాళిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వాల తపనైతే, ఎక్కువ షరతులతో తక్కువ మొత్తం ఇచ్చి, ఎక్కువ మన ప్రభుత్వాలతోనే ఖర్చు పెట్టించి అభివృద్ధిలో తనదైన ముద్ర వెయ్యాలని ప్రపంచ బ్యాంకు చూసేది.

ఇదంతా చదువుతున్నప్పుడు మన ప్రభుత్వమూ, ప్రపంచబ్యాంకూ ఏదో శత్రువర్గాలన్న భావన కలుగుతుందేమో. అందుకే ఈ విషయాన్ని కొంత జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

ఇద్దరిదీ ఒకటే ఉమ్మడి లక్ష్యం – అది అభివృద్ధి. మనం ఓ ప్రాజెక్టు రూపురేఖలను నిర్ణయించుకుంటాం, వ్యయమెంతో, సాధకబాధకాలేమిటో, ఎన్ని నిధులు కావాలో ఒక అంచనా వేసుకుంటాం. వాటిని ప్రపంచ బ్యాంకు ముందు పెట్టి నిధులు కోరతాం.

ప్రపంచ బ్యాంకు ఆ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసి నిధులిస్తుంది. కాని అవి దుర్వినియోగం, నిరుపయోగం కాకుండా ఉండేందుకు వీలైనన్ని ఎక్కువ షరతులు పెట్టాలనుకుంటుంది. అలాగని తాను మొత్తం నిధులేమీ ఇవ్వదు. ప్రభుత్వం ఎక్కువ నిధులు అందులో పెట్టేలా ప్రయత్నిస్తుంది. తద్వారా స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యాన్ని పెంచి, వాళ్ల సామర్థ్యాన్ని పెంచుదామని ప్రయత్నిస్తుంది.

ఇలాంటి నేపథ్యంలో మన ప్రభుత్వమూ, ప్రపంచ బ్యాంకూ పరస్పరం చర్చించుకుని ఒక అంగీకారానికి రావడం ముఖ్యం. దానికోసం పలు విడతలుగా సంప్రదింపులు అవసరమవుతాయి.

సంప్రదింపులకు ప్రపంచ బ్యాంకు అధికారులు పక్కా ప్రణాళికతో, బాగా హోమ్‌వర్క్ చేసి, చక్కని వ్యూహాలతో వస్తారు సాధారణంగా. దానికి ఇక్కడి వారి కార్యాలయం, సిబ్బంది, సమాచారం – అన్నీ కలిసొస్తాయి. మన బృందానికి అటువంటి వ్యవస్థ, సమాచారం ఉండేవి కావు. దాంతో సంప్రదింపుల సమయంలో అవతలి వారితో కన్నా, మనలో మనకు సమన్వయం సాధించడమే పెద్ద సమస్యగా ఉండేది!

అలాగని ప్రపంచ బ్యాంకుది మనకన్నా పైచెయ్యి అనుకుంటే పొరపాటే.

ఆ సంస్థకు మంచి రుణగ్రహీతలు కావాలి! అప్పటికి మన దేశం భారీగా రుణాలు తీసుకునేది, తీసుకున్నవి సరిగ్గా ఖర్చుచేసేది. ప్రపంచబ్యాంకులో సభ్యత్వం పొందటం ద్వారా ఆ తర్వాత ఆ స్థానాన్ని చైనా ఆక్రమించుకుంది!

తీసుకున్న నిధులను సద్వినియోగం చేస్తుందనే పేరు మన దేశానికి సానుకూలాంశం. వీటన్నిటి వల్లా ప్రపంచ బ్యాంకులోని వివిధ విభాగాలు భారత్‌కు తమ ప్రాజెక్టులు మంజూరు చెయ్యడానికి పోటీపడుతుండేవి. కాబట్టి మనకు అవసరమున్నవీ, అనుకూలమైన షరతులున్న శాఖలకు సంకేతాలు పంపే వీలుండేది. మనకున్న పరపతిని ఉపయోగించి ఇచ్చేవాడి నుంచి ఎక్కువ సంపాదించేందుకున్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవచ్చనిపించింది నాకు.

అధికార స్థాయిలో కొంత, అనధికార స్థాయిలో కొంత – వెసులుబాటిచ్చే సంకేతాలు కీలకం. అయితే ఆ వ్యూహాల్ని చాలా జాగ్రత్తగా రూపొందించుకోవాలి. సంప్రదింపుల్లో పాల్గొనే బృంద సభ్యుల్లో ఎవరికేం చెప్పాలో, ఎంత చెప్పాలో... అంతే చెప్పాలి.

సాధారణంగా ఈ సంప్రదింపులు ఐదు రోజుల పాటు వాడిగా వేడిగా సాగేవి. కొన్ని మీటింగుల తర్వాత నేననుకున్న పద్ధతే వీటికి ఉపకరిస్తుందన్న నమ్మకం నాలో బలపడింది. ప్రపంచ బ్యాంకులో భారతీయ ప్రాజెక్టులు చూసే నిపుణులు, అలాగే అక్కడ పనిచేసే భారతీయ నిపుణులు – వాళ్లకు ప్రపంచ బ్యాంకు ఆలోచనల దశాదిశా తెలుస్తుంది. వాళ్లతో వ్యక్తిగత స్థాయిలో చర్చలు సాగితే అది ఇరుపక్షాలకూ మేలు చేస్తుంది. ఈ అవగాహనతో సంప్రదింపుల ప్రక్రియలో నాదైన ఒక ఫార్ములాను తయారుచేశాను.

ఆ సమయంలో ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా డాక్టర్ ఎస్.ఆర్.సేన్ ఉండేవారు. ఆయన తర్వాత ఎమ్. నరసింహం ఆ స్థానంలోకి వచ్చారు. వాళ్లిద్దరూ అర్థశాస్త్రవేత్తలు. కాని ఇద్దరికీ ప్రాజెక్టులు, వివిధ విభాగాలు – మరీ ముఖ్యంగా రాష్ట్రస్థాయిలోని వాటి గురించి పెద్దగా అవగాహన ఉండేది కాదు. దాంతో నేను అప్పటికే ప్రపంచబ్యాంకులో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు వి. ఎన్. రాజగోపాలన్, జె. మురళి, దేవవ్రత్‌దత్‌లతో పాటు ఐఎమ్ఎఫ్‌లో పనిచేస్తున్న ఆరికెపూడి ప్రేమ్‌చంద్ వంటి వారి మార్గదర్శనం కోరేవాణ్ణి. వీళ్లందరివల్ల ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్ వ్యవహారాలు, పనితీరు నాకు బాగా అర్థమయ్యాయి.

ఆ తర్వాత రోజుల్లో ప్రేమ్‌చంద్‌గారు నాకు ఫ్రెండ్, గైడ్, ఫిలాసఫర్‌గా అయ్యారు. ఇప్పటికీ ఆయన నాకు చాలా విషయాల్లో స్ఫూర్తినిస్తూ ఉంటారు. ఆయన అవగాహన, జ్ఞానం అపారం. తన పనిలో చూపే నిబద్ధత అందరి మన్ననలందుకునేది.

ప్రపంచబ్యాంకుతో చర్చలు (నెగోషియేషన్లు) జరగడంలో నేనుంటే మేలు జరుగుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖలోని నా బాసులే కాకుండా, ఇతర మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు కూడా గుర్తించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇటు ఢిల్లీలో, అటు వాషింగ్టన్‌లోనూ కూడా నమ్మకమైన మధ్యవర్తిగా మారాను!

ఫండ్ – బ్యాంక్ డెస్క్‌లో నా ఉద్యోగం క్లిష్టమైన విషయాలను నేర్చుకునే అవకాశం కల్పించింది.

ఆ సమయంలో జాతీయ ప్రణాళికల్ని దగ్గర్నుంచి చూశాను. అందులోని ఆర్థికం, పట్టణాభివృద్ధి, నీటి సరఫరా, వ్యవసాయం – ఇలా వివిధ శాఖల పథకాలకు సంబంధించి దేశవిదేశాల్లో తయారైన పత్రాల్ని అధ్యయనం చేశాను. అలాగే వివిధ రాష్ట్రాలు చేపట్టిన ప్రాజెక్టులు, విభిన్న పరిస్థితులు, పాలనా యంత్రాంగాలు ఎదుర్కొనే

సవాళ్లను తెలుసుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో బిడ్డింగ్, దాని పర్యవసానాలను అర్థం చేసుకున్నాను. ఫండ్ – బ్యాంక్ డెస్కులో నేనున్నది 15 నెలలు. అంటే తక్కువ సమయమే. కాని నా వరకు అది ఎంతో అమూల్యమైన సమయం.

**ఒకే ఒక పోస్టుకు...**

ఇలా సాగుతుండగా ప్రపంచ బ్యాంకులో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ అయే సమయం వచ్చింది. ప్రపంచ బ్యాంకులో మన దేశం ప్రతినిధిగా పని చేసే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కు (ఈడీ)తలలో నాలుకలా మెలగాల్సిన కీలకమైన పదవి అది. అప్పటికి ఈడీగా పనిచేస్తున్న ఎమ్. నరసింహం ఎవరిని సూచిస్తే వారికే ఆ పోస్టు దక్కుతుందని అనుకున్నారు అందరూ.

అనూహ్యంగా ప్రొఫెసర్ మన్మోహన్‌సింగ్ ఆ పోస్టుకు నా పేరును ప్రతిపాదించడం, అన్నిరకాలుగా అర్హతలున్నాయంటూ ప్రభుత్వం వెంటనే అంగీకరించడం జరిగిపోయింది!

నా పేరు ప్రతిపాదించే ముందు మన్మోహన్‌సింగ్ నరసింహంగారితో మాట్లాడారట. ‘నాకు వైవీరెడ్డి ఎవరో తెలీదు. అలాంటప్పుడు ఆయన పేరు ప్రతిపాదిస్తే నేను తెలుగువాడిని గనక తెలుగువాడి పేరును ప్రతిపాదిస్తున్నారనుకుంటారు అందరూ..’

ఇలాంటి కారణాలతో నరసింహం వెనకాడారు. కాని మన్మోహన్‌సింగ్ ‘నేను ఎంచుకున్నది ఇతన్నే..’ అని స్పష్టంగా నా గురించి చెప్పారట. అడిషనల్ సెక్రెటరీ మల్హోత్రా పిలిచి, నేనా పోస్టుకు ఎంపికవడం గురించి అభినందిస్తూ అధికారిక లేఖను నా చేతిలో పెట్టారు.

1973లో టాంజానియాలో పని చేసిన తర్వాత యూఎన్‌డీపీ ద్వారా విదేశాల్లో పని చెయ్యడానికి ఇష్టపడ్డాన్నేను. 1974 – 77 మధ్య జాంబియా, ఇరాన్, పశ్చిమ సమోవాల్లో ప్రాంతీయ ప్రణాళికాభివృద్ధి కోసం నా పేరు పరిశీలనకు వచ్చింది. అయినా అది కార్యరూపం దాల్చలేదు. ప్రపంచబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆఫీసులో పనిచేసే మంచి అవకాశం నాకు వచ్చింది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుకున్నాను.

# లక్ష్మీసరస్వతులిద్దరూ కరుణించిన వేళ

ప్రపంచబ్యాంకులో మన దేశపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఎం. నరసింహంగారు పనిచేస్తున్న సమయంలో – 1978 సెప్టెంబరులో ఆయనకు టెక్నికల్ అసిస్టెంట్‌గా ఆ సంస్థలో అడుగుపెట్టి, అక్కడ ఐదేళ్ల పాటు పనిచేశాన్నేను.

అప్పటికి మన దేశంతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా ఆయనే ప్రాతినిధ్యం వహించేవారు. అంటే ఆఫీసంతా కలిపి మేమిద్దరమే. ఇద్దరు పీయేలుండేవారు.

తర్వాత 'టెక్నికల్ అసిస్టెంట్' అన్న పోస్టు పేరు అడ్వైజర్‌గా మారింది. ఆ రోజుల్లో ఈడీకి అడ్వైజర్ ఒకరే ఉండేవారు.

ఈడీ ముఖ్యమైన విధి ఏమంటే – అటు ప్రపంచ బ్యాంకు లక్ష్యాలు, ఇటు తన మాతృదేశ ప్రయోజనాలు... రెండూ నెరవేరేలా చూడటం. ఒక్కముక్కలో చెప్పాలంటే ఈడీ అనే వ్యక్తి తన దేశానికి ఆర్థిక దౌత్యవేత్త అన్నమాటే. ఆయనకు సహాయపడే అడ్వైజర్ పరిస్థితి కూడా కొంచెం అటూఇటూగా అంతే ఉంటుంది. మేం ఇటు మన దేశానికి సంబంధించిన ప్రాజెక్టులు, వాటి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి, మరోవైపు ప్రపంచ బ్యాంకు ఉద్దేశాలు నెరవేరేలా చూడాలి.

ఇదంతా సవ్యంగా జరగాలంటే అడ్వైజర్ పట్ల దేశ ప్రభుత్వానికి, అధికారులకూ నమ్మకం ఉండాలి, అలాగే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కూ అతని సామర్థ్యం పట్ల నమ్మకం ఉండాలి.

అడ్వైజర్‌గా పనిచెయ్యడం వల్ల నేను సొంతంగా నిర్ణయాలు తీసుకోనవసరం లేదుగాని, ఎన్నో ముఖ్యమైన విషయాల లోతుపాతులు పరిశీలించే అవకాశం కలిగింది. ఆ సమయంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, వాటి అభివృద్ధి, వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు, రాజకీయాల వల్ల ఆర్థిక వ్యవస్థల్లో వచ్చే మార్పులు, ప్రపంచ బ్యాంకుకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్), ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు

వంటి సంస్థలకు మధ్య ఉండే సంబంధాలు.... ఇలా ఎన్నో ముఖ్యమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం కలిగింది.

వీటన్నిటితో పాటు, ఆర్థికపరమైన దౌత్యనీతిని, చాలా అత్యున్నత స్థాయి పాలసీ సమావేశాలను దగ్గర్నుంచి చూసి అర్థం చేసుకోవడం సాధ్యమయ్యింది.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బోర్డు వారంలో రెండు రోజులు సమావేశమవుతుంది. బోర్డులోని వివిధ కమిటీలు మిగిలిన రోజుల్లో సమావేశమవుతుంటాయి. ఈ సమావేశాలకు అవసరమైన సమాచారాన్ని పోగుచెయ్యడం, దేశదేశాల అధికారులు, ప్రతినిధులతో చర్చలు జరపడం ప్రపంచ బ్యాంకు ఉద్యోగుల కర్తవ్యం.

అన్ని బోర్డు మీటింగులకూ అడ్వైజర్లు తప్పనిసరిగా హాజరవుతారు, ఈడీ లేనప్పుడు అంత స్థాయిలోనూ వారి తరఫున పనిచేస్తారు. ఇటు దేశ ప్రభుత్వాలుగాని, అటు ప్రపంచ బ్యాంకుగాని వాళ్లడిగిన సమాచారాన్ని క్షణాల్లో ఇవ్వాల్సిందే.

బోర్డు సమావేశాలకు ముందుగానే – సమావేశాల్లో చర్చించబోయే అంశాలకు సంబంధించిన సమాచారాన్ని క్షుణ్ణంగా చదివేవాణ్ణి. తెలియనివి, బాగా అర్థం కానివీ ఏమైనా ఉంటే మా ఈడీ నరసింహంగార్ని అడిగి తెలుసుకునేవాణ్ణి.

ఢిల్లీలోని అధికారులతో నాకు మంచి స్నేహం ఉండటంతో వివిధ ప్రాజెక్టులు, నిధుల విషయంలో మన దేశ విభాగం కూడా నన్ను తరచూ సంప్రదిస్తూ ఉండేది. మన ప్రయోజనాలు పెంచడం కోసం నాకు మంచివని తోచిన సలహాలూ, సూచనలూ ఇచ్చేవాణ్ణిగాని, నేను ప్రపంచ బ్యాంకు అధికారిని కనుక, వీళ్ల సంప్రదింపుల్లో ఆధికారికంగా భాగస్వామినయ్యే అవకాశం మాత్రం ఉండేది కాదు.

## ఇద్దరమ్మలూ దయచూపారు

ప్రపంచబ్యాంకు ఉద్యోగం నిర్వర్తించడానికి నా పూర్వానుభవం కొంత దోహదపడింది. ఆర్థికశాస్త్ర నేపథ్యం, రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా విభాగం, ఫండ్ బ్యాంక్ డెస్కులో పనిచేసినందున – ప్రపంచ బ్యాంకు రాష్ట్ర స్థాయిలో ఏదైనా చెయ్యాలనుకున్నప్పుడు ఆ అనుభవం అక్కరకొచ్చేది. అయినా సరే, ఇంకా ఎన్నో విషయాల మీద లోతైన పరిజ్ఞానాన్ని సంపాదించాలన్న ఆశ నన్ను నిలవనిచ్చేది కాదు.

పగలంతా ప్రపంచ బ్యాంకులో పనిచెయ్యడం, రాత్రి పూట చదువుకోవడం ఉద్దేశంగా పెట్టుకున్నాను. జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీలో చేరి ఆర్గనైజేషనల్ బిహేవియర్ గురించి ఒక సెమిస్టర్ చదువుకున్నాను. దానివల్ల నాకు అక్కడి విశ్వవిద్యాలయాల పనితీరు అర్థమయింది, నా పనికి సంబంధించిన పరిజ్ఞానమూ పెరిగింది.

ఢిల్లీలో కేంద్ర సర్వీసులో పని చేసినప్పటితో పోలిస్తే, ప్రపంచబ్యాంకు ఉద్యోగిగా నాకు మెరుగైన జీతభత్యాలు లభించేవి. దాంతో నాకు కావలసినన్ని పుస్తకాలు డబ్బుకు వెనకాడకుండా కొనుక్కోగలిగేవాణ్ణి. ఆ రకంగా చూసినప్పుడు ఆ సమయంలో నన్ను అటు సరస్వతీదేవి, ఇటు లక్ష్మీదేవి – ఇద్దరూ కరుణించినట్టయింది.

**అది లోటే**

అయితే ఆ సమయంలో నా కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించ లేకపోయేవాణ్ణి.

వాషింగ్టన్ డీసీ చేరుకున్నాక మేం వాటర్‌గేట్ కాంప్లెక్స్‌కు దగ్గర్లోని ఒక హోటల్లో కొన్నాళ్లున్నాం. తర్వాత వాటర్‌గేట్ కుంభకోణం వార్తల్లోకొచ్చింది చూడండి, అక్కడే. తర్వాత నగర శివార్లలో ఒక మంచి ఇండిపెండెంట్ ఇంటిని అద్దెకు తీసుకున్నాం. ఇల్లంతా కాస్త సర్దుకున్నాక, పొద్దున గీతను ఇంట్లో వదిలి ఆఫీసుకెళ్లాను. నేను సాయంత్రం ఎప్పుడో తిరిగి వచ్చేసరికి ఆమె వరండాలోనే కూర్చుని ఉంది!

అదేమంటే, 'ఇంత పెద్ద ఇంట్లో నేను ఒక్కదాన్నే బిక్కుబిక్కుమని ఉంటే భయమేస్తోంది. అప్పుడప్పుడూ వెళ్లే కార్లు తప్ప, పొద్దున్నుంచీ ఇప్పటిదాకా ఒక్క మనిషి కూడా కనిపించలేదు. కొత్త దేశం, కొత్త ప్రాంతం.. ఒక్కదాన్నీ ఉండటం నా వల్ల కాదంటే కాదు...' అని బిగుసుకుపోయింది.

మర్నాడు ఉదయానికల్లా నేను న్యూయార్క్ వెళ్లే విమానంలో టికెట్టు కొని గీతను తన కజిన్ దగ్గరకు పంపేశాను. కొన్నాళ్లుండి తను తిరిగి వచ్చేలోగా అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ చూద్దామనుకున్నాను. పూర్వం ఇంటి ఓనర్‌తో చేసుకున్న అద్దె ఒప్పందం వీగిపోవడం వల్ల మామీద ఆర్థిక భారం బాగానే పడిందిగాని తప్పదు మరి. ఆమె ఉండలేను అన్నప్పుడు ఇక వేరే మార్గం ఏమీ లేదు కదా?

ఫ్లాట్‌కు మారాక కూడా గీత ఒక్కతే ఉండలేకపోయేది. ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ చేసి నేను ఆఫీసుకెళ్లిపోయిన తర్వాత ఆమె మా అపార్ట్‌మెంట్ లాబీలో సాయంత్రం వరకూ కూర్చునేది. లేదా దగ్గర్లోని మాల్‌కెళ్లి గడిపేది. అంతేతప్ప నేను లేకుండా ఒంటరిగా ఇంట్లో ఉండటానికి ఇష్టపడేది కాదు. కొన్ని వారాల తర్వాత మా పిల్లలు కవిత, ఆదిత్య ఇండియా నుంచి వచ్చారు. అప్పట్నుంచి ఆమె వాళ్లతో బిజీ అయిపోయింది.

అప్పటికి మా అమ్మాయి కవితకు ఎనిమిదేళ్లు, అబ్బాయి ఆదిత్యకు ఆరేళ్లు. వాళ్లను కూడా మాతోపాటు అమెరికా తీసుకెళ్లాం. గీతకూ పిల్లలు మాతో ఉండటమే సంతోషంగా ఉండేది. కాని నేను మాత్రం వాళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని – ఒక ఏడాదిన్నర తర్వాత – అంటే 1980లో అనుకుంటా, మళ్లీ తీసుకొచ్చి చిత్తూరు జిల్లా మదనపల్లి సమీపంలోని ఋషివ్యాలీ స్కూల్లో చేర్పించాను.

ఇప్పుడు తిరిగి చూసుకుంటే – నేను అప్పుడు అలా చేసుండాల్సింది కాదని అనిపించి గుండె కలుక్కుమంటుంది. మా పిల్లలను మాతో పాటే ఉంచుకుని చూసుకునివుంటే బాగుండేదని ఇప్పుడనిపిస్తుంటుంది. అయితే మా అబ్బాయి ఆరోగ్య కారణాల వల్ల ఏడాది తిరగ్గానే మళ్లీ అమెరికా వచ్చేశాడు. అప్పట్లో ప్రపంచ బ్యాంకులో పని చేసే అధికారుల పిల్లలు ఏడాదికి రెండుసార్లు మాతృదేశం నుంచి వచ్చి వెళ్లేందుకు టికెట్లిచ్చేది. అందువల్ల నామీద ఆర్థిక భారం ఎక్కువగా పడేది కాదు.

**మంచి జ్ఞాపకాలూ ఉన్నాయి...**

వాషింగ్టన్‌లో మాకు జీపీ రావు, వరదాచారి కుటుంబాలతో స్నేహం ఉండేది. ఐఎమ్ఎఫ్‌లో పనిచేసే ఆరికెపూడి ప్రేమ్‌చంద్, డాక్టర్ కాటా వెంకటేశ్వర్రావు, డాక్టర్ మధుమోహన్ వంటి వాళ్లు కూడా సన్నిహితులయ్యారు. అప్పటి నుంచీ నా డయబెటిస్ సంగతి చూసేది డాక్టర్ మధునే.

మొదట్లో అంత ఇబ్బంది పడిన గీతకు నెమ్మదిగా అమెరికాలో జీవితం చాలా నచ్చింది. స్నేహితుల రాకపోకలతో ఆమెకు ధైర్యం చిక్కింది. ఇండియాలో ఉన్నప్పుడు మాకు చుట్టాలుపక్కాల రాకపోకలు ఎక్కువగా ఉండేవి. అదే అమెరికాలో గీత తన కోసం తాను చాలా సమయం కేటాయించుకునే వీలు కలిగింది. అది ఆమెకు సంతోషాన్నిచ్చింది. ఆర్థికపరమైన ఇబ్బందులేం ఉండేవి కాదు, దాంతో అప్పట్లో

ఫోను మాట్లాడటం చాలా ఖరీదైన వ్యవహారం అయినప్పటికీ తనకిష్టమైనప్పుడల్లా ఫోన్ చేసి ఇండియాలో ఉన్న బంధుమిత్రుల యోగక్షేమాలు కనుక్కునేది.

ఒకసారి మా అత్తమామలు మాతో గడపడానికి అమెరికా వచ్చారు. మా అమ్మను హైదరాబాద్ నుంచి వాషింగ్టన్ తీసుకు రావడం నాకెప్పటికీ సంతోషాన్నిచ్చే విషయం. హైదరాబాద్ నుంచి లండన్ దాకా ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించాం. అక్కణ్ణుంచి వాషింగ్టన్‌కు శబ్దం కన్నా వేగంగా ప్రయాణించే సూపర్‌సోనిక్ విమానం కంకార్డ్‌లో రావడం ఎప్పటికీ మర్చిపోలేను.

ఆ ఏడాది ప్రపంచ బ్యాంకు నిర్వహించిన క్రిస్మస్ పార్టీకి మా అమ్మను తీసుకెళ్లాను. ఆమెకది ఎంత ఆనందాన్నిచ్చిందంటే, తర్వాత ఎన్నో ఏళ్లు గడిచినా, తన ప్రయాణాన్ని, ఆ పార్టీని తల్చుకున్నప్పుడు ఆమె మొహం చిరునవ్వుతో, కళ్లు వెలుగుతో నిండిపోయేవి! ఆమె మాతోపాటు ఉంటే బాగుండేదని అనుకున్నాంగాని మా అమ్మకు అమెరికా వాతావరణం అంతగా నచ్చక తిరిగి వచ్చేసింది.

**విందు సమావేశాల విశేషాలెన్నో...**

ప్రపంచబ్యాంకు పని మీద అమెరికా వచ్చే ప్రతి భారతీయ బృందానికీ వారి గౌరవార్థం మన ఈడీ విందు ఇచ్చేట్టు ఏర్పాటు చేశాను. ఆ విందులకు వారితో చర్చల్లో పాల్గొనవలసిన ప్రపంచ బ్యాంకు అధికారులను, అక్కడ పనిచేస్తున్న ఇతర భారతీయ అధికారులను కూడా ఆహ్వానించేవాళ్లం.

ఆ భోజన సమయాల్లో ఎన్నో విషయాలు చర్చకు వచ్చేవి. అందరూ తమతమ అభిప్రాయాలను ఎదుటివాళ్లకు విశదీకరించే వీలు కలిగేది. దీనివల్ల వాళ్ల మధ్య ఒక సుహృద్భావ వాతావరణం ఏర్పడేది. ఎన్నో విషయాలు సులువుగా పరస్పర అంగీకారానికి వచ్చేసేవి.

ఒక్కోసారి భారతీయ అధికారులను మా ఇంటికి కూడా భోజనానికి ఆహ్వానించేవాణ్ణి. అంతమందికి వండి వడ్డించడం ఎంతో శ్రమ. అయినా గీత ఎప్పుడూ విసుక్కునేది కాదు. పైగా మన దేశం నుంచి వచ్చారంటూ చాలా ఆనందపడేది. అక్కడ వాళ్లకు షాపింగ్ ఏమేం చెయ్యాలో, ఏయే ప్రదేశాలు చూడాలో వివరంగా చెప్పేవాళ్లం మేమిద్దరం.

వివిధ రాష్ట్రాలు, భాషలు, మంత్రిత్వ శాఖల నుంచి వచ్చే వివిధ అధికారులతో ఎన్నో విషయాల గురించి మాట్లాడటం, వాళ్ల గురించి తెలుసుకోవడం మాకు చాలా నచ్చే వ్యాపకమైంది.

## ఆయనతో మాట్లాడటమే ఒక ఎడ్యుకేషన్

ప్రపంచ బ్యాంకులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుకు, ఆయనకు అడ్వైజర్‌గా పనిచేసే అధికారికి మధ్య వృత్తిరీత్యా సంబంధాలు చక్కగా ఉండాలి. ఆ రకంగా చూసినప్పుడు నరసింహంగారు నాకు ఈడీగా దొరకడం అదృష్టమనే చెప్పుకోవాలి. అంతర్జాతీయ ఆర్థిక అంశాలకు సంబంధించిన వివిధ కోణాలు నాకు అర్థమయ్యేలా చెప్పేవారాయన.

ప్రపంచ బ్యాంకు ఈడీ కాకముందు ఆయన మన దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖలో అడిషనల్ సెక్రెటరీ, సెక్రెటరీగా పనిచేశారు. అంతేకాదు, మన రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా కూడా పనిచేశారు. ఆయన మేధ చాలా పదునైనది. నిత్యం శక్తిమంతంగా, ఉత్సాహంగా ఉండేవారు. మాటల్లో సరదా ఉండేది.

కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదువుకున్నారు కనుక, ప్రపంచ బ్యాంక్ బోర్డులోని అత్యున్నత స్థాయి అధికారులతో సైతం ఎంతో హుందాగా, ధైర్యంగా మాట్లాడేవారు. బోర్డులోని ఇతర మెంబర్లకు ఆయనంటే గౌరవం ఒక్కటే కాదు, ఒకరకమైన ఆరాధన కూడా ఉండేది!

అప్పటి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు రాబర్ట్ ఎస్. మెక్ నమారా కూడా నరసింహంగారి పట్ల ప్రత్యేక గౌరవం చూపించేవారు. పనితీరు విషయంలోను, ఇతరులతో మెలిగే తీరులోనూ నరసింహంగారిని గమనించడమే ఒక ఎడ్యుకేషన్ అన్నట్టుండేది నాకు.

నేను ఆయన దగ్గర విధుల్లోకి చేరిన కొత్తలో నన్ను సాయంత్రం ఇంటికి పిలిచారు. స్కాచ్ విస్కీ తాగుతూ కబుర్లలో పడ్డాక ఆయన 'వేణూ, మీరు నా ఛాయిస్ కాదని, నేను కావాలని మిమ్మల్ని నియమించుకోలేదని మీకు తెలుసు. అయితే ఆ సంగతి ఇటుపై మన ఉద్యోగ ధర్మాలు నిర్వర్తించడంలో అడ్డు రాదని నేననుకుంటున్నా...' అన్నారు.

'సర్, నాకదంతా తెలుసు. ఉద్యోగానికి సంబంధించినంత వరకు నా విధి నేను నిర్వర్తిస్తాను. మీరు అర్హులైనంత వరకూ, మీకు విధేయంగా ఉంటాను' అని నిష్కర్షగా చెప్పాను.

నా సమాధానానికి ఆయన నవ్వి రెండో డ్రింకుకు ఛీర్స్ చెప్పారు.

తర్వాత ఆయన 'మీరు ఇల్లు అద్దెకు తీసుకుంటున్నారా? అందర్లాగా కొంటున్నారా?' అనడిగారు.

'సర్, నేనిక్కడ ఇల్లు కొనుక్కోను. ఎందుకంటారా? నాకు నా బాస్‌తో దెబ్బలాడి, పెట్టే బేడా సర్దుకుని తక్షణమే మన దేశానికి వెళ్లి పోగలిగే స్వాతంత్ర్యం ఉండాలి. అంతేగాని ఇల్లూ పొల్లూ అని బాదరబందీలెందుకండి...' అని సమాధానమిచ్చాను నవ్వుతూనే.

'అలాగా. అయితే మన బంధం బాగానే నడుస్తుందన్న మాట...' అన్నారాయన నవ్వుతూ.

మూడు నెలల తర్వాత ఆయన మన ఆర్థిక వ్యవహారాల శాఖ సెక్రెటరీగా పనిచేస్తున్న మన్మోహన్ సింగ్ గారికి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసే సందర్భం వచ్చింది.

అందులో ఆయన ఏం రాశారంటే 'మీరు డాక్టర్ రెడ్డిని నా ఆఫీసుకు పంపించారు. అంతకు ముందు నాకాయన తెలియదు. కాని ఆయన అత్యుత్తమమైన మనిషి. మీకు ధన్యవాదాలు...' అని! దాన్ని నాకు చూపించారు కూడా. ఈ ఒక్క ఉదాహరణ చాలు కదా, మూడు నెలల్లో మా బంధం ఎలా రూపుదిద్దుకుందో తెలిపేందుకు!

అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల్లో నాతో అ ఆలు దిద్దించిన నరసింహంగారు, ఒక్క ఏడాదిలో ఆ రంగంలోని తన అనుభవాన్నంతా నాకు నూరిపోశారు!

బోర్డులోని ఇతర డైరెక్టర్లతో, సీనియర్ అధికారులతో మన సంబంధాలు మెరుగ్గా ఉండేందుకు ఆయన శక్తియుక్తులను వెచ్చించేవారు. మన దేశపు ప్రాజెక్టులు, అధికారులు, ఇతరత్రా వ్యవహారాలు నాకు వదిలిపెట్టేసేవారు. మాకు పట్టున్న అంశాలను బట్టి మా మధ్య పనిని విభజించుకున్నాం.

నరసింహంగారు తన నెట్‌వర్కింగ్‌లో భాగంగా నన్ను బోర్డు మీటింగులకు, అత్యున్నత స్థాయి అధికారులతో లంచ్, డిన్నర్లకు తీసుకెళ్లేవారు. ఆయన ఎంత చలాకీగా ఉండేవారంటే, రెండు మూడు కాక్‌టెయిల్ పార్టీలు, డిన్నర్‌కు వెళ్లొచ్చిన తర్వాత కూడా నాతో ఆ రోజు విషయాలను సమీక్షించేందుకు అర్ధరాత్రి పూట

కూర్చునేవారు. అలా మేమిద్దరమే ఉన్నప్పుడు ఆయనకు తారసపడిన వ్యక్తులు, అంశాల గురించి తన అభిప్రాయాలను పంచుకునేవారు. ఎంత రాత్రి దాకా మేలుకున్నా మర్నాడుదయానికి తాజా పువ్వులాగా ఉండేవారాయన.

ఒక సందర్భంలో ఆయన మన ప్రభుత్వానికి పంపబోతున్న ఒక ఉత్తరపు ప్రతిని నాకు చూపించారు.

'దీని గురించి మీ అభిప్రాయాలు నిర్మొహమాటంగా చెప్పండి' అన్నారు. నేను చెప్పాను. అప్పుడు ఆయన ఏమన్నారంటే – 'వేణూ, నేను మిమ్మల్ని నిక్కచ్చిగా చెప్పమన్నాను. కటువుగా కాదు...' అని!

## పొగుడుతుంటే ఎంత బాగుంటుందో?

అప్పట్లో ప్రపంచ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న ఖురేషీగారు పాకిస్తానీయుడు. ఆయనకు నరసింహంగారితో మంచి స్నేహం ఉండేది. ఆయన తన కెరీర్‌ను నిర్మించుకోవడంలో చాలా సాయం చేశారు మా ఈడీ. నేను కొన్నిసార్లు వాళ్లిద్దరితో కలిసి లంచ్ సమావేశాలకు వెళ్లేవాణ్ణి.

'సర్, ఖురేషీగారు మిమ్మల్ని చాలా అతిగా పొగుడుతుంటారు. ప్రపంచంలో దైవం అల్లా. అల్లా తర్వాత మళ్లీ నరసింహమే... అంటాడతను. మీరేమో దానికి పడిపోతారు...' అన్నాను.

'వేణూ, నాకు ఇప్పుడీ వయసులో సంతోషాన్నిచ్చే విషయాలు కొన్నే. అలాంటి పొగడ్తకు పడిపోకుండా ఎలా ఉంటాను చెప్పండి? ఒకటి ఆలోచించండి – నన్ను ఎవరైనాగానీ, ఉత్తినే ఎందుకు పొగుడుతారు? నేను తిరిగి వాళ్లకేదో ఒకటి చెయ్యాలి కదా. మరీ ఇబ్బందికరం కానంత వరకు స్నేహితులకు కొన్ని సాయాలు చెయ్యాలి. అయితే నేను ఎప్పుడైనా హద్దు మీరుతున్నానని మీకు అనిపిస్తే మాత్రం వెంటనే హెచ్చరించండి, సరిచేసుకుంటాను...' అన్నారు!

మా ఇద్దరి మధ్యా సంబంధం ఎంత బలపడిందంటే, ఆయన రిటైరయ్యాక నాకు దగ్గరగా ఉండొచ్చని హైదరాబాద్‌లో బంజారా హిల్స్‌లో రోడ్డు నెంబర్ 12లో మా ఇంటికి దగ్గరగా ఒక జాగా కొనుక్కున్నారు. తర్వాత మేం ఇల్లు మారిపోవడంతో అప్పుడప్పుడు ఆయన విసుక్కునేవారు. 'నువ్వుంటావని నేనిక్కడ ఇల్లు కట్టుకుంటే ఇప్పుడు మారిపోయావేంటయ్యా బాబూ...' అని.

**లోను క్యాన్సిలైంది!**

అప్పట్లో భారతదేశంలో ఒక ఎరువుల కర్మాగారాన్ని నెలకొల్పే ప్రయత్నాల్లో ప్రపంచ బ్యాంక్ భాగస్వామి అయింది. కన్సల్టెంట్, కర్మాగారానికి అవసరమైన టెక్నాలజీ – రెండూ తమకు సమ్మతమైనవి, తాము నిర్దేశించిన ప్రమాణాలను అందుకునేవి అయి ఉండాలని షరతు పెట్టింది. దాని కోసం నియమించిన భారతీయ నిపుణుల కమిటీ ఒక అంతర్జాతీయ సంస్థ అందించే సాంకేతిక సాయాన్ని తీసుకుంటామని ముందుగా నివేదించింది.

ఈలోగా 1980లో ఇక్కడ ప్రభుత్వం మారిపోయింది. అప్పుడు అధికారంలోకి వచ్చిన వారు, పూర్వపు కమిటీ నివేదికను తోసిరాజని ఒక ఇటాలియన్ సంస్థ అధీనంలో ఉన్న ఒక డేనిష్ కంపెనీని కన్సల్టెంట్‌గా నియమించుకున్నారు, ఆ సంస్థ సాంకేతికతనే అందిపుచ్చుకుంటామని ఒప్పందం కూడా చేసేసుకున్నారు. అయితే ఆ టెక్నాలజీ పట్ల ప్రపంచబ్యాంకుకు గురి కుదరలేదు. అది సరిగా పని చెయ్యదని, అందువల్ల ఫ్యాక్టరీ వ్యయం పెరిగిపోవడం తప్ప మరే ఉపయోగమూ లేదని అభిప్రాయపడింది.

ప్రపంచ బ్యాంక్ అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలియజేస్తూ, అలాగే ముందుకెళ్లే పక్షంలో ప్రపంచ బ్యాంకు ఇవ్వబోయే లోన్ ఆగిపోయే ప్రమాదముందంటూ నరసింహంగారు మన ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. భారత్‌కు సంబంధించినంత వరకూ అలా జరిగిన దాఖలాలు అప్పటి వరకూ లేకపోవడం వల్ల అది మనకు చెడ్డపేరు తెచ్చిపెడుతుందని, దాని పరిణామాలు బాగుండవని, వాటి గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలంటూ మన ప్రభుత్వానికి సూచించారాయన.

కాని దాన్ని అప్పటి ప్రభుత్వం ఖాతరు చెయ్యకుండా తాను అనుకున్న దిశలోనే ముందడుగేసింది. ప్రపంచ బ్యాంక్ లోన్ క్యాన్సిల్ కావడం చరిత్రలో అదే తొలిసారి! అయితే అప్పుడే ఇక్కడ పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. లోను పోయినా పర్లేదుగాని, ఆ విషయాన్ని చెప్పే లేఖ మాత్రం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు పంపొద్దని ఇక్కడివారు కోరుకున్నారు!

నేను పనిచెయ్యడం మొదలుపెట్టిన ఒక సంవత్సరం తర్వాత నరసింహంగారు ప్రపంచ బ్యాంక్‌ను వదిలిపెట్టి, ఐఎమ్ఎఫ్‌కు ఈడీగా చేరారు. అప్పట్లో మా ఇద్దరి

కార్యాలయాలు వీధికి చెరోవైపునా ఎదురెదురుగా ఉండేవి, భూగర్భంలోని ఒక టన్నెల్ ద్వారా వాటి మధ్య రాకపోకలకు వీలుండేది!

## కాకా పట్టడమే స్పెషలైజేషన్

నరసింహంగారి తర్వాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా హెచ్.ఎన్.రే నియమితులయ్యారు. సివిల్ సర్వీసు అధికారిగా పనిచేసిన ఆయన ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసి రిటైరయ్యారు. ఆయనంటే కూడా మన దేశంలో అందరికీ గౌరవం ఉండేది. ఆర్థిక శాఖలో ఆయన రెవెన్యూ, ఖర్చుల వరకే చూసేవారు. ప్రపంచ బ్యాంకుకు వచ్చేనాటికి ఆయనకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక దౌత్యం వంటి వాటి పట్ల అవగాహన ఉండేది కాదు.

రే ప్రపంచ బ్యాంకుకు వస్తున్నారన్న ప్రకటన వెలువడగానే అక్కడివాళ్లు నా పరిస్థితి ఏమవుతుందని ఆరా తీశారు. ఎందుకంటే, ముందే చెప్పినట్టు అడ్వైజర్ పోస్టులో ఎవరుండాలనేది ఈడీ ఇష్టమే. అదీగాక, అమెరికా సంస్కృతిలో బాసులు తమ కింద పనిచేసే అధికారులను ఎంచుకుని తీసుకురావడం ఆనవాయితీ. అదీ వాళ్లు నన్ను అలా అడగడానికి నేపథ్యం.

నేను మాత్రం వాళ్లకు కాస్త కొంటెగా సమాధానం చెప్పాను.

'నేను దేనిలోనూ స్పెషలిస్టును కాను. డాక్టర్ని కాను, ఇంజినీర్ని కాను. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుకు చెందినవాణ్ణి. అంటే, బాసును ప్రసన్నం చేసుకోవడంలో స్పెషలిస్టును. ఇక చెప్పేదేముంది, బాసుగా ఎవరొచ్చినా, నాకు వచ్చిన ఢోకా ఏమీ లేదన్నట్టే...'

నేను నవ్వుతూ అన్నానుగాని, నిజానికి ఆపాటికి మూడేళ్ల నా డిప్యుటేషన్ కాలం పూర్తి కావస్తోంది. కావాలంటే రే గారు తన అడ్వైజరును నియమించుకోవచ్చు కాని ఆయన ఆ పని చెయ్యలేదు. ఆయన పెద్దతరహా మనిషని, సహృదయులని నాకు త్వరగానే అర్థమైంది. ఆయన కూడా నాపట్ల పుత్రవాత్సల్యంతో ఉండేవారు.

ఈడీగా రే గారు వచ్చాక నా పని రెండింతలైంది. ఆయన ప్రతి చిన్న విషయాన్నీ నిశితంగా చూడాలని, పూర్వాపరాలతో ఉన్న ఫైళ్లు పరిశీలించాలనీ అనుకునేవారు. కాని అక్కడ ఫైళ్ల కన్నా, ఒకటికి పదిసార్లు సమావేశమై చర్చించుకోవడమే అలవాటు. దాంతో ఇటు భారతీయ అధికారులు, అటు ప్రపంచ బ్యాంకు అధికారులు నన్ను సంప్రదించేవారు.

## ప్రధాని సమయమంటే మాటలా?

హెచ్.ఎన్. రేగారు తన మూడేళ్ల పదవీకాలం ముగిసే ముందు భారతదేశానికి వెళ్లొచ్చారు. వాషింగ్టన్ తిరిగొచ్చిన తర్వాత ఆయనెందుకో తనలో తానే బాధపడటాన్ని గమనించాను.

నన్ను పిలిచారు. భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీతో ఆయన సమావేశం ఎలా జరిగిందో వివరించారు. 'ఆవిడకు నా పని పట్ల అసంతృప్తి ఉంది. పైగా ప్రతి అంశాన్నీ ప్రస్తావించి మరీ వాటి గురించి ఆవిడకు ఎందుకు చిరాకొచ్చిందో కూడా చెప్పారు..' అన్నారు విచారంగా. 'గతంలో జరిగిన పొరపాట్ల గురించి మనం ఆవిడకు వివరంగా ఒక నోట్ పంపించాలిప్పుడు...' అని కూడా చెప్పారు.

నాకు బుర్రలో ఏదో తట్టింది.

'సర్, ప్రధాని మీతో ఎంతసేపు మాట్లాడారు?' అని అడిగాను.

'ఏం, 20 నిమిషాలకు పైగా మాట్లాడారు...' అన్నారాయన.

'సరే సర్, మీరు చెప్పినట్టే ఒక వివరమైన నోట్ తయారుచేస్తాను. దాన్ని ఆవిడకు పంపించవచ్చు. అదిసరేగాని, కంగ్రాచ్యులేషన్స్ సర్, ఈడీగా మీ పదవీకాలం పొడిగించబడుతోంది....' అన్నాను.

'అదేంటి? మీరలా ఎలా చెప్పగలరు?' అంటూ ఆశ్చర్యపోయారాయన.

'దేశ ప్రధాని అంటే మాటలా సర్? ఎంత బిజీగా ఉంటారు? ఈడీగా మీ పదవీకాలం ముగియబోతుంటే గనక, 'మీ సేవలకు కృతజ్ఞతలు, అంతా బాగున్నారు కదా, వెళ్లిరండి...' అంటూ మూడు ముక్కలు మాట్లాడి, టీ ఇచ్చి మూడే నిమిషాల్లో పంపేస్తారు. అంతేతప్ప సుమారు అరగంట ఎందుకు మాట్లాడతారు? అదీగాక, అంశాలవారీగా ప్రస్తావించి, ఆవిడకు నచ్చనివన్నీ చెప్పారంటే, మరోసారి అలా చెయ్యకూడదని, వీలున్న మేరకు వ్యవహారాలను చక్కదిద్దమన్నట్టే కద. ఆమెకు ఆ అంశాల మీద ఒత్తిడి ఉండి ఉంటుంది. మీకు మరోసారి ఈడీగా అపాయింట్‌మెంట్ ఇచ్చేముందు వాటిని సరిచెయ్యమని చెబుతున్నారావిడ....' అంటూ నేను ఊహిస్తున్న వివరణ చెప్పాను.

ఆయన ఆలోచనలో పడ్డారు, 'అవునేమో...' అన్నారు.

తర్వాత కొన్నాళ్లకే ఈడీగా ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు వచ్చాయి! ఆయన సంతోషించారు.

## ఎంత దురుసువాడినో...

నా ఐదేళ్ల పదవీకాలం ముగిసి మేం అమెరికా వదిలి వచ్చేసే ముందు రేగారు నన్నూ గీతనూ వాళ్లింటికి ఇంటికి భోజనానికి పిలిచారు. వెళ్లేముందు 'వేణూ, నువ్వు ప్రపంచ బ్యాంకును వదిలేసి వెళుతున్నావు. నువ్వు కావాలనుకుంటే బ్యాంకులోనో, ఐఎమ్ఎఫ్‌లోనో ముఖ్యమైన పదవులేమైనా దొరికేవే. అయినా నువ్వెందుకు వెళుతున్నావో నాకు అర్థం కావడం లేదు. కాని నువ్వెప్పుడో ఒకసారి ఇక్కడికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా వస్తావు. నువ్వు సమర్థుడివి, ఆ పదవికి తగినవాడివి' అన్నారు రేగారు!

ఆ సంభాషణ తలుచుకుంటే మనస్సు కలుక్కుమంటుంది. నేను ఆయనతో ఇంకాస్త వినయపూర్వకంగా వ్యవహరించి ఉండాల్సిందేమో అనిపిస్తుంటుంది ఇప్పటికీ.

వ్యక్తిగతంగా ఆయనంటే నాకు చాలా గౌరవం ఉన్నప్పటికీ, వృత్తిరీత్యా నేను ఆయన పట్ల కొంత దుడుకుగానే ఉండేవాణ్ణి. రేగారు చేరిన కొత్తలో జరిగిన ఒక సంభాషణ అప్పుడు నాకు గుర్తుకొచ్చింది.

'డాక్టర్ రెడ్డీ, మీరు పుట్టక ముందే నేను సివిల్ సర్వీసుల్లో చేరాను. ఇంకొంత మర్యాదగా ఉండటం నేర్చుకోండి...' అన్నారాయన ఒకసారి.

నేనేం వెనక్కి తగ్గలేదు.

'సర్, మీ ఇంటికొచ్చి మీపట్ల నా గౌరవమంతా చూపిస్తాను. కాని పని విషయంలో మీరు తప్పుగా వ్యవహరించినప్పుడు అది తప్పు అని చెప్పక తప్పదు నాకు...' అన్నాను దురుసుగా. కాని నేనప్పుడు అలా మాట్లాడకుండా, మృదువుగా ఉండాల్సింది.

## ప్రభుత్వంతో సాన్నిహిత్యం

నేను ఈడీకి అడ్వైజరుగా పని చేసేటప్పుడు మన ఆర్థిక మంత్రులతో నేరుగా మాట్లాడాల్సిన అవసరం నాకు ఉండేది కాదు. అయితే ఏడాదికి రెండుసార్లు జరిగే ఫండ్ – బ్యాంక్ సమావేశాలకు ఈడీతో పాటు వెళ్లినప్పుడు వాళ్లు నాకు

తారసపడేవారు. అలా నేను పనిచేసిన ఐదేళ్లలో హెచ్.ఎమ్. పటేల్, ఆర్.వెంకట్రామన్, ప్రణబ్ ముఖర్జీలను పరిశీలించే అవకాశం దొరికింది. వాళ్లు ముగ్గురూ హుందా అయినవాళ్లు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల లోతుపాతులను తమ మెరుపులాంటి మేధతో త్వరగా అర్థం చేసుకోగలిగినవాళ్లే.

వివిధ విషయాల్లో సాధారణంగా ఈడీ చెప్పిన విషయాల మీదే ఆధారపడక తప్పదు వాళ్లకు. కాని అప్పుడప్పుడు భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ల సలహాలను కూడా తీసుకునేవారు. ఆర్‌బీఐ గవర్నర్లు పాలసీ విషయాల్లోనే తమ సలహాలనిచ్చేవారు. అప్పట్లో ఆర్‌బీఐ గవర్నర్‌గా ఐ.జీ. పటేల్, ఆ తర్వాత మన్‌మోహన్ సింగ్‌గార్లు ఉండేవారు.

ఐ.జి. పటేల్‌గారికి అంతర్జాతీయంగా మంచి పేరుండేది. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు రాబర్ట్ మెక్‌నమారాను తనతో సమానంగా చూడగల హోదా ఉండేదాయనకు. ప్రపంచ బ్యాంకులో చైనా 1980 ఏప్రిల్ వరకూ సభ్యత్వం తీసుకోకపోవడంతో, అభివృద్ధి చెందుతున్న దేశాలకు మన దేశమే నాయకత్వం వహించేది. అందుకని మన ఆర్థిక మంత్రులకు ప్రపంచ బ్యాంకులో మంచి గౌరవం ఉండేది. వాళ్లు ప్రతి అంశాన్ని గురించి కూలంకషంగా అధ్యయనం చేస్తారని, దూరదృష్టితో ఆలోచించగలిగిన సామర్థ్యం ఉన్నవాళ్లనే పేరు ఉండేది.

అటువంటి గొప్ప ఆర్థిక మంత్రులు, రిజర్వ్ బ్యాంకు గవర్నర్లతో కలిసి చర్చల్లో, సమావేశాల్లో పాల్గొనడం, వాళ్లను గమనించడం నాకు అమూల్యమైన అనుభవాలనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

వాళ్లలో ఆర్. వెంకట్రామన్, ప్రణబ్ ముఖర్జీలు మన దేశానికి రాష్ట్రపతులయ్యారు. ఆనాటి మా సమావేశాల గురించి ప్రణబ్ ముఖర్జీ ఇప్పటికీ తల్చుకుంటుంటారు!

ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖలో పనిచేసే కార్యదర్శులతో కూడా నాకు నేరుగా పనేం ఉండేది కాదు, ఈడీకి అవసరమైతే తప్ప. నేను అడ్వైజర్‌గా పనిచేసిన ఐదేళ్లలో ముగ్గురు కార్యదర్శులను గమనించే వీలు కలిగింది. వాళ్లు – మన్మోహన్‌సింగ్, ఆర్.ఎన్. మల్హోత్రా, నరసింహంగార్లు. వీళ్లు ముగ్గురితోనూ వేర్వేరు సందర్భాల్లో గతంలో నేను పని చేసి ఉన్నాను కనుక వాళ్ల పనితీరు, వ్యక్తిత్వాలను దగ్గరగా చూసే వీలు కలిగింది.

మన్మోహన్‌సింగ్ చాలా మృదుభాషి. తన తెలివితేటలను బయటకు ప్రదర్శించాలనే ఉబలాటం లేకుండా చాలా నింపాదిగా ఉండే మనిషాయన. దాదాపు ప్రతి సమావేశంలోనూ ఆయన ఎంతో సంక్లిష్టమైన ఆర్థిక వ్యవహారాల గురించి ఒక అధ్యాపకుడిలాగా వివరిస్తున్నప్పుడు, మిగిలిన వారంతా తరగతి గదిలో విద్యార్థుల్లాగా శ్రద్ధగా వినేవారు.

ఎవరినీ నొప్పించాలనుకోని వ్యక్తిత్వం మన్మోహన్‌గారిది.

1978 – అది నేను ప్రపంచ బ్యాంక్‌లో చేరిన తొలి ఏడాది. ఫండ్ – బ్యాంక్ వార్షిక సమావేశాల్లో మొదటి రోజు గడిచిపోయింది. సాయంత్రం మా ఈడీ నరసింహంగారు నన్ను పిలిచి, 'వేణూ వార్షిక సమావేశాలకు ఎప్పుడూ టై కట్టుకుని రావాలని మన్మోహన్‌గారు నీకు చెప్పమన్నారు. టై కట్టుకోవడం నీకిష్టం ఉండదని ఆయనకు తెలుసు. అయినా ఈ సమావేశాలప్పుడు అది తప్పనిసరి....' అని చెప్పారు.

టై కట్టుకోవడం అంటే మనల్ని పాలించిన వలసవాద పాశ్చాత్య దేశాలను గౌరవించినట్టు అనే భావన నాలో అప్పట్లో బలంగా ఉండేది. అందుకే నేను దాన్ని ఇష్టపడేవాణ్ణి కాదు.

కాని, మన్మోహన్ సింగ్ తీరు చూడండి. నాతో నేరుగా చెప్పి ఇబ్బంది పడకుండా, ఈడీ తో చెప్పించారు! దాన్ని నేను ప్రభుత్వ ఆదేశంగా తీసుకుని ఆ రోజు నుంచీ తప్పనిసరిగా టై కట్టుకునేవాణ్ణి.

ఆ తర్వాత నేనాయనకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ రాసిన ఉత్తరంలో ఆ విషయాన్ని ప్రస్తావించాను. 'సర్, ఇప్పుడు నేను ప్రతి రోజూ టైని ధరిస్తున్నాను. ఒక్క పడుకునేప్పుడు తప్ప...' అని!

★ ★ ★ ★ ★

మన్‌మోహన్ సింగ్ తర్వాత ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆర్.ఎన్. మల్హోత్రా కూడా చాలా నిరాడంబరంగా ఉండేవారు. అవసరమైనప్పుడు అంతే దృఢంగానూ ఉండేవారు.

అప్పట్లో ప్రపంచ బ్యాంకు మన దేశంలో ఒక ప్రాజెక్టుకు 200 మిలియన్ డాలర్లు అప్పుగా ఇవ్వాలనుకుంది. కాని దానికి వల్లమాలినన్ని షరతులు పెట్టింది. దాని గురించి చర్చించడానికి ఆ సంస్థ ఉపాధ్యక్షుడితో మల్హోత్రా సమావేశమయ్యారు.

'ఇన్ని షరతులు మా దేశంలో సాధ్యమయ్యేవి కావు...' అంటూ వివరంగా ఆయనకు నచ్చజెప్పారు. కాని ఉపాధ్యక్షుడు పట్టు వీడలేదు.

'మిస్టర్ సెక్రెటరీ, 200 మిలియన్ అమెరికన్ డాలర్లంటే మాటలనుకున్నారా? అవి కావాలంటే ఇవన్నీ తప్పదు మరి...' అన్నాడు విసురుగా.

మల్హోత్రా కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత పెదవి విప్పారు.

'మిస్టర్ వైస్ ప్రెసిడెంట్, ఆ సొమ్మును మీతోనే ఉంచుకోండి' అన్నారు సూటిగా!

మల్హోత్రా భార్య అన్నా మల్హోత్రా కూడా ఐఏఎస్ అధికారిణిగా పనిచేశారు, కార్యదర్శి స్థాయికి ఎదిగారు. అమెరికాలో ఉన్నప్పుడు ఆమెకు నా భార్య గీతతో చాలా మంచి స్నేహం కుదిరింది.

★ ★ ★ ★ ★

ఒకసారి ప్రపంచ బ్యాంకు నెగోషియేటర్ ఒకాయన ఏమన్నాడంటే 'మాకు మీ భారతీయ అధికారులు కొందరు మాట్లాడే ఇంగ్లీషును అర్థం చేసుకోవడం కష్టంగా ఉంది. అది సమస్యే...' అని.

నేనేమన్నానంటే – 'మంచిదే. మీకు వాళ్ల ఇంగ్లీషు అర్థం చేసుకోవడం కష్టం. వాళ్లకు మీ ఇంగ్లీషు అర్థం చేసుకోవడం కష్టం. మొత్తమ్మీద ఇరుపక్షాలకూ సమస్య ఒకటే. అంటే నెగోషియేషన్లలో ఇద్దరూ సమానంగా ఉన్నట్టే...' అని.

మామూలుగానైతే ప్రపంచ బ్యాంకులో నా పదవీ కాలం మూడేళ్లే. అది ముగుస్తూనే తిరిగి వచ్చెయ్యాలని నేను గట్టిగా అనుకున్నాను. కాని మన ప్రభుత్వం మరో రెండేళ్లు పొడిగించడంతో మొత్తం ఐదేళ్లు అక్కడే ఉండాల్సి వచ్చింది. చెప్పొచ్చేదేమంటే, మేం తిరిగి రావాల్సిన సమయానికి గీత అక్కణ్ణుంచి రానంటే రానని భీష్మించుక్కూర్చున్నది!

వరల్డ్ బ్యాంక్‌లో నా పదవీ కాలం ముగియ వచ్చేటప్పటికి మన ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా నరసింహంగారుండేవారు. విశేషమేమంటే, మిగిలిన కార్యదర్శులు ఇద్దరూ తర్వాత కాలంలో మన రిజర్వ్‌బ్యాంక్‌కు గవర్నర్లుగా పనిచేశారు. వాళ్లంతా పనిని దైవంగా భావించినవాళ్లు. వృత్తిరీత్యా ఎంత ఒత్తిడి ఉన్నా వాళ్లు తమ హుందాతనాన్ని, మృదుస్వభావాన్ని ఎప్పుడూ కోల్పోయేవాళ్లు కాదు. అన్ని విషయాలనూ కూలంకషంగా తెలుసుకునేవాళ్లు.

**తెలుగు నేలకు తిరుగు ప్రయాణం**

ప్రపంచబ్యాంకు అధ్యక్షుడంటే చాలా ఉన్నతమైన స్థానం. ఒక అడ్వైజరుగా నాకు వాళ్లెవరితోనూ వ్యక్తిగత పరిచయం ఏర్పడే వీలే లేదు. బోర్డు సమావేశాల్లో దూరం నుంచి గమనించడం తప్ప దగ్గరికెళ్లి తెలుసుకునే వీలుండదు.

ఒకరోజు నా ఆఫీసుకు ఒక పొడుగాటి మనిషి నడుచుకుంటూ వచ్చారు.

ఆయన – కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న నాయుడమ్మ! నాకాయనతో ఇదివరకే కాస్త పరిచయముంది.

'వేణూ, నేనిప్పుడే ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు రాబర్ట్ మెక్‌నమారాతో మాట్లాడి వస్తున్నాను. మీ గురించి ఆయన చెబుతుంటే తెలిసింది. 'ప్రపంచ బ్యాంకులోని భారతీయ అధికారుల్లో ఇద్దరు ప్రతిభావంతులు డీసీ రావు, వైవీ రెడ్డి...' అన్నారాయన. మిమ్మల్ని కలిసినందుకు సంతోషం...' అంటూ కరచాలనం చేశారు నాయుడమ్మ.

ప్రపంచబ్యాంకులో నా పదవీకాలం ముగియబోతున్నప్పుడు కొత్త ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుగారు నాకోసం ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ప్లానింగ్ సెక్రెటరీగా నేనుంటే బాగుంటుందని ఎన్టీఆర్ అనుకుంటున్నట్టు చీఫ్ సెక్రెటరీ జీవీ రామకృష్ణ చెప్పారు. మాతృదేశంలో, నాకిష్టమైన, అనుభవమున్న రంగంలో పనిచేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా అనిపించింది.

నేనిలా వెళుతున్నట్లు ప్రపంచబ్యాంకులోని చీఫ్ ఆఫ్ ఇండియా డివిజన్ – ఆన్ హామిల్టన్‌కు చెబితే ఆమె ''వేణూ, మీ రాష్ట్రం ఒక సినిమా హీరోను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంది! అలాంటి మనిషి దగ్గర పని చెయ్యడానికి నువ్వు వెళుతున్నావు!! బాగుంది.. బాగుంది...'' అన్నారు కాస్త వెటకారంగా.

ఆమె అలా మాట్లాడేసరికి నాకూ సరదాగా జవాబివ్వాలనిపించింది.

అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ కొన్ని చిన్నాచితకా సినిమాల్లో నటించినట్టు నాకు తెలుసు. 'ఆన్, అమెరికాలో బీ గ్రేడ్ సినిమాల్లో పనిచేసిన ఒక బీ గ్రేడ్ హీరోను మీరు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అదే ఆంధ్రాలో ఏ క్లాస్ సినిమాల్లో తిరుగులేని కథానాయకుడైన ఏ క్లాస్ హీరోను ముఖ్యమంత్రిగా ప్రజలు ఎన్నుకున్నారు. నేను అలాంటి హీరోతో పనిచెయ్యబోతున్నాను....' అని ముగించాను.

## ప్రపంచ బ్యాంకు ఎలా పనిచేస్తుందంటే....

*ఇంటర్నేషనల్ బ్యాంక్ ఆఫ్ రికన్స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐబిఆర్‌డి)ని సంక్షిప్తంగా, సామాన్య పరిభాషలో ప్రపంచ బ్యాంక్ అని వ్యవహరిస్తారు. ఇది 1944 జూన్ 22న అమెరికాలోని బ్రెటన్‌మడ్‌లో జరిగిన సమావేశంలో ఏర్పాటయింది. తర్వాత మరి రెండేళ్లకు అంటే 1946 జూన్ 25 నుండి తన కార్యకలాపాలను ఆరంభించింది. దీని కేంద్ర కార్యాలయం వాషింగ్టన్ డీసీలో ఉంది.*

*ఐబిఆర్‌డిలో మూడు విభాగాలుంటాయి. ఒకటి ప్రపంచ బ్యాంకు, రెండోది ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఐడిఎ), మూడోది ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సి).*

*తన దగ్గర సభ్యత్వం తీసుకున్న దేశాలు సమకూర్చే పెట్టుబడి ఆధారంగా ప్రపంచ బ్యాంకు తన వ్యవహారాలను నిర్వహిస్తుంది. ఒక్కో దేశమూ సమకూర్చే పెట్టుబడిని బట్టి దానికి ఓటింగ్ శక్తి వస్తుంది. ఒక దేశం ఎంత పెట్టుబడి పెట్టొచ్చు అనేదానికి ఎన్నో అంశాలు పునాదిగా ఉంటాయి. స్థూలంగా చూసినప్పుడు ఒక దేశం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో, వాణిజ్యంలో ఎంత యాక్టివ్‌గా ఉంది అనేదాన్ని బట్టి ప్రపంచ బ్యాంకులో దాని స్థానం నిర్ణయింపబడుతుంది. మనకు సులువుగా అర్థమయ్యేదేమిటంటే – అభివృద్ధి చెందిన దేశాలకు ఓటింగ్ పవర్ ఎక్కువ.*

*వివిధ దేశాల్లో జరిగే అభివృద్ధి పనులకు ఊతంగా నిలవడానికి ప్రపంచ బ్యాంకు దీర్ఘకాలికమైన రుణాలిస్తుంది. అయితే ఆయా దేశాలు అప్పును ఎంత బాగా తిరిగి తీర్చగలవు అన్న అంశాన్ని ముందే మదింపు చేసుకుంటుంది!*

*ఇక అంతర్జాతీయ అభివృద్ధి మండలి (ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ – ఐడిఎ) కొన్ని దేశాల దాతృత్వం మీద, ప్రపంచ బ్యాంకు లాభాల మీద ఆధారపడుతుంది. ఇది పేద దేశాలకు*

చాలా తక్కువ వడ్డీకి అప్పులిస్తుంది. ఐడిఎ, ఐబిఆర్‌డిలు ప్రభుత్వాలకు లేదా ప్రభుత్వ గ్యారెంటీ ఉన్నవాటికే రుణాలిస్తాయి. కాని ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సి) ప్రైవేటు రంగానికి రుణాలిస్తుంది.

ప్రపంచ బ్యాంకు కార్యకలాపాలను ఒక బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ బృందం నిర్వహిస్తుంటుంది. వాళ్లను అందులో సభ్యత్వం ఉన్న దేశాలు ఎన్నుకుంటాయి. వాళ్లను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అంటారు. ప్రపంచ బ్యాంకు డైరెక్టర్లంటే ఐడిఎ, ఐఎఫ్‌సిలకూ వాళ్లే అధికారులు. చర్చల్లో అందరు డైరెక్టర్లూ సమానంగా పాల్గొనవచ్చు కాని తమ దేశం ఎన్ని నిధులు సమకూర్చిందన్న దానిమీదే ఈ డైరెక్టర్ల ఓటుకు విలువ, శక్తి ఉంటాయి. ఉదాహరణకు ఏదైనా విషయం మీద ఓటింగ్ పెడితే, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలు రెండు కలిపితే అమెరికా ఒక్క ఓటుకు సమానం కాదు. అప్పటికి ప్రపంచ బ్యాంకులో మన దేశం ఏడో అతి పెద్ద షేర్ హోల్డర్.

# కథానాయకుడితో కార్యనిర్వహణ ...

ప్రపంచబ్యాంకు నుంచి తిరిగి వచ్చి, 1983 అక్టోబర్‌లో నేను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్లానింగ్ శాఖ కార్యదర్శిగా పని మొదలుపెట్టాను. నాటి నుంచే ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుగారితో నా పరిచయం మొదలైంది. కోరి ప్రపంచబ్యాంకు నుంచి నన్ను రప్పించింది తానే కనుక నేనాయనకు వీరవిధేయంగా ఉండాలన్నది ఎన్టీఆర్ అభిలాష.

అంతగా పట్టుబట్టి నన్ను రప్పించడం ఎందుకు? 1977 మొదలుకొని నేను మన దేశంలో లేను కనుక, ఇక్కడి కాంగ్రెస్ వర్గాల ప్రభావం నా మీద ఉండే అవకాశం లేదు. రెండోది– ఎన్టీఆర్‌కు సన్నిహితులైన డాక్టర్ నాయుడమ్మ నా గురించి మంచిమాటలు చెప్పి ఉండవచ్చు. ఇక మూడో కారణం – నేను ప్రపంచబ్యాంకులో పనిచేసి, మాతృభూమికి మరలి వచ్చాననే గ్లామర్.

వీటివల్ల నేను ఎన్టీఆర్‌తో సన్నిహితంగా పనిచేసే వీలు కలిగింది. ఈ ప్రత్యేక బంధం అంతే ప్రత్యేకంగా ఎక్కువ కాలం నడవలేదనుకోండి, అది వేరే విషయం. ఎందుకో అది కూడా చెబుతాను.

### నేను అద్భుతమైన వ్యక్తిని కదండీ

ఎలా చూసినా, తానొక అద్భుతమైన హీరోనని, హీరో అనే ఏముంది, అసలు తాను కారణజన్ముడినని ఎన్టీఆర్ మనస్ఫూర్తిగా నమ్మేవారు. మేం పనిచెయ్యడం మొదలుపెట్టిన ఓ రెండేళ్ల తర్వాత ఒకరోజు మేమిద్దరమే ఉన్నప్పుడు ఆయన అకస్మాత్తుగా నన్నో ప్రశ్న వేశారు.

'వేణుగోపాల్‌రెడ్డిగారూ, నేను చాలా గొప్ప వ్యక్తిని. కదండీ?'

'ఎందుకలా అనుకుంటున్నారు సర్?'

'నేను నటుడిగా, కథానాయకుడిగా ఎన్నో సినిమాల్లో చేశాను. విజయవంతమైన, తిరుగులేని హీరోని. ఎంతో డబ్బు సంపాదించేవాణ్ణి. కాని అవన్నీ వదిలేసి ప్రజలకు సేవ చెయ్యడానికే రాజకీయాల్లోకి వచ్చాను. నేనెంతో త్యాగం చేశాను కదండీ....'

'సర్, స్వాతంత్ర్య ఉద్యమ దినాల్లో ఎంతోమంది తమ సమస్తాన్నీ త్యాగం చేశారు కదా...'

'కాని నేను సొంతంగా పార్టీని ప్రారంభించి, తొమ్మిది నెలల్లో అధికారాన్ని చేజిక్కించుకున్నాను. చరిత్రలో ఇలాంటి అద్భుతం జరిగిందా చెప్పండి?'

'సర్, నాకైతే తెలియదు. లేదేమోనండి..'

'కేంద్ర ప్రభుత్వం నన్ను నాశనం చెయ్యాలని కంకణం కట్టుకుంది. నన్ను ఇబ్బందుల పాల్జేయడానికి ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్‌ను కూడా ప్రయోగించింది. ఆఖరుకు న్యాయస్థానాలను కూడా ప్రభావితం చేస్తోంది. అయినా, నేను ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నాను, ప్రజలు నన్నెంతగానో అభిమానిస్తున్నారు, నాకు బ్రహ్మరథం పడుతున్నారు. నేను గొప్పవాణ్ణా కాదా చెప్పండి?'

'సర్, మీరు అన్నిరకాలుగా విజయవంతమైన వ్యక్తి. అందువల్ల గొప్పవాళ్లే..'

చాలా జాగ్రత్తగా మాటలు పేర్చి నేనిచ్చిన ఈ సమాధానంతో ఆయన సంతృప్తి చెందలేదు.

'కేంద్ర ప్రభుత్వం ఆఖరుకు గవర్నర్‌ని కూడా నా మీదకు ఉసిగొలిపింది. మా ఎమ్మెల్యేల్లో ఇబ్బందులు సృష్టించి, ముఖ్యమంత్రిగా నన్ను తప్పించి, మరొకర్ని పెట్టి నా అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. అప్పుడు కూడా నేను వీరోచితంగా పోరాడాను. తిరిగి నేనే అధికార పీఠానికి వచ్చాను. తలవంచి నన్ను ఈ పీఠంపై కూర్చోబెట్టక తప్పలేదు ఆ రాక్షసికి! ఇలాంటిది ఎక్కడా ఎప్పుడూ జరిగి ఉండదు..' అని గట్టిగా చెప్పారు.

'సర్, మీరెంత గొప్పవాళ్లో నాకిప్పుడు అర్థమయింది.... నిస్సందేహంగా మీరు చాలా గొప్ప వ్యక్తి సార్..' అన్నాను.

ఎన్టీఆర్‌గారికి తనపై తనకున్న గొప్ప అభిప్రాయం ఈ సంభాషణతో తేటతెల్లమైంది నాకు. నిజమైన ప్రశంస పట్ల ఆయనకున్న ఇష్టం కూడా నాకు అర్థమైంది.

ఎప్పుడైనా తాను ప్రత్యేకంగా కనిపించాలని ఉండేదాయనకు.

చీరలాగా అనిపించే పట్టుబట్టలు కట్టుకునేవారు కొన్నాళ్లు, మరికొన్నాళ్లు కాషాయం ధరించారు, ఇంకొన్నాళ్లు స్వామి వివేకానందలాగా వస్త్రధారణ చేసేవారు. ఏది చేసినా ఆయనకున్న జనాకర్షణ మాత్రం తిరుగులేనిది!

ఒకరోజు తన చేతిరాతను చూపించి, నా అభిప్రాయం అడిగారు ఎన్టీఆర్. చాలా బాగుందన్నాను నేను. ఆ తర్వాత ఎర్రసిరాతో తెలుగు, ఇంగ్లీషుల్లో రాసి, 'ముత్యాలకోవలా ఉంది కదండీ...' అనడిగారు. అవునని చెప్పక తప్పలేదు నాకు.

**పరమశివుడి వంటివాణ్ణి!**

ఎన్టీఆర్‌తో సన్నిహితంగా పని చేస్తున్నప్పుడు ఆయన స్వభావం, లక్షణాలను గమనించే వీలు కలిగింది నాకు. ముఖ్యంగా ఏదైనా మాట్లాడుతున్నప్పుడు, ఆయన నటిస్తున్నారో లేక నిజంగానే చెబుతున్నారో – ఎదుటివారికి అర్థమయ్యేది కాదు. నాకేమనిపిస్తుందంటే – ఆయనకే అది తెలిసేది కాదని!

ఒక్కోసారి, ఆఫీసు గదిలో ఇద్దరుముగ్గురు అధికారులే ఉన్నప్పుడు కూడా వేలమందిని ఉద్దేశించి బహిరంగ సభలో ప్రసంగిస్తున్నట్టు హెచ్చు స్వరంతో మాట్లాడేవారు, రకరకాల హావభావాలను ప్రదర్శించేవారు!

వ్యక్తిగతంగా గాని, వృత్తిరీత్యాగాని చాలా క్రమశిక్షణతో ఉండే మనిషాయన.

కొందరు ఆయన్ని స్థిరమైన అభిప్రాయాలున్న వ్యక్తి అనుకుంటే, మరికొందరు మొండిపట్టు మనిషి అనుకునేవారు. సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపించాలనుకునేవారు తప్ప, వాటిని లోతుగా అధ్యయనం చేసే దృష్టి ఆయనలో ఉండేది కాదు.

తెలివితేటలు, జ్ఞానమంటే మాత్రం ఆయనకు అపారమైన గౌరవం ఉండేది.

ఎంత దగ్గరవాళ్లకైనా, ఆయన నెక్ట్స్ స్టెప్ ఏమిటో ఊహించడం అసాధ్యంగా ఉండేది. కాని దేనిమీదైనా ఒక నిర్ణయం తీసుకున్నారంటే ఇక దానిమీద గట్టిగా నిలబడేవారు. ఎన్ని ఇబ్బందులొచ్చినా భరించేవారే తప్ప వెనకడుగు వెయ్యడం అనేదే లేదు. ఒక సందర్భంలో నేను సలహానివ్వాల్సి వచ్చింది. 'ఇలా చేస్తే బాగుంటుందండి. కాని తర్వాత రాజకీయంగా ఇబ్బందులు రావచ్చు...' అని ముందే చెప్పాను. దానికాయన 'రెడ్డిగారూ, నా నిర్ణయాల వల్ల వచ్చే పర్యవసానాల్ని నేను ధైర్యంగా

ఎదుర్కొంటాను. నేను పరమశివుడి వంటి వాణ్ణి. గరళాన్ని గళంలో దాచుకోగలను!' అన్నారు గంభీరంగా!

**పిండి వాడిది, అట్టు మనది**

ఒకసారి ఇద్దరుముగ్గురు అధికారులం ఉదయాన్నే ఆయన ఇంటికి వెళ్లాం. వాళ్లింట్లో నిత్యం బ్రేక్‌ఫాస్ట్‌లో పెసరట్లు ఉండాల్సిందే. మేం భోజనాల బల్ల దగ్గర కూర్చున్నాం. ఏవేవో పెట్టారు కాని పెసరట్టు రాలేదు. ఎన్టీఆర్ వంటవాణ్ణి పిలిచి 'పెసరట్లు పెట్టు...' అన్నారు.

వాడు చేతులు నలుపుకుంటూ 'అయిపోయాయి సార్...' అన్నాడు నెమ్మదిగా. మళ్లీ వాడే 'మనింటి పక్కనున్న అన్నపూర్ణ హోటల్ నుంచి తెప్పించి పెట్టమంటారా సార్...' అని అడిగాడు ఆయన్ని.

అంతే, ఆయనకు చాలా కోపం వచ్చేసింది.

'మన ఇంటికి వచ్చిన అతిథులకు హోటలు నుంచి తెప్పించిన ఆహారాన్ని పెట్టడం ఏమిటి? తాళ్, వీల్లేదు..' అన్నారు గట్టిగా.

వంటవాడు వెనుతిరగబోతుంటే, 'హోటల్ నుంచి పెసరట్టు పిండి తీసుకురా. అట్లు మాత్రం మన వంటింట్లోనే తయారుచెయ్యి...' అన్నారు.

మేమంతా ఒకరి మొహాలొకరు చూసుకున్నాం!

ఎన్టీఆర్ అధికారులను చాలా వేకువనే సమావేశాలకు పిలిచేవారు. అది నచ్చక కొందరు అధికారులు ఇబ్బందిపడుతున్నారని ఆయన దృష్టికి వచ్చింది. ఒక విస్తృతస్థాయి సమావేశంలో ఆయన దాని మీద స్పందించారు.

'మేం తెల్లవారుతూనే సమావేశాలకు పిలవడం వల్ల కొందరు అధికారులు ఇబ్బంది పడుతున్నారని మాకు తెలిసింది. కాని ఇదే అధికారులు కొంతమంది ముఖ్యమంత్రులు అర్ధరాత్రి వరకూ సమావేశాలు నిర్వహించినా ఉండేవారు. అలాగే ముఖ్యమంత్రి పిలిచే వరకూ ఆయన ఆఫీసు బయటే ఎన్ని గంటలయినా వేచి ఉండేవారు. మరి మేం అలాకాదే? పిలిచిన సమయానికే సిద్ధంగా ఉంటాము, ఎవ్వర్నీ ఎదురుచూసేలా చెయ్యము. ఎంతో ఆదరంగా ఉదయాన్నే నాతో పాటే బ్రేక్‌ఫాస్ట్ కూడా పెట్టిస్తాము. మరి వారి సమస్య ఏమిటో మాకు అర్థం కావడం లేదు!' అన్నారు.

## హీరోయిన్లు మారాలి, హీరో మాత్రం ఒక్కడే

ఎన్టీఆర్‌కు సన్నిహితంగా మెలిగేవాళ్ల జాబితా తరచూ మారిపోయేది. మరీ ముఖ్యంగా తెలివైన అధికారుల పట్ల ఆయన పూర్వకాలపు మహారాజుల తత్వంతో మెలిగేవారని అందరూ అనుకునేవారు. అంటే, తెలివితేటలున్న ఒక అధికారి ఎవరైనా ఆయన కంటపడగానే, వాళ్లను ఆయన తన దగ్గరకు రప్పించుకునేవారు. కొద్దికాలం తర్వాత మరొకరు. ఆ తర్వాత మరొకరు.

'ఆయన సినిమాల్లో పనిచేసి వచ్చారు కదా. అదే సూత్రం ఇక్కడా వర్తిస్తోంది' అనుకునేవారు అధికారులు. అదేంటంటే, ఎన్నేళ్లయినా, ఎన్ని సినిమాల్లోనైనా కథానాయకుడు ఒక్కడే – అది ఆయనే. కేవలం హీరోయిన్లు మారుతుంటారు. ఈ పాత్ర ఆయన అధికారులకు వర్తింపజేస్తున్నారు!

ఇది నిజమేనేమో అనిపించే ఉదంతమొకటి నాకూ తెలుసు.

1984 –85 బడ్జెట్‌ను తయారుచేసే ముందు దానిమీద సంప్రదింపులు చేసేందుకు మంచి సమర్థులైన ఆర్థికవేత్తలెవరైనా ఉంటే చూడమని నాకు చెప్పారు. నేను ప్రొఫెసర్ బల్వంత్‌రెడ్డి పేరును సూచించాను.

'మీరు రాకముందు ఏదో ఒక విషయంలో అవసరమై ఆయనతో మాట్లాడాం. మళ్లీ వాళ్లే ఎందుకు, మరొక కొత్తవారిని చూడండి...' అన్నారు ఎన్టీఆర్!

ఇది పైన చెప్పిన 'హీరో ఒకడే – అనేక హీరోయిన్లు' సూత్రానికి నిరూపణ కావచ్చు. లేదా తటస్థంగా ఉండి ఆలోచిస్తే – అంతకుముందు బల్వంత్‌రెడ్డి ఇచ్చిన సలహా ఆయనకు నచ్చలేదేమో!

★ ★ ★ ★

కె.ఎల్. కృష్ణగారు తెలుగువారు, దేశ వ్యాప్తంగా పెద్ద పేరున్న ఆర్థికవేత్త. అప్పటికి ఆయన ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పనిచేసేవారు.

ఆయన మన ప్లానింగ్ బోర్డ్‌లో ఉండాలన్నది ఎన్టీఆర్ కోరిక. కృష్ణగారు ఎన్టీఆర్‌గారిని కలిసి, 'సర్, నేనేమీ ప్రాంతీయ ప్లానింగ్‌లో నిపుణుడిని కాదు. ఆ రంగంలో నైపుణ్యం, అనుభవం ఉన్న వై.వి.రెడ్డి ఇప్పటికే మీ దగ్గర ఉన్నారు. అందువల్ల ప్లానింగ్ బోర్డ్‌లో నా అవసరమయితే లేదు...' అని స్పష్టంగా చెప్పారట.

ఆ సమావేశం కాగానే ముఖ్యమంత్రి నన్ను పిలిచి 'రెడ్డిగారూ, మీరు కె.ఎల్. కృష్ణగారికి మంచి స్నేహితులనుకుంటా..' అన్నారు. అవునన్నాను.

'మన ప్లానింగ్ బోర్డులో చేరమంటూ నేను ఆయనను ఆహ్వానించాను. కాని ఆయన వినడం లేదు. మిత్రులుగనుక, ఆయనకు మీరు నచ్చజెప్పండి...' అన్నారు.

నేను కృష్ణగారిని అభ్యర్థిస్తే, ఆయన కాదనలేక, రెండు మూడు సమావేశాలకు వచ్చారు. తర్వాత ఆయన రాలేదు, ఎన్టీఆర్ అడగలేదు!

## నచ్చని వ్యవస్థ మారాల్సిందే

ఎన్టీఆర్ పనితీరు చాలా వినూత్నంగా, విలక్షణంగా ఉండేది. దానికి ముఖ్యకారణం ఏమిటో ఆయనే ఒకసారి నాతో చెప్పారు.

'రెడ్డిగారూ, నేను డిగ్రీ పూర్తి చేసిన తర్వాత సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో క్లర్కుగా చేరాను. రోజూ ఆఫీసుకు మేం కోటు వేసుకుని వెళ్లేవాళ్లం. సీట్లో కూర్చోబోయే ముందు ఆ కోటు తీసి కుర్చీకి వెనకవైపు తగిలించేవాళ్లం.

సాయంత్రం ఇళ్లకు బయల్దేరబోయే ముందు ప్యూన్ వచ్చి ఆ రోజు వచ్చిన లంచాల డబ్బును ఎవరికెంత రావాలో అంత వాళ్లవాళ్ల కోటు జేబుల్లో పెట్టేసేవాడు. అందరూ ఏమీ ఎరగనట్టు ఇంటికెళ్లిపోయేవారు. నాకు మాత్రం ఆ పద్ధతి ఏ మాత్రం రుచించలేదు. నా మనసుకు చాలా కష్టంగా అనిపించేది. అందుకే ఆ ఉద్యోగాన్ని వదిలేశాను. అదృష్టం బాగుండి, దేవుడు చల్లగా చూశాడు - నేను సినిమాల్లో రాణించాను....' అంటూ చెప్పుకొచ్చారు.

తొలిరోజుల్లోని అలాంటి అనుభవం వల్ల ఆయన అధికారులంటే లంచగొండులనే నిర్ణయానికి వచ్చారు! అదీగాక, ముఖ్యంగా ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ తనను వేధించిందని ఆయన భావన. దాంతో ప్రభుత్వంతో పనంటే తలనొప్పి అనే భావన ఆయనలో స్థిరపడిపోయింది.

ఇక్కడో విశేషం చెప్పుకోవాలి. ఎవరైనా సరే, ప్రభుత్వ వ్యవస్థ, యంత్రాంగం నచ్చనప్పుడు ప్రైవేటురంగం మీద ఆధారపడతారు. అయితే ఎన్టీఆర్‌గారికి ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు పట్ల ఎంత అపనమ్మకం ఉన్నా, వారిని కాదని ప్రైవేటు రంగానికి పెద్దపీట వెయ్యలేదు. ప్రభుత్వ వ్యవస్థలో మార్పు రావాలి, ప్రభుత్వం ద్వారానే సామాన్యులకు మేలు చెయ్యాలి అని గట్టిగా కోరుకునేవారు.

తాను ఈ వ్యవస్థలో భాగమని ఎన్‌టీ రామారావుగారు అనుకునేవారు కాదు. అందువల్ల ఉన్న అధికారులు, ఇతర ఉద్యోగులు తనకు విశ్వసనీయంగా ఉంటారని కూడా ఆయన భావించేవారు కాదు. అప్పటికి ఉన్న వ్యవస్థను సమూలంగా మారిస్తే తప్ప తనకు పట్టు చిక్కదని, అవి బాగా పనిచెయ్యవన్న అభిప్రాయానికి వచ్చేశారు.

## అనుకున్నది సాధించిన మండలాధీశుడు

అప్పట్లో పరిపాలనపరమైన అంశాల్లో రెవెన్యూకు తాలూకా, అభివృద్ధిపరమైన అంశాలకు బ్లాకులు ప్రాథమిక యూనిట్లుగా ఉండేవి. గ్రామీణ ప్రాంతాల్లో అవి రెండూ ఒకటేనని అనుకునేవారు సామాన్యులు. తాలూకాలు బ్రిటిష్ కాలం నుంచి ఉంటే, బ్లాకులు 1950, 60ల నుంచి ఉన్నాయి. ఆ తర్వాత ముప్ఫై ఏళ్లలో జనాభా పెరిగింది, వాళ్ల అవసరాలు పెరిగాయి. కాని అవే తాలూకాలు, బ్లాకులు ఉండటం వల్ల ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండేవి కావు.

ఎన్టీఆర్ ఒకో తాలూకా లేదా బ్లాకునూ 3, 4 భాగాలుగా విడగొట్టాలనుకున్నారు. ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చెయ్యాలనేది ఆయన లక్ష్యం. ఐదో పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఏరియా ప్లానింగ్ అప్రోచ్ మీద నేనో పేపర్ రాసి ఉండటంతో ఆ విషయమ్మీద తన ఆలోచనలను నాతో పంచుకున్నారు ఎన్టీఆర్.

అప్పటివరకు శాస్త్రీయంగా జరిగిన అధ్యయనాలను, వాటి సూత్రాలను అన్వయించి ఈ విభజన చేస్తే బాగుంటుందని నేననుకున్నాను. తాలూకాలను మండలాలుగా విభజించడంలో ఆయన అనుకున్నట్టు అధికార వికేంద్రీకరణ జరుగుతుంది, ప్రజలకు పనులు సులువుగా జరుగుతాయి.

అలాగే గ్రామస్థాయిలో ప్రజలెన్నుకున్న ప్రతినిధులుండటమూ మంచిదే. కాని భౌగోళికంగా సరిహద్దులు మారిపోవడం వలన రాజకీయంగా ఆయన పార్టీ అన్ని స్థానాలనూ చేజిక్కించుకునే అవకాశం ఉండకపోవచ్చు.

అలాగని రాజకీయంగా పట్టుండేలా మార్పుచేర్పులు చేస్తే, ఆ ఉద్దేశాలను న్యాయవ్యవస్థ ప్రశ్నించవచ్చు.

మొత్తమ్మీద అన్ని అంశాలనూ సునిశితంగా విశ్లేషించి శాస్త్రీయంగా విభజన చెయ్యడమొక్కటే మార్గం.

ఆ విషయాన్నే ఆయనకు చెప్పాను. రాజకీయంగా తమ పార్టీకి కలిసి రాకపోయినా పర్లేదు, ఎంత రిస్కయినా పూర్వపు వ్యవస్థ మారితీరాలన్నదే తన అభిమతమని ఎన్టీఆర్ తేల్చిచెప్పారు.

మొత్తం సమాచారం, మ్యాపులు, కంప్యూటర్ల విశ్లేషణ, జిల్లా స్థాయి అధికారులతో సమావేశాలు... దేన్నీ వదలకుండా శాస్త్రీయంగా అధ్యయనం చేశాం. ఏ రకంగానూ ఇబ్బందులు రాకుండా కొత్త వ్యవస్థను తయారుచేశాం. తర్వాత మంత్రివర్గం మండల వ్యవస్థను ఆమోదించింది.

ముందు ఊహించినట్టుగానే, మండలాల ఏర్పాటుపై న్యాయస్థానాల్లో కొన్ని కేసులు నమోదయ్యాయి. కాని ఈ కొత్త ఏర్పాటు రాజకీయపరమైన కారణాలతో కాకుండా పరిపాలన సౌలభ్యానికే ఉపయోగపడతాయని నిరూపించడంలో నాటి ప్రభుత్వం సఫలీకృతమయింది.

పాలనా వ్యవస్థను వికేంద్రీకరించడం అన్న అంశంలో ఆంధ్రప్రదేశ్‌నొక కేస్‌స్టడీగా తీసుకుని నేను రాసిన పేపర్ 1988నాటి 'ది ఇండియన్ జర్నల్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్'లో అచ్చయింది.

**ఒక్కదెబ్బకు రెండు పిట్టలా?**

తాలూకాలు, బ్లాకుల పద్ధతిని రద్దు చెయ్యడంతో పాటు, ఎన్టీఆర్ గ్రామాధికారుల వ్యవస్థను కూడా రద్దు చేశారు.

అప్పటికి గ్రామస్థాయిలో కరణం – మునసబుల ప్రాబల్యం ఉండేది. అదే తెలంగాణలో పట్వారీ – పటేల్ ల మాట నెగ్గేది. ఆర్థిక, భూసంబంధ వ్యవహారాలను కరణాలు చక్కబెడితే శాంతిభద్రతలను మునసబులు చక్కబెట్టేవారు. ఈ పదవులు ఎక్కువగా వంశపారంపర్యంగా వచ్చినవే అయి ఉండేవి. అదికానప్పుడు, డబ్బు, భూమి, కులబలం, పరపతి వంటివి ఎక్కువగా ఉన్న కుటుంబాలు వాటిని చేజిక్కించుకుని చెలామణీ అయిపోయేవి.

ఆ వ్యవస్థను రద్దు చెయ్యాలని ఎన్టీఆర్ తీవ్రంగా అభిలషించారు. అప్పటికి పెత్తనం చేస్తున్న వారికి బదులుగా బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులు గ్రామస్థాయిలో పనులు చక్కబెట్టాలన్నది ఆయన ఆలోచన.

భూస్వామ్య లక్షణాలేమీ లేకుండా, పరీక్షల్లో ప్రతిభతో నెగ్గిన అభ్యర్థులు గ్రామస్థాయి అధికారులైతే అవినీతి తగ్గుముఖం పడుతుందని, సామాన్యుల కష్టనష్టాల పట్ల వారు సరైన దృక్పథంతో వ్యవహరిస్తారని ఎన్టీఆర్ భావన.

అదొక్కటే కాదు, కొత్త అధికార యంత్రాంగం అమల్లోకి రావడం అంటే – అప్పటివరకూ అధికారానికి మారుపేరుగా ఉన్న రెండుమూడు కులాల ప్రాబల్యం గ్రామాల్లో పూర్తిగా నశించిపోవడమే!

అందుకే రెవెన్యూ అడ్మినిస్ట్రేషన్ను సమూలంగా మార్చే అంశంలో ఎన్టీఆర్ అప్పటి రెవెన్యూ సెక్రెటరీ కాశీపాండ్యన్ మీద ఆధారపడ్డారు. ఎందుకంటే ఆయన ఈ ప్రాబల్య కులాలకు చెందినవాడు కాదు.

ఈ విషయంలో ఎన్టీఆర్ నా సలహా ఒకసారి అడిగారు. ఎందుకంటే, ఈ మార్పులు చేస్తే న్యాయపరమైన చిక్కులేమైనా తలెత్తవచ్చని ఆయన ఊహించారు. అవి రాకుండా చూడటానికి ముంబైలో ఉంటున్న ప్రముఖ న్యాయవాది నానీ పాల్కీవాలాను ముందుగానే సంప్రదించాలని ఎన్టీఆర్ భావించారు.

ఆయన ఊహించినట్టుగానే అధికార యంత్రాంగం నుండి, అటు రాజకీయ యంత్రాంగం నుండి ఆయన ప్రతిపాదించిన మార్పులకు తీవ్రమైన ప్రతిఘటన వచ్చింది. అయినా సరే, ఆనాడు ఎన్టీఆర్ తాను అనుకున్నది సాధించారు!

ఆ ఒక్క చర్య వల్ల ఆయన అనుకున్న లక్ష్యాలు కొన్నిటిని అందుకోగలిగారు. వాటిల్లో మొదటిది – భౌగోళిక సరిహద్దులు మారిపోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా బలహీనపడింది. తెలుగుదేశం బలపడింది. రెండోది – గ్రామాల్లో పెత్తనం చేసిన కరణం, మునసబులందరూ ఒక్క కలం పోటుతో నిర్వీర్యమైపోయారు.

వ్యవస్థలో ఎన్టీఆర్ చేసిన మూడో మార్పు నా పనికి సంబంధించినదే. అదేమంటే – జిల్లా స్థాయి ప్రణాళిక యంత్రాంగాన్ని బలోపేతం చెయ్యడం. జిల్లాస్థాయి ప్లానింగ్ బోర్డులను ఏర్పాటు చేసి వాటికి కలెక్టర్లు సారథ్యం వహించేట్టుగా చెయ్యడం – అప్పట్లో జరిగిన మార్పుల్లో ఒకటి.

### అవినీతి అంటే పడదు

ఒక్కముక్కలో చెప్పుకోవాలంటే, అప్పటికి ఉన్న యంత్రాంగం మీద ఆయనకు నమ్మకం ఉండేది కాదు. దానికితోడు ఆయన నాయకత్వం మీద ప్రభుత్వ అధికార వ్యవస్థకూ అపనమ్మకమే ఉండేది.

అవినీతిపరులైన, లంచగొండి అధికారుల మీద ఆయన కఠిన చర్యలు తీసుకునేవారు. దానికి 'ధర్మ మహామాత్ర' అనే పేరు పెట్టారు.

మరోవైపు, ప్రభుత్వంలోని సీనియర్ అధికారులపై క్రమశిక్షణచర్య తీసుకోవలసి వచ్చినప్పుడు తన ఇష్టప్రకారం ప్రవర్తించేవారు. దాంతో అధికార గణానికీ, ఆయనకూ మధ్య అంతరం పెరిగిపోయింది. అప్పటికే ఆయన మీద గుర్రుగా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఈ అగాధాన్ని మరింత పెంచడంలో తన వంతు పాత్ర పోషించింది. అధికారులే కాకుండా న్యాయవ్యవస్థ సైతం తన పట్ల వ్యతిరేకంగా ఉన్నట్లు ఆయన భావించేవారు.

ఆ రకమైన ఆయన ఆలోచనల ఫలితంగా తీసుకున్న నిర్ణయమే – ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు తగ్గించడం! తర్వాత కోర్టు ఆదేశాల మేరకు తన నిర్ణయాన్ని మార్చుకోవలసి వచ్చింది. ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ ఫైల్ చేసిన కేసుల కోసం ఆయన స్వయంగా కోర్టులో హాజరు కావలసి వచ్చేది. అలాంటి సందర్భాన్ని ఆయన చాలా నాటకీయంగా రక్తి కట్టించేవారు. తన అధికార నిర్ణయాల్లో కేంద్ర ప్రభుత్వం తనను ఎంతగా ఇబ్బంది పెడుతోందో నాతో చాలాసార్లు పంచుకునేవారాయన.

## అదర్ ఐటెమ్స్‌కే ప్రాధాన్యం

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన 'మనం మొదట అదర్ ఐటెమ్స్‌తో మొదలెడదాం...' అన్నారు!

మంత్రివర్గ సమావేశాల్లో సాధారణంగా చర్చించాల్సిన అంశాలను వాటి ప్రాధాన్యతను అనుసరించి ఒక వరుస క్రమంలో పెడతారు. ఇంకా ఏమైనా ఉంటే మాట్లాడుకోవడానికి వాటిని 'అదర్ ఐటెమ్స్'లో చేరుస్తారు. అందువల్ల సమావేశం మొదటి నుంచి చివరికి అన్ని అంశాలనూ చర్చించి, చివర్లో 'అదర్ ఐటమ్స్'తో ముగుస్తుంది!

అందువల్ల ఎన్టీఆర్ ముందే చిట్టచివరి అంశాలతో మొదలెడదామనేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. చీఫ్ సెక్రెటరీ ధైర్యం చేసి 'సర్, అవి చివర్లో మాట్లాడుకోవలసినవి, అంత ముఖ్యమైనవి కావు' అంటూ ఆయన చెవిలో నెమ్మదిగా చెప్పారు.

'అదర్ ఐటెమ్స్ అంటే అవి మా అంశాలు. వాటిమీద మా మంత్రుల అభిప్రాయాలేమిటో ముందుగా వినాలనుకుంటున్నాం. రెగ్యులర్ అజెండా ఐటెమ్స్

అన్నీ మీవి. మీ ప్రాధాన్యతలను బట్టి వాటిని మీరు ముందు పెట్టారు. ముందు మా అంశాలపై చర్చించాక, అప్పుడు మీవాటి సంగతి చూద్దాం...' అన్నారాయన! పనిలో ఆయన ప్రత్యేకమైన శైలికి ఈ సంఘటన అద్దం పడుతుంది.

**నా బొమ్మ పెట్టుకుని గెలిచి....**

ప్రజలు ఎన్నుకున్న రాజకీయ ప్రతినిధులంటే ఆయనకు గౌరవం ఉన్నప్పటికీ, తన పార్టీ ఎమ్మెల్యేల్లో చాలామంది కేవలం తనవల్లే గెలిచారన్న సత్యం ఆయనకు తెలుసు.

ఒకసారి ఏమైందంటే, పరిపాలనలో తమ మాటకు ఇంకొంత విలువనివ్వాల్సిందంటూ ఒక అభ్యర్థనను తీసుకుని ఎన్టీఆర్ వద్దకు వచ్చారు కొందరు ఎమ్మెల్యేలు. వాళ్లు వస్తున్నారన్న విషయం తెలిసి, నన్ను కూడా పిలిచారాయన. వాళ్లు తమ సాధకబాధకాలన్నీ చెప్పుకున్నాక, ఆయన వాళ్లకు అభయం ఇచ్చారు. పరిపాలనలో అధికారులతో పోలిస్తే ప్రజాప్రతినిధులదే పైచెయ్యిగా ఉండాలన్న వాళ్ల వాదనను అంగీకరించారు. 'ప్రజాస్వామ్యాన్ని మేం పరిరక్షిస్తాం...' అంటూ చెప్పారు. వాళ్లు వెళ్లడానికి వెనుదిరగ్గానే, 'నా బొమ్మను పెట్టుకుని గెలిచినవాళ్లీ పెద్దమనుషులు. వీళ్ల తల మీద రూపాయి కాసు పెట్టి నడిబజార్లో వేలం వేస్తే అర్ధరూపాయికి అమ్ముడుపోతారు. వీళ్లా ప్రజాప్రతినిధులు? నేను ప్రభుత్వాన్ని ఎలా నడపాలో నాకే పాఠాలు చెబుదామని వచ్చారా వీళ్లు...' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు.

వాళ్లంతా ఆయన మాటలు విన్నారు, ఒక్కరు కూడా వెనక్కి తిరిగి చూసే ధైర్యం కూడా చెయ్యకుండా వెళ్లిపోయారు!

ప్రజాప్రతినిధులంటే బాగా చదువుకున్నవారు, క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాలని ఎన్టీఆర్ అనుకునేవారు. అందువల్లే ప్రతి నియోజకవర్గంలోనూ వెతికివెతికి మరీ ఉన్నత విద్యావంతులు, మంచి పేరున్నవారికే సీట్లు కేటాయించారు. ఎమ్మెల్యేలు అయ్యాక వివిధ విషయాల మీద నిష్ణాతులతో వాళ్లకు క్లాసులు చెప్పించేవారు. బడ్జెట్‌కు ముందు దానికి సంబంధించిన విషయాలన్నీ వారు అర్థం చేసుకునేలా ప్రత్యేక శిక్షణనిప్పించేవారు, ప్రత్యేక సమావేశాలు నిర్వహించేవారు. ఎన్టీఆర్‌కు పూర్వం ఇలాంటివి జరగడం అరుదు.

**నాకు జీతమిస్తున్నారా?**

మీడియా ప్రాముఖ్యం, దాని శక్తి ఎన్టీఆర్‌కు బాగానే తెలుసు. కాని మీడియాను ఒక సానుకూల శక్తిగా ఆయన గౌరవించేవారు కాదు. ఓసారి ఏమన్నారంటే 'రెడ్డిగారూ, నేనెప్పుడూ దినపత్రికలు చదవను. వాళ్లేం రాస్తారండీ? ఓ బస్తా బియ్యమో, పంచదారో ఇచ్చామంటే మనమేం చెబితే అదే రాస్తారు. వాళ్లను మనవైపు ఉంచుకోవడం మనకు తెలియాలంతే..' అని!

నాకు తెలిసి, ఆయన ముఖ్యమంత్రి అయ్యాక కూడా దినపత్రికలు చదివేవారు కాదు. అయితే ప్రతి ఉదయం ప్రెస్ డిపార్ట్‌మెంట్‌వాళ్లు ముఖ్యమైన పరిణామాల గురించిన సమాచారం ఆయనకు తెలియజేసేవారు. ఏవైనా ముఖ్యమైన ఫోటోలుంటే వాటిని చూపించేవారు.

ఒకసారి ఒక కమ్యూనిస్ట్ నాయకుడు ఎన్టీఆర్‌ను హిట్లర్‌తో పోల్చి తిట్టారట. అది పత్రికల్లో వచ్చింది. ఆ వార్తను ఎన్టీఆర్‌కు ప్రెస్ అధికారులు ఎంతో భయపడుతూ తెలియజేశారు.

కాని ఎన్టీఆర్ 'దానిలో తప్పేముంది? హిట్లర్‌ను మించిన దేశభక్తుడు మరొకరు ఉంటే నాకు చూపించండి! నేను కూడా దేశభక్తుణ్ణే... నా మాతృదేశం పట్ల నాకు విపరీతమైన అభిమానం...' అంటూ స్పందించారు.

మీడియాకు సంబంధించి ఒక సంఘటనను నేనెప్పుడూ మర్చిపోలేను. నిజానికి రిజర్వ్ బ్యాంక్ పగ్గాలు చేపట్టిన తర్వాత నాకు ఎంతగానో ఉపకరించిన విషయం అది.

ప్రణాళికలకు సంబంధించిన ప్రశ్నలడగడానికి ఆయన ఆఫీసుకు మీడియా ప్రతినిధులు వచ్చారు. నేను అక్కడే ఉండి ఆయనకు సాయం చెయ్యాలనుకున్నాను. సాధారణంగా వాళ్లు ఎలాంటి ప్రశ్నలు వేస్తారో, ఆయన ఎలాంటి సమాధానాలు చెప్పాలో ముందుగానే చెప్పాను. ఆయన శ్రద్ధగా విన్నారు.

తర్వాత ప్రెస్‌వాళ్ల ప్రశ్నల పరంపర మొదలయింది. చాలాసార్లు వాళ్లు అడుగుతున్నదానికీ, ఈయన చెబుతున్నదానికీ పొంతన ఉండటం లేదు. అభాసు పాలవుతామేమోనని నాకు ఆదుర్దా. 'ఎందుకలా చెబుతున్నారు' అన్నట్టు ముఖకవళికలతోనే ఆయనకు సైగ చేశా.

కాని ఆయన సరదాగా నాకు కన్ను కొట్టారు. మీడియా సమావేశం ముగిసి వాళ్లందరూ వెళ్లిపోయాక మేమిద్దరమే మిగిలాం. 'అన్నీ తెలిసికూడా పాత్రికేయులకు అలా పొంతన లేని సమాధానాలు చెప్పాం మేము అనుకుంటున్నారు కదా...' అనడిగారు. నేనేం మాట్లాడలేదు.

'మాకు వాళ్లడిగిన ప్రశ్నలు అర్థమయ్యాయి. సమాధానాలు కూడా చెప్పగలం. కాని ప్రశ్నలడగడానికి పాత్రికేయులకు జీతాలిస్తున్నాయి సంస్థలు. వాళ్లకు సమాధానాలు చెప్పమని మాకెవరైనా జీతాలిస్తున్నారా? లేదే? మరి నేనెందుకు వాళ్లడిగిన వాటికల్లా చెప్పాలి? రేపుదయం పేపర్లో ఏమి వస్తే బాగుంటుందో, ప్రజలకు ఏం తెలియాలని నేను అనుకుంటున్నానో ఆ విషయాలే వాళ్లకు చెప్పాను. నాకు అదే ముఖ్యం....' అన్నారు!

**నాలుగునెలల నుంచే..**

మంత్రివర్గం తీసుకున్న ఒక నిర్ణయాన్ని అమలుపరచడంలో ఒకసారి ఒక అధికారి చాలా జాప్యం చేశారు. అది ఒక సమావేశంలో ఎన్టీఆర్ దృష్టికి వచ్చింది. 'ఈ నిర్ణయాన్ని ఏడాది క్రితం తీసుకున్నాం. ఇప్పటిదాకా ఇది అమల్లోకి రాలేదు. సమాచార కమిషనర్ గతేడాదిగా నిద్రపోతున్నారు' అన్నారాయన ఘాటుగా.

ఛీఫ్ సెక్రెటరీ 'సర్, ఇప్పుడున్న కమిషనర్ విధుల్లోకి చేరి నాలుగు నెలలే అయింది. ఇందులో ఆయన పొరపాటేమీ లేదేమో...' అంటూ నెమ్మదిగా సూచించారు.

వెంటనే ముఖ్యమంత్రి 'అయ్యో, అలాగా. ఇప్పుడున్న కమిషనర్ గడచిన నాలుగు నెలలుగానే నిద్రపోతున్నారు. మేమే పొరబడ్డాం...' అన్నారు.

**అంతా భ్రాంతియేనా?**

ఎన్టీఆర్‌దొక విలక్షణమైన పనితీరు.

ఒకసారి ఆయన 'కేంద్ర ప్రభుత్వం అనేది ఉత్తి మిథ్య, భ్రాంతి. అంతే. వాస్తవంగా ఉన్నదంతా రాష్ట్ర ప్రభుత్వాలే. కేంద్రమంటే రాష్ట్ర ప్రభుత్వాల సమాహారమే...' అన్నారు!

ఆయనకున్న ఈ దృక్పథం వల్ల ప్లానింగ్ సెక్రెటరీగా నా పని మరింత సంక్లిష్టమయ్యింది. ఎందుకంటే, నేను పొద్దున లేస్తే కేంద్ర ప్రభుత్వంతోనూ, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ప్లానింగ్ కమిషన్‌తోనూ పనులు చక్కబెట్టుకుంటూ రాష్ట్రానికి వీలైనంత ఎక్కువ లబ్ధి చేకూరేలా చూడాలి మరి!

1984 –85 వార్షిక ప్రణాళికను చర్చించడానికి కూర్చున్నాం.

'కొత్త పథకాలను ప్రకటించడం కన్నా, ప్రస్తుతం నడుస్తున్న పథకాలకు పూర్తిగా నిధులు సమకూర్చడం మంచిది. దానివల్ల ఇటు ఆర్థికానికీ, అటు వ్యవస్థకూ మేలు కలుగుతుంది...' అని అప్పటి ప్రణాళిక సంఘ అధికారులు అభిప్రాయపడ్డారు. కాని మన రాష్ట్ర ప్రణాళిక ఇక్కడి మంత్రివర్గం అభిప్రాయాలను, ముఖ్యంగా ముఖ్యమంత్రి ప్రాథమ్యాల(ప్రయారిటీస్)ను ప్రతిఫలించాలి. ప్రణాళిక సంఘ అధికారులతో భేటీ మొదలయింది. వాళ్లు పట్టు వదలకుండా – అప్పటివరకూ ఉన్న పథకాలను కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారు.

చివరికి నేను కరాఖండీగా మాట్లాడాను.

'ఆఫ్ ద రికార్డ్ ఒకమాట నిర్మొహమాటంగా చెప్పదలచుకున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఉన్న పథకాలనే కొనసాగించదలచుకుంటే, ఉన్న ప్రభుత్వాన్నే కొనసాగించేవాళ్లు కదా. ఇదీ మా ముఖ్యమంత్రి, ఇతర మంత్రివర్గ సభ్యుల అభిప్రాయం. కేంద్ర ప్రభుత్వం కూడా సమయం సందర్భాలను బట్టి ఎప్పటికప్పుడు తన ప్రాథమ్యాలను సవరించుకుంటూనే ఉంటుంది కదా... అందువల్ల ఇప్పుడు మనం చెయ్యాల్సినదేమిటంటే, ప్రస్తుతం నడుస్తున్న పథకాలకు, కొత్త పథకాలకు మధ్య ఒక సమతౌల్యం సాధించుకోవాలి. దానిలో ఉండే లాభనష్టాలేమిటో అంచనా వేసుకుంటూ ముందుకు సాగాలి...' అని చెప్పాను.

ఇరు పక్షాల రాజకీయ జోక్యంతో చివరకు అది సర్దుకుంది.

ఆ ఏడాది మనం సమర్పించినది చాలా పెద్ద ప్రణాళిక. దానికి అనుగుణంగా ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం కష్టమని కేంద్ర అధికారులకు తెలియకపోలేదు. అనుకున్నట్టే వాళ్లు ఆ అంశాన్ని ఎత్తి చూపించారు. 'మేం అన్నీ మదింపు చేసుకునే దీన్ని తయారుచేశాం, ప్లానింగ్ కమిషన్ అనుమతినిస్తే చాలు, ఈ ప్రణాళికను అమలు చెయ్యడం మీరనుకున్నంత కష్టమేం కాదు..' అంటూ నేను వాదించాను.

ఒక స్థాయిలో ఎంత వరకూ వెళ్లానంటే – 'అసలు ఆర్థిక వనరుల గురించి రాష్ట్ర ప్రభుత్వం చెబితేనే ప్లానింగ్ కమిషన్‌కు తెలిసేది. అది తప్ప కేంద్రానికి వేరే వ్యవస్థ ఏమీ లేదు. అలాంటప్పుడు, రాష్ట్రంలో వనరులు తక్కువైతే ప్రణాళికను వాళ్లే తగ్గించి తయారుచేసుకునేవారు. తాను సమకూర్చాల్సిన వనరుల గురించి కేంద్ర సంఘం

ఆలోచించుకుంటే చాలు, రాష్ట్ర ప్రభుత్వ వనరుల గురించి దానికున్న అంచనాను గౌరవిస్తే చాలు...' అని కుండబద్దలు కొట్టేశాను.

ఏడో పంచవర్ష ప్రణాళిక గురించి రాష్ట్ర – కేంద్ర ప్రభుత్వాల మధ్య అస్సలు అంగీకారం కుదరలేదు. అప్పట్లో అవసరాన్ని బట్టి రాష్ట్రాలు అప్పులు చేసేవి. దాన్ని ఎన్టీఆర్ వ్యతిరేకించేవారు.

అత్యవసర పరిస్థితుల్లో తోచినట్టు చెయ్యడం కాకుండా, దానికో సూత్రమంటూ ఉండాలనేవారు ఆయన. అంటే కేంద్రం గాడ్గిల్ ఫార్ములాను అనుసరించి సాయం చేసినట్టు, దీనికీ ఓ పద్ధతుండాలనేది ఆయన అభిప్రాయం. అంతేకాదు, కేంద్రం చేసే అప్పులు – రాష్ట్రాలన్నీ కలిపి చేసే అప్పులకు సమానంగా ఉండాలని ఎన్టీఆర్ అనుకునేవారు.

వృత్తిరీత్యా ఉన్న అనుభవంతో చూసినప్పుడు – ఇవన్నీ అంత సులువైనవి కాదని, చాలా సంక్లిష్టమైన విషయాలని మాకు తెలుసు. కాని రాజకీయ కోణం నుంచి ఎన్టీఆర్ పట్టు వదలలేదు.

అప్పటి ప్లానింగ్ కమిషన్‌కు డిప్యూటీ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ మన్మోహన్ సింగ్ ఉండేవారు. ఆయనతో నాకు చాలా కాలం నుంచి పరిచయం ఉంది. ఒకసారి మాట్లాడుతున్నప్పుడు ప్రసంగవశాత్తూ ఈ విషయం చర్చించాన్నేను.

ఎన్టీఆర్ పంచవర్ష ప్రణాళికను వ్యతిరేకించకపోవచ్చుగాని, మద్దతును కూడా తెలియజెయ్యరని మాకనిపించింది.

ఆ తర్వాత నేను ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లి కొన్ని ప్రాజెక్టుల కోసం కేంద్ర సాయాన్ని స్వీకరించడంలో తప్పులేదని, స్వీకరించకపోతే దీర్ఘకాలిక ప్రయోజనాలు దెబ్బతినవచ్చని ఆయనకు గట్టిగా నచ్చజెప్పాను. ఆ తర్వాత ఆయన తన పట్టుదలను కొద్దిగా సడలించారు. ఫలితమే – మన తెలుగు గంగ ప్రాజెక్టుకు నిధుల కోసం ప్రపంచ బ్యాంకుతో జరిగిన చర్చల్లో ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున నన్ను భాగస్వామిని చేశారు.

# బుద్ధుడికి ఉడతాసాయం

ప్లానింగ్ బోర్డ్ సమావేశాల్లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ బీపీఆర్ విఠల్‌గారి పట్ల గౌరవాభిమానాలను ప్రదర్శించేవారు.

తర్వాతి వార్షిక ప్రణాళిక చాలా భారీగా ఉండాలన్న తన అభిలాషను వ్యక్తం చేశారు ఎన్టీఆర్, ఒకసారి. అంత భారీ ప్రణాళికను అమలుచెయ్యాలంటే పన్నులు పెంచుకుంటే తప్ప సాధ్యం కాదని విఠల్‌గారు అన్నారు. ఆయన ప్రతిపాదనలన్నిటినీ ఎన్టీఆర్ కొట్టిపారేశారు.

'ప్రభుత్వమంటే గల్లాపెట్టె నింపుకునే చిల్లర కొట్టనుకున్నారా... పేద బడుగు బలహీన వర్గాలవారి మీద పన్నులు వేసి మా ఖజానాను నింపుకోమంటారా? అందరికీ ఆహారధాన్యాలు పండించే చిన్నరైతుల పొట్టకొడదామంటారా...' అని తీవ్రమైన డైలాగులతో నాటకీయంగా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

మరుక్షణంలోనే శాంతించి, 'విఠల్‌గారూ, మీరెంతో తెలివైనవారు. ఆర్థిక రంగంలో మేధావి, అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులున్న నిపుణులు. అందుకే మిమ్మల్ని మేం మరీమరీ అడుగుతున్నాము, పేదసాదల మీద పన్నుల భారం పడకుండా, నిధుల సమీకరణ ఎలా చెయ్యాలో మా ప్రభుత్వానికి చెప్పండి...' అని అడిగారు.

విఠల్‌గారు ఒక్క నిమిషం ఆలోచించారు.

'సర్, ఇంతకు ముందు చెప్పినవాటికి మించి ఏ సలహానూ నేనివ్వలేను, ఇంత భారీ ప్రణాళిక వేస్తే దాన్ని అమలు చెయ్యలేము. ఇదే ఆలోచనతో ముందుకెళితే మిమ్మల్ని ఆదుకొనేదొక్కరే....' అంటూ ఆగారు.

ఎన్టీఆర్ ఆత్రుతగా 'ఎవరది? ఎవరు మా ఆలోచనను అమలుపరచగలరు?' అని అడిగారు.

'సర్, మీ వెనకాలే ఉన్నారాయన చూడండి...' అన్నారు విఠల్‌గారు.

ఎన్టీఆర్ వెనక్కి తిరిగి చూశారు. నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుడి చిత్రపటం ఉన్నదక్కడ!

ఆనాటి మా సమావేశం అలా ముగిసింది.

## అమలుకు నోచుకోని ఆలోచనలు

నా సలహాలను, ప్రతిపాదనలను ఎన్టీఆర్ పట్టించుకోని సందర్భాలు కూడా కొన్ని లేకపోలేదు.

ఉదాహరణకు – నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఏర్పాటు ప్రతిపాదనలను నేను సమర్థించలేదు. అప్పటికి ఉన్న మన ప్రభుత్వ ఆస్పత్రులను అన్ని విధాలా బలోపేతం చెయ్యాలని, ఆలిండియా మెడికల్ సైన్సెస్ వంటి సూపర్‌స్పెషాలిటీ సంస్థలను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాలని నా అభిప్రాయం.

అలాగే అపోలో ఆస్పత్రికి పెద్ద ఎత్తున భూకేటాయింపులు జరగడం నాకిష్టం లేదు. వాళ్లకు అవసరమైన దానికన్నా ఎక్కువ అడుగుతున్నట్టు అనిపించింది నాకు. కాని నా అభిప్రాయాలను ఎన్టీఆర్ పట్టించుకోలేదు.

అలాగే ట్యాంక్‌బండ్ మీద తెలుగు ప్రముఖుల విగ్రహాలను స్థాపించడం నాకు పెద్దగా ఇష్టం లేదు. సంస్కృతికి సంబంధించిన అంశాల్లో నా వంటి ఆర్థికవేత్తలకు పెద్ద పట్టింపు ఉండదని, కాని ఆ అంశాల్లో ప్రభుత్వ జోక్యమూ, బాధ్యతా ఉంటాయన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. దానికి తగ్గట్టే ఆయన ఆ పనిని సాధించుకున్నారు.

నాగార్జున ఫెర్టిలైజర్ కంపెనీని స్థాపించడానికి చాలా ఆర్థిక సాయం అడిగారు. ప్రైవేటు సంస్థ నెలకొల్పే కర్మాగారానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చెయ్యాల్సిన పనేముందని నేను వాదించాను. కాని ఆయన నా సూచనలను కొట్టి పారేశారు.

ఎన్టీఆర్ ఆలోచనలు కాగితాలకే పరిమితమైపోయినవీ కొన్ని లేకపోలేదు.

ఒక భారీ విద్యా ప్రాంగణాన్ని ఏర్పాటు చెయ్యాలని, అక్కడ కిండర్ గార్టెన్ మొదలుకొని పీహెచ్‌డీ వరకూ చదువుకోగలిగే సౌకర్యం ఉండాలని ఆయన కలలు కనేవారు. ఆ ప్రాంగణం సమస్త సౌకర్యాలకూ నెలవుగా ఉండాలి, పూర్తిగా రెసిడెన్షియల్ అయి ఉండాలన్నది ఆయన ఉద్దేశం. పూర్వం పురాణాల్లో విన్నట్టుగా తల్లిదండ్రులు తమ పిల్లలను మూడు నాలుగేళ్ల వయసులో తీసుకొచ్చి అక్కడ అప్పజెప్పేస్తే,

వాళ్లు విద్యాభ్యాసం పూర్తయిన తర్వాతే బయటకొచ్చేలా ఉండాలనుకునేవారు. అత్యున్నతమైన నైతిక విలువలకు, విద్యా ప్రమాణాలకు ఆ సంస్థ పెట్టింది పేరుగా నిలబడాలని ఎన్టీఆర్ ఆశయం.

అప్పట్లో మంచి పేరున్న టౌన్ ప్లానర్ వెంకట రమణారెడ్డి ఆ సంస్థకు సంబంధించిన ప్లానులన్నీ గీసి ఇచ్చారు. దాన్ని సాకారం చెయ్యడానికి అధికారులతో బోలెడన్ని సమావేశాలు నిర్వహించారు ఎన్టీఆర్. అది సాధ్యం కాదని నేనెంత గట్టిగా అనుకునేవాణ్ణో, దాన్ని సాధించి తీరాలని ఆయన అంత గట్టిగా కోరుకునేవారు. ఎందువల్లనో మరి, ఆ ఆలోచన కార్యరూపం దాల్చలేదు, ఓ రెండేళ్ల తర్వాత ఆయన ఆసక్తి కూడా సన్నగిల్లిపోయింది!

కాని పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే తీరు మారాలని, కేవలం నల్లబల్ల – సుద్దముక్కలతో కాకుండా దృశ్యమాధ్యమంలో చెబితే వాళ్లకు సులువుగా అర్థమమతాయన్న ఎన్టీఆర్ ఆలోచన కొంతవరకూ అమలు జరిగింది. దానిలో భాగంగానే ప్రతి పాఠశాలకూ ఒక టెలివిజన్, వీడియో క్యాసెట్లు, వాటిని చూసేందుకు వీసీఆర్‌లను ప్రభుత్వం సరఫరా చేసింది!

అలాగే పరిపాలన సంబంధ విషయాల్లో కంప్యూటర్ల వాడకాన్ని ఎన్టీఆర్ ప్రోద్బలంతో మేం 1980ల్లోనే అమల్లోకి తీసుకొచ్చాం!

'రెండు రూపాయలకే కిలో బియ్యం' అనేది ఎన్టీఆర్‌కు అత్యంత ప్రియమైన పథకం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు బియ్యం అందాలన్నది ఆయన ఆలోచన. కేంద్రం దాన్ని తీవ్రంగా విమర్శించినా, ఎన్టీఆర్ తన పట్టు వీడలేదు.

ఆ పథకం అమలుకు ఆయన వ్యక్తిగతంగా తన శక్తియుక్తులన్నీ వెచ్చించారు. నాకు సీనియర్ అయిన ఐఏఎస్ అధికారి కె. ఆర్. వేణుగోపాల్‌ను ఆయన ఆ పనికి ఎంచుకున్నారు.

రెండు రూపాయలకు కిలో బియ్యం అందించే కన్నా, పేదలకు ఉపాధి హామీ ఉండే పథకాలకు రూపకల్పన చేస్తే బాగుంటుందని నేను సలహానిచ్చాను. కేజీకి రెండు రూపాయలైనా వెచ్చించలేని పేదలున్నారు కాబట్టి గ్రామాల్లో స్త్రీ పురుషులకు తప్పనిసరిగా ఉపాధి కల్పించి, కనీస వేతనాలు ఇవ్వగలిగితే అది వారికి మేలు చేస్తుంది. ముఖ్యంగా నిరుపేద మహిళల బతుకులకు భరోసా కలుగుతుందని

నా ఆలోచన. అంతేకాదు, కూలి కోసం భూస్వాముల మీద ఆధారపడే అవసరం పేదలకు తప్పుతుందని అనిపించింది.

ఎన్ని చెప్పినా, రెండ్రూపాయలకు కిలో బియ్యం పథకానికి బదులుగా దీన్ని ప్రవేశపెట్టడానికి ఎన్టీఆర్ అస్సలు అంగీకరించలేదు. ఆ సందర్భంలోనే ఆయనొక ఆసక్తికరమైన పరిశీలన చెప్పారు.

'బ్రదర్ ఇప్పటికే గ్రామాల్లో రైతులకు వ్యవసాయపనులకు తగినంత మంది కూలీలు దొరకడం లేదు. మనం ఉపాధి హామీ పథకాలు తీసుకొస్తే రైతుల పని ఇంకా కష్టమైపోతుంది....' అన్నారు!

## మా కన్నుగప్పిన ఎన్టీఆర్

ఎన్టీఆర్‌తో పనిచేసిన కాలంలో నేను మర్చిపోలేని అనుభవం ఒకటుంది.

నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సమావేశాల్లో ముందు ప్రధానమంత్రి, తర్వాత ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్ ప్రసంగిస్తారు. అటుపై ముఖ్యమంత్రుల ప్రసంగాలు ఉంటాయి. ఆ తర్వాత చర్చలు జరుగుతాయి, తీర్మానాలను ఆమోదిస్తారు. పరస్పర అంగీకారానికి రాలేని తీర్మానాలు కొన్ని ఉండటం సహజమే. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ముందుగానే తయారుచెయ్యడం ప్లానింగ్ సెక్రెటరీ విధి. చీఫ్ సెక్రెటరీ, ఫైనాన్స్ సెక్రెటరీల సూచనలు ముందుగానే తెలుస్తాయి.

ఢిల్లీలో ఇందిరాగాంధీ అధ్యక్షతన ఆనాడు ఎన్‌డీసీ సమావేశం జరగబోతోంది. దానిలో ఎన్టీఆర్ ప్రసంగాన్ని నేను సిద్ధం చేశాను. అచ్చు అయిన కాపీలను ముందుగానే ప్లానింగ్ కమిషన్‌కు పంపాను.

'మీ ముఖ్యమంత్రి మాట్లాడబోయే ప్రసంగం ఇదేనా, ఆయన దీన్ని ఆమోదించారా' అంటూ అటునుంచి ఒక సందేహం వ్యక్తమయింది! ఆశ్చర్యపోవడం నా వంతయింది!!

'ఎందుకలా అడుగుతున్నారు? ఆయన దాన్ని ఆమోదించారు, ఇవాళ ఉదయం ఎలా మాట్లాడాలో రిహార్సల్ కూడా చేసి చూసుకున్నారు' అని సమాధానం చెప్పాను.

ఆనాటి ఉదయం ముఖ్యమంత్రితో పాటు చీఫ్ సెక్రెటరీ, నేనూ ఆ సమావేశానికి వెళ్లాము. ఆయన వెనుకే కూర్చున్నాము. సంప్రదాయం ప్రకారం, అకార క్రమంలో తొలిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని మాట్లాడమన్నారు.

ఎన్టీఆర్ లేచి నిలబడ్డారు. అధికారికంగా రాసి ప్లానింగ్ కమిషన్‌కు అందజేసినది కాకుండా, వేరే జేబులోంచి ఒక కాగితం తీసి ఆవేశంగా రాజకీయపరమైన ప్రసంగం చేశారు. అందులో భాగంగా ఆయన కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను దుయ్యబట్టారు, రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తోందని కేంద్రాన్ని విమర్శించారు. ఆ తర్వాత తాను వాకవుట్ చేస్తున్నట్లు నాటకీయంగా ప్రకటించి బయటకు నడిచారు! ఆయనతో పాటు కాంగ్రెస్ వ్యతిరేకులైన మరికొందరు ముఖ్యమంత్రులు కూడా వాకవుట్ చేశారు.

మేం లేవబోతుంటే ఆయన వద్దు కూర్చోమంటూ చెయ్యి ఊపారు.

కొన్ని క్షణాలు గడిచాయో లేదో, ప్రధానమంత్రి, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్ కూర్చున్న వేదిక మీద ఏవో గుసగుసలు మొదలయ్యాయి. ఒక ప్రకటన కూడా వెలువడింది.

'వాకవుట్ చేసిన ముఖ్యమంత్రుల సహాయార్థం వచ్చిన అధికారులంతా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోవాలి' అని ప్రకటించారు. మా అందరికీ చాలా అవమానంగా అనిపించింది. వాళ్లు వెళ్లిపొమ్మన్నారన్న దానికన్నా, ఎన్టీఆర్ ప్రసంగం విషయంలో, ఆ సమావేశానికి సంబంధించి మమ్మల్ని నమ్మలేదనే విషయం మనసుకు చేదుగా అనిపించింది.

ఆ సంఘటనతో నా హృదయం చాలా గాయపడింది. అటుపైన ఆయనను కలుసుకుని మాట్లాడాలని నాకు అనిపించలేదు. తర్వాత ఆయన సెక్రెటరీ చాలాసేపు చెప్పిన మీదట మెత్తబడ్డాను.

వాకవుట్ చెయ్యాలని ఆయన ముందు నుంచీ అనుకోలేదట. ముందురోజు రాత్రే రాజకీయపరమైన కారణాల వలన ఆ నిర్ణయం తీసుకున్నారట. ఆ విషయాన్ని పరమ రహస్యంగా ఉంచారు. అది మాకు ముందు తెలిస్తే మేం చెడ్డవుతామన్న భావనతో, మమ్మల్ని చెడ్డ చెయ్యడం ఎందుకన్న ఆలోచనతో ఎన్టీఆర్ మాకు తెలియనివ్వలేదట.

ఆయన మాకు తెలియనివ్వలేదో, మమ్మల్ని నమ్మలేదో – ఇప్పటికీ అర్థం కాని చిదంబర రహస్యమది.

## బ్లేడ్లు, స్కూటర్ల తయారీ మా పనా?

లైట్ కమర్షియల్ వెహికిల్స్ తయారుచేసే ఆల్విన్ నిస్సాన్ కంపెనీ విస్తరణకు ఓ ప్రతిపాదన వచ్చింది. నేను బాధ్యతలు తీసుకునే సమయానికే అది దాదాపు

ఖరారయ్యింది. మిగిలిన సంప్రదింపులకు నేను జపాన్‌కు వెళ్లాలి. కాని నాకెందుకో ఆ ప్రతిపాదనలంత లాభదాయకమనిపించలేదు. పైగా రాష్ట్రప్రభుత్వంపైనే భారం పడేలా ఉంది. ఆ విషయమే సీఎమ్ ఎన్టీఆర్‌కు వివరించాను. యెన్ రుణాలతో ముందుకువెళితే భారం పెరిగే ప్రమాదముందని చెప్పాను.

'రేజర్ బ్లేడ్లు, కార్లు, స్కూటర్లు తయారు చెయ్యడం ప్రభుత్వం పనా? ప్రజాధనాన్ని వాటికోసం దుర్వినియోగం చెయ్యాలా? అదేం కుదరదు. అసలు ఈ యూనిట్‌ను అమ్మెయ్యాలి..' అన్నారాయన.

అలా చేస్తే తక్కువ ధరకు షేర్లు అమ్మవలసి వస్తుందని, కార్మిక సంఘాల వ్యతిరేకతను మూటగట్టుకొనే ప్రమాదం ఉన్నదని చెప్పాను.

'ఎంత నష్టమైనా రానివ్వండి భరిస్తాను. ఎవరు వ్యతిరేకించినా పర్వాలేదు. కాని డబ్బునిలా వృథా చెయ్యకూడదు. స్కూళ్లు, హాస్పిటళ్లపై పెట్టాల్సిన సొమ్మును ఇలాంటివాటిలో పెట్టాల్సిన అవసరం లేదు..' అన్నారాయన గట్టిగా.

రాజకీయంగా అంత బలమైన నిర్ణయం జరగడంతో ఆల్విన్ నిస్సాన్ కంపెనీలో ప్రభుత్వ వాటాను ప్రైవేటు కంపెనీలకు అమ్మడానికి ఒక కమిటీ వేశాం. కార్మికులకు ఇబ్బంది లేకుండా ఉండే నిబంధనలు రూపొందించాం. ప్రక్రియంతా సజావుగా సాగి, మహింద్రా గ్రూప్ ఆ కంపెనీని తీసుకుంది. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణలో ఇది తొలిది కాదుగాని, తొలి ఘటనల్లో ఇదొకటి.

ఆ తర్వాత 'ఆంధ్రప్రదేశ్ స్కూటర్స్' సంస్థను కూడా ప్రైవేటీకరించే బాధ్యత నామీద పెట్టింది ప్రభుత్వం. అమ్మకం సజావుగా సాగడం కోసమే నన్ను బోర్డు డైరెక్టర్లలో చేర్చారు. వివిధ కారణాల వల్ల ఆ ప్రక్రియ విఫలమైంది. కాని నేను బోర్డులో సభ్యుణ్ణి కావడం వల్ల రిజర్వ్‌బ్యాంకు జాబితాలో నా పేరు కూడా రుణం ఎగవేతదారుల్లో చేరింది! తర్వాత బ్యాంకింగ్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాక నాకీ విషయం తెలిసింది!

**ఈ-పాలనకు పునాది**

నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ప్రాంతీయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటుచెయ్యాలని కేంద్రం భావించింది. రాష్ట్ర, జిల్లా స్థాయుల్లోనూ ఉచితంగా కంప్యూటింగ్ సేవలందించేందుకు ముందుకొచ్చారు. దానికి ముఖ్యమంత్రి ఎంతో సంతోషించారు.

ఎన్ఐసీకి సహకారం అందిస్తూనే పాలనను కంప్యూటరైజ్ చెయ్యడానికి సిద్ధం కావాలని మాకు అనిపించింది. ఆనాటి ముఖ్యకార్యదర్శి టీఎల్ శంకర్, నేనూ కలిసి ప్రణాళికలు, కమర్షియల్ ట్యాక్స్ – ఇలా ప్రతి విభాగాన్ని, జిల్లా స్థాయి నుంచి కంప్యూటరైజ్ చేస్తూ రావాలని సూచించాం. దానికి ఎన్టీఆర్ తక్షణమే అంగీకరించారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ పేరుతో నాకు గుర్తుండి పాతిక లక్షల రూపాయల మూల పెట్టుబడితో ఓ సంస్థను కూడా ఏర్పాటు చెయ్యడానికి అనుమతించారు. ఇదంతా డబ్బు వృథా అని అప్పటి విపక్షం విమర్శించినా ముఖ్యమంత్రి వెనక్కి తగ్గలేదు, సరికదా, విద్యారంగంలో కంప్యూటర్ ఎడ్యుకేషన్ కోసం ఓ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటుచేశారు. అలా ఈ–పాలనకు ఆంధ్రప్రదేశ్‌లో పునాదులు పడ్డాయి.

## ఆ పాపం నాది కూడా

అసంపూర్ణ ప్రాజెక్టులు, పనులను పూర్తి చెయ్యడానికి జిల్లా కలెక్టర్ల దగ్గర కొన్ని నిధులుండేలా ఓ పథకం ఉంటే బాగుంటుందని ముఖ్యమంత్రికి ప్రతిపాదించాను. జిల్లాలోని వివిధ శాఖలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే విజ్ఞప్తులను, జిల్లా ప్రణాళికాధికారి సాయంతో ప్రాధాన్యక్రమంలో పూర్తి చెయ్యడానికి, అత్యవసరమైనప్పుడు వినియోగించడానికి ఈ నిధి ఉపయోగపడాలనేది అసలు ఉద్దేశం. దానికి క్రూషియల్ బ్యాలెన్సింగ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ అని పేరు పెట్టాం. ప్రణాళిక, బడ్జెట్ విధానాలకు ఇది విరుద్ధమని తన సన్నిహితులు చెప్పినా ముఖ్యమంత్రి మాత్రం ఆ స్కీమ్‌వైపు మొగ్గుచూపారు. మొదట్లో చాలా బాగా ఉపయోగపడిన ఈ స్కీమ్, క్రమంగా ప్రజాప్రతినిధులు తమ సిఫార్సులను పెంచడం, కలెక్టర్లపై ఒత్తిడి తేవడంతో ఎమ్మెల్యేల నియోజకవర్గాల అభివృద్ధి పథకంగా మారిపోయింది.

కొన్నేళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే స్కీమ్‌ను అనుసరించింది. కాని వాటి పేరే ఎంపీ నిధులుగా మారిపోయింది. ఒక సదుద్దేశంతో ప్రారంభించిన స్కీమ్ అనుకున్నట్లుగా, ఆరోగ్యకరంగా సాగకపోవడం చూస్తున్నప్పుడు నాకు లోపల ఇబ్బందిగా అనిపిస్తుంటుంది.

## బుద్ధుణ్ణి తీసుకొచ్చాం

హైదరాబాద్ నగరం నడిబొడ్డునున్న హుస్సేన్‌సాగర్ మధ్యలో బుద్ధుడి విగ్రహం ప్రతిష్ఠించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఎక్కడా అతుకులు లేకుండా 58 అడుగులు, 350 టన్నుల బరువుతో ఏకశిలపై చెక్కిన ఆ విగ్రహాన్ని భువనగిరి నుంచి

హైదరాబాద్‌కు రోడ్డు మార్గాన తరలించాలి. దానికో ప్రత్యేక వాహనం ఏర్పాటైంది. అది బ్రిడ్జిలు, విద్యుత్, టెలిఫోన్ లైన్లు, రైల్వేలైన్లను దాటడానికి ప్రత్యేక ఏర్పాట్లు చెయ్యవలసి వచ్చింది. అంటే కేంద్రప్రభుత్వంలోని వివిధ శాఖలు, రాజకీయనేతలతో సమన్వయం చేసుకుంటూ చెయ్యాల్సిన పని.

ఆ సమయంలో ఎన్టీఆర్‌కు కేంద్రంతో సత్సంబంధాలు లేవన్నది బహిరంగ రహస్యం.

నేను పూర్వం కేంద్ర ప్రభుత్వంలో పనిచేశాను కనుక, పదిమందితో సమన్వయం చేసుకోగలనన్న నమ్మకం ఉండటంతో ముఖ్యమంత్రి బుద్ధవిగ్రహం తరలింపు బాధ్యతను నా మీద పెట్టారు. ఆ పని నా శక్తి, ఓపిక, సమన్వయ సామర్థ్యానికి, వృత్తిగత నైపుణ్యానికి పరీక్ష పెట్టింది!

## మంచిదే అయినా విఫలమైంది!

తాము పుట్టిపెరిగిన ఊరి అభివృద్ధికి ఏదైనా చెయ్యాలని ప్రవాస భారతీయులు అనుకుంటారు. నా స్నేహితులు, పరిచయస్థులు కొందరు అలాంటి ప్రస్తావనలు నాతో చేసేవారు. కాని వాళ్లకేం చెయ్యాలో తెలియదు, ఒకవేళ ముందడుగు వేసినా, ప్రభుత్వ సంస్థలు ఏవేవో అడ్డంకులు కల్పించేవి. ఇలాంటి సందర్భాల్లో ఉపయుక్తంగా ఉంటుందని 'క్లియరింగ్ హౌస్ ఫర్ సోషల్ సర్వీస్' అనే సొసైటీని స్థాపించాను. అవసరానికి, అవకాశానికి (దాతలకు) మధ్య సంధానకర్తగా నిలబడుతుందని అనుకున్నాను. ఇది నా అధికార బాధ్యతలతో ఏమాత్రం సంబంధం లేనిది.

దీనిలో మొదట గూడూరు కాలేజీలో అదనపు భవనం, టాయిలెట్లు, సైన్స్ లాబరేటరీ నిర్మించాలనుకున్నాం. దాత సొమ్మును కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఇవ్వడానికి సిద్ధమయ్యారు. కాని రోడ్లు, భవనాల శాఖ, విద్యాశాఖ కూడా నిబంధనల సాకు చూపుతూ అడుగు ముందుకు పడనివ్వలేదు. ఆయా శాఖల కార్యదర్శులతో నేను స్వయంగా మాట్లాడినా ఏమీ ఫలితం లేకుండా పోయింది.

ఇది నేను చేసిన మరో మంచి విఫల ప్రయోగం!

## టైపిస్టు చాలు, ఐఏఎస్‌లెందుకు దండగ...

ఎన్టీఆర్‌గారికీ నాకూ తీవ్రమైన విభేదాలు వచ్చిన సంఘటన ఒకటి చెప్పాలిక్కడ.

అప్పటి వార్షిక ప్రణాళిక మీద చాలా సూక్ష్మస్థాయిలో విశ్లేషణ చేసిన తర్వాత ఆయనతో మీటింగుకని వెళ్లాను. నాకింద పనిచేసే ఉద్యోగులను కూడా తీసుకువెళ్లాను.

నేను ఏదైనా చెప్పడానికి ముందే ఆయన తనదైన శైలిలో సుదీర్ఘంగా ప్రసంగించారు. ఏకపాత్రాభినయంలోని స్వగతంలా అది ఎంతోసేపు అలా సాగుతూనే ఉంది. మాతో ఒక్కముక్కా మాట్లాడలేదు. తిరిగి వచ్చేశాం.

మేం కష్టపడి చేసిన పని అంతా వృథా అయిపోయిందని నాకు చాలా నిరాశగా అనిపించింది. నా ఆఫీసు గదికి వెళ్లి నా కాగితాలన్నీ సర్దుకున్నాను. ఛీఫ్ సెక్రెటరీకి ఫోన్ చేసి నేను లాంగ్ లీవులో వెళుతున్నానని, వీలున్నంతవరకు రాష్ట్ర ప్రభుత్వ విధుల నుండి పూర్తిగా తప్పుకునే ప్రయత్నాలు చేస్తానని చెప్పేశాను.

అనుకున్నట్టుగానే, ఎన్టీఆర్‌కు ఆ సమాచారం చేరిపోయింది. అప్పట్లో ముఖ్యమంత్రికి కార్యదర్శిగా యూబీ రాఘవేంద్రరావు ఉండేవారు. ఆయన నాకు ఫోన్ చేసి ఎన్టీఆర్‌కు ఫోనందించారు.

'మీరు వచ్చి మీ ఇబ్బందేమిటో చెబితే మనం మాట్లాడుకుందాం...' అన్నారు ఎన్టీఆర్.

'ఇంతకు మించి ఈ విషయంలో నేను చెప్పాల్సినదేమీ లేదండీ' అని ఆ సంభాషణను తుంచేశాన్నేను.

ఆ సాయంత్రం యూబీ రాఘవేంద్రరావు మా ఇంటికి వచ్చారు.

'మీ సమస్య గురించి మీరొస్తే మాట్లాడదామని ఆయన అనుకుంటున్నారు. మీరు రానంటే, ముఖ్యమంత్రే స్వయంగా మీ ఇంటికొచ్చి మాట్లాడతారట. మీకు ఏది వీలుగా ఉంటుందో చెప్పమన్నారు...' అన్నారాయన.

'అబ్బే, నేను రావడమే సముచితంగా ఉంటుంది..' అని ఆయనకు చెప్పేసి నేను ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లాను. వెళ్లగానే నా ఇబ్బందేమిటని ఆరా తీశారాయన.

'సర్, మీ ప్రభుత్వానికి ప్లానింగ్ సెక్రెటరీగా ఒక ఐఏఎస్ అధికారి అవసరం లేదు. మీక్కావలసిందంతా – తెలుగు టైపింగ్ వచ్చిన ఒక స్టెనోగ్రాఫర్. అంతే. మీకేం కావాలో, ఎలా చెయ్యాలో చెబితే వాళ్లు టైప్ చేసి పెడతారు. వృత్తిరీత్యా నాకు ఇరవయ్యేళ్ల అనుభవముంది. నా జ్ఞానం, నైపుణ్యం ప్రభుత్వానికి ఉపయోగపడనప్పుడు నేనిక్కడ ఉండి చేసేదేముంది? ఎన్నో రోజుల పాటు తదేక దీక్షగా కూర్చుని నేను, నా అధికారులు రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ వార్షిక ప్రణాళికను తయారుచేశాం. ఎంతో శ్రమించాం. దాని గురించిన వివరాలు వినే ఓపిక,

తీరిక ముఖ్యమంత్రిగారికి లేనప్పుడు నేనీ ఉద్యోగంలో కొనసాగడం అనవసరం. నా అనుభవం, నైపుణ్యాలకు భవిష్యత్తులో ఎంతో అవసరం ఉంటుంది. ఇక్కడ నా సమయాన్ని వృథా చేసుకోలేను....' అంటూ నా మనసులో ఉన్న ఆవేదననంతా గుక్క తిప్పుకోకుండా వెళ్లగక్కాను.

నా మాటలు విన్న తర్వాత ఎన్టీఆర్ ఒక్క నిమిషం కూడా ఆలోచించలేదు.

'బ్రదర్, ఐయామ్ సారీ. మీరిలా భావిస్తారని మేం అనుకోలేదు. మేం ఎమోషనల్‌గా అలా చెప్పుకుంటూ వెళ్లామంతే. మీ సేవ, సలహాలు మా ప్రభుత్వానికి ఎంతో అవసరం. అది మీక్కూడా తెలుసు. వార్షిక ప్రణాళిక గురించి త్వరలోనే మరోసారి సమావేశమవుదాం. అప్పుడు మీరు చెప్పేదంతా జాగ్రత్తగా వింటాము, మీ సూచనల మేరకే నడచుకుంటాం....' అన్నారు శాంతంగా.

అన్న మాట మేరకు వెంటనే మరో సమావేశాన్ని ఏర్పాటు చేశారు, మేం చెప్పినదంతా సావధానంగా విన్నారు. మా ఇద్దరి మధ్యా వచ్చిన ఆ అభిప్రాయభేదాన్ని ఆనాటితో తుడిచేశారంతే.

## మీ రక్తం ధారపొయ్యడమెందుకు బ్రదర్?

వ్యక్తిగతంగా నా మీద ఎన్టీఆర్ చాలా శ్రద్ధ చూపించేవారు. నాకు మధుమేహం ఉంది కనుక, మధ్యాహ్నం ఒంటి గంటకల్లా భోజనం చెయ్యాలని చేరిన కొత్తలోనే చెప్పాను ఆయనకు. దాంతో ప్రతి సమావేశంలోనూ ఆయన ఆ సమయానికల్లా సమావేశాన్ని ముగించేసేవారు లేదంటే వాయిదా వేసేవారు. ఒకవేళ ఆయన మరచిపోయినా, నేను నా వాచీ వైపు చూసుకుంటే చాలు, ఆయన దాన్ని గమనించేసి, 'రెడ్డిగారి భోజనానికి టైమవుతోంది, ఈ మీటింగ్‌ను త్వరగా ముగించేద్దాం...' అనేవారు.

ఒకసారి నా మొహం ఉబ్బిపోయి ఉండటాన్ని గమనించారాయన.

'ఎందుకలా ఉన్నారు' అని ఆయన అడిగితే, 'నా ఒంట్లో చక్కెర స్థాయి పెరిగి ఉండొచ్చు సర్. అందువల్లనే మొహం ఉబ్బిపోయి ఉంటుంది. రక్త పరీక్ష చేయించుకోవాలి...' అంటూ చెప్పాను.

'పరీక్షలంటూ మీ ఒంట్లోని రక్తాన్ని వృథా చెయ్యకండి. నేనేం చేస్తానో తెలుసా? ఉదయం లేవగానే నా శ్వాస వాసనెలా ఉందో చూస్తాను. అది దుర్వాసన వస్తుంటే

గనక నా ఒంట్లో చక్కెర స్థాయి ఎక్కువ ఉన్నట్టేనన్నమాట... ఆ మాత్రం దానికి పరీక్షలెందుకండీ...' అన్నారు!

మధుమేహులు ఏం తినచ్చో, ఏం తినకూడదో – అన్నీ బాగా తెలుసాయనకు. మొత్తమ్మీద నాకు అర్థమైనదీ, నా అనుభవంలోకి వచ్చినదీ ఏమంటే – ఆయన దగ్గరగా తీసుకున్నవాళ్లమీద అప్పటికి అపారమైన అభిమానాన్ని, వ్యక్తిగత శ్రద్ధనూ చూపిస్తారు! దూరమైతే మరి పట్టదు.

బహుశా సినిమాల్లో పనిచేసిన ప్రభావమేమోనని నాకు అనిపిస్తూ ఉంటుంది. ఒక సినిమా సెట్లో ఉన్నంతసేపూ అందరితో కలుపుగోలుగా ఉండటం, మరో సినిమా మొదలైతే ఇక పాతవాళ్లకు చెల్లుచీటీనే. సినిమా రంగంలో తన అనుభవాలను గురించి ఆలోచిస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎన్టీఆర్ ఒక రకమైన మైమరుపులోకి వెళ్లిపోయేవారు.

# మార్పును అర్థం చేసుకోవాలని

**రా**ష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక రూపకల్పనలో పాలుపంచుకోవడం నాకు ఉత్సాహంగానే ఉండేదిగాని, రెండేళ్లకల్లా అది కొంత చప్పబడిపోయింది. ప్రణాళికశాఖ కార్యదర్శిగా చేసే పని సవాళ్లతో కూడుకున్నదే. కాని ప్రణాళికలు, అభివృద్ధి పట్ల మనం అనుసరిస్తున్న దృక్పథం కాలం చెల్లినదనిపించింది.

ప్రపంచం శరవేగంగా మారడం మొదలైంది. చైనా, ఇతర ఆసియా దేశాలు అభివృద్ధి బాట పట్టాయి. ప్రపంచ పరిణామాలను మనం గమనించడం లేదేమో, వాటికి తగినట్టు మన విధానాల్లో మార్పుచేర్పులు చేసుకోలేకపోతున్నామేమో, ఇంకా మనం పాత మార్గంలోనే పయనిస్తున్నామేమో అన్న చింతన నాలో మొదలైంది. దానికితోడు ప్రపంచబ్యాంకులో పని చేస్తున్నప్పుడు దొరికే మేధాపరమైన స్ఫూర్తి, ప్రేరణ నాకిక్కడ కరువయ్యాయి.

అక్కడ పనిచేస్తున్నప్పుడే, ఆర్థికరంగంలో ప్రభుత్వాలు పోషించే పాత్రలో వస్తున్న మార్పును చూశాను. అమెరికా అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ సంస్కరణలను ప్రవేశపెట్టిన కాలం అది. సాంకేతిక అభివృద్ధి, ట్రేడ్ యూనియన్ల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ – మార్కెట్ శక్తుల మధ్య సమతూకం సాధించాలనే భావన పెరిగింది. ప్రభుత్వాలు ప్రజాసంక్షేమంలో పోషించాల్సిన పాత్ర, వాటి భాగస్వామ్యాలను పునర్ నిర్వచించుకుంటున్న సమయమది. ఈ పరిణామాలను సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి నా ఉద్యోగం వీలు కల్పించేది కాదు. దాంతో నాలో ఒకరకమైన అసహనం మొదలై, ప్రభుత్వం నుంచి బయటపడే మార్గాల కోసం అన్వేషించడం మొదలుపెట్టాను.

1985లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కాగానే, ఆయనకు నమ్మకస్థుడూ, సన్నిహితుడూ అయిన బ్యూరోక్రాట్ గోపీకృష్ణ అరోరా ఢిల్లీ వర్గాల్లో ఒక ముఖ్యవ్యక్తి అయ్యారు. 'గోపీ సాబ్' అని అందరూ పిలిచే ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు

మా ఇంటికొచ్చి చాలాసేపు మాట్లాడారు. నేను ఐఏఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆయన నన్ను అడిగారు. 'పార్టీ, ప్రభుత్వాల కోసం అంకితభావంతో కష్టపడి పనిచేసే యువ ప్రొఫెషనల్స్‌తో ఓ బృందాన్ని ఏర్పాటుచెయ్యాలని రాజీవ్ అనుకుంటున్నారు. దేశం కోసం ప్రపంచబ్యాంకు ఉద్యోగం నుంచి వచ్చేసిన నువ్వు కూడా ఆ బృందంలో ఒకడివైతే బాగుంటుంది' అన్నారు గోపీసాబ్. రాజకీయాల కన్నా అధ్యయనం అంటేనే నాకు ఆసక్తి ఎక్కువని, అందువల్ల అందులోకి రాలేనని ఆయనకు నచ్చజెప్పాను.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రవేశపెట్టిన విజిటింగ్ ప్రొఫెసర్ల విధానాన్ని ఆధారం చేసుకుని నేను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా చేరాలని నిర్ణయించుకున్నాను. అప్పటి వీసీ ప్రొఫెసర్ నవనీతరావు ఆ పనిలో నాకు సాయం చేశారు. నా తక్షణ బాస్ టీఎల్ శంకర్‌ను కలిసి, ఆయనతోపాటు ముఖ్యమంత్రి ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లి నా ఆలోచనలను ఆయనతో చెప్పాను. కొద్దికాలం ప్రభుత్వ పని నుంచి విశ్రాంతి తీసుకుని, ఉస్మానియాలో పనిచెయ్యాలనుకుంటున్నట్టు చెప్పాను.

'మీకిష్టమైనవి చెయ్యవద్దని మేమెలా అనగలం? కాని మాకు అవసరమైనప్పుడు సాయమందిస్తారుగా?' అంటూ తనదైన శైలిలో అడిగారాయన.

'తప్పకుండా సర్' అంటూ ఎన్టీఆర్‌కు మాట ఇచ్చి ఆరు నెలల డెప్యుటేషన్‌పై ఉస్మానియాకు వచ్చాను. దానివల్ల రోజువారీ ఒత్తిడి లేకుండా నాకిష్టమైన ఆర్థికశాస్త్రం, సాహిత్య పుస్తకాలు చదువుకునే వీలు కలిగింది. కాని విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్లు, విద్యార్థుల తీరు నేననుకున్నట్టుగా లేదు.

సర్కారియా కమిషన్ కార్యదర్శి శంకరగురుస్వామితో కలిసి ప్రణాళిక వికేంద్రీకరణపై చేసిన పనివల్ల కొన్ని విషయాలు నేర్చుకోగలిగాను. ఆ విద్యా సంవత్సరంలో (1985 సెప్టెంబరు – 1986 మార్చి) కీలకమైన ఆరునెలలు గడవగానే మళ్లీ ప్రణాళిక శాఖకు రావలసివచ్చింది. కాని అకడమిక్స్‌లో కొనసాగాలన్న కోరికతో ఏయే మార్గాలున్నాయో అన్వేషించడం మొదలుపెట్టాను.

ఆ సమయంలోనే హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (ఆస్కి) ప్రిన్సిపాల్ ధరణి సిన్హా తమదగ్గర ఫ్యాకల్టీగా చేరమంటూ నన్ను ఆహ్వానించారు. ప్రభుత్వం నుంచి ఏడాదిపాటు స్టడీ లీవ్ తీసుకుని ఆస్కిలో గౌరవ హోదాలో విజిటింగ్

ఫెలోగా చేరాను. ఆస్కిలో నాకో గది, సహాయకుడిని ఇచ్చారు. అక్కడి లైబ్రరీ బాగుండేది. విస్తృతంగా చదవడం, సెమినార్లలో పాల్గొనడం, శిక్షణ కార్యక్రమాల్లో లెక్చర్లు ఇవ్వడం నాకెంతో ఇష్టంగా ఉండేది. అక్కడ యువ మేధావులతో కలిసి మాట్లాడటంలో చాలా విషయాలు తెలిసేవి. వాళ్లలో కొందరు ప్రపంచవ్యాప్తంగా వివిధ సంస్థల్లో విద్యావేత్తలుగా రాణిస్తున్నారు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్‌లో కూడా గడిపే అవకాశం నాకు అప్పుడు లభించింది.

ఆస్కికి మారడం వల్ల ప్రభుత్వ అధికారికుండే కారు, ఫోను వంటి సౌకర్యాలు పోయాయి. కాని ఆస్కిలో ఉన్న అకడెమిక్ వాతావరణం ముందు అది పెద్ద అసౌకర్యం అనిపించలేదు. ఆ ఏడాదిలో మా పిల్లల చదువు మీద కూడా నేను ఎక్కువ శ్రద్ధ పెట్టగలిగాను. అప్పటికి మా అమ్మాయి కవిత ఇంటరు, అబ్బాయి ఆదిత్య పదో తరగతిలోకి వచ్చారు. రోజూ ట్యూషనుకు తీసుకెళ్లి దింపడం, అర్థం కానివి ఉంటే విడమరిచి చెప్పి చదివించడం చేసేవాణ్ణి. చిన్నప్పుడు వాళ్లకు దగ్గరగా లేకపోయినా, వాళ్ల కీలకమైన దశలో దగ్గరుండి చదివించాననే తృప్తి కలిగింది.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ)లో చదవాలన్న నా చిరకాల వాంఛను తీర్చుకోవాలని బలంగా అనిపించింది. వాకబు చేస్తే అక్కడి ఇంటర్నేషనల్ రిలేషన్స్ డిపార్ట్‌మెంట్‌లో విజిటింగ్ ఫెలో అవకాశం ఉందని, కాని ప్రతి ఏటా నలుగురికే అవకాశం ఇస్తారని తెలిసింది. దానికి నేను దరఖాస్తు చేశాను. ఏడాదిపాటు ఫెలోషిప్ మంజూరు చేసింది ఎల్ఎస్ఈ. కాని అప్పటికే నేను స్టడీలీవును దాదాపు వాడేశాను కనుక అక్కడ నాలుగు నెలలే ఉండటానికి నిర్ణయించుకున్నాను.

లండన్‌లో మా చెల్లి, బావలతో ఉన్నాను. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో గడిపిన ఆ నాలుగు నెలల సమయం నా జీవితంలో అత్యంత లాభదాయకమైనది. అక్కడి లైబ్రరీ చాలా గొప్పది. నేనున్న తక్కువ సమయంలో అక్కడి నుంచి మంచి మెటీరియల్‌ను సంపాదించడమే పనిగా పెట్టుకున్నాను. ఆ రోజుల్లో ఇంటర్నెట్ లేదు కనుక, సమాచారం కోసం లైబ్రరీ మీద ఆధారపడక తప్పదు.

ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలు, ప్రైవేటైజేషన్, రెగ్యులేషన్ తదితర అంశాల్లో సెమినార్లకు హాజరవడం, భోజనవిరామాల్లో నిపుణుల సంభాషణలను

వినడం నాకెంతో ఇష్టంగా ఉండేవి. అలా టెంపుల్టన్ కాలేజీలో జరిగిన రెండువారాల సదస్సు సందర్భంలో ఉస్మానియాలో నాకు పీహెచ్‌డీ గైడ్‌గా పనిచేసిన వి.వి. రామనాథంగారిని మళ్లీ కలిసే అవకాశం వచ్చింది. అలాగే లండన్ బిజినెస్ స్కూల్లోనూ కొంత సమయం గడిపాను.

ఎల్ఎస్ఈ, టెంపుల్టన్ కాలేజీల అనుభవాల నేపథ్యంలో 'పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఎట్ క్రాస్‌రోడ్స్', 'ప్రైవేటైజేషన్ ఇన్ డెవలపింగ్ కంట్రీస్' అనే ఆర్టికల్స్ రాశాను. ఆ తర్వాత బుడాపెస్ట్‌లో కార్ల్‌మార్క్స్ యూనివర్సిటీకి వెళ్లి మల్టీలెవల్ ప్లానింగ్‌పై ఉపన్యాసాలిచ్చాను. ఇవన్నీ చేస్తున్న క్రమంలో 'ప్లానింగ్' అనే సబ్జెక్టు పట్ల నాలో అయిష్టం పెరిగిందని నేను గమనించాను!

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు వీడ్కోలు చెప్పి వచ్చేసే ముందు దాని డైరెక్టర్ ఐజీ పటేల్‌ను కలవడానికి అపాయింట్‌మెంట్ తీసుకున్నాను. ఆయన అంతకుముందు మన రిజర్వ్‌బ్యాంకు గవర్నర్‌గా పనిచేస్తున్నప్పుడు నేను ప్రపంచబ్యాంకులో ఉన్నాను. అలా మాకు పరిచయముంది. ఆయన్ను కలిసి, ఎల్ఎస్ఈలో విజిటింగ్ ఫెలోగా నాకు అవకాశమిచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశాను.

దానికాయన 'డాక్టర్ రెడ్డి, మీ ఫెలోషిప్ గురించి నాకేమీ తెలియదు. మా స్కూల్ పద్ధతుల ప్రకారం అన్నిదశలూ దాటి మీ ఫెలోషిప్ అప్లికేషన్ నాదగ్గరకొచ్చినప్పుడు మాత్రం – అధ్యయనం పట్ల ఆసక్తి ఉన్న ఐఏఎస్‌లు ఇంకా ఉన్నందుకు సంతోషపడ్డాను..' అన్నారు!

## పారిశ్రామికాభివృద్ధి బోర్డులో

స్టడీలీవు ముగిసిన తర్వాత 1988 ఫిబ్రవరిలో మళ్లీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చేరాను. ఆస్కిలో, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో నేను చదివిన సబ్జెక్టులో కొంత ఆచరణలో పెట్టే అవకాశం వచ్చింది నాకు. ఆ ఏడాది జూలైలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఐడీసీ) వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వేశారు.

నేను చేరేటప్పటికి ఏపీఐడీసీ ఛైర్మన్ డాక్టర్ నూతక్కి భానుప్రసాద్. వృత్తిరీత్యా కెమికల్ ఇంజినీర్ అయిన ఆయన మన అణుశక్తి విభాగంలో పనిచేసి, రిటైరయిన తర్వాత కొన్ని ప్రైవేటు సెక్టార్ కంపెనీల్లోనూ మేనేజింగ్ డైరెక్టరయ్యారు. ఓఎన్‌జీసీ

ఛైర్మన్‌గా బోంబే హైలో చమురు క్షేత్రాల వృద్ధికి కృషి చేసిన భానుప్రసాద్‌గారిని 1960లో భారతప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో గౌరవించింది. మినిస్ట్రీ ఆఫ్ ఎనర్జీలో సెక్రెటరీగా, ప్రపంచబ్యాంకులో కన్సల్టెంటుగా పనిచేసిన ఆయన అపారమైన అనుభవం నాకు మార్గదర్శకంగా ఉండేది. చాలా అంశాల్లో మాకు భిన్నాభిప్రాయాలుండేవిగాని, ఆయన్నుంచి నేనెంతో నేర్చుకున్నా.

ఏపీఐడీసీలో పనిచేస్తున్నపుడు విద్యుత్ బోర్డు, ఆర్టీసీ, టూరిజం, మౌలిక సదుపాయాల సంస్థల పనితీరు గురించి తెలుసుకున్నాను. ఇదంతా నేను తర్వాత ఐడీబీఐ, నాబార్డ్, ఎస్‌బీఐ, ఎన్‌హెచ్‌బీ, ఐసీఐసీఐ వంటి సంస్థల బోర్డుల్లో సభ్యుడిగా ఉన్నప్పుడు అక్కరకొచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని పరిశ్రమలు ఎలా పనిచేస్తాయో, ఎక్కడ ఎందుకు చతికిలపడతాయో, పరిశ్రమల పట్ల ఆర్థిక సంస్థల ఆలోచనలు ఎలా ఉంటాయో అవగతమయ్యింది అప్పుడే.

జాతీయస్థాయి రీఫైనాన్సింగ్ సంస్థ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడీబీఐ) సంప్రదింపులు జరిపే అవకాశం ఏపీఐడీసీ ద్వారానే కలిగింది. ఐడీబీఐ సహకారంతో పారిశ్రామికవేత్తల అభివృద్ధికి వెంచర్ కాపిటల్ సదుపాయానికి బాటలు వేశాను. భానుప్రసాద్‌గారి మార్గదర్శనం, అంతకుముందు ప్రపంచబ్యాంకులో నాకున్న పరిచయాలతో వెంచర్ క్యాపిటల్ కంపెనీకి ఆ బ్యాంకు సాయం పొందడం సులువైంది. అలా ఏపీఐడీసీకి వెంచర్ క్యాపిటల్ అనేది సబ్సిడరీ సంస్థగా ఆవిర్భవించింది. దేశంలో నాలుగంటే నాలుగే వెంచర్ క్యాపిటల్ కంపెనీలను ప్రపంచబ్యాంకు ప్రమోట్‌చేసింది. మనదిగాక మిగిలినవి – ఐసీఐసీఐ, గుజరాత్ ప్రభుత్వం, సిండికేట్ బ్యాంకు స్పాన్సర్ చేసినవి. అనుభవం, చురుకుదనం ఉన్న మేనేజర్ డి.బి.రెడ్డి ఈ వెంచర్ క్యాపిటల్ ప్రమోట్ చెయ్యడంలో ముఖ్యపాత్ర పోషించారు. మొదట్లో బాగా నడిచిన ఈ కంపెనీ తర్వాత డీలాపడి ప్రైవేటుపరమైంది. అయితే హైదరాబాద్‌లోని పారిశ్రామికవర్గాల్లో వెంచర్ క్యాపిటల్‌పై అవగాహన కలిగించడానికి ఇది పునాదులు వేసింది.

నేను చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసిన కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ఏపీఐడీసీకి మధ్య కొన్ని సందర్భాల్లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో పేరుప్రతిష్ఠలున్న ఒక వ్యాపారవేత్త కంపెనీకి ఈక్విటీ రూపంలో భారీ మొత్తాన్ని చెల్లించేట్టు ఏపీఐడీసీ ద్వారా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇది నేను

వెళ్లకముందే జరిగింది. చాలామంది చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకిచ్చిన హామీలను గాలికొదిలి ఇంత పెద్దమొత్తాన్ని ఒకే సంస్థకు ఇవ్వడం సరికాదని నాకు అనిపించింది. కాబట్టి ఆ మొత్తాన్ని మళ్లీ అదనపు కేటాయింపుల ద్వారా ప్రభుత్వం ఏపీఐడీసీకి ఇవ్వాలని ప్రతిపాదించాను, కొంత మొత్తం వచ్చేలా సఫలమయ్యాను కూడా.

మరో సందర్భంలో కాంగ్రెస్ నాయకుడి కుమారుడికి సంబంధించిన కంపెనీ ఆర్థిక ఇబ్బందుల పాలయ్యి, ఏపీఐడీసీకి కట్టాల్సిన సొమ్ము కట్టలేని పరిస్థితిలో ఇరుక్కుంది. అగ్నికి ఆజ్యం పోసినట్టు ట్రేడ్ యూనియన్ల సమస్య కూడా దానికి తోడయింది. అది రాజకీయంగా తలెత్తిన సమస్య గనక డబ్బులు కట్టడానికి కాస్త సమయం ఇవ్వమంటూ ఆ పారిశ్రామికవేత్త అభ్యర్థించాడు ఏపీఐడీసీని. ప్రభుత్వానికి ఇష్టం లేకపోయినా, నేను మాత్రం చొరవచూపించి ఆయనకు సమయం ఇచ్చేలా చూశాను.

ఒక పేపరు మిల్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. సరైన యాజమాన్యం లేకపోవడం దాని ప్రధాన సమస్య. ఏం చేసినా దానికి భవిష్యత్తు లేదని నాకు అర్థమైంది. అందుకే దాని మూసివేతను ప్రోత్సహించాను. కాని ఆ చర్య కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేస్తున్న జలగం వెంగళరావుకు కోపం తెప్పించింది. రాష్ట్రంలోని అధికార పార్టీ ఒత్తిడికి లొంగి ఆ మిల్లు పట్ల నేను అనవసరంగా కఠినంగా వ్యవహరిస్తున్నానని ఆయన భావించారు.

ఆయన నాకు ఫోను చేసినప్పుడు అదేమీ లేదని చెబుతూ అసలు ఆ కంపెనీ పరిస్థితులను ఆయనకు వివరించాను. కాని ఆయన కోపం పట్టలేక 'మీరు మళ్లీ యూనివర్సిటీకి వెళ్లి పనిచేసుకోవడం మంచిది. పరిశ్రమల అభివృద్ధికి ప్రగతిశీలంగా ఆలోచించే అధికారులు కావాలి' అని అన్నారు. నేను ఏమాత్రం సంకోచించకుండా వెంటనే 'సర్, మీ సలహాకు చాలా థ్యాంక్స్. నాకు వెళ్లాలనిపించినప్పుడు యూనివర్సిటీకి తప్పకుండా వెళతాను. ఇప్పుడు మాత్రం నా విధి నేను నిర్వర్తిస్తాను' అని పెట్టేశాను.

అయితే ఆ తర్వాత మేం కలిసినప్పుడు అదేమీ మా మనసుల్లో లేదు. పరస్పరం గౌరవాభిమానాలతో పలకరించుకున్నాం.

నేను ఏపీఐడీసీలో చేరగానే ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త వచ్చి కూర్చుని పారిశ్రామిక అభివృద్ధి అంటే ఏమిటో, అందులో నేనెలాంటి పాత్ర పోషించాలో లెక్చరిచ్చారు. సరేలెమ్మని ఊరుకుంటే ఏపీఐడీసీ ఎలా పని చెయ్యాలో అదేపనిగా సలహాలివ్వడం మొదలుపెట్టారు.

వినీవినీ విసుగెత్తిన తర్వాత 'సర్, మీరు ఒక పౌరుడిగా సలహాలిస్తున్నారా లేదా ఒక పారిశ్రామికవేత్తగానా' అని సూటిగా అడిగేశాను.

'నేను పేరున్న పారిశ్రామికవేత్తను. నా అనుభవంతో చెబుతున్నాను..' అన్నారాయన. నాకు చాలా కోపం వచ్చింది.

'జాయింట్ వెంచర్లలో మీరు ఏపీఐడీసీ భాగస్వామి. ఒప్పందంలో భాగంగా మీరు చెయ్యాల్సినవేవీ చెయ్యడం లేదు, మాకు మాత్రం తెగ సలహాలిస్తున్నారు. అది మోసం కాదా?' అని అడిగేశాను తీవ్రంగా.

రుసరుసలాడుతూ వెళ్లిపోయారాయన.

తర్వాత ముఖ్యమంత్రి కార్యదర్శి నుంచి నాకు ఫోనొచ్చింది. 'ప్రముఖ పారిశ్రామికవేత్తను పట్టుకొని మోసగాడన్నారట మీరు నిజమేనా' అని సీఎమ్ కనుక్కోమన్నారట. ఆయన విన్నది నిజమేనని, కావాలంటే ఏం జరిగిందో రాసి మరీ చెబుతానన్నా. కాని మళ్లీ ఆ సబ్జెక్టు గురించి నాతో ఎవ్వరూ మాట్లాడలేదు.

## కేంద్ర ఆహ్వానం – ఆంధ్రప్రదేశ్‌కు నమస్కారం

1989లో కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి గోపీకృష్ణ అరోరా ఆ శాఖలో జాయింట్ సెక్రెటరీగా పనిచెయ్యడానికి రమ్మంటూ నన్ను పిలిచారు. అప్పటికి మన దేశం నిధుల రూపంలో సాయం కోసం ప్రయత్నిస్తోంది. ఫండ్‌బ్యాంక్ వ్యవహారాల్లో నాకున్న అనుభవం ఆ పనిలో ఉపయోగపడుతుందని అనుకున్నారాయన.

వెళ్లాలా వద్దా అని నేను ఆలోచిస్తున్నాను. ఈలోగా ఎన్నికలు వచ్చాయి, వాటిలో తెలుగుదేశం పార్టీ అనూహ్యంగా ఓటమి పాలయ్యింది. మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రిని అధికారులు అభినందించడం సంప్రదాయం. నేనూ అలాగే వెళ్లాలనుకున్నాను. కాని ఆయన ఆఫీసు నుంచి సానుకూల సంకేతాలు అందలేదు.

దాంతో కేంద్ర సర్వీసు వైపు మొగ్గు చూపాను. ఢిల్లీలో జాయింట్ సెక్రెటరీగా నాకు పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చాయి. కాని ఆసరికల్లా ఆర్థికశాఖ సెక్రెటరీగా గోపీసాబ్ వెళ్లిపోయి, డాక్టర్ బిమల్ జలాన్ వచ్చారు.

1990 ఏప్రిల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో నా రుణం తీరిపోయింది. ఏపీకి నా సేవ అక్కడితో ముగిసిపోయింది. కాని ఎక్కడున్నా హైదరాబాదులోనే స్థిరపడాలని అనుకునేవాణ్ణి. తర్వాత మళ్లీ ఎన్టీఆర్ ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చాక, నేను సెలవులో వచ్చినప్పుడు కలిశాను. ఆయనలో మునుపటి కళగాని, ఆప్యాయతగాని కనిపించలేదు. పరధ్యానంగా ఉండేవారు. అదే ఆఖరిసారి నేనాయన్ని కలవడం.

# మహాలక్ష్మి చెంతకు చేరాను కానీ..

**1990**లో నేను మళ్లీ ఢిల్లీలో, మళ్లీ ఆర్థికశాఖలో అడుగుపెట్టాను. అక్కడి 'కరెన్సీ అండ్ కాయిన్స్' విభాగంలో జాయింట్ సెక్రెటరీగా చేరాను. ఇదివరకు 1977లో హైదరాబాదు నుంచి ఢిల్లీ వచ్చినప్పుడున్న అసౌకర్యాలేమీ ఈసారి లేవు. పూర్వం అనుభవం ఉంది గనుక ఢిల్లీ జీవనశైలి ఎలా ఉంటుందో, మనకు కావలసిన సదుపాయాలు ఎలా అమర్చుకోవాలో – ఇవన్నీ తెలుసు. గతంలో నేను పనిచేసిన ఆర్థికవ్యవహారాల మంత్రిత్వ శాఖలోనే చేరడం వల్ల కూడా నా దారి సుగమమైంది. అప్పుడు, ప్రపంచ బ్యాంకులో పనిచేసినప్పుడు నాకు కొందరు స్నేహితులు, ఆప్తులు అయ్యారు. వారిలో డాక్టర్ బిమల్ జలాన్ ఒకరు. అప్పట్లో ఆయన చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్‌గా ఉండేవారు. మేం కలిసి ప్రయాణాలు చేసేవాళ్లం, మంచి స్నేహితులయ్యాం. ఆయనే ఆర్థికశాఖ కార్యదర్శిగా ఇప్పుడు నాకు పై అధికారి.

కుటుంబపరంగా చూస్తే, పిల్లలు – చదువులు – వాళ్ల సీట్లు అంటూ పరుగెత్తాల్సిన పనేమీ లేదు. అప్పటికి మా అమ్మాయి హైదరాబాద్‌లో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసింది. మా అబ్బాయి ఆదిత్య బెంగుళూరులోని ఆర్వీ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇంటి కోసం కాళ్లరిగేలా తిరగాల్సిన పని లేదు. నాకు పోస్టింగ్ రాగానే, మాకంటూ ఒక ఫ్లాట్ కూడా కేటాయింపు అయిపోయింది. మొత్తమ్మీద ఢిల్లీకి మార్పు ఈసారి అంత కష్టం కాలేదు.

### నోట్లూ నాణేలతో నేను...

'కరెన్సీ అండ్ కాయిన్స్' విభాగంలో పని పెద్ద కష్టమైనదేం కాదు, సబ్జెక్టు సంక్లిష్టమైనదీ కాదు. అసలు ఆ విభాగంలో పని చెయ్యడానికి ఆసక్తి చూపించేవాళ్లు తక్కువ.

రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఎన్ని నోట్లు, నాణేలు ముద్రించాలో తెలుసుకోవడం, ఎంతెంత విలువైనవి, ఎన్నెన్ని ముద్రించాలి

అన్న లెక్కతో పాటు, వాటి నాణ్యత, భద్రత ప్రమాణాలకు తగినట్టు ఉండేలా చూసుకోవడం – ఇదే కరెన్సీ అండ్ కాయిన్స్ విభాగం చేసే పని. కరెన్సీ (నోట్లు) ఆర్‌బీఐ ఇష్యూ చేస్తుంది, నాణేలను ప్రభుత్వం జారీ చేస్తుంది. కరెన్సీ, కాయిన్లు రెండిటినీ బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ఆర్‌బీఐ ప్రజలకు (డిస్ట్రిబ్యూట్) అంద చేస్తుంది. ఒక్కరూపాయి నోటు కూడా నాణెం కిందే లెక్క.

హైదరాబాద్, కలకత్తా, బొంబాయి, ఢిల్లీల్లోని నోయిడాలోని మింట్లలో నాణేల ముద్రణ జరుగుతుంది. వీటిని నేరుగా ప్రభుత్వమే చూసుకుంటుంది. నోట్లను నాసిక్‌లో ప్రభుత్వ ముద్రణశాలల్లో ముద్రిస్తారు. ఆ కాగితం హోషింగాబాద్‌లో తయారవుతుంది. అప్పట్లో నాసిక్‌లోని ముద్రణాలయమే అన్ని రాష్ట్రాలు, కేంద్రానికి సెక్యూరిటీ పేపర్ సరఫరా చేసేది. ఒక్కమాటలో చెప్పాలంటే వీటన్నిటికీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లాగా వ్యవహరించడమే మా విభాగం పని. అయితే ముడి వస్తువుల సేకరణ, ఉద్యోగుల నియామకాల వంటివన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకే జరుగుతాయి.

నోట్లు, నాణేల ముద్రణలోనూ, డిమాండ్‌ను నిర్ణయించడంలోనూ – మా విభాగం రిజర్వ్ బ్యాంక్‌తో సమన్వయం చెయ్యడం కీలకమైన విషయం.

కరెన్సీ అండ్ కాయిన్స్ విభాగంలో నేను పని చేసింది మూడు నెలలే. ఆ సమయంలోనే నాకు ఆ సబ్జెక్టు అర్థమయింది, అందులోని సమస్యలూ అవగతమయ్యాయి.

ముద్రణశాలల్లో ట్రేడ్ యూనియన్లకు ఎంత పట్టు ఉంటుందంటే, అవసరం లేకపోయినా తమ బోనస్ కోసం కార్మికులు నాణేల ముద్రణ చేస్తూనే ఉంటారు! ఇప్పుడు అది తగ్గింది. అలాగే నోట్ల ముద్రణకు అవసరమయ్యే కాగితం, ఇంకుల వంటివి, నాణేలకు అవసరమయ్యే లోహం దిగుమతి, సరఫరా వంటి విషయాల్లో కొందరికి ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. అంచనాలు సరిగ్గానే ఉన్నా కూడా, చాలాసార్లు నాణేలు అవసరం కన్నా ఎక్కువగా ఉండేవి, లేదంటే చాలినన్ని లేకపోయేవి.

ఆ సమయంలో మన రిజర్వ్‌బ్యాంక్ కర్ణాటకలో, పశ్చిమ బెంగాల్లో కొత్తగా రెండు ముద్రణాలయాలను నెలకొల్పాలని అనుకుంది. దానికి సంబంధించిన చర్చల్లో నేను పాల్గొన్నాను. నోట్లు, నాణేల ముద్రణకు అవసరమైన యంత్రాలు జర్మనీ, జపాన్‌లు సరఫరా చేస్తాయి. ఆ సప్లయర్లు వాళ్లలో వాళ్లు తెగ పోటీపడేవారు.

ఈ పనుల కోసం నేను తరచూ రిజర్వ్ బ్యాంక్‌కు వెళ్లాల్సి వచ్చేది. కరెన్సీ అండ్ కాయిన్స్ విభాగంలో నేనున్నది తక్కువ కాలమే అయినా, సామాన్యులపై ప్రభావం చూపించే ఎన్నో విషయాల గురించి అర్థం చేసుకోవడానికి అది ఉపయోగపడింది, ఆ తర్వాత నేను రిజర్వ్ బ్యాంక్‌లో పనిచెయ్యడంలోనూ ఈ విషయాలెంతో ఉపకరించాయి.

## కొత్త డిపార్ట్‌మెంట్‌కి

కొద్ది వారాల్లోనే నన్ను కరెన్సీ అండ్ కాయిన్స్ నుంచి తప్పించారు.

నిజానికి నేను చేరినప్పుడే ఫైనాన్స్ సెక్రెటరీ బిమల్ జలాన్ 'ఇది తాత్కాలికమే..' అంటూ సూచన చేశారు. కేంద్ర ఆర్థికశాఖలో నన్ను వెయ్యాలని ఆయన అనుకునేవారు. అయితే ఆర్థికశాఖలో చోటు సంపాదించడం అంత సులువేం కాదు. అనేక రాజకీయ ఒత్తిళ్లు, ఇతర సమీకరణాలు అక్కడ పనిచేస్తుంటాయి. అదే కాయిన్స్ అండ్ కరెన్సీ వంటి విభాగాలకు అదేమీ ఉండదు కనుక బిమల్ జలాన్ నన్ను ముందు అక్కడ పెట్టారు.

కొద్దివారాల తర్వాత అప్పుడు బిమల్ జలాన్ నన్ను పిలిచి ఆర్థిక శాఖలో రెండు ఖాళీలు వస్తున్నాయని, నాకు దేనిలో పని చెయ్యడం ఆసక్తికరంగా ఉంటే అక్కడ పెడతామన్నారు. ఒకటి – బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ (బీఓపీ) (చెల్లింపులు), ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ). రెండోది – బ్యాంకింగ్ డివిజన్‌లో ఆర్థిక సంస్థలను అభివృద్ధి పరచడం. అంటే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఐడిబిఐ), ఇండస్ట్రియల్ క్రెడిట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఐసిఐసీఐ) వంటి సంస్థలతో ముడిపడిన వ్యవహారాలను చక్కబెట్టేది. ఇది చాలా శక్తిమంతమైన, ముఖ్యమైన విభాగం.

అయినా నేను బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్, ఈసీబీలోనే పనిచేస్తానని జలాన్‌కు చెప్పాను. 'ఈసీబీలో పనంటే ఎక్కువసార్లు విదేశాలకు వెళ్లిరావలసి ఉంటుంది. మీకేమో మధుమేహం ఉంది. మరి చెయ్యగలుగుతారా' అన్నారాయన. 'పరవాలేదు, నేను చూసుకుంటానని, ఎక్కువగా బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మీద దృష్టి సారిస్తా'నని చెప్పానాయనకు.

అది అంత ఆకర్షణీయమైన విభాగం కాదు. అంతేకాదు, అప్పటికి మనం బీఓపీ విషయంలో సంక్షోభానికి చేరువ అవుతున్నామన్న సంకేతాలు కూడా ఉన్నాయి.

అలాంటప్పుడు అందులో చేరడమనేది మంచి నిర్ణయమేం కాదు. కాని అక్కడ ఆర్థికశాఖ, రిజర్వ్ బ్యాంక్‌లతో సమన్వయం చేస్తూ చేసే ఆ పని నాకు ఛాలెంజింగ్‌గా ఉంటుందనిపించింది.

అప్పుడు తీసుకున్న ఆ నిర్ణయం నా కెరీర్‌నూ, జీవితాన్నీ మలుపు తిప్పింది.

కేంద్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఆర్థిక శాఖ చాలా కీలకమైనది. ఇందులో మూడు డిపార్ట్‌మెంట్లు ఉండేవి. రెవెన్యూ, ఎక్స్‌పెండిచర్, ఎకనామిక్ ఎఫైర్స్. ప్రతి డిపార్ట్‌మెంట్‌నూ ఒక సెక్రెటరీ చూసుకుంటారు. సెక్రెటరీల్లో సీనియర్ అయిన వాళ్లను ఫైనాన్స్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. ఎకనామిక్స్ ఎఫైర్స్‌లో మళ్లీ చాలా విభాగాలుంటాయి. బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ (బీఓపీ), ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ) ఒక డివిజన్ – దానిలో రెండు డెస్కులుండేవి. బీఓపీ క్లిష్టమైన సబ్జెక్టు.

అందుకని దానిమీద పూర్తిగా పట్టుసాధించడానికి రిజర్వ్ బ్యాంకుకెళ్లి ఒక వారం పాటు అక్కడి మాన్యువల్స్ అన్నీ దీక్షగా చదివాను. అక్కడి చీఫ్ జనరల్ మేనేజర్లతో మాట్లాడేవాణ్ణి.

ఆర్థిక శాఖ నుంచి అధికారులు ఆర్‌బీఐకి వెళ్లడమే అరుదు. అది కూడా ఏదైనా నేర్చుకోవడానికి! ఆర్‌బీఐ మేనేజర్లను వాళ్ల గదికెళ్లి కలవడం ఇంకా అరుదైన విషయం. అందువల్ల నా తీరు అక్కడందరికీ ఆశ్చర్యంగా అనిపించేది. కాని అలా వెళ్లి అక్కడి వాళ్లతో మాట్లాడటం వల్ల నాకు తక్కువ సమయంలోనే ఎక్కువ విషయాలు అర్థమయ్యాయి. వారితో స్నేహం పెరిగింది. తర్వాత్తర్వాత ఏ సమాచారం కావాలన్నా ఫోన్లోనే చెప్పేసేవాళ్లు!

బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌లో కరెంట్ అకౌంట్, క్యాపిటల్ అకౌంట్ అని ఉంటాయి.

సొమ్మురూపేణా, సేవల రూపేణా మనం చేసే ఎగుమతులు, దిగుమతుల లావాదేవీలు, ప్రవాస భారతీయులు అక్కణ్ణుంచి ఇక్కడకు పంపే డబ్బు (రెమిటెన్సెస్) – వీటిని కరెంట్ అకౌంట్‌గా వ్యవహరిస్తారు. కరెంట్ అకౌంట్ బాలెన్స్‌డ్‌గా ఉందంటే, మన దిగుమతులకు చెల్లించాల్సిన విదేశీ మారక ద్రవ్యం ఎగుమతుల ద్వారా సంపాదిస్తున్నామని అర్థం. కాని మన దేశంలో ఎగుమతుల కన్నా ప్రవాస భారతీయులు తమ కుటుంబాల కోసం పంపే విదేశీమారక ద్రవ్యమే మనల్ని

కాపాడేది. టెక్నికల్‌గా దీన్నికూడా ఎగుమతుల కిందే లెక్కపెడతాం. ఎందుకంటే మన పౌరులు అక్కడికెళ్లి తమ పని ద్వారా సంపాదిస్తున్న మొత్తం కనుక. అప్పట్లో అది కువైట్, దుబాయిల నుంచి ఎక్కువగా వచ్చేది, అమెరికా నుంచి తక్కువ. ఎగుమతులు ఎక్కువగా ఉంటే కరెంట్ అకౌంట్ మిగుల్లో ఉంటుంది. అదే దిగుమతులు ఎక్కువగా ఉంటే అది లోటులోకి వెళ్లిపోతుంది.

కాపిటల్ అకౌంట్ అంటే మన అప్పులు, షేర్ల కొనుగోళ్లు – అమ్మకాలు, విదేశాల నుంచి వచ్చిన పెట్టుబడులు, ఎన్నారై డిపాజిట్లు ఉంటాయి. మనవాళ్లు ఇతర దేశాల్లో చేసే వ్యాపారాలు కూడా ఈ అకౌంట్ కిందికే వస్తాయి.

కరెంట్ అకౌంట్ లోటు ఉన్నప్పుడు దాన్ని ఆ ఏడాది కాపిటల్ అకౌంటు ఫ్లో నుంచి సరిచెయ్యాలి. లేదంటే రిజర్వ్ బ్యాంక్ అధీనంలో ఉన్న విదేశీ మారక నిల్వల్లోంచి ఇవ్వాలి. కరెంట్ ఎకౌంట్లో మిగులు ఉన్నప్పుడు ఆ సొమ్మును విదేశీ మారక నిల్వలను పెంచుకోవడానికి ఉపయోగిస్తాము. మన ఆర్థిక లావాదేవీలు, సంస్థలు సాఫీగా నడవాలంటే విదేశీ మారక నిల్వలు ఒక కనీస స్థాయిలోనైనా ఉండితీరాలి.

మా విభాగంలో చెయ్యాల్సిన ముఖ్యమైన పనేమిటంటే – ఏడాది కాలానికి దేశ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వెయ్యడం, సమయానికి అనుగుణంగా వస్తున్న మార్పులను అంచనా వేస్తూ బీఓపీ బాగుండేలా వ్యూహాలను రచించుకోవడం. ఇదిగాక, రిజర్వ్ బ్యాంక్ విదేశీ మారక నిల్వలను దాచి ఉంచుతుంది. దానికి బడ్జెట్‌ను తయారుచెయ్యడం కూడా మా విభాగం పనే. అప్పట్లో దిగుమతులకు లైసెన్స్ అవసరం ఉండేది. ఒక స్థాయిని మించిన లైసెన్స్‌కు బీఓపీ అనుమతి తప్పనిసరి. ఇప్పుడీ దృశ్యమంతా మారిపోయింది లెండి.

ఎక్స్ఛేంజ్ రేటు ఎంత ఉండాలి, విదేశీ మారక నిల్వలు ఎన్నున్నాయన్న సమాచారం – ఏ రోజుకారోజు అతి కొద్దిమంది ఉన్నతస్థాయి అధికారులకే తెలుస్తుంది. ఇవి రెండూ అత్యంత సున్నితమైన విషయాలు. అందుకని అప్పట్లో వాటిని రహస్యంగా ఉంచేవారు.

ఆర్థికపరమైన అన్ని ముఖ్యమైన నిర్ణయాలను తీసుకునేది ఆ శాఖలో సీనియర్ అధికారులే. ముఖ్యంగా ఫైనాన్స్ సెక్రెటరీ, చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, రిజర్వ్ బాంక్ గవర్నర్, డిప్యుటీ గవర్నర్లు విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటారు.

వాళ్లకు అవసరమైన సమాచారాన్ని అందించడం, వాళ్లు తీసుకున్న నిర్ణయాలు అమలవుతున్నాయా లేదా అని పర్యవేక్షించడం బీఓపీ విభాగం పని.

ప్రైవేటు సంస్థలు, ప్రభుత్వ సంస్థలు బయట నుంచి ఎలాంటి రుణాలు తెచ్చుకోవాలన్నా ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ (ఈసీబీ) విభాగం అనుమతి ఉండాలి. ఒక్కముక్కలో చెప్పాలంటే అప్పుకు అప్రూవల్ అన్నమాట. ప్రతి అప్పుకు కాలపరిమితి ఎంత, వడ్డీరేటెంత, మొత్తం పడుతున్న భారం ఎంత... ఇవన్నీ తెలియాల్సిందే. దీనిద్వారా ఆ విభాగం మొత్తం డబ్బు రాకపోకలను తెలుసుకుంటుంది, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ సమతులత దెబ్బతినకుండా చూసుకుంటుంది.

# రాజకీయమూ ఆర్థికమూ కలిస్తే

**1990** జులైలో ఆర్థికశాఖలోని బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ – ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ విభాగంలో నన్ను వేశారు. చేరిన కొద్దిరోజులకే మన ఆర్థిక రేటింగ్ విషయంలో భాగస్వామినయ్యాను.

అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ స్టాండర్డ్ అండ్ పూర్ (ఎస్ అండ్ పి) వివిధ దేశాల ఆర్థికవ్యవస్థలను మదింపు వేసి రేటింగ్ ఇస్తుంది. అది చాలా ముఖ్యమైన, ప్రతిష్ఠాత్మకమైన సంస్థ. ఒక దేశ ఆర్థిక స్థితిగతుల మీద ఆ సంస్థ ఇచ్చే రేటింగ్‌కు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. ఆ రేటింగ్ బాగుంటేనే మదుపరులు పెట్టుబడులు పెట్టడానికి, రుణదాతలు రుణాలివ్వడానికీ ఆసక్తిగా ముందుకొస్తారు. రుణాల్లో వడ్డీరేటును నిర్ణయించడంలోనూ రేటింగే కీలకం.

ఆ సమయంలో మన పరిస్థితిని బేరీజు వేసిన ఎస్ అండ్ పి ఒక రేటింగ్‌ను ప్రతిపాదించింది. ఆ విషయాన్ని మన ప్రభుత్వానికి, రిజర్వ్‌బ్యాంకుకూ తెలియజేసింది. కాని ఆ రేటింగ్‌ను ధ్రువపరిచే ముందు మన వాదన చెప్పుకునేందుకు మరో అవకాశం ఉంటుంది. దాన్ని సద్వినియోగం చేసుకుందామనుకున్నాం.

దానికోసం ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్, నేనూ కలిసి న్యూయార్క్ వెళ్లడానికి నిశ్చయమయింది.

అక్కడ మాట్లాడటానికి అవసరమైన ప్రెజెంటేషన్ తయారుచేసేందుకు మన ఆర్థిక పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి వచ్చిన ప్రత్యేక అధికారి ఆర్. కృష్ణమూర్తి ఆ సమయంలో ఎంతో సాయపడ్డారు.

న్యూయార్క్ చేరుకున్నాక నేనూ రంగరాజన్‌గారూ మన దేశ ఆర్థికస్థితి బలాబలాల గురించి, ఇవ్వాల్సిన ప్రెజెంటేషన్ గురించి మరోసారి సమీక్షించుకున్నాం. ఎస్ అండ్ పీ తక్కువ రేటింగ్ ఇవ్వడానికి ప్రధాన కారణం – అప్పటికి ఉన్న రాజకీయ అస్థిరత. ప్రధాని వీపీ సింగ్ ప్రభుత్వం మనుగడలో ఉంటుందో లేదో ఇదమిత్థంగా

తెలియకపోవడం. ఇతర దేశాల్లోలాగా కాకుండా మన దేశంలో రాజకీయ మార్పులు చాలా సాఫీగా జరిగిపోతాయని, అందువల్ల ఆర్థిక పరిస్థితి పెద్దగా ప్రభావితం కాబోదని ఆ ఏజెన్సీకి నచ్చజెప్పాలని మేం అనుకున్నాం.

ఈ విషయంలో నేను కొత్త, రంగరాజన్ తలపండిన మనిషి.

ఎలాగైనా రేటింగ్ పెంచాలని నేను పడుతున్న ఉత్సాహానికి ఆయన అడ్డుకట్ట వేశారు. 'వేణూ, వాస్తవాలేమిటో మనం తెలుసుకోవాలి. పరిస్థితిని అంచనా వెయ్యాలి. సానుకూల ఫలితాలు సాధించాలి, ఇవేమీ నేను కాదనడం లేదు. కాని అలాగని మన ప్రెజెంటేషన్‌లో అత్యుత్సాహం కనిపించకూడదు. దానివల్ల ఇటు వృత్తిరీత్యా, అటు వ్యక్తిగతంగానూ మన విశ్వసనీయత దెబ్బతింటుంది. వీటన్నిటికీ మించి, ఈ రేటింగ్ ఏజెన్సీలతో మనం ముందుముందు చాలాసార్లు పనిచెయ్యాల్సి ఉంటుంది. అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ వాళ్ల ముందు మన విశ్వసనీయతనూ, గౌరవాన్నీ కోల్పోకూడదు...' అంటూ వివరంగా చెప్పారు.

'ఫలితాల కోసం ఎంతైనా శ్రమించవచ్చు, కాని వృత్తిపరమైన విశ్వసనీయతను కోల్పోకూడదు...' అన్న ఆయన మాటలు నన్ను ఆలోచనలో పడేశాయి, తర్వాత్తర్వాత నాకవి తారక మంత్రాలయ్యాయి. ఆయన ఆ రేటింగ్ ఏజెన్సీతో ఎలా మాట్లాడారు, ఏయే విషయాలను వివరించారు... ఇవన్నీ జాగ్రత్తగా గమనించి నేర్చుకున్నాను.

తర్వాత మన వివరాలను రేటింగ్ ఏజెన్సీతో వివరంగా చెప్పాం. కాని ఆ ఏజెన్సీ ముందు ఇచ్చిన రేటింగ్‌కే కట్టుబడింది.

రేటింగ్ వచ్చిన కొద్ది సమయంలోనే మనం చెల్లింపుల సంక్షోభంలో పడ్డాం. అప్పుడు రంగరాజన్ చెప్పింది అక్షరసత్యమని తెలిసింది.

## చెల్లింపుల కష్టాలు ఎందుకంటే...

ఇంతకూ మన చెల్లింపుల్లో (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) సంక్షోభం ఎందుకు వచ్చింది? మన ఆర్థిక వ్యవస్థ మీద ఒత్తిడి ఎప్పుడు, ఎందుకు ప్రారంభమైంది?

ఒత్తిడి మూలాలు 1980ల్లో దేశం అనుసరించిన ఆర్థికవిధానాల్లో ఉన్నాయి!

1982– 84ల మధ్య ఆర్థికమంత్రిగా ప్రణబ్ ముఖర్జీ మూడు బడ్జెట్లను ప్రతిపాదించారు. వాటి ప్రకారం ఆర్థికవృద్ధి పరుగులు పెట్టింది. కాని బడ్జెట్ ప్రతిపాదనలకు తగినన్ని నిధులు లేవు, దేశంలో అంతర్గత రుణాలు పెరిగాయి, పన్నులు పెరగలేదు. 1985లో వీపీ సింగ్ ప్రకటించిన బడ్జెట్‌లో పన్నులు తగ్గాయి,

అనుమతులు సులువు కావడంతో దిగుమతులు పెరిగాయి. 1987 జనవరిలో రాజీవ్‌గాంధీ కొత్త ఆర్థిక విధానాన్ని ప్రకటించారు. దానివల్ల మన వృద్ధి బాగా పెరిగింది. దానితోపాటే మన ద్రవ్యలోటు (ప్రభుత్వం చేసిన అప్పులు) బాగా పెరిగింది. పెరిగిన దిగుమతులకు అనుగుణమైన నిష్పత్తిలో ఎగుమతులు కూడా పెరిగితే ఇబ్బంది ఉండకపోయేదేమో. కాని మన ఎగుమతులు పెరగలేదు.

మొత్తమ్మీద 80ల్లో మనం అనుసరించిన సరళీకృత (లిబరలైజేషన్) ఆర్థిక విధానాల వల్ల అంతకు ముందుతో పోలిస్తే వృద్ధి బాగా పెరిగింది. కాని అప్పులు కూడా బాగా పెరిగాయి. పైన పటారం, లోన లొటారం అన్నట్టు తయారయింది మన పరిస్థితి.

మన ఆర్థికవ్యవస్థ బలహీనంగా ఉన్నప్పుడే సోవియట్ రష్యా (యుఎస్ఎస్ఆర్) విచ్ఛిన్నమైపోయింది, ఫలితంగా మనకు ఆ దేశంతో ఉన్న రుపీ ట్రేడ్ అగ్రిమెంట్ కూడా విచ్ఛిన్నమైపోయింది. 1990 ఆగస్టులో గల్ఫ్ యుద్ధం మొదలైంది. చమురు ధరలు చుక్కలనంటాయి. ఆ ఏడాది మొదటి ఆరు నెలల్లో నెలకు 287 మిలియన్ డాలర్లు చెల్లించిన మనం చివరి ఆరు నెలల్లో నెలకు 671 మిలియన్ డాలర్లు చెల్లించాల్సి వచ్చింది. సుమారు మూడు రెట్లు ఎక్కువ భారం పడింది.

ఇదిగాక, యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల్లో వర్కర్ల చెల్లింపులు నిలిచిపోయాయి. విదేశాల్లో భయం నెలకొంది. ప్రవాస భారతీయులు తమ డిపాజిట్లను వెనక్కి తీసుకున్నారు.

సెప్టెంబరు తర్వాత బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ తీవ్రమైన లోటులోకి వెళ్లిపోవడం మొదలైంది.

బీఓపీలో అత్యవసర పరిస్థితి తలెత్తితే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) నుంచి విదేశీ మారక నిల్వలను వాడుకునే సదుపాయం ఉంది. అదీ వాడుకున్నాం. ఆ నిల్వలు అడుగంటిపోతున్న సమయానికి ఇంధనం వంటి అత్యవసర దిగుమతుల కోసం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు స్వల్పకాలిక రుణాలు తీసుకోవడం మొదలుపెట్టాయి. కాని తీసుకున్నవి తీర్చడానికి డబ్బు లేక బ్యాంకులు మళ్లీమళ్లీ అప్పు తీసుకోవలసి వచ్చేది. అప్పులు చేసి దిగుమతులు చేస్తూనే ఉండేవి.

విదేశాల్లోని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో బిలియన్ల కొద్దీ డాలర్లు మన దేశానికి రిజర్వ్‌గా ఉండేవి. అవి ఉన్నట్టు ఆర్‌బీఐ, ఆర్థికశాఖలో సెక్రెటరీ స్థాయి అత్యున్నత

స్థాయి అధికారులు అతికొద్దిమందికే తెలుసు! అప్పటికి చాలాకాలంగా పేరుకున్న విదేశీ మారక నిల్వలను కొంత మేరకు వాడుకోవాలనుకున్నది ప్రభుత్వం. దాంతో వాటిని వాడకంలోకి తెచ్చేసింది.

అవి కరిగిపోయాక, ఆ సమయంలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలకు అవసరం లేకపోయినా అప్పు తీసుకోమని ప్రోత్సహించింది. కొన్నిటికి రిజర్వ్ బ్యాంక్ ఎక్స్ఛేంజ్ గ్యారెంటీ కూడా ఇచ్చింది.

విదేశీ బ్యాంకులేవీ మన బ్యాంకులకు రుణాలివ్వడానికి ఇష్టపడేవి కాదు.

ప్రతిరోజూ 'రెక్కాడితే కాని డొక్కాడదు' అన్నట్టుగా తయారయింది పరిస్థితి. పగలు గడిచి సాయంత్రమయ్యేసరికి ఆందోళనతో మాకు ముచ్చెమటలు పోసేసేవి – మన దగ్గర విదేశీ మారక నిల్వలు ఎంత ఉన్నాయో, ఎంత కావాలో రిజర్వ్‌బ్యాంక్ తెలియజేసే సమయం అది.

అప్పట్లో వివిధ బ్యాంకులు, ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన తక్కువ వ్యవధి రుణాల గురించి బీఓపీ విభాగానికి ఏమీ తెలీదు. అదంతా రిజర్వ్‌బ్యాంక్ చూసుకునేది. మరోవైపు దిగుమతులు – ఎగుమతుల విలువ గురించి, బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ గురించీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ స్టాటిస్టిక్స్ దగ్గరున్న సమాచారానికీ, రిజర్వ్‌బ్యాంక్ దగ్గరున్న సమాచారానికీ పొంతన ఉండేది కాదు. వాస్తవంగా మన నిల్వలు, అప్పుల గురించి ఎవ్వరికీ పూర్తిగా తెలియదు. ఉన్న సమాచారంలో ఏది, ఎంతమేరకు ఆధారపడదగినదో తెలియదు. అది అప్పటి అయోమయ పరిస్థితి.

అప్పటివరకూ ఉన్న చట్టాల వల్ల మన దగ్గరున్న బంగారం విలువ మార్కెట్‌తో పోలిస్తే నలభయ్యో వంతే. 1990లో ప్రత్యేక ఆర్డినెన్సు తెచ్చి మార్కెట్ విలువ కట్టాం. దాంతో ఆ ఏడు సెప్టెంబరులో 521 మిలియన్ డాలర్లున్న ప్రభుత్వ బంగారం విలువ అక్టోబరుకల్లా 3,678 మిలియన్ డాలర్లకు చేరింది! ఆర్‌బీఐ ఫారెక్స్ విలువ 3514 మిలియన్ డాలర్ల నుంచి 6212 మిలియన్ డాలర్లకు చేరింది.

ఆర్థిక శాఖలో విదేశీ మారక నిల్వల విభాగాన్ని చూసే కొందరు సీనియర్ అధికారులకూ, రిజర్వ్‌బ్యాంకుకూ ఆర్థిక ఒత్తిడి గురించీ, రాబోతున్న సంక్షోభం గురించీ తెలుసు. కాని అది బయట ఎవరికీ తెలియదు, జనసామాన్యానికి అసలే తెలియదు.

## ఒత్తిడి ముదిరి సంక్షోభంగా మారింది

ఒక్క ఆర్థిక ఇబ్బందులే అయితే బయట నుంచి ఎవరో ఒకరు ఆదుకునేవారు. సరైన నిర్ణయాలు తీసుకోవడానికి తగిన బలమైన రాజకీయ నాయకత్వం ఉంటే పరిస్థితి చెయ్యిదాటిపోయేది కాదు. 1989 డిసెంబరులో ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ (వీపీ సింగ్)కు రాజకీయంగా పెద్ద బలం లేదు. దానికితోడు విశ్వవిద్యాలయాల చదువుల్లోనూ, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్ల శాతం పెంచాలంటూ చెప్పిన మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తామని ఆయన ప్రకటించడంతో 1990లో దేశమంతటా అల్లర్లు చెలరేగాయి. హింసాత్మక వాతావరణం నెలకొంది. దాంతో ఆయన రాజీనామా కోసం విపక్షాలు పట్టుపట్టాయి.

ఆయన రాజీనామా చేశాక 1990 నవంబరులో జనతాదళ్‌కు చెందిన చంద్రశేఖర్ ప్రధాని అయ్యారు. ఆయనకు బయట నుంచి మద్దతిచ్చిన రాజీవ్‌గాంధీ అకస్మాత్తుగా మద్దతు ఉపహరించుకోవడంతో 1991 ఫిబ్రవరిలో చంద్రశేఖర్ పదవి ప్రశ్నార్థకమైంది. ఆపద్ధర్మ ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికలు వచ్చాయి. అప్పుడే మే 21న రాజీవ్‌గాంధీ హత్యకు గురయ్యారు. ఎన్నికల ఫలితాలు ఏమవుతాయో తెలియదు.

ఇంతకు ముందే చెప్పినట్టుగా 1984 నుంచి మన దేశ అభివృద్ధి మెరుగ్గా కనిపించినా దానిలో లొసుగులు ఉండేవి. 89కల్లా ఈ లొసుగుల కారణంగా మన పాలసీలో మార్పులు అత్యవసరమని ఆర్థికవర్గాలకు తెలుసు. దానికి ఐఎమ్ఎఫ్ సాయం అత్యవసరం, తప్పనిసరి అని కూడా అందరికీ తెలుసు. కాని కొందరు మార్పులు అవసరమేగాని, ఐఎమ్ఎఫ్‌కు పోనవసరం లేదని వాదించేవారు.

రాజకీయంగా ఉన్న ఇటువంటి అస్థిర వాతావరణం వల్ల మార్పులకు ఏ రాజకీయ నాయకులూ పూనుకోలేదు. పూర్తి బలం ఉన్న ప్రభుత్వాలు కాకపోవడం వల్ల వాళ్లు అడుగు ముందుకు వేసి ఉండకపోవచ్చు. ఇటువంటి పరిస్థితుల్లో ఆనాటి ఆర్థిక ఇబ్బందులను తట్టుకునే పని ఇటు ఆర్థికశాఖలోనూ అటు ఆర్‌బీఐలోనూ ఉండే అధికారుల మీద పడింది. సంక్షోభం ఛాయలు ముదురుతున్నకొద్దీ ఉన్నతాధికారులకు టెన్షన్‌తో తల పగిలిపోయినంత పనయ్యేది. క్షణమొక యుగంగా గడిచేది. కొన్ని అత్యవసరమైన ఆర్థిక విధానాలను కేబినెట్ నోట్‌లో చేర్చడానికి కేంద్రమంత్రివర్గంతో చర్చలు జరిపి, విసిగిపోయారు బిమల్ జలాన్.

'కేబినెట్‌తో నా సంబంధాలు ఇండియా – పాకిస్తాన్ సంబంధాల కన్నా సంక్లిష్టంగా ఉన్నాయని మీకు అర్థమవుతోందా వేణూ..' అన్నారాయన! ఆయన తర్వాత వచ్చిన శుక్లాగారైతే 'వేణూ, నాకసలు నిద్ర పట్టడమే లేదండీ. జీవితంలో మొదటిసారి నిద్రమాత్రలు మింగుతున్నాను..' అన్నారు దిగులుగా.

మనం తలలు పట్టుకున్నంత మాత్రాన రాత్రికి రాత్రే అద్భుతాలేం జరగవు. అందుకే కాస్త కూల్‌గా ఉండటానికి ప్రయత్నించేవాణ్ణి. దాన్ని చూసి కొందరికి చిరాకొచ్చేది కూడా. అడిషనల్ సెక్రెటరీగా పనిచేస్తున్న జానకి కట్పాలియా అయితే నన్ను మొహమ్మీదే దులిపేశారు కూడా. 'దేశం ఇంత క్లిష్టపరిస్థితుల్లో ఉంది, మేమంతా టెన్షన్‌తో చచ్చిపోయేట్టు ఉన్నాం. మీక్కూడా ఎంతో పని ఒత్తిడి, టెన్షన్ ఉన్నాయి. అయినా మీరు మాత్రం ఉల్లాసంగా ఎలా ఉండగలుగుతున్నారు? మీ ప్రవర్తన ఏం బాగాలేదు...' అనేశారామె!

ఆ సమయంలో ఆర్‌బీఐ గవర్నర్ వెంకిటరమణన్ నాతో ఫోన్లో తరచూ మాట్లాడుతూ ఉండేవారు. కొన్నిసార్లు ఆర్థిక వ్యవహారాల శాఖలో నా పరిధిలో లేని విషయాలను కూడా నన్ను అడిగేవారు. నేను ఆ సంగతి ఆయనకు చెబితే 'వేణూ, అదంతా నాకు తెలియదు. నా మట్టుకు నాకు ఆర్థిక శాఖ అంటే నువ్వే. నేనడిగిన విషయంలో నీ అభిప్రాయం ఏమిటో చెప్పు చాలు. మిగిలింది నేను చూసుకుంటాను..' అనేవారు!

ఒక్కటి మాత్రం సత్యం.

ఆ సమయంలో అధికార వర్గాల్లోనూ, రిజర్వ్‌బ్యాంక్ నాయకత్వంలోనూ ఎన్నో మార్పుచేర్పులు జరిగాయి, ఎంతోమంది మారారు. కాని ఆర్థికశాఖలో పనిచేసిన అందరూ – సెక్షన్ ఆఫీసర్ మొదలుకొని సెక్రెటరీ వరకూ – అందరికీ దేశం ఆ సంక్షోభం నుంచి బయటపడాలని కోరుకుని, దానికోసం రాత్రింబగళ్లూ పనిచేసేవారు. ఎలాగైనా దేశ గౌరవాన్ని కాపాడాలనే పట్టుదలతో ఉండేవారు.

అప్పుడు గనక సంక్షోభ నివారణ చర్యలు తీసుకోకుంటే దాని పరిణామాలు ఊహించలేం. ఒక్కసారి ఊహించి చూడండి, దేశంలో పెట్రోల్ లేకపోతే, రవాణా – బ్యాంకింగ్ వ్యవస్థ స్తంభించిపోతే, ఎగుమతులు – దిగుమతులు లేకపోతే..? ఆ ఊహకే ఒళ్లు జలదరిస్తుంది. అటువంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు ఆనాడు అధికారవర్గాలు తమ శాయశక్తులా కృషి చేశాయి. అందువల్లనే సంక్షోభ చిహ్నాలు జనసామాన్యానికి అంతగా తెలియలేదు.

# బంగారు తల్లి

ఆర్థిక సంక్షోభాన్ని నివారించడానికి ఆర్థికశాఖ చెయ్యవలసినదంతా చేసింది. అత్యవసరమైనవి తప్ప, మిగిలిన అన్ని దిగుమతుల మీదా భారీ పన్నులు పడ్డాయి. అదివరకు సులువుగా చేసుకోగలిగే దిగుమతులు కాస్తా ఇప్పుడు లైసెన్స్ ఉంటే తప్ప కుదరని జాబితాలోకి చేరిపోయాయి. అత్యవసరాలకు సైతం ఆ శాఖలు తప్పనిసరి అన్న నివేదిక ఇస్తేనే దిగుమతి సాధ్యమయ్యేది. ఇంధనాన్ని విచ్చలవిడిగా వాడకుండా, పొదుపుగా వాడేందుకు దానిమీద సర్‌ఛార్జీ ఎక్కువగా విధించారు. కాని ఇటువంటి చర్యలు తాత్కాలికంగానే చెయ్యగలము. ఎందుకంటే దిగుమతులు కష్టమయ్యేకొద్దీ ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ధరలు మండిపోతాయి. ఎగుమతులూ తగ్గిపోతాయి. అందరిలోనూ ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది.

పరిస్థితి ఎంతవరకూ దిగజారిందంటే ఐఎమ్ఎఫ్ సాయం లేకుండా మనం దీన్నుంచి బయటపడలేమని అందరికీ అర్థమయ్యింది. ఆ పరిస్థితుల్లో చంద్రశేఖర్ ప్రభుత్వం ఐఎమ్ఎఫ్‌తో చర్చలు మొదలుపెట్టింది.

ఆర్థిక సంక్షోభం సంభవించక ముందు మనకు రుణాలివ్వడానికి ఎన్నో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ఉత్సాహంగా ముందుకొచ్చేవి. మన దేశం పట్ల స్నేహాభిమానాలున్నాయంటూ ఆయా సంస్థల ప్రతినిధులు రకరకాల ప్రతిపాదనలతో ఆర్థికశాఖలో ఉన్నతాధికారులను కలిసేవారు.

ఆర్థికంగా మన పరిస్థితి దిగజారినప్పుడు వాళ్ల సాయం తీసుకోవాలనుకున్నాం. చిత్రం! వాళ్లలో ఒక్కరూ మాకు ఫోన్‌లో దొరకలేదు! నేను సహాయం అడుగుదామనుకున్న ప్రతివాళ్లూ ప్రయాణంలో ఉన్నారనే సమాధానమే వచ్చేది వాళ్ల ఆఫీసులకు ఫోన్ చేస్తే. పోనీ వచ్చాకైనా చెయ్యాలి కదా, అదికూడా చేసేవాళ్లు కాదు.

ఎప్పుడు సంపద కలిగిన
నప్పుడు బంధువులు వత్తురది ఎట్లన్నన్

తెప్పలుగ చెరువు నిండిన
కప్పలు పదివేలు చేరు కదరా సుమతీ...

అన్న పద్యం ఆ రోజుల్లో తరచూ గుర్తొచ్చేది.

## అప్పులిచ్చే అప్పారావులెందరో

కాని విచిత్రమైన విషయం ఏమంటే ఆ రోజుల్లో ప్రభుత్వానికి వందలు, వేల కొద్దీ మిలియన్ల డాలర్లను అప్పుగా ఇస్తామంటూ ముక్కూమొహం తెలియని వ్యక్తులు, సరైన చిరునామా సైతం లేని సంస్థలు ముందుకొచ్చేవారు. ప్రభుత్వం, రిజర్వ్‌బ్యాంక్ లేదంటే స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో ఏదో ఒకటి తామిచ్చే డబ్బును అప్పుగా తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్టు అంగీకారపత్రం ఇస్తే చాలనేవారు!

ఇదంతా సరైన వ్యవహారమని అనిపించలేదు మాకు. ప్రభుత్వ సంస్థలు అటువంటి అంగీకార పత్రాలిస్తే ప్రమాదాలకు అవకాశం ఉంది. వాటిని అడ్డం పెట్టుకుని వాళ్లు చాలా డబ్బు పోగుచేస్తారు, అది మనకు ఇవ్వకపోవచ్చు, అసలా డబ్బు ఎలా వచ్చిందో కూడా ఎవరికీ తెలియకపోవచ్చు. దాంతో చాలా భారీ ఆర్థిక మోసాలకు తెర లేస్తుందని మా నిశ్చితాభిప్రాయం.

అటువంటి వ్యక్తులు, సంస్థలు వచ్చినప్పుడు వాళ్లను తప్పించాల్సిన పూచీ నామీద పెట్టింది ఆర్థికశాఖ. ఎందుకంటే అప్పట్లో అలాంటి డబ్బును తీసుకోమంటూ రాజకీయ వర్గాల మీద వచ్చిన ఒత్తిడిని కూడా నావైపే పంపేసేవారు. చివరకు సాక్షాత్తూ ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్థిక మంత్రి కార్యాలయం నుండి కూడా ఆ సొమ్ము సంగతేమో చూడమంటూ నామీదే తోసేసేవారు.

నా దగ్గరకు వచ్చినవాళ్లకల్లా నేనొక్కటే చెప్పి పంపేవాణ్ణి. ఎవ్వరైనా సరే ఏదైనా పబ్లిక్ సెక్టార్ బ్యాంకులో ఎన్నారై డిపాజిట్ కింద డబ్బు కట్టేస్తే నిరభ్యంతరంగా వాళ్లకు బ్యాంకు రసీదులిస్తుంది.

కొంతమంది పట్టుబట్టి ఒప్పుకునేదాకా కదలం అన్నట్టుగా ఉండేవారు. కాని ఎంతడిగినా వాళ్ల గురించి వివరాలేమీ చెప్పేవారు కాదు. ఒకసారి అలాంటి పార్టీ ఒకరు ఒక ఫోన్ నెంబర్ మాత్రం ఇచ్చి వెళ్లారు. దానికి ఫోన్ చేస్తే అది న్యూజెర్సీలోని హాలిడే ఇన్ హోటల్‌దని తేలింది!

మరొకసారి ఏకంగా ఒక బిలియన్ డాలర్లు ఇస్తామంటూ వచ్చిందొక పార్టీ. 'నేనిప్పుడు పనిలో బిజీగా ఉన్నాను. రేపుదయం కలుద్దామా?' అని అడిగాను.

'కాదు సార్. మీ అపాయింట్‌మెంట్ ఈ సాయంత్రానికే ఇవ్వండి. మళ్లీ మేం రాత్రి ట్రెయినుకు టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. రేపుదయానికల్లా అహ్మదాబాద్ చేరుకోకుంటే మాకు గడవదు...' అని నన్ను వేడుకున్నారు వాళ్లు!

చూడండి ఎంత మోసమో. బిలియన్ అమెరికన్ డాలర్లు అప్పుగా ఇవ్వగలిగిన వాళ్లు ట్రెయిన్ టిక్కెట్లు పోతే మళ్లీ కొనుక్కోలేరా?

అలాగే మరో వ్యక్తి చాలా డబ్బులిస్తానని, వచ్చి కలుస్తానని తెగ ఫోన్లు చేసేవాడు. ఆ నెంబర్ ఎవరిదా అని ఆరా తీస్తే తెలిసిందేమంటే – అతను ఒక రాజకీయ నాయకుడి బట్టలు కుట్టే టైలర్!!

అప్పులిస్తామంటూ వస్తున్న వ్యక్తులది, రాజకీయ నాయకులదీ కూడా ఒత్తిడి పెరిగిపోయింది. అది తీవ్రతరమైనప్పుడు నేను చొరవ చేసి దేశంలోని అన్ని బ్యాంకులకూ ఒక వర్తమానం వెళ్లేలా చేశాను. అదేమంటే – పేరూ ఊరూ తెలియని వ్యక్తులు, సంస్థల నుంచి ఎలాంటి భారీ డిపాజిట్లు, రుణాలు తీసుకోవద్దు. తీసుకోకుండా ఉండటమే కాకుండా, కనీసం అలాంటి ప్రతిపాదన వచ్చినట్టు కూడా అధికారికంగా ఎక్కడా నమోదు చెయ్యవద్దన్నదే ఆ సందేశం సారాంశం.

ఒకసారి ఆర్‌బీఐ గవర్నర్ వెంకిటరమణన్ స్వయంగా నా దగ్గరకు అలాంటిదొక కేసు తీసుకొచ్చారు. 'ప్రభుత్వానికి చాలా పెద్ద మొత్తంలో డబ్బులిస్తామంటున్నారు...' అన్నారాయన.

'మీకు తెలియనిదేముంది సర్. ఇలాంటివి మనం చెయ్యడం లేదు కదా...' అన్నాన్నేను.

'నాకు తెలుసు. కాని ప్రధానమంత్రి చంద్రశేఖర్ నన్ను చూడమన్నారు' అని చెప్పారు వెంకిటరమణన్. చాలాసేపు చర్చించుకున్న తర్వాత అంగీకార పత్రం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చుకున్నాం.

ముంబై ఎస్‌బీఐ నుంచి ఒక అధికారిని డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయని వాళ్లు చెబుతున్నారో అక్కడకు పంపి, పార్టీ వివరాలు తెలుసుకుంటే మంచిదని మేం నిర్ణయించుకున్నాం. మేం పంపిన ఎస్‌బీఐ అధికారి వెళ్లినవాడు వెళ్లినట్టే వెనక్కొచ్చాడు. 'సర్, ఆ బ్రాంచిలో అకౌంట్ ఓపెనయిన మాట నిజమే. కాని దాన్ని వెంటనే మూసేశారు కూడా. ఆ పార్టీ ఎవరో ఏమిటో ఏమీ తెలియలేదు..' అన్నాడు!

ఇక ఈ అప్పులిచ్చే అయ్యగార్ల వ్యవహారానికి పరాకాష్ఠగా నిలిచిన ఓ సంఘటన చెబుతాను. ఫైనాన్స్ సెక్రెటరీగా పనిచేస్తున్న శుక్లా ఒకరోజు ఫోన్ చేశారు.

'వేణూ, మీరు ఈ రాత్రికే బ్రూనై వెళుతున్నారు. బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌కు అవసరమైన నిధులు అక్కడ అందుతాయి. వాటిని తీసుకొని వచ్చెయ్యండి' అని.

'సర్, మీకు తెలియనిదేముంది? అంత పెద్ద ఎత్తున సొమ్మును తీసుకురావడం, అదీ ఎక్కణ్ణుంచి వస్తోందో తెలియకుండా ఉంచడం సాధ్యం కాదు. మనకు నిధులు సమకూరడం ముఖ్యమేగాని, అవి ఎక్కణ్ణుంచి వస్తున్నాయనేది దేశ గౌరవానికి సంబంధించిన విషయం...' అన్నాన్నేను.

'మీరు చెప్పేదంతా నాకు తెలుసు. కాదనను. కాని నాకు ఆర్థిక మంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ నుంచి ఆదేశాలు అందాయి..' అన్నారాయన.

'పోనీ ఈ పనికి మన ఆర్థిక శాఖలో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్న ఎస్‌బీఐ ఉన్నతాధికారి ఆర్. కృష్ణమూర్తిని పంపుదాం. అప్పుడు కనీసం రుణదాతలూ బ్యాంకర్ మాట్లాడుకున్నట్టుగా ఉంటుంది. ప్రభుత్వంలో పనిచేస్తూ నేను వెళ్లడం అంత బాగుండదు...' అన్నాను.

మంత్రితో సంప్రదించి శుక్లా 'అదంతా కుదరదు. బ్రూనైకి మీరే వెళ్లాలి. బట్టలు సర్దుకోండి. ఇది అత్యంత రహస్యం. ఇంట్లో ఏదో ఒకటి చెప్పండి కాని ఇలాగని నిజం చెప్పడానికి వీల్లేదు. మీరు ఒక ప్రత్యేక విమానంలో వెళుతున్నారు. వీసా కోసం కూడా మీరు చూడనవసరం లేదు. అంతే...' అన్నారు.

మా ఆవిడకు ముంబై వెళుతున్నానని చెప్పి బట్టలు సర్దుకుని ఆఫీసుకొచ్చి కూర్చున్నాను. బ్రూనై నుంచి నిధులు తీసుకోవడం మన్మోహన్‌సింగ్‌కూ, శుక్లాకూ కూడా ఇష్టం లేదని నాకు కచ్చితంగా తెలుసు. తర్వాత కొద్దిసేపటికి నా బ్రూనై ప్రయాణం రద్దయింది!

**బంగారం తాకట్టు...**

మన పరిధిలో ఉన్న చర్యలన్నీ తీసుకున్నా సంక్షోభం తగ్గకపోవడంతో చివరగా బంగారాన్ని ఆశ్రయించక తప్పలేదు.

బంగారానికి దేశవిదేశాల్లో ఎక్కడైనా మారకపు విలువ ఉంటుంది కనుక ప్రతి దేశమూ కొంత బంగారాన్ని నిల్వ చేసి పెట్టుకుంటుంది. అలా మన

రిజర్వ్‌బ్యాంక్ దగ్గరున్న బంగారం, విదేశీ మారక ద్రవ్యాన్ని కలిసి విదేశీమారక నిధిగా వ్యవహరిస్తారు. నిధి ఉన్నదంటే దానర్థం ఎప్పుడైనా అవసరానికి తక్షణమే ఉపయోగపడుతుందని. కాని డబ్బు రూపంలో నిల్వ ఏమీ లేనప్పుడు బంగారాన్ని ఉపయోగించడం తప్ప వేరే దారే లేదు. భారత ప్రభుత్వం దగ్గర ఉండే బంగారంలో 20 మెట్రిక్ టన్నులు, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర ఉండే బంగారంలో 47 మెట్రిక్ టన్నులు వాడాలని నిర్ణయమైంది.

ప్రభుత్వం దగ్గరున్న బంగారాన్ని కుదువపెట్టేందుకు ఆర్థికమంత్రి యశ్వంత్‌సిన్హా, రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ వెంకిటరమణన్ ప్రతిపాదనలు తయారు చేశారు. చంద్రశేఖర్ ప్రధానిగా ఉన్నప్పుడే దానికి ఆమోదం లభించింది.

ముందుగా ప్రభుత్వం దగ్గరున్న బంగారాన్ని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పచెప్పేట్టు ఆర్‌బీఐ గవర్నర్ ప్రతిపాదించారు. దాన్ని కేబినెట్, న్యాయశాఖ ఆమోదించాలి. దానికి తగిన కట్టుదిట్టాలు చేశాం. ఎస్‌బీఐ ఆ బంగారాన్ని అమ్మడానికి లేదు. సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు కుదువపెట్టాలి, అంతే. 1991 ఏప్రిల్లో యూనియన్‌బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం, ఎస్‌బీఐ బంగారాన్ని తనఖా పెట్టి, 200 మిలియన్ డాలర్లను తీసుకొచ్చింది.

మన సంప్రదాయం ప్రకారం ఎంత అత్యవసర సమయాల్లోనైనా బంగారాన్ని తాకట్టు పెట్టి, అవసరం గట్టెక్కాక తిరిగి తెచ్చుకుంటాం తప్ప తెగనమ్మడానికి ఇష్టపడం. మన దేశం కూడా అదే చేసింది. ఉన్న పళంగా బంగారాన్ని అమ్మకుండా, కేవలం తాకట్టు పెట్టేలా ఒప్పందం కుదుర్చుకుంది.

రిజర్వ్‌బ్యాంకు దగ్గరున్న బంగారాన్ని కూడా కుదువపెట్టాల్సిన పరిస్థితి అది. బంగారం తాకట్టుకు సంబంధించిన కేబినెట్ నోట్‌ను తయారుచెయ్యమని ఆనాటి ఆర్థిక మంత్రి యశ్వంత్‌సిన్హా, సెక్రెటరీ శుక్లా ఉత్తర్వులిచ్చారు. ఆ సంగతి మా కుటుంబాలకు కూడా తెలియకూడదని చెప్పారు. నా గదిలో కూర్చుని నేను, డాక్టర్ బి.ఎల్.మాథుర్ కలిసి దానికి రూపకల్పన చెయ్యడంలో చాలా అడ్డంకులు ఎదురయ్యాయి. ఆర్‌బీఐ కులకర్ణిగారితో తరచూ సంప్రదింపులు జరుపుతూ ప్రతి సమస్యనూ విడదీసుకుంటూ వెళ్లేవాళ్లం.

ఒక దేశం బంగారాన్ని తాకట్టు పెడితే దాన్ని దేశం బయటకు తరలించాల్సిన పని ఉండదు సాధారణంగా. ఆ వ్యవహారమంతా కాగితాల మీదే జరుగుతుంది.

కాని ఆనాడు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐమ్ఎఫ్) తాను మనకు సాయం అందించాలంటే – కుదువబెట్టిన బంగారాన్ని దేశం నుంచి బయటకు తరలించాల్సిందేనన్న షరతు పెట్టింది. ఐఎమ్ఎఫ్ సాయం చేస్తేనే మనం సంక్షోభం నుంచి బయటపడతాం, అంతర్జాతీయంగా ఇతర సంస్థలకూ మన ఆర్థిక పరిస్థితి మీద నమ్మకం నెలకొంటుంది.

1991 మే 30న మా అమ్మాయి కవిత పెళ్లి హైదరాబాద్‌లో అని ముందుగానే నిశ్చయమైంది. వరుడు బుగ్గన హరిహరనాథ్ మాకు బాగా తెలిసిన బంధువుల అబ్బాయే. పెళ్లి కోసం మే 13 నుంచి జూన్ 7 వరకు నాకు సెలవివ్వమని అడిగాను ఫైనాన్స్ సెక్రెటరీ శుక్లాని.

'కంగ్రాచ్యులేషన్స్ వేణూ. మీరు సెలవడగడం సబబే. కాని ఇప్పుడున్న పరిస్థితిలో మీరు ఢిల్లీలో లేకపోతే నాకు కష్టం' అన్నారు. 'మీరు పెళ్లిని ఢిల్లీలో జరిపితే బాగుండేది' అన్నారు.

'ఎప్పుడైనా సరే, నేను మీకందుబాటులో ఉంటాను' అంటూ ఆయన దగ్గర సెలవు పుచ్చుకున్నాను. నేను తీవ్రమైన పని ఒత్తిడిలో ఉండటం వల్ల మా అమ్మాయి కవిత పెళ్లి బాధ్యత మా అత్తమావయ్యలు తమ భుజాల మీద వేసుకున్నారు. నేను హైదరాబాదు వచ్చేనాటికే పెళ్లి పనులు చాలా వరకు వాళ్లు చక్కబెట్టేశారు.

ఈలోగా ఓ సాయంత్రం 'రేపుదయం ఫ్లైటుకు మీరు ఢిల్లీ రావాలి' అంటూ శుక్లాగారి నుంచి ఫోను!

'ఇప్పటికిప్పుడు టికెట్టు..' అని నేను ఆలోచిస్తూ ఉంటే ఆయనే చెప్పేశారు, 'అన్ని ఏర్పాట్లూ అయిపోయాయి, మీరు బయల్దేరడమే' అని!

నేను వెళ్లాక తెలిసింది – ఐఎమ్ఎఫ్ షరతులకు లోబడి మన బంగారాన్ని గడప దాటించి, లండన్‌లోని బ్యాంకుల్లో భద్రపరచడానికి ఏర్పాట్లు చెయ్యాలని!

కాస్త బంగారం మన దగ్గరుంటేనే ప్రయాణాల్లో భయపడతాం. మరి టన్నులకొద్దీ బంగారాన్ని వేరే చోటికి తరలించాలంటే మాటలా? ఆర్‌బీఐ నుంచి బంగారాన్ని ఒక ట్రక్కులోకి ఎక్కించి ముంబై విమానాశ్రయానికి అతి రహస్యంగా, అర్ధరాత్రి దాటాక చేర్చాలని అనుకున్నాం. భారీ భద్రత మధ్య ట్రక్కు బయల్దేరింది.

మార్గమధ్యంలో దాని టైరు పంక్చరయింది!

మామూలుగానైతే టైరు పంక్చరయి ఒక వాహనం ఆగిపోవడం మన దగ్గర కొత్తేం కాదు, ఎవరూ పట్టించుకోరు కూడా. కాని పెద్ద శబ్దంతో ట్రక్కు ఆగిపోవడంతో – దానికి ముందూవెనుకా వెళుతున్న భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమయి తమ వాహనాల నుంచి దిగిపోయి ఈ ట్రక్కు చుట్టూ తుపాకులను ఎక్కుపెట్టి మోహరించాయి!

ముంబైలో అర్ధరాత్రి అపరాత్రి అనేం లేకుండా రోడ్ల మీద ఎంతోకొంత జనం ఉంటూనే ఉంటారు. ఈ సీనంతా వాళ్ల కంటపడి వాళ్లలో ఆసక్తిని రేకెత్తించింది! ట్రక్కులో ఉన్నదేమిటి, అక్కడ జరుగుతున్నదేమిటని వాళ్లలో కొందరు ఆరాలు తీశారు.

టైరు బాగు చేశాక ట్రక్కు విమానాశ్రయానికి చేరుకుంది, దాన్ని అన్‌లోడ్ చేసి ఒక ప్రత్యేక విమానంలోకి ఎక్కిస్తున్నప్పుడు అక్కడున్న ఆకతాయిలెవరో ఫోటో తీశారు! దాంతో విషయం కొద్దికొద్దిగా బయటకు వచ్చింది.

ఆర్‌బీఐ బంగారం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌కు భద్రంగా చేరాక, మనకు మరో 407 మిలియన్ డాలర్ల అప్పు వచ్చింది.

బంగారాన్ని కుదువబెట్టాల్సినంత పరిస్థితికి వచ్చాం అని జనసామాన్యానికి తెలియడం కూడా ఒకందుకు మంచిదైంది. అందువల్లనే వాళ్లు తర్వాత సంస్కరణల అమలుకు మద్దతునిచ్చారు. అప్పటికి తమ మీద కాస్త ఆర్థిక భారం పడినా దీర్ఘకాలంలో మంచి జరుగుతుందనే నమ్మకంతో సంస్కరణలను అడ్డుకోలేదు.

మన దగ్గరున్న బంగారం నాణ్యత ఒకేరీతిగా ఉండేది కాదు. తాకట్టు నుండి విడిపించినప్పుడు అది ఒకే నాణ్యతకు వచ్చేసింది. సంక్షోభం నుంచి బయటపడిన తర్వాత ప్రభుత్వం దాన్ని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అమ్మేసింది. అదంతా మన రిజర్వ్‌లో భాగమయింది.

ఇదంతా ఎందుకు, బంగారాన్ని అమ్మేస్తే సరిపోయేది కదా.. అనుకోవచ్చు ఎవరైనా.

మన సమాజంలో బంగారానికి ఒక ప్రత్యేకమైన విలువ, కొంత సెంటిమెంటు ఉన్నాయి. ఆ పరంగా రెండు విభిన్న అభిప్రాయాలు వినిపించేవి ఆనాడు. అదేంటంటే – రిజర్వ్‌బ్యాంక్ పసిడిని తెగనమ్మే పరిస్థితికి వచ్చిందంటే మన ఆర్థిక పరిస్థితి ఎంత దిగజారిపోయిందోనంటూ పెదవి విరిచే తీరు ఒకటయితే, అత్యవసర పరిస్థితుల్లో

అక్కరకు రాకపోతే బంగారం ఉండి ఏమి లాభం, దాన్ని తాకట్టుపెట్టో, అమ్మేసో అయినా సంక్షోభం నుంచి గట్టెక్కడమే మంచిదన్న అభిప్రాయం మరొకవైపు వినిపించేవి.

మొత్తమ్మీద, ఆర్థికసంక్షోభ కాలంలో మనల్ని ఆదుకున్నది బంగారమే. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, పాలనను పట్టాలెక్కించేలోగా అత్యవసరాలకు అది పనికొచ్చింది. స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని నిశ్చయించుకున్నాక అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్), ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బాంకు (ఎడిబి)లు ఆర్థికసాయం అందించడంతో మనం నెమ్మదిగా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడగలిగాం. ఆ వెంటనే పీవీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంస్కరణల వల్ల ఆర్థికంగా నిలదొక్కుకోగలిగాం.

ఆ సంస్కరణలు మన దేశ ఆర్థిక చరిత్రలో ఒక కొత్త శకానికి నాంది పలికాయి. ఆర్థిక బలహీనతలను వదిలించుకుని బలమైన దేశంగా రూపొందడానికి అవసరమైన ధీమా నెలకొల్పాయి. ఈ మార్పుకు అవసరమైన రాజకీయ వాతావరణం కల్పించిన ఘనత ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకే చెందుతుంది!

## క్లిష్టసమయంలో కీలకవ్యక్తులు

ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖలో (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్) లో నేను 1990 ఏప్రిల్ 4న జాయింట్ సెక్రెటరీగా చేరాను. 1993 మే 3 వరకు ఆ పదవిలో ఉన్నాను. ఆ మూడేళ్లలో మూడుసార్లు ప్రధానమంత్రులు, ఆర్థికమంత్రులు, ఫైనాన్స్ సెక్రెటరీలు, ఛీఫ్ ఎకనామిక్ అడ్వైజర్లు మారారు.

అంతమంది మారారుగాని, నేను మాత్రం ఆ సంక్షోభ సమయం మూడేళ్లూ స్థిరంగా ఉన్నాను. అందువల్ల కొన్ని సందర్భాల్లో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో నా అనుభవమూ, పాత్ర కీలకమైనవిగా మారాయి. ఆ సమయంలో ఆర్థిక శాఖలో జరిగే అతి ముఖ్యమైన చర్చోపచర్చలన్నిటిలోనూ నేను భాగం పంచుకునేవాణ్ణి. సందర్భానుసారం నేనిచ్చే సమాచారం, అందించే విశ్లేషణ – ఆర్థికవర్గాలు సరైన నిర్ణయాలు తీసుకోవడంలో తోడ్పడేవి. రకరకాల ఆప్షన్లను పరిశీలించడం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలు పరచడం – ఈ మూడింటికీ సరైన విశ్లేషణ ముఖ్యం. కీలకమైన ఆర్థిక మంత్రులు, సెక్రెటరీలు

మారిపోయినా నేను కొంతకాలం ఆర్థికశాఖలో కదలకుండా ఉండటం వల్ల, ఆర్థిక అంశాల్లో నా పరిజ్ఞానం మీద నమ్మకం వల్ల వాళ్లు నా సలహాలకు విలువనిచ్చేవాళ్లు.

గడ్డు రోజుల్లో అత్యున్నతమైన నాయకత్వ లక్షణాలను ప్రదర్శించిన వ్యక్తి ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన ఎస్. వెంకిటరమణన్. నాటి సందర్భాలకు తగిన మేధాపరమైన కృషి చేసినది డాక్టర్ సి. రంగరాజన్. ఆర్థిక సంక్షోభం పతాకస్థాయిని తాకినప్పుడు దాన్ని ఒక దారికి తీసుకొచ్చి సంస్కరణల పట్టాలకెక్కించడానికి ఆనాటి ఆర్థికమంత్రి యశ్వంత్‌సిన్హా ఉండటం మన దేశం చేసుకున్న అదృష్టమనే చెప్పాలి.

ఆర్థిక మంత్రి ప్రొఫెసర్ మధు దండావతేని నేనెప్పుడూ కలవలేదు. తర్వాత వచ్చిన యశ్వంత్‌సిన్హా దగ్గరకు నా పై అధికారులతో కలిసి వెళ్లటమే తప్ప విడిగా కలవలేదు. మన్మోహన్‌సింగ్‌తో పూర్వం పనిచేసి ఉన్నాను కనుక ఆయనకు మాత్రం నా బలాబలాలేమిటో తెలుసు. కావాలనుకున్నప్పుడు ఆయనతో మాట్లాడగలిగే చనువుండేది.

ప్రధానమంత్రులు వీపీసింగ్, చంద్రశేఖర్‌లకు నేను తెలియదు, నేనూ వారిద్దరినీ వ్యక్తిగతంగా ఎప్పుడూ కలుసుకోలేదు.

పీవీ నరసింహారావుగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నేను డిప్యుటీ సెక్రెటరీగా పనిచేశాను కనుక ఆయనకు నా పేరు తెలిసుండొచ్చు. కాని ఆయన్ని కూడా నేరుగా కలిసే అవకాశం నాకెప్పుడూ రాలేదు.

సంక్షోభానికి ఆర్థికపరమైన – రాజకీయపరమైన కారణాలున్నాయి. దాన్నుంచి బయటపడుతూ, ఆర్థికంగా పురోగమించడానికి సంస్కరణలు అవసరం. వాటిని రూపొందించడానికి మన్మోహన్‌సింగ్ నాయకత్వంలో మరికొందరు నిపుణులున్నారు. కాని సంస్కరణల అమలుకు రాజకీయంగా తోడ్పాటునివ్వడానికి తగిన దార్శనికతా ధైర్యమూ పీవీ నరసింహారావు కనబరిచారు. ఆ ధీమా ఉన్న ప్రధానమంత్రిగా పి.వి.నరసింహారావు చరిత్రలో అందరికన్నా మిన్నగా నిలిచిపోతారు! ఆయన విజన్‌కు తగినట్టుగా సంస్కరణల రథాన్ని ముందుకు నడిపించిన సారథిగా మన్మోహన్‌సింగ్ పేరుపొందారు.

ఆర్థిక సంక్షోభ నివారణకు నడుం బిగించి, దేశాన్ని సంస్కరణల పథంలో నడిపించిన కొద్దిమంది సీనియర్ పాలసీ మేకర్లకు సహాయాన్నందిస్తూ, దగ్గరగా కలిసి పనిచేసే అవకాశం లభించడం నా అదృష్టం.

# సంస్కరణల పథంలో...

**సం**క్షోభ సమయంలో మేం ఎంత టెన్షన్ పడ్డామో చెప్పడానికి ఒక్క ఉదాహరణ చెబుతాను. ఆర్థిక సంక్షోభం ముగిసిన తర్వాత, జాయింట్ సెక్రెటరీగా నా బాధ్యత తీరిపోయిన తర్వాత నేను తిరుపతికి వెళ్లి వేంకటేశ్వరస్వామికి వందనాలు చెప్పుకుని వచ్చాను. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న పి.బి. కులకర్ణి 'హమ్మయ్య... బయటపడ్డాం...' అంటూ ఏకంగా తిరుపతి వెళ్లి గుండు చేయించుకుని వచ్చారు!

సంక్షోభం నుంచి బయటపడినా, పూర్తిగా సాధారణ పరిస్థితికి చేరడానికి ప్రభుత్వమూ, ఆర్‌బీఐ కొంత కృషి చెయ్యవలసి వచ్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని బ్యాంకులు, కొన్ని ఇతర సంస్థలు ఒక అవకాశంగా మలచుకున్నాయి. ఉదాహరణకు రిస్క్ ఎక్కువ కావడం వల్ల అవి అన్ని వ్యవహారాల్లోనూ ఎక్కువ ప్రీమియమ్ వసూలు చేయడం మొదలుపెట్టాయి. పరిస్థితులు ఒక కొలిక్కి వచ్చాక కూడా ఆ రుసుము తగ్గించడానికి అవి చొరవ చెయ్యలేదు. ఎందుకంటే సంక్షోభం ముగిసిపోయి, సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని అంగీకరించడానికి అవి భయపడ్డాయి.

ఆ వర్గాల్లో ధైర్యం నింపడమే ఒక ప్రత్యేక కార్యక్రమంగా చేపట్టాల్సి వచ్చింది. మన దగ్గర తగినన్ని విదేశీమారకద్రవ్య నిల్వలున్నాయని, ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్‌లు చేసిన సాయం వల్ల మన ఆర్థిక పరిస్థితి కుదుట పడిందని అందరికీ నమ్మకం కల్పించడం ఆ సమయానికి అత్యావశ్యకమైంది.

మంచి వాతావరణం నెలకొందని తెలియగానే, గతంలో అప్పులిచ్చినవాళ్లు వెంటనే తీర్చాలని ఒత్తిడి పెట్టడం మానేశారు. అంతేకాదు, రుణ షరతుల్లో మార్పుచేర్పులు చేస్తూ, తీర్చాల్సిన కాలావధిని పెంచుతామని కూడా ముందుకొచ్చారు. ఆర్థిక పరిభాషలో దాన్ని రోల్ ఓవర్ అంటారు. అయితే రుణదాతలు ప్రతిపాదించిన రోల్ ఓవర్‌ను నేను వ్యతిరేకించాను. మరీ అవసరమైతే తాజాగా మరోసారి అప్పు

చేద్దాం తప్ప, పాతవాటి పొడిగింపు వద్దని కరాఖండీగా చెప్పేశాను. వడ్డీ రేట్లు ఎక్కువనిపించినవీ, అలాగే షరతులు మరీ విపరీతంగా అనిపించినవీ – తాజా రుణాలను సైతం వద్దనుకున్నాం. పాత – కొత్త లోన్లు తగ్గించుకుని, మన విదేశీ నిల్వల నుంచే మన అవసరాలను గట్టెక్కించుకున్నాం.

దీంతో – ఆర్థికంగా మనం ఏ రకమైన ఒత్తిడిలోనూ లేమనీ దేనికీ తలొగ్గకుండా స్థిరమైన నిర్ణయాలు తీసుకోగలమనీ మార్కెట్లో విస్పష్టంగా తెలిసి వచ్చింది. దాంతో సంక్షోభం తేలిపోయిందనే సూచన అందరికీ అర్థమయింది.

ఇక విదేశీ నిల్వలకు సంబంధించి ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోలను నియంత్రించాలి. చమురు సంస్థల దిగుమతులకు అవసరమైన విదేశీ నిల్వలను నియంత్రిస్తేనే అది సాధ్యం. అవసరమైన చమురు దిగుమతుల కోసం ఆ సంస్థలు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి స్వల్పకాలిక రుణాలు తీసుకోగలిగే వీలుండేది. అప్పుడు ఆర్‌బీఐ – ఎస్‌బీఐ – ఇండియన్ ఆయిల్ సంస్థల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూశాం. దాంతో పరిస్థితి చక్కబడింది. లండన్ ఇంటర్ బ్యాంక్ ఆపరేటింగ్ రేట్ (లైబోర్) ఆర్నెల్ల స్వల్పకాలిక రుణాన్ని 0.25శాతం మార్జిన్‌తో ఇవ్వడానికి ముందుకు వచ్చిందంటేనే మన బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌లో సమతౌల్యం నెలకొందని అందరికీ అర్థమైంది.

**ఎవరు కారణం?**

ఇంతకూ మన దేశంలో ఇంతటి ఆర్థిక సంక్షోభం తలెత్తడానికి ఎవరు కారణం? అప్పటి ఫైళ్లన్నీ చదివి, సంక్షోభానికి దారి తీసిన పరిస్థితులేవి, వాటికి దోహదం చేసిన వ్యక్తులెవరు అన్నది ఒక నోట్ తయారుచేసి తనకివ్వమన్నారు డాక్టర్ మన్మోహన్‌సింగ్.

నేను మొత్తం సమాచారాన్ని తెప్పించుకున్నాను. దాన్నంతా చదివాక నా అభిప్రాయాన్ని ఒక నివేదికగా రూపొందించాను.

చెల్లింపుల విషయంలో పడబోతున్న ఒత్తిడి గురించి, అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్ల రాబోయే ప్రమాదాల గురించి రిజర్వ్‌బ్యాంక్ కేంద్రప్రభుత్వాన్ని చాలాసార్లు ముందుగానే హెచ్చరించిందనేది స్పష్టంగా ఉంది. చెల్లింపుల్లో ఒత్తిడి గురించి అన్ని కోణాల్లోనూ సమాచారమూ స్పష్టతా ఉన్నాయి అప్పటి ప్రభుత్వానికి.

కాని కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధిని ఆపడానికి వెనకాడారు. మరీ పెద్ద ఇబ్బంది తలెత్తితే అప్పుడు చూసుకోవచ్చన్న ధోరణే ఎక్కువగా కనిపించింది. అదే సమయంలో అకస్మాత్తుగా విరుచుకుపడిన గల్ఫ్ యుద్ధాన్ని – తద్వారా తలెత్తిన సంక్షోభాన్ని ఎవరు ఊహించగలరు?

అది కేవలం ఒత్తిడి స్థాయిలో ఉండగానే పరిస్థితిని చక్కదిద్దాలంటే రాజకీయపరమైన అంగీకారం కావాలి. అది సకాలంలో అందలేదనేది విస్పష్టం. సరైన సమయంలో మన ఆర్థికవిధానాల్లో మార్పుచేర్పులు చేసుకుని ఉంటే పరిస్థితి చెయ్యి దాటిపోయేది కాదు. 'పాలసీలో మార్పు చెయ్యడం కష్టంగానే ఉంటుంది. కాని ఆ కష్టాన్ని సహించి మార్పు చెయ్యడానికి నాటి రాజకీయ నాయకత్వం తాత్సారం చేసింది' అని రాశాను నా నోట్‌లో.

అప్పటి ఫైళ్లలో సెక్రెటరీలు సూచించిన చర్యలు, పరిష్కారాలు – వాటికి మంత్రుల అనంగీకారాలు ఏమీ కనిపించలేదు అన్నదొక విమర్శ.

కాని సున్నితమైన పాలసీ వ్యవహారాల్లో సెక్రెటరీలు – అమాత్యుల మధ్య సంభాషణలు ఎలా నడుస్తాయో నాకు తెలుసు.

ఆనాడున్న సెక్రెటరీలు రానున్న ఆపద గురించి మంత్రులకు, ప్రధానమంత్రులకు ముందుగానే చెప్పే ఉంటారు. మంత్రుల ఫైనల్ నిర్ణయాలు మాత్రమే ఫైళ్లలో కనిపిస్తాయి. అంతకు ముందు జరిగిన చర్చలు వాటిలో కనిపించవు.

ఆ నోట్ ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ దగ్గరకు చేరింది, ఆయన కామెంట్లేమీ చెయ్యలేదు.

ఇక్కడ ఒకమాట తప్పక చెప్పాలి. రాబోతున్న ప్రమాదం గురించి సూచనప్రాయంగా 1989లోనే తెలియజేసిన ఐఎమ్ఎఫ్ తన ప్రోగ్రామ్ గురించి కూడా ముందుగానే చర్చించింది. అలాంటి పరిస్థితి తలెత్తితే అక్కరకొస్తాననే ఉద్దేశంతోనే అప్పటి ఫైనాన్స్ సెక్రెటరీ జి.కె. అరోరా నన్ను ఆర్థికశాఖలో చేరమన్నారు!

## సంస్కరణల తొలిదశలో...

సంక్షోభం నుంచి గట్టెక్కాం, మన ఆర్థిక పరిస్థితి చక్కబడింది. సరే, దాన్ని స్థిరంగా కొనసాగిస్తూ అభివృద్ధిని సాధించడం ఎలా? సంక్షోభం నుంచి మనం నేర్చుకున్న పాఠాలేమిటి?

నిజం చెప్పాలంటే, ఆర్థిక సంస్కరణలకు బీజం 1980ల్లోనే పడింది. ఆ సమయానికే సంస్కరణల ఆవశ్యకతనూ గుర్తించారు! ఆర్థిక, ద్రవ్య, వాణిజ్య, పారిశ్రామిక విధానాల్లో మార్పులకు ఆనాడే తొలి అడుగులు పడ్డాయి. విధాన రూపకర్తలు తమ అపారమైన మేధను వాటికి ధారపోశారడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

అప్పటికే మన ఆలోచనా స్రవంతి ఏ దిశగా సాగుతోందో ఐఎమ్ఎఫ్‌కు తెలుసు. మన పరిస్థితులకు, స్థిరత్వం కలగాలంటే మనదైన ఆలోచనావిధానమే త్రోవ చూపించగలదనే విశ్వాసమూ దానికుంది. అందువల్ల సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ఐఎమ్ఎఫ్ అందించిన సాయానికి పెట్టిన షరతుల్లో కూడా సంస్కరణలకు తగిన సహకారం ఉంది.

మనం చేపట్టదలచుకున్న ఆర్థిక సంస్కరణల సమగ్ర స్వరూపాన్ని యశ్వంత్‌సిన్హా నేతృత్వంలో వీసీ శుక్లా, దీపక్ నయ్యర్‌లు రూపొందించారు. 1991లో మధ్యంతర బడ్జెట్ ద్వారా దాన్ని యశ్వంత్ సిన్హా ప్రతిపాదించాలని అనుకున్నారు. కాని రాజకీయ పరిస్థితులు మారిపోవడం వల్ల అది కుదరలేదు.

సంస్కరణల మీద పూర్తి స్థాయిలో పనిచెయ్యాల్సిన బాధ్యత ఆయన తర్వాత ఆర్థిక మంత్రిగా వచ్చిన మన్మోహన్‌సింగ్‌దే అయింది. సంస్కరణల బాటలు వెయ్యడం, ఫలితాలను ఊహించడం, చివరిగా సంస్కరణలు అమలయ్యేలా చూడటం – ఇదంతా ఆయన భుజస్కంధాల మీదే పడింది.

రూపొందించడానికి క్లిష్టం, అమలుకు కష్టమైన సంస్కరణల ప్రక్రియలో, ముఖ్యంగా ఎక్స్‌టర్నల్ సెక్టర్‌లో నేను పాలుపంచుకున్నాను.

అదెలాగంటే – 1991 నవంబర్‌లో అప్పటి ప్లానింగ్ కమిషన్ సభ్యుడైన డాక్టర్ రంగరాజన్ ఛైర్మన్‌గా ఒక అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్‌లో అనుభవమున్న నన్ను ఆ కమిటీలో సభ్యుడిగా చేర్చుకున్నారు.

మా కమిటీ ముందుగా మన విదేశీ మారకపు రేటు మీద దృష్టి పెట్టింది. అది రెండంచెల్లో ఉండాలన్నది ప్రధానమైన ప్రతిపాదన. అంటే ఎగుమతుల ద్వారా లభించిన ఆదాయంలో 40 శాతం అతి ముఖ్యమైన దిగుమతుల కోసం వెచ్చించాలి. మిగిలిన 60 శాతం మార్కెట్లో మిగిలిన అవసరాలకు అందుబాటులో ఉంటుంది. అంటే ఎక్స్‌ఛేంజ్ రేటు రెండు రకాలుగా ఉంటుందన్న మాట. ఉదాహరణకు పప్పు

దినుసులు, బియ్యం, చక్కెర వంటివి ప్రభుత్వ చౌక దుకాణాల్లో ఒక రేటుకు, బయట కొంటే ఎక్కువ రేటుకూ దొరికినట్టు!

అయితే ఏవి అత్యావశ్యకమైన దిగుమతులు, ఏవి కాదు, దేనికెంత విదేశీ మారక ద్రవ్యాన్ని వెచ్చించాలి – ఇవన్నీ జాగ్రత్తగా పరిశీలించాకనే ఆ పాలసీని రూపొందించాలి. ఆ బాధ్యతను డాక్టర్ అరవింద్ విర్మానీ, డాక్టర్ మాథుర్, ఆర్. కృష్ణమూర్తి (వీళ్లు నాకు అసిస్టెంట్స్) నెరవేర్చారు. చివరగా ఆర్‌బీఐ గవర్నర్ వెంకిటరమణన్‌గారితో ముంబైలోని ఆయన ఇంట్లో కూర్చుని మాట్లాడుకున్నాక తగిన ఫ్రేమ్‌వర్క్ సిద్ధమయింది.

దీనికి సంబంధించిన మధ్యంతర నివేదికను నేను రిజర్వ్ బ్యాంక్ భవనపు 18వ అంతస్తులో డిక్టేట్ చెయ్యడం నాకిప్పటికీ కళ్లకు కట్టినట్టుంది.

బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ కమిటీ విషయంలో ఒక విచిత్రం జరిగింది. సాధారణంగా ప్రభుత్వ కమిటీలు నివేదికలు సమర్పించాక కూడా అందులోని ప్రతిపాదనలు అమల్లోకి రావడం కష్టం. కాని ఈ కమిటీ ప్రతిపాదనలు వెంటవెంటనే అమల్లోకి వచ్చేశాయి. తర్వాత పూర్తి నివేదిక సమర్పించాం!

ఆనాడు అమల్లోకి వచ్చిన ద్వంద్వ మారక విలువ (డ్యుయెల్ ఎక్స్ఛేంజ్ రేట్) ఆర్థిక రంగ నిపుణుల అంచనాలను మించి విజయవంతమైంది. దానివల్ల బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ గురించిన ఒక సమగ్రమైన దృక్పథాన్ని ఏర్పర్చుకునే వీలు కలిగింది. దానికోసం నేను చాలా విశ్లేషణాత్మకమైన పరిశ్రమ చేశాను. ఆ సమయంలో కాపిటల్ అకౌంట్ మానేజ్‌మెంట్ గురించి మా కమిటీ చేసిన సూచనలు దేశానికి చాలా మేలు చేశాయి. వివరంగా చెప్పాలంటే, వాణిజ్య కార్యకలాపాలకు మాత్రమే స్వల్పకాలిక రుణాలివ్వడం, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్‌కు పరిమితి విధించడం, కరెంట్ అకౌంట్‌ను ఇతర అవసరాలకు వాడే వీల్లేకుండా చెయ్యడం వంటివి ఆర్థిక రంగానికి కొత్త దారులు ఏర్పర్చాయి. తర్వాత మన లక్ష్యం – ఒకటే మారకపు విలువ. (యూనిఫైడ్ ఎక్స్ఛేంజ్ రేట్)

ఈ అంశం మీద ఆర్థిక వర్గాల్లో తర్జనభర్జనలు మొదలయ్యాయి. దాని గురించి నేను క్లుప్తంగా నోట్ రాసి ఆర్థిక వ్యవహారాల సెక్రెటరీ మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియాకు అందజేశాను. అప్పటికి ఆధికారిక వ్యవహారాలకు ఎక్స్ఛేంజ్ రేటు అమెరికన్ డాలర్‌కు 27–28 రూపాయలుగా, ఓపెన్ మార్కెట్ రేటు డాలర్‌కు

32–37రూపాయల మధ్య ఉండేది. ఏకీకృత రేటు ఈ రెండింటి సగటుగా ఉండాలని అనుకుంటున్నట్టు రాశాను. ఇది ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ ఆమోదం పొందింది. దాంతో రెండు రేట్లు పోయాయి, ఒకే మార్కెట్ రేటు అమల్లోకొచ్చింది. అంటే ఎక్స్ఛేంజ్ రేటు ఆధికారికంగా ఇంత అనిగాకుండా మార్కెట్‌లో డిమాండ్ సప్లయిని బట్టి నిర్ణయమయ్యే పద్ధతి అమల్లోకి వచ్చింది. మార్కెట్ రేట్ ఎంతో సమాచారం సేకరించి – ప్రతిరోజూ మధ్యాహ్నం పన్నెండింటికి ఆర్‌బీఐ ప్రకటిస్తుంది.

## విదేశీ అప్పెంతో తెలియాలి

మన దేశానికి బయట ఎన్ని అప్పులున్నాయన్నది పూర్తి లెక్క, సమాచారం తెలియకపోవడం అనేది సంక్షోభ సమయంలో పెద్ద సవాలుగా నిలిచింది. ప్రభుత్వానికి తానెంత అప్పు చేసిందో తెలుసు, కాని 1980ల్లో ప్రభుత్వేతర సంస్థలు ముఖ్యంగా బ్యాంకులు బాగా అప్పులు చేశాయి. అందువల్ల అసలు ఆ లెక్కంతా తెలియడానికి ఒక వ్యవస్థ ఉండాలని నేను ప్రతిపాదించాను. కాని ఆర్థిక శాఖలో నా ప్రతిపాదన పట్ల పెద్దగా ఎవరూ ఉత్సాహం చూపించలేదు.

ఆర్‌బీఐ గవర్నర్ వెంకిటరమణన్ నన్ను పూర్తిగా సమర్థించారు. ఆయన చొరవతో అప్పు లెక్కంతో తేల్చడానికి ఒక వర్కింగ్ గ్రూపు ఏర్పాటయ్యింది. దానికి నన్ను, ఆర్‌బీఐలో అడ్వైజర్‌గా పనిచేస్తున్న శేషన్ ను నియమించారు. మేం ఇరువైపుల ఉద్యోగులతో టెక్నికల్ బృందం ఏర్పాటుచేసుకున్నాం. వారి పనిని విశ్లేషించి మా బృందం చాలా వినూత్నమైన ప్రతిపాదనలు చేసింది, తర్వాత అవి పూర్తిగా అమల్లోకి వచ్చి ఆర్థికశాఖకు మేలు చేశాయి.

ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ మరో అడుగు ముందుకేసి, దేశం చేస్తున్న అప్పుల గురించి ఆర్నెల్లకోసారి సామాన్యులకు సైతం తెలియాలన్నారు. దానికి ఆర్థిక శాఖ, భారత ప్రభుత్వం, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకరించేలా ఏర్పాట్లు చేశారాయన. ఆనాడు మా వర్కింగ్ గ్రూప్ రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌ను ప్రపంచ బ్యాంక్, ముఖ్యంగా కామన్‌వెల్త్ సెక్రెటేరియట్ ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఉపయోగించుకుంది.

## కాపిటల్ మార్కెట్స్

ఫైనాన్స్ మినిస్ట్రీలో బీఓపీ డివిజన్‌తో పాటు 92 నవంబరులో నాకు కాపిటల్ మార్కెట్స్ విభాగాన్ని కూడా చూడమంటూ అదనపు బాధ్యతలు అప్పగించారు.

అప్పటికి సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఏర్పాటయింది, దానికి ఛైర్మన్‌గా జీవీ రామకృష్ణ నియమితులయ్యారు. ప్రభుత్వ సహకారంతో చాలా విధివిధానాలను, ప్రకటనలను జారీ చెయ్యాల్సిన బాధ్యత సెబీపై ఉండేది. ఏవో కొన్ని కారణాల వల్ల సెబీ పనితీరు కుంటుపడింది.

నేనూ రామకృష్ణగారూ ఎన్టీఆర్ హయాంలో కలిసి పనిచేశాం, మాకు మంచి పరిచయం ఉండేది. అందువల్ల మంత్రిత్వ శాఖతో సెబీకున్న ఇబ్బందులు చాలావరకూ తీరిపోయాయి. రామకృష్ణ ఆలోచనలేమిటో ఆర్థికమంత్రికి నేరుగా చెప్పగలిగే చనువు ఉండేది నాకు.

1992 నవంబర్ 17 నుంచి 1993 మార్చి 5 వరకు నేను సెబీ సభ్యుడిగా కూడా పనిచేశాను.

రిజర్వ్ బ్యాంకుతోనూ సెబీకి సత్సంబంధాలుండాలి. ఆర్‌బీఐ గవర్నర్ వెంకిటరమణన్, సెబీ ఛైర్మన్ రామకృష్ణ – ఇద్దరూ ఐఏఎస్ అధికారులే, ఇద్దరూ సీనియర్లే. అయినా ఎందుకో పెద్దగా మాట్లాడుకునేవారు కాదు. దాంతో పని ముందుకు నడిచేది కాదు. దాన్ని గమనించి నేను వాళ్లిద్దరితో పాటు, ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వశాఖ సెక్రెటరీ కలిసి ఒక బృందంగా ఏర్పడితే బాగుంటుందని, అప్పుడు అందరూ కలిసి కూర్చుని మాట్లాడుకుంటే ఇబ్బందులన్నీ తొలగిపోయి పని చక్కగా నడుస్తుందని సూచించాను. దానికి అందరూ అంగీకరించారు.

నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీని ఏర్పాటు చేస్తామని, దానికి ఐడీబీఐ ముందడుగు వేస్తుందని ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ అప్పటికే ప్రకటించారు. కాని అది ఎంతకూ కార్యరూపం దాల్చలేదు. ఆర్థికమంత్రి నన్ను పిలిచి ఏదో ఒకటి చేసి పని జరిగేలా చూడమన్నారు. దానికి అవసరమైన అధికారాన్నిచ్చారు.

నేను ఐడీబీఐ ఛైర్మన్ నాదకర్ణిని ఢిల్లీ వచ్చినప్పుడు నా కార్యాలయానికి రమ్మని పిలిచాను. ఆయన వచ్చాక మాట్లాడితే సమస్య ఏమిటో తెలిసింది. అవసరమైన అనుమతులన్నీ సంపాదిస్తే, వెంటనే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజి ఏర్పాటుకు అవసరమైన కంపెనీ ఏర్పాటయింది!

ఈ ఉదాహరణ ద్వారా నేను చెప్పొచ్చేదేమంటే నాయకులకు సదుద్దేశమూ, ప్రభుత్వానికి పట్టుదలా ఉంటే గనుక చాలా పనులు సాఫీగా సాగిపోతాయి అని.

# ముచ్చటలేని మూడేళ్లు

మహారాష్ట్రలోని రత్నగిరిలో దభోల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతుల గురించి 1992లో ప్రభుత్వంలో చర్చ వచ్చింది. ఎన్రాన్, జనరల్ ఎలెక్ట్రిక్‌ల సహకారంతో మహారాష్ట్ర పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆ ప్రాజెక్టును నిర్మించాలనుకున్నది. అప్పటికి మన దేశంలో అతి పెద్ద ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రతిపాదన అదే. దానికి ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ విభాగం అనుమతులివ్వాలి.

కాని ఆ ప్రాజెక్టు నుంచి ఉత్పత్తయ్యే పవర్‌ను కొనుగోలు చేసే ఒప్పందాల్లో లొసుగులుండేవి. వాటిని ఎత్తిచూపుతూ ఈసీబీ చర్చల్లో ఆ ఒప్పందాలను నేను వ్యతిరేకించాను.

అలాగే ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఇరాన్ దేశంలో పర్యటిస్తున్నప్పుడు అక్కడ ఓ ప్రాజెక్టు నిర్మించడానికి బీహెచ్ఈఎల్ ముందుకొస్తుందని చెప్పారంటూ ప్రభుత్వశాఖలు ఆ పనిలోకి దిగాయి.

నాదగ్గరకొచ్చినప్పుడు 'ఇది నష్టదాయకం.. అయినా ప్రధాని ఏం చెప్పారో నాకు తెలియాలి' అంటూ ఆ ఫైలు కోసం పట్టుపట్టాను. ఆయన పర్యటన వివరాల్లో – అటువంటి ప్రతిపాదనను పరిశీలిస్తానని మాత్రమే ఆయన చెప్పినట్టు స్పష్టంగా ఉంది. పరిశీలించడం వేరు, అంగీకరించి వాగ్దానం చెయ్యడం వేరు. అందువల్ల అది కుదిరేపని కాదని ఉన్నతాధికారులకు నేను తెలియజేశాను.

ఈ తరహా నా ప్రతిస్పందనల వల్ల పై వర్గాలకు కష్టం కలిగిందేమో మరి, తెలియదు.

1993 మే మొదటివారంలో నాకు ఒక వార్త అందింది. అది సగం తీపి, సగం చేదు. నాకు అడిషనల్ సెక్రెటరీగా ప్రమోషన్ వచ్చిందన్నది తీపి కబురు. ఫైనాన్స్ మినిస్ట్రీలో ఖాళీ ఉన్నప్పటికీ, అంతగా ప్రాముఖ్యం లేని వాణిజ్యశాఖలో నన్ను వేశారన్నది రుచించని పరిణామం.

ప్రతిదానికీ లైసెన్సులు అవసరమయ్యే కాలం, రష్యాతో రుపీ ట్రేడ్ – ఈ రెండూ అంతరించిపోయి, సరళీకరణ (లిబరలైజేషన్) మొదలుకావడంతో కేంద్ర వాణిజ్యశాఖ ప్రాముఖ్యం తగ్గుతూ వచ్చింది. వాణిజ్యశాఖలో నాకు చాలా తేలికపాటి సబ్జెక్టులిచ్చారు. ఎగుమతులకు సంబంధించిన యూనిట్లు, ప్రాసెసింగ్ జోన్లు, ఫైనాన్సింగ్ – ఈ మూడూ చూసుకుంటూ యాంటీ డంపింగ్ అథారిటీగా వ్యవహరించాలి నేను. మొత్తం పనంతా రెండు గంటల్లో అయిపోయేది.

మూడేళ్ల పాటు ఆర్థికశాఖలో – అదీ అత్యంత క్లిష్టసమయంలో ముఖ్యమైన సంఘటనల్లో ఒక పాత్రగా ఉన్నవాడిని కాస్తా ఏ పనీ లేనిచోట పడటంతో నాలో ఉత్సాహం అడుగంటిపోయింది. 'మిమ్మల్ని ఇంత అన్యమనస్కంగా ఎప్పుడూ చూడలేదు నాన్నా..' అనేది మా అమ్మాయి కవిత.

ఖాళీ సమయంలో ఏం చెయ్యాలని ఆలోచించి – భారతీయ ఆర్థిక వ్యవస్థను క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యడం ప్రారంభించాను. 'మీకన్నా భారతీయ ఆర్థిక వ్యవస్థ గురించి నాకే ఎక్కువ తెలుసు. ఎందుకంటే మీరు పని చేస్తూ అర్థం చేసుకోవాలి, నేను మాత్రం అదే పనిగా చదువుతున్నాను మరి!' అని సరదాగా శంకర్ ఆచార్యతో అన్నాను.

పెద్దగా లాభాలు రాకపోయినా, మన మార్కెట్‌ను కైవసం చేసుకోవడానికి ఇతర దేశాలు తమ ఉత్పత్తులను మనకు చవగ్గా ఇవ్వడాన్ని డంపింగ్ అంటారు. ఆ క్రమంలో అనవసరమైన వస్తువులు మన మార్కెట్లను ముంచెత్తకుండా చూసుకోవడమే యాంటీ డంపింగ్ అథారిటీ కర్తవ్యం. అటువంటిదొకటి ఏర్పడటం అదే తొలిసారిగనక, దానికి అవసరమైన విధివిధానాలను, న్యాయపరమైన మార్గదర్శకాలను రూపొందించడం నాకు సంతృప్తినిచ్చింది.

మన కార్పొరేట్ సంస్థలు ఇతర దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులు అప్పట్లో ఉండేవి కాదు. కాని వాటి కి ప్రోత్సాహకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వమూ ఆర్‌బీఐ తగిన కట్టుదిట్టాలు చెయ్యాలని నేను అనుకునేవాణ్ణి. అప్పట్లో ఆ దిశగా పెద్ద అడుగులు పడలేదుగాని మరికొన్నేళ్లకు అది సాధ్యమయ్యింది.

కామర్స్ మినిస్ట్రీలో నేను చేరేనాటికి ప్రణబ్‌ముఖర్జీ మంత్రిగా ఉండేవారు. తర్వాత చిదంబరం వచ్చారు. ఆయనకు విదేశాల్లో పెట్టుబడులు, ఎగుమతులంటే

ఆసక్తి ఉండేది. వాటి సాధ్యాసాధ్యాలు తరచూ ఆయనతో చర్చించడంతో మా ఇద్దరికీ పరిచయం పెరిగింది.

ఇక్కడ పనిలో సవాళ్లు తక్కువ. దాంతో కొద్దిరోజులపాటు వేరే పనేదైనా చెయ్యాలనుకున్నాను. ఆ సమయంలో ప్రపంచబ్యాంకులో మన ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా బిమల్ జలాన్ ఉండేవారు. అక్కడేమైనా అవకాశాలున్నాయేమో చూడమని ఆయన్ను అడిగాను. అది కుదరలేదు. తర్వాత స్నేహితుడు ఆరికెపూడి ప్రేమ్‌చంద్ సహకారంతో ఐఎమ్ఎఫ్‌లో కన్సల్టేషన్ మొదలుపెట్టాను. ఆ పనిలో భాగంగా చైనా, టాంజానియా, ఇథియోపియా, బహ్రెయిన్ దేశాల్లో కొంతకొంత కాలం పనిచేశాను.

చైనా అధికారుల తీరు నాకు నచ్చింది. తమకు కావలసిన విషయాలను ఆసక్తిగా తెలుసుకోవడం, ఏ సమావేశానికైనా క్షుణ్ణంగా చదువుకుని పూర్తిగా సిద్ధమై రావడం, ఎట్టిపరిస్థితుల్లోనూ తమ పరిధిని అతిక్రమించి మాట్లాడకపోవడం, సమయాన్ని కచ్చితంగా పాటించడం – వర్క్‌కల్చర్‌కు సంబంధించిన మంచి లక్షణాలు వాళ్లకున్నాయి. 2020కల్లా అమెరికాను మించిపోయే ఆర్థికవ్యవస్థను తమకు సాధించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అప్పట్లో చెప్పేవారు. వాళ్ల క్రమశిక్షణ, అంకితభావం, ఆసక్తి చూస్తే కార్యసాధకులే అనిపించింది నాకు.

మొత్తమ్మీద ఆర్నెల్ల పాటు నేను విదేశాల్లో ఉన్నాను.

## బ్యాంకింగ్ సెక్రెటరీ

1995 ఆగస్టులో ఆర్థికశాఖలో సెక్రెటరీగా ప్రమోషన్ వచ్చింది. మళ్లీ ఆర్థికశాఖలోకి వచ్చినందుకు, మా బ్యాచ్‌లో త్వరగా సెక్రెటరీని అయినందుకు నాకు సంతోషం కలిగింది.

విభేదించడానికి మరీ గట్టి కారణాలుంటే తప్ప, సాధారణంగా ఆర్‌బీఐ పంపిన ప్రతిపాదనలను అంగీకరించాలన్నదే నా దృక్పథం. ఏ విషయంలోనైనా అనుమానాలుంటే ఆర్‌బీఐ గవర్నర్ లేదా డిప్యూటీ గవర్నర్లను అడిగి నివృత్తి చేసుకునేవాణ్ణి. ఆర్థికమంత్రికి నేనేం నివేదిస్తున్నానో వాళ్లకు తెలియజేసేవాణ్ణి.

ఆర్‌బీఐ గవర్నర్‌ను నియమించడం, పునర్నియామకం అనేవి ప్రధాని, ఆర్థిక మంత్రి నిర్ణయిస్తారు. గవర్నర్ సలహా మేరకు డిప్యూటీ గవర్నర్లను నియమిస్తారు. తర్వాత ప్రక్రియను బ్యాంకింగ్ సెక్రెటరీ చూసుకుంటారు. డాక్టర్ సి. రంగరాజన్ ఆర్‌బీఐ గవర్నర్‌గా రెండోసారి, డిప్యూటీ గవర్నర్‌గా కపూర్ నియమితులు కావడం

నేనున్నప్పుడు జరిగాయి. ఆ సమయంలో డిప్యూటీ గవర్నర్లుగా పనిచేసిన తారాపోర్, ఆర్‌వి గుప్తా, ఎస్‌పీ తల్వార్ – ముగ్గురితోనూ నాకు పూర్వ పరిచయాలున్నాయి. ఇప్పుడు వారితో స్నేహబంధం బలపడింది.

## బ్యాంకులతో బంధాలు

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా, మన పబ్లిక్ సెక్టార్ బ్యాంకు బోర్డుల్లో నాన్–అఫిషియల్ డైరెక్టర్లను నియమించడం అనేది చాలా క్లిష్టమైన ప్రక్రియ అయి కూర్చుంది. సాధారణంగా చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, ఆర్థికం, మహిళాభివృద్ధి వంటి ఎనిమిది రంగాల్లో కృషి చేసి, పేరున్న వారిని ఆర్‌బీఐ ఎంపిక చేసి, ఆర్థిక మంత్రి పరిశీలనకు పంపిస్తుంది.

ఆ తరహాలోనే మేం చాలా మంచి వ్యక్తిత్వమున్నవాళ్లను, అన్ని రకాలా అర్హులైన వాళ్లను ఏరికోరి ఒక జాబితా తయారు చేసి మంత్రిగారికి పంపాం. ఆయనకూ దాదాపుగా ఏ అభ్యంతరమూ లేకపోయింది. కాని ఎందువల్లనో ఆ ఫైలు తిరిగి మా దగ్గరకు రావడానికి కొద్ది నెలలు పట్టింది!

ఒకానొక సందర్భంలో ఆర్థికమంత్రి నన్ను పిలిచి ఆ మొత్తం వ్యవహారం మీద ఆయన అసహనాన్ని వ్యక్తం చేశారు!

అసలేం జరిగిందంటే – ఆ ఫైలు ప్రధానమంత్రి కార్యాలయానికి చేరింది. అక్కడివాళ్లు మేం ఎంపిక చేసిన ఒక్కో పేరునూ పరిశీలించి సదరు వ్యక్తి కాంగ్రెస్‌కు అనుకూలురా కాదా అని ఆరా తియ్యడం మొదలెట్టారట!

మంత్రిగారు ఒక్కొక్క పేరు చెప్పగానే వాళ్లు ఆ వ్యక్తి కాంగ్రెస్ పార్టీకి అనుకూలం కాదని చెబుతూ తొలగించేశారు. అక్కడితో ఆగకుండా కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన వ్యక్తులకు – వాళ్లు కోరుకున్న బ్యాంకుల్లో డైరెక్టర్ల పదవి దక్కేలా పైరవీలు సాగాయి. అదీ ఆయన అసహనానికి కారణం!

ఆ తర్వాత ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఆర్‌బీఐకి కొన్ని బయోడేటాలు రావడం మొదలైంది. మేం చెయ్యాల్సినదల్లా – వాటిని అందుకున్నాక అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ద కాబినెట్ (ఏసీసీ) ఆమోదానికి పంపడమే!

బ్యాంకుల బోర్డులో ప్రభుత్వం ప్రతిపాదించిన అధికారి నామినీ డైరెక్టరుగా ఉంటారు. సాధారణంగా ప్రభుత్వంలో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్న వారే ఆ స్థానంలో నియమితులమతారు. నామినీ డైరెక్టర్ బ్యాంకు మేనేజింగ్ కమిటీలో సభ్యుడిగా

ఉండకూడదని నా అభిప్రాయం. ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ నా వాదనను అంగీకరించలేదు.

వివిధ బ్యాంకులకు, ఆర్థిక సంస్థలకు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎమ్‌డీ)లను నియమించడం కూడా కష్టమైన పనే. ఆర్‌బీఐ గవర్నరే ఛైర్మన్‌గా వ్యవహరించే ఒక సెలెక్షన్ కమిటీ ఈ వ్యవహారాన్ని చూసుకుంటుంది. అన్ని అర్హతలూ ఉన్న వ్యక్తులను వెతికి, ఇంటర్వ్యూలు చేసేవాళ్లం. ఆ అభ్యర్థులకు విజిలెన్స్ విభాగం నుంచి క్లియరెన్స్ రావాలి. కొన్నిసార్లు వాళ్లమీద తప్పుడు ఆరోపణలుండేవి. విచారణ జరిపి, అవి నిజమోకాదో నిర్ధారించడం ఆఖరుకు చీఫ్ విజిలెన్స్ కమిషనర్‌కు కూడా సాధ్యమయ్యేది కాదు! నియమనిబంధనలు అడ్డుపడటం వల్ల కొందరు సమర్థులు నష్టపోయారు.

ఈ సమయంలో ఒక అభ్యర్థి సామాజిక నేపథ్యం గురించి ఆర్థికమంత్రి నన్నడిగారు. వృత్తిపరంగా నాకు తెలిసిన విషయాలన్నీ చెబుతూ, సామాజిక నేపథ్యం నాకంతగా తెలియదన్నాను.

'వేణూ, మన సమాజం చాలా సంక్లిష్టమైనది, కొన్నిసార్లు క్రూరంగా ఉంటుంది. ఏదీ లేకపోయినా సరే, ఏవేవో అంటగడతారు. ఇది మీకు తెలియాలి. అందువల్ల ఇలాంటి సంగతులన్నీ ముందుగా మీకు తెలిసి ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు వాటిని పట్టించుకోకుండా వదిలెయ్యకూడదు..' అని జాగ్రత్త చెప్పారాయన!

బ్యాంకింగ్ సెక్రెటరీగా నేను కొన్ని ఆర్థిక సంస్థల బోర్డుల్లో సభ్యుడిగా కూడా ఉండేవాణ్ణి. ఐడీబీఐ, ఐసీఐసీఐ, నాబార్డ్, కోల్‌కతాలోని ఐడీఎఫ్‌సీ వంటి సంస్థల బోర్డు సభ్యుడిగా చేశాను.

వాళ్ల సంస్థాగతమైన వ్యవహారాల్లో తలదూర్చకుండా, బోర్డు సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావడం, వాళ్ల చర్చలను శ్రద్ధగా వినడం చేసేవాణ్ణి. నాకేమైనా సందేహాలుంటే సమావేశానికి ముందే ఆయా సంస్థల ఛైర్మన్‌లతో ప్రస్తావించేవాణ్ణి. అటు తర్వాత యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకు ట్రస్టీగా ప్రతిపాదించడంతో ఆ స్థానంలో పనిచేశాను.

1996 ఫిబ్రవరిలో ఒక ఉదయం. ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్ గదిలో ఒక సమావేశానికి రమ్మన్నారు. నేను వెళ్లేసరికి రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్ రంగరాజన్, ఫైనాన్స్ సెక్రెటరీ మాంటెక్ సింగ్, చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ శంకరాచార్య అందరూ

ఉన్నారు. ఫారెక్స్ మార్కెట్ మీద ఒత్తిడి పెరిగి రూపాయి విలువ తరిగిపోతోంది. దానికేం చెయ్యాలని చర్చించిన తర్వాత మన్‌మోహన్‌సింగ్ 'వేణూ, ఈ విషయంలో మీరు గవర్నర్‌కు సాయం చెయ్యండి. మార్కెట్ స్టెబిలైజ్ అయ్యేదాకా..' అని చెప్పారు.

ఫారెక్స్ డిమాండును తగ్గించడానికి తీసుకున్న చర్యల వల్ల రెండు వారాల్లో మార్కెట్లు నిలకడగా దారికొచ్చాయి.

1996 జూన్‌లో ఆర్థికమంత్రిగా పి. చిదంబరం పగ్గాలు చేపట్టారు.

**ఆర్థికశాఖ నుంచి నిష్క్రమించా..**

జూలై చివర్లోనో, ఆగస్టు తొలి వారంలోనో సరిగా గుర్తు లేదుగాని, ఒకరోజు కేబినెట్ సెక్రెటరీ సురేందర్‌సింగ్ నుంచి తనను కలవమంటూ నాకు ఫోన్ వచ్చింది. కలిశాక 'వేణూ, మీకు ఒక ముఖ్యమైన మంత్రిత్వశాఖలో – అంటే రక్షణశాఖలో పోస్టింగ్ ఇద్దామనుకుంటున్నాం.. మీకు వ్యక్తిగతంగా చెబుదామని పిలిచా..' అన్నారు!

నాకు రక్షణశాఖ కేటాయిస్తున్నారంటే దానర్థం – ఆర్థికశాఖ నుంచి మొత్తంగా నన్ను సాగనంపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని. ఒకసారి రక్షణశాఖకు వెళ్లి, అక్కడ నా పని గనక నచ్చిందంటే రిటైరయ్యేవరకూ నన్ను అక్కడే ఉంచుతారు. ఒకవేళ నా పనితీరు నచ్చలేదంటే అక్కణ్ణుంచి పంపేస్తారు తప్ప, కేంద్రంలో మరోచోటికి వేసే అవకాశం ఉండదు. అంటే అక్కడితో నాకిష్టమైన ఆర్థికశాస్త్రంతో పనిచేసే అవకాశం పోగొట్టుకున్నట్టే. అవన్నీ ఆలోచించి సురేందర్‌సింగ్‌కు 'నేను ప్రభుత్వ సర్వీసును వదిలిపెట్టెయ్యాలని నిర్ణయించుకున్నాను' అని చెప్పాను.

మర్నాడంతా ఆలోచించుకుని చిదంబరాన్ని కలిసి హైదరాబాద్ వెళ్లిపోవాలనుకుంటున్నట్టు చెప్పాను. రక్షణ శాఖకు వెళ్లడం నాకిష్టం లేదని ఆయనకు అర్థమైపోయింది. ఒకటిరెండు రోజుల తర్వాత ఫైనాన్స్‌సెక్రెటరీ మాంటెక్‌సింగ్ నాతో మాట్లాడారు. కేబినెట్ సెక్రెటరీ, ఆర్థికమంత్రి తనతో మాట్లాడారని చెబుతూ టెక్స్‌టైల్స్, భారీ పరిశ్రమలు వంటి శాఖలైతే నాకిష్టం ఉంటాయా అంటూ ఆరాతీశారు. నేను వెళ్లిపోవడానికే నిశ్చయించుకున్నానని ఆయనకు స్పష్టం చేశాను.

సరిగ్గా అదే సమయంలో రిజర్వ్‌బ్యాంక్ డిప్యుటీ గవర్నర్ ఎస్.ఎస్. తారాపోర్ ఏదో పనిమీద ఢిల్లీకి వచ్చారు. మేం కలుసుకున్నాం. అప్పుడు నేను రిజైన్ చెయ్యబోతున్నట్టు చెప్పానాయనకు.

'నేనెటూ రెండుమూడు నెలల్లో రిటైరవుతున్నాను. మీరు నా స్థానంలోకి వస్తే బాగుంటుంది' అని సూచించారాయన. ఆ ప్రతిపాదనను నేను తోసిపుచ్చలేదుగాని కాస్త ముందువెనకాడాను.

మర్నాడు ఆర్‌బీఐ గవర్నర్ డాక్టర్ రంగరాజన్ ఫోన్ చేశారు. 'మీరు డిప్యుటీ గవర్నర్‌గా వస్తే బాగుంటుంది' అన్నారు.

ఆ తర్వాత చిదంబరం 'ఆర్‌బీఐకి డిప్యుటీ గవర్నర్‌గా వెళ్లాలనుందా?' అని అడిగారు.

రంగరాజన్ నేనుంటే బాగుంటుందన్నారని సమాధానమిచ్చాను.

'మీరుంటే ఆయనకు బాగుంటుందని నాకు తెలుసు. కాని మీరు నిజంగా వెళ్లాలనుకుంటున్నారా?' అనడిగారు.

అవునన్నాను.

1996 సెప్టెంబరు 13న ఢిల్లీ నుంచి బొంబాయికి ప్రయాణమయ్యాను. విమానంలో కూర్చున్న రెండు గంటలూ నా బుర్రలో జీవితం, కుటుంబం, కెరీర్‌ల గురించి ఎన్నో ఆలోచనలు సుళ్లుతిరిగాయి. విధి ఎంత చిత్రమైనదో కదా అనిపించింది. బొంబాయిలో పనిచేస్తానని నేను కలలో సైతం ఊహించలేదు. రిజర్వ్‌బ్యాంకులో ఉద్యోగమన్నది ఊహలో సైతం లేదు. మూడు దశాబ్దాలుగా పనిచేసిన ప్రభుత్వాన్ని వదిలి వెళతానని అనుకోలేదసలు. కేంద్ర ప్రభుత్వ ఆర్థికశాఖలో ఒక డిపార్ట్‌మెంటుకు పూర్తి సెక్రెటరీగా పనిచెయ్యలేదన్న వెలితి నా మనసును తొలుస్తూనే ఉంది.

ప్రపంచం నాపట్ల సానుకూలంగా స్పందించలేదని అనిపించింది. లోకం పోకడ ఇంతేనని తీర్మానించుకున్నాను. కాసేపు అలాంటి ఆలోచనల్లో కొట్టుకుపోయాను.

కాని, కాసేపయ్యాక ఒకటి తట్టింది. ప్రభుత్వం రక్షణశాఖ సెక్రెటరీగా ఇస్తానన్నది కదా, దాన్నెందుకు నిందించాలి అని. ఇంకాసేపయ్యాక, నా ఆలోచనలు సాగిన విధానానికి నాకే సిగ్గనిపించింది. ఇంత మంచి జీవితాన్నిచ్చిన దేవుడి పట్ల కృతజ్ఞతగా ఉండాలనిపించింది. ఒక స్థాయి చదువు, ఉద్యోగమూ ఉన్న నేనే ఇలాగనుకుంటే, నాకన్నా తెలివితేటలున్నా చదువుకోలేనివాళ్లు, కనీసం హైస్కూలు స్థాయిని దాటలేనివారు ఏమనుకోవాలి? ఆ రకంగా చూసినప్పుడు నాకన్నీ అమిరినట్టేగద? ఒక సానుకూల ఆలోచన ఇచ్చిన శక్తితో విమానం దిగి బొంబాయి నేల మీదకు అడుగుపెట్టాను.

# ఆర్‌బీఐలో అడుగుపెట్టాను

**మా** ఆవిడ గీతకు హైదరాబాద్‌లో షీలా క్షేత్రపాల్ అనే స్నేహితురాలుండేవారు. ఆమెకు హస్తసాముద్రికం కాస్త తెలుసు. 1988లో అనుకుంటా ఒకసారి వాళ్లింటికి డిన్నర్‌కు వెళ్లినప్పుడు ఆమె నా చెయ్యి చూసి 'వేణు ఉన్నత స్థాయి బ్యాంకరవుతారు..' అంటూ చెప్పారు. దానికి మేం సరదాగా నవ్వుకున్నాం. ఎందుకంటే, ఐఏఎస్ అధికారిగా స్థిరపడ్డాక బ్యాంకింగ్ రంగంలోకి వెళ్లడం, అక్కడ ఉన్నత స్థానానికి చేరుకోవడం – దాదాపు అసాధ్యం! కాని 1996 సెప్టెంబరులో డిప్యుటీ గవర్నర్‌గా నేను రిజర్వ్‌బ్యాంకులోకి అడుగుపెట్టాక ఆమె భవిష్యవాణి నిజమయ్యిందంటూ గుర్తుచేసుకున్నాం.

అప్పటికి నా వయసు 55 ఏళ్లు. రిటైర్‌మెంట్‌కు దగ్గరవుతున్న వయసులో కొత్త ఉద్యోగం ప్రారంభించాను! ఢిల్లీ తెలుసు, ప్రభుత్వంలో పని తెలుసు, పదిమంది స్నేహితులున్నారు. అన్నిటినీ వదిలి ఏమీ తెలియని, మాకంటూ ఎవ్వరూ లేని బొంబాయి వెళ్లడానికి తటపటాయించాం.

ఆర్‌బీఐలో చేరితే ఆర్థికవేత్తగా గుర్తింపు వస్తుందన్నది ఒక్కటే నన్ను ఆకర్షించింది.

అప్పటికి మా అమ్మాయి కవిత పెళ్లయి అమెరికా వెళ్లిపోయింది. అబ్బాయి ఆదిత్య కూడా పైచదువులకు అక్కడే ఉన్నాడు. మొదటి టెర్మ్ తర్వాత వాడి చదువుకు లోను వచ్చింది, ఏదో చిన్న ఉద్యోగం కూడా చూసుకున్నాడు. అందువల్ల వాడి చదువు భారమేమీ నాకు లేదు.

బ్యూరాక్రటిక్ వర్గాల్లో నా నిష్క్రమణ పెద్ద వార్త ఏమీ కాలేదు. ఎవరికీ పట్టలేదు. ప్రభుత్వం పంపేస్తే వచ్చానేమోనని ఆర్‌బీఐలో కొందరు అనుకునేవారు. మా బంధుమిత్రుల్లో చాలామంది ప్రభుత్వ సర్వీసును వదిలేసి అక్కడకు వెళ్లడమేమిటని ప్రశ్నించేవారు. ఆర్‌బీఐ అనేది ప్రభుత్వంతో సరిసమానమైన ప్రాముఖ్యం ఉన్న సంస్థ అని వివరించేవాణ్ణి వాళ్లకు.

వాళ్లెంత కన్విన్స్ అయ్యారో తెలీదుగాని, ఆ క్రమంలో నాకు మాత్రం ఆర్‌బీఐ పట్ల ఇష్టం పెరిగింది. సామాన్యులు అంతగా గమనించరుగాని, మన దైనందిన జీవితాల్ని ఎన్నో రకాలుగా ప్రభావితం చేసే శక్తి ఆర్‌బీఐకి ఉంది. ధరలు, వడ్డీ రేట్లు, రూపాయి విలువ, ఎక్స్ఛేంజ్ రేటు.. ఒకటేమిటి – కరెన్సీ నోటో నాణెమో ఉన్న చోటనల్లా ఆర్‌బీఐ ఉందన్న మాటే కదా.

నేను చేరేప్పటికి రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ డాక్టర్ సి. రంగరాజన్‌గారు.

ఆర్‌బీఐ సంస్కృతి ప్రకారం గవర్నర్ పట్ల అత్యంత గౌరవమర్యాదలతో వ్యవహరిస్తారు. గవర్నర్ వ్యక్తిత్వాన్ని బట్టి, ఆయన ప్రభుత్వంతో వ్యవహరించే తీరును బట్టి ఆర్‌బీఐ బలం ఉంటుందని అభిప్రాయపడతారు. ఆర్‌బీఐలో ముగ్గురు లేదా నలుగురు డిప్యూటీ గవర్నర్లుంటారు. నేను చేరేటప్పటికి ఎస్.పి.తల్వార్, ఆర్.వి. గుప్తాలు డిప్యూటీ గవర్నర్లుగా ఉన్నారు. నా తర్వాత జగదీష్ కపూర్ చేరారు.

## దేశవాళీ ఆర్థికవేత్తనట

ఆర్‌బీఐకి సంబంధించినంత వరకు మానెటరీ పాలసీ గుండెకాయ వంటిది. డిప్యూటీ గవర్నర్లలో ఒకరు పూర్తిగా దానికే అంకితమవుతారు. నాకు పూర్వం ఆర్‌బీఐలో మానెటరీ పాలసీ చూసుకున్న డిప్యూటీ గవర్నర్లు డాక్టర్ కె.ఎస్. కష్ణస్వామి, డాక్టర్ రంగరాజన్, ఎస్.ఎస్.తారాపోర్ వంటివారు. ఆ సబ్జెక్టులో గట్టివారు. విదేశీ యూనివర్సిటీల్లో చదువుకుని, పనిచేసి వచ్చినవారు మరి నేను? మానెటరీ పాలసీలో నిపుణుడిని కాను, ఫైనాన్షియల్ మార్కెట్ల మీద దీర్ఘకాలపు అవగాహన లేదు. విదేశాల్లో గొప్పగా చదువుకున్న రికార్డూ లేదు.

వీటన్నిటివల్లా అటు ఆర్థిక రంగంలోను, ఇటు మీడియాలోను నా నియామకం పట్ల మిశ్రమ స్పందన వచ్చింది. ఒక పత్రిక కాలమిస్ట్ నన్ను 'దేశవాళీ ఆర్థికవేత్త' అన్నారు! మరో జర్నలిస్టు – నేను ఐఏఎస్ అధికారిని కాకపోతే ఈ పదవి దక్కేది కాదేమో అని సందేహపడ్డారు. ఇంకో పాత్రికేయుడు మరో అడుగు ముందుకేసి – నా నియామకం అనేది ఆర్‌బీఐ పూర్తిగా ఐఏఎస్ లాబీ వశమైపోయిందన్న విషయాన్ని నిరూపిస్తోందని సూత్రీకరించారు!

పూర్వం కేంద్రంలోని ఫైనాన్స్, కామర్స్ మంత్రిత్వ శాఖల్లోను, రాష్ట్ర ప్రభుత్వంలో ప్లానింగ్ విభాగంలో పనిచేసిన అనుభవం రిజర్వ్‌బ్యాంకు పనిలో నాకు ఉపయోగపడింది. అలాగే 1991 – 92 సమయంలో ఆర్థిక సంక్షోభం సమయంలో

పనిచేసినందువల్ల ఎక్స్‌టర్నల్ సెక్టర్ మీద కూడా పట్టుంది. ప్రభుత్వ పద్దులు, బడ్జెట్, వ్యయ నియంత్రణ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ వంటి విషయాలు బాగానే తెలుసు.

ఆర్‌బీఐలోని నిష్ణాతుల నుంచి విషయ పరిజ్ఞానాన్ని సరైన తీరున గ్రహించాలని, లోతైన జ్ఞానం సంపాదించాలని నిర్ణయించుకున్నాను. ఒకవైపు అలజడి, మరోవైపు నేర్చుకోవాలన్న తపన, నన్ను నేను నిరూపించుకోవాలన్న పట్టుదల – వీటన్నింటి మధ్య 1996 సెప్టెంబరు 14న నేను ఆర్‌బీఐలో డిప్యుటీ గవర్నర్‌గా అడుగుపెట్టాను.

'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డిప్యుటీ గవర్నర్ పదవిలో నా వారసుడిగా డాక్టర్ రెడ్డి నియమితులైనందుకు నాకెంత సంతోషంగా ఉందో మాటల్లో చెప్పలేను. ప్రభుత్వం నుంచి ఇంతకన్న కోరేదేముంటుంది?' అంటూ సాదరంగా స్పందించారు తారాపోర్‌గారు తన వీడ్కోలు ప్రసంగంలో. ఆయన స్నేహపూరిత వాక్యాలు నన్ను ఆర్‌బీఐకి కట్టిపడేశాయంటే అతిశయోక్తి కాదు. బాధ్యతలు అప్పచెప్పేముందు తారాపోర్‌గారు నేను కలిసి కొన్ని వారాలపాటు పనిచేశాం. ఆ సమయంలో ఆయన నాకు పనికి సంబంధించిన ప్రతి అంశాన్నీ కూలంకషంగా తెలియజేశారు.

ఆర్‌బీఐలో అందరూ డిప్యుటీ గవర్నర్ల పట్ల గౌరవంగా ఉంటారు. గవర్నర్ వాళ్లకిచ్చే మన్నింపుననుసరించి డిప్యుటీ గవర్నర్ల గౌరవం పెరుగుతుంది. చేరిన తేదీని బట్టి వాళ్ల సీనియారిటీని లెక్కపెడతారు. దాన్నిబట్టి ప్రోటోకాల్ చాలా పట్టింపుగా ఉంటారు అక్కడి ఉద్యోగులంతా. నేను చేరేప్పటికి డిప్యుటీ గవర్నర్లలో జూనియర్‌ని. అందువల్ల కార్యాలయం గది, కారు వంటి సౌకర్యాలన్నీ సీనియర్లకు దక్కిన తర్వాతే నాకు దక్కేవి! ఆఖరుకు ఆర్‌బీఐ కార్యాలయంలో లిఫ్టు వాడకం కూడా సీనియారిటీని బట్టే. ఈ మర్యాదలన్నిటినీ తెలుసుకోవడం సరదాగా ఉండేది.

పనిలో మాత్రం సీనియర్ జూనియర్ అని కాకుండా నైపుణ్యాన్ని బట్టి గౌరవం ఉంటుంది. ప్రభుత్వ సర్వీసులా కాకుండా, ఫైళ్ల మీద మన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పొచ్చు. నేను ఏ విషయం మాట్లాడాలన్నా ఇతర డిప్యుటీ గవర్నర్ల గదులకు చక్కా వెళ్లిపోయేవాణ్ణి. అరమరికలేవీ లేకుండా, పరస్పరం చర్చించుకుంటూ ప్రతి అంశమ్మీదా దాదాపు ఏకాభిప్రాయానికి రాగలిగేవాళ్లం. ఆనాటి మా బృందాన్ని తల్చుకుంటే నాకు సంతోషంగా ఉంటుంది.

## ఫస్ట్ అండ్ బెస్ట్ ప్రొఫెషనల్స్

1960ల్లో ఆర్‌బీఐలో ఉన్న ఉన్నతస్థాయి నిపుణుల్లో కొంతమందిని ఐఎమ్ఎఫ్ వంటి సంస్థలు ఎగరేసుకుపోయాయి. రంగరాజన్ గవర్నరయ్యాక నిపుణులను ఏరి

పట్టుకుని వాళ్లకు శిక్షణనిప్పించి ఉద్యోగాల్లో పెట్టేవారు. అందువల్ల నేను చేరేనాటికి మెరికల్లాంటి ఆర్థికశాస్త్ర నిపుణులు అక్కడ కనిపించేవారు. వాళ్లందరూ తమ సంస్థ (ఆర్‌బీఐ) పట్ల గర్వంగా ఉండేవారు.

రిజర్వ్‌బ్యాంక్ ఉద్యోగులు సంప్రదాయంగా, నింపాదిగా పనిచేస్తారన్న మాట వినవస్తూ ఉంటుంది. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఉన్నతస్థాయి విలువలు సొంతం చేసుకున్నవాళ్లే ఆర్‌బీఐలో ఉండేవారు.

సంస్కరణల నేపథ్యంలో ఆర్‌బీఐ అంతర్గత పనిసంస్కృతిని మార్చడానికి, మార్కెట్ వర్గాలతోనూ, విదేశీ ఆర్థిక సంస్థలతోనూ ఆర్‌బీఐకి సంబంధభాంధవ్యాలను పెంచడానికి గవర్నర్లు నడుం బిగించారు. డిప్యూటీ గవర్నరుగా నేను వాళ్లకు ఆ పనిలో తోడ్పడ్డాను. చక్కగా చదువుకున్నవాడు, మంచి కలుపుగోలుతనమున్న యువకుడు డాక్టర్ ఎ. ప్రసాద్‌ను నాకు ఎగ్జిక్యూటివ్ అసిస్టెంటుగా నియమించుకున్నాను. అప్పుడు నా దగ్గర బేను ష్నైడర్, ఊర్జిత్ పటేల్ కొద్దికాలం కన్సల్టెంట్లుగా ఉండేవారు. తర్వాత బేను ష్నైడర్ ఐక్యరాజ్యసమితికి వెళ్లిపోయారు, ఊర్జిత్ పటేల్ మనదేశంలో వివిధ సంస్థల్లో పనిచేసి ఇటీవలే రిజర్వ్ బ్యాంక్ గవర్నరయ్యారు.

ఆర్‌బీఐలో మనీ మార్కెట్స్ గురించి ఒకటి, గవర్నమెంట్ సెక్యూరిటీస్ మార్కెట్ గురించి మరొకటి – రెండు కమిటీలను వేశాం. దీనివల్ల రిజర్వ్‌బ్యాంక్ ఉన్నతోద్యోగులకు బోలెడంత కొత్త సమాచారం అందేది. విషయపరిజ్ఞానం పెరిగేది. తాము ఎంచుకున్న అంశాల్లో ఆర్‌బీఐ ఉద్యోగులు సాధికారికమైన పత్రాలు సమర్పించేలా – జాతీయ అంతర్జాతీయ స్థాయి సెమినార్లు, కాన్ఫరెన్సుల్లో పాల్గొనేలా ప్రోత్సహించేవాళ్లం. వాళ్లక్కడ ఏం ప్రెజెంట్ చెయ్యబోతున్నారో ముందుగా చర్చించేవాళ్లం. దినపత్రికల్లో, అంతర్జాతీయ జర్నల్లలో వాళ్ల రచనలు చూసినప్పుడు అభినందించేవాణ్ణి. ఇవి సత్ఫలితాలనిచ్చాయి. అంతర్జాతీయంగా పేరుప్రఖ్యాతులున్న ఎంతోమంది ఆర్థికవేత్తలు మన ఆర్‌బీఐ ఉద్యోగులను 'ఫస్ట్‌క్లాస్ అండ్ బెస్ట్ ప్రొఫెషనల్స్' అంటుంటే చాలా గర్వంగా అనిపించేది.

ఈ మొత్తం ప్రక్రియలో యువ ఉద్యోగుల నుంచి నేనెన్నో విషయాలు నేర్చుకున్నాను. దానికి కృతజ్ఞతగా, నేను డిప్యూటీ గవర్నర్‌గా ఉన్నప్పుడు రాసిన 'మానెటరీ అండ్ ఫైనాన్షియల్ సెక్టార్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా' అనే పుస్తకాన్ని ఆర్‌బీఐలో ప్రతిభావంతులైన, నిబద్ధత గల ప్రొఫెషనల్స్‌కు అంకితమిచ్చాను!

## మార్పులొచ్చిన కాలం

నేను డిప్యూటీ గవర్నరుగా అక్కడున్న ఆరేళ్లలో (సెప్టెంబరు 1996 – జులై 2002) నాదైన ఒక వ్యక్తిత్వం, శైలి, దృక్కోణం ఏర్పర్చుకునే వీలు కలిగింది. నా అదృష్టం కొద్దీ మన దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ తీవ్రమైన సంఘటనలు చోటు చేసుకున్న సమయం అది. అవి మన దేశాన్ని అతలాకుతలం చెయ్యకుండా రక్షించడంలో ఆర్‌బీఐ పాత్ర చాలా గొప్పది. అసలు అన్ని విపత్కర పరిస్థితులు ఉన్నాయని కూడా సామాన్య పౌరులకు తెలియలేదంటే, ఆర్‌బీఐ ఎంత బాగా పనిచేసిందో అర్థం చేసుకోవచ్చు.

ఉదాహరణకు మన దేశంలో ఆర్థిక సంక్షోభం ఇంకా తగ్గుముఖం పడుతూ ఉండగానే 1997 జులైలో ఆసియా సంక్షోభం విరుచుకుపడింది. ఆసియా సంక్షోభం కాస్త నెమ్మదించింది అనేసరికి 1998లో రష్యాలో రూబుల్ సంక్షోభం (రష్యన్ ఫ్లూ) వచ్చిపడింది. రష్యా ప్రభుత్వం, అక్కడి రిజర్వ్ బ్యాంకు రూబుల్ విలువను తగ్గించాయి, ఫలితంగా అప్పులు తీర్చలేక విఫలమయ్యాయి. దానితో అప్పులిచ్చేవారిలో భయం మొదలై, ఇండియాతో సహా అనేక దేశాల్లో తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలుపెట్టారు. ఆ ఏడాదే, పోఖ్రాన్‌లో మనం అణుపరీక్షలు జరిపినందుకు నిరసనగా అమెరికా మనమీద ఆంక్షలు విధించింది. తర్వాత 1999లో మన దేశంలో కార్గిల్ యుద్ధం వచ్చిపడింది. బ్రెజిల్ కరెన్సీ సంక్షోభం వచ్చింది.

ఇవన్నీ మన దేశాన్ని పెద్దగా ప్రభావితం చెయ్యలేదంటే – దానికి రంగరాజన్ హయాంలోనూ, బిమల్ జలాన్ కాలంలోనూ తీసుకున్న గట్టి చర్యలే కారణమని చెప్పొచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎక్కడ సంక్షోభం వచ్చినా దాని ప్రభావం మిగిలిన దేశాల మీద ఉండక తప్పదు. అలాగే అంతర్గతంగా ఏ ఇబ్బందులొచ్చినా మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతినవచ్చు. ఏవైపు నుంచీ ఇబ్బందులు రాకుండా, మన ఆర్థిక వ్యవస్థ సజావుగా సాగేలా చూసుకోవడం కత్తి మీద సామే. దానికి చాలా ముందుచూపు, దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాలి. ఆరోగ్యం దెబ్బతిన్నాక వైద్యుల వద్దకు పరుగెత్తే బదులు, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ, అనారోగ్య లక్షణాలను ముందుగానే అంచనా వేస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు కదా. ఫైనాన్షియల్ స్ట్రెస్ ఇండికేటర్, లిక్విడిటీ ఇండికేటర్, బ్యాంకింగ్ స్టెబిలిటీ ఇండికేటర్ వంటి కొన్ని

సూచికలను తయారుచేసుకుని, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మన ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉండేలా చూసుకోవడంలో రిజర్వ్‌బ్యాంక్ ప్రముఖపాత్ర పోషించింది. నాకు అది గర్వకారణం.

## వారధిగా వ్యవహరించాను

కీలకమైన సంస్కరణల సమయంలో నేను ప్రభుత్వానికీ – ఆర్‌బీఐకీ మధ్య ఒక వారధిగా పనిచేశాను. చాలాకాలం పాటు ప్రభుత్వంలో పనిచేసి రావడం, ఆర్‌బీఐలో అందరూ తెలియడం నాకున్న ప్లస్ పాయింటు. ఆ సమయంలో డిప్యుటీ గవర్నరుగా ఉండటం వల్ల అనేక కీలక నిర్ణయాల్లో నేను భాగస్వామిని కాగలిగాను.

వాటిలో ముందు చెప్పుకోవలసింది ప్రభుత్వానికి ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని తగ్గించడం గురించి. అలాగే ప్రభుత్వం అడిగినంత నగదును అందుబాటులో ఉంచడాన్ని (ఆటోమాటిక్ మానెటైజేషన్) ఆపేశాం. వీటి స్థానంలో వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టాం.

ప్రభుత్వాలు పెద్ద ఎత్తున రుణాలు తీసుకుంటే, ప్రైవేటు వ్యాపారాలకు, ప్రజలకు అందుబాటులో ఉండే డబ్బు తగ్గిపోతుంది. దాన్ని సరిచెయ్యడానికి ఆర్‌బీఐ ఒక్కటే పూనుకుంటే చాలదు, కేంద్ర ఆర్థికశాఖతో కలిసికట్టుగా పనిచేయాలి.

ఆర్థిక సంక్షోభ రోజుల తర్వాత సంస్కరణలు మొదలైనప్పటి నుంచి మన దేశంలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ల ప్రాముఖ్యం పెరిగింది. గ్లోబల్ ఎకానమీతో మన ఆర్థిక వ్యవస్థను అనుసంధానించడం పెరుగుతున్న కొద్దీ ట్రేడ్, క్యాపిటల్ ఫ్లోస్ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మన దగ్గర తగినంత విదేశీ మారక ద్రవ్యం, బంగారం నిల్వలు తగినన్ని ఉండేలా చూసుకోవడం చాలా ముఖ్యమైన పని.

అలాగే విదేశాల్లో మన ఆస్తులను పెంచడం, వాటి రక్షణ – ఇవికూడా ఆర్‌బీఐ బాధ్యతే. కాపిటల్ ఇన్‌ఫ్లో – అవుట్ ఫ్లోల తీరు మారడం వల్ల మన దగ్గర మనీ సప్లై మీద ప్రభావం పడింది. గతంతో పోలిస్తే ఫైనాన్షియల్ మార్కెట్లు పెద్ద పాత్ర పోషించడం మొదలుపెట్టాయి. ఆర్థిక సంక్షోభాన్ని అతి దగ్గర నుంచి చూశాను కనుక ఫారిన్ ఎక్స్ఛేంజ్ రెగ్యులేషన్ విధివిధానాల రూపకల్పనలో నేను చొరవచేశాను, అది నాకు సంతృప్తినిచ్చింది.

సంవత్సరాంతంలో ఆదాయమూ ఖర్చులూ లెక్కచూశాక ఆర్‌బీఐలో మిగులు సొమ్ముంటే దాన్నెలా పంచుకోవాలన్నది ప్రభుత్వానికి – ఆర్‌బీఐకి మధ్య

తలెత్తే పెద్ద ప్రశ్న. సాధారణంగా ఇరుపక్షాలూ అది తమకే చెందాలనుకుంటాయి. 90లకు ముందు మిగులు పెద్దగా ఉండేది కాదు. సంస్కరణల తర్వాత మిగులు ఎక్కువ ఉండటంతో ఇది పెద్ద సమస్యగా మారింది. ఆ పంపకాలకు ఇరుపక్షాలకూ ఆమోదయోగ్యంగా ఉండే ఒక ఫార్ములా రూపొందించడం ఒక ముఖ్యమైన ప్రక్రియ. మేం రూపొందించిన ఆ ఫార్ములా 15 ఏళ్లకు పైగా అమల్లో ఉంది.

ఈ నిర్ణయాల్లో కొన్ని అసాధారణమైనవి, కొన్ని మౌలికమైనవి. వాటన్నిటిలోనూ తుది నిర్ణయం గవర్నర్లదే. కాని వాళ్లు నేను చెప్పినవి శ్రద్ధగా విన్నారు, నా ప్రయత్నాలకు మద్దతునిచ్చారు, నన్ను స్వేచ్ఛగా పనిచెయ్యనిచ్చారు, నిర్ణయాల్లో నా అభిప్రాయాలకు విలువనిచ్చారు. అది నాకు సంతృప్తినిచ్చింది.

★★★★

వ్యక్తిగతంగా చూస్తే, ఆరేళ్ల పాటు ఒకే ఉద్యోగంలో, ఒకే ఇంట్లో ఉండటం నాకు అదే మొదటిసారి. ఉద్యోగ – వ్యక్తిగత వాతావరణాలు స్వేచ్ఛగా, సౌకర్యంగా ఉండేవి. మా అమ్మ తనకిష్టమైనప్పుడల్లా బొంబాయి వచ్చి వెళ్లేది. మా చెల్లి, బావగారు వచ్చివెళ్లేవారు.

ఆ సమయంలో మా అబ్బాయి ఆదిత్య పెళ్లి జరిగింది. మా కోడలు శ్వేతవాళ్లది కూడా అల్లుడు హరిలాగా మూడు నాలుగు తరాలుగా తెలిసిన కుటుంబమే. మా అమ్మాయి కవిత, అల్లుడు హరి కూడా అమెరికాలోనే ఉండేవారు. అందువల్ల మేం వీలున్నప్పుడల్లా వెళ్లి చూసి వచ్చేవాళ్లం. మా పిల్లలు పుట్టినప్పుడు నేను వాళ్లకు దగ్గరగా లేనుగాని, మా రెండో మనవడు రోహన్ (కవిత కొడుకు) పుట్టినప్పుడు నేను షికాగోలోనే ఉన్నాను. పసిపిల్లలుగా వాళ్ల తొలి స్పర్శ నా జ్ఞాపకాల్లో ఎప్పటికీ పదిలంగా ఉంటుంది. రోహన్ అయితే నేను తన సొంతమన్నట్టు ప్రవర్తించేవాడు, ఎవ్వరి దగ్గరకూ వెళ్లేవాడు కాదు, నన్నెవరితోనూ మాట్లాడనిచ్చేవాడు కాదు!

మనవలు దగ్గరగా లేనప్పుడు బొంబాయిలో ఆర్‌బీఐ ఆఫీసర్ల ఫ్లాట్లలోని పిల్లలతో సంతోషంగా గడిపేవాణ్ణి.

# నా శిష్యరికం

**బొం**బాయిలో రిజర్వ్ బ్యాంక్ 18 అంతస్తుల భవనం. పద్దెనిమిదో అంతస్తులో గవర్నర్ కార్యాలయం ఉంటుంది. 1996 సెప్టెంబరు 14 తేదీన డిప్యుటీ గవర్నరుగా బాధ్యతలు స్వీకరించడానికి ఆ గదికి వెళుతుంటే నా మనసులో ఆలోచనలు సుళ్లు తిరిగాయి.

పూర్వం ఆర్ఎన్ మల్హోత్రా గవర్నరుగా ఉన్నప్పుడు, ఆ తర్వాత ఎస్. వెంకిటరమణన్, రంగరాజన్ ఉన్నప్పుడు ఆ కార్యాలయానికి వెళ్లినవాణ్ణే. కాని అప్పుడు ప్రభుత్వం తరఫున అధికారికంగా వెళ్లాను, పనిచేశాను. కాని 96లో ఒక ఉద్యోగిని అన్న స్పృహతో అడుగుపెట్టాను.

బాధ్యతలు స్వీకరించాక, గవర్నర్ డాక్టర్ సి. రంగరాజన్‌గారిని కలిసి కృతజ్ఞతాపూర్వకంగా పాదాలను స్పృశించాను. ఆయన షేక్‌హ్యాండిచ్చి 'వేణూ, ఆర్‌బీఐకి స్వాగతం' అన్నారు. ఆశీర్వచనాలతో పాటు శుభాకాంక్షలందించారాయన.

'పని విషయంలో ఏ సందేహమున్నా ఎప్పుడైనా సరే నన్ను అడగండి. సెంట్రల్ బ్యాంకింగ్ గురించి మీరు క్షుణ్ణంగా అర్థం చేసుకోవడానికి ఒకటే మార్గం – వివిధ విషయాల మీద అధ్యయనం చేసి వీలైనన్ని ఉపన్యాసాలివ్వడం!' అంటూ తొలి పాఠాన్ని ఆరోజే నాకు చెప్పేశారు కూడా!

సాధారణంగా డిప్యుటీ గవర్నర్ల ప్రసంగాలను గవర్నర్ చూడటం అరుదు. అలాంటిది రంగరాజన్ నేను తయారుచేసుకున్న ప్రసంగాలను శ్రద్ధగా చూసి సరిచేసేవారు. నేను ఎక్కువ సందర్భాల్లో వివిధ విషయాల్లో ప్రసంగించేలా తర్ఫీదునిచ్చారు. అక్కడున్న ఆరేళ్లలో దేశవిదేశాల్లో, వివిధ ఆర్థిక విషయాల మీద నేను సుమారు 80 వరకూ ఉపన్యాసాలిచ్చాను. చర్చలు రేకెత్తించడానికి, విషయసమాచారం ఇవ్వడానికి, ఆర్‌బీఐ ఆలోచనలను పంచుకోవడానికి అవి ఉపయోగపడ్డాయి. ఆర్‌బీఐలో అదొక రికార్డని చెప్పుకోవచ్చు.

1991నాటి ఆర్థిక సంక్షోభం తర్వాత మన మానెటరీ – ఫిస్కల్ పాలసీల్లోనూ, ఫైనాన్షియల్ సెక్టార్‌లోనూ సంస్కరణలు చెయ్యక తప్పదని దిశానిర్దేశం చేసినవారు రంగరాజనే. వాటి గురించి 80ల్లోనే ఆలోచించిన వ్యక్తిగా ఆయనకు ఆర్థికవర్గాలు పెద్దపీట వేస్తాయి.

ఆర్‌బీఐలో చేరిన కొద్దిరోజులకే రంగరాజన్ నన్ను తనతో పాటు వాషింగ్టన్ డీసీకి వార్షిక ఫండ్ బ్యాంక్ సమావేశాలకు తీసుకెళ్లారు. దానివల్ల గవర్నర్ – ఆర్థిక మంత్రి – ఆర్థిక శాఖలోని ఉన్నతాధికారులు – ఇతర ఆర్థిక సంస్థల ప్రతినిధుల మధ్య సంభాషణలు, చర్చలు ఎలా నడుస్తాయో గమనించే అవకాశం కలిగింది నాకు.

ఆ తర్వాత 1997 జూన్‌లో జరిగిన గవర్నర్ల వార్షిక సమావేశానికి తన ప్రతినిధిగా నన్ను పంపించారు. దానివల్ల ఇతర దేశాల గవర్నర్లతో సమాన ప్రాతిపాదికన వ్యవహరిస్తూ వివిధ విషయాలను గ్రహించే వీలు కలిగింది.

అలాగే ఆర్థికమంత్రితో తన సమావేశాలకు రంగరాజన్ నన్ను తరచూ తీసుకెళ్లేవారు. ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించబోయే కీలక అంశాలను ఆయనతో చర్చకు పెట్టేవారు. ఆ రకంగా కీలకమైన అంశాలను ఆకళింపు చేసుకునే అవకాశం కలిగింది.

## ఎవరూ ఇవ్వరు, మనమే తీసుకోవాలి

జాతీయ – అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నాయి, వాటికి అనుగుణంగా రిజర్వ్‌బ్యాంక్ ఏం చెయ్యబోతోంది అన్న అంశాలతో ఆర్‌బీఐ ప్రతి ఏటా తన క్రెడిట్ పాలసీని ప్రకటిస్తుంది. దీన్నిబట్టి ఆ ఏడాది ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటుందని ప్రభుత్వమూ, మార్కెట్ వర్గాలూ ఒక అంచనాకి వస్తాయి.

1997నాటి ఏన్యువల్ క్రెడిట్ పాలసీని మే 5 న ప్రకటించాలనుకున్నారు. ఆ సమాచారం బ్యాంకులకు తెలుసు, పబ్లిక్‌కూ తెలుసు. ఈలోగా సీతారామ్ కేసరి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అప్పటి ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకుంది. ప్రభుత్వం ఉంటుందో ఉండదో తెలియని డోలాయమాన పరిస్థితిలో పడిపోయింది.

పాలసీ ప్రకటన వాయిదా వేద్దామనుకున్నారు గవర్నర్ రంగరాజన్. అది వద్దని నేను ఆయనకు సూచించాను. అనుకున్న తేదీన ప్రకటించడం వల్ల – ఆర్‌బీఐ అనేది ప్రభుత్వ రాజకీయాలతో సంబంధం లేని స్వతంత్ర సంస్థ అని, రాజకీయ అస్థిరత్వం

ఉన్నప్పటికీ తాను స్థిరంగా పనిచేసుకోగలుగుతుందని అందరికీ తెలుస్తుందని నా ఆలోచన.

అంతేకాదు, ఏదైనా మార్పులు, సంస్కరణలు చెయ్యాలన్నప్పుడు అందులో రిస్క్ ఉంటే రాజకీయ వర్గాలు వెనకాడతాయి. కాని ఆర్‌బీఐ ఒక నిర్ణయం తీసుకుంటే దాన్ని పునఃపరిశీలించిన చరిత్ర లేదు. అందువల్ల ఇదే మంచి అదునుగా, దీర్ఘకాలంలో మేలు చేసే మంచి నిర్ణయాలను తీసుకోవాలన్నది నా వాదన.

దాన్నే కాస్త సరదాగా 'సర్, స్వాతంత్ర్యం ఎవరూ ఇవ్వరు. మనం దాన్ని తీసుకోవాలంతే' అన్నాను గవర్నర్‌తో. అప్పటిదాకా ఏం చెయ్యాలా అని కాస్త అటూఇటూ ఊగిసలాడుతున్న ఆయన ఒక నిర్ణయం తీసుకున్నారు. వాయిదా వెయ్యకుండా అనుకున్న తేదీనే పాలసీ ప్రకటించేశారు. 'బిగ్ బ్యాంగ్' థియరీగా అది చరిత్రలో నిలిచిపోయింది!

**మానెటరీపాలసీలో మార్పులు..**

ఆర్‌బీఐ అప్పటివరకూ పాటిస్తున్న ద్రవ్యవిధానం (మానెటరీ పాలసీ)లో మార్పుచేర్పులు చెయ్యాల్సిన అవసరముందని అందరూ అర్థం చేసుకున్నారు. సంస్కరణల లక్ష్యాన్ని నిర్దేశించి, దానికి అవసరమైన మేధాపరమైన పునాదిని అప్పటికే డాక్టర్ రంగరాజన్ వేశారు. వాటికో తీరూతెన్నూ ఇవ్వడంలో, అందరినీ కూడగట్టడంలో డిప్యూటీ గవర్నర్‌గా నేను చొరవ చూపించాను.

ఆర్‌బీఐ ద్రవ్యవిధానంలో లోటుపాట్లు చక్కదిద్దాలంటే – ప్రభుత్వానికి అవసరమైనప్పుడల్లా నోట్లను అచ్చుగుద్ది ఇవ్వడం (ఆటోమేటిక్ మానెటైజేషన్)ను ఆపాలి. తర్వాత ఆర్‌బీఐ వడ్డీరేటుకు ప్రాముఖ్యమిచ్చి వాడాలి.

అప్పట్లో ఆర్‌బీఐలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆసూరి వాసుదేవన్. క్రెడిట్ పాలసీ విభాగానికి డాక్టర్ వైఎస్‌ఆర్ శర్మ చీఫ్. ఇద్దరూ తెలుగువారే. సంస్కరణల రథం ముందుకు పరుగెత్తాలంటే వారిద్దరి సారథ్యం మంచిదనిపించింది. ఆర్థిక వ్యవస్థ ముందడుగు వెయ్యాలంటే ఏం చెయ్యాలో, లక్ష్యమేమిటో వాళ్లకు తెలుసు.

ఎలా చెయ్యాలి, ఎంత సమయంలో చెయ్యాలి, లక్ష్యాన్ని చేరుకునే ప్రయాణం ఎలా సాగాలో నాకు తెలుసు. అందువల్ల మేమొక బృందంగా ఏర్పడి ఒక్కొక్క అంశం గురించి క్షుణ్ణంగా చర్చిస్తూ, ప్రణాళికలు రూపొందిస్తూ వచ్చాం.

ఒకరకంగా – నేను వాళ్లిద్దరి దగ్గరా శిష్యరికం చేశాను!

తర్వాత నేను గవర్నరయినప్పుడు కూడా డాక్టర్ డి. ఆంజనేయులు, డాక్టర్ డీవీఎస్ శాస్త్రి అనే ఇద్దరు తెలుగువాళ్లు అదే విభాగాలకు ఇన్‌ఛార్జ్‌లుగా వ్యవహరించారు.

మొదట్లో రంగరాజన్‌కు కొన్ని సందేహాలున్నా, క్రమంగా ఆయనకు మేం చేస్తున్న పని పట్ల నమ్మకం కలిగింది.

మొత్తమ్మీద చూస్తే – అప్పటి రాజకీయ అస్థిరత ఆర్‌బీఐకి ఒక మహత్తర అవకాశాన్ని కల్పించినట్టయింది. ఆర్‌బీఐలో వివిధ విభాగాలు, అధికారులు పరస్పర సహకారంతో చురుగ్గా పని చేశాం, ఆర్థిక సంస్కరణల్లో కీలకమైన ఘట్టానికి తొలి మెట్లు ఎక్కేశాం!

బిగ్ బ్యాంగ్ పాలసీ వల్ల రిజర్వ్ బ్యాంక్ – ఇతర బ్యాంకుల సంబంధాల్లో చాలా మార్పులు వచ్చాయి. ప్రతి చిన్న విషయానికీ ఆర్‌బీఐ మీద ఆధారపడటం తగ్గింది. స్థూల స్థాయిలో ఆర్‌బీఐ పర్యవేక్షణ మొదలైంది. బ్యాంకుల సాధికారత పెరిగింది. అలాగే బ్యాంకులూ లబ్ధిదారుల మధ్య సంబంధాల్లోనూ మార్పు వచ్చింది. తమతమ అవసరాలకు తగిన బ్యాంకులను ఎంచుకునే సౌలభ్యం వ్యక్తులకు, సంస్థలకు కలిగింది. మూడోది – వివిధ ఆర్థిక సంస్థల మధ్య వ్యత్యాసాలు, పొరపొచ్చాలు తగ్గి ఒకరినొకరు అర్థం చేసుకునే వాతావరణం ఏర్పడింది. తర్వాత తక్షణ కర్తవ్యం ఏమంటే – దేశీయ మార్కెట్లను అనుసంధానించడం.

## అడిగినంత అచ్చొత్తడమేనా? తాళ్, వీల్లేదు!

ప్రభుత్వానికి జమాఖర్చుల మధ్య తేడా వచ్చినప్పుడు తాత్కాలికంగా డబ్బు సర్దుబాటు చెయ్యడానికి ట్రెజరీ బిల్లులు ఉపయోగపడతాయి. బ్యాంకుల్లో వినియోగదారులకుండే ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యంలాంటిదే ఇవీను. అయితే ప్రభుత్వం వాటిని 91 రోజుల్లోగా క్లియర్ చెయ్యాలి.

1955లో మొదటిసారి ప్రభుత్వం దగ్గర సరిపడా డబ్బు లేకపోయింది. అది మొదలుకొని ట్రెజరీ బిల్లుల ద్వారా ఆర్‌బీఐ ప్రభుత్వానికి అడిగినంత సొమ్మునిస్తూనే ఉంది – ప్రభుత్వం అంతూపొంతూ లేకుండా అలా తీసుకుంటూనే ఉంది!

1974 నుంచి వడ్డీరేటు కేవలం 4.6 శాతమే. అత్యవసర పరిస్థితుల్లో పనికొచ్చే ట్రెజరీ బిల్లుల సదుపాయం ప్రభుత్వానికి ఒక వ్యసనంగా తయారయ్యింది.

ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రభుత్వం అడిగినప్పుడల్లా సొమ్మును అచ్చుకొట్టి ఇవ్వడమే ఆర్‌బీఐ పని అన్నట్టుగా తయారయ్యింది పరిస్థితి. అసలు ఎంత సొమ్ము చలామణీలో ఉందో కూడా తెలియని అంచుకు చేరుకున్నాం. ఫలితంగా – ఒక స్పష్టమైన ద్రవ్యవిధానానికి రూపకల్పన చెయ్యలేని స్థితిలో పడింది ఆర్‌బీఐ.

అప్పటికే రంగరాజన్ ఆ దిశగా కొంత కసరత్తు చేసి ఆర్థిక శాఖతో సంప్రదింపులు జరిపి 1994లో ఒక ఒప్పందానికి రాగలిగారు. ఆ విధంగా 'కావల్సినంత కరెన్సీ ముద్రణ'కు అడ్డుకట్ట పడింది.

విచ్చలవిడి ట్రెజరీ బిల్లులకు బదులుగా క్రమశిక్షణాయుతమైన 'వేస్ అండ్ మీన్స్'కు సంబంధించి, సరైన విధానాన్ని రూపొందించే బృహత్తరమైన బాధ్యతను నామీద పెట్టారు రంగరాజన్.

ఆర్థిక శాఖతో నాకు సత్సంబంధాలు ఉన్నప్పటికీ, వాళ్లు ఈ కొత్త ఏర్పాటుకు విముఖత చూపారు. ఓవర్‌డ్రాఫ్ట్ లిమిట్ అయిపోతే బిల్లులనాపెయ్యడం అనేది వాళ్లకు ఎంత మాత్రమూ రుచించలేదు. ఆర్‌బీఐ రాష్ట్రాల విషయంలో అలా ప్రవర్తించవచ్చునేమోగాని, కేంద్ర ప్రభుత్వంతో అలా ప్రవర్తించడమంటే దాని సార్వభౌమత్వాన్ని ప్రశ్నించినట్టే అని భావించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన చెక్కు చెల్లకుండా పోవడానికి లేదు.

మరైతే ఏం చెయ్యాలి? ఒక ఆలోచన తట్టింది. ఆర్‌బీఐ ప్రభుత్వం కలిసి కూర్చుని పరిమితి ఎంత అనేది నిర్ణయించుకుంటాయి. దానిలో 75శాతం ప్రభుత్వం వాడేసుకుంటే, వెంటనే ఆర్‌బీఐ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తుంది. అప్పుడు ఆర్‌బీఐ డెట్ మేనేజర్‌గా వ్యవహరించి అప్పు వచ్చేలాగ చూస్తుంది.

అలాగే అత్యల్పంగా ఉన్న వడ్డీ రేటును కూడా క్రమంగా సవరించాలని తీర్మానించాము. ఆర్థికశాఖలో అధికారులు 'ఇది జరిగే పనేనా' అన్నట్టుగా చూశారు. లోగుట్టు ఏమంటే – ఎప్పుడంటే అప్పుడు, ఎంతంటే అంత డబ్బు తీసుకోవడం అలవాటైన ఆ శాఖకు ఈ కొత్త ప్రతిపాదనలేవీ మింగుడు పడలేదు.

కాని ఇటువంటి పరిమితులుండటం ఆర్థికశాఖకే మంచిదని, దానివల్ల వాళ్లమీద పడే అనవసరమైన ఒత్తిళ్లను తప్పించుకోవచ్చని నేను వాళ్లకు సూచించాను. నాటి విత్తమంత్రి చిదంబరం ఈ ఏర్పాటుకు అంగీకరించారు.

## ప్రభుత్వ బాండ్లు కొనండి

నేను బ్యాంకింగ్ సెక్రెటరీగా ఉన్నప్పుడు ఆర్‌బీఐ డిప్యుటీ గవర్నర్‌గా ఉన్న తారాపోర్ ఫోన్ చేసి కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలకు డబ్బు కావాలి కనుక, బ్యాంకులకు టార్గెట్లు ఇచ్చి బాండ్లు కొనిపించాలని చెప్పేవారు.

నేను బ్యాంకుల ఛైర్మన్ – మానేజింగ్ డైరెక్టర్ల (సీఎమ్‌డీ)లకు ఫోన్లు చేసి, వాళ్ల టార్గెట్లు తెలియజేసి, ఫలానా సమయంలోపల 'ప్రభుత్వానికి సహకరించ'మని కోరేవాణ్ణి. వాళ్లందరికీ అది అదనపు బరువని తెలుసు. అందువల్ల మొహమాటానికి సరేననేవాళ్లు. ఇంకొందరు దాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వంతో బతిమాలించుకునే ప్రయత్నాలు చేసేవాళ్లు. ఆ వ్యవహారమంతా నాకు చిరాగ్గా అనిపించేది. ఇలా దేబిరించే వ్యవస్థకు ఎప్పటికైనా మంగళం పాడెయ్యాలనుకునేవాణ్ణి.

అందువల్ల నేను డిప్యుటీ గవర్నరయ్యాక రాష్ట్రప్రభుత్వ బాండ్ల సమస్యకు పరిష్కారం కనుగొనడం మీద దృష్టి పెట్టాను. ఆకర్షణీయమైన వడ్డీనిస్తే వాటికి డిమాండు పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చేదానికి మరో పావు శాతం వడ్డీ ఎక్కువిస్తామని ఆర్‌బీఐ ముందుకొచ్చింది. దాంతో బ్యాంకులకు సంతోషం కలిగింది. బెదిరింపులు, అభ్యర్థనల అవసరం లేకుండా బాండ్లలో ఆసక్తి పెరిగింది! అలాగే ఆర్థికపరంగా ముందడుగేస్తున్న రాష్ట్రాల బాండ్ల పట్ల ఎక్కువ ఆసక్తి కలిగేలా కొన్ని చర్యలు తీసుకున్నాం. అదీ సత్ఫలితాలనిచ్చింది.

అదే సమయంలో బాండ్లను విదేశీ కరెన్సీలో ఇష్యూ చేస్తే డిమాండు పెరుగుతుందనే సూచన ఒకటి వినవచ్చింది. కాని లాటిన్ అమెరికా ప్రభుత్వాలు అలా చేసినందువల్ల వాటి అభివృద్ధి పాతికేళ్లు వెనకబడింది. మనకు ఆర్థికలోటు, ద్రవ్యలోటు ఉన్నప్పుడు, మదుపరులు కోరుకున్నప్పుడు డాలర్లలో చెల్లించలేకపోతే ఇబ్బందుల పాలవుతాం. అందువల్ల ఆ ప్రతిపాదనను ఎవ్వరూ ఇష్టపడలేదు.

## రాష్ట్రాలకు చేరువయ్యాం

చట్టప్రకారం రిజర్వ్ బ్యాంక్ ఒక స్వతంత్ర సంస్థ. కేంద్ర ప్రభుత్వానికి ఎలాగైతే ఒక బ్యాంకర్‌గా, ఆర్థిక సలహాదారుగా వ్యవహరిస్తుందో, సుమారు అదే రకంగా రాష్ట్రాలతోనూ వ్యవహరించాలి. రుణ పంపిణీ, ప్రాధాన్య రంగాలకు రుణాల వంటి అంశాల్లో రాష్ట్రాల ప్రభుత్వాలతో కలిసిమెలిసి పనిచెయ్యాలి. అలాగే పట్టణ–గ్రామీణ

ప్రాంతాల్లోని సహకార సంఘాలు, బ్యాంకుల వంటివాటిని నియంత్రించడంలో కూడా ఆర్‌బీఐ, రాష్ట్రాలు కలిసి పనిచెయ్యాలి.

కాని వాస్తవానికి ఆర్‌బీఐ అనేది కేంద్ర ప్రభుత్వ సంస్థగా అనుకుంటాయి రాష్ట్రాలు. ఆర్‌బీఐ రాష్ట్రాలకు కాస్త ఎడంగానే ఉండేది. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్నప్పుడే ఆ సంగతి గ్రహించాన్నేను. అయితే, రాష్ట్రాలతో ఆర్‌బీఐ బంధం బలోపేతమయితే ఆర్థిక శాఖలు బలపడతాయి, ఇంకా ఎన్నో సత్ఫలితాలుంటాయి. అందుకే రిజర్వ్ బ్యాంకులో అడుగుపెట్టాక ఆ దిశగా దృష్టి సారించాను.

ప్రభుత్వ బాండ్లు అమ్మిపెట్టాలనుకున్నప్పుడే రాష్ట్రాల ఆర్థిక సెక్రెటరీలను సమావేశానికి పిలిచేది ఆర్‌బీఐ. కాని అలా పిలిచి మరీ అభ్యర్థించాల్సిన అవసరం లేని ఏర్పాటుంటే బాగుంటుందని నేను గవర్నర్‌కు సూచించాను. పబ్లిక్ డెట్ మేనేజ్‌మెంట్‌లో తలెత్తే అనేక అంశాల పట్ల స్పష్టత రావడానికి ఏడాదికోసారి ఆర్‌బీఐలో అన్ని రాష్ట్రాల ఫైనాన్స్ సెక్రెటరీలు కలిసి కూర్చుని మాట్లాడుకుంటే బాగుంటుందని కూడా సూచించాను. ఆ సమావేశానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, అకౌంట్స్, ఎక్స్‌పెండిచర్, ప్లానింగ్ కమిషన్ వంటి విభాగాల నుంచి కూడా ప్రతినిధులు వస్తే అదొక అర్థవంతమైన చర్చావేదిక అవుతుందని సలహానిచ్చాను. డాక్టర్ రంగరాజన్ నా ఆలోచనకు సమ్మతించారు, సమర్థించారు. అలా ఏర్పాటు చేసిన తొట్టతొలి సమావేశానికి స్వాగతోపన్యాసం ఆయనే చేశారు! ఈ తరహా సమావేశాలు మంచి ఫలితాలనిచ్చాయి.

అప్పట్లో కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రాజకీయ సంబంధాలు సంక్లిష్టంగా ఉండేవి. ఇలాంటి సమావేశాల వల్ల రాజకీయాల ప్రభావం ఆర్థిక వ్యవహారాలపై పడకుండా చూసుకునే వీలు కలిగింది.

ఆర్‌బీఐ – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఇరు పక్షాల ఆలోచనలు, అవసరాలను పరస్పరం అర్థం చేసుకునేందుకు తోవ పడింది. రుణ పరిమితులు, గ్యారెంటీలు వంటి క్లిష్టమైన అంశాల్లో ఆర్‌బీఐ గైడెన్స్‌తో రాష్ట్రాలు ఉపయుక్తమైన చట్టాలు చేసుకోగలిగాయి.

అన్నిటికీ మించి, ఆర్‌బీఐకి 'కేంద్ర ప్రభుత్వ సంస్థ మాత్రమే' అనే ముద్ర పోయింది! ఈ సమావేశాల్లో నేను రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులకు సంబంధించి ఎన్నో విషయాలు నేర్చుకోగలిగాను. తర్వాత నేను పద్నాలుగో ఆర్థిక సంఘం ఛైర్మన్నయినప్పుడు ఈ అనుభవం ఎంతో ఉపయోగపడింది.

**బంగారు బాబు**

ఫైనాన్స్ మినిస్ట్రీలో మినిస్టర్ ఆఫ్ స్టేట్‌గా పనిచేసిన ఠాకూర్ నన్ను 'గోల్డ్‌మ్యాన్' అనేవారు సరదాగా. రిజర్వ్ బ్యాంకులో ఉన్న బంగారం విలువను నేను మదింపు చేయించిన సంగతి, ఆర్థిక సంక్షోభ సమయంలో పసిడిని తాకట్టు పెట్టడం, దాన్ని తిరిగి తీసుకురావడంలో నా పాత్ర కూడా తెలుసు. అందువల్ల ఆయన నన్ను అలా పిలిచేవారు.

ఆ తర్వాత డిప్యూటీ గవర్నర్‌గా బంగారానికి సంబంధించిన విధివిధానాల రూపకల్పనలో పరోక్షంగా నేను పాలుపంచుకున్నాను.

1993 మార్చిలో ప్రభుత్వం గోల్డ్ బాండ్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. మూడు నెలల్లో అది మూతపడింది. అప్పుడే కాదు, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటికి నాలుగైదుసార్లు బంగారం పట్ల ప్రజల దృక్పథాన్ని మార్చే ప్రయత్నాలు చేసింది ప్రభుత్వం. అన్నిసార్లూ అవి విఫలమయ్యాయి. బంగారం అనేది డెడ్ ఇన్వెస్ట్‌మెంట్ అని, దాన్ని దిగుమతి చేసుకోవడం వల్ల మన విదేశీమారకద్రవ్యం తరిగిపోవడం తప్ప మరే ప్రయోజనమూ లేదనుకునేది ప్రభుత్వం. అందువల్ల స్వాతంత్ర్యం తర్వాత చాలా ఏళ్లు బంగారు దిగుమతులను నిషేధించింది. కాని ప్రజల్లో బంగారం పట్ల ఆసక్తి తగ్గలేదు. దాంతో మన దేశంలోకి స్మగ్లింగ్ పద్ధతుల్లో వచ్చి చేరేది.

మన సమాజంలో బంగారం పాత్ర ప్రత్యేకమైనది. ఇక్కడ ఎంతోమంది మహిళలకు బంగారం తప్ప వేరే ఆస్తిపాస్తుల మీద హక్కులుండవు. కుటుంబాల్లో తల్లి నుంచి కూతురికో, అత్తగారి నుంచి కోడలికో అది సంక్రమిస్తూ ఉంటుంది. అందువల్ల బంగారం గురించిన ఏ నిర్ణయమైనా అది కుటుంబ బంధాలను ప్రభావితం చేస్తుందన్నది మనం మరిచిపోకూడదు.

ఇక, బంగారానికి అటు పెట్టుబడిగానూ, ఇటు వినిమయ వస్తువుగానూ ఒకేరూపంలో ఉపయోగపడే స్వభావమున్నది. అందువల్ల సామాన్యులు తరచూ ఎదురయ్యే ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి ఇంట్లో ఉండే బంగారాన్నే నమ్ముకుంటారు. అత్యవసర సమయాల్లో తాకట్టుపెట్టడమో అమ్మడమో సులువు.

పేద, మధ్యతరగతి వర్గాలకది ఇన్సూరెన్సులాగా పని చేస్తుంది. అసలు మన దేశంలో బంగారాన్ని స్వచ్ఛమైన కడ్డీలు, నాణేల రూపంలో కొనేవారు,

మదుపు చేసేవారూ తక్కువ. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు బంగారానికున్న డిమాండును తక్షణమే తగ్గించలేం.

ప్రజల ఆదాయాలు పెరగాలి, ఆలోచనల్లో మార్పు రావాలి, ఇతర ఆర్థిక బలాన్నిచ్చే ఆస్తులు సమకూరాలి – అప్పుడే బంగారం పట్ల వారిలో మోజు తగ్గుతుంది.

రెండోది – మెర్సిడీజ్ బెంజ్ వంటి లగ్జరీ కార్లు కావల్సినప్పుడల్లా దిగుమతి చేసుకోవచ్చు గాని బంగారం దిగుమతుల మీద మాత్రం ఆంక్షలు విధిస్తారా అంటూ ప్రభుత్వం మీద జనం విరుచుకు పడతారు.

మూడోది – మన దేశంలో ఇంధనం, ఎరువుల తర్వాత అత్యధికంగా దిగుమతయ్యేది బంగారమే. దానిమీద ఆంక్షలు విధిస్తే, వాటిని సరిగ్గా అమలు చెయ్యలేకపోతే, అది స్మగ్లింగ్‌కు తెర తీసినట్టవుతుంది. అప్పుడు పరిస్థితి ఇంకా ఘోరంగా తయారవుతుంది.

నాలుగు – అధికారిక దిగుమతుల మీద సుంకం తక్కువగా ఉండాలి. అప్పుడే బంగారం దిగుమతికి అక్రమ మార్గాలు మూసుకుపోతాయి.

ఈ విషయాలన్నిటినీ జాగ్రత్తగా ఆలోచించి చూసినప్పుడు బంగారం దిగుమతుల్ని సరళతరం చెయ్యాలని నేను ప్రతిపాదిస్తూ 1996 నవంబరు 28న వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ కాన్ఫరెన్సులో ఒక ప్రసంగం చేశాను.

అది ఆర్థిక వర్గాల్లో ఆలోచనను రేకెత్తించింది. నా ప్రతిపాదనలు చాలా విప్లవాత్మకంగా తోచడం వల్ల వాటిని అంగీకరించడానికి అందరూ కాస్త వెనకాడారు. కాని తర్వాత కాలంలో క్యాపిటల్ అకౌంట్ కన్వర్టబిలిటీ మీద ఏర్పడిన తారాపోర్ కమిటీ బంగారు దిగుమతులను సరళీకతం చేసే విధివిధానాలకు తన మద్దతు తెలియజేసింది. అది నా ప్రసంగం వల్లనే అని తారాపోర్ నొక్కివక్కాణించారు.

## ఎన్నాళ్లో వేచిన ఉదయం..

ఒకానొక సమయంలో విదేశాల్లో విద్య, వైద్యం, పర్యటన... ఇలా ఏదైనా భారతీయులకు గగన కుసుమమే. అప్పట్లో విదేశీ మారక ద్రవ్యం మీద అంతులేనన్ని ఆంక్షలుండేవి. దానికి సంబంధించిన చట్టం – ఫెరా చాలా కఠినంగా ఉండేది. ఏమాత్రం పొరపాటు జరిగినా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చాలా సీరియస్‌గా తీసుకునేది. సంస్కరణల సమయంలో ఫెరాను సవరించాలన్న ఆలోచన మొగ్గ తొడిగింది.

ఆర్‌బీఐలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ రెగ్యులేషన్ అనేది నా విధుల్లోది కాదు. మరో డిప్యుటీ గవర్నర్ ఆర్‌వీ గుప్తా పరిధిలోని విషయమది. అయినా ఆర్థిక సంక్షోభం రోజుల్లో ఫారెక్స్, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ లావాదేవీల్ని చూసిన అనుభవం నాకుంది కనుక ఫెరాను మార్చే పనిలో నన్నూ పాలు పంచుకోమన్నారు. కొన్ని సవరణలను నేను ప్రతిపాదించాను.

వాటిలో ముఖ్యమైనది – ఫారెక్స్‌ను ఆర్‌బీఐ నిర్వహిస్తే చాలు, నియంత్రించ నవసరం లేదనేది.

అంటే, అంతవరకూ భారతీయ పౌరులు, సంస్థలు తమ దగ్గర ఫారిన్ కరెన్సీ ఎంతుందో ఆర్‌బీఐకి చెప్పాల్సి వచ్చేది. నేనేమంటానంటే, అది ఎంత ఉన్నదన్న విషయాన్ని వదిలేసి, దానితో జరిగే లావాదేవీల మీద ఓ కన్నేసి పెడితే చాలునని! బ్యాంకుల్లో ఒక పద్ధతి ప్రకారం కరెంటు అకౌంట్లను ఏర్పాటు చేసుకుని, వాటిద్వారా ఫారెక్స్ లావాదేవీలు చేసుకుంటే, మాటిమాటికీ ఆర్‌బీఐ అనుమతుల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. ఈ సదుపాయం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు, ఒక పరిమితి విధిస్తే సరిపోతుంది. అన్ని కాపిటల్ అకౌంట్ లావాదేవీలు మాత్రం ఆర్‌బీఐ నియంత్రణలోనే ఉండాలి.

వీటన్నిటికీ తోడు, ఈ విషయాల్లో తెలిసీతెలియక జరిగే పొరపాట్లను చక్కదిద్దడానికి ఒక వ్యవస్థ ఉండాలి. వాటిని నేరపూరిత చర్యల కింద జమకట్టకూడదు. అవసరమైనప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేటుకు రిఫర్ చెయ్యొచ్చు.

అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దగ్గర అపరిష్కృతంగా ఉండిపోయిన ఆర్థిక అంశాలను త్వరగా తేల్చెయ్యాలి.

అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మాత్రం అన్ని కంట్రోల్స్‌నూ విధించే అధికారం ఆర్‌బీఐకి ఉండాలని కూడా నేను సూచించాను.

ఈ ప్రతిపాదనల మీద 1997 జూన్, జులైల్లో చాలా చర్చ జరిగింది. చివరకు అత్యంత కఠినమైన ఫెరా స్థానంలో ఫెమా చట్టం వచ్చింది. విదేశీ విద్య, వైద్యం, పర్యటన అనేవి సామాన్యుడికి అందేంత దగ్గరకు వచ్చాయి. ఫెమా గురించి సంక్షోభం నాటి రోజుల నుంచి ఆలోచిస్తూనే ఉన్నాం. దాన్నిప్పటికి ఆచరణలోకి తీసుకొచ్చాం. ఎక్స్‌టర్నల్ సెక్టర్‌కు సంబంధించిన సంస్కరణలకు పునాది వేసినవారిలో నేనూ ఉన్నానన్న వాస్తవం నాకు తృప్తినిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక విధానాల్లో పెను మార్పులు వస్తున్న కాలమది. తూర్పు ఆసియా దేశాల్లో విజయవంతమైంది కనుక మిగిలిన దేశాలన్నీ కాపిటల్ అకౌంట్ ఓపెన్‌గా ఉండటం గొప్పగా భావించేవి. ఆ సమయంలోనే అభివృద్ధి కోసం విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి తగిన విధివిధానాలను తయారుచేద్దామని కామన్వెల్త్ దేశాలన్నీ అనుకున్నాయి.

పెట్టుబడుల రంగంలో పెద్ద ఎత్తున సరళీకరణకు తెరతియ్యడం తగదని నా నిశ్చితాభిప్రాయంగా ఉండేది. చైనా ఓపెన్ కాపిటల్ అకౌంటు కాకపోయినా ఆ దేశానికి భారీ విదేశీ పెట్టుబడులు వస్తున్నాయంటూ ఉదాహరణలు చూపించేవాణ్ణి. నా వాదనతో ఏకీభవించేవారుగాని ఎవ్వరూ పెద్దగా మద్దతునివ్వలేదు.

కాపిటల్ అకౌంట్ కన్వర్టబిలిటీ మీద తారాపోర్ నేతత్వంలో ఒక కమిటీ ఏర్పాటయింది. నేను ఆయనకు సాయం చేస్తూ, ఆ అంశం మీద చర్చల్లో పాల్గొంటూ ఉండేవాణ్ణి. 'మన ఫిస్కల్ డెఫిసిట్ 3.5 శాతం కన్నా తక్కువ ఉండాలి, ధరలు అదుపులో ఉండాలి, బ్యాంకులకు సత్తా ఉండాలి. ఈ మూడూ ఉన్నప్పుడు – అంటే ఆర్థికంగా మనం బలంగా ఉన్నప్పుడు కాపిటల్ అకౌంట్ కన్వర్టబిలిటీ నెమ్మదిగా, అంచెలంచెలుగా చెయ్యవ'చ్చని ప్రతిపాదించింది తారాపోర్ కమిటీ. ఈ రికమెండేషన్‌కు పునాది 1991లో రంగరాజన్ నేతత్వంలో మేం పనిచేసిన 'హైలెవల్ కమిటీ ఆన్ బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్' సిఫార్సుల్లో ఉంది!

1997 సెప్టెంబరులో కామన్వెల్త్ దేశాల ఆర్థిక మంత్రుల సమావేశం మారిషస్‌లో జరిగింది. దానిలో ఇదే విషయం చర్చకు వచ్చింది. వెంటనే ఐఎమ్ఎఫ్ – ప్రపంచబ్యాంకు వార్షిక సమావేశం హాంగ్‌కాంగ్‌లో జరగబోతోంది. ఆ సమావేశాల్లోనూ ఇదే ప్రధాన అజెండా. కాపిటల్ అకౌంట్ కన్వర్టబిలిటీ పూర్తిగా చెయ్యాలంటూ తన సభ్య దేశాలను ఎలాగైనా ఒప్పించాలన్నదే ఆనాటి ఐఎమ్ఎఫ్ ఆలోచన.

నేను మారిషస్ నుంచి హాంగ్‌కాంగ్ వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటుండగా గవర్నర్ రంగరాజన్ ఫోన్ చేశారు.

'వేణూ, ఆసియా ఆర్థిక సంక్షోభం విరుచుకుపడబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియదు. మన ఫారెక్స్

మార్కెట్లను జాగ్రత్తగా గమనించుకోవాలి. మీరు హాంగ్‌కాంగ్ వెళ్లకుండా ఉన్నపళాన ముంబై వచ్చెయ్యండి..' అన్నారు.

అప్పటివరకూ బాగుందనుకున్న ఓపెన్ కాపిటల్ అకౌంట్ల తీరు ఇలా వికటిస్తుందని ఎవరూ ఊహించలేదు. ఆసియా సంక్షోభంతో ఆ తరహా ప్రతిపాదనల మీద అందరికీ అనుమానాలొచ్చాయి. తప్పనిసరిగా ప్రతి దేశమూ ఫుల్ క్యాపిటల్ అకౌంట్ కన్వర్టబిలిటీ చెయ్యాలనే ప్రతిపాదన కాలక్రమంలో వెనక్కెళ్లిపోయింది! నిజం చెప్పాలంటే 2008 గ్లోబల్ క్రైసిస్ తర్వాత కొన్ని పరిస్థితుల్లో క్యాపిటల్ కంట్రోల్స్ కూడా విధించడంలో తప్పులేదనే అవగాహన అందరికీ వచ్చింది.

## రాక్షసుణ్ణా – రక్షకుణ్ణా?

1997 ఆగస్టు మొదట్లో – ఫారెక్స్ మార్కెట్లలో రూపాయి విలువ ఎక్కువగా ఉందనే భావన కలిగింది ఆర్‌బీఐ వర్గాలకు.

సులువైన మాటల్లో చెప్పాలంటే – ఒక డాలర్‌కు మారుగా అవసరమైన రూపాయల సంఖ్య తక్కువగా ఉండటం.

ఎగుమతులు తగ్గిపోతాయి, దిగుమతులు పెరుగుతాయి. అది అలాగే కొనసాగితే తర్వాత సరిదిద్దడం కష్టమైపోతుంది. చివరికది ఏదో ఒకనాడు రూపాయి పతనానికి కారణమవుతుంది. అదే జరిగితే ఆ నష్టాన్ని మాటల్లో చెప్పలేం!

దాన్ని ముందుగా ఊహించే, రూపాయి విలువను సరిచెయ్యడానికి నడుం బిగించింది ఆర్‌బీఐ. ముందు మన మార్కెట్ల మనోభావాలేమిటో అంచనా వేద్దామనుకున్నాం. ఇండియాలో ఇది జరగడం అదే ప్రథమం.

దానికి మొదటి అడుగుగా – 1997 ఆగస్టు 15న గోవాలో ఫారెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో ఎక్స్ఛేంజ్ రేట్ మేనేజ్‌మెంట్ మీద నేనొక ప్రసంగం ఇవ్వాలన్న నిర్ణయం జరిగింది.

ఆనాటి నా ప్రసంగాన్ని నేనెంత శ్రద్ధ పెట్టి తయారుచేశానో, అంతకు రెట్టింపు శ్రద్ధ పెట్టి సరిచూశారు గవర్నర్ రంగరాజన్. ఎందుకంటే ఆ ప్రసంగం మేం తీసుకోదలచిన చర్యల్ని జాగ్రత్తగా వివరించాలి, అదే సమయంలో మార్కెట్ వర్గాలు భయపడకుండా నివారించాలి.

మేం ఊహించినట్టుగానే, నా ఉపన్యాసానికి మార్కెట్లు వెంటనే స్పందించాయి. ఒక దేశం తన కరెన్సీ విలువను తానే తగ్గించడం అనేది ప్రపంచంలో అదే తొలిసారేమో! అటువంటి పనికి ఒడిగట్టిన నన్నొక దుర్మార్గుడిలాగా చూడటం మొదలుపెట్టారు అందరూ. దేశ ఆర్థిక క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నా విధి నేను నిర్వర్తించానన్న భావనతో పుట్టినరోజు చేసుకుందామని హైదరాబాద్ వచ్చేశాను.

అంతలోనే గవర్నర్ నుంచి ఫోన్!

'ప్రధానమంత్రి ఐకె గుజ్రాల్ ఎకనామిక్ టైమ్స్ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎక్స్ఛేంజ్ రేట్ పాలసీలో మార్పులుండొచ్చనే అభిప్రాయాన్నిచ్చారు. ఆర్‌బీఐ పాలసీలో అటువంటి ప్రతిపాదనేదీ లేదు. ఇప్పుడు మార్కెట్లు ఎలా స్పందిస్తాయో ఏమిటో'నంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

'సర్, దీనిపై ఆర్థిక మంత్రి అభిప్రాయమేమిటో అడిగారా?' అన్నాన్నేను.

'అడిగాను. ఆయనకూ ఈ ఇంటర్వ్యూ గురించి ఏమీ తెలియదట!' అన్నారాయన.

'ప్రధానమంత్రిగారో, ఆయన కార్యాలయమో దాన్ని ఏదో రకంగా ఖండించడం కుదురుతుందా?'

'అదికూడా ప్రయత్నించాను. ఆ ఇంటర్వ్యూని ప్రధాని తన నివాసంలో ఇచ్చారు. పత్రిక దాన్ని రికార్డు చేసింది. అందువల్ల దాన్ని ఖండించడం కుదరదు' అన్నారాయన.

నేను ఆలోచించాను. 'ఆర్‌బీఐ దాన్ని తిరస్కరిస్తే సరి...' అన్నాను క్లుప్తంగా.

'అదెలా కుదురుతుంది వేణూ? ప్రధాని ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని మనమెలా ఖండించగలం?' అడిగారాయన ఆశ్చర్యపోతూ!

ఆయనన్నది సబబే. అలా చెయ్యకూడదు. కాని ఎవరో ఒకరు ఆ పని చెయ్యకపోతే దాని పరిణామాలు బాగుండవు. ఆ మాటే చెబితే ఆయన ఆలోచిస్తానన్నారు. అత్యంత జాగ్రత్తగా, ఆచితూచి రాసిన సందేశాన్ని 'ఎక్స్ఛేంజ్ రేటు మీద ఆర్‌బీఐ వివరణ' అంటూ ప్రెస్‌కు ఆగస్టు 20న విడుదల చేశారు.

'ఎకనామిక్ టైమ్స్ పత్రికలో ఎక్స్ఛేంజ్ రేటు మీద ప్రధాని వ్యాఖ్యలు వచ్చాయి. అవి కాస్త గందరగోళపరిచేవిగా ఉన్నాయి. కాపిటల్ అకౌంట్ కన్వర్టబిలిటీ మీద వేసిన

కమిటీ ఒక నిజమైన రేటును సూచించింది. ఇప్పటికైతే ప్రభుత్వంగాని ఆర్‌బీఐగాని దానిమీద ఏ నిర్ణయానికీ రాలేదు. ధరలు సరిగ్గా ఉండేందుకు అవసరమైనట్టుగా దానిలో మార్పుచేర్పులు తప్పనిసరి..' అంటూ వివరించింది మేమిచ్చిన ప్రెస్‌నోట్.

ఒక దేశ ప్రధాని చెప్పిన విషయం అపార్థాలకు తావిచ్చేదిగా ఉందని ఆ దేశ సెంట్రల్ బ్యాంకు వివరణనివ్వడం అనేది అత్యంత అరుదైన సంగతి. ఈ ప్రకటనతో మార్కెట్లలో గందరగోళం ఎక్కువైంది. మేం ఊహించినట్టుగానే, ఆశించినట్టుగానే రూపాయి విలువ కరెక్షన్ చాలా వేగంగా మొదలైంది!

ఇక్కడే కథకు కొసమెరుపు వచ్చింది. రూపాయి విలువ అంత త్వరగా క్షీణించడం ప్రభుత్వానికి అంతగా రుచించలేదు. దానికి నేనే బాధ్యుణ్ణన్నట్టుగా చూడటం మొదలెట్టారు అందరూ!

విలువ పడిపోతున్న వేగాన్ని నియంత్రించమని ఆర్థికమంత్రి చిదంబరం సలహానిచ్చారు. నా అభిప్రాయాలకది విరుద్ధం. ఈ విషయంపై చర్చ కోసం ఢిల్లీలో నేను, ఆర్‌బీఐ గవర్నర్, ఆర్థిక శాఖ సెక్రెటరీ ఆహ్లూవాలియా, చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ శంకర్ ఆచార్య ఆయనతో సమావేశమయ్యాం. నేను గట్టిగా వాదించాను.

చిదంబరం 'వేణూ, ఇది క్లిష్టమైన విషయం. ఒక్క కోణంలోంచే దీన్ని చూడకూడదు. మార్కెట్లు బెంబేలెత్తకుండా చూసుకోవాలి మనం' అన్నారు. అలాగే చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత ఆసియా ఆర్థిక సంక్షోభం ప్రపంచాన్ని సునామీలా తాకింది. దానికి ముందుగానే మేం రూపాయి విలువ బలవంతంగా తగ్గించడం వలన ఆ సంక్షోభం మన దేశాన్ని అంతగా ఇబ్బంది పెట్టలేదు!

ఆ సందర్భంలో పూర్వం పనిచేసిన తారాపోర్ రాసిన మాటలు నాకెప్పటికీ గుర్తుంటాయి. 'భారతదేశ ఆర్థిక చరిత్రను గనక ఎవరైనా క్షుణ్ణంగా రాస్తే, డాక్టర్ వేణుగోపాలరెడ్డిని భారత ఆర్థిక వ్యవస్థకు రక్షకుడిగా గుర్తిస్తారు..' అని రాశారాయన! రూపాయి మారకపు విలువను తగ్గించిన రాక్షసుడినా? ఆసియా సంక్షోభం దెబ్బతియ్యకుండా కాపాడిన రక్షకుడినా? ఆర్థిక వర్గాల్లో ఇది ఇవాళ్టికీ చర్చనీయమే!

## రంగరించి ఇచ్చారు

మానెటరీ పాలసీ ఫ్రేమ్‌వర్క్‌కు డాక్టర్ రంగరాజన్ ఆర్కిటెక్ట్ అని చెప్పుకోవచ్చు. ఆర్థిక వ్యవస్థ సంస్కరణలకు శ్రీకారం చుట్టినది ఆయనే. ఆర్‌బీఐలో నైపుణ్యాన్నీ,

టెక్నాలజీని ప్రవేశపెట్టిన ఖ్యాతి ఆయనకే చెందుతుంది. నేను రంగరాజన్ దగ్గర పనిచేసింది సుమారు 15 నెలలు. ఒక ప్రొఫెసర్‌గా థియరీలో తిరుగులేని పట్టున్న ఆయన డిప్యూటీ గవర్నరుగా దాదాపు పదేళ్లు, గవర్నరుగా ఐదేళ్లు పనిచేశారు. 15 – 20 ఏళ్ల తన అనుభవసారాన్నంతా రంగరించి పదిహేను నెలల్లోనే ఆయన నాకిచ్చారు. అక్కడితో నా శిష్యరికం అయిపోలేదు. నేను గవర్నయిన తర్వాత కూడా అవసరమైనప్పుడల్లా ఆయనను సంప్రదిస్తూనే ఉన్నాను, నేర్చుకుంటూనే ఉన్నాను.

# గవర్నర్లు మారారు

**1997** నవంబరులో నేనూ రంగరాజన్ ఢిల్లీలో ఓ సమావేశానికి వెళ్లాం. తిరిగి బొంబాయి వెళ్లడానికి ఎయిర్‌పోర్ట్‌కు వెళుతూ ఉండగా నాతో మనసు విప్పి మాట్లాడారు ఆయన.

'వేణూ, నా తర్వాత గవర్నర్ ఎవరనే విషయం ఆర్థికమంత్రి నాతో సంప్రదించారు. బిమల్ జలాన్ అయితే బాగుంటుందని నేను సూచించాను. మీకు మరికొంత అనుభవముంటే మీ పేరే చెప్పేవాణ్ణి..' అన్నారు. ఆయనకు ధన్యవాదాలు తెలిపి, తర్వాతేం చెయ్యాలనుకుంటున్నారని అడిగాను. అమెరికాలో ప్రొఫెసర్‌గా వెళ్లాలా, ఇక్కడే ఉండాలా అని ఆలోచిస్తున్నట్టు చెప్పారాయన.

తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర గవర్నర్‌గా రంగరాజన్‌ను ఆహ్వానించడం, ఆయన అంగీకరించడం జరిగాయి. అప్పుడే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా డాక్టర్ బిమల్ జలాన్ పగ్గాలు చేపట్టారు.

బిమల్ జలాన్, రంగరాజన్ ఇద్దరూ జగమెరిగిన ఆర్థికవేత్తలు. నాకన్నా పదేళ్లు పెద్దయిన రంగరాజన్‌కు నాపట్ల శిష్యవాత్సల్యం ఉండేది, జలాన్‌కూ నాకూమధ్య స్నేహవాత్సల్యం ఉండేది.

రంగరాజన్ విదేశాల్లోనూ, ఐఐఎమ్‌లోనూ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆయన ప్లానింగ్ కమిషన్, ఫైనాన్స్ కమిషన్లలో సభ్యుడిగా, ఆర్‌బీఐ డిప్యుటీ గవర్నర్‌గా అనుభవం గడించారు.

జలాన్ కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీ విద్యార్థి. ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయాల్లో ఉండి వచ్చి మన ప్రభుత్వంలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా, సెక్రెటరీగా పనిచేశారు. కామన్వెల్త్ సెక్రటేరియట్, ఐఎమ్‌ఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటివాటిలోనూ పనిచేసిన అనుభవముంది. ఆర్థికమంత్రికి ముఖ్య సలహాదారుగా ఉన్నప్పుడు ఆర్‌బీఐతో పరిచయం పెంచుకున్నారాయన.

రంగరాజన్ – బిమల్ జలాన్ల నేపథ్యాల్లో ఉన్న పోలికలు, తేడాలు వారి పనితీరులో స్పష్టంగా కనిపించేవి.

థియరీ లేనిదే ప్రాక్టీస్ లేదని రంగరాజన్ నమ్మకం. అందువల్ల ఆయన ప్రతి అంశాన్నీ థియరీ ప్రకారం చూసి విశ్లేషించిగానీ ముందడుగేసేవారు కాదు. వ్యవస్థలను మెరుగుపరచడం మీద ఆయన దృష్టి పెట్టేవారు. జలాన్‌కు థియరీ పరిచయమున్నా, ఎప్పటికప్పుడు మారిపోయే పరిస్థితులను బేరీజు వేసి సరైన నిర్ణయాలు మెరుపువేగంతో తీసుకునేవారు. దేన్నైనా వ్యూహాత్మకంగా ఆలోచించేవారు.

## కొత్త గవర్నర్ – కొత్త సంప్రదాయాలు

1997 నవంబరు 22న బిమల్ జలాన్ మన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సంప్రదాయం ప్రకారం ఆయనను ఆర్‌బీఐ బోర్డు సెక్రెటరీ ఆహ్వానించి పద్దెనిమిదో అంతస్తుకు తీసుకెళ్లారు, పాత గవర్నరును ఆయనే కిందవరకూ వచ్చి దిగబెట్టారు. సెక్రెటరీతో పాటు బిమల్ జలాన్‌గారు కూడ కారు వరకూ వచ్చి రంగరాజన్‌కు వీడ్కోలు చెప్పారు. అప్పటివరకూ చరిత్రలో అలా జరగడం అదే ప్రథమం!

ఆ మర్నాడనుకుంటా, ఆఫీసు నుంచి ఇంటికి వెళుతూ బిమల్ జలాన్ నా గదికి వచ్చారు. గవర్నర్ స్వయంగా డిప్యుటీ గవర్నర్ గదికి రావడం అరుదు. కాని మా ఇద్దరికీ అదివరకే మంచి పరిచయం ఉంది. మేమిద్దరం ఒకే ఏడాది, ఒకే రోజున పుట్టాం! అందువల్ల వయసు తేడా లేదు. ఆయన ఫైనాన్స్ సెక్రెటరీగా ఉన్నప్పుడు నేను జాయింట్ సెక్రెటరీగా పనిచేశాను. అంతకుపూర్వం నేను ప్రపంచబ్యాంకులో ఉన్నప్పుడు ఆయన ఇక్కడ ముఖ్య ఆర్థిక సలహాదారుగా ఉండేవారు. కొన్ని సందర్భాల్లో కలిసి పనిచేశాం. అందువల్ల మా మధ్య ఆదరాభిమానాలు ఎక్కువ.

'వేణూ, గీత ఇక్కడే ఉన్నారా? సాయంత్రం నేనూ మీనూ మీ ఇంటికొస్తాం..' అన్నారు.

'ఇంట్లోనే ఉంటాం, తప్పకుండా రండి..' అని స్వాగతించాను.

వాళ్లు సాయంత్రం వచ్చాక నలుగురం కూర్చుని టీ తాగుతూ మేం కలిసి పనిచేసిన పాత రోజుల గురించి గుర్తు చేసుకున్నాం. మాటల్లో ఆయనేమన్నారంటే 'వేణూ, మళ్లీ మనం కలిసి పనిచేద్దాం..' అని. నేను ఆలోచిస్తానన్నాను.

'స్నేహితుల మధ్య ఆలోచించేదేముంది వేణూ.. మనం కలిసి పనిచేద్దాం.. సరదాగా ఉంటుంది..' అన్నారు బిమల్ జలాన్. కొత్త గవర్నర్ కూడా నేనుండాలని పట్టుపట్టడంతో కొనసాగాను.

## కనిపించని యుద్ధాలెన్నో..

ఆర్‌బీఐ గవర్నర్‌గా పగ్గాలు చేపట్టిన మరుక్షణం నుంచే జలాన్ రకరకాల సమస్యలపై యుద్ధం చెయ్యాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఆసియా సంక్షోభం కమ్ముకొని వచ్చింది. మరోవైపు మన దేశంలో రాజకీయ పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల నిలకడైన నాయకత్వం లేకుండా పోయింది. వీటివల్ల మన ఫారెక్స్ మార్కెట్లు అతలాకుతలమయ్యాయి.

1997 నవంబరులో జలాన్ బాధ్యతలు స్వీకరించినప్పటికే తూర్పు ఆసియాలో విస్తరించిన ఆర్థిక సంక్షోభం మనమీద ప్రభావం చూపడం మొదలైంది. రూపాయి మారకపు విలువ క్షీణించే సూచనలు బలంగా ఉండేవి. దాన్ని నివారించడానికి జలాన్ చాలా ధైర్యంగా, దూకుడుగా ముందడుగు వేశారు. ఆయన అవలంబించిన కొన్ని ఆధునికమైన పోకడలపై ఆర్థికరంగంలోని సంప్రదాయవాదులు నొసలు చిట్లించారుగాని జలాన్ పంథాయే సరైనదని తర్వాత అందరికీ అర్థమయింది. ఆ సమయంలో ఆర్థిక రంగంలో సంస్కరణలకు బ్రేక్ పడలేదుగాని, మందగించాయి. తక్షణ సవాళ్లకు పరిష్కారం చూసుకుని, కొంతకాలం తర్వాత మళ్లీ సంస్కరణల గురించి ఆలోచించవచ్చన్నది జలాన్ అభిప్రాయం.

1998 ఆగస్టులో జరిగిన అణుపరీక్షల వల్ల అమెరికా ఆంక్షలు విధించడం వల్ల మన బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మీద ప్రభావం పడింది. అప్పుడే రష్యాలో చెలరేగిన సంక్షోభమూ మనకు సమస్యగా పరిణమించింది. ఇంకోవైపు బ్రెజిల్ వంటి లాటిన్ అమెరికన్ దేశాల్లో వచ్చిన ఇబ్బందికరమైన పరిణామాల వల్ల మనకే సమస్యలు వస్తాయోనన్న భయం. ఇవన్నీ సద్దుమణగక ముందే 1999 మేలో కార్గిల్ యుద్ధం! అటువెంటనే విరుచుకుపడిన వై2కే సమస్య! 1997 నుంచి 2000 మధ్యలో ధామ్మన్న డాట్ కామ్ బుడగ.

వీటిలో ప్రతిదీ మన ఆర్థిక వ్యవస్థను రకరకాల ఇబ్బందులకు గురిచేసినదే. కొన్ని ఫారెక్స్ మార్కెట్ల మీద, కొన్ని ఎక్స్‌టర్నల్ సెక్టార్ మీద విరుచుకు పడితే, వైటూకే వంటివి మన సాంకేతిక పరిజ్ఞానానికి సవాళ్లు విసిరాయి. డాట్కామ్ బుడగ స్టాక్ మార్కెట్లను అతలాకుతలం చేసింది.

ఒకదాని వెంట మరొకటిగా విరుచుకుపడిన సమస్యలను ఒక యుద్ధంలాగా ఎదుర్కొన్నారు బిమల్ జలాన్. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఆయన చూపిన నాయకత్వ లక్షణాలు, నిర్ణయాలు తీసుకోవడంలోని ప్రతిభ – సామాన్యమైనవి కావు. ఇక్కడొక విషయాన్ని తప్పక చెప్పుకోవాలి. అదేంటంటే సామాన్యంగా సమస్య వచ్చాక, ఇబ్బందులొచ్చాక పరిష్కరిస్తే అది అందరికీ తెలుస్తుంది. కాని సమస్యలు రాకుండా నివారించడంలోని గొప్పదనం, దానికి చేసే కృషి సాధారణంగా ఎవరికీ కనిపించదు. జలాన్ పనిచేసిన ఆరేళ్ల కాలంలో ముందుచూపుతో జాగ్రత్తపడి, తగిన చర్యలు తీసుకుని, ఆర్థిక సంక్షోభాలెన్నిటినో మనవరకూ రాకుండా అడ్డుకుని, కట్టుదిట్టం చేసిన తీరు చాలా ముఖ్యమైనది.

గొప్ప ప్రతిభావంతుడు అయిన బిమల్ జలాన్ – మీడియాతో తరచు మాట్లాడటం, పబ్లిక్ పాలసీ గురించి ఉపన్యాసాలివ్వడం, రాయడం వంటివి చేసేవారు కాదు. తాను ప్రవేశపెట్టిన సంస్కరణలు, మార్పులకు కూడా ప్రభుత్వమే కర్త అన్నట్టుగా మిన్నకుండిపోవడం వల్ల కూడా ఆయనకు రావలసినంత పేరు రాలేదని నాకనిపిస్తూ ఉంటుంది. ఆయన సహోద్యోగులతో చాలా మానవీయంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించేవారు. ఏ విషయమైనా ఇట్టే అర్థం చేసుకునేవారు. ఆలోచనాపరుడైన ఆయన్నుంచి నేనెన్నో విషయాలు నేర్చుకున్నాను.

**ప్రముఖుల నుంచి పాఠాలు...**

కేవలం ఆర్థికవేత్తలే కాకుండా, అనేక ఇతర రంగాల్లో కృషి చేసిన ప్రముఖ వ్యక్తులు రిజర్వ్ బ్యాంక్ బోర్డులో సభ్యులుగా ఉండటం ఒక సంప్రదాయం. దానివల్ల వివిధ రంగాలను ప్రభావితం చేసే అంశాల్లో సరైన నిర్ణయాలు తీసుకునే వీలుంటుంది. సెంట్రల్ బోర్డులో టాటా గ్రూపు ఛైర్మన్ రతన్ టాటా, దేశంలో పేరున్న సీయే మాలెగామ్, సహకార పాలవిప్లవానికి తన జీవితాన్ని అంకితం చేసిన అమృత పటేల్, ప్లానింగ్ కమిషన్– ఫైనాన్స్ కమిషన్ సభ్యుడిగా పనిచేసిన ప్రొఫెసర్ సీహెచ్ హనుమంతరావు, న్యాయవాది, పార్లమెంటేరియన్ ఏరాసు అయ్యప్పరెడ్డి వంటి ప్రముఖులు సభ్యులుగా ఉండేవారు.

ఆర్‌బీఐ డైరెక్టర్లను నియమించే ముందు ప్రభుత్వం గవర్నర్‌ను సంప్రదిస్తుంది. బోర్డును పునర్వ్యవస్థీకరించే సమయంలో పేర్లను సూచించమని జలాన్ నన్ను అడిగారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నాతోపాటు పనిచేసిన ఐఏఎస్ అధికారి కాకి

మాధవరావు పేరును సూచించాను. ఆయన పట్టణ సహకార బ్యాంకులపై ఆర్‌బీఐ నియమించిన కమిటీ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. ఆ సమయంలో వారిద్దరికీ పరిచయముంది. మాధవరావు పనితీరు తెలుసుగనక ఆయన పేరును జలాన్ వెంటనే అంగీకరించారు. ఆర్థికరంగంలో మిహిర్ రక్షిత్ పేరును సూచించాను. అప్పుడు జలాన్– 'ఆర్థిక పరిపుష్టికి మనం తీసుకొనే చర్యలు ఆయనకు నచ్చకపోవచ్చు. ఆ విషయం మీకు తెలుసా?' అని ప్రశ్నించారు. 'నాకు తెలుసు. మన ఆలోచనా విధానాన్ని వ్యతిరేకించే వారు కూడా మన బోర్డులో ఉండాలనేది నా ఉద్దేశం. దీని వల్ల మన వ్యతిరేకుల ఆలోచనా విధానం మనకు తెలుస్తుంది. నిర్ణయాలు తీసుకొనే ముందే ఎలాంటి విమర్శలు వస్తాయనేది తెలిస్తే మంచిదేకదా..' అన్నాను.

అబ్దుల్ కలామ్, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి తొలిసారి బోర్డు మీటింగ్‌లో ఆర్‌బీఐ గురించి ఒక ప్రెజెంటేషన్ ఇవ్వమన్నారు. ఆ బాధ్యతను నాపై పెట్టారు జలాన్. కలామ్, నారాయణమూర్తి దాన్నెంతో శ్రద్ధగా విన్నారు, నోట్స్ కూడా రాసుకున్నారు. ఆ తర్వాత ఎప్పుడు కలిసినా నారాయణమూర్తి సరదాగా 'రెడ్డిగారు మా టీచర్' అనేవారు. వివిధ రంగాలలో గొప్పవ్యక్తులు తమకు తెలియని విషయాల్ని తెలుసుకోవడానికి విద్యార్థుల్లాగా తమ సమయాన్ని వెచ్చించటం, అందులో వారి నిబద్ధత వంటివి చూసి ఆర్‌బీఐ సిబ్బంది ఎంతో స్ఫూర్తిపొందారు!

## నువ్వు నాకు థ్యాంక్స్ చెప్పాలోయ్

1998 మే 15 రిజర్వ్ బ్యాంక్ బోర్డు మీటింగ్ శ్రీనగర్‌లో జరిగింది. దానికి ముందు రోజు సాయంత్రం అక్కడి ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా మా అందరికీ గౌరవపూర్వకంగా డిన్నరు ఏర్పాటు చేశారు.

డిన్నరులో జలాన్ నన్ను కాస్త పక్కకు తీసుకెళ్లారు.

'వేణూ, పోఖ్రాన్‌లో మన దేశం జరిపిన అణుపరీక్షలకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడు క్లింటన్ మన దేశం మీద ఆంక్షలు విధించబోతున్నారట. ఈ సమాచారాన్ని ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ నాకు చెప్పారు. క్లింటన్ ప్రకటన చేసేసరికి మనకు రాత్రవుతుంది. తెల్లవారేసరికి ఈ వార్త తెలిస్తే మన మార్కెట్లు అతలాకుతలం కావచ్చు. అందువల్ల ఆర్‌బీఐ తరఫున 'ఏం భయం లే'దంటూ రేపు ఉదయం నేనొక ప్రకటన చెయ్యాలనుకుంటున్నాను. మీడియాకిచ్చే ముందు నువ్వు ఒకసారి ఆ ప్రకటనను శ్రద్ధగా చూడు..' అన్నారు.

అమెరికా అధ్యక్షుడి ప్రకటన వెలువడిన వెంటనే మనం జాగ్రత్తపడాలంటే, అసలు ఆంక్షలు ఎలా ఉంటాయో, వాటి పర్యవసానాలేమిటో మనకు తెలిసి ఉండాలి. అదే తెలియనప్పుడు మనం ఏమని హామీలిస్తాం? ఇచ్చినా వాటి పట్ల నమ్మకం ఉండకపోవచ్చు. అదీగాక మనం భయపడుతున్నట్లు వాళ్లకు ముందుగానే తెలియజెప్పినట్టవుతుంది. ఇలా ఆలోచిస్తే ఆ ప్రకటన అనవసరమనిపించింది నాకు. క్లింటన్ ప్రకటన ఏమిటో చూసి, దానికి మార్కెట్లు ఎలా స్పందిస్తాయో గమనించాక, కావాలంటే ఆర్‌బీఐ భరోసానిస్తే చాలనిపించింది నాకు. అదేమాట జలాన్‌తో చెప్పాను.

దీనికి జలాన్ వాదన భిన్నంగా ఉంది. 'ఇంత పెద్ద సమస్య వచ్చిపడినప్పుడు, మనం ముందుగా స్పందించకుంటే బాధ్యతారహితంగా ఉన్నట్టు అనిపించే ప్రమాదముంది. అందువల్ల మనం ముందుగా ప్రకటన ఇవ్వాలి..' అన్నారు.

డిన్నరయ్యేలోపల రెండుసార్లు 'ప్రకటన ఇద్దాం' అని ఆయన, వద్దని నేను.

ఎవరికీ దేనిమీదా స్పష్టత లేదు. మర్నాడుదయం పది గంటల ప్రాంతంలో జలాన్ నాకు ఫోన్ చేశారు.

'వేణూ, నీ సలహా పాటించినందుకు నాకు నువ్వు థ్యాంక్స్ చెప్పాలోయ్. మనం ఏ ప్రకటనా చెయ్యలేదుకదా, అయినా మార్కెట్లు మామూలుగానే ఉన్నాయి...' అంటూ సరదాగా మాట్లాడారు!

## రష్యా ఋణం – వృథా ప్రయాస

యూఎస్ఎస్ఆర్‌కు భారత్‌కి కొంత అప్పు ఉండేది. అయితే రష్యా విచ్ఛిన్నం కావడంతో రూబుల్ విలువ పడిపోయింది. మన రూపాయి – రూబుల్‌కు మధ్య వ్యత్యాసం బాగా పెరిగిపోయింది. ఆ పరిస్థితుల్లో ఈ రెండు దేశాల మధ్య ఒక ఒప్పందం జరిగింది.

ఈ ఒప్పందం ప్రకారం – రష్యాకు భారత ప్రభుత్వం ప్రతి ఏటా కొన్ని వేల కోట్ల రూపాయలు ఇస్తుంది. ఆ రూపాయలను ఆర్‌బీఐలోని రష్యా అకౌంట్‌లో వేస్తారు. భారత్ నుంచి కొన్ని వస్తువులు దిగుమతి చేసుకోవటానికి, సేవలను పొందటానికి రష్యా ఆ డబ్బును ఉపయోగిస్తుంది. ఈ విధంగా రష్యా తనకు రావాల్సిన అప్పును భారత్ నుంచి రాబట్టుకుంటుంది. కాని చాలాసార్లు ఆర్‌బీఐ అకౌంట్‌లో రష్యా పేరిట

జమ చేసిన రూపాయలను పూర్తిగా ఉపయోగించుకొనేది కాదు ఆ దేశం. తమ దగ్గర ఉన్న రూపాయి నిల్వలను రష్యాలో ఉండే దిగుమతిదారులకు విక్రయించేది.

ఒప్పందం ప్రకారం– ఏయే వస్తువులను ఎగుమతి చేయాలి? ఎలా చేయాలి అనే విషయాలపై రెండు ప్రభుత్వాలకూ నియంత్రణ ఉంది. దీనిని సక్రమంగా ఉపయోగించుకుంటే రెండు దేశాలకూ లబ్ధి చేకూరుతుంది. దీనిని దుర్వినియోగం చేసే అవకాశం కూడా ఉంది.

1997లో రష్యాకు అమెరికా డాలర్ల రూపంలో విదేశీ మారక ద్రవ్యం చాలా అవసరముందనే విషయం తెలిసింది. మాస్కోలో అప్పటి భారత రాయబారి రోనన్‌సేన్ అందించిన సమాచారం ఆధారంగా – రష్యాకు మనం చెల్లించాల్సిన అప్పును డాలర్లలో తీరిస్తే మనకు మేలు. ఆ సందర్భంగా మనకు సుమారు 50 శాతం డిస్కౌంట్ వచ్చేది.

అప్పటి ఆర్థిక శాఖ మంత్రి చిదంబరం ఆదేశాల మేరకు ఈ విషయంలో అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించటం మొదలుపెట్టాను. రష్యా – భారత్ దేశాల్లోని వ్యాపారస్తులకు రాజకీయంగా సంబంధ బాంధవ్యాలుండటం వల్ల వారికీ విషయం తెలుస్తుందనే ఉద్దేశంతో దీనిని చివరివరకూ చాలా రహస్యంగా ఉంచాం. రష్యా ఆర్థికశాఖ కార్యదర్శిని లండన్‌లోనూ, ఢిల్లీలోని ఆర్‌బీఐ గెస్ట్‌హౌస్‌లోనూ కలిసిన సంగతి ఎవ్వరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాం.

మేం కుదిర్చిన ప్యాకేజీపై చిదంబరం సంతృప్తి వ్యక్తం చేశారు. లంచ్ సమయంలో రష్యా నుంచి వచ్చిన మంత్రి బృందాన్ని అధికారికంగా కలిసి, ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తున్నట్లు ప్రకటించాలనేది మా ఉద్దేశం.

అందరం మధ్యాహ్న భోజనానికి కలిశాం. కాని ఆ ఒప్పందానికి మన అధిష్ఠానం అంగీకారం లభించలేదని చిదంబరం చెప్పారు. దానితో నేను షాక్ తిన్నాను. ఆయన కూడా డిజప్పాయింట్ అయ్యారు. దానికి కారణమేమిటో ఆయన చెప్పలేదు. కొన్ని గంటల ముందు దాకా అందరికి ఆమోదయోగ్యమైన ఒప్పందం హఠాత్తుగా ఎందుకు పనికిరాకుండా పోయిందో నాకు తెలియదు. మేం చేసిన పని అంతా వృథా అయినందుకు నాకు చాలా విచారం కలిగింది. ఈ ఒప్పందం కుదరకపోవడానికి రాజకీయంగా, దౌత్యపరంగా, భద్రతాపరంగా– మాకు తెలియని కారణాలు ఉండి ఉండొచ్చు.

# కొత్త దిశానిర్దేశం

యశ్వంత్ సిన్హా 1960 బ్యాచ్ ఐఏఎస్. ఇరవయ్యేళ్ల పాటు ప్రభుత్వాధికారిగా వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన జర్మనీలో మన దౌత్యాధికారిగా కూడా చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. 84లో రాజీనామా చేసి రాజకీయాల్లో చేరిన యశ్వంత్ సిన్హా చంద్రశేఖర్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఆర్థికమంత్రిగా సేవలందించారు. వారు ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు నేను బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ ఇన్‌ఛార్జిగా జాయింట్ సెక్రెటరీగా పనిచేశాను. అది కీలకమైన విభాగం కావడంతో ఆయన నా పనితీరును దగ్గరగా పరిశీలించే అవకాశం ఉండేది. అందువల్ల మా మధ్య పరస్పర నమ్మకం, గౌరవం కుదిరాయి.

1998లో జరిగిన ఎన్నికల తర్వాత అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. యశ్వంత్‌సిన్హా ఆర్థికమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. బడ్జెట్‌ను సాయంత్రం ఐదు గంటలకు ప్రవేశపెట్టడమనేది అప్పటికి ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం. బ్రిటిష్ పార్లమెంటుకు, వారి కాలమానం ప్రకారం అనుకూలమైన సమయమది. దాన్ని తోసిపుచ్చి, మన కాలమానం ప్రకారం, మనకు అనుకూలమైన సమయంలో, ఉదయాన్నే బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత యశ్వంత్ సిన్హాదే. 53 ఏళ్లు నడిచిన సంప్రదాయానికి తెరదించిన తొలి ఆర్థికమంత్రిగా ఆయన చరిత్ర పుటల్లో నిలిచిపోతారు. రియల్ ఇంటెరెస్ట్ రేటును తగ్గించడం, టెలీకమ్యూనికేషన్స్‌ను నిర్బంధాల నుంచి విడుదల చెయ్యడం, నేషనల్ హైవేస్ అథారిటీకి నిధులివ్వడం, పెట్రోలియమ్ పరిశ్రమను డీరెగ్యులేట్ చెయ్యడం వంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారాయన.

అటు బ్యూరాక్రాట్‌గానూ, ఇటు రాజకీయ నాయకుడిగానూ రెండు విధాలా అపార అనుభవమున్న యశ్వంత్‌సిన్హా పనితీరు ఇరువర్గాల వారికీ సమ్మతంగా ఉండేది. జాతీయ, అంతర్జాతీయ పరిణామాల మీద మంచి అవగాహనతో పాటు –

సంక్షోభ సమయంలో ఆర్థికమంత్రిగా పనిచేసిన అనుభవమూ ఉండటంతో ఆర్థిక సంస్కరణల ప్రాముఖ్యాన్ని చాలాముందుగానే గుర్తించారాయన.

అందువల్ల రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా బిమల్ జలాన్ తీసుకునే నిర్ణయాలకు ఆయన సహకారాన్నిచ్చేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే తాను గవర్నర్‌గా ఉన్నప్పుడు విత్తమంత్రిగా యశ్వంత్ సిన్హా ఉండటం బిమల్ జలాన్ అదృష్టం! ఫెరాను మార్చి ఫెమా చట్టం తీసుకొచ్చినప్పుడు ఆర్థిక మంత్రి ఇచ్చిన మద్దతు అపూర్వం. సంస్కరణల నేపథ్యంలో ఆర్థిక రంగానికి కొత్త దిశానిర్దేశం చెయ్యడానికి వాళ్లిద్దరి జోడీ బాగా కుదిరింది.

**పనికిరాని నియమాలను తొలగించేశాం**

ఆర్‌బీఐ బోర్డు మీటింగ్ కోసం ఒకసారి నేను, బిమల్‌జలాన్ – మరికొందరితో కలిసి చండీగఢ్ వెళ్తున్నాం. నేను 1997లో ప్రపంచ బ్యాంకు ప్రచురించిన వరల్డ్ డెవలప్‌మెంట్ రిపోర్టును చదువుతున్నా. అందులో – గతంలో మెక్సికో అధ్యక్షుడు 'డిరెగ్యులేషన్ జార్'ను నియమించినట్లు ఉంది. ఈ జార్ అధ్యక్షుడికి మాత్రమే జవాబుదారీగా ఉంటాడు. నియమ నిబంధనలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటాడు. అది చదువుతూ – మన రిజర్వ్‌బ్యాంకు నియమనిబంధనల వల్ల ఏర్పడే ఇబ్బందులను తొలగించటానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తే బాగుంటుందని జలాన్‌కు సూచించాను. ఆయన 'గుడ్ ఐడియా' అని ఊరుకున్నారు.

బోర్డు సమావేశంలో అజెండా అంతా చర్చించిన తర్వాత జలాన్ – రిజర్వ్ బ్యాంకు నియమ నిబంధనలను రివ్యూ చేయటానికి ఒక అథారిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆశ్చర్యకరంగా నన్ను ఆ పదవిలో నియమించారు. ఆ పదవీ కాలం ఏడాది. ఈ విధంగా రెగ్యులేషన్స్ రివ్యూ అథారిటీ, 1999 ఏప్రిల్ 1వ తేదీన ఏర్పడింది.

అథారిటీ ఏర్పడగానే మేం చేసిన పనేమంటే – ఆర్‌బీఐ నియమనిబంధనల్లో అనవసరమని తోచినవాటిని మాకు తెలియజేయమని కోరుతూ ఒక ప్రెస్ రిలీజ్‌ను విడుదల చేశాం. దాంతోపాటే ఒక సర్క్యులర్‌ను కూడా అన్ని డిపార్ట్‌మెంట్‌లకూ పంపాం. వివిధ వర్గాల నుంచి వచ్చిన సూచనలను ఎలా ప్రాసెస్ చేయాలనే విషయాన్ని అప్పటికే నేను నిర్ధారించాను. దీనిని ప్రజలకు తెలియజేశాం. రెగ్యులేషన్ రివ్యూ అథారిటీకి సాయం చేయటానికి ఆర్‌బీఐలో పనిచేస్తున్న ఇరవై మంది

యువతీయువకులను ఎంపిక చేసుకున్నా. వీళ్లలో ప్రతి ఒక్కరూ తాము పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్ కాకుండా ఇతర డిపార్ట్‌మెంట్‌ల గురించిన అంశాలను పరిశీలిస్తారు. వాటిపై తమ సిఫార్సులను రెగ్యులేషన్ రివ్యూ అథారిటీకి అందిస్తారు. అథారిటీ ఈ సిఫార్సులను సంబంధిత డిపార్ట్‌మెంట్‌కు పంపుతుంది. అథారిటీ పేర్కొన్న నిబంధన ఉండాలా? లేదా మార్పులు చేయాల్సిన అవసరముందా? లేకపోతే పూర్తిగా తొలగించాలా? అనే విషయంపై డిపార్ట్‌మెంట్ తన సూచనలు చేయాల్సి ఉంటుంది. ఒక వేళ అథారిటీ అభిప్రాయానికి, సంబంధిత డిపార్ట్‌మెంట్ చేసిన సూచనల మధ్య వైరుధ్యం ఉంటే– దానిని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌కు తెలియజేస్తారు.

ఈ ప్రక్రియ వల్ల రిజర్వ్ బ్యాంకు పనితీరులో అనేక మార్పులు వచ్చాయి. డిపార్ట్‌మెంట్లవారీగా, అంశాలవారీగా వేర్వేరు సర్క్యులర్లు పంపకుండా, ముఖ్యమైన వాటిని గుదిగుచ్చి ఏడాదికి ఒకసారి జులై 1వ తేదీన మాస్టర్ సర్క్యులర్ విడుదల చేయటం మొదలుపెట్టింది ఆర్‌బీఐ. వాటి తయారీలో ప్రతి డిపార్ట్‌మెంట్ జాగ్రత్తగా వ్యవహరించేది. ఈ మాస్టర్ సర్క్యులర్స్ వల్ల రిఫరెన్స్ చాలా సులభమయింది. రివ్యూ ప్రక్రియను వ్యవస్థలో భాగం చేసి, రెండేళ్ల తర్వాత ఈ అథారిటీని మూసేశారు.

## స్టాండర్డ్స్ మనమే రూపొందిద్దాం

మానెటరీ – ఫైనాన్షియల్ – ఫిస్కల్ పాలసీల రూపకల్పన, పేమెంట్స్, అకౌంటింగ్, ఆడిటింగ్, బ్యాంకింగ్ రెగ్యులేషన్ వంటివి వివిధ దేశాల్లో వివిధ రకాలుగా ఉంటాయి. దానివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నట్టు ఆసియా దేశాల్లో ఆర్థిక సంక్షోభ సమయంలో ఆర్థికవేత్తలు కనుగొన్నారు. అందువల్ల 1999 ఏప్రిల్లో ఫైనాన్షియల్ స్టెబిలిటీ ఫోరంలో – అంతర్జాతీయంగా అందరికీ ఆమోదయోగ్యంగా, పారదర్శకంగా కొన్ని స్టాండర్డ్స్ అండ్ కోడ్స్‌ను రూపొందించాలన్న నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా రూపొందించిన స్టాండర్డ్స్ అండ్ కోడ్స్‌ను వివిధ దేశాలు ఏ విధంగా ఉపయోగిస్తున్నాయనే విషయాన్ని ఎప్పటికప్పుడు మదింపు (ఎసెస్) చేస్తుండాలని కూడా నిర్ణయించారు. వాటికోసం ఏర్పాటు చేసిన వర్కింగ్ గ్రూపుల్లో నేను కూడా సభ్యుడిగా ఉన్నాను.

ఐఎమ్ఎఫ్, ప్రపంచబ్యాంకు వంటివి రూపొందించే ప్రామాణికాలు (స్టాండర్డ్స్) అన్ని దేశాలకూ ఇంచుమించు ఒకేలా ఉంటాయి. అది తగదని నా అభిప్రాయం. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండే స్వదేశీ మదింపు విధానాన్ని

ప్రతిపాదించాను. ఇదేమీ అసాధ్యం కాదని ఆర్‌బీఐ గవర్నర్‌ను, ఆర్థిక శాఖను నేను ఒప్పించగలిగాను.

1999 డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాత ఆర్‌బీఐ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ స్టాండర్డ్స్ అండ్ కోడ్స్‌పై ఒక స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ (ఆ సమయంలో నేను), ఎకనమిక్ అఫైర్స్ కార్యదర్శి ఈ స్టాండింగ్ కమిటీలో ముఖ్యపాత్ర పోషించాం. ఎమ్. నరసింహం వంటి ఉద్దండులు నా అభ్యర్థన మేరకు ఈ కమిటీల్లో చేరి, దిశానిర్దేశం చేశారు. ఈ విషయాలన్నింటిలోను జలాన్ నాకు గైడెన్స్ ఇచ్చారు. స్వేచ్ఛగా పనిచెయ్యనిచ్చారు.

మా నివేదికలను అంతర్జాతీయ సంస్థలు, ఇతర దేశాలు ప్రశంసించాయి. 'ఐఎమ్ఎఫ్ ఈ పని చేయాలంటే లక్షల డాలర్ల ఖర్చు అయ్యేది..' అని అంతర్జాతీయ ద్రవ్యనిధి డైరెక్టర్ డాక్టర్ విజయ్ కేల్కర్ చేసిన వ్యాఖ్యలు ఈ సంఘాలు చేసిన కృషికి అద్దం పడతాయి. సలహా సంఘాల తుది నివేదికలను ప్రజలందరికీ అందుబాటులో ఉంచాం.

ఈ నివేదికలను చూసిన ఐఎమ్ఎఫ్‌కు ఆర్‌బీఐలో ఉన్నతాధికారుల ప్రతిభ అర్థమై – కన్సల్టెంట్లుగా చేరమని కోరింది. వాళ్ల అభ్యర్థన ప్రకారం నేను కొందరిని ఆర్‌బీఐ నుంచి ఇంటర్వ్యూలకు పంపించాను. అలా వెళ్లిన వారిలో కొందరు అక్కడే ఉద్యోగాల్లో ఉండిపోయారు. కొందరు తిరిగి వచ్చారు.

### అదే మంచిదయ్యింది

అది 2001 ఏప్రిల్ అనుకుంటాను. నేను ఆఫీసు పని మీద వాషింగ్టన్ డీసీలో ఉండగా, గవర్నర్ జలాన్ నుంచి ఫోను!

'వేణూ, ఈక్విటీ మార్కెట్లు గజగజలాడుతున్నాయి. కేతన్ పరేఖ్ అనే ఒక స్టాక్ బ్రోకరు, ప్రైవేట్ సెక్టార్‌లోని గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్, గుజరాత్‌లోని మాధాపుర కోపరేటివ్ బ్యాంకు వంటి అర్బన్ కోపరేటివ్ బ్యాంకులు కొన్ని కలిసి చేసిన పని వల్ల ఈ ఉత్పాతం సంభవించింది...' అంటూ ఆందోళనగా మాట్లాడారాయన.

'ఇలాంటి ప్రాడుకున్న అవకాశం చాలా తక్కువ. కాని ఇలా జరగొచ్చని నువ్వు ముందే ఎలా ఊహించావు?' అడిగారాయన.

'బాస్, ఏ పాలసీ చేసినా, నేను ఒకటే ఆలోచిస్తాను. నేనుగనక అవతలి పక్షంలో ఉంటే ఫలానా పాలసీలో ఎక్కడెక్కడ కన్నాలున్నాయి? వాటిద్వారా నేనెలా డబ్బు సంపాదించగలను అని ఒక్క ప్రశ్న వేసుకుంటాను. అప్పుడు ఎక్కడెలాంటి లోపాలున్నాయో ఇట్టే తెలిసిపోతాయి..' అన్నాన్నేను.

జలాన్ నవ్వారు. 'నయం, నువ్వు అవతల పక్షంలో లేకపోవడం మాకు మంచిదయింది..' అన్నారు.

ఆ తర్వాత వెంటనే మీడియాతో మాట్లాడమన్నారాయన నన్ను. అవసరమైనప్పుడు బ్యాంకుల లిక్విడిటీకి ఆర్‌బీఐ సాయపడుతుందని ప్రకటించాం. దాంతో కొంత సర్దుకుంది.

దీనికి నేపథ్యం ఏమిటి?

షేర్లు, ఈక్విటీల్లో బ్యాంకులు పెట్టుబడి పెట్టేందుకు ఒక పరిమితి ఉంది. దాన్ని ప్రుడెన్షియల్ నార్మ్స్ అంటారు. అది ఐదు శాతం (ఇంక్రిమెంటల్ డిపాజిట్ లెవెల్ – ఒక ఏడాదిలో పెరిగిన డిపాజిట్ల మీద మాత్రమే) అని ఉండేది. జలాన్ దాన్ని ఒకేసారి పెంచారు. దాన్ని అవకాశంగా తీసుకుని బ్యాంకర్ – బ్రోకర్ కలిసిపోతే భారీ స్కామ్ జరగొచ్చని నా ఊహ. అదే ఆయనకు చెప్పాను. కేతన్ పరేఖ్ స్కామ్ జరిగినప్పుడు ఆయనకు నా హెచ్చరికలు గుర్తొచ్చాయి.

అటుపైన 2001 ఏప్రిల్ 19న ఆ ఏడాదికి సంబంధించిన మానెటరీ అండ్ క్రెడిట్ పాలసీని ప్రకటించాలి. కేతన్ పరేఖ్ స్కామ్ నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్లు ఇబ్బందుల పాలవకుండా పక్కాగా ప్రణాళిక రూపొందించాలనుకున్నారు జలాన్. పనిలో పనిగా ఆర్థిక వ్యవస్థకు ఎదురవుతున్న కొత్త సవాళ్ల గురించి నన్ను వివరంగా రాయమన్నారు.

అప్పటికి అర్బన్ కోపరేటివ్ బ్యాంకుల మీద అధికారమేమో రాష్ట్ర ప్రభుత్వాలు చెలాయించేవి. ఏమైనా సమస్య రాగానే అందరూ రిజర్వ్ బ్యాంకువైపు వేలెత్తి చూపించేవారు. అధికారం వాళ్లది, అపవాదులు మాపైన అన్నది కేతన్ పరేఖ్ స్కామ్ స్పష్టం చేసింది.

ఈ నేపథ్యంలో అర్బన్ కోపరేటివ్ బ్యాంకులు పాటించాల్సిన విధివిధానాలేమిటో స్వయంగా జలానే డ్రాఫ్ట్ చేశారు. ఆర్థిక సంస్కరణలకు సంబంధించి అంతకు

పూర్వం ఏ గవర్నరూ ఇవ్వనంత సమగ్రంగా వివరణ ఇస్తూ, ప్రతిపాదనలు చేస్తూ జలాన్‌గారు ఆ ఏడాది ఏన్యువల్ క్రెడిట్ పాలసీని ప్రకటించారు. అది ప్రాతిపదికగా కొన్ని ముఖ్యమైన ఆర్థిక విషయాల్లో గణనీయమైన మార్పులకు పునాది పడింది.

## ఎఫ్ఆర్‌బీఎమ్‌కు పునాది

ఓరోజు నేను ఫైనాన్స్ సెక్రెటరీ డాక్టర్ విజయ్ కేల్కర్ కార్యాలయంలో కూర్చుని కాఫీ తాగుతున్నా. అప్పుడే జలాన్ అటుగా వచ్చారు. 'వేణూ, సెంట్రల్ బ్యాంకరయి ఉండి మీరు ప్రభుత్వ కాఫీని ఎలా తాగుతున్నారు?' అంటూ నవ్వారాయన. ఆయనట్లా వేళాకోళమాడటానికి ఒక నేపథ్యం ఉంది.

ఓసారి ఆర్థికమంత్రి ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ గురించిన విధివిధానాలను కొత్తగా తయారుచెయ్యమన్నారు. దాన్ని చెయ్యమని గవర్నర్ జలాన్ నన్నడిగితే 'ఒక సెంట్రల్ బ్యాంకర్‌గా నేను చెయ్యాల్సిన పని కాదది' అని తిరస్కరించాను.

అందుకే జలాన్ 'ప్రభుత్వ కాఫీ ఎలా తాగుతున్నారు' అని అడిగినది.

తర్వాత ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ గురించి నేను పనిచెయ్యాలని తానూ యశ్వంత్ సిన్హా మాట్లాడుకున్నట్టు చెప్పి జలాన్ నన్ను ఒప్పించారు. ఫిస్కల్ డెఫిసిట్ (మొత్తం ఆదాయానికీ మొత్తం ఖర్చుకూ మధ్య ఉన్న లోటు) మీద ఒక పరిమితి విధించడానికి జరిగిన కసరత్తు అది. ఆర్‌బీఐ నుంచి కొద్దిగా సాయం చేసి పాలసీ బాధ్యత మాత్రం ప్రభుత్వ వర్గాలకే వదలాలని అనుకున్నాం. దానికి ఎకనామిక్ అఫైర్స్ సెక్రెటరీ ఛైర్మన్‌గా ఒక కమిటీ ఏర్పడి చర్చించాలని ప్రతిపాదించాను. విజయ్ కేల్కర్ తర్వాత డాక్టర్ ఈఏఎస్ శర్మగారు సెక్రెటరీ అయ్యారు, ఆయన పేరు మీద వచ్చిన కమిటీ అది. ఆయనా తెలుగువారే, నాకు చిరకాలంగా పరిచయస్థులు. కనకసభాపతి, రంజిత్ పట్నాయక్ తదితర ఆర్‌బీఐ నిపుణులు దానికి చాలా సూచనలు చేశారు. ఐఎమ్ఎఫ్‌లో పనిచేసి రిటైరయిన ఆరికెపూడి ప్రేమ్‌చంద్ ఈ కమిటీకి సాయపడ్డారు.

ఈ కమిటీ ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎమ్) యాక్ట్ రూపొందించింది. పైన చెప్పుకున్న యాక్ట్ – ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పన విధివిధానాలను, ప్రభుత్వాలు ద్రవ్యలోటును అదుపులో పెట్టుకోవల్సిన తీరును సూచించింది.

## మంచి పనులెన్నో!

బిమల్ జలాన్ ఆలోచనాశీలి. ఆర్‌బీఐకి పనికొచ్చే మంచిపనులెన్నో ఆయన మొదలుపెట్టారు. ఆయనకూ ప్రభుత్వం నుంచి మంచి మద్దతు ఉందిగనక ఆర్థిక వ్యవస్థకు మేలుచేసే కొన్ని కీలకమైన నిర్ణయాలను తీసుకుంటే మంచిదని నేను ప్రతిపాదించేవాణ్ణి.

ప్రాంతీయ డైరెక్టర్లకు విస్తృతాధికారాలు కల్పించటం జలాన్ కంట్రిబ్యూషన్లలో ఒకటి. ఆయన హయాంలో ప్రాంతీయ కార్యాలయాలకు అనేక అధికారాలు లభించాయి. వాటి సామర్థ్యం పెరిగింది.

జలాన్ మరో కంట్రిబ్యూషన్ క్లీన్ నోట్ పాలసీ. బాగా వాడేసిన కరెన్సీ నోట్లను వేరుచేసే మిషన్లను ఆయన ప్రవేశపెట్టారు. దీనిని రిజర్వ్ బ్యాంకులో ఉన్న కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. కాని అవి అల్లరి పెట్టకుండా ఆయన నియంత్రించగలిగారు.

దీని వెనకున్న రహస్యాన్ని జలాన్ ఒకసారి నాతో పంచుకున్నారు. మంచి నోట్లను పంపిణీ చేయటానికి యూనియన్లు అడ్డువస్తున్నాయని.. ఆ యూనియన్ల లీడర్లంతా దాదాపు కలకత్తావారేనని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రితో జలాన్ ప్రస్తావించారట. క్లీన్ నోట్ పాలసీని అమలుచెయ్యనివ్వకపోతే, పశ్చిమ బెంగాల్‌కు అన్నీ పాత నోట్లే వస్తాయని నర్మగర్భంగా హెచ్చరించారు. దానితో యూనియన్లు మెట్లు దిగి వచ్చి పాత నోట్లను ఏరేసే పనికి సహకరించాయి!

రిజర్వ్ బ్యాంక్‌లో సిబ్బంది సంఖ్యను తగ్గించటం జలాన్ విజయాల్లో ఒకటిగా చెప్పుకోవచ్చు. టెక్నాలజీని ప్రవేశపెట్టడం, అవుట్ సోర్సింగ్ చేయటం, స్వచ్ఛంద పదవీ విరమణ పథకం వంటివి ప్రవేశపెట్టారు. దీనివల్ల ఉద్యోగుల సంఖ్యను తగ్గించటానికి వీలయింది. ఈ పనుల్లో తెలుగాయన వేపా కామేశం చాలా సాయపడ్డారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేసిన ఆయనకు సబ్జెక్టు మీద పట్టుండేది. అనుభవజ్ఞులు.

జలాన్‌కు మీడియాతో సత్సంబంధాలుండేవి. ఇన్‌ఫార్మల్‌గా అన్ని విషయాలూ వాళ్లకు చెప్పేవారు. అయితే ఫార్మల్‌గా ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు, స్టేట్‌మెంట్లు ఇవ్వడానికిష్టపడేవారు కాదు. ఒక సినిమా దర్శకుడిలాగా ఆయన తెర వెనక ఉండి, తెర మీదికి నన్ను పంపేవారు. దీనితో రిజర్వ్ బ్యాంకు ప్రతినిధిగా మీడియాతో మాట్లాడే

బాధ్యత నాపై ఉండేది. ఆర్థిక సంస్కరణలు కొత్తగనుక, వాటికి సంబంధించిన విషయ పరిజ్ఞానాన్ని మీడియాలోని యువ జర్నలిస్టులతో పంచుకునే వాణ్ణి. ఇవిగాక వెబ్‌సైట్‌ను కూడా ఆధునీకరించడంతో రిజర్వ్ బ్యాంక్ కమ్యూనికేషన్ అంతా ఆ సమయంలో బాగా అభివృద్ధి చెందింది.

ప్రతి విషయమ్మీద సమగ్రమైన ఉపన్యాసాలివ్వడంలో రంగరాజన్‌లాగానే, జలాన్ కూడా నన్ను ప్రోత్సహించారు. ఆ సమయంలో నేను చేసిన ప్రసంగాలు, వివిధ సందర్భాలలో ప్రచురించిన పత్రాలతో– ''మానెటరీ అండ్ ఫైనాన్షియల్ సెక్టార్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా'' పేరిట మూడు పుస్తకాలను ప్రచురించాను. వీటికి మంచి స్పందన లభించింది.

**అనుకున్నామని జరగవు అన్నీ...**

2001లో నేను పదవీ విరమణ చేసే ముందు– నాకు డిప్యూటీ గవర్నర్‌గా కొనసాగాలనే ఉద్దేశం లేదని జలాన్‌తో చెప్పాను. దానికి ఆయన, ఆర్థికమంత్రి సమ్మతించారు.

హైదరాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఫ్యాకల్టీగా చేరటానికి సిద్ధమయ్యాను. కాని నేను పదవీ విరమణ చేయటానికి కొన్ని నెలల ముందు కేతన్ పరేఖ్ స్కామ్ బయటకు వచ్చింది. దీనితో కనీసం ఒక ఏడాది కొనసాగమని నన్ను జలాన్ కోరారు. పార్లమెంటరీ కమిటీల ముందు ఆర్‌బీఐ వాదనను సమర్థంగా వినిపించటానికి నాకు అనుభవముందని ఆయన అభిప్రాయపడ్డారు. యశ్వంత్‌సిన్హా అభిప్రాయం కూడా అదేనని చెప్పారు. నన్ను ఒప్పించిన జలాన్ మరో రెండేళ్లు నేనక్కడే పనిచేసేలా రీ–అపాయింట్‌మెంట్ ఇచ్చారు.

కేతన్ పరేఖ్ స్కాం విషయంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ ముందు ఆర్‌బీఐ వాదన 2002లో పూర్తి అయింది. ఈ పని పూర్తయింది కాబట్టి– ఆర్‌బీఐ నుంచి పదవీ విరమణ చేస్తానని జలాన్‌తో చెప్పాను.

'అంత తొందరేముంది.. కొన్ని నెలలు ఆగండి..' అన్నారు.

# ఐఎమ్ఎఫ్‌కు స్వాగతం – వీడ్కోలు

**ఒ**కరోజు ఆర్థిక వ్యవహారాల శాఖ సెక్రెటరీ సి.ఎమ్.వాసుదేవ్ నాకు కాల్ చేశారు. 'వేణూ సాబ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వాషింగ్టన్‌కు వెళ్లడం మీకిష్టమేనా?' అని అడిగారు.

'యెస్. నాకిష్టమే. మా పిల్లలిద్దరూ అక్కడే ఉన్నారు, మనవడున్నాడు. సరే, ఇంతకూ వెళ్లాల్సింది ఫండ్‌కా? బ్యాంక్‌కా?' అనడిగాను పెద్దగా ఆలోచించకుండానే.

'రెండు ఖాళీలూ వస్తున్నాయి, మీకేది కావాలి?'

'నేనిప్పటికే బ్యాంకులో పనిచేశాను. రిజర్వ్ బ్యాంకులో చేసినందువల్ల ఫండ్‌కు సంబంధించిన విషయాలు తెలుసు. అందువల్ల ఫండ్‌లో అయితే బాగుంటుంది, బ్యాంక్ అయినా పర్లేదు. థాంక్యూ...' అని పెట్టేశాను.

వెంటనే ఈ సంగతి జలాన్ చెవిన వేశాను, ఆయన గదికి వెళ్లి.

'యెస్ చెప్పడానికి ఎందుకంత తొందరపడ్డారు? ప్రభుత్వం ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను ఎలా ఎంపిక చేస్తుందో మీకు తెలియదా? మీరు ఎవరి ప్రయోజనాలకూ కొమ్ము కాయలేదు. అందువల్ల మిమ్మల్ని అడ్డు తప్పించాలని ఎవరో ప్రయత్నిస్తున్నారు..' అన్నారాయన.

'బాస్, మీరు చెప్పిందంతా నాకు తెలుసు. అయితే ఎటూ ఇప్పుడు నేను దీన్ని వదిలి హైదరాబాద్ వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నవాణ్ణే. అలాంటప్పుడు ఈ ప్రతిపాదన వచ్చింది. మా పిల్లలేమో అమెరికాలోనే ఉన్నారు, అక్కడికెళితే వాళ్లతో ఆనందంగా ఉండొచ్చు. నాకిప్పటికే అరవయ్యేళ్లు నిండాయి. ఎలా చూసినా ఈ ప్రతిపాదన మంచిదే. ఆ పదవి రావాలేగాని, వస్తే వెళ్లడానికి నాకభ్యంతరమేం లేదు..' అన్నాను.

త్వరలోనే నన్ను ఐఎమ్ఎఫ్ – అంతర్జాతీయ ద్రవ్యనిధికి మన దేశం నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులొచ్చాయి.

నా తర్వాత రాకేష్ మోహన్ ఆర్‌బీఐ డిప్యుటీ గవర్నరయ్యారు. అదే సమయంలో మన ఆర్థికమంత్రిగా యశ్వంత్‌సిన్హా మారిపోయి, ఆయన స్థానంలో జశ్వంత్‌సింగ్ వచ్చారు.

ఐఎమ్‌ఎఫ్‌కి ఈడీగా వెళ్లే ముందు ఆర్థిక మంత్రిగారిని మర్యాదపూర్వకంగా కలుద్దామని అపాయింట్‌మెంట్ అడిగాను. 'ఊరికే కలవడానికి మీరు ముంబైనుంచి పనిగట్టుకొని ఢిల్లీ దాకా రానవసరం లేదన్నారు మంత్రివర్యులు. మీరు వెళ్లి ఐఎమ్‌ఎఫ్‌లో చేరాక, మరోసారి కలుస్తామన్నారు..' అని సందేశాన్ని పంపింది ఆయన కార్యాలయం.

అయినా, మినిస్ట్రీలో ఇతర ఉన్నతాధికారులను, నా స్నేహితులను కలవడానికి నేను ఢిల్లీ వెళ్లాను. అప్పటికి విదేశీ వ్యవహారాల శాఖను చేపట్టిన యశ్వంత్‌సిన్హాను కలిశాను. ఆయన అభిమానంగా మాట్లాడారు, మేం కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. నన్ను ఫైనాన్స్ సెక్రెటరీగా తీసుకురావాలని ఆయన గతంలో చేసిన ప్రయత్నాల గురించి ఆయన నాకప్పుడే చెప్పారు! కొత్త ఉద్యోగంలో రాణించాలని అభినందనలందించారు.

తర్వాత అప్పటికి ప్రతిపక్షంలో ఉన్న ప్రొఫెసర్ మన్మోహన్‌సింగ్, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ రంగరాజన్‌గార్ల ఆశీస్సులు తీసుకున్నాను.

### తెలిసినవారితో శుభారంభం..

ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పనిచెయ్యడానికి నాకు ఎన్నో అంశాలు సానుకూలించాయి.

ఎలాగంటే ఆర్‌బీఐ డిప్యుటీ గవర్నర్‌గా పనిచేసినప్పుడు ఈడీకి సహకరించడం అనేది అప్పటివరకూ నేను చేశాను. ఇరు పక్షాలకూ సంబంధించిన అనేక కీలక అంశాలు, విధానపరమైన అంశాలకు సంబంధించి – అటు ఫండ్, ఇటు ఆర్బీఐలోని ఉన్నతాధికారులు కలిసి పని చేస్తారు. దాన్ని నేనే పర్యవేక్షించేవాణ్ణి. అలాగే ఫండ్‌కు సంబంధించిన అన్ని అంశాలనూ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడం, చర్చించడం వంటి విషయాల్లో అప్పటికి ఆరేళ్ల అనుభవముంది.

వీటన్నిటివల్లా నాకు అక్కడి ఉన్నతాధికారులు తెలుసు, పని తెలుసు, విధివిధానాలు తెలుసు. బిమల్ జలాన్ పూర్వం ఈడీగా పనిచేసిన వారే కనుక

ఏ సందేహమైనా ఆయనతో చర్చించేవాణ్ణి. ఆయన సలహా ప్రకారం చేరిన తొలినాళ్లలోనే ఐఎమ్ఎఫ్‌లో పనిచేస్తున్న భారతీయులందరితోనూ పరిచయాలు పెంచుకున్నాను. నాకన్నా ముందు ఈడీగా పనిచేసిన డాక్టర్ విజయ్ కేల్కర్ – బోర్డు సభ్యులకు, సీనియర్ మేనేజ్‌మెంట్‌కూ నా గురించి మంచిగా చెప్పారు. వీటన్నిటివల్లా ఐఎమ్ఎఫ్‌లో నా ఉద్యోగ జీవితం సాఫీగా మొదలైంది.

ఇక కుటుంబపరంగా చూసినప్పుడు వాషింగ్టన్‌లో స్థిరపడటం ఈసారి సులువైంది. ఇరవయ్యేళ్ల క్రితం అక్కడ కొన్నాళ్లుండి వచ్చినవాళ్లమే కదా.

ఇప్పుడు ఈడీకి నలుగురు అడ్వైజర్లున్నారు. వారిలో ఐఏఎస్ అధికారి వి. భాస్కర్, దేవీప్రసాద్ ఇద్దరూ తెలుగువారే. అలాగే రిజర్వ్ బ్యాంక్ నుంచి వచ్చిన కనకసభాపతి ఆర్‌బీఐలో నా దగ్గర పనిచేశారు.

ఐఎమ్ఎఫ్‌లో ఒక మేనేజింగ్ డైరెక్టర్, ఆయన కింద ముగ్గురు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్లు, వివిధ ప్రాంతాలకు, సబ్జెక్టులకు ప్రత్యేకంగా డైరెక్టర్లు ఉంటారు. ఈ మేనేజ్‌మెంట్‌కు వివిధ దేశాల ఈడీల మద్దతు అవసరం. వాళ్ల దేశాల ఓటింగ్ పవర్‌ను బట్టి ఈడీల మాటకు గౌరవం. భారత ఈడీకి మంచి గౌరవం ఉంటుంది.

బోర్డు మీటింగుల్లో మన అభిప్రాయాలను రాతపూర్వకంగా అందరికీ తెలియజేసేవాణ్ణి. చర్చలకు సంబంధించిన సూక్ష్మ విషయాల పట్ల మా అడ్వైజర్లు చాలా శ్రద్ధ పెట్టేవాళ్లు. మన అభిప్రాయం ఒక మార్పుకు నాంది పలుకుతుందన్నప్పుడే నేను మాట్లాడేవాణ్ణి.

బోర్డులో డైరెక్టరుగా ఉన్న మీరా ఖోర్ ఇరాన్‌కు చెందిన వ్యక్తి, పాక్‌కూ ప్రాతినిధ్యం వహించేవారు. ఆయన మేధ అక్కడ చర్చలకు ఎంతో ఉపకరించేది. సీనియర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏన్ క్రూగర్ చాలా ప్రభావశీలమైన మహిళ. ఆవిడ స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో పాఠాలు చెబుతున్నప్పటి నుంచి నాకు తెలుసు.

ఏన్ క్రూగర్ మా ఆవిడ గీతకేం చెప్పారంటే 'వేణు బోర్డులో చాలా అరుదుగా మాట్లాడతారు. కాని ఆయన మాట్లాడితే చాలు, మిగిలిన వాళ్లంతా సావధానులై వింటారు..' అని. ఆమె ఆత్మీయంగా చేసిన ఆ ప్రశంస గీతకు సంతోషాన్నిచ్చింది.

## ఇరుగుపొరుగుతో

సాధారణంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఏదైనా అంశం మీద నిర్ణయానికి వచ్చేముందు తమ దేశ ఆర్థికశాఖ, రిజర్వ్ బ్యాంకులతో సంప్రదింపులు చేస్తారు. నా అనుభవం పట్ల నమ్మకంతో మన ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంకులు పెద్దగా కలగజేసుకోకుండా, నా అభిప్రాయాలకు విలువనిచ్చేవి. ఈ నేపథ్యం ఐఎమ్ఎఫ్‌లో నా స్థానాన్ని బలోపేతం చేసింది.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా నేను కేవలం మన దేశానికేగాక, బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంకలకూ ప్రాతినిధ్యం వహించేవాణ్ణి. చాలా అంశాల్లో మన నాలుగు దేశాల ఆలోచనలు, ప్రయోజనాలు ఒకేలాగ ఉండేవి. అందువల్ల నేనే విశ్లేషణ చేసినా, అభిప్రాయాలు వెలిబుచ్చినా – అది నాలుగు దేశాలనూ దృష్టిలో పెట్టుకునే చేసేవాణ్ణి. అత్యంత ముఖ్యమైనవి తప్ప, దేన్నీ రహస్యంగా ఉంచేవాణ్ణి కాదు. నేను చేస్తున్న పని, తీసుకుంటున్న నిర్ణయాలన్నీ నాలుగు దేశాల ఆర్థిక శాఖలకూ, మంత్రులకూ ఎప్పటికప్పుడు తెలియబరుస్తూ ఉండేవాణ్ణి.

ఆ మూడు దేశాల రాజధానులకు వెళ్లినప్పుడల్లా అక్కడి ప్రధాని, ఆర్థిక మంత్రి, సెంట్రల్ బ్యాంక్ అధిపతులను కలుస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకునేవాణ్ణి.

తాను పూర్వం చేసిన వాగ్దానాలు నెరవేర్చలేదని ఐఎమ్ఎఫ్‌కు బంగ్లాదేశ్ పట్ల దురభిప్రాయం ఏర్పడిపోవడంతో – ఆ తర్వాత ఇంక దేనికీ నిధులు ఇవ్వడం మానుకుంది. ఇరుపక్షాలకు చెందిన ఉన్నతాధికారులు ఎడమొహం పెడమొహంగా ఉండేవారు. తర్వాత బంగ్లాదేశ్‌కు ఆర్థిక సాయం అవసరమై నా సహాయం కోరుకున్నది.

ఆ రెంటి మధ్యా పూర్వం రాజుకున్న చిన్నాచితకా గొడవల్లోకి నేను పోదల్చుకోలేదు. అప్పుడే ఐఎమ్ఎఫ్ ఆసియా విభాగానికి డైరెక్టరుగా డేవిడ్ బర్టన్ వచ్చారు. నేను ఆయన్ని భోజనానికి ఆహ్వానించి అవీ ఇవీ మాట్లాడుతూనే చిన్నగా బంగ్లాదేశ్ విషయం ప్రస్తావించాను. కొత్తవాళ్లొస్తే మళ్లీ సంబంధాలు చిగురిస్తాయన్న ఆలోచనను ఆయనతో పంచుకున్నాను.

బంగ్లాదేశ్ ఫైనాన్స్ సెక్రెటరీ, ఆర్థికమంత్రిగా పనిచేసిన సయిద్ ఉజ్జమన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గులామ్ కిబ్రియాలతో నా పూర్వపరిచయం వల్ల పరపతి ఉంది. దాంతో నా మాటను మన్నించి ఇరుపక్షాలూ ఆ ఆలోచనను అమల్లోకి

పెట్టారు. అప్పటితో సమస్య సమసిపోయి, ఐఎమ్ఎఫ్‌తో ఆ దేశ సంబంధాలు కొత్త చిగుళ్లేశాయి. బంగ్లాదేశ్ ప్రోగ్రామ్ రికార్డు టైమ్‌లో మంజూరయ్యింది! ఆ తర్వాత నేను ఆ దేశ ప్రధానమంత్రి బేగమ్ ఖలీదా జియాను కలిసినప్పుడు ఆమె నా చొరవను ఎంతో ప్రశంసించారు.

మరోసారి శ్రీలంకకు ఐఎమ్ఎఫ్ ప్రోగ్రామ్ ఒకటి అవసరమైంది. అయితే బంగ్లాకు భిన్నంగా ఈ దేశంతో ద్రవ్యనిధి సంస్థకు పేచీలేం లేవు, మంచి సంబంధాలున్నాయి. నేను చెయ్యాల్సిందల్లా ఒకటే – ఆ ప్రోగ్రామ్‌కు నా మద్దతు ఉంటుందని సంస్థకు తెలియజెయ్యడం.

అక్కడికి వెళ్లినప్పుడు శ్రీలంక ప్రధాని శ్రీమతి సిరిమావో బండారనాయకేను కలిశాను. ఆమె నాకిచ్చిన సమయం కన్నా ఎక్కువసేపు కూర్చుని నాతో మాట్లాడారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, వివిధ సంస్థల పనితీరు, శ్రీలంక ఆర్థిక వ్యవస్థల మీద విపులంగా మాట్లాడుకున్నాం. ఆయా అంశాల మీద ఆమెకున్న అవగాహన, పట్టు, సూక్ష్మగ్రాహ్యతలు నాకు చాలా సంతోషాన్నిచ్చాయి. ఐఎమ్ఎఫ్ నుంచి వచ్చేస్తూ నేను చేసిన వీడ్కోలు ప్రసంగంలో ఆమె లేవనెత్తిన అంశాలను ప్రస్తావించాను కూడా!

ఇక భూటాన్‌లో నా పర్యటన అందరి ప్రశంసలకూ పాత్రమైంది. ఎందుకంటే ఐఎమ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు అక్కడికి వెళ్లడం అరుదు. అక్కడి ఆర్థిక మంత్రి నా గౌరవార్థం ఒక విందునేర్పాటు చేశారు. తీరా విందు మొదలయ్యే సమయానికి నాకు శ్వాస తీసుకోవడం ఇబ్బందయి అస్వస్థుణ్ణయ్యాను. డాక్టరు వచ్చి చూసి ఏం పర్లేదని అభయమిచ్చాడు. ఎత్తైన ప్రదేశం కావడం వల్ల కొత్తవాళ్లకు అలా జరగడం మామూలేనట! కొంతసేపు విశ్రాంతి తీసుకున్నాక మా ఆధికారిక విందు యథావిధిగా కొనసాగింది.

### రఘురామ్ రాజన్ నియామకం

ఆ ఏడాది మే లేదా జూన్‌లో అనుకుంటాను, ఐఎమ్ఎఫ్‌లో ఎకనామిక్ కౌన్సిలర్ ప్రొఫెసర్ కెన్నెత్ రాగాఫ్ స్థానంలో ఎవర్ని నియమిస్తే బాగుంటుందని చర్చ వచ్చింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురించిన ఒక దృక్పథం ఏర్పడటానికి, ఆర్థిక పరిశోధనలు ముందుకు సాగడానికి, విధాన నిర్ణయాలకు ఐఎమ్ఎఫ్‌కు ఆ పదవిలోని వ్యక్తి అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. అందువల్లే ప్రొఫెసర్ రాగాఫ్ తర్వాత ఎవరు అనేది పెద్ద ప్రశ్నయి కూర్చుంది.

'ప్రొఫెసర్ రఘురామ్ రాజన్ గురించి మీరేమనుకుంటున్నారు' అని అడిగారు సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ ఏన్ క్రూగర్ .

'నేను ఆయన అభ్యర్థిత్వాన్ని పూర్తిగా సమర్థిస్తాను' అని చెప్పానామెకు. అయితే ఆయనకు భారతీయ పౌరసత్వం ఉందోలేదో మాత్రం నాకు తెలియదని కూడా చెప్పాను. తర్వాత రఘురామ్ రాజన్ వచ్చి కలిశారు. మా సంభాషణలో తనకు భారతీయ పౌరసత్వం ఉందన్న సంగతిని ఆయన ధ్రువీకరించారు.

నేను ఆయన అభ్యర్థిత్వం సంగతి ఇక్కడ ప్రభుత్వంలో ఎవరికీ చెప్పలేదు. చెబితే లేనిపోని ఒత్తిళ్లు రావచ్చు, సరైన అభ్యర్థి కానివాళ్లకు సపోర్ట్ చేయాల్సి రావచ్చు. ఐఎమ్ఎఫ్ బోర్డు డీన్ మీరాఖోర్‌గారికి మాత్రం విషయం చెప్పాను.

ప్రొఫెసర్ రఘురామ్ రాజన్ ఎకనామిక్ కౌన్సిలర్‌గా నియమితులయ్యారు. నా కృషి ఫలించి ఒక భారతీయుడు, ఆర్థికశాస్త్రనిపుణుడిగా నాకు పరిచయమున్న వ్యక్తి తొలిసారి ప్రతిష్ఠాత్మకమైన పదవిలోకి వచ్చినందుకు నాకు సంతోషంగా అనిపించింది. తర్వాత నేను జలాన్‌కీ సంగతంతా చెప్పాను. ఆర్థికమంత్రికి లేఖ రాసి, దానిలో రాజన్ ఈ–మెయిల్ ఐడీ ఇచ్చాను!

## నేర్చుకున్న పాఠాలు

ఐఎమ్ఎఫ్‌లో ఉండగా బ్రెజిల్, మెక్సికో, టర్కీ, అర్జెంటీనా వంటి దేశాల తీరును దగ్గర్నుంచి చూశాక నాకొన్ని విషయాలు బోధపడ్డాయి. వాటిలో ముఖ్యమైనది ఏమంటే, ఏ దేశమైనా సరే ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతే అది చాలా భారీ మూల్యం చెల్లించవలసి వస్తుంది. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పూర్తిగా పోగొట్టుకున్నా ఆశ్చర్యం లేదు! రెండోది: బయట నుంచి సాయం చేసే సంస్థలు ఆసియాతో పోలిస్తే ఈ దేశాల పట్ల షరతులు విధించడంలో ఉదారంగా వ్యవహరిస్తాయి. ఇక చివరిది, ఏ దేశమైనా ఆర్థికంగా వ్యాధిగ్రస్తమైపోయినప్పుడు ఐఎమ్ఎఫ్ సూచించిన మందు మంచిదా, అసలే మందూ వెయ్యకుండా ఉండటమే మంచిదా అన్నది ఎవ్వరికీ, ఎప్పటికీ అంతుపట్టదు. వీటన్నిటి ఫలితంగా – ఆర్థిక సరళీకరణలో, మరీ ముఖ్యంగా కాపిటల్ అకౌంట్ సరళీకరణ అంశంలో – అత్యంత జాగరూకతతో ప్రవర్తించాలన్నది నాలో బలంగా నాటుకుపోయింది!

సెప్టెంబరు 2002లో ఆర్థికమంత్రి జశ్వంత్‌సింగ్ ఫండ్ – బ్యాంక్ వార్షిక సమావేశానికి వాషింగ్టన్ డీసీ వచ్చారు.

ఫండ్ వ్యవహారాల మీద కాసేపు మాట్లాడుకున్నాక ఆయన హఠాత్తుగా ఒక ప్రశ్న అడిగారు.. 'మన ప్రభుత్వం విదేశాల్లో డాలర్లలో సావరిన్ బాండ్లను విడుదల చేసి వాళ్లనుంచి డబ్బు సేకరించవచ్చు కదా, అది అభివృద్ధికి ఉపయోగపడుతుంది. వాటికి చాలా డిమాండ్ ఉన్నట్టనిపిస్తోంది..' అని.

ఆ తరహా బాండ్లను జారీ చెయ్యడంలోని మంచిచెడులను ఆయనకు వివరించాను. రెవెన్యూ అకౌంటు లోటులో ఉన్నప్పుడు అవి జారీ చేస్తే ఎదురయ్యే పరిణామాలను వివరంగా చెప్పాను. ఆయన జాగ్రత్తగా విన్నారు.

అటు తర్వాత నేను ఎప్పుడు ఢిల్లీ వెళ్లినా ఆయన్ని కలిసి ఐఎమ్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారాలను క్లుప్తంగా చెప్పేవాణ్ణి. సబ్జెక్టుపై అదే శ్రద్ధ, నా పట్ల అదే గౌరవాదరాలతో వ్యవహరించేవారాయన.

★★★★★

2002 ఆగస్టు. మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా, ఐషర్ కలిసి నన్నూ గీతనూ మేం వాషింగ్టన్ వచ్చినందుకు, ఐఎమ్ఎఫ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చేరుతున్నందుకు గౌరవపూర్వకంగా డిన్నర్ ఏర్పాటు చేద్దామనుకున్నారు. కాని అందరికీ అనువైన ఒక తేదీ కుదరక ఆ విందు చాలా నెలల పాటు వాయిదా పడింది. దాదాపు ఏడాది కావస్తుండగా 2003 జులైలో డిన్నర్‌కు ఒక తేదీ కుదిరింది. ఆ రోజే నన్ను మన దేశ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా నియమిస్తూ వార్తలు వచ్చాయి! వాళ్లు ఐఎమ్ఎఫ్‌కు స్వాగతం చెప్పడం కోసం ఏర్పాటైన ఆ డిన్నరే నాకు వీడ్కోలు డిన్నరయిపోయింది! రెండింటికీ ఒకేసారి కేక్ కట్ చేశాను.

# తొలి తెలుగు గవర్నర్

**2003** ఏప్రిల్లో ఇండియాకి వచ్చినప్పుడు ఆర్థికమంత్రి జశ్వంత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశాను.

'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ పదవి త్వరలో ఖాళీ కావొచ్చు. దానికి మీరైతే బాగుంటుందని పరిశీలిస్తున్నాం...' అన్నారాయన సూటిగా!

ఆశ్చర్యపోవడం నా వంతయింది.

'సర్, ఐఎమ్ఎఫ్‌లో నాకింకా సర్వీసుంది. నేనక్కడికి వెళ్లింది కూడా కొద్ది నెలల కిందటే. నన్నడిగితే అక్కడుండటమే నాకిష్టం. నాకిప్పటికే 62ఏళ్లు. ఆర్‌బీఐ గవర్నర్‌గా నా పేరు పరిశీలించకపోతేనే మంచిదేమోనండి. ఏదేమైనా ప్రభుత్వ ఆజ్ఞలను శిరసావహిస్తాను...' అన్నాను నేను.

దానికాయన ఏమీ స్పందించలేదు, సంభాషణను వేరే అంశాలవైపు మళ్లించారు. మా సంభాషణ ముగిసిన ఎంతోసేపటి వరకూ ఆశ్చర్యం నన్ను వదల్లేదు.

ఎందుకంటే అప్పటికి గవర్నర్ బిమల్‌జలాన్. ఆయన పదవీకాలం 2004 డిసెంబరు వరకూ ఉంది మరి.

నేను ఆయనకు వెంటనే ఫోన్ చేసి జశ్వంత్‌సింగ్‌తో జరిగిన సంభాషణ చెప్పాను. ఆయన నాలాగా ఆశ్చర్యపోలేదు.

'నా పదవీకాలం ముగియక ముందే నేను వెళ్లిపోవచ్చు. కాని ప్రస్తుతానికి ఈ మాటను మీ మనసులోనే ఉంచుకోండి..' అన్నారు.

జశ్వంత్ సింగ్ ప్రతిపాదన గురించి నేనింట్లో చెబితే 'రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా వెళ్లడం మీకిష్టం లేదన్న సంగతి మరింత స్పష్టంగా, దృఢంగా చెప్పి ఉండాల్సిందేమో' అన్నారు మావాళ్లు.

'ఎప్పుడైనా, ఎవరైనా సరే, ప్రభుత్వాన్ని కాదనకూడదు. అలా గనుక చేస్తే ఇక్కడ ఐఎమ్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగడమూ కష్టమే అవుతుంది. అసలు ప్రభుత్వం నుంచి అటువంటి ఆహ్వానం రావడమే ఒక గౌరవం' అన్నాను.

రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ పదవి కోసం చాలామంది ప్రయత్నాలు చేస్తున్నారని, నేను తప్పుకోవడం వాళ్ల ప్రయత్నాలకు ఊతమిస్తుందని నాకు తెలుసు.

ఓ నెల రోజుల తర్వాత అనుకుంటా, నేను భూటానో, బంగ్లాదేశో వెళుతూ ఢిల్లీలో ఆగాను. సమయం తక్కువగా ఉండటం వల్ల మినిస్ట్రీకి వెళ్లాలనుకోలేదు. కాని సంప్రదాయం ప్రకారం అప్పటికే నా ప్రయాణం గురించి వాళ్లకు సమాచారమిచ్చి ఉండటం వల్ల ప్రోటోకాల్ ప్రకారం ఎయిర్‌పోర్టుకు మినిస్ట్రీ నుంచి ఒక అధికారి వచ్చారు. 'ఆర్థిక మంత్రి మిమ్మల్ని కలవమన్నారు' అంటూ వార్త తీసుకొచ్చాడాయన.

నేను వెళ్లి జశ్వంత్‌సింగ్‌ను కలిశాను.

'డాక్టర్ రెడ్డీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాళీ గురించి నేనింతకు ముందు మీతో మాట్లాడాను. నేను ఉపప్రధాని, ప్రధానులిద్దరితోనూ మాట్లాడాను. తర్వాతి గవర్నర్ మీరే కావాలని మేమంతా అనుకుంటున్నాం' అన్నారాయన సూటిగా.

'మీకు ఇబ్బందని మాకు తెలుసు. కాని దీనికి మీరే అర్హులని కూడా మాకు తెలుసు. అందువల్ల మీరు వెంటనే వచ్చి చేరాలి. బాధ్యతలు ఎప్పుడు అప్పగిస్తారో అది జలాన్ చెబుతారు...' అన్నారు.

'నా పట్ల మీరు చూపిస్తున్న నమ్మకానికి కృతజ్ఞుణ్ణి. మీ ఆదేశాలను పాటిస్తాను..' అన్నాను.

దానికాయన వెంటనే స్పందించారు. 'లేదు, ఇది ఆదేశం కాదు, ఆహ్వానం. మన రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం' అన్నారు!

ఆ మాటకు నా సంతోషాన్ని వ్యక్తపరుస్తూనే 'సర్, చట్టప్రకారం రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ పదవీకాలం ఐదేళ్ల వరకూ ఇవ్వొచ్చు. నియమించిన గవర్నర్‌ను ఐదేళ్ల వరకూ ఉండనిచ్చినప్పుడే గవర్నర్ పట్ల ప్రభుత్వ నమ్మకాన్ని బాహాటంగా తెలియజెప్పినట్టవుతుంది..' అన్నాను.

ఆయన అడిగిన మీదట మరింత వివరంగా చెప్పాను. 'ఈమధ్యనంతా గవర్నర్లకు మూడేళ్ల పదవీకాలమే ఇస్తున్నారు.. ఆ తర్వాత దాన్ని ఏడాదో, రెండేళ్లో పొడిగిస్తున్నారు..' అని.

'డాక్టర్ రెడ్డి, మీరు చెప్పింది సబబే.. అలాగే జరుగుతుంది...' అన్నారు జశ్వంత్‌సింగ్.

ఆయన దగ్గర్నుంచి వచ్చేశాక జలాన్‌కు ఫోన్ చేశాను. మా సంభాషణంతా చెబుతూనే 'నాకు ఇప్పటికీ ఐఎమ్ఎఫ్ ఈడీగా కొనసాగడమే ఇష్టం... మీరు వీలైతే ప్రధానమంత్రికి చెప్పండి' అని మళ్లీ చెప్పాను.

దానికి ఆయన 'రిజర్వ్ బ్యాంక్ గవర్నరంటే మాటలా? మన కరెన్సీ నోట్లపైన మీ సంతకాన్ని చూసి మీ మనవలు, మనవరాళ్లు థ్రిల్లమతారు, గర్వపడతారు...' అన్నారు.

'మీరు మీ తాతగారిని రోజుకెన్నిసార్లు తలుచుకుంటారు?' అని అడిగాన్నేను కొంటెగా.

'అదంతా ఎందుగ్గానీ, మీరు పీఎమ్‌కు నా మనసులోని మాటను తెలియజేసి నాకు సాయం చేద్దురూ, మీకు పుణ్యముంటుంది...' అని అడిగాను.

'సరే, మీ ఇష్టమేంటో చెబుతానుగాని, ఆ పదవికి మీరు అత్యుత్తమమైనవాళ్లని కూడా చెబుతాను..' అన్నారాయన.

'సరేనండీ, సంతోషం' అన్నా. అక్కడితో అది ముగిసినట్టే అనుకున్నా.

కొన్ని రోజుల తర్వాత జలాన్ నుంచి ఫోనొచ్చింది. 'మీ అభీష్టాన్ని పీఎమ్‌కి చెప్పాను. మీకు గవర్నర్ పదవి తప్పినట్టే' అన్నారు. నేను హమ్మయ్య అని నిట్టూర్చాను.

నేను ఐఎమ్ఎఫ్ ఈడీగా ఇంకొన్నేళ్లు వాషింగ్టన్‌లోనే ఉంటానన్న భరోసా మా వాళ్లకు వచ్చేసింది. దాంతో అప్పటికి చికాగోలోని మెకిన్సే సంస్థలో పనిచేస్తున్న మా అల్లుడు హరి వాషింగ్టన్‌కు మారేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేసుకున్నాడు. వాళ్లబ్బాయి ప్రణవ్ చదువుతున్న స్కూలు నుంచి తనను మార్చేస్తున్నట్టు చెప్పేసొచ్చింది మా అమ్మాయి కవిత. క్లీవ్‌లాండ్‌లో ఉంటున్న మా అబ్బాయి ఆదిత్య, కోడలు శ్వేత కూడా సంతోషపడ్డారు. ఇక అంతా దగ్గరగా ఉంటామన్న భావనతో అపార్ట్‌మెంటును వదిలి, విశాలమైన ఇంటి వేటలో పడింది మా ఆవిడ గీత.

★★★★★

అది 2003 జులై నెల. మా ఇంట్లో ఫోను నిర్విరామంగా మోగడం మొదలుపెట్టింది.

'భారతీయ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా వస్తున్న మీకు శుభాకాంక్షలు' అంటూ ఒకరి తర్వాత ఒకరు అభినందనలు తెలియజేయడం మొదలుపెట్టారు. రాజ్యసభ సభ్యుడిగా జలాన్‌ని, ఆర్‌బీఐ గవర్నర్‌గా నన్ను నియమిస్తూ ఒక్కసారే ప్రకటన వెలువరించింది ప్రభుత్వం.

బ్రేక్‌ఫాస్ట్ సమయానికల్లా 'మీ ఫోను కోసం విత్తమంత్రి ప్రయత్నిస్తున్నారు' అనే సందేశం వచ్చింది మినిస్ట్రీ నుంచి.

దాంతో నేనాయనకు ఫోను చేశాను.

'ఆర్‌బీఐ గవర్నర్‌గా మీరు నియమితులవడం నాకెంతో సంతోషంగా ఉంది. దానికి సంబంధించిన ఉత్తర్వులు పంపేముందు, మిమ్మల్ని ఆహ్వానిస్తూ ఒక ఉత్తరం పంపుతాం, మీ ఫ్యాక్సుకు...' అని చెప్పారు జశ్వంత్‌సింగ్.

నాకు చాలా మొహమాటంగా అనిపించింది. 'సర్, మీరు స్వయంగా ఫోను చేసి ఆహ్వానించారు. అది చాలు. ఇక విడిగా ఆహ్వానపత్రమెందుకు..' అన్నాన్నేను.

'అలాకాదు డాక్టర్ రెడ్డి. ఇప్పుడే మీకది ఫ్యాక్స్ చేస్తాం. మీరెప్పుడు చేరాలో జలాన్ చెబుతారు. ఉంటా..' అని ఫోను పెట్టేశారాయన.

మరికొద్ది నిమిషాలకల్లా ఆయన స్వయంగా డిక్టేట్ చేసిన ఉత్తరం ఆహ్వానంగా వచ్చింది, 'బ్యాంక్‌లో మీ పదవీకాలం విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలియజేస్తున్నా. మీతో కలిసి పనిచెయ్యడానికి ఎదురుచూస్తున్నాం...' అంటూ చివర్లో ఆయన స్వయంగా రెండు వాక్యాలు రాశారు! అది కేవలం ఆహ్వానంగా మాత్రమే అనిపించలేదు. మంత్రివర్యులకు – గవర్నర్‌కు మధ్య ఉండాల్సిన ఒక బలమైన నమ్మకానికి పునాదిగా అనిపించింది. దానివెంటనే గవర్నర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

ఆ మర్నాడు అంటే జులై 19న, నా నియామకం గురించి తాను జశ్వంత్‌కి రాసిన లేఖ ప్రతిని జలాన్ నాకు పంపారు. 'మీరు సరైన వ్యక్తిని ఎంపిక చేసినందుకు నాకు సంతోషంగా ఉంది. దీనివల్ల ఆర్థిక రంగానికి స్థిరత్వం, నిరంతరమైన అభివృద్ధీ ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్నది చాలా మంచి నిర్ణయం. దీనికి నా సంతృప్తినీ, సంతోషాన్నీ వ్యక్తం చేస్తున్నాను..' అని రాశారాయన అందులో.

జలాన్‌కీ నాకూ మధ్య ఉన్న నమ్మకం, గౌరవం ఎటువంటివో చెప్పడానికి ఈ రెండు వాక్యాలూ చాలు కదూ? ఆ ఏడాది ఫండ్ – బ్యాంక్ వార్షిక సమావేశాలు దుబాయిలో జరిగాయి. వాటి తర్వాత నేను ఆర్‌బీఐ గవర్నర్‌గా చేరేట్టు మేమిద్దరం మాట్లాడుకున్నాం.

'ఆర్‌బీఐ గవర్నర్‌గా నీ పేరును ఒక్క కార్పొరేట్ సంస్థగాని, ఒక్క రాజకీయ నాయకుడుగాని, ఒక్కడంటే ఒక్క బ్యూరాక్రాట్‌గాని సమర్థించలేదు. విచిత్రం ఏంటంటే – ఒక్కరంటే ఒక్కరు కూడా విభేదించలేదు కూడా. నువ్వుగాక మిగిలిన అభ్యర్థులందరికీ పై వర్గాల వ్యక్తుల నుంచి బలమైన సమర్థనా ఉంది, వ్యతిరేకత కూడా అంతే స్థాయిలో ఉంది..' అన్నారు జలాన్. నాకు పూర్వం గవర్నర్లు రంగరాజన్, బిమల్ జలాన్ – ఇద్దరూ నా పేరును గట్టిగా ప్రతిపాదించారని అన్ని పత్రికల్లో కథనాలు వచ్చాయి.

ఈలోగా ఆధికారిక లాంఛన ప్రకియగా నేను ఢిల్లీ వెళ్లాను. ఆర్థిక మంత్రిని కలిశాను. తర్వాత అప్పటికి ప్రతిపక్షంలో ఉన్న మన్మోహన్‌సింగ్ అపాయింట్మెంటుఅడిగాను. నా నియామకం గురించి చెప్పి ఆయన ఆశీస్సులు కోరాను. ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేసి, నన్ను నియమించినందుకు అప్పటి ప్రభుత్వాన్ని ప్రశంసించారు.

నేను తిరిగి వెళుతుంటే, ఆయన నా కారు వరకూ వచ్చారు! 'ఇప్పుడిక నేను నిశ్చింతగా నిద్రపోగలను. మన ఆర్థిక రంగం భద్రమైన చేతుల్లో ఉందిప్పుడు..' అన్నారు!

పి. చిదంబరం కూడా నా నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అటుపైన డాక్టర్ రంగరాజన్ను కలిసి ఆశీస్సులు తీసుకున్నా. మొత్తానికి ఢిల్లీ వెళ్లిరావడం చాలా మంచిదైందనే చెప్పాలి. ఐఎమ్ఎఫ్ నుంచి భారత్‌కు తిరిగి రావడం పట్ల నాలోపల కొద్దోగొప్పో అసంతృప్తి ఉంటే, అది ఇట్టే మాయమయింది.

## ఐఎమ్ఎఫ్‌కు వీడ్కోలు

ఆగస్టు 31న జలాన్ కాల్ చేసి, వీలైనంత త్వరగా ముంబై వచ్చి బాధ్యతలు స్వీకరించమన్నారు. ఎందుకంటే రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి ఆయన్ను నియమించిన తర్వాత గవర్నర్‌గా కొనసాగే వీల్లేదని న్యాయశాఖ అభిప్రాయపడింది.

సెప్టెంబరు 3న ఐఎమ్ఎఫ్‌లో నా వీడ్కోలు సమావేశం ఏర్పాటయింది. వీడ్కోలు ప్రసంగంలో నేను ఆచితూచి స్పందించాను. ఆ సంస్థతో అక్కడికది అయిపోయే బంధం కాదు. ఆర్‌బీఐ గవర్నర్‌గా ఫండ్‌తో నేరుగా ఇంకా చాలాకాలం పని చెయ్యాల్సి ఉంది. ఆ సందర్భంలోనే సెంట్రల్ బ్యాంక్ పనితీరుకు సంబంధించి నా ఆలోచనలు ఏ దిశలో ఉన్నాయో చెప్పాలనుకున్నాను.

'ఐఎమ్ఎఫ్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా పనిచేసిన ఏడాది కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గురించి ఎన్నో విషయాలను అర్థం చేసుకున్నాను. కొత్త హోదాలో నా బాధ్యతలను నిర్వర్తించడానికి అవన్నీ ఉపయోగపడతాయి. కోట్ల మంది సామాన్యులను ప్రభావితం చేసే గవర్నరు పదవి చేపట్టడం పెద్ద బాధ్యత అంటూ ఇక్కడి అధికారులు నన్ను అభినందించారు. పేదరికానికి సంబంధించిన వివిధ అంశాలను అర్థం చేసుకుని, వాటికి తగినట్టు స్పందించడం ఇంకా పెద్ద బాధ్యత అని నేననుకుంటున్నాను. పేదలకు అనుకూలంగా ఉండటమంటే, ధనికులకు వ్యతిరేకంగా ఉండటం కాదు, ఆర్థిక ప్రయోజనాలు పేదలకు చేకూరితే దాన్ని సబ్సిడీ అంటారు, ధనవంతులకిస్తే 'ఇన్సెంటివ్' అంటారు...' అని చెబుతూ ఐఎమ్ఎఫ్‌లో పనిచెయ్యడం పట్ల నా సంతృప్తిని వ్యక్తం చేశాను. అక్కణ్ణుంచి భారత్‌కు ప్రయాణమయ్యాను.

## తొలి తెలుగు గవర్నర్

2003 సెప్టెంబరు 6న నేను ఆర్‌బీఐలో 21వ గవర్నర్‌గా అడుగుపెట్టాను. కార్యాలయానికి వెళ్లడానికి ముందు ముంబైలో ప్రసిద్ధి పొందిన సిద్ధి వినాయక ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నాను.

రిజర్వ్ బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు చాలా సంతోషంగా, హృదయపూర్వకంగా ఆహ్వానించారు.

సాధారణంగా ఆర్ బీఐ గవర్నర్‌గా కొత్తవాళ్లు వస్తారు. డిప్యూటీ గవర్నర్‌గా పనిచేసినవాళ్లు గవర్నర్ కావడం అరుదైన సందర్భం. అందువల్ల ఆరోజు అక్కడ ఒక ఆనందకరమైన వాతావరణం నెలకొంది. అందరం ఒకరికొకరం తెలుసునన్న సంతోషం అది.

కొత్త గవర్నర్ ఆర్‌బీఐ కార్యాలయంలోకి అడుగుపెట్టిన తొలిరోజు ఒక పట్టు వస్త్రం మీద తన తొలి సంతకాన్ని చేస్తారు. దాన్ని 'సైనింగ్ ద స్క్రోల్' అంటారు.

కొత్తాయనతో కరచాలనం చేశాక పాత గవర్నర్ వెళ్లిపోతారు. అప్పటివరకూ అది ఆఫీసు నాలుగ్గోడలకే పరిమితమైన ఒక సంప్రదాయం. తన పనిలోనే కాకుండా, బాధ్యతలను కొత్త గవర్నర్‌కు అప్పగించడంలోనూ బిమల్ జలాన్ నూతన పంథాను అవలంబించారు. 'సైనింగ్ ద స్క్రోల్'కు ఆయన ఆర్‌బీఐ సిబ్బందిని, మీడియానూ ఆహ్వానించి ఒక వేడుకలాగా చేశారు.

కొత్త గవర్నర్‌గా నాకు బాధ్యతలు అప్పగిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన స్పందన ఏమిటని జలాన్‌ని అడిగింది మీడియా. ఎప్పట్లాగే చిరునవ్వుతో ఆయన నావైపు చూపించారు.

'రిజర్వ్ బ్యాంక్‌లో మీ పాలసీలెలా ఉండబోతున్నాయి?' అనడిగారు వాళ్లు. 'కంటిన్యుటీ అండ్ ఛేంజ్, సమయం, సందర్భాన్ని బట్టి..' అంటూ నర్మగర్భంగా నవ్వుతూ ఒక్కముక్కలో తేల్చేశాను నేను.

దానికి జలాన్ తన హాస్యాన్ని జోడించారు.

'ఈయన డిప్యుటీ గవర్నర్‌గా ఉన్నప్పుడు చేసిన పనులను కంటిన్యూ చేస్తారు, నేను గవర్నర్‌గా చేసిన వాటిలో మార్పులు చేస్తారన్న మాట.. అదీ ఆయన చెబుతున్న కంటిన్యుటీ అండ్ ఛేంజ్ అంటే..' అని కిలకిలా నవ్వారు. నేనూ నాటకీయంగా కొద్దిగా ముందుకు వంగి, 'ఇకముందు ఏం చేసినా గౌరవనీయులైన ఎంపీగారి గైడెన్సు తీసుకుంటాం..' అన్నాను సరదాగా.

'ఆర్‌బీఐ గవర్నర్‌గా తొలి తెలుగువాడు' అని రాశాయి మన పత్రికలు.

నాకు పూర్వం మైదవోలు నరసింహం ఆ బాధ్యతలు నిర్వహించారు. (1977 మే – డిసెంబరుల మధ్య). ఆ తర్వాత ఆయన ప్రపంచబ్యాంకులో నాకు బాస్ అయ్యారు. అంతకు ముందు గవర్నరుగా పనిచేసిన చింతామణి దేశ్‌ముఖ్ దుర్గాబాయమ్మను పెళ్లి చేసుకోవడం ద్వారా తెలుగింటి అల్లుడయ్యారు. ఈ సంగతులు పక్కన పెడితే, తెలుగులో ఉపన్యాసం ఇచ్చిన తొలి గవర్నర్‌ను మాత్రం నేనే!

## జంటపదాల్లో ఆలోచిద్దాం

నా ఆలోచనాశైలి, తత్వం – ఆర్‌బీఐలో డిప్యుటీ గవర్నర్లు, ఇతర ఉన్నతాధికారులకు తెలియాలి. దాన్ని అవకాశం వచ్చినప్పుడల్లా కొన్ని తెలుగు జంటపదాల్లో విడమరిచి చెప్పాను. 'మనం ఏ నిర్ణయం తీసుకున్నా, ముందుగా

ఈ పదాల్లో ఆలోచించాలి..' అంటూ నా తత్వమేమిటో చెప్పాను. అవేమిటంటే – ఎక్స్‌ట్రీమ్స్ తెలియాలి, జీవితం ఎప్పుడూ మధ్యే మార్గంగా ఉంటుంది. ఒక సమంజసమైన చోటులో మనం ఉండాలి.

**హద్దు – పద్దు :** దేన్నయితే కొలవలేమో, దాన్ని మేనేజ్ చెయ్యలేం. అధికారానికీ అవకాశాలకూ ఉన్న పరిమితులు, హద్దులేమిటో తెలియాలి. వాటిమధ్య చేసే ప్రతిదానికీ పద్ధతి ఉండాలి, లెక్క ఉండాలి.

**సమయం – సందర్భం :** ప్రతి పనికీ సబబైన సమయం తెలియాలి, అలాగే ఏ నిర్ణయం తీసుకున్నా సమయం మించిపోకూడదు, అలాగని తొందరపడకూడదు. సందర్భాన్ని బట్టి ఏ సిద్ధాంతం సమంజసమో తెలియాలి.

**మంచి–చెడు :** ఎవరికి మంచి ఎంత మంచి – ఎవరికి చెడు, ఎంత చెడో తెలియాలి. ఒకటే నిర్ణయం కొందరికి మంచి చెయ్యవచ్చు, అదే మరికొందరికి చెడు ఫలితాలనివ్వచ్చు.

**తన – మన :** సంస్థాగతంగా, విధానపరంగా మనవారెవరు, పరాయివారెవరు, నిర్ణయాలు తీసుకుంటే ఎవరికి మేలు జరుగుతుంది, ఎవరికి ఇబ్బంది అవుతుంది తెలియాలి. మన సంస్థకు చెడ్డపేరు రాకుండా, అనవసరమైనవారికి మేలు జరగకుండా చూసుకోవాలి.

**వేళ – పాళ :** నిర్ణయాలు, విధానాలు సరైనవే కావొచ్చు, కాని వాటిని ప్రకటించడానికి, అమల్లోకి తీసుకురావడానికి ఒక సరైన వేళ ఉంటుంది. దాన్ని జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి.

**భయం – భక్తి :** ఆర్థికపరమైన నిర్ణయాలు పెద్దలెవరికైనా భయపడి చేస్తున్నామా, పనిపట్ల భక్తితో, గౌరవంతో చేస్తున్నామా అనేది తరచిచూసుకోవాలి.

**పెద్ద – చిన్న :** ఆర్థిక రంగంలో నిర్ణయాలు తీసుకునేముందు రిస్కు పెద్దదా చిన్నదా చూసుకోవాలి. రిస్క్ ఒక్క శాతమే అయినాసరే, దాని పర్యవసానం ప్రమాదకరంగా ఉంటుందా అన్నది ఆలోచించుకోవాలి.

### ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే

నేను రిజర్వ్ బ్యాంకు గవర్నరవుతున్నానంటే మా అమ్మ చాలా గర్వపడింది, సంతోషించింది. గవర్నరవడం అనేదాని కన్నా నేను ఇండియాలో, తనకు దగ్గరగా ఉండటం మా అమ్మకు ఆనందాన్నిచ్చింది.

మా ఆవిడకు నా కొత్త హోదాపట్ల కొంత గర్వం లేకపోలేదుగాని, మరీ అంత సంతోషమైతే లేదు. మా పిల్లలకు, మనవలకు దూరంగా ఉండాల్సి వస్తున్నదని – కొంచెం ఇబ్బందిగానే ఉండేది తన మనసులో. ఇక మా పిల్లలు – వాళ్లకు దూరంగా మేం ఇండియాకు వెళ్లిపోతున్నందుకు బాధ పడ్డారుగాని, ఆర్‌బీఐ గవర్నరంటే అత్యున్నతమైన పదవి కనుక నాకది గౌరవమని భావించి ఆనందించారు.

కొత్త గవర్నరు తొలి సంతకంతో కరెన్సీ నోట్లు అచ్చయి వచ్చాక తొలి నోటును ఆయనకివ్వడం ఆనవాయితీ. అది కూడా ఉచితమేం కాదు. దానికి గవర్నర్ తనదగ్గరుండే పాతనోటునివ్వాలి!

అలాగే కొత్త ఐదురూపాయల కట్ట వచ్చాక తొలి నోటును నాకిచ్చారు ఆర్‌బీఐలో. అయితే నేను మొదట దాన్నెవరికివ్వాలన్న సందేహం వచ్చింది నాకు. నా తల్లికా – భార్యకా? ఈ సందిగ్ధంతో నేను దాన్ని ఆఫీసులోనే ఉంచేశాను. ఆ తర్వాత పదిరూపాయల కట్ట ప్రింటయి వచ్చాక, మళ్లీ తొలి నోటును నాకిచ్చారు. అప్పుడు రెండు నోట్లనూ ఇంటికి తీసుకెళ్లి ఇద్దరికీ చెరొకటీ ఒకే సమయంలో ఇచ్చాను!

# అందరివాడు – ఒంటరివాడు

'ఆర్‌బీఐ గవర్నరు అందరికన్నా ఒంటరివాడు' అన్నారు మన్మోహన్‌సింగ్ 1980లో. ప్రతివాళ్లూ, ప్రతిదానికీ గవర్నర్ మీద ఆధారపడతారు, కాని అతను ఆధారపడటానికి ఎవరూ ఉండరు.

ఆ కుర్చీలో కూర్చున్నాక ప్రతిదీ ప్రశ్నే.

ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాలా – అభివృద్ధిని పెంచాలా?

రూపాయి విలువ ఎక్కువుంటే మంచిదా – తక్కువుంటే మంచిదా?

ఇప్పటికిప్పుడు లాభాల సంగతి చూడాలా – దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలా?

ప్రజలను డబ్బు దాచుకోమని చెప్పాలా – అప్పు చేసైనా అభివృద్ధి సాధించాలని చెప్పాలా?

బ్యాంకుల పక్షాన నిలబడాలా – ఇతర ఆర్థిక సంస్థలను ప్రోత్సహించాలా?

అన్నీ ప్రశ్నార్థకాలే. దేనికీ ఇదమిత్థమైన సమాధానాలుండవు. ఏది చేసినా రెండోది దెబ్బతినొచ్చు. ప్రతిదాని మధ్యా విభజన రేఖ చాలా సన్నగా ఉంటుంది. వాటిమధ్య సమతూకం దెబ్బతినకుండా చూడటమే అసలు సవాలు. దేనిమీదా పూర్తిస్థాయి సమాచారం ఉండదు. ఏ నిర్ణయాన్నీ ఠక్కున తీసుకోవడం కుదరదు.

నామీద నమ్మకంతో ఐదేళ్ల పదవీకాలాన్నిచ్చారు గనక దాన్ని అర్థవంతంగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవాలని అనుకున్నాను. ఆర్థిక రంగంలో అనుభవమూ, వ్యక్తిగతంగా నేను పాటించే విలువలూ దానికి పునాది.

సాధారణంగా పదవిలోకి రాగానే కొత్త నిర్ణయాలు తీసుకోవాలని, కొత్త దారిలో సాగిపోవాలనుకుంటారు ఎవరైనా. కాని నేను అలా అనుకోలేదు. ఎందుకంటే రంగరాజన్, జలాన్‌ల కాలంలో ఆరేళ్లపాటు రూపొందిన పాలసీల్లో డిప్యూటీ

గవర్నర్‌గా నా ప్రమేయం ఎంతో ఉంది. వాటిని కొనసాగిస్తూనే, లోపాలున్నవాటిని సరిదిద్దాలి, బలమైన అంశాలను మరింత బలోపేతం చెయ్యాలి. అదీ నా ఉద్దేశం.

**ఇవి నాకు ముఖ్యం**

రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా నాకు అన్నిటికన్నా ముఖ్యమైనది ఎక్స్‌టర్నల్ సెక్టార్ బ్యాలెన్స్. ఎందుకంటే మన దేశం అప్పటికి యాభయ్యేళ్లు లేమిలోనే గడిపింది! అదీగాక నేను 90ల నాటి ఆర్థిక సంక్షోభాన్ని అతి దగ్గరగా చూశాను, ఐఎమ్‌ఎఫ్‌లో పనిచేశాను కనుక గ్లోబలైజేషన్ వల్ల వచ్చే లాభనష్టాలు, రిస్క్– వీటిని అంచనా వెయ్యగలిగిన చూపు అలవడింది నాకు.

గతంలో నేను డిప్యూటీ గవర్నరుగా ఉండగా బిమల్ జలాన్ నాకు 'మేస్ట్రో' అనే పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. అది అమెరికా ఫెడరల్ బ్యాంక్ గవర్నర్‌గా పనిచేసిన అలాన్ గ్రీన్‌స్పాన్ పనితీరు మీద బాబ్ మడ్‌వార్డ్ రాసినది. అందులో ఒకచోట ఆసక్తికరమైన అంశం ఉంది. అదేమంటే – మెక్సికో ఆర్థిక సంక్షోభం బారిన పడినప్పుడు ఆర్థిక సాయం కోసం అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను అర్థించింది. ముందు ఆయన అంగీకరించలేదు, గ్రీన్‌స్పాన్ వంటి ఆర్థికనిపుణులు నచ్చజెప్పాక సరేనన్నారట. ఆ సందర్భంలో – ఇటువంటి సంక్షోభం ఇండియా వంటి దేశాల్లో తలెత్తితే మాత్రం మనం సాయం చేసేది లేదంటూ వ్యాఖ్యానించారని ఆ పుస్తకంలో చదివాను. ఎక్స్‌టర్నల్ సెక్టార్ సమతూకంగా ఉండాలన్న నా అభిప్రాయానికి అక్కడ నాకు నిదర్శనం దొరికింది.

మనది చాలా పెద్ద దేశం, జనాభా ఎక్కువ. అలాంటి మనం ఎప్పుడైనా ఆర్థిక ఇబ్బందులపాలయితే, భౌగోళిక – రాజకీయ పరిస్థితుల దృష్ట్యా మనల్ని ఆదుకోవడానికి ముందుకొచ్చేవారు ఎవ్వరూ ఉండరు. అదీగాక ఎక్స్‌టర్నల్ సెక్టార్ బ్యాలెన్స్‌ను ఒక మంచి స్థాయిలో ఉంచడమనే బాధ్యతను ఆర్‌బీఐ తప్ప వేరెవ్వరూ నిర్వర్తించలేరు. ముఖ్యంగా రాజకీయ అనిశ్చిత పరిస్థితుల్లో ఆర్‌బీఐ మీద ఎక్కువ బాధ్యత ఉంటుంది.

గవర్నర్‌గా చేరిన వెంటనే ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిశాను. ఆప్యాయంగా మాట్లాడుతూ 'వేణూ, మనం ఎట్టి పరిస్థితుల్లోనూ ఐఎమ్‌ఎఫ్ సాయం అడగకూడదు...' అన్నారు.

'గ్యారెంటీగా అలాంటి పరిస్థితి రానివ్వను సర్' అని నేను చెప్పాను.

ఈ రెండు కారణాల దృష్ట్యా నేను దానిమీద ఎక్కువ శ్రద్ధ పెట్టాను.

నేను పుట్టిపెరిగిన కుటుంబ నేపథ్యమూ, చదువు, రాష్ట్రంలో కింద నుంచి పైవరకూ వివిధ స్థాయుల్లో పనిచేసిన అనుభవం వల్ల సమాజంలోని వివిధ వర్గాల అవసరాల పట్ల నాకు అవగాహన ఉంది. అందువల్ల ధరలు నిలకడగా ఉండటం, ఆర్థిక వ్యవస్థలు స్థిరంగా ఉండటం నాకు ముఖ్యం.

ప్రజల సేవింగ్స్ ఎక్కువగా ఉంటే వృద్ధికి కావలసిన పెట్టుబడులు లభిస్తాయి. ఆ దిశగా వాళ్లను ప్రోత్సహించాలి. సామాన్యులు బ్యాంకింగ్ లావాదేవీల్లో ఇబ్బందులు పడకుండా, సాఫీగా సాగిపోవాలి. ఏది చేసినా, సామాన్యుడి డిపాజిట్లు భద్రంగా ఉండాలి. మరోవైపు అంతర్జాతీయ స్థాయిలో మనపట్ల నమ్మకం ఉండాలంటే, మన ఫైనాన్షియల్ సిస్టమ్, దాని గవర్నెన్స్, మార్కెట్లు, టెక్నాలజీ అన్నీ మెరుగుపడటం ముఖ్యమని నా నమ్మకం.

అలాగని 'గవర్నర్‌గా నా విధులివే, బాధ్యతలింత మట్టుకే' అని గిరిగీసుక్కూర్చోను. ప్రభుత్వం చేసే మంచి పనులకు ఆర్‌బీఐ తరఫున సహకారం ఇవ్వాలి, పొరపాటు చేస్తుంటే చెప్పాలి, ఎక్కడైనా రిస్క్ ఉంటే దాన్ని తగ్గించాలి.

ఒక రెగ్యులేటర్‌గా ఆర్‌బీఐ రెగ్యులేట్ చేసే సంస్థలకు మాపట్ల గౌరవం, భయం ఉండాలి. ఇవీ నా లక్ష్యాలు.

### పరిమితులున్నాయి

గవర్నర్‌గా నేననుకున్నవన్నీ చెయ్యడం నల్లేరు మీద బండి నడకేం కాదు. ఆ పదవికి కొన్ని పరిమితులున్నాయి, ముందడుగెయ్యడానికి ఇబ్బందులుంటాయి.

ఒక గవర్నర్‌గా నేను ఏదైనా సాధించాలంటే ప్రభుత్వ విశ్వాసాన్ని చూరగొనడం ముఖ్యం. అంటే ప్రధానమంత్రి, ఆర్థికమంత్రుల మద్దతు, నమ్మకం తప్పనిసరి. అంటే దాని అర్థం – కింద పనిచేసే ఒక ఉద్యోగిలాగా నేను విత్తమంత్రికి లొంగి ఉండాలనీ కాదు. పూర్తిగా స్వయం నిర్ణయాలు తీసుకోగలననీ కాదు. ఒక గవర్నర్ మంచి నిర్ణయాలు తీసుకుని అమలు చెయ్యడానికి ఆర్థిక మంత్రి సహాయసహకారాలు తప్పనిసరి. అలా చూసినప్పుడు నేను బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో ఆర్థిక మంత్రిగా జశ్వంత్‌సింగ్ ఉండటం నా అదృష్టమనే చెప్పాలి.

నేను గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలోనే 'మీ ఆబ్జెక్టివ్ ఏమిటి' అని అడిగారు కొందరు పాత్రికేయులు.

'భారత ఆర్థికవ్యవస్థను భారత ప్రభుత్వం నుంచి రక్షించాలి. అదే నా లక్ష్యం' అన్నాను.

ఉన్న గణాంకాలు (డేటా) విశ్వసనీయమైనవి కాదు. డేటాను పలుమార్లు రివైజ్ చేస్తుంటారు. అది పెద్ద సమస్య. దాన్ని దృష్టిలో పెట్టుకుని, ఓ జర్నలిస్ట్‌తో 'మన దేశానికి గణాంకాల్లో, ఆర్థిక విషయాల్లో భవిష్యత్తే కాదు, గతమూ అయోమయమే' అన్నాను. ఆ మాటను తర్వాత చాలామంది, చాలాసార్లు కోట్ చేశారు!

## నేనెదుర్కొన్న సవాళ్లు

నిలకడగా ఉన్న ఆర్థిక వ్యవస్థను నాకు అందించారు జలాన్. నేను గవర్నరైన సమయానికల్లా ప్రపంచీకరణ, సరళీకరణలవైపు వేసిన తొలి అడుగులు తమ ప్రభావాన్ని చూపెట్టడం మొదలయ్యింది. ఆ నేపథ్యంలో నా ముందు మూడు కొత్త సవాళ్లుండేవి.

ఓవర్ హీటింగ్ అండ్ కౌంటర్ సైక్లికల్ పాలసీ – ఇది మనకు చాలా కొత్త. ఎందుకంటే గతంలో అంతటి వృద్ధిని మనం ఎప్పుడూ చూడలేదు. అందువల్ల అందరూ ఊపు మీదుండేవారు. అదే అదనుగా అంతర్జాతీయంగా మార్కెట్లన్నిటినీ అనుసంధానించాలనే ప్రతిపాదనలు ఊపందుకున్నాయి. నేను దానికి వ్యతిరేకం.

రెండోది – భారీ ఎత్తున కాపిటల్ ఇన్ ఫ్లో అనేది పూర్వం ఎప్పుడూ జరగలేదు. విదేశీమారకద్రవ్య విషయంలో లోటుతో ఇబ్బందిపడటమే మనకు తెలుసుగాని, డబ్బు ప్రవాహంలా వచ్చిపడుతుంటే ఏం చెయ్యాలో అనుభవం లేదు మనకు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికవేత్తలు ఏమంటారంటే వాటిని నియంత్రించకూడదని.

మూడోది – దేశ ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడం తక్షణ కర్తవ్యం. అంతర్జాతీయంగా వేగంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా చూసినప్పుడు అప్పుడప్పుడే మనం కట్టుబాట్లను సడలించి, సరళీకరణ దిశగా అడుగులు వేస్తున్నాం. కాపిటల్ అకౌంట్లోకి సొమ్ము రాకపోకలు పెరిగాయి. అందువల్ల ఫైనాన్షియల్ మార్కెట్లను స్థిరంగా ఉంచడమూ, వాటిని నియంత్రించడమూ ముఖ్యమే. స్థూలంగా ఇవీ అప్పుడు నేనెదుర్కొన్న సవాళ్లు.

అంతర్జాతీయంగా అన్ని విధాలా అనుకూల పరిస్థితులున్నాయిగనక ఒకింత రిస్క్ తీసుకుని ముందుకు వెళితే మనం ఇంకా చాలా అభివృద్ధి సాధించేవాళ్లమని, కాని దానికి నేనంత ఉత్సాహం చూపలేదని, రిస్క్ విషయంలో మరీ సంప్రదాయబద్ధంగా నడుచుకున్నాననీ విమర్శకులు అంటారు.

ఆనాడు ప్రభుత్వం సైతం దూకుడుగా ముందడుగు వెయ్యడానికే సిద్ధపడింది. ఫైనాన్షియల్ మార్కెట్లు అతి విశ్వాసంతో ఉండేవి. కాని నేను వాళ్లతో పాటు పరుగెత్తడానికి ఇష్టపడలేదు. నాది చాదస్తం అనుకున్నా పర్లేదనుకున్నా. ఎందుకంటే, రిస్క్ వల్ల నష్టపోతే ఆ భారం సామాన్యుల మీదే పడుతుంది. పేదలు, సామాన్యులు ఆర్థిక నష్టాన్ని భరించలేరు. నిరంతరమూ వాళ్లను దృష్టిలో పెట్టుకునేవాణ్ణి కనుకనే నేను రిస్క్ తీసుకోవడానికి వెనకాడేవాణ్ణి.

### ఇది నా పద్ధతి

ఇంట గెలిచి రచ్చ గెలవమన్నది సామెత. అందువల్ల నేను గవర్నరయ్యాక ముందుగా రిజర్వ్‌బ్యాంక్ ఉద్యోగుల మీద దృష్టి పెట్టాను. అక్కడి ఉద్యోగుల నైపుణ్యాలు, పరిజ్ఞానం పెరగాలి. ఏ విషయం గురించైనా లోతైన అధ్యయనం లేకపోతే సరైన నిర్ణయాలు తీసుకోలేం. పరిస్థితులు మారుతూ, కొత్త సవాళ్లు ఎదురవుతున్నప్పుడు ఆర్‌బీఐ వెలుపల జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో నిపుణులైనవారి సలహా సహకారాలను తీసుకునేవాళ్లం.

రిజర్వ్‌బ్యాంకు ఉద్యోగుల్లో అభిప్రాయ భేదాలుండొచ్చు. అర్థవంతమైన చర్చల ద్వారా వాళ్లు ఒక్కతాటి మీదకు రావాలి. అంతర్గతంగా బలం పెరిగితేనే ప్రభుత్వం దగ్గరా, అంతర్జాతీయంగానూ ప్రతిష్ఠ పెరుగుతుందని చెప్పి వివిధ విషయాల మీద అడ్వైజరీ గ్రూపులు ఏర్పడేలా చేశాను. నాయకుడిగా వాళ్లకొక లక్ష్యాన్ని నిర్ణయిస్తాను, దాన్ని అందుకోవడమెలాగో వాళ్లు నిర్ణయించుకోవచ్చు.

ఆర్‌బీఐ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకుంటూనే మౌలికమైన మార్పులు చెయ్యడంలో, విధానపరమైన నిర్ణయాల్లో ప్రభుత్వంతో కలిసి నడిచే శైలిని రూపొందించుకున్నాను. అయితే ఆర్‌బీఐ నియంత్రణలో ఉన్న వర్గాలతో మాత్రం తగిన జాగ్రత్తతో వ్యవహరించేవాణ్ణి. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, రాజకీయులను అవసరమున్నంత మాత్రమే కలిసేవాణ్ణి. వ్యక్తిగతంగా కొంతమంది బంధుమిత్రులతో కూడా ఎడం పాటించాల్సిన అవసరం పడింది.

నేనున్న కాలంలో కీలకమైన ప్రతి అంశం మీదా ప్రసంగాలిచ్చాను. వాటిలోని ప్రతి పదమూ ఆచితూచి రాసేవాణ్ణి, ఆ అంశానికి సంబంధించి ముఖ్యమైన ఉద్యోగులతో చర్చించాకనే బయట మాట్లాడేవాణ్ణి. ప్రసంగించిన వెంటనే ఆర్‌బీఐ దాన్ని వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. మీడియాతో సంబంధాల విషయానికి వస్తే, ఇంటర్వ్యూల్లో మాత్రం చిక్కడు – దొరకడు అన్నట్టు ప్రవర్తించేవాణ్ణి.

ఆర్‌బీఐలో అందరూ తమకు నచ్చిన పార్ట్‌టైమ్ కోర్సుల్లో చేరి చదువుకునేందుకు ప్రోత్సహించాం. నాలుగో తరగతి ఉద్యోగులు మొదలు అత్యున్నత స్థాయి వరకూ వారు చేరిన కోర్సులకు ట్యూషన్ ఫీజు కూడా ఆర్‌బీఐ కడుతుందని చెప్పి అందరూ చదువుకోవడానికి ముందుకొచ్చేలా చేశాం. క్రమంగా ఆర్‌బీఐలో అధ్యయనం అనేదొక సంస్కృతిగా విస్తరించింది.

## ముందుగా చెప్పాలా వద్దా?

ఫైనాన్షియల్ మార్కెట్లకు రిజర్వ్ బ్యాంక్ ముందస్తుగా దిశానిర్దేశం చెయ్యాలని అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు భావిస్తాయి. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు దానికి విరుద్ధం. ఆర్‌బీఐ గవర్నర్‌గా నా పాలసీ ఏమంటే – మా దగ్గరున్న సమాచారాన్ని మార్కెట్లతో పంచుకోవడంలో మాకెలాంటి అభ్యంతరమూ లేదుగాని ముందస్తు గైడెన్స్ ఇవ్వడానికి నేను వ్యతిరేకిని.

ఎందుకంటారా, భవిష్యత్తులో ఏం జరగబోతోందో గవర్నర్‌కు మాత్రం ఏం తెలుస్తుంది? ఒకవేళ తెలిసినా కూడా, అది చెబితే మార్కెట్లు మరింత ఎక్కువ రిస్కు తీసుకుంటాయి, అవి ప్రమాదం బారిన పడితే నష్టపోయేది సామాన్యుడే.

ఇలాంటి చర్చ నడుస్తున్నప్పుడు ఒక పాత్రికేయుడు 'మీరు మమ్మల్ని కన్ఫ్యూజ్ చేస్తున్నారు' అన్నాడు.

'అవును, నేను కన్ఫ్యూజన్‌లో ఉన్నాను. దాన్నే మీతో పంచుకుంటున్నాను..' అన్నాను నవ్వుతూ. దానికాయన కూడా నవ్వుకుని వెళ్లిపోయాడు.

## మంచి పెట్టుబడులు వస్తాయి

2003 సెప్టెంబరులో ఒకనాటి ఉదయం. ఆనాడెందుకో నేను లేవడం ఆలస్యమైంది. అప్పటికే ఆర్థికమంత్రి జశ్వంత్‌సింగ్ నాతో అర్జెంటుగా

మాట్లాడాలన్నారని తెలిసింది. నేను ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో ఫోను చేశాను.

'గవర్నర్‌గారూ, ప్రవాసుల డిపాజిట్లను స్వీకరించడం ఆపెయ్యమన్నారట మీరు, ఏమిటది? చాలామంది ఆందోళన చెందుతున్నారు, నాకు ఫోన్లు చేస్తున్నారు' అంటూ అడిగారాయన.

ఆ ముందు రోజు సాయంత్రం, ఆఫీసు పనివేళలు ముగిసిన తర్వాత రిజర్వ్ బ్యాంకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది.

ప్రవాసులు నిర్వహిస్తున్న ఓవర్సీస్ కార్పొరేట్ బాడీస్ (ఓసీబీ) నుంచి ఇకపై దేశంలోకి నిధులు రావడానికి వీల్లేదని స్పష్టం చేశాం. ఇప్పటికి ఉన్న నిధులు ఎప్పుడైనా వాళ్లు వెనక్కి తీసుకోవచ్చని చెప్పాం.

అప్పటివరకూ ఓసీబీలు మన దేశంలో యథేచ్ఛగా పెట్టుబడులు పెట్టేవి, సంపాదించుకునేవి. ఈ నోటిఫికేషన్ వల్ల ఇకపై అది కుదరదు. అయితే అది ప్రవాస భారతీయులు వ్యక్తిగతంగా పెట్టే పెట్టుబడులకు వర్తించదు. కేతన్ పరేఖ్ స్కామ్ మీద జాయింటు పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా తీసుకున్న నిర్ణయం అది.

ఇవన్నీ ఆయనకు కూలంకషంగా చెబుతూ, చివర్లో ఈ నిర్ణయం తీసుకున్నది నేనేగాని, ఈ దిశగా జలాన్‌గారున్నప్పటి నుంచీ ప్రభుత్వంతో చర్చలు నడుస్తున్నాయని కూడా గుర్తుచేశాను ఆయనకు.

'ఓసీబీలు ఎందుకు మంచివి కావు' అనడిగారాయన.

'వాటిలోకి పెట్టుబడులు పెడుతున్నదెవరో, లాభాలు పొందుతున్నదెవరో మనకు ఇదమిత్థంగా తెలియదు. అవి కొందరికి నల్ల ధనాన్ని దేశం నుంచి బయటకు తరలించడానికి, మళ్లీ తీసుకురావడానికీ ఉపయోగపడుతున్నాయి. స్మగ్లర్ల ప్రమేయం చాలా ఎక్కువ. ఆ డబ్బు ఎవరిదో ఏమిటో మనకేమీ తెలియదు...' అని విశదీకరించాను.

'అటువంటి ధన ప్రవాహాల్ని అడ్డుకోవాలనే దానితో నేనూ అంగీకరిస్తాను. అలాగని స్టాక్ మార్కెట్లు కూలే పని చెయ్యలేం..' అన్నారు.

'సర్, నన్ను నమ్మండి. నెమ్మదిగా మంచి పెట్టుబడులు వస్తాయి. దానికి నాదీ పూచీ. మనం కొంచెం ఓపిక పట్టాలంతే..' అని నచ్చజెప్పాను.

'గవర్నర్‌గారూ, నాకు మీ పట్ల విశ్వాసముంది. కాని గాభరా పడుతున్న ఈ పెద్దమనుషులందరికీ ఏం చెప్పమంటారు?' అడిగారాయన.

'సర్, నేను మీకు చెప్పిందే మీరు వాళ్లకు చెప్పండి. మనకు అనారోగ్యకరమైన పెట్టుబడుల అవసరం లేదని చెప్పండి. ఆ మాటతో మంచి పెట్టుబడులు ముందుకొస్తాయి. ఇక స్టాక్ మార్కెట్ల మీద ప్రభావం తాత్కాలికం, అంతే..' అన్నాను.

'సరే అయితే. అలాగే చెబుతాను. మీరిలా చెప్పారని కూడా చెబుతాను. మిగిలిన పరిణామాల గురించి నాకు సమాచారమిస్తూ ఉండండి..' అన్నారు జశ్వంత్‌సింగ్.

రిజర్వ్ బ్యాంకు తీసుకొన్న చరిత్రాత్మకమైన నిర్ణయాల్లో అదొకటి. దాని ఫలితంగా ఓసీబీలు మూతబడ్డాయి.

### మన బ్యాంకులకు బలం కావాలి

విదేశీ బ్యాంకులు మన దేశ బ్యాంకుల్లో పెట్టుబడి పెట్టేట్లు ఒక ప్రతిపాదన వచ్చింది. దాని గురించి మంత్రివర్గం ఆమోదానికి పంపే నోట్‌ను తయారు చేస్తూ, ఏదో సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి అప్పటి బ్యాంకింగ్ సెక్రెటరీ సిసోడియా నాకు ఫోను చేశారు. అసలా ప్రతిపాదనే నాకు నచ్చలేదు. అదే ఆయనకు చెప్పాను. దానికి ఆయన దీన్ని ఇదివరకు బడ్జెట్‌లోనే ప్రతిపాదించారు, బిమల్ జలాన్ అంగీకరించారు కూడా. అందువల్ల ఇప్పుడు మొత్తం ఈ అంశాన్ని తిరగదోడటం కుదరదు అనుకుంటా..' అన్నారు.

'అయితే దీనిగురించి నేనోసారి ఆర్థిక మంత్రితో మాట్లాడతాను' అన్నాను.

తర్వాత నన్ను ఆర్థికమంత్రి పిలిపించారు.

'సర్, ఇప్పుడే విదేశీ బ్యాంకులను ఆహ్వానించడం సరికాదేమో. ఎన్నో ఏళ్లుగా మన బ్యాంకింగ్ రంగం కొన్ని కట్టుబాట్లకు బందీగా ఉంది. ఇప్పటికిప్పుడు దాన్ని విదేశీ బ్యాంకింగ్‌తో పోటీపడమనడం భావ్యం కాదు. ముందు కొంత అభివృద్ధి చెందడానికి మనవాళ్లకు అవకాశమివ్వాలి. అవి సరైన నాణ్యతా ప్రమాణాలను అందుకున్నాయో లేదో పరిశీలించే అధికారం రిజర్వ్ బ్యాంక్‌కు ఉండాలి...' అంటూ చెప్పుకొచ్చాను.

మనవంటి దేశాల్లో విదేశీ బ్యాంకులు ఉండాలా వద్దా, అందులోని లాభనష్టాలు, రిస్క్ గురించి ఆర్థిక శాస్త్రవేత్తల్లో చాలా చర్చ నడుస్తోంది, భిన్నాభిప్రాయాలు వ్యక్తమమతున్నాయి అప్పటికి.

'సర్, ఇప్పుడున్న దశలో విదేశీ బ్యాంకుల రంగప్రవేశం మన దేశానికి మేలు చెయ్యదు. అక్కడి బ్యాంకులు ఇక్కడ శాఖలు తెరిచేలా మనం ప్రపంచ వాణిజ్య సంస్థలో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడదాం. వాళ్ల శాఖలు పెంచుకోవచ్చేమోగాని, మన బ్యాంకింగ్ రంగంలోకి వాళ్ల పెట్టుబడులు భాగస్వామ్యం ప్రస్తుతానికి వద్దు' అని వివరంగా చెప్పాను.

'కాని ఇది బడ్జెట్‌లో చేసిన వాగ్దానం. నేను దాని గురించి ఏదో ఒకటి చెయ్యక తప్పదు. ' అన్నారు జశ్వంత్‌సింగ్.

'అలాగైతే దానికి తగిన గైడ్‌లైన్స్ ఆర్‌బీఐ ఇస్తుందని, అది ఇవ్వగానే ఆ పని మొదలుపెడతామనీ చెప్పండి, బాగుంటుంది' అన్నాన్నేను. ఆయన అలాగే ప్రకటించారు.

**ఆ మార్కు అందుకున్నాం**

నేను గవర్నర్‌గా చేరి ఇంకా ఎంతో కాలం కాలేదు.

'మన ఆర్థిక భద్రత కోసం విదేశీ మారక ద్రవ్యం నిల్వలను పెంచుకోవాలి. వంద బిలియన్ డాలర్లు మన దగ్గరుండేదెప్పుడు?' అని అడిగారు ఆర్థికమంత్రి జశ్వంత్‌సింగ్ ఒకరోజున!

'మీకెప్పుడు కావాలి?' అడిగాన్నేను ఏ మాత్రం తడుముకోకుండా.

'మార్చికల్లా...'

'దానికన్నా చాలా ముందే మనం ఆ సంఖ్యను చేరుకుంటాం. ఒకసారి చేరుకోగానే నేను మీకు తెలియజేస్తాను. అప్పుడు మీరు ప్రకటించవచ్చు' అన్నాన్నేను.

అన్నట్టుగానే 2004 ఫిబ్రవరికల్లా ఆ లక్ష్యాన్ని చేరుకున్నాం, ఆయన బహిరంగ ప్రకటన చేశారు!

## మార్కెట్ స్టెబిలైజేషన్ స్కీమ్

దేశంలోకి భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. వాటిని మేనేజ్ చెయ్యడానికి తాను సంసిద్ధం కావాలన్నది రిజర్వ్ బ్యాంక్ ఆలోచన. దానికొంత డబ్బు ఖర్చవుతుంది. మామూలుగానైతే దాన్ని ఆర్‌బీఐ భరించాలి. కాని అలాచేస్తే, దాని బ్యాలెన్స్ లోటులోకి వెళ్లిపోతుంది. కేంద్ర ప్రభుత్వం భరిస్తే దాని మీద భారం పడుతుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను కేంద్రం ఆమోదించాలి.

'సర్, ఇది మీవరకూ వచ్చినప్పుడు ఆమోదం తెలియజెయ్యండి..' అని అభ్యర్థించాను ఆర్థికమంత్రిని.

'దేశానికి, ప్రభుత్వానికి, రిజర్వ్ బ్యాంకుకు మంచివైన ప్రతిపాదనలను కాదనేదేముంది, అలాగే చేద్దాం' అన్నారాయన.

'దీని గురించి మీరు ముందుగానే ప్రధానితో మాట్లాడితే మంచిది' అని కూడా సూచించానాయనకు, అప్పుడే.

ఎందుకంటే చాలా ముఖ్యమైన ఈ ప్రతిపాదనకు ఎక్కడా అడ్డంకులు ఏర్పడకూడదన్నదే నా ఆలోచన. కాని నేను భయపడినంతా అయింది.

కొద్దిరోజుల తర్వాత 'ప్రధానమంత్రిగారికి దీనిపట్ల కొన్ని అభ్యంతరాలు న్నట్టున్నాయి..' అన్నారు జశ్వంత్‌సింగ్.

'అవేమిటో తెలిస్తే, నివృత్తి చెయ్యవచ్చు సర్' అన్నాన్నేను.

'మీ ప్రతిపాదన వల్ల మారకపు (ఎక్స్ఛేంజ్) రేటును మేనేజ్ చెయ్యడంలో రిజర్వ్ బ్యాంక్ స్వాతంత్ర్యం తగ్గిపోతుందన్న అభిప్రాయం వ్యక్తమయింది.'

'సర్, ఇది చాలా ముఖ్యమైన అంశం. దీనికి సంబంధించినంత మేరకు ఆర్‌బీఐ స్వతంత్రత కాదు కావలసింది. స్టెరిలైజేషన్ భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలి. ఆర్‌బీఐ ఎంతవరకు చెయ్యాలో ఒక పరిధిని కేంద్రం సూచిస్తే బాగుంటుంది. అప్పుడు కాపిటల్ ఫ్లోస్ పెరిగినా తరిగినా రూపాయి అప్రీసియేషన్ను నియంత్రించడం ఆర్‌బీఐకి సాధ్యమవుతుంది' అని విశదంగా చెప్పాను.

'సర్, మన విదేశీ మారక నిల్వలు పెరుగుతున్నాయి. వాటిని మేనేజ్ చెయ్యడానికి కొంత ఖర్చుమతుంది. మన ఆర్థిక భద్రత, స్థిరత్వాల కోసం ఆమాత్రం ఖర్చు పెట్టక తప్పదు. వచ్చిన ప్రశ్నల్లా, ఆ ఖర్చును ఎవరి ఖాతాలో చూపాలనేదే. ఆర్‌బీఐ భరిస్తే

లోటు పెరుగుతుంది. కాని ఒక దేశ సెంట్రల్ బ్యాంకే లోటులో ఉన్నదనే విషయం ఆ దేశ ప్రతిష్ఠను దిగజారుస్తుంది. అందువల్ల ఆర్‌బీఐ బ్యాలెన్స్‌షీటు ఆరోగ్యకరంగా ఉండక తప్పదు. ఒకవేళ ఆర్‌బీఐ దగ్గర మిగులు నిధులుంటే అవెలాగూ ప్రభుత్వానికే ఉపయోగపడతాయి...' అని ముగించాను.

'రిజర్వ్ బ్యాంక్ గౌరవం తక్కువయ్యే పనేదీ ప్రభుత్వం చెయ్యదు. ఆర్‌బీఐ బలంగా ఉండాలి, అందరి గౌరవానికీ పాత్రం కావాలి.. అందులో వేరే అభిప్రాయానికి తావు లేదు..' అని బలంగా చెప్పారాయన.

ఇప్పుడు అందరి ఆదరానికీ పాత్రమైన మార్కెట్ స్టెబిలైజేషన్ స్కీమ్ అమల్లోకి వచ్చిన తీరు అదన్నమాట.

## ఆర్థిక చరిత్రలో మైలురాయి

మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి వైపు పరుగులు పెట్టాలని జశ్వంత్‌సింగ్ అభిలషించేవారు. సంస్కరణల వైపు మొగ్గు చూపే ఒక వర్గం ఆర్థిక రంగంలో త్వరగా రావాల్సిన మార్పుల గురించి – మరీ ముఖ్యంగా క్యాపిటల్ అకౌంట్లను త్వరగా సరళీకరించాలంటూ (లిబరలైజ్ చెయ్యాలంటూ) ఆయనకు తెగ నూరిపోసేది. వాళ్ల సూచనలను ఆయన నాతో పంచుకునేవారు.

ఒకసారి ముంబైలోని ఒక హోటల్లో పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలతో ఒక సమావేశం ఏర్పాటయింది. దానిలో పాల్గొనబోయే ముందు ఆయన నాతో మాట్లాడారు.

'గవర్నర్‌గారూ, వాళ్లను బాగా సంతోషపెట్టే వార్తలేవైనా చెప్పాలి నేను. ఏం చెప్పమంటారు?' అనడిగారు.

'సర్, దేశీయంగానే కాకుండా, విదేశాల్లోనూ శరవేగంతో విస్తరించమని, వాళ్లకు మన ఆర్థిక వ్యవస్థ అండదండలందిస్తుందని చెప్పండి. బయట నుంచి పెట్టుబడులు వస్తాయన్న విషయం మీద నమ్మకంగా ఉన్నామని, అలాగే ఇక్కణ్నుంచి వాళ్లు పెట్టే పెట్టుబడుల మీద ఆంక్షలు సడలిస్తామని చెప్పండి..' అన్నాన్నేను.

'అది బాగానే ఉంది. కాని సామాన్యుడి సంగతేమిటి? సొమ్మును అతనికిష్టమైనట్టు వాడుకునే సౌకర్యాన్ని మనం కల్పించలేమా?' అడిగారాయన.

'తప్పకుండా చేద్దాం సర్. పౌరులు తమ సొమ్మును ఇష్టమైనట్టు వాడుకోవచ్చు. మనం ఏ ప్రశ్నలూ అడగం.

అయితే ఆ వీలు కొన్ని వేల డాలర్ల వరకే. కోట్ల కొద్దీ మాత్రం కాదు..' అని చెప్పాను.

'వ్యక్తిగత స్థాయిలో పాతిక వేల డాలర్ల వరకూ బాగుంటుందేమో? నేను ఆ మేరకు ప్రకటన చేస్తాను..'

'తప్పకుండా చెయ్యండి సర్. పెట్టుబడుల ప్రవాహం ఆరోగ్యంగా ఉండాలంటే రాకా పోకా రెండూ ఉండాలి కదా' అని భరోసానిచ్చాను. ఆ సాయంత్రం ఆయన పారిశ్రామికవేత్తలనుద్దేశించి ప్రసంగించారు.

'భారతీయ పారిశ్రామిక రంగం ప్రపంచవ్యాప్తంగా విస్తరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఇకపై మన పారిశ్రామికవేత్తలు విదేశాల్లో సైతం పెట్టుబడులు పెట్టి సంస్థలను నిర్వహించవచ్చు. నేనిప్పుడే రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌తో మాట్లాడాను, వారిక్కడే ఉన్నారు, అది తప్పకుండా చెయ్యొచ్చని ఆయన ధీమానిచ్చారు..' అనగానే ఆ హాలంతా చప్పట్లతో దద్దరిల్లిపోయింది.

తర్వాతి రెండు రోజుల్లో విధివిధానాలన్నిటి గురించి ఆలోచించుకుని ప్రెస్ రిలీజ్ ప్రకటన సిద్ధం చేశాను.

'దీన్ని నన్ను రిలీజ్ చెయ్యమంటారా? ప్రభుత్వం ఆమోదించే వరకూ ఆగమంటారా' అని జశ్వంత్ సింగ్‌ను అడిగాను.

'ఆగనవసరం లేదు, మీరు రిలీజ్ చేశాక ప్రభుత్వానికి తెలియజెయ్యండి' స్పష్టం చేశారాయన.

విదేశీ మారక ద్రవ్యం, పెట్టుబడులపై ఆంక్షలు తొలగించడం అనేది మన దేశ ఆర్థిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన, మైలురాయి వంటి నిర్ణయం అని చెప్పుకోవచ్చు. ఆ రెండు అంశాల్లోనూ 1957 నుంచీ అమల్లో ఉన్న ఆంక్షల వల్ల సామాన్యులు మొదలుకొని భారీ పారిశ్రామికవేత్తల వరకూ అందరికీ ఏదో ఒక రూపంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యేవి. ఆనాటి సడలింపుల (లిబరలైజేషన్) ప్రాముఖ్యాన్ని, అది తీసుకొచ్చే మార్పుల గురించి కొద్ది నెలల పాటు – మన దేశంలో సామాన్యులే కాదు, పెద్ద పారిశ్రామికవేత్తలు సైతం అంచనా వెయ్యలేకపోయారంటే నమ్మండి!

## పరస్పర విశ్వాసం

ఒకసారి రిజర్వ్ బ్యాంక్‌లో డిప్యుటీ గవర్నర్ పదవి ఖాళీ అయింది. దానికి ఒక బ్యాంక్ ఛైర్మన్ పేరు చెబుతూ నా అభిప్రాయం అడిగారు జశ్వంత్‌సింగ్.

'అతని పట్ల వ్యతిరేకత లేదు. అలాగని సానుకూల అంశాలూ లేవు. నాకెందుకో అతని నియామకం పెద్ద సౌకర్యంగా అనిపించడం లేదు..' అని చెప్పేశాను.

'కాని అతన్ని చాలామంది పెద్దలు సిఫార్సు చేస్తున్నారు.'

'సర్, మీరు నియమిస్తే నాకేం అభ్యంతరం లేదు. కాని అతను ఆర్‌బీఐ డిప్యుటీ గవర్నర్ అయ్యేంత సీనియరైతే కాదు. అందువల్ల నా అంతట నేను సిఫార్సు చెయ్యలేను..' అన్నా.

'జనాలేమనుకుంటారు?'

'ఆయన్ని రికమెండ్ చెయ్యడం అటు ప్రభుత్వానికిగాని, ఇటు ఆర్‌బీఐకిగాని శోభనివ్వదు సర్'

'సరే అయితే. మనకు గౌరవం కలిగించని పనులేవీ నేను చెయ్యను. ఈ విషయాన్ని మీరిక్కడితో మర్చిపోండి..' అనేశారు జశ్వంత్‌సింగ్.

ఎంత ఒత్తిడి ఉన్నా ఆ వ్యక్తి నియామకం జరగనే లేదు!

ప్రభుత్వానికి – రిజర్వ్ బ్యాంకుకు మధ్య ఒక చక్కని సహకారం, నమ్మకం ఉండే సంప్రదాయాన్ని నాకు పూర్వం పనిచేసిన గవర్నర్ బిమల్ జలాన్ నెలకొల్పారు. దాన్ని నేను కొనసాగించగలిగానంటే, ఆర్థికమంత్రిగా జశ్వంత్‌సింగ్ ఇచ్చిన మద్దతు కీలకమైనది.

ఫైనాన్స్ మినిస్టర్ – ఆర్‌బీఐ గవర్నర్ల మధ్య బంధం ప్రధానంగా ఆర్థిక మంత్రి మీద, ఆయనకు ప్రధానితో ఉండే బంధం మీద ఆధారపడి ఉంటుంది. జశ్వంత్ సింగ్‌కు ప్రధానమంత్రి దగ్గర చాలా పట్టుంది. దానివల్ల ఆయన ఆత్మవిశ్వాసంతో వ్యవహరించేవారు, కీలకమైన నిర్ణయాలను సత్వరమే తీసుకోవడం ఆయనకు వీలయ్యేది.

జశ్వంత్‌సింగ్‌తో నా సమావేశాలన్నీ ఏకాంతంగానే జరిగేవి. ఇదీ బిమల్ జలాన్ ఏర్పరచిన సంప్రదాయమే. వాటిలో చర్చించాల్సిన అంశాల పట్ల అటు మంత్రి

ఇటు నేనూ – ఇద్దరం సర్వసన్నద్ధతతో వెళ్లేవాళ్లం. మేం తరచూ కలిసి కూర్చొని మాట్లాడుకోవడం వల్ల ఏ విషయంలోనూ అపార్థాలకు తావుండేది కాదు. నా వరకు నాకు ఆయన పనితీరు, ఆలోచనాదృక్పథం పట్ల చాలా స్పష్టత ఉండేది. అంటే – ఆయనేం చెబుతారో, అది చేస్తారన్న నమ్మకం ఉండేది. అలాగే నేనే సలహాలూ సూచనలూ ఇచ్చినా జాగ్రత్తగా వినేవారు. సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించే వారు, మిగిలిందంతా నాకు వదిలేసేవారు.

జశ్వంత్‌సింగ్ నేల విడిచి సాము చేసే వ్యక్తి కాదు. అంతర్జాతీయ ఆర్థిక మార్కెట్ల పట్ల ఆయనకెలాంటి వ్యామోహమూ ఉండేది కాదు. తనను తాను సామాన్యుడిగా సరిసమానంగా భావించుకునే ఆయనలాంటి వ్యక్తిత్వం నూటికొక్కరికి ఉంటుందేమో! పుట్టిపెరిగిన నేపథ్యం, పాటించే విలువలు ఇంచుమించు సరిపోలడం వల్లనేమో మరి, మా ఇద్దరికీ వ్యక్తిగతంగా ఒకరంటే ఒకరికి గౌరవంతో కూడిన ఇష్టం ఉండేది.

## ఆసియాలో బెస్ట్ గవర్నర్

అది 2004, మే నెల. మన దేశంలో సార్వత్రిక ఎన్నికలనే మహాయజ్ఞం పూర్తయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేదెవరన్నది మాత్రం ఇంకా తేలలేదు. ఎందుకంటే ఎన్‌డీఏ ప్రభుత్వం పట్ల జనాల్లో అంతగా వ్యతిరేకత ఉన్నట్టు కనిపించలేదు. మరోవైపు కాంగ్రెస్‌కు ఆ మాత్రం సంఖ్యాబలం వస్తుందని ఎవరూ ఊహించలేదు. అందువల్ల ఏ పార్టీ ప్రభుత్వాన్నేర్పాటు చేస్తుందో ఎవరి అంచనాలకూ అందలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే దేశంలో రాజకీయ అనిశ్చితి అలముకున్న వేళ అది. రాజకీయ స్పష్టత లేకపోవడంతో ఫలితాలు రావడానికి వారం ముందు – బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) పడిపోవడం మొదలైంది. మధ్యాహ్నానికల్లా ఫారెక్స్ మార్కెట్లలో రూపాయి మీద ఒత్తిడి పెరుగుతున్న సూచనలు కనిపించాయి. సెబీ అప్రమత్తమై స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్‌ను ఆపేసింది.

'ఆర్‌బీఐ ఈ పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తోంది, అవసరమైనప్పుడు తగిన చర్యలు తీసుకుంటుంది..' అని తెలియజేశాను జశ్వంత్‌సింగ్‌కు.

'గవర్నర్‌గారూ, నేనిప్పుడు ఆర్థికమంత్రిని కాదు..' అన్నారాయన క్లుప్తంగా.

'సర్, కొత్త ప్రభుత్వం ఏర్పడి, ఎవరో ఒకరు పదవీ స్వీకారం చేసేదాకా మా ఆర్థిక మంత్రి మీరే. ప్రస్తుతానికి మేం రిపోర్ట్ చేసేది మీకే' అన్నాను దృఢంగా.

'థాంక్యూ గవర్నర్, ఐ విష్ యూ ఆల్ ద బెస్ట్' అన్నారాయన.

ఎన్నికల కౌంటింగ్ జరుగుతూ కాంగ్రెస్ సీట్లు పెరుగుతున్నవని తెలిసేకొద్దీ మార్కెట్లు స్తిమితపడ్డాయి. కాంగ్రెస్‌కు చేయూతనిస్తామంటూ వామపక్షాలు ముందుకొచ్చాయి. వామపక్షాలకు చెందిన ఒక నాయకుడు చేసిన వ్యాఖ్యల వల్ల విదేశీ మదుపరులు మార్కెట్ నుంచి వేగంగా ఉపసంహరించుకోవడం మొదలెట్టారు. రూపాయి విలువ పడిపోవడం మొదలైంది.

దాన్ని నివారించడానికి గవర్నర్‌గా నన్నొక స్టేట్‌మెంట్ ఇవ్వమన్నారు ఆర్థిక రంగ నిపుణులు.

కాని నేను తొందరపడలేదు. వ్యూహాత్మకంగా కొంతసేపు వేచి చూశా. మార్కెట్లో సెంటిమెంటు కొద్దిగా మారుతున్న సమయంలో డాలర్లు సప్లయి చేసి, తర్వాత స్టేట్‌మెంట్ ఇచ్చాను. సరైన సమయంలో గవర్నర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం మంచి ప్రభావాన్ని చూపింది. రూపాయి విలువ పట్ల ఆర్‌బీఐ భరోసాగా ఉందని అర్థం చేసుకున్నాయి మార్కెట్లు. త్వరగానే మామూలుకు చేరుకోవడం మొదలెట్టాయి.

కొందరు విమర్శకులకిది నచ్చలేదుగాని, అప్పుడు నేను చేసింది సరైనదేనంటూ ఎక్కువమంది ప్రశంసించారు. అంతర్జాతీయంగా మంచి పేరొచ్చింది. 2004 ఫండ్ బ్యాంక్ వార్షిక సమావేశంలో ఆ ఏడాదికి 'ఆసియాలో బెస్ట్ గవర్నర్'గా గుర్తింపు వచ్చింది!

**తర్వాత కూడా**

జశ్వంత్‌సింగ్ మంత్రిపదవి నుంచి విరమించుకున్న తర్వాత 'మీరు అనుభవజ్ఞులు, అందువల్ల అప్పుడప్పుడు వచ్చి మిమ్మల్ని కలుస్తుంటాను. అలాగే నా నిర్ణయాల్లో దేని గురించి వివరం కావాలన్నా తప్పక అడగండి, నేను చెబుతాను' అన్నాను. అలాగే అప్పుడప్పుడూ వెళ్లి కలిసేవాణ్ణి. ఆయనను కలుస్తున్నట్టు చిదంబరం, మన్మోహన్‌సింగ్‌లకూ తెలియజేసేవాణ్ణి.

జశ్వంత్‌సింగ్ రాసిన ప్రతి పుస్తకాన్నీ ఆటోగ్రాఫ్ చేసి మరీ నాకిస్తారు. అలా ఇచ్చిన ఓ పుస్తకంలో 'వైవీరెడ్డిగారికి, ఎంతో త్యాగం చేసి, మా ఆహ్వానాన్ని మన్నించి రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా చేరినందుకు..' అంటూ రాసిచ్చారు. దాన్ని చూసి నేను కదిలిపోయాను!

నా పుస్తకాలేవి విడుదలైనా, ఆయనకు పంపి, ఆయన అభిప్రాయాన్ని తెలుసుకుంటాను. రాసిన అంశాల పట్ల మాకు భిన్నాభిప్రాయాలున్నా, వాటిని గౌరవపూర్వకంగానే చర్చించుకుంటాం. ఉదాహరణకు 1947లో మన దేశ విభజనకు దోహదం చేసిన అంశాల మీద ఆయన రాసిన దానితో నేను విభేదించాను.

అయినా సరే, ఆయన పుస్తకం 'జిన్నా' అచ్చయి వచ్చాక, 'టు ఎ గ్రేట్ గైడ్, తెలివైన సలహాలనిచ్చే నేస్తం, సాటిలేని సెంట్రల్ బ్యాంకర్‌కి – హృదయపూర్వక శుభాకాంక్షలతో..' అంటూ రాసి సంతకం చేసి నాకు పంపించారు.

నేను జశ్వంత్‌సింగ్‌కు కృతజ్ఞుడినై ఉంటాను. నన్ను గవర్నర్‌గా సిఫార్సు చేసినందుకు కాదు, గవర్నర్‌గా బాగా పనిచెయ్యడానికి, బలమైన నిర్ణయాలు తీసుకోవడానికి తగిన మద్దతునిచ్చినందుకు.

ఒక్కముక్కలో చెప్పాలంటే, జశ్వంత్‌సింగ్ పట్ల ఆరాధన ఉన్న అభిమానుల్లో నేనొక్కణ్ణి!

# అందరూ ఆర్థికనిపుణులే

**2004** మే 22న మన దేశానికి పదమూడో ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ పదవీస్వీకారం చేశారు. వారితో ప్రమాణ స్వీకరం చేయించిన రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ ఒకప్పుడు ఆర్‌బీఐ బోర్డు సభ్యులు. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ స్వయంగా ఆర్థికవేత్త, ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసి వచ్చిన వ్యక్తి. రంగరాజన్ ప్రధానికి ఎకనామిక్ అడ్వైజరీ కౌన్సిల్ ఛైర్మన్. ఆయనా ఒకప్పుడు ఆర్‌బీఐ గవర్నరే, అంతకు ముందు కొన్ని దశాబ్దాలు అర్థశాస్త్ర ఆచార్యులు. ప్లానింగ్ కమిషన్ డిప్యుటీ ఛైర్మన్ మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా. ప్రభుత్వంలో సెక్రెటరీగా ఉంటూ కొన్నేళ్లపాటు ఆర్‌బీఐ బోర్డులో సభ్యుడిగా ఉన్నారు. ఆయనా ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్‌లలో పనిచేసి, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఆర్థిక నిపుణుడు. ఇక ఆర్థికమంత్రిగా అనుభవమున్న పి. చిదంబరానికి ఆర్‌బీఐ గురించి క్షుణ్ణంగా తెలుసు.

ఆర్థికశాస్త్రంలో నిష్ణాతులంతా ఒకేసారి కీలక స్థానాల్లో ఉండటం అనేది మన దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అపూర్వమైన సందర్భం. ఇది ఒకవిధంగా నాకు మంచిది. అందరి గైడెన్స్ లభిస్తుంది. మరో రకంగా చూస్తే, అందరినీ ఒప్పించి ముందుకెళ్లడం కష్టం.

ఆర్థికనిపుణుల సలహాలున్నా, ఉద్యోగరీత్యా నా లావాదేవీలన్నీ ఆర్థికమంత్రితోనే. అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరంతో అంతకు ముందు నేను పనిచేశాను.

హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా, న్యాయవాదిగా మంచి పేరు, వాణిజ్య – ఆర్థిక మంత్రిగా అపారమైన అనుభవమున్నా చిదంబరం వ్యక్తిగతంగా ఆడంబరాల్లేని మనిషి. ఆయన అధికారిక నివాసంలో ఆయనే స్వయంగా ఫోన్ తీసుకుంటారు! మంత్రిగా ఆయన చాలా సీనియర్. నేను బ్యూరోక్రసీలో ఒకో మెట్టే ఎదుగుతూ వచ్చినవాణ్ణి. అయినా అటువంటి భేదాలేం పెట్టుకోకుండా సమానంగా వ్యవహరించేవారాయన. మేం ఒకరి అభిప్రాయాలకు మరొకరం విలువనిచ్చేవాళ్లం,

ఏవైనా విభేదాలుంటే వాటిని నిర్మొహమాటంగా వ్యక్తపరచుకునేవాళ్లం. కనీసం నెలకోసారి నార్త్‌బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో సమావేశమయ్యేవాళ్లం మేమిద్దరం. సుమారు గంట – గంటన్నరపాటు ఏకాంతంగా చర్చించుకునేవాళ్లం.

ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌కూ నాకూ మధ్య ఉండే పరిచయమూ, అనుబంధమూ అరుదైనవి. ఎన్నోఏళ్ల పాటు (1977 నుంచి) మేం కలిసి పనిచేశాం గనుక ఆయనకు నా విశ్లేషణశక్తి పట్ల విశ్వాసం, నిర్ణయాల పట్ల నమ్మకమూ ఉండేవి. వాటిని ఆయన బాహాటంగానే ప్రదర్శించేవారు కూడా. ఆయన ఆదేశం ప్రకారం, ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ఆయనకు సమయం ఉంటే తప్పక కలిసేవాణ్ణి. జాతీయ అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలను వివరించేవాణ్ణి. మేమిలా కలుస్తున్నట్టు చిదంబరానికి ఎప్పటికప్పుడు చెప్పేవాణ్ణి.

'ప్రధానమంత్రికి మీ సమావేశాలంటే ఇష్టమని నాకూ తెలుసు. రాజకీయాల రంధి లేకుండా ఆర్థిక విషయాల మీద మాట్లాడుకోవడం ఆయన మనసుకెంతో శాంతినిస్తుందనుకుంటా..' అనేవారు ఆయన నవ్వుతూ.

## ఇద్దరూ ఇద్దరే

సౌరవ్యవస్థలో గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ తిరిగినట్టు, ఆర్‌బీఐ పూర్తిగా గవర్నర్ చుట్టూ తిరిగేది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఆర్‌బీఐ ఆర్థిక శాఖ ద్వారా పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటుంది. ఆర్థికశాఖకు మంత్రి కేంద్రకం. అందువల్ల ఆర్‌బీఐ గవర్నర్ – ఆర్థికమంత్రి కలిసి ముఖ్యమైన అంశాలన్నీ చర్చించుకుంటూ నడుచుకోవాలి. వాళ్లమధ్య ఉన్న అవగాహనే దేశాభివృద్ధికి కీలకం. గవర్నర్‌కూ ఆర్థికమంత్రికీ ఉండే బంధంలో సమానత్వం ఉండదు. అలాగని ఆర్‌బీఐ గవర్నర్ మంత్రి కింద పనిచేసే ఉద్యోగి కాదు. ఎవరికి వారు స్వేచ్ఛగా వ్యవహరిస్తూనే ఎదుటివారి మాటకు విలువనివ్వాలి.

ఇద్దరు వ్యక్తుల మధ్య ఎంత అన్యోన్యత ఉన్నా కొన్నిసార్లు కీచులాటలు తప్పవు కదా. నాకూ చిదంబరానికీ కూడా అంతే. కొన్ని అంశాల్లో ఎంత ఏకాభిప్రాయం ఉండేదో, మరికొన్నిటిలో అంతగా అభిప్రాయభేదాలు ప్రస్ఫుటమయ్యేవి. వ్యక్తిగతంగా మా ఇద్దరికీ పరస్పర గౌరవాభిమానాలు ఉన్నాయనడంలో సందేహం లేదు. కాని మా ఇద్దరి వ్యక్తిత్వాలు, అనుభవాలు వేర్వేరు కావడం వల్ల కొన్ని విషయాల్లో ఇద్దరికీ ఎంత మాత్రం పొసిగేది కాదు. మేం కలిసి పనిచేసిన కాలం – సంస్కరణలకు తొలి దశ.

ప్రతి అడుగూ ఆచితూచి వెయ్యాల్సిన సందర్భం. అందువల్ల కూడా మా ఆలోచనల్లో తేడా కొట్టొచ్చినట్టు కనిపించేది. కాని మేం కలిసి ఎన్నో మౌలికమైన మార్పులు సాధించగలిగాం. మాకు భేదాభిప్రాయాలున్నప్పుడల్లా అది మీడియాలో కనిపిస్తుంది. కాని మేం కలిసి పనిచేసినప్పుడు ఎవరూ గమనించేవాళ్లు కాదు.

## కలిసి సాధించాం

మేమిద్దరం కలిసి పనిచేసిన ఎన్నో విషయాలు మంచి ఫలితాలనిచ్చాయి. గతంలో లేని ఎన్నో విధానపరమైన మార్పులు తీసుకురావడంలో మా జోడీ సఫలమైంది. ఉదాహరణకు 2006లో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టాన్ని సవరించారు. అప్పటికి దశాబ్ద కాలానికి పైగా పెండింగ్‌లో ఉన్న గవర్నమెంట్ సెక్యూరిటీస్ చట్టం మా కాలంలోనే సవరణకు నోచుకుంది. 2007లో బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాన్ని సవరించారు.

రాజకీయపరంగా కష్టమైనా, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టడానికి, ద్రవ్య లోటును తగ్గించడానికి చిదంబరం పూనుకున్నారు. దాంతో మానెటరీ పాలసీ మెరుగయ్యే అవకాశం లభించింది. ప్రైవేటు సెక్టార్ బ్యాంకుల పరిపాలనా ప్రమాణాలను పెంచడంలో భాగంగా కొన్ని చిన్న బ్యాంకులను కలిపెయ్యడం, బలహీనమైన బ్యాంకులను రంగం నుంచి తప్పించడం వంటి పనుల్లో ఆయన నాతో పూర్తిగా ఏకీభవించారు.

సామాన్యులకు సేవ విషయంలో ఆయన వ్యక్తిగతంగా శ్రద్ధ పెట్టేవారు. వాస్తవానికి అంబుడ్స్‌మన్ పథకానికి విధివిధానాలను ఆయనే స్వయంగా కూర్చొని పరిశీలించి ఖరారు చేశారు! అలాగే గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థ నాణ్యత పెంచడానికి, సహకార బ్యాంకుల వ్యవస్థలో మార్పుచేర్పులకూ అంగీకరించారు. ఆ విషయంలో ఫలితాలు ఆశించినంత లేకపోయినప్పటికీ మేం వందశాతం శ్రద్ధ పెట్టి పనిచేశామని చెప్పగలను.

ఆర్‌బీఐ బోర్డు సభ్యుల విషయంలో వివరంగా చర్చించుకుని ఏకాభిప్రాయానికి వచ్చేవాళ్లం. అలాగే ప్రతి డిప్యూటీ గవర్నర్ నియామకం కూడా. ఆర్‌బీఐకి సంస్థాగత విషయాల్లో చిదంబరం దాని స్వతంత్రతను కాపాడటానికి సహకరించారు.

ఆర్‌బీఐలో డిప్యూటీ గవర్నరుగా పనిచేస్తున్న రాకేశ్ మోహన్‌ను ఆర్థిక వ్యవహారాల సెక్రెటరీ (ఎకనామిక్ అఫైర్స్)గా పంపించాం. అప్పుడు ఆయన

స్థానంలో ఆర్‌బీఐలో డిప్యుటీ గవర్నరు కావలసి వచ్చారు. పరిశీలనకు వచ్చిన ఏ పేరూ మాకు సంతృప్తికరంగా అనిపించలేదు. రఘురామ్‌రాజన్‌ను రమ్మని నేను అడిగాను. కాని ఆయన రాలేకపోయారు. అప్పుడు మళ్లీ రాకేశ్ మోహన్ డిప్యుటీ గవర్నరుగా వచ్చేశారు.

ఎన్నో అంతర్జాతీయ సమావేశాలకు నేనూ చిదంబరం కలిసి వెళ్లేవాళ్లం. ఆ సమయంలో ఆయనతో వ్యక్తిగతంగా ఎన్నో విషయాలు పంచుకునే అవకాశం కలిగింది. ప్రోటోకాల్ విషయంలో ఆయన చాలా పద్ధతిగా ఉంటారు.

## ఆ ఘనత నాకు వద్దు

నేను గవర్నర్‌గా పగ్గాలు చేపట్టేనాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిస్థితి అయోమయంగా ఉంది. వాటి భవిష్యత్తేం కాబోతోందో ఎవరికీ తెలియదు. ఎందుకంటే 2003 – 04 బడ్జెట్‌లోనే నాటి ఆర్థికమంత్రి జశ్వంత్‌సింగ్ – ప్రైవేటు సెక్టార్ బ్యాంకుల్లో 74 శాతం వరకూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ – ఎఫ్‌డీఐ)లను అనుమతిస్తామంటూ ప్రకటన చేశారు. ఎన్ని షేర్లున్నా, ఓటింగ్ హక్కు మాత్రం 10 శాతం షేర్లకే – అన్న నిబంధననూ తొలగిస్తామని ఆయన చెప్పేశారు. దీనికి స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్ ఆమోదమూ లభించింది! విదేశీ బ్యాంకులు మన ప్రైవేటు బ్యాంకుల్లో ఈక్విటీలు కొనుగోలు చేసేట్టు, క్రమంగా మేనేజ్‌మెంటును కూడా చేజిక్కించుకునేట్టు సిద్ధమయ్యాయి. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్‌ను మార్చిగానీ, మార్చకుండానైనా సరే, ఇవి అమలుచెయ్యాలన్న ఉత్సాహంతో ఎన్డీయే ప్రభుత్వం ముందుకురికింది.

ఈ ప్రక్రియను నేను తీవ్రంగా వ్యతిరేకించాను. ఆ బిల్లు ఆలస్యమయ్యేలా అడ్డుకున్నాను. ఎన్నికల తర్వాత యూపీయే నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. చిదంబరం ఆర్థికమంత్రి అయ్యారు. అప్పుడు ఆయన ఆ అంశాన్ని మళ్లీ తెర మీదకు తీసుకొచ్చారు! ఆయనకు నా అభిప్రాయాల్ని వివరంగా చెప్పాను.

మన బ్యాంకులు అభివృద్ధి చెందడానికి సమయం ఇవ్వాలి. అప్పుడే అవి విదేశీ బ్యాంకులతో పోటీ పడగలుగుతాయి. రెండోది – మనదగ్గరున్న ఉద్యోగుల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు బాగుపడతాయి. అంతర్జాతీయంగా పరిశీలించి చూసినప్పుడు ఫారిన్ బ్యాంకులు రిటైల్‌లో లేవు,

కేవలం ఫారిన్ ఎక్స్ఛేంజ్, బాండ్ మార్కెట్లలోనే అవి అక్కరకు వస్తాయని అనుభవం చెబుతోంది. మన దగ్గర విదేశీ బ్యాంకుల శాఖల ద్వారా ఆ ప్రయోజనమూ నెరవేరుతోంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుంటే బ్యాంకింగ్ రంగంలోకి ఎఫ్‌డీఐలను అనుమతించడానికి అది సమయమూ సందర్భమూ కాదనిపించింది.

జశ్వంత్‌సింగ్ కు చెప్పినదిదే. ఈ విషయాన్నే చిదంబరానికీ చెప్పాను.

దానికి ఆయన – 'అన్ని రాజకీయపక్షాలూ ఈ ప్రతిపాదనకు అంగీకరించి రంగం సిద్ధం చేశాయి. మీరెందుకు వద్దంటున్నారు? డాక్టర్ రెడ్డీ, అంతర్జాతీయ ఆర్థికవర్గాలకు మనం ఇచ్చిన మాట ఇది. ఇప్పుడు దాన్ని ఏ ప్రాతిపదికన వ్యతిరేకిస్తాం? రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ మారినంత మాత్రాన మాట మారిపోయిందని చెప్పగలమా? ఆర్‌బీఐ గవర్నర్ మారిన ప్రతిసారీ మన వాగ్దానాలను సవరించుకుంటూ ఉంటామా? ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవడం సరైనదోకాదో మీరే చెప్పండి' అన్నారు చిదంబరం.

కొంత వాగ్వివాదం జరిగిన తర్వాత – 'సర్, దేశ ప్రధాని, ఆర్థికమంత్రులు ఒక విషయం దేశానికి మేలు చేస్తుందని బలంగా నమ్మినప్పుడు అది జరగవలసిందే. నేను దీనిగురించి మరోమారు ఆలోచిస్తాను' అని అక్కణ్ణుంచి వచ్చేశాను.

ముంబై వెనక్కి వెళ్లాక క్షుణ్ణంగా ఆలోచించుకున్నాను. చివరకు ఆర్థిక వ్యవహారాల సెక్రెటరీగా పనిచేస్తున్న డాక్టర్ రాకేశ్ మోహన్‌కు ఫోన్ చేశాను.

'దేశప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ నిర్ణయాన్ని ఇప్పుడు తీసుకోవడం సరికాదు. అయితే ప్రభుత్వం చెయ్యాలనుకున్నప్పుడు చెయ్యాల్సిందే. అలాగని ఒక గవర్నరుగా నేను దాన్ని మనస్ఫూర్తిగా అమలుచెయ్యలేను. నేను నమ్మనిదాన్ని చెయ్యడం నాకు బాధాకరం. నాకు వ్యతిరేకత ఉన్నట్టు బాహాటంగా తెలిశాక, ప్రభుత్వానికి నామీద నమ్మకమూ ఉండదు. దీన్ని అమలు చెయ్యడంలో ఏవైనా విపరిణామాలు తలెత్తితే నా చర్యలను వాళ్లు అనుమానపడనూవచ్చు. ఏదో అనారోగ్యం వంకపెట్టి ఆస్పత్రిలో చేరతాను. కొద్దిరోజుల్లో పదవి నుంచి తప్పుకుంటాను. ఆ తర్వాత కొత్త గవర్నర్‌ను నియమించుకోవచ్చు, వాళ్లనుకున్నట్టు చేసుకోవచ్చు. అంతేతప్ప, రానున్న దుష్పరిణామాలను అంచనా వెయ్యగలిగిన ఆర్థిక నిపుణుడిగా – మన బ్యాంకింగ్ వ్యవస్థలోకి విదేశీ యాజమాన్యాలు రావడాన్ని అంగీకరించలేను' అని స్పష్టంగా చెప్పాను. నా మాటను ఆర్థికమంత్రికి తెలియజెయ్యమన్నాను.

అంతా విన్నాక ‘వేణూ, మీరు అతిగా స్పందిస్తున్నారనిపిస్తోంది. అయినాసరే, నేను మీ అభిప్రాయాలను మరోమారు మంత్రిగారికి చెప్పిచూస్తాను’ అన్నారు రాకేశ్‌మోహన్.

ఆ తర్వాత కొద్దిరోజులకు హైదరాబాద్‌లో ఏదో ఫంక్షన్‌లో ఉన్నాను. నా సెల్ మోగింది. చేస్తున్నది చిదంబరం.

‘వేణూ, విదేశీ పెట్టుబడుల విషయంలో మీ అభిప్రాయాలను పరిగణించాం. కాని వెనక్కిపోలేం. ఇప్పుడు ఒక పాలసీ స్టేట్‌మెంట్ ఇస్తాం. మన వ్యవస్థ దెబ్బతినకుండా – ఈ లక్ష్యాన్ని ఎలా సాధించాలో ఒక రోడ్‌మ్యాప్ మీరే తయారుచేసి ఇవ్వండి. అదిమాత్రం చాలా కచ్చితంగా ఉండాలి’ అన్నారు.

నేను ఊపిరి పీల్చుకున్నాను.

ఆయన కోరినట్టుగానే ఒక రోడ్‌మ్యాప్ తయారుచేసి సమర్పించాం. దాన్ని ఆసాంతం చదివి మర్నాడుదయం నాకు ఫోన్ చేశారాయన. ఏవో కొన్ని మార్పులు చెప్పి, ఫోన్లోనే తన అనుమతినీ ఇచ్చేశారు. నేను ధన్యవాదాలు తెలిపాను. 2005 బడ్జెట్ ప్రసంగంలో ఆధికారికంగా ఆయన ఆ పాలసీని ప్రకటించారు.

కొద్దివారాల తర్వాత ఏదో సమావేశంలో మేమిద్దరం కలిశాం.

‘రోడ్‌మ్యాప్‌కు అంత ఎక్కువ టైమ్ ఎందుకు పెట్టారు?’ అంటూ అడిగారాయన కుతూహలంగా.

‘సర్, మన బ్యాంకింగ్ వ్యవస్థను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు తెరిచిపెట్టిన ఘనత నా తర్వాత వచ్చే గవర్నర్‌కు చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను...’ అన్నాను నవ్వుతూ.

### నా మాట మన్నించారు

ప్రైవేటు సెక్టార్ బ్యాంకుల బోర్డులు ఆయా బ్యాంకులకు ఛైర్మన్లుగా అర్హులైన వ్యక్తుల పేర్లను ప్రతిపాదిస్తాయి, దాన్ని గవర్నర్ అంగీకరించడమో, తిరస్కరించడమో చేస్తారు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు, ఆర్థికాభివృద్ధి సంస్థలకు ఛైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లను ప్రభుత్వం నియమిస్తుంది. ఆర్‌బీఐ గవర్నర్ అధ్యక్షతన ఒక కమిటీ, మరొక స్వతంత్ర నిపుణుడు కలిసి ఆ పదవులకు కొందరి పేర్లను నామినేట్ చేసేవారు.

ఆర్‌బీఐ ఆ నియామకాల్లో కల్పించుకోకూడదన్నది నా అభిప్రాయం. ఈ విషయం చర్చించడానికి చిదంబరం ఆర్‌బీఐ గెస్ట్‌హౌస్‌కు వచ్చేశారు! ఆర్‌బీఐ లేదా గవర్నర్ పూర్తిగా పక్కకు తప్పుకొంటే బ్యాంకింగ్ రంగంలోని ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ పదవులన్నీ రాజకీయ పందేరాలైపోతాయేమోనన్నది ఆయన భయం. మన ఆర్థిక వ్యవస్థ క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుంటే గవర్నర్ ఆ నియామకాల్లో కీలక పాత్ర పోషించక తప్పదని ఆయన నన్ను ఒప్పించారు.

తనదైన సూటి వాదన – హాస్యస్ఫోరకమైన తీరుతో ఆయన చెప్పిన విషయాలను కాదనడానికి లేకుండా పోయింది నాకు! ఆయన మీద రాజకీయ ఒత్తిడి ఉన్నా సరే, కమిటీ ప్రతిపాదనలను తాను ఏ విధంగానూ ప్రభావితం చెయ్యనంటూ నాకిచ్చిన మాటను ఆయన గౌరవించారు. ఒక ఆర్థికమంత్రి గవర్నర్‌తో చర్చించడానికి ఆర్‌బీఐ గెస్ట్‌హౌస్‌కు రావడం, రెండు గంటల సమయాన్ని వెచ్చించడం చాలా అరుదైన విషయం!

## ఓవర్ హీటింగ్ అంటే తప్పా?

ద్రవ్యోల్బణం పట్ల జనాలు, మార్కెట్లు పెట్టుకునే ఆశలు మానెటరీ పాలసీ రూపకల్పనలో చాలా ముఖ్యపాత్ర పోషిస్తాయి. 'ఇన్‌ఫ్లేషన్ ఎక్స్‌పెక్టేషన్' ఎంతో తెలుసుకోవడం కోసం సర్వే చేస్తారు కొన్ని దేశాల్లో. మన దేశంలోనూ అలాంటి సర్వేకి శ్రీకారం చుట్టాను నేను.

ఆ సర్వే వల్ల కొంత విలువైన సమాచారం అందింది. దానికితోడు, గతంలో ఎప్పుడూ లేనంతగా ఇండియన్ ఎకానమీ తన సామర్థ్యాన్ని మించి ఎదుగుతోందనే సిగ్నల్స్ కొన్ని అందాయి. దాన్నే 'ఓవర్ హీటింగ్ ' అంటారు. ఆ క్రమంలో కొన్ని రంగాల్లో ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వంటి వాటిలో ఏర్పడుతున్న బుడగలూ (బబుల్స్) మా దృష్టికి వచ్చాయి. వెంటనే ఆర్‌బీఐ రంగంలోకి దిగింది. లిక్విడిటీని కష్టతరం చెయ్యడం, వడ్డీరేట్లను పెంచడం వంటి చర్యలతో కౌంటర్–సైక్లికల్ మానెటరీ పాలసీని ఉపయోగించడం ద్వారా అధిక పరుగుకు కళ్లెం వేసింది.

ఆ సందర్భంలోనే నేను ఒకచోట ఉపన్యసిస్తూ 'ఓవర్ హీటింగ్' అన్నమాట వాడాను. అది పెద్ద దుమారం రేపింది. నేనలా వ్యాఖ్యానించడం ఆర్థికమంత్రికి అస్సలు రుచించలేదు.

తర్వాత నేనా మాటను ఉపసంహరించుకున్నానుగాని దానికోసం తగిన చర్యలు తీసుకోవడం మాత్రం ఆపలేదు.

## టోబిన్ ట్యాక్స్ దుమారం

ఎక్స్ఛేంజ్ రేటు, వాటిలో మార్పులు – ఫారిన్ ఎక్స్ఛేంజ్ ఎంత ఉంది, ఏ రూపంలో ఉంది అనేది – ఫైనాన్షియల్ మార్కెట్ల నాణ్యత, స్థిరత్వం – ఇవన్నీ కాపిటల్ అకౌంట్ మేనేజ్‌మెంట్ మీద ఆధారపడి ఉంటాయి.

ఎక్స్ఛేంజ్ రేటును నిర్ధారించడంలో కాపిటల్ అకౌంట్ ప్రాధాన్యం పెరగడం అనేది నేను గవర్నర్‌గా ఉండగా చోటుచేసుకున్న అతి ముఖ్యమైన పరిణామం. అంటే రూపాయితో పోలిస్తే ఫారిన్ కరెన్సీ సప్లై – డిమాండులను అనుసరించి ఎక్స్ఛేంజ్ రేటు మారేది.

మన దేశంలో యథేచ్ఛగా పెట్టుబడులు పెట్టే ఓవర్సీస్ కార్పొరేట్ బాడీ (ఓసీబీ) లను మూసేయించడంలో (2003 సెప్టెంబరు) సఫలీకృతుణ్ణయ్యాక నేను పార్టిసిపేటరీ నోట్స్ (పి నోట్స్) మీద దృష్టి పెట్టాను. అవి అవకతవకలకు దారితీస్తున్నాయన్నది నా దృఢమైన అభిప్రాయం. వాటిని నిషేధించాలని నేను చిదంబరాన్ని కోరాను. ఆయన ఆ సబ్జెక్ట్ పట్ల ఆసక్తి చూపించలేదు.

పి – నోట్ల నిషేధం వైపు ఏదైనా చెయ్యాలని నేను తపించాను. వాటి మంచిచెడులు చర్చించేలా ఒక పాలసీ డిబేట్ లేవనెత్తాలనుకున్నాను. దానికి ముంబైలో 'ఇండియా డెవలప్‌మెంట్ రిపోర్ట్' పేరిట జరిగే ఒక సమావేశాన్ని వేదిక చేసుకున్నా. ఆరోజు నా ఉపన్యాసంలో పి నోట్ల వల్ల వచ్చే ఇబ్బందులు చెబుతూ వాటికి విరుగుడుగా ఆర్థికనిపుణులు 'టోబిన్ టాక్స్'ను ప్రతిపాదించారని ప్రస్తావించాను. చాలా దేశాలు టోబిన్ టాక్స్‌ను విధించాలనుకుని చెయ్యలేకపోయినట్టు కూడా చెప్పాను.

ఉపన్యాసం అయిన అరగంట కూడా గడవక ముందే నాకు ఆర్థికమంత్రి నుంచి ఫోను వచ్చింది.

'మీరు టోబిన్ టాక్స్ అంటూ మాట్లాడారట. నాకు చాలా కాల్స్ వస్తున్నాయి. మీరేం చెప్పారు అసలు....' అని.

'సర్, కాపిటల్ అకౌంట్ మేనేజ్‌మెంటు గురించి మాట్లాడుతూ దాని గురించి ప్రస్తావించాను. అది పూర్తిగా అకడమిక్ ఫోరమ్' అని వివరించాను.

'అయితే నేను మీడియాకు అదే చెబుతా. మీతో మాట్లాడాననీ, అదొక అకడమిక్ ఆలోచనే తప్ప ప్రభుత్వం ముందు అలాంటి ప్రతిపాదన లేదని చెబుతా. వేణూ, అసలు మీరు అలాంటి ప్రస్తావనేదీ చెయ్యకుండా ఉండవలసింది..' అన్నారాయన .

అక్కడితో అయిపోలేదు. అత్యున్నతస్థాయి నుంచి నాకు ఫోను వచ్చింది. రాత్రికిరాత్రి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి – నేను మాట్లాడింది అకడమిక్ విషయమే తప్ప, మన దేశంలో టోబిన్ టాక్స్ విధించే ఆలోచనేదీ లేదని చెప్పాల్సివచ్చింది!

వాస్తవానికి, నా ఉపన్యాసం ప్రకంపనాలు కలిగిస్తుందని నాకు ముందుగా తెలియకపోలేదు. అందువల్ల నేను ఎప్పుడూ చేసినట్టే – నా ప్రసంగాన్ని ఆర్‌బీఐలో ముగ్గురు సంబంధిత నిపుణులకు ముందుగానే చూపించి వాళ్ల సలహాలడిగాను. వారిలో ఇద్దరు ఈ స్టేట్‌మెంట్ వివాదాస్పదం కావొచ్చని సూచించారు కూడా. కాని దేశక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఆ పనికి నేనుగాక ఇంకెవరు పూనుకుంటారన్న స్పృహతో చేశాను.

మార్కెట్ వర్గాలు, మరీ ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియా అంత తీవ్రంగా విరుచుకుపడుతుందని, ప్రభుత్వంలోని అత్యున్నతవర్గమే అంత వ్యతిరేకంగా స్పందిస్తుందని మాత్రం నేను ఊహించలేదు.

ఆ తర్వాత పార్టిసిపేటరీ నోట్ల విషయంలో చిదంబరం చొరవ చేసి డాక్టర్ లాహిరీ నేతృత్వంలో ఒక కమిటీని వేశారు. ఆ కమిటీలో ఆర్‌బీఐ ప్రతినిధి కూడా ఒకరు సభ్యుడిగా ఉన్నారు. ఆ సభ్యుడి అభ్యంతరాలను పట్టించుకోకుండా కమిటీలోని మిగిలిన సభ్యులు పి నోట్ల పట్ల 'లిబరల్ అప్రోచ్' ఉండాలని ప్రతిపాదించారు. అటువంటప్పుడు కమిటీ రిపోర్టులో సంతకం పెట్టవద్దని నేను ఆర్‌బీఐ ప్రతినిధికి సూచించాను.

'ఆర్‌బీఐ అభ్యంతరాలను వివరిస్తూ 'డిసెంట్ నోట్' పెట్టి సంతకం పెడతారు, లేదంటే అసలు పెట్టరు. ఏదైనా అలా చెయ్యడం ప్రభుత్వానికీ ఆర్‌బీఐకీ మధ్య విభేదాలున్నట్టు బహిరంగపరచడమే..' అని నేను ఆర్థిక మంత్రికి స్పష్టంగా చెప్పాను.

'లేదు, అభ్యంతరాల నోట్‌తో పాటూ ఆయన సంతకం పెట్టాల్సిందే' అని పట్టుపట్టారు చిదంబరం.

నేను సమ్మతించాను, ఆయన కోరినట్టే జరిగింది.

ఆర్థిక సంస్కరణల విషయంలో నేను ధైర్యంగా, ఉత్సాహంగా అడుగు ముందుకు వెయ్యనని ఆయనకు నా పట్ల కినుక ఉండేది. ఒకదశలో చిదంబరంలో అసహనం పతాకస్థాయికి చేరింది. 'నా విదేశ పర్యటనలన్నిటినీ క్యాన్సిల్ చేసుకుంటున్నాను. మీ దేశంలో సంస్కరణలు ఇంత నత్తనడకన నడుస్తున్నాయేమిటని ఇతరులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నాను, మొహం చూపించలేకపోతున్నాను..' అన్నారు!

## సరళీకరణ త్వరగానా?

కొన్ని భారీ కార్పొరేట్ సంస్థలు, ఫైనాన్షియల్ సెక్టర్, విదేశీ మదుపరులు రూపాయి పెరుగుదల పట్ల ఉత్సాహంగా ఉండేవారు. అయితే అది మన ఎగుమతుల మీద మరీ ముఖ్యంగా దీర్ఘకాలంలో మన దేశీయ ఆర్థిక వ్యవస్థ మీద చూపే నెగెటివ్ ప్రభావం గురించి వాళ్లకు బాగా తెలియదు. అందువల్ల వారు సరళీకరణ (లిబరలైజేషన్) త్వరగా, భారీ ఎత్తున జరగాలని ప్రభుత్వం మీద ఒత్తిడి పెట్టేవారు. అప్పట్లో ఐఎమ్ఎఫ్ కూడా మనల్ని సంస్కరణల పథంలో, ఆర్థిక సరళీకరణల వైపు నడిపించడానికి ప్రయత్నించేది. అది సరికాదని, దానివల్ల వచ్చే విపరీత పరిణామాలను తట్టుకునే శక్తి మన ఆర్థికవ్యవస్థకు ఇంకా చేకూరలేదనేది నా అభిప్రాయంగా ఉండేది.

## సొంత కాగితం సాధ్యమే

మన కరెన్సీని మనమే ముద్రించుకునేలా ప్రెస్సులున్నాయి. కాని కరెన్సీ నోట్ల ముద్రణకు అవసరమైన కాగితాన్ని విరివిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకునేవాళ్లం. దానిలో అవకతవకలు జరుగుతున్నట్టు నా దృష్టికి వచ్చింది.

ఆ కాగితాన్ని కూడా మనమే తయారుచేసుకుంటే ఎలా ఉంటుంది? ఈ ఆలోచనను కొందరితో పంచుకుంటే – తయారీకి కావలసిన సాంకేతిక నైపుణ్యం మనకున్నట్టు తెలిసింది. అంతా సిద్ధమనుకున్నప్పుడు – ఆర్‌బీఐ ఈ అంశాన్ని చేపట్టడం ప్రభుత్వానికి ఇష్టం లేదని తెలిసింది!

అదేపనిగా నేను ఈ విషయాన్ని లేవనెత్తితే 'ఆర్‌బీఐ చట్టం దీనికి అనుమతించదు' అన్న వాదన తెరమీదకు తీసుకొచ్చింది ప్రభుత్వం. న్యాయనిపుణులను మేం సంప్రదిస్తే 'అదేం లేదు, మన కాగితాన్ని మన ఆర్‌బీఐ తయారుచేసుకోవ'చ్చని చెప్పారు.

అప్పుడే మరో విషయమూ బయటపడింది. కరెన్సీ ముద్రణకు మనకు కాగితాన్ని సప్లయి చేస్తున్న వ్యక్తే వేరే దేశాలకూ ఆ కాగితాన్ని సరఫరా చేస్తున్నారని. దానివల్ల నకిలీ కరెన్సీ నోట్లు వెల్లువెత్తే ప్రమాదం ఉంది. ఆ సమస్యను తప్పించాలంటే మనం సొంత కాగితం తయారుచేసుకోవాలి. ఈ పరిస్థితుల్లో మేం జాతీయ భద్రతా సలహాదారుతో సంప్రదింపులు జరిపాం. మనకు తగిన సాంకేతిక పరిజ్ఞానం, మానవ వనరులు ఉన్నప్పుడు వేరెవరి మీదో ఆధారపడటం అనవసరం కదా. అందువల్ల మేం పట్టువీడకుండా ప్రయత్నాలు సాగించాం. ఫలితంగా ప్రభుత్వం – ఆర్‌బీఐ కలిసి కరెన్సీ పేపరు మిల్లు పెట్టేలా నిర్ణయం జరిగింది.

**చూపులో తేడా ఉన్నాగాని..**

ఆర్‌బీఐ గవర్నర్ – ఆర్థికమంత్రుల మధ్య విభేదాలు సాధారణంగా పత్రికలకెక్కుతుంటాయి. అయితే ఆ విభేదాలు వచ్చేది వాళ్ల వ్యక్తిత్వాల వల్లనే కాదు. అవి వాళ్ల వ్యక్తిగత గొడవలని భావించడం పొరపాటు. రిజర్వ్ బ్యాంక్ – ప్రభుత్వం వాళ్ల మీద పెట్టిన బాధ్యతలు, పని తీరు, ఇతరత్రా ఒత్తిళ్లు వాళ్ల మధ్య అభిప్రాయ భేదాలను సృష్టిస్తాయి. ప్రభుత్వాల మీద రాజకీయ ప్రభావాలుంటాయి. ఏ ప్రభుత్వమైనా తానున్న ఐదేళ్ల కాలం గురించే ఎక్కువగా ఆలోచిస్తుంది. అందువల్ల అది స్వల్పకాలిక (ఐదేళ్లకు సరిపడా) ప్రణాళికలతో ఉంటుంది. ద్రవ్యోల్బణం, అధిక ధరలు, అభివృద్ధి, ఉపాధి కల్పన వంటివి ప్రభుత్వాల మనుగడకు అతి ముఖ్యమైన అంశాలు. అందువల్ల ఈ అంశాల్లో ప్రభుత్వం తక్షణమే ఏదో ఒకటి చెయ్యాలనుకుంటుంది.

ధరల నియంత్రణ, ఉద్యోగ కల్పన వంటివే ఆర్‌బీఐకీ ముఖ్యమైనప్పటికీ ఆర్‌బీఐ వంటి సంస్థలు దేశ ఆర్థిక భద్రత దృష్ట్యా దీర్ఘదృష్టితో ఆలోచిస్తాయి. అటు ప్రభుత్వం – ఇటు ఆర్‌బీఐ రెండూ సామాన్యుడిని దృష్టిలో పెట్టుకునే పనిచేస్తాయి. తేడా అల్లా చూపులోనే. అందువల్లనే ప్రభుత్వానికి ప్రతినిధిగా వ్యవహరించే ఆర్థికమంత్రికీ – రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌కూ మధ్య వివిధ అంశాల్లో తరచూ భిన్నాభిప్రాయాలు తలెత్తుతూ ఉంటాయి. భిన్నాభిప్రాయాలున్నా, ప్రభుత్వాన్ని గురించి వ్యతిరేకంగా నేను ఎప్పుడూ మాట్లాడేవాణ్ణి కాదు.

చిదంబరం మొదట్లో మానెటరీ పాలసీ గురించి వ్యాఖ్యానించేవారు. దానికి మార్కెట్లు ప్రభావితమవుతాయంటూ నేను ఆయన్ని వారిస్తే, 'ఇది ప్రజాస్వామ్యం, నా ఆలోచనల గురించి ప్రజలతో మాట్లాడే హక్కుంది నాకు' అన్నారు. అక్కడితో అది

వదిలేశాను. ఏవైనా ముఖ్యమైన విషయాల్లో ప్రధానమంత్రిని కలిసి వారి అభిప్రాయం తెలుసుకుని దానికి అనుగుణంగా వ్యవహరించేవాళ్లం.

ముందు చెప్పినట్టు నేను గవర్నర్‌గా పనిచేసినప్పుడు ముఖ్యమైన పదవుల్లో ఉన్న వ్యక్తులంతా ఆర్థికవేత్తలే కావడం నాకు చాలా రకాలుగా లాభించింది. ముఖ్యమైన విషయాలను అందరం చర్చించుకునేవాళ్లం. ఒక అంశాన్ని తీసుకుంటే నలుగురూ నాలుగు కోణాల్లో ఆలోచించేవారు. సాధారణంగా మాంటెక్‌సింగ్ అభివృద్ధి ముఖ్యమంటారు, రంగరాజన్ ప్రధానమంత్రి అభిప్రాయాలను తెలియజేస్తారు, చిదంబరం రాజకీయ కోణాలను చెబుతారు.. ఇలాగన్నమాట. నాదైన నిర్ణయాలు తీసుకునే ముందు వీళ్లందరినీ వినడం నాకు పనికొచ్చేది.

సాధారణంగా రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్లకు ఏదో ఒక పక్షం నుంచి ఇబ్బంది ఉంటూనే ఉంటుంది. ఆ విషయంలో నేను అదృష్టవంతుణ్ణనే అనుకుంటాను. నామీద నమ్మకంతో ఎన్డీయే ఐదేళ్ల పదవీకాలాన్నివ్వడం, యూపీయేలో సైతం అందరూ తెలిసినవారే కావడం, మరోవైపు వామపక్షాలు నన్ను తమవాడిగా భావించడం – దీనివల్ల నేను ఎన్నో కీలకమైన అంశాల్లో సంస్థకు నాయకుడిగా ముందడుగు వెయ్యగలిగాను!

# సంస్థకు నాయకుడిగా..

**జా**తీయ సంస్థల్లో రిజర్వ్‌బ్యాంక్ స్థానం చాలా ప్రత్యేకమైనది. మన దేశంలోనే కాదు, అంతర్జాతీయంగానూ ఆర్‌బీఐ పరువుప్రతిష్ఠలు ముఖ్యమైనవి. అటువంటి సంస్థకు నాయకుడిగా దాని బలాన్ని పెంచాలి, సంప్రదాయాన్ని కాపాడాలి. అలాగని పాతదంతా మంచిదే అని కూర్చోకూడదు. మారుతున్న కాలానికి అనుగుణంగా దానిలో సానుకూల మార్పులు తీసుకురావాలి. ఏం చేసినా, దేశప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చెయ్యాలి. అదికూడా అప్పటికప్పుడు మేలుచేసేవాటితో పాటు, దీర్ఘకాలిక ప్రయోజనాలకు పెద్ద పీట వెయ్యాలి.

రిజర్వ్ బ్యాంక్ పాలసీలకు సంబంధించి మేం కొన్ని లక్ష్యాలు పెట్టుకున్నాం.

మొట్టమొదటిది – ప్రపంచ ఆర్థికవ్యవస్థతో మన దేశీయ వ్యవస్థను అనుసంధానించడం. ప్రపంచీకరణ ఇంతకు ముందు లేదు కనుక, దీన్నెలా చెయ్యాలో ఏమిటో ఎవరికీ అంతగా తెలియదు. ఎలాంటి దిశానిర్దేశమూ, ఉదాహరణలూ దొరకవు. అయితే ఇటువంటి ప్రయాణంలో బ్రెజిల్, టర్కీ, అర్జెంటీనా వంటివి దెబ్బతిన్న ఉదంతాలున్నాయి. అందువల్ల ఎక్స్‌టర్నల్ సెక్టార్‌ను పటిష్ఠంగా ఉంచడం నా తొలి ప్రాధాన్యమని నిర్ణయించుకున్నాను.

ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉండాలన్నా, సామాన్యుడు సంతోషంగా ఉండాలన్నా ధరలు నిలకడగా ఉండాలి. 'ఇన్‌ఫ్లేషన్ ఈజ్ టాక్స్ ఆన్ పూర్ పీపుల్' అంటారు. అటువంటి భారం వాళ్లమీద పెరగకుండా చూడాలి నేను.

సామాన్యులకు చేరువగా ఉండే బ్యాంకింగ్ వ్యవస్థలోని బలహీనతలను తొలగించాలి. వాళ్లకు ఆర్థిక సేవలు పెరగాలి. బ్యాంకుల్లోగాని, మరోచోటగాని పౌరులు చేసే డిపాజిట్లు భద్రంగా ఉంటాయన్న నమ్మకం ప్రజల్లో కలగాలి.

ఆర్థిక ఎదుగుదలను సాధించడానికి, డబ్బును మదుపు చేసేందుకు వాళ్లకు అనేక అవకాశాలు ఉండాలి. అంటే ఫైనాన్షియల్ మార్కెట్లను జాగ్రత్తగా అభివృద్ధి చెయ్యాలి.

దేశం అభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వంతో కలిసి పని చెయ్యాలి. ఆర్థిక వ్యవస్థను ఒక సమగ్రదృష్టితో చూడాలి – ఇవీ నా మనసులోని ఆలోచనలు.

## మా బృందం

ఈ లక్ష్యాలను సాధించాలంటే రిజర్వ్‌బ్యాంకులో నాతో పాటు కలిసి నడవగలిగే బృందం ఉండాలి.

నేనున్న ఐదేళ్లలో డిప్యుటీ గవర్నర్లు, ఇతర ఉన్నతాధికారులను నాకు తగినవారిని నియమించుకోగలిగాను. వాళ్లద్వారా ఆర్‌బీఐ ఉద్యోగుల్లో నైపుణ్యం, నాణ్యత పెరిగేలా చూసుకోగలిగాను. దాంతో ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాస స్థాయి పెరిగింది. ఆర్‌బీఐలో అంతర్గతంగా స్వేచ్ఛాపూరిత వాతావరణం ఏర్పడేలా చేశాం. బోర్డు సభ్యులతోనూ స్నేహపూరిత సంబంధాలు ఉండేవి.

ఏ సమస్యనైనా అప్పటికప్పుడు ఏదో చేసేద్దాం అని కాకుండా మూడు కోణాల్లో చూస్తాం. థియరీ ఏం చెబుతోంది, ప్రపంచవ్యాప్తంగా బెస్ట్ ప్రాక్టీసెస్ ఏమిటి, మన దేశ పరిస్థితుల దృష్ట్యా ఏం చేస్తే మంచిదని కలిసికట్టుగా ఆలోచిస్తాం, మాట్లాడుకుంటాం. ఏదో ఫైలు పెట్టి, నోట్ రాసేసేదానికన్నా, సమగ్రంగా విశ్లేషించి ఒక అభిప్రాయానికి రావడం అలవాటయింది. దానివల్ల హైరార్కీ కాదు, బృందాలుగా పనిచేసే సంస్కృతి రూపొందింది.

ఇదిగాక బయట నిపుణులను ఆహ్వానించి అర్థవంతమైన చర్చల ద్వారా కొత్త పరిజ్ఞానం అందేలా చూశాం. దానివల్ల వచ్చిన అవగాహన, ముందుచూపుతో చాలా మార్పులకు శ్రీకారం చుట్టాం.

ఆర్‌బీఐకి వెలుపల – అంటే ప్రభుత్వంతో సమన్వయం ఉండేది, అదే సమయంలో మా స్వయం ప్రతిపత్తిని మేం కోల్పోకుండా జాగ్రత్త పడ్డాం. వివిధ పార్లమెంటరీ కమిటీలతో సత్సంబంధాలుండేలా జాగ్రత్త పడ్డాం.

అంతర్జాతీయ స్థాయిలో – వివిధ దేశాల ఆర్థిక సంస్థలతో స్నేహసంబంధాలుండేవి. ఇతర దేశాల సెంట్రల్ బ్యాంకర్లందరితో పరిచయాలు, పనివిషయంలో అవసరమైనప్పుడల్లా రాకపోకలూ ఉండేవి.

## మానెటరీ పాలసీ కమిటీ

ధరలను అదుపులో ఉంచడం, ద్రవ్యోల్బణాన్ని సమతూకంగా ఉంచి డబ్బు విలువ పడిపోకుండా చూడటం మానెటరీ పాలసీ ముఖ్యబాధ్యత. ఆర్థికవ్యవస్థలోకి

అవసరమైన డబ్బు వచ్చేలా చూడటం, తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగేలా చూసుకోవడం దాని విధి. మూడు వాక్యాల్లో ఇమిడ్చి చెప్పగల సులువైన విషయం కాదు మానెటరీ పాలసీ. అది సంక్లిష్టమైనది, రిజర్వ్ బ్యాంకుకు గుండెకాయ వంటిది.

మన చట్టరీత్యాగాని, సంప్రదాయం ప్రకారంగాని – అప్పట్లో మానెటరీ పాలసీని రూపొందించడం పూర్తిగా గవర్నర్ బాధ్యత. ఆర్‌బీఐ బోర్డు గైడెన్స్ ఇస్తుందంతే. నేను గవర్నరయ్యాక – వివిధ దేశాల్లో మానెటరీ పాలసీని ఎలా రూపొందిస్తారని అధ్యయనం చేశాను. కొన్ని దేశాల్లో ఆ అంశంలో నిపుణుల కమిటీ ఉంటుంది.

ఆర్‌బీఐ బోర్డు నా ఆలోచనకు సహకరించింది. మానెటరీ పాలసీ రూపకల్పనలో గవర్నర్‌కు సలహాలనివ్వడానికి ఒక టెక్నికల్ అండ్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేశాన్నేను. దీనిలో డిప్యూటీ గవర్నర్, ఇద్దరు బోర్డు మెంబర్లతో పాటు, నలుగురు బయటివారు – అకడమిక్, ఫైనాన్షియల్ మార్కెట్లు, ఫిస్కల్ పాలసీ, కమర్షియల్ బ్యాంకింగ్ రంగాల్లో నిపుణులైన వారుండేట్టు చూసుకున్నాను. ఈ రకమైన సంస్థాగతమైన ఏర్పాటు ఆర్‌బీఐ చరిత్రలోనే మొదటిది.

### ఇంపాజిబుల్ ట్రినిటీ

ఫిక్స్‌డ్ ఎక్స్ఛేంజ్ రేటు, ఫ్రీ కాపిటల్ మూమెంటు, ఇండిపెండెంట్ మానెటరీ పాలసీ – ఈ మూడూ ఒక్కసారి సంభవిస్తే దాన్ని 'ఇంపాజిబుల్ ట్రినిటీ' అంటారు. ఆర్థిక శాస్త్రం ప్రకారం ఈ మూడింటినీ సమన్వయపరచడం కుదరదు. మన దేశ పరిస్థితుల్లో మాత్రం అటువంటి మధ్యేమార్గం అవసరమని నా నమ్మకం.

ఆర్‌బీఐ మాజి గవర్నర్ ఐజీ పటేల్‌ను సంప్రదిస్తే, 'ఇది గందరగోళం. కాని చెయ్యాలి, తప్పదు' అన్నారు.

దీన్ని మేనేజ్ చెయ్యడానికి మార్కెట్ స్టెబిలైజేషన్ స్కీమ్ ఉపయోగపడింది.

నేను గవర్నరయిన కొద్ది నెలలకే భారీ ఎత్తున కాపిటల్ ఫ్లో ఉండబోతోందని పసిగట్టాను. దానికి ముందుగానే సిద్ధం కావాలనిపించింది. ఎందుకంటే కాపిటల్ ఫ్లో ఎక్కువ ఉన్నప్పుడు రూపాయి విలువ పెరుగుతుంది. అయితే దానివల్ల సమాజం మీద కొన్ని దుష్పరిణామాలూ ఉంటాయి. అలా జరక్కుండా ఉండేందుకు – బోలెడంత విదేశీ మారక ద్రవ్యాన్ని కొనిపెడుతుంది ఆర్‌బీఐ. కాని ఫారిన్ ఎక్స్ఛేంజ్ కొంటే ఆర్థికవ్యవస్థలో రూపాయలెక్కువవుతాయి. అంటే మనీ సప్లయి పెరుగుతుంది.

దానివల్ల ధరలు పెరుగుతాయి. అలాకాకుండా ఉండాలంటే బాండ్లు జారీచెయ్యాలి. మళ్లీ వాటికి ఆర్‌బీఐ ఎక్కువ వడ్డీలు చెల్లించాలి. ఇదంతా ఒక చక్రం.

కాపిటల్ ఫ్లో పెరిగినప్పుడు తీసుకునే ఇలాంటి స్టెరిలైజేషన్ చర్యల వల్ల ఆర్‌బీఐ చాలా నష్టపోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఏమేం చెయ్యొచ్చని ఒక వర్కింగ్ గ్రూప్‌గా ఏర్పడి ఆలోచించాం. అదిగో, ఆ చర్చల ఫలితంగా వచ్చిందే – 'మార్కెట్ స్టెబిలైజేషన్ స్కీమ్'.

దీనిప్రకారం స్టెరిలైజేషన్ ఖర్చులు ప్రభుత్వమే భరించేట్టు నిర్ణయమైంది. ఆర్‌బీఐ బ్యాలెన్స్ షీటులో లోటు కనిపించడం దేశ ప్రతిష్ఠకు శోభనివ్వదు కదా. ఎప్పుడైనా కాపిటల్ అవుట్‌ఫ్లోస్ ఉన్నప్పుడు మార్కెట్లకు రూపాయలు అవసరమైతే ఈ బాండ్ల పద్ధతిని రివర్స్ చేస్తే సరిపోతుంది.

## లిక్విడిటీ అడ్జస్ట్‌మెంట్ ఫెసిలిటీ

'అసలు ఒక దేశంలో ఉన్న డబ్బెంతో ఎలా లెక్కపెడతారు? దాని విలువను ఎలా నిర్ధారిస్తారు? అసలది సాధ్యమేనా? ఇంతకూ అది అవసరమా?' సామాన్య ప్రజలకే కాదు, ఆర్థిక వర్గాల మనసుల్లోనూ సాధారణంగా మెదిలే ప్రశ్నలివి.

మన దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడానికి – 1997లో రంగరాజన్ ఆర్‌బీఐ గవర్నరుగా ఉన్నప్పుడు నా నేతృత్వంలో ఓ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటయ్యింది. 1998లో మా బృందం నివేదిక సమర్పించింది. అందులోనే మానెటరీ టార్గెటింగ్ అప్రోచ్ – అంటే డబ్బు పరిమాణం ఎంత అనేది పాలసీ ప్రయోజనాలు సాధించడానికి పెద్దగా ఉపయోగపడటం లేదని తేల్చాం. దానికి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతిపాదించాం. దానికోసం 'లిక్విడిటీ అడ్జెస్ట్‌మెంట్ ఫెసిలిటీ' ఉండాలని చెప్పాం.

నేను గవర్నరయ్యాక పూర్తిస్థాయి లిక్విడిటీ అడ్జెస్ట్‌మెంట్ ఫెసిలిటీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. సాధారణ పరిస్థితుల్లో అదెలా పనిచెయ్యాలో, అసాధారణంగా కాపిటల్ ఫ్లో ఉన్నప్పుడేం చెయ్యాలో – వీటన్నిటినీ ఆలోచించి పెట్టాం.

## ఒక్కటి కాదు, మూడు లక్ష్యాలు

దేశ అభివృద్ధికి అవసరమైన నిధులందించడం, ధరలు నిలకడగా ఉండేలా చూడటం – ఇవి రెండూ మానెటరీ పాలసీ లక్ష్యాలుగా సంప్రదాయ ఆర్థిక వేత్తలు

భావిస్తారు. దేనికి ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలన్న ప్రశ్న వస్తుంటుంది. సమయాన్ని బట్టి, సందర్భాన్ని అనుసరించి దేనికైతే దానికి ప్రాముఖ్యమివ్వాలని నా దృక్పథం. వ్యవస్థను నిలకడగా ఉంచడమన్న లక్ష్యానికే మొగ్గు చూపుతాన్నేను.

నేను గవర్నరయ్యేనాటికి – ధరలను అదుపులో ఉంచడం ఒక్కటే మానెటరీ పాలసీ కర్తవ్యం అనే బలమైన నమ్మకం ప్రపంచవ్యాప్తంగా బలపడుతూ ఉంది. అంటే ప్రభుత్వం 'ఇన్‌ఫ్లేషన్ ఇంత ఉండా'లంటూ ఒక సంఖ్య చెబితే, దాన్ని చేరుకోవడానికి పాలసీ అన్నట్టు ఉండేది.

నేనూ అలాగే చెయ్యాలని ఒత్తిడి ఉండేది. కాని గవర్నరుగా బిమల్ జలాన్ అలా ఇన్‌ఫ్లేషన్‌ను టార్గెట్ చెయ్యడాన్ని వ్యతిరేకించారు. నేనూ ఆయన బాటలోనే నడిచాను. మన దేశంలో ఇన్‌ఫ్లేషన్ టార్గెటింగ్ సాధ్యం కాదు.

ఇన్‌ఫ్లేషన్ టార్గెట్ అంటూ ఒక సంఖ్యను కాకుండా, ఒక రేంజ్‌ను నిర్దేశించుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. ఈ సందర్భంలో ఏప్రిల్ 2007 పాలసీలో 5శాతం సీలింగ్ పెట్టుకుంటే మంచిదని ప్రతిపాదించాను. అదిగాక ముందుముందు పాలసీ, ఎక్స్‌పెక్టేషన్ రెండూ 4 – 5శాతం ఉంటే మంచిదని చెప్పాను. ఆర్‌బీఐ 'ఎక్స్‌పెక్టెడ్ లెవెల్ ఆఫ్ ఇన్‌ఫ్లేషన్'ను చెప్పడం వల్ల మేలు జరిగింది. అటుపైన కాలంలో అదొక నమూనాగా స్థిరపడింది.

## సరైన విలువ ఎలా తెలుస్తుంది?

ఓసారి ఫండ్ – బ్యాంక్ వార్షిక సమావేశానికి దుబాయి వెళ్లినప్పుడు ఒక జర్నలిస్ట్ 'అసలు మన రూపాయి సరైన విలువ ఎంత' అని నన్నడిగాడు. నాకు తెలియదన్నాను. సాక్షాత్తూ రిజర్వ్ బ్యాంక్ గవర్నరే సరైన విలువేదో తెలియదనడం ఏమిటి – అని ఆశ్చర్యంతో తలమునకలయ్యాడతడు.

'చూడండి, దేవుడంటే ఏమిటో నేను చెప్పలేకపోవచ్చు. కాని దెయ్యపు జాడలుంటే మాత్రం పసిగట్టగలను. కరెన్సీకి సరైన విలువ ఎంతో నేనే కాదు, భూమ్మీద ఎవరూ చెప్పలేరు. కాని ఎక్స్‌ఛేంజ్ రేటు సరిగా లేకపోతే మాత్రం దాన్ని పసిగట్టగలను' అన్నాను నిబ్బరంగా.

మన రూపాయి బలంగా ఉండాలనుకోవడం మన దేశభక్తికి ప్రతీక. ప్రతి దేశంలోనూ ప్రజలు అదే కోరుకుంటారు. కాని ఒక దేశ కరెన్సీ బలంగా ఉండటమంటే ఏమిటి?

ఒక రూపాయి ఇచ్చి ఏం కొనవచ్చు అనేది దేశం లోపల రూపాయి విలువను సూచిస్తుంది. డాలరుకెన్ని రూపాయలు అనేది దేశం బయట దాని విలువను సూచిస్తుంది. ఇవి రెండూ పరస్పరం ఆధారపడి ఉంటాయి. ఈ విలువలు మన ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్)పైన, వడ్డీరేట్లపైన ఆధారపడి ఉంటాయి. రూపాయి బయట విలువ (ఎక్స్‌టర్నల్ వాల్యూ) సరిగ్గా ఉండటం ముఖ్యం. అది మనకు సరిగ్గా అనిపించాలి, ప్రపంచానికీ సరిగ్గా అనిపించాలి.

పేచీ అంతా ఈ 'సరైన విలువ' అన్న మాట దగ్గరే వస్తుంది! ఎందుకంటే కరెన్సీ విలువ రైటా – రాంగా, స్ట్రాంగా – వీకా ఇవి ఎవ్వరూ చెప్పలేరు. కాని ఎక్స్‌టర్నల్ సెక్టార్‌ను మేనేజ్ చెయ్యడానికి ఎక్స్ఛేంజ్ రేటే కీలకం! ఆ రేటు ఎంత, అది ఎంత మారుతుంది అనేది ఎకానమీకి ముఖ్యం. కాపిటల్ అకౌంటు – కరెంటు అకౌంటు – బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ – వీటికి ఎక్స్ఛేంజ్ రేటు ప్రాణం వంటిది. ఎక్స్ఛేంజ్ రేటు ఫిక్స్‌డ్‌గా ఉండటం, ఫ్లోటింగ్‌గా ఉండటం, లేదూ కొంత ఫ్లోటింగ్ ఉండి మరికొంత నియంత్రణలో ఉండటం – స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన దగ్గర రకరకాల పద్ధతులు కొంతకొంత కాలం పాటు అమల్లో ఉండేవి.

నాకు పూర్వం పనిచేసిన జలాన్ ఒక రేటును ఫార్మల్‌గా ప్రకటించకుండా ఎక్కువ హెచ్చుతగ్గులున్నప్పుడు మాత్రం కలగజేసుకుని నియంత్రించేవారు. నేనూ ఆ సంప్రదాయాన్నే కొనసాగించాను.

వడ్డీరేట్ల లాగానే, ఎక్స్ఛేంజ్ రేట్ల పట్ల కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూ ఉండటం సర్వసాధారణం. ప్రభుత్వాలు మన రూపాయి బలంగా ఉండాలని కోరుకుంటాయి. రూపాయి బలంగా ఉంటే తక్కువ ధరకు దిగుమతులు ఎక్కువగా చేసుకోగలం. అప్పులు చీప్‌గా ఉంటాయి. కాని ఎగుమతులు తగ్గిపోవచ్చు. దిగుమతుల ధరలు తగ్గిపోతే మన పరిశ్రమలు పోటీపడలేకపోవచ్చు. విదేశీ పెట్టుబడిదారులు మనం ఎక్కువ అప్పులు చేస్తున్నామని అనుకోవచ్చు. రూపాయి బలహీనపడితే దిగుమతులు ఖరీదయిపోతాయి. చమురు ధరలు పెరుగుతాయి, ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఇతర దేశాలకు ఎగుమతులు దెబ్బతినొచ్చు, దాంతో ప్రపంచంలో రియాక్షన్ వస్తుంది.

ఇదీ సందిగ్ధ అవస్థ.

## ఫారెక్స్ నిల్వలు ఎంత ఉండాలి?

అదే మీటింగ్‌లో 'ఫారెక్స్ నిల్వలు ఎంత ఉంటే సరిపోతుంది' అని విదేశీ పాత్రికేయుడు అడిగాడు.

'ఎంతయితే సరిపోతుందో నాకు తెలియదు, ఇప్పటికైతే మాకు ఇంకొంచెం కావాలి'.

'గవర్నరై ఉండి మీకు తెలియకపోతే ఎలా?'

'ఒకవేళ ప్రపంచంలో ఎవరైనా ఫారెక్స్ నిల్వ ఇంతే ఉండాలని చెప్పగలిగితే నేను వాళ్లకు సాష్టాంగప్రణామాలు చెయ్యడానికి సిద్ధం' అన్నాను.

విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఎక్కువగా ఉంటే మెయింటెయిన్ చెయ్యడం కష్టం, స్టెరిలైజేషన్ ఖర్చులు ఎక్కువని ఒక వర్గం భావించేది. అలాంటప్పుడు కాపిటల్ ఫ్లోను నియంత్రిద్దామన్నది నా ఆలోచన. దానికి విరుద్ధంగా ఎక్స్‌ఛేంజ్ రేటును పెంచాలనుకున్నది ప్రభుత్వం. అప్పుడు అస్సలేమీ కలగజేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. ప్రభుత్వం ఎలా కావాలనుకుంటే అలా చేసుకోనిమ్మని మౌనం వహించాను. ఎక్స్‌ఛేంజ్ రేటు పెరిగిన తర్వాత దాని విపరిణామాల పట్ల ప్రభుత్వం కళ్లు తెరిచింది! స్టెరిలైజేషన్‌లో ఆర్‌బీఐ అంతకుముందు వరకూ పోషించిన క్రియాశీలకమైన పాత్రను తిరిగి ఆర్‌బీఐకే కట్టబెట్టింది. ఫారెక్స్ మార్కెట్లలో కలగజేసుకోమని అడుగుతూ గవర్నర్‌కు సందేశం పంపింది!! అదే అదనుగా మనం చాలా అప్పులు తీర్చేశాం. అయినా కూడా విదేశీమారకద్రవ్య నిల్వలు అడుగంటనేలేదు.

1991లో బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ విషయంలో ఏర్పడిన సంక్షోభాన్ని అనుభవించి ఉండటం వల్ల, ఐఎమ్ఎఫ్ ఈడీగా లాటిన్ అమెరికా దేశాల్లో సంక్షోభాన్ని చూశాను కనుక, నేను గవర్నయ్యాక విదేశీ మారక ద్రవ్య నిల్వల విషయంలో చాలా జాగ్రత్త పడ్డాను. ఎక్స్‌టర్నల్ సెక్టార్‌ను జాగ్రత్తగా మేనేజ్ చెయ్యడం ద్వారా నేను గవర్నరైన కొద్ది కాలానికే ఫారెక్స్ నిల్వలు మంచి స్థాయికి వచ్చాయి.

## ఫారెక్స్ నిల్వలను వాడకూడదా?

2004లో ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక, అప్పుడు ప్లానింగ్ కమిషన్ డిప్యుటీ ఛైర్మన్‌గా ఉన్న మాంటెక్‌సింగ్ ఆహ్లూవాలియా – ఆర్‌బీఐ అధీనంలో ఉన్న

ఫారెక్స్ నిల్వలను దేశంలో మౌలిక వసతుల నిర్మాణానికి కేటాయించమని కోరుతూ ఒక ఉత్తరం రాశారు.

ఆశ్చర్యపోవడం నా వంతయింది. 'అది కుదిరే పని కాదు, దేశానికి మంచిది కాదు' అంటూ మేం ఆర్థికశాఖకు విపులంగా ఓ నోట్ రాసి ఆ లేఖకు సమాధానంగా పంపించాం.

ఆ ఏడాది బడ్జెట్ రూపకల్పనకు ముందు ఈ విషయం చర్చకు వచ్చింది. అప్పటికి రాకేశ్‌మోహన్ ఆర్థికవ్యవహారాలశాఖలో సెక్రెటరీగా చేరారు. ఆర్‌బీఐలో డిప్యుటీ గవర్నర్‌గా పనిచేసిన అనుభవంతో ఆయన నా అభిప్రాయాలను చిదంబరానికి వివరంగా చెప్పారు. చిదంబరం ఆ విషయాన్ని అప్పటికి వదిలేశారు.

2007 బడ్జెట్ ప్రసంగాన్ని తయారుచేస్తూ చిదంబరం ఆ విషయాన్ని మళ్లీ నాతో ప్రస్తావించారు. మౌలికవసతుల కల్పనకు విదేశీమారక నిల్వలను వాడటంపై దీపక్ పారిఖ్ కమిటీ సూచనలను అమలు చెయ్యాలనుకుంటున్నట్టు చెప్పారు.

దానిలో ముఖ్యమైన సూచనలను చదివి నా అభ్యంతరాలను ఆయన ముందు ఏకరవు పెట్టాను.

కాని 'వేణూ, మనం దీన్ని చెయ్యకతప్పదు. వేరే దారి లేదు. ఈ విషయంలో డ్రాఫ్ట్ తయారుచేద్దాం.. అంతే' అన్నారాయన దృఢంగా.

అందువల్ల రీఫైనాన్సింగ్ ద్వారా ఫారెక్స్ నిల్వలను వాడటానికి ప్రతిపాదించాం. అంటే ప్రభుత్వం ఎంత రుణమిస్తుందో చూసి, దానికి తగినట్టు ఆర్‌బీఐ కూడా రుణమిస్తుంది. ఆర్‌బీఐ సొమ్ము పెట్టాక అది సద్వినియోగం కాకపోతే మాకు చెడ్డపేరు వస్తుంది. ఈ ఆలోచనతో మేం రూపొందించిన రీఫైనాన్సింగ్ ప్రతిపాదనలకు ప్రభుత్వం అంగీకరించలేదు. కాని చివరకు ప్రభుత్వంతో అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది ఆర్‌బీఐకి. అయితే, అందులో ఉన్న లొసుగులన్నీ జాబితాగా రాసి, మా అంగీకారాన్ని తెలియజేశాం.

## కేతన్ పరేఖ్ స్కామ్

1990ల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఆయా రంగాలకు సంబంధించి మార్కెట్ బ్రహ్మాండంగా ఎదిగింది. డాట్ కామ్ విప్లవం అప్పుడు వచ్చిందే. ఆ సమయంలో

అభివృద్ధి చెందుతున్న ఈ–కామర్స్ విప్లవం వల్ల ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ స్టాక్స్ బాగా పైకి వెళ్లాయి. మరీ ముఖ్యంగా ఇంటర్నెట్ వెంచర్స్ అన్నీ పరుగులుపెట్టాయి. టెక్నాలజీ బబుల్ అన్నిటినీ చుట్టేసినట్టే స్టాక్ మార్కెట్‌నూ చుట్టేసింది.

దానికి 'కేతన్ పరేఖ్' రూపంలో పెద్ద షాకు తగిలింది.

2001 మార్చిలో కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన మర్నాడే కేతన్ పరేఖ్ స్టాక్ మార్కెట్లో చేసిన భారీ కుంభకోణం బయటపడింది. షేర్ మార్కెట్ అమాంతం పడిపోయింది. సామాన్యులు దివాలా తీశారు. 8–10 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు కూడా. అంతకు పదేళ్ల ముందు హర్షద్ మెహతా, ఇప్పుడు కేతన్ పరేఖ్ వందల కోట్ల రూపాయలు స్వాహా చేసే అవకాశం ఇచ్చినవి బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాల్లో ఉన్న లోపాలేనని విపక్షాలు తూర్పారబట్టాయి.

ఈ కుంభకోణం బ్యాంకింగ్ రంగం ఎంత బలహీనంగా ఉందో చూపే నిలువెత్తు ఉదాహరణగా నిలబడింది. బ్రోకర్ – బ్యాంకర్ – ప్రమోటర్ల మధ్య ఉండాల్సిన సంబంధాలు ఎంతవరకు సబబు, అవి శ్రుతిమించితే ఎంత ప్రమాదం జరగొచ్చు అనేదాన్ని ఆ స్కామ్ అద్దంలో పెట్టి చూపెట్టినట్టయింది. అసలు బ్యాంకులు కాపిటల్ మార్కెట్ కార్యకలాపాలకు సాయపడొచ్చునా లేదా అన్నది పెద్ద ప్రశ్నగా నిలిచింది. అలాగే కోపరేటివ్ బ్యాంకుల మీద అటు ఆర్‌బీఐ, ఇటు ప్రభుత్వం – ఇరుపక్షాల పెత్తనం ఉండాలా వద్దా అన్నదీ సందేహమై కూర్చుంది.

వీటన్నిటి ఫలితంగా 1990లోనే ప్రారంభించిన బ్యాంకింగ్ రెగ్యులేషన్ సంస్కరణల్లో వేగం పెంచాలని నిర్ణయించుకుంది రిజర్వ్‌బ్యాంక్. బ్యాంకింగ్ వ్యవస్థను మరీ ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకులు – కోఆపరేటివ్ బ్యాంకులను సమూలంగా ప్రక్షాళన చెయ్యడానికి నడుంబిగించింది ఆర్‌బీఐ.

ముందుగా ప్రైవేటు బ్యాంకులు తమ పరిస్థితులను మెరుగుపరచుకునే అవకాశం ఇచ్చాం. అప్పటికీ సరిచేసుకోలేకపోతే ఆరోగ్యకరంగా ఉన్న బ్యాంకులతో అవి స్వచ్ఛందంగా విలీనమయ్యేలా చేశాం. ఇంకా ఘోరంగా ఉన్న బ్యాంకులను మూసేశాం. నేను గవర్నర్‌గా పదవీవిరమణ చేసే నాటికి కాపిటల్ తగినంత లేకుండా ఒక్క ప్రైవేటు బ్యాంకు కూడా లేదంటే అతిశయోక్తి అనిపించవచ్చేమోగాని, అది నిజం!

గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు ఉదంతంతో – ప్రైవేటు బ్యాంకుల యాజమాన్యాలు సరిగ్గా ఉన్నాయా లేదా అనేదాని మీద ఎక్కువగా దృష్టి సారించాను నేను. ఆ మేరకు కొన్ని యాజమాన్యాలకు గైడ్‌లైన్స్ కూడా ఇచ్చాము. బ్యాంకు బోర్డుల ఏర్పాటు, వాటి డైరెక్టర్ల నియామకాలు, పాలన – వీటన్నిటికీ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చాం. ఆ బోర్డులు వాటిని పాటించేలా స్ట్రిక్ట్‌గా ఉన్నాం. ఆ విషయంలో చిదంబరం నాకు చాలా మద్దతిచ్చారు.

## పెద్ద మార్పులే వచ్చాయి

రెగ్యులేషన్, గవర్నెన్స్, మార్కెట్ డిసిప్లిన్ – ఈ మూడు అంశాలూ సవ్యంగా ఉంటే బ్యాంకింగ్ రంగం దృఢంగా ఉంటుంది. అందువల్ల బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం ఏం చెబుతోంది, అది అమలవుతోందా లేదా, కాలానుగుణంగా చట్టానికి ఏవైనా మార్పుచేర్పులు చెయ్యాలా – వీటిమీద శ్రద్ధ పెట్టాను.

అయితే బ్యాంకుల మీద ఆర్‌బీఐ నియంత్రణ తగ్గాలని ఒక వాదన మొదలయింది. అవి అన్ని నియమనిబంధనలనూ పాటిస్తూ విశ్వసనీయతను పెంచుకుంటే ఆర్‌బీఐ క్రమంగా ఆ పాత్ర నుంచి తప్పుకోవడానికి ఏ అభ్యంతరమూ లేదని నేను పదేపదే చెప్పేవాణ్ణి. ప్రభుత్వ రంగ బ్యాంకుల బోర్డు నియామకాల్లో అటు రాజకీయ జోక్యమూ ఇటు వేరే జోక్యాలూ ఉండకూడదని కోరుకున్నాను. ఆ విషయంలో నేను కొద్దిగా విఫలమైనట్టే అనిపిస్తుంది.

ప్రైవేటు బ్యాంకుల ఓనర్‌షిప్, గవర్నెన్స్‌కు సంబంధించిన గైడ్‌లైన్స్ అమలు నాకు సంతృప్తికలిగే స్థాయిలో జరగలేదు. ఉదాహరణకు ఒక పెద్ద ప్రైవేటు సెక్టార్ బ్యాంకు బోర్డులో సాక్షాత్తూ బ్యాంకింగ్ సెక్రెటరీయే సభ్యుడిగా ఉండేవారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అలాగే కొత్తగా లైసెన్సులు తెచ్చుకున్న మరో ప్రైవేటు బ్యాంకుకు పబ్లిక్ సెక్టార్ హోల్డింగ్స్ ఉన్నాయి. అటువంటివి సరి చేస్తామని ప్రభుత్వం చెప్పిందిగాని ఏమీ చెయ్యలేదు! ఇటువంటివాటిని నివారించడానికి రిజర్వ్‌బ్యాంకు చట్టానికి సవరణలను ప్రతిపాదించాను.

ప్రైవేటు బ్యాంకుల సీఈవోలకు ఇన్సెంటివ్‌లిచ్చే పద్ధతికీ స్వస్తి పలికాను. ఇన్సెంటివ్‌ల కోసం వాళ్లు జనం సొమ్మును పణంగా పెట్టి రిస్క్ తీసుకుంటారు. అది సరికాదని నా భావన. ఆర్‌బీఐ ఆమోదించే టెర్మ్స్ అండ్ కండిషన్లలో దాన్ని చేర్చాం. దీనికి మార్కెట్ల నుంచి నిరసన వ్యక్తమయ్యింది.

తమ పెట్టుబడి తగినంత చూపడానికి బ్యాంకులు ఒకదానికొకటి సాయం చేసుకునేవి. ఇలా చెయ్యడం తప్పయినా ఎన్నో ఏళ్ల నుంచీ అలాగే చేస్తూ వచ్చాయవి. దానివల్ల బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తాన్ని కలిపి చూస్తే తగినంత క్యాపిటల్ కనిపించేది కాదు. అప్పుడు ఒక బ్యాంక్ మరో దానిలో ఎంత కాపిటల్ పెట్టాలనే దానిమీద సీలింగ్ విధించాం.

బ్యాంకులు ఒక్క వ్యక్తికి ఎక్కువెక్కువ రుణం మంజూరు చేసే పద్ధతికీ మంగళం పాడేశాం. అలాగే భారీ డిపాజిట్లపై ఓ కన్నేసి ఉంచాం, వాటిపై బ్యాంకులు అతిగా ఆధారపడే తత్వాన్నీ తగ్గించాం. రియల్ఎస్టేట్లు, స్టాక్ మార్కెట్లకు అతిగా రుణాలివ్వకుండా బ్యాంకులను కట్టడి చేశాం. సరైన మార్గదర్శకాలు పాటించని బ్యాంకులకు కొత్త శాఖలు ప్రారంభించడానికి లెసైన్సులివ్వనేలేదు!

## బ్యాంకులకు పెనాల్టీ

ఏవైనా పొరపాట్లు చేస్తే బ్యాంకుల మీద పెనాల్టీ వేస్తుంది ఆర్బీఐ. కాని అది బహిర్గతమయ్యేది కాదు. నేను గవర్నరయ్యాక అటువంటివి ప్రజానీకానికి తెలిసేలా ఉంచాలని పట్టుబట్టాను. కేసు వివరమంతా ఉంచకపోయినా పర్లేదుగాని పెనాల్టీ పడిందన్న సంగతి పబ్లిక్కు తెలియాలన్నాను. దీనికి బ్యాంకింగ్ వర్గాల్లో గగ్గోలు పుట్టింది. అటువంటి ప్రతిపాదన మన దేశంలో అంతకుముందెన్నడూ లేదు.

పెనాల్టీల సంగతి బయటకు తెలిస్తే బ్యాంకింగ్ వ్యవస్థ పట్ల జనాల్లో విశ్వసనీయత పోతుందని, అంతేగాక అది వెల్లడించడం అనేది బ్యాంకింగ్ సీక్రెసీ చట్టానికి తూట్లు పొడవడమేనని ఎంతోమంది అభ్యంతరం పెట్టారు. కాని నేను పట్టుపట్టి ఆచరణలోకి వచ్చేలా చూశాను.

## అంతా మన మంచికే

2007 తర్వాత గ్లోబల్ ఫైనాన్షియల్ క్రైసిస్ ఏర్పడవచ్చని అంచనా వేస్తూ వచ్చాం. దాన్ని రేఖామాత్రంగా సూచించినా, అభివృద్ధి పరుగులో ఆ హెచ్చరికలను ఎవరూ పట్టించుకోలేదు. అయినా మా జాగ్రత్తలో మేమున్నాం. 2008 జనవరికల్లా ఆర్బీఐ అన్ని కట్టుదిట్టాలనూ చేసుకుని, ఒక అత్యవసర విధానానికి రూపకల్పన చేసి పెట్టుకుంది. నా ఊహను నిజం చేస్తూ అమెరికాలో హౌసింగ్ ఫైనాన్స్ బుడగ బద్దలయింది. దాంతో అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం అలముకుంది. అయితే

మనం చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యల వల్ల మన దేశం ఇబ్బందుల పాలవకుండా కాపాడుకోగలిగాం.

గ్లోబల్ క్రైసిస్ తర్వాతే కాపిటల్ అకౌంట్ మేనేజ్‌మెంట్, ఎక్స్ఛేంజ్ రేటు మేనేజ్‌మెంట్, ఫారెక్స్ రిజర్వ్స్, బ్యాంకింగ్ రెగ్యులేషన్, ఎన్‌బీఎఫ్‌సీల వంటి కీలక విషయాల్లో ధైర్యంగా అనుసరించిన పంథా మేలు చేసిందని అందరికీ తెలిసి వచ్చింది. దాన్ని తల్చుకున్నప్పుడు నాకు తృప్తిగా ఉంటుంది. ఆ సమయంలో మన రిజర్వ్ బ్యాంకుకు మంచి పేరొచ్చింది. లండన్‌లోని ఎకానమిస్ట్ అనే ప్రముఖ మ్యాగజీన్ సైతం మన విధానాలను ప్రశంసించింది. అది మనకు గర్వకారణం!

# సామాన్యుడికి సేవకుణ్ణి

'పనిమనిషి తన తాగుబోతు మొగుడి నుంచి డబ్బు దాచుకోగలగాలి. దాన్ని సాధిస్తే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ లక్ష్యం నెరవేరినట్టే..' అన్నది నా ఉద్దేశం. దాన్నే ఒక ఉపన్యాసంలో చెప్పాను కూడా. సాధారణంగా బ్యాంకింగ్ రంగం 'క్రెడిట్‌ను విస్తరించడం' అన్న లక్ష్యంతో పనిచేస్తుంది. క్రెడిట్ ఇవ్వాలంటే బ్యాంకులకు డిపాజిట్లు ఉండాలి. నేను 'సర్వీస్‌ను విస్తరిద్దాం, మంచి సేవలు అందిద్దాం, అప్పుడు డిపాజిట్లు వస్తాయి, ఫలితంగా క్రెడిట్ దానంతటదే పెరుగుతుంది' అన్న దృక్పథంతో ముందడుగు వేశాను.

నేను గవర్నరయ్యాక 'ఫైనాన్షియల్ ఇంక్లూజన్'ను విస్తృతపరచాలనుకున్నాను. మానెటరీ పాలసీలో మొట్టమొదటిసారి మనం ఆ మాటను వాడాం. ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అనేది చాలా పెద్ద సబ్జెక్టు. దాని ఆశయం మాత్రం చాలా సింపుల్. ప్రజలకు బ్యాంకింగ్, మిగిలిన ఆర్థిక సేవలు చేరువ కావాలి, లావాదేవీలకయ్యే ఖర్చు తగ్గాలి. ఉదాహరణకు ఒక పల్లెటూరి వ్యక్తి వేరే పట్టణంలో కూలిపనిచేస్తూ, ఇంటికి డబ్బు పంపాలంటే దానికి ఖర్చు అవకూడదు.

ప్రాథమికంగా – రిజర్వ్ బ్యాంక్, ఇతర బ్యాంకులు సామాన్యుడికెలాంటి సేవలందిస్తున్నాయి, వాటి నాణ్యత ఎంత అనేది తెలుసుకోవడానికి ఒక అధ్యయనం చేయించాలనుకున్నాను.

ఫైనాన్షియల్ సెక్టార్ – మరీ ముఖ్యంగా బ్యాంకింగ్ సర్వీసులు సామాన్యుడికి మేలు చేసేలా ఉండాలని ముందు నుంచీ నాకు మనసులో ఉండేది. బ్యాంకు లావాదేవీల్లో జనాలు ఇబ్బందిపడుతుండటాన్ని నేను తరచూ గమనిస్తూనే ఉండేవాణ్ణి. బ్యాంకు పనుల్లో ఖాతాదార్లు ఎందుకు ఇబ్బందులు పడాలి?

## సాంకేతిక సాయం

అభివృద్ధి కావాలంటే టెక్నాలజీని సొంతం చేసుకోవలసిందే. నాకు పూర్వం పనిచేసిన గవర్నర్లు ఆ దిశగా కొన్ని అడుగులు వేశారు. ఆ దారిలో వేగం పెంచాను

నేను. ఐడిఆర్‌బీటీ సాయం తీసుకుని తొలిసారి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ప్రయోగం ఆంధ్రప్రదేశ్‌లోనే చేశాం. అంటే ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు అకౌంట్‌లోకే ఆ సాయం వచ్చేస్తుందన్నమాట.

తర్వాత మా దృష్టి ఏటీఎమ్‌ల వైపు పడింది. ఏటీఎమ్‌లు, వాటి వినియోగానికి బ్యాంకులు విధిస్తున్న ఛార్జీలు, నోట్ల ముద్రణకు అవుతున్న ఖర్చు.. వీటితోపాటు ఈ ప్రక్రియలో బ్యాంకులకు ఎంత సౌలభ్యం దొరుకుతోంది, కస్టమర్లకు ఎంత వీలుగా ఉంటుంది – ఈ అంశాలపై ఒక విస్తృతమైన సర్వే చేయించాను. దానిలో వెల్లడైన అంశాల ఆధారంగా ఏటీఎమ్‌ల వాడకాన్ని వీలైనంత ఎక్కువ ప్రోత్సహించాలని నిర్ణయించాం. దానివల్ల ఆర్‌బీఐకి నోట్ల ముద్రణ పని కొంచెం తగ్గింది. బ్యాంకులకు పనిభారం తగ్గింది. బ్యాంకుల్లోనైతే పెద్ద కస్టమరు, సామాన్యుడు అంటూ విచక్షణ ఉండవచ్చు. కాని ఏటీఎమ్ దగ్గర ఎవరైనా క్యూలో నిలబడి డబ్బు తీసుకోవలసిందే.

అప్పటివరకూ ఏ బ్యాంకు ఖాతాదార్లు ఆ ఏటీఎమ్‌నే వాడాలి. అదీ కొన్ని లావాదేవీల వరకే. దగ్గరలో ఆ బ్యాంకు ఏటీఎమ్ లేకపోతే ఆ సౌకర్యం ఇక వాళ్లకు లేనట్టే. ఈ పద్ధతిని మార్చి, ఖాతాదారులెవరైనా ఏ బ్యాంకు ఏటీఎమ్‌నైనా ఎలాంటి రుసుమూ లేకుండా వాడుకునేలా చేశాం. బ్యాంకుల మధ్య లావాదేవీలకు ఎలాంటి రుసుమూ లేకుండా ఆర్‌బీఐ చూసుకునేలా మార్పు తెచ్చాం. దానివల్ల సామాన్యుడి మీద భారం పడకుండా చూసుకున్నాం. దీనివల్ల ఏటీఎమ్‌ల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రజలకెంతో సౌకర్యం సమకూరింది!

## ఫైనాన్షియల్ ఇంక్లూజన్

ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌కు పడిన పెద్ద ముందడుగు ఏదంటే – జీరో బ్యాలెన్స్ అకౌంట్లను అనుమతించడమే. దీన్ని మొదటిసారి పాండిచ్చేరిలోని ఇండియన్ బ్యాంకులో ప్రయోగించి చూశాం.

'బ్యాంకింగ్ కరెస్పాండెంటెంట్' మోడల్‌కూ శ్రీకారం చుట్టినది ఆ సమయం లోనే. బ్యాంకు శాఖలు లేని గ్రామాల్లో ఒక వ్యక్తి బ్యాంకు ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. అక్కడి స్థానికులకు బ్యాంకులో ఏ పనున్నా అతనే చేసిపెడతాడు. రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి చోట్ల ఇది బాగా పనిచేసిందిగాని దేశవ్యాప్తంగా అంత మంచి ఫలితాలనివ్వలేదు.

క్రమంగా ఫైనాన్షియల్ ఇంక్లూజన్ బాగా విస్తరించింది. ఇంక్లూజన్ వైపు మేము (ఆర్‌బీఐ) తొలి అడుగులు వేశాక ప్రభుత్వానికీ దానివైపు ఆసక్తి పెరిగింది. అప్పుడు డాక్టర్ రంగరాజన్ అధ్యక్షతన ఓ కమిటీ వేసింది. అయితే ఆ కమిటీ ఎక్కువగా రుణాల విస్తరణ పైన ఆసక్తి చూపింది. మేము మాత్రం సేవల విస్తరణ వైపు దృష్టి పెట్టాం. ఎందుకంటే ఫైనాన్షియల్ ఇంక్లూజన్ పేరిట అతిగా అప్పులిచ్చెయ్యడం సమస్యలకు దారి తీస్తుందని నా అభిప్రాయం. అమెరికాలో హౌసింగ్ బబుల్ బద్దలవడం నా అభిప్రాయం సరైనదేనని నిరూపించింది!

## చిన్న రుణాలు పెద్ద సమస్యలు

సూక్ష్మరుణ సంస్థల (మైక్రోఫైనాన్స్ ఇన్‌స్టిట్యూషన్స్) విస్తరణతో సామాన్యులకు రుణాలు అందే తీరు మారిపోయింది. వాటికోసమే ప్రత్యేకించిన స్వచ్ఛంద సంస్థలు పుట్టుకొచ్చాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో అవి శరవేగంగా వృద్ధి చెందాయి. ఆర్‌బీఐ తరఫున వాటిని ప్రోత్సహించాలని ఎమ్ఎఫ్ఐలను ప్రయారిటీ సెక్టార్‌లోనికి తీసుకొచ్చాను. అప్పటికవి లాభాపేక్షలేని సంస్థలే. అకస్మాత్తుగా వాటి వ్యాపారం పెరగడంతో వాటిలో స్వయం నియంత్రణ తగ్గిపోయింది.

వాళ్ల పనుల్లో ఫ్లెక్సిబిలిటీ ఉండాలి అనే ఉద్దేశంతో ఆర్‌బీఐ నుంచి గట్టి నియంత్రణ పెట్టలేదు మేం. ఆ తర్వాత అవి లాభాలను ఆర్జించే సంస్థలుగా మారిపోయాయి. ఈ పరిణామాలను నేను ఊహించలేకపోయాను.

క్రమంగా అర్థమైనదేమంటే లాభాల బాటలో నడుస్తున్న సూక్ష్మ రుణ సంస్థలు వడ్డీ వ్యాపారులకేమీ తీసిపోవడం లేదని.

మైక్రోఫైనాన్స్ రంగానికి ఆద్యుడిగా నోబెల్ బహుమతి పొందిన మహమ్మద్ యూనస్ ఆర్‌బీఐ ఆహ్వానం మేరకు మన దేశానికి వచ్చారు. ఆయన కూడా తన ప్రసంగంలో ఇదే విషయాన్ని ప్రస్తావించి హెచ్చరించారు.

బ్యాంకుల ద్వారా సూక్ష్మ రుణాలను గృహనిర్మాణాలకూ, మౌలిక వసతుల కల్పనకూ కూడా విస్తరించాలని తీవ్రమైన ఒత్తిడి ఉండేది అప్పట్లో. అది సరికాదని, బ్యాంకులు వర్కింగ్ క్యాపిటల్ పట్ల శ్రద్ధ చూపాలని నా నిశ్చితాభిప్రాయం. అలాగే వెంచర్ కాపిటల్ వంటి ప్రమాదభరితమైన కార్యకలాపాలకు రుణాలివ్వడాన్ని నేను ప్రోత్సహించలేదు.

## అవగాహన పెరగాలి

ఆర్థికపరమైన అంశాల పట్ల అందరికీ అవగాహన ఉండాలి. దురదృష్టవశాత్తూ మన పౌరుల్లో అది తక్కువే. అందుకే ఆర్థిక అక్షరాస్యతను పెంచేలా ఆర్‌బీఐ తరఫున వివిధ కార్యక్రమాలు ప్రారంభించాము. 'సామాన్యుడి సేవలో ఆర్‌బీఐ' అన్న అంశం మీద కారంచేడులో నేను తెలుగులో ఉపన్యసించాను. రిజర్వ్ బ్యాంకు గవర్నర్ ఒక ప్రాంతీయ భాషలో ఉపన్యసించడం అదే తొలిసారి అనుకుంటాను.

ఆర్‌బీఐ కార్యకలాపాల గురించి ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పెట్టడం, వివిధ ప్రాంతీయ భాషల్లో కూడా వివరించేలా వెబ్‌సైట్‌ను తీర్చిదిద్దడం నాకు మంచి సంతృప్తినిచ్చిన అంశాలు. ఆర్‌బీఐ పనితీరు మీద విద్యార్థులకు క్విజ్‌లు నిర్వహించడం, ప్రభుత్వేతర సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేశాం. సమాజంలో ఆర్థిక అవగాహనను పెంచడానికి ఈ పనులు చాలవు, ఇంకా చెయ్యవలసినదెంతో ఉందనే అనిపిస్తుంది నాకు.

మొత్తమ్మీద కొన్ని మంచి ఆలోచనలకు, పనులకు బీజం వేశానని తలుచుకుంటే సంతోషంగా ఉంటుంది.

## అసలు మన సంస్కృతి ఏమిటి?

బ్యాంకుల్లో డబ్బు దాచుకునేవాళ్లు (డిపాజిట్‌దారులు) ఉంటేనే వాటి నుంచి అవసరమైనవారికి అప్పులు వస్తాయి. అలాగే ఖాతాదార్లు కావాలనుకున్న తక్షణమే డిపాజిట్లు చెల్లిస్తేనే బ్యాంకుల పట్ల వాళ్లకు విశ్వాసం ఉంటుంది. అప్పు తీసుకున్నవాళ్లు సక్రమంగా తిరిగి చెల్లించినప్పుడే ఇవన్నీ సాధ్యం. ఈ మొత్తం ప్రక్రియను 'క్రెడిట్ కల్చర్' అంటారు.

రుణగ్రహీతల్లో కొందరు తిరిగి చెల్లించడంలో చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తారు. వాళ్లకు బ్యాంకులు అదనపు ప్రయోజనాలనిస్తే బాగుంటుంది. కొందరు క్రమశిక్షణ పాటించరు. మరికొందరు చాలా రిస్కీ వ్యాపారాలకు రుణాలు తీసుకుంటారు. అవి ప్రమాదంలో పడితే వాళ్లు డిఫాల్ట్ అయ్యే ప్రమాదముంది. అప్పుడొచ్చి వాళ్లు వాటిని రైటాఫ్ చెయ్యమని అడుగుతారు. అందువల్ల అలాంటి రిస్కీ వ్యాపారాలకిచ్చే రుణాల వడ్డీరేటు ఎక్కువగా ఉండాలి.

వడ్డీరేట్ల మీద సబ్సిడీ ఇవ్వాలన్న గొంతుకలు గట్టిగానే వినిపిస్తుంటాయి మనకు. వడ్డీరేటు మీద సబ్సిడీలిస్తే ఏం జరుగుతుందో తెలుసా? ఒకటి – రుణం

సరిగ్గా తిరిగి తీర్చడానికి ఏ ప్రోత్సాహమూ లేనట్టు. రెండోది – కొందరు అలా తక్కువ వడ్డీరేట్లకు బ్యాంకు రుణాలు తీసుకుని బయట ఎక్కువ వడ్డీలకు ఆ సొమ్మును ప్రైవేటుగా తిప్పుకోవచ్చు!

ఇది ఇలా ఉంచితే – బ్యాంకుల దగ్గర భారీగా రుణాలు తీసుకున్న బడాబాబులు కొందరు ఏవేవో మాయలు చేసి వాటిని ఎగ్గొట్టడం మనం చూస్తూనే ఉంటాం. ఇక తప్పదన్నప్పుడు వాటిని రీస్ట్రక్చర్ చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తుంటారు. బ్యాంకులు అలాంటి ఆటల్ని సాగనివ్వకూడదు. ఎందుకంటే అలాంటి 'పెద్దమనుషు'ల విషయంలో కోర్టులు ఆదేశించినా సరే, సొమ్ములు వెనక్కి రాని ప్రమాదం ఉంటుంది. అప్పుడు బ్యాంకులు నిస్సహాయంగా చూస్తూ ఉండవలసిందే తప్ప చెయ్యగలిగేది ఏమీ ఉండదు. ఏదైనా వ్యాపారంలో అనుకోని నష్టాలు వాటిల్లినప్పుడు, కరువులు – వరదల కారణంగా నష్టపోయినప్పుడు దాన్నుంచి బయటపడ్డానికి రీస్ట్రక్చరింగ్ సదుపాయం ఉంది. దురుద్దేశాలతో దాన్ని వాడుకోవడం అన్యాయం. అలాంటి కొన్ని చేదు అనుభవాల తర్వాత మేం కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్ పద్ధతులను బాగా మార్చాం.

ఎన్ని ఇబ్బందులున్నా, సామాన్యుడికి అవసరమైనప్పుడు డబ్బు అందుబాటులో ఉండాలనే సంకల్పంతోనే ముందడుగు వేస్తుంది రిజర్వ్ బ్యాంక్. దానికి బ్యాంకింగ్ కరెస్పాండెంటెంట్స్, సూక్ష్మరుణ సంస్థలు (మైక్రోఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్స్) మంచి మార్గాలు. అందరికీ వడ్డీరేట్ల మీద సబ్సిడీలివ్వడం లేదా కొంతమందికి భారీ రుణాలివ్వడం వంటివి కాకుండా, ఎక్కువమందికి రుణపరపతి కల్పించగలగాలి.

## మాఫీ భారం ఎవరి మీద?

ప్రొఫెసర్ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక 'మనం ఇస్తున్న రుణాలు నాలుగేళ్లలో రెండింతలు కావాలి' అని కోరారు ఆర్‌బీఐని. నేను సమ్మతించాను, ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టాను.

కాని 2008 ఎన్నికల ముందు ప్రభుత్వం అకస్మాత్తుగా రైతుల రుణాలు మాఫీ చెయ్యాలని నిర్ణయించుకుంది. నేను దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాను. ఆర్థికమంత్రితో చర్చించాను. మేమిద్దరం కలిసి ప్రధాని దగ్గరకు వెళ్లాము. సామాజిక, నైతిక కారణాలతో అలాంటి నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని ఆయన అన్నారు!

అయితే ఈ భారం ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకుల మీద పడకూడదన్నదే నా అభిప్రాయం. ఎందుకంటే సామాన్యుల డిపాజిట్లతో నడిచే బ్యాంకులు ఈ భారాన్ని

భరించడం సబబు కాదని నా విశ్వాసం. అందువల్ల ప్రభుత్వమే ఆ భారాన్ని భరించి దానికి తగిన బడ్జెట్ కేటాయించాలని నేను ఆయన్ని కోరాను.

మొత్తమ్మీద ప్రభుత్వమే రైతుల తరపున బ్యాంకులకు సొమ్ము చెల్లించేట్టు అంగీకారం కుదిరింది. ఆ మొత్తాన్ని రెండు బడ్జెట్లలో సర్దారు. ఇక్కడ గమ్మత్తయిన విషయం ఏమంటే – ఈ పద్ధతి వల్ల బ్యాంకులు కూడా రుణమాఫీకి ఆనందంగా అంగీకరించాయి. ఎందుకంటారా? చిన్నాచితకా మొత్తాలు చెల్లించమంటూ రైతుల వెంటబడేదానికన్నా ఒక్కసారిగా తామిచ్చిన రుణమంతా తిరిగి వసూలైపోతుంటే వాటికి మాత్రం ఆనందంగా ఉండదూ?

కాని ఈ మొత్తం వ్యవహారంలో చిరాకు పుట్టించే అంశం ఒక్కటే. అదేంటంటే – రైతులకు రుణాల్విడంలోగాని, తీసుకోవడంలోగాని ఎలాంటి సంబంధం లేని సామాన్య ప్రజలు అంటే టాక్స్‌పేయర్స్ మీద ఆ భారమంతా పడటం. నేను దీనికి వంద శాతం వ్యతిరేకిని. కాని ఆ సందర్భంలో ఏమీ చెయ్యలేకపోయాను!

## వడ్డీ వ్యాపారం

మన దేశంలో వడ్డీవ్యాపారులు లేకుండా బ్యాంకింగ్ వ్యవస్థను దృఢపరచాలన్న ఆలోచన దశాబ్దాలుగా ఉంది. కాని ఆ వ్యవస్థ సమాంతరంగా నడుస్తూనే ఉంది. వడ్డీవ్యాపారం మీద నియంత్రణ రాష్ట్రాల పరిధిలోని అంశం. దాన్ని బలోపేతం చెయ్యాలన్న ఉద్దేశంతో 2006 మేలో ఒక కమిటీ పెట్టాం. ఆ కమిటీ 2007 జులైలో మోడల్ లెజిస్లేషన్ నివేదిక ఇచ్చింది. దాన్ని అన్ని రాష్ట్రాలకూ పంపించాం. కాని దాన్ని ఏ రాష్ట్రమూ సీరియస్‌గా తీసుకోలేదు. అప్పుడు రాష్ట్రాలు దాన్ని చట్టంగా రూపొందించుకుని ఉంటే వడ్డీవ్యాపారం అదుపులో ఉండేది.

## ఏది ముఖ్యం?

బ్యాంకుల విషయంలో ఎప్పుడూ నలుగుతూ ఉండే అంశం – ప్రయారిటీ సెక్టార్ లెండింగ్.

ప్రతి రంగమూ తనను ప్రయారిటీ సెక్టార్‌గా గుర్తించాలని కోరుకుంటుంది. దాంతో అసలు 'ప్రాముఖ్య రంగం' అన్న ఆలోచనే పలచనైపోతుంది. ప్రభుత్వంలోని అన్ని శాఖలూ – మౌలిక వసతులు, వ్యవసాయం, చిన్న పరిశ్రమలు... ఇలా ప్రతిదీ ప్రయారిటీ సెక్టారన్న బిరుదు తగిలించుకోవడానికే ప్రయత్నిస్తుంటాయి.

రుణాల వ్యాప్తి పెరుగుతోందంటే బ్యాంకులకూ సంతోషమే. కాని ఈ మొత్తంలో 'ప్రయారిటీ సెక్టార్' అసలు ఉద్దేశమే పక్కదారి పడుతోందని, దాని లక్ష్యమే నీరుకారిపోతోందన్నది – చాలా తక్కువమంది గ్రహించే సత్యం!

## గ్రామీణ సహకార బ్యాంకులు

మన దేశంలో సహకార బ్యాంకుల వ్యవస్థ అతి పెద్దది. మన ఆర్థిక వ్యవస్థలో అవి పోషించే పాత్రా కీలకమైనదే. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, ఒక మాదిరి పట్టణాల్లో చిన్నాచితకా వ్యాపారాలు చేసుకునేవారికీ రుణాలందించడంలో సహకార బ్యాంకులు చాలా సాయపడేవి. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో వాటి విస్తృతి చాలా ఎక్కువ.

కాని కాలక్రమంలో స్థానిక రాజకీయ జోక్యం ఎక్కువైపోవడం వల్ల సహకార బ్యాంకుల వ్యవస్థ క్రమంగా సమస్యల ఊబిలోకి కూరుకుపోయింది. జాతీయ స్థాయి రీఫైనాన్సింగ్ సంస్థలు ఆర్థికసాయం అందిస్తే తప్ప మనలేని దుఃస్థితికి దిగజారి పోయాయి!

నేను గవర్నర్ కావడానికి పూర్వం కూడా వాటికి కొత్త జవజీవాలనిచ్చే పని జరిగింది. నిధులూ అందించాం. నాబార్డ్ వంటివీ భారీగా ఆదుకున్నాయి. కాని అప్పటి ప్రయత్నాలు అంతగా సఫలం కాలేదు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తిని కావడం వల్ల గ్రామీణ సహకార బ్యాంకుల వ్యవస్థను చక్కదిద్దడం చాలా ముఖ్యమని తోచింది నాకు.

ప్రభుత్వం కూడా వాటికి కొత్త జవసత్వాలివ్వడంలో సాయపడతానని అంగీకరించింది. దానికోసమే వైద్యనాథన్ కమిటీని నియమించింది. మేం కలిసి కృషిచేశాం. ఆ కమిటీ చాలా విలువైన సలహాలనిచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చింది.

అయితే ఆ సూచనలను అమలు చెయ్యవలసినవి రాష్ట్రప్రభుత్వాలు. అవిమాత్రం తమకేం పట్టనట్టు కూర్చున్నాయి. అందువల్ల ఎంత చేసినా, స్థానిక రాజకీయ కారణాల వల్ల గ్రామీణ సహకార బ్యాంకుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉన్నది తప్ప అభివృద్ధిలోకి రాలేదు.

పల్లెటూళ్లలో ఉండే వ్యవసాయదారులకు, చిరువ్యాపారులకు, మహిళలకు వెన్నుదన్నుగా నిలవాల్సిన ఒక అద్భుతమైన వ్యవస్థ విఫలమైనందుకు నాకు బాధగా ఉంటుంది. అత్యున్నత స్థాయి నుంచి ప్రయత్నించినా సరే దాన్ని చక్కదిద్దలేక పోయినందుకు నా హృదయం మెలిపెట్టినట్టు అనిపిస్తుంది.

## పట్టణ సహకార బ్యాంకులు

పట్టణ సహకార బ్యాంకులు మాత్రం గ్రామీణ సహకార బ్యాంకులకు భిన్నదిశలో నడిచాయి.

2004కల్లా అవి ఎంత అస్తవ్యస్తంగా ఉండేవో మాటల్లో చెప్పవశం కాదు. ఎందుకంటే 2001లో గుజరాత్‌లో జరిగిన కేతన్ పరేఖ్ కుంభకోణం వాటిని చావుదెబ్బ తీసింది. ఆ వ్యవస్థలోని బలహీనతలన్నీ అప్పుడే బయటపడ్డాయి. ఆ తరహా బ్యాంకులకు లైసెన్సులు చాలా ఉదారంగా లభించడం వల్ల క్రమంగా ఆ వ్యవస్థ నిర్వీర్యమైపోయింది. మొత్తానికి అదో పెద్ద పుండులాగా తయారయ్యింది.

ఆ సమయంలో నేను రిజర్వ్‌బ్యాంకులో డిప్యుటీ గవర్నర్‌గా ఉండేవాణ్ణి. సహకార బ్యాంకుల మీద నియంత్రణ ఆర్‌బీఐకే ఉండాలని చట్టసవరణకు అప్పుడే ప్రతిపాదించాను. నేను గవర్నరయ్యాక ఈ విషయం మీద స్టాండింగ్ కమిటీ ఆన్ ఫైనాన్స్‌కు నా వాదనలు వినిపించాను. ఆ వ్యవస్థ మీద ఇటు ఆర్‌బీఐ – అటు రాష్ట్రాలు : రెండింటి పెత్తనం ఉండకూడదన్న ప్రతిపాదనను ఆ కమిటీ అప్పటికే పరిశీలిస్తోంది.

కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాలు సహకార బ్యాంకుల మీద పూర్తి అధికారం చలాయించడం ఆర్థిక మంత్రిత్వశాఖకు ఇష్టం లేదు. ఎందుకంటే ఆర్‌బీఐ అండదండలున్నంత వరకే ఆ బ్యాంకుల మీద ప్రజలకు నమ్మకం ఉంటుందని వారికి కచ్చితంగా తెలుసు! అయితే స్థానికంగా రాజకీయ జోక్యం లేకుండా ఉండటమంటే వాటిమీద పట్టువదులుకోవడమేనని కూడా రాజకీయపక్షాలకు తెలుసు. ఈ ఆలోచనలన్నీ నలుగుతుండగానే, పట్టణ సహకార బ్యాంకుల ప్రతినిధులు వచ్చి వాళ్ల స్థితిగతులు నాకు చెప్పుకున్నారు.

ఆ రంగాన్ని అభివృద్ధి బాట పట్టించాలంటే ఒకటే మార్గం. రిజర్వ్ బ్యాంక్ రాష్ట్రాలతో విడివిడిగా అంగీకార ఒప్పందాలు కుదుర్చుకోవడం మేలనిపించింది. బాగా పనిచేస్తున్న సహకార బ్యాంకులను ఆర్‌బీఐ ప్రోత్సహించేట్టు, బలహీనంగా

ఉన్నవాటిని బలోపేతం చేసేట్టు, మరీ నష్టాల్లో కూరుకుపోయినవాటిని మూసెయ్యడంలో సాయపడేందుకు సిద్ధమయ్యాం.

దానికోసం ప్రతి రాష్ట్రానికీ ఓ కమిటీ ఏర్పడింది. దానిలో వాళ్ల ప్రతినిధులు, ఆర్‌బీఐ నుంచి ఒకరు, కోపరేటివ్ బ్యాంకు నుంచి ఒకరు ఉంటారు. ఆ ఉద్యోగులకు అవసరమైన శిక్షణనివ్వడానికి ఆర్‌బీఐ ముందుకొచ్చింది.

మొదట మా అడుగులు కొద్దిగా తడబడినా, ఈ వ్యూహం బాగానే ఫలించింది. సహకార బ్యాంకులను బలోపేతం చెయ్యడానికి ఆర్‌బీఐ అందించే ప్రోత్సాహకాలను అందుకోవడానికి రాష్ట్రాల మధ్య పోటీ ఏర్పడింది. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి – ఇద్దరికిద్దరూ పోటీ పడేవారు. ఆ తర్వాత మిగిలిన రాష్ట్రాలు కూడా ఈ పద్ధతిలోకి వచ్చేశాయి. పట్టణ సహకార బ్యాంకులకు సంబంధించి ఇదొక అరుదైన ప్రయోగమని చెప్పాలి. అది విజయవంతమైనందుకు నాకు సంతోషంగా ఉంటుంది.

## ఎన్‌బీఎఫ్‌సీలపై గురి పెట్టాం

నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై ఆర్‌బీఐ నియంత్రణ అంతగా ఉండదు. వీటిలో కొన్ని పబ్లిక్ నుంచి డిపాజిట్లు సేకరించవు, కొన్ని సేకరిస్తాయి. పబ్లిక్ డిపాజిట్ తీసుకునేవాటిలో కొన్ని ఆర్థిక వ్యవస్థలో లోటుపాట్లను ఆధారం చేసుకుని చెలరేగిపోయేవి. నేను గవర్నరయ్యేనాటికి 5 పెద్ద రెసిడ్యుయెరీ ఎన్‌బీఎఫ్‌సీలు ఉండేవి. వాటిని నిర్వహిస్తున్న తీరు చూస్తే, మనీ లాండరింగ్‌కు పాల్పడుతున్నట్టు అనుమానం కలిగింది.

అయితే ఉన్నపాటున వాటిని ఎత్తిపారెయ్యడం కుదరదు. వాటి మూలాలు ఎక్కడెక్కడికో పాతుకుపోయి ఉన్నాయి.

వాటి ప్రాబల్యం తగ్గించాలంటే వాటికి ప్రత్యామ్నాయంగా మరో వ్యవస్థను నిలబెట్టాలి. అదంతా చాలా పెద్ద పని.

మొత్తం డిపాజిట్లలో 70 శాతం పీర్‌లెస్, సహారాల్లోనే ఉండేవి. నేను గవర్నరయ్యాక వాళ్లను పిలిచి ఆ తరహా వ్యాపారాల నుంచి తప్పుకోవాలని చెప్పాను. పీర్‌లెస్ సహకరించింది.

సహారా నిరాకరించింది. వేగంగా డిపాజిట్లు పెంచింది. మేం తగ్గించమన్నాం. ఎక్కువ అవుతున్నకొద్దీ డిపాజిట్‌దారులు దెబ్బతింటారనే ఉద్దేశంతో రెండేళ్లు

గడువిచ్చినా ఆపలేదు. చివరకు మేం డిపాజిట్లు సేకరించవద్దంటూ ఆర్డరిచ్చాం. దాంతో వాళ్లు కోర్టుకెక్కారు. సుప్రీమ్‌కోర్టు వాళ్లకు మరికొంత సమయం ఇవ్వమని మాకు చెప్పింది. ఆ తర్వాత ఆర్‌బీఐతో సహారా ఒక అంగీకారం కుదుర్చుకుంది. దాని ప్రకారం డిపాజిట్లు సేకరించడం క్రమంగా ఆపేసింది.

★★★★★

మార్గదర్శి చిట్‌ఫండ్స్ 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నదనే సమాచారం బెంగుళూరు నుంచి రిజర్వ్‌బ్యాంకుకు అందింది 2005లో, రహస్యంగా. ఏం జరుగుతున్నదో తెలుసుకొమ్మని నేను ఆర్‌బీఐ హైదరాబాద్ కార్యాలయాన్ని ఆదేశించాను. అది బయటకు పొక్కడంతో మార్గదర్శి వ్యవహారం జాతీయ మీడియాలో పతాక శీర్షికగా మారింది. తెలుగునాట పెద్ద దుమారాన్ని రేపింది.

మా ఎంక్వైరీలో తేలినదాని ప్రకారం, ఆ సంస్థకు పూర్వం ఆర్‌బీఐతో కొంత కరెస్పాండెన్స్ ఉన్నా కూడా, నా అభిప్రాయంలో ఆ సంస్థ చేసింది సబబు కాదనిపించింది.

కాని అందులో డిపాజిటర్ల సంఖ్య ఎక్కువ. హడావిడిగా నిర్ణయాలు తీసుకుంటే కుటుంబాలకు కుటుంబాలే దెబ్బతింటాయి. కొన్ని వేలమంది సామాన్యులు ఒక్కొక్క రూపాయీ పోగుచేసి దాచుకున్న సొమ్ము అది. అలాంటి కేసుల్లో ఒక్క మాట అటూఇటూ అయినా వాళ్లందరి జీవితాలూ దెబ్బతింటాయి. అలా కాకుండా చూడవలసిన బాధ్యత ఆర్‌బీఐ గవర్నరుగా నా మీద ఉంది. అందువల్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాం. మాకు వచ్చిన సందిగ్ధావస్థ ఏమంటే – మార్గదర్శిని శిక్షించడం ముఖ్యమా? డిపాజిట్లను భద్రంగా ఇప్పించడం ముఖ్యమా? ఈ విషయంలో కొన్ని హైకోర్టు తీర్పుల్లో డిపాజిట్‌దారుల భద్రత ముఖ్యమంటూ తీర్పు ఇచ్చిన ఉదంతాలున్నాయి. అప్పుడొక నిర్ణయానికొచ్చాం.

ఇకమీద కొత్త డిపాజిట్లను స్వీకరించవద్దని, మూడేళ్ల లోపల మెచ్యూర్ అయినవి అయినట్టుగా తిరిగి చెల్లించాలని. ఏది తేడా వచ్చినా శిక్ష విధించక తప్పదని మార్గదర్శికి చెప్పాం. చెల్లింపుల్లో మార్గదర్శి విఫలమయి, డిపాజిటర్ల నుంచి ఒక్క ఫిర్యాదు వచ్చినా కథ వేరేలా ఉండేదేమో.

# శ్రమిస్తేనే అదృష్టం

నేను 2003 సెప్టెంబరులో మన రిజర్వ్‌బ్యాంకుకు 21వ గవర్నరుగా బాధ్యతలు స్వీకరించాను. అన్ని రాజకీయపక్షాలు, మీడియా, ఆర్థిక సంస్థలు, మార్కెట్లు నన్ను ఎంతో సంతోషంగా ఆహ్వానించాయి. అందరికీ తెలిసినవాణ్ణి కావడం ఓ కారణం. మరో కారణం ఏమిటంటే – ఆరేళ్ల పాటు డిప్యుటీ గవర్నర్‌గా పనిచేసినప్పుడు సరళీకరణ (లిబరలైజేషన్) చెయ్యడంలో నేను కీలకపాత్ర పోషించిన సంగతి అందరికీ తెలుసు. అందువల్ల గవర్నర్‌గా దాన్ని మరింత వేగవంతం చేస్తాననీ, ప్రపంచానికి తలుపులు బార్లా తెరిచిపెడతాననీ అందరూ అనుకున్నారు.

నేను డిప్యుటీ గవర్నర్‌గా వైదొలగి, ఐఎమ్ఎఫ్ ఈడీగా వెళ్లొచ్చిన ఏడాది కాలంలో సరళీకరణ, సంస్కరణల మీద చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను. పక్కా ప్రణాళిక లేకుండా ప్రపంచంలో అందరూ చేస్తున్నారు కదాని మనమూ హడావిడిగా మార్పులు చేసేస్తే కోలుకోలేనంత దెబ్బ తింటామని ఇతర దేశాల అనుభవాల నుంచి నేర్చుకున్నాను. అందువల్ల గ్లోబలైజేషన్, లిబరలైజేషన్‌ల దిశగా దూసుకెళ్లే ముందు జాగ్రత్తగా ఉండాలన్న అభిప్రాయం నాలో బలపడింది.

ఫైనాన్స్ రంగం ఒక్కటే సరళీకరణవైపు పరుగులు పెడితే దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అందువల్ల మేం దాన్ని తగ్గించాం. ఇది కొన్ని వర్గాలకు ఇబ్బంది అనిపించింది. ఆర్థికరంగంలో సంస్కరణలు జరగాలనుకున్నప్పుడు దానికి పూరకంగా (కాంప్లిమెంటరీ) ఉండే అనేక రంగాల్లో సంస్కరణలు రావాలి. కాని అది జరగడం లేదని గమనించాం. అందువల్ల ఆర్థిక సంస్కరణల వేగం తగ్గించాం. ఇది కూడా కొందరికి నచ్చలేదు.

బ్యాంకింగ్ రంగంలోకి విదేశీ బ్యాంకులను రానివ్వకుండా అడ్డుపడటం, 5శాతం కన్నా షేర్లు పెట్టడానికి కుదరదని అడ్డుకోవడం, లోకల్ ప్రైవేటు బ్యాంకుల యాజమాన్యాలు సరిగ్గా ఉండాలనడం, నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)

లను కట్టడి చెయ్యడం – ఇలా అన్నిటిమీదా రిజర్వ్ బ్యాంక్ నియంత్రణను పెంచాను. ఇది ఆయా వర్గాలకు మింగుడు పడలేదు.

మరోవైపు మానెటరీ పాలసీలో కూడా పట్టు బిగించాం. ఎక్కువైన లిక్విడిటీని ఆపడానికి, కాపిటల్ ఫ్లోలను సరైన మార్గంలో మళ్లించడానికి ప్రయత్నించాం. దిగుమతయ్యే ఇంధనం రేట్లు తగ్గి, దేశంలోకి పెట్టుబడుల ప్రవాహం పెరిగి, కళ్లముందు అభివృద్ధి కనిపిస్తున్నా సరే, వడ్డీ రేట్లు పెంచాను. ఇదీ కొందరికి నచ్చలేదు.

అభివృద్ధి చెందిన దేశాల్లోలాగా, డెరివేటివ్స్, మార్ట్‌గేజ్ కంపెనీలు, కాంగ్లొమెరేట్ (హోల్డింగ్ కంపెనీ)లు మన దేశంలోనూ అభివృద్ధి చెందాలని కొందరు అభిలషించారు. అవన్నీ విదేశీ బ్యాంకులకు లాభదాయకం, మనకు ప్రమాదకరం కావచ్చన్న ఆలోచనతో వాటన్నిటికీ గైడ్‌లైన్స్ గట్టిగా పెట్టేశాం, వాటి రాక ఆలస్యమయ్యేలా చేస్తూ వచ్చాం. వీటన్నిటివల్లా నేను అభివృద్ధిని అడ్డుకుంటున్నానన్న అభిప్రాయం కొందరిలో కలిగింది.

రియల్ ఎస్టేట్ వంటి రిస్కీ వ్యాపారాలకు బ్యాంకులు అప్పులివ్వకుండా అడ్డుకోవడం, బలహీనమైన ప్రైవేటు సెక్టార్ బ్యాంకుల మీద కఠినమైన చర్యలు తీసుకోవడం, ఎన్‌బీఎఫ్‌సీల మీద పట్టుబిగించడం వల్ల కొంత అసంతృప్తి పెరిగింది.

## వైమనస్యం కలిగింది

2006 తర్వాత నుండి నా పనితీరు పట్ల కొందరిలో అసంతృప్తి పేరుకోవడం మొదలైందని గమనించాను. మీడియాలోనూ, ప్రైవేటు సంభాషణల్లోనూ అది బాహాటంగానే వ్యక్తమయ్యేది. అది ఎంతవరకూ వెళ్లిందంటే – ఒకసారి బిమల్ జలాన్ ఫోన్‌చేసి 'ఈసారి ఢిల్లీ వచ్చినప్పుడు నన్ను తప్పనిసరిగా కలువు' అన్నారు.

వెళ్లాక ఆయన 'ఎందుకు అంత చెడ్డపేరు మూటగట్టుకుంటున్నావు? నీ అంత అపఖ్యాతి పాలయిన గవర్నర్ ఆర్‌బీఐ చరిత్రలోనే లేరు. దీనిగురించి నువ్వేదో ఒకటి చెయ్యక తప్పదు. కనీసం మీడియాతో అయినా సంబంధాలు జాగ్రత్తగా ఉంటే నీ ఇమేజ్ మెరుగవుతుంది...' అంటూ తన ఆవేదనను వెళ్లగక్కారు.

'రోజురోజుకూ నా ఇమేజ్ పాడవుతున్న సంగతి నాకు తెలుసు. కాని వాటి వెనుక ఉన్న కారణాలు ఇవి. ఇమేజ్ సంగతి ఎలా ఉన్నా, నేను దేశ ఆర్థికవ్యవస్థ క్షేమం కోసమే పనిచేస్తున్నాను. నేను చేస్తున్నవి సరైనవేనని బలంగా నమ్ముతున్నాను.

బహుశా మీరన్నట్టు నా పబ్లిక్ రిలేషన్స్ ఇంకాస్త మెరుగ్గా ఉంటే బాగుండేదేమో..' అని వివరించాను.

ఆ తర్వాత జరిగిన బోర్డు సమావేశంలో సభ్యులు కూడా గవర్నర్‌గా నా ప్రతిష్ఠ మసకబారటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఏదైనా పబ్లిక్ రిలేషన్స్ సంస్థను నియమించుకుని మరీ ఆర్‌బీఐ ఇమేజ్‌ను పెంపొందించే చర్యలు చేపడదామని ప్రతిపాదించారు వారిలో కొందరు. అటువంటి సంస్థ ఏమీ వద్దని, ఆర్‌బీఐకు మంచి ఇమేజ్ తెచ్చిపెట్టేందుకు నేను శాయశక్తులా కృషి చేస్తానని వాళ్లకు నచ్చచెప్పాను.

మరోవైపు ఆర్థికమంత్రి చిదంబరంతో కూడా నా సంబంధాలు క్రమంగా క్షీణించాయి. 2007 ప్రారంభం నుంచే ఆయనతో నాకు సరిగా కుదరడం లేదని అనిపించేది లోలోపల. అప్పుడే 13వ ఆర్థిక సంఘం ఛైర్మన్ పదవికి పేర్లు చెప్పమంటూ రంగరాజన్ నన్నడిగారు. గవర్నర్‌గిరీ నుంచి తప్పుకుని నేనే వస్తానని ఆయనకు చెప్పాను. ఆ విషయం ఆయన చిదంబరానికి చెబితే 'అదేమీ కుదరదు. వేణును ఎక్కడికీ పంపించం. ఆయనకు వెళ్లాలని ఇష్టమున్నా సరే....' అన్నారట!

### 'లాస్ట్ లెక్చర్'

2008 మొదట్లో ఒకసారి ప్రధానమంత్రిని అర్జెంటుగా కలవమంటూ సందేశం వచ్చింది.

సాధారణంగా ఆదివారం ప్రధానమంత్రి ఎవరినీ కలవరు. ఏ సమావేశాలూ పెట్టుకోరు. అందుకని నాకు ఆశ్చర్యంగా అనిపించింది. నేను హుటాహుటిన ఢిల్లీ వెళ్లాను.

ప్రధానిని కలిసేముందు అలవాటు ప్రకారం ఆర్థికమంత్రికి ఫోన్‌చేసి 'సర్ నన్నిలా కలవమన్నారు. విషయమేమిటో నాకేమీ తెలియదు. ఏమైనా చెప్పమంటారా?' అని అడిగాను.

'ఏమీ లేదు..' అన్నారు క్లుప్తంగా చిదంబరం.

తర్వాత ప్రధానమంత్రిని కలిశాను. అప్పటికాయనకు జ్వరంగా ఉంది. చాలా అలసిపోయినట్టున్నారాయన. అలసటను మించిన ఆందోళన ఆయన ముఖంలో కనిపించింది.

'వేణూ, ఆర్థికమంత్రి మీపట్ల తీవ్రమైన అసంతృప్తిగా ఉన్నారు. ఏం చెయ్యాలో నాకు పాలుపోవడం లేదు. మీ ఇద్దరిలోనూ ఎవరో ఒకరి పక్షం వహించలేను నేను. నాకు చాలా దిగులుగా ఉంది..' అన్నారాయన విచారంగా.

నాకు చాలా కష్టమనిపించింది.

'సర్. మీకెన్నో సమస్యలుంటాయి, అతి ముఖ్యమైన పనులుంటాయి. మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. దీనిగురించి మీరేమీ ఆందోళన చెందకండి. నేను తప్పకుండా ఏదో ఒకటి చేస్తాను...' అన్నాను. ఆయన థాంక్స్ చెప్పారు.

ప్రధాని ఇంటి బయటకు వస్తూనే నేను చిదంబరానికి ఫోన్ చేసి వాళ్లింటికి వస్తున్నట్టు చెప్పాను.

'వద్దు, ఇప్పుడెందుకు మీరు రావడం' అన్నారు.

'నేను వస్తున్నా సర్. ఒక్క నిమిషం మాట్లాడేసి వెళ్లిపోతా' అన్నాను.

ఆయన సమాధానం కోసం చూడకుండా ఫోన్ పెట్టేసి నేరుగా వాళ్లింటికి వెళ్లాను.

దారిలో నా మనసులో ఎన్నో ఆలోచనలు. ఆర్థికమంత్రి ఏయే అంశాల్లో నాతో ఇబ్బంది పడుతున్నారో అడిగి, నా ఉద్దేశాలను వివరించి చెప్పాలనుకున్నాను. అదంతా ఎందుకు, తక్షణమే రిజైన్ చేద్దామనుకున్నాను. కాని అప్పటికి నా పదవీకాలం ఉన్నది తక్కువే. అంతలోనే రాజీనామా చేసి వివాదాస్పదం కావడం ఎందుకనిపించింది. ఎన్నో ఆలోచనలు నా బుర్రలో సుళ్లు తిరుగుతూ ఉండగా నేను చిదంబరం ఇంటికి చేరాను.

ఎప్పుడూ లేనంత ఫార్మల్‌గా చూశారాయన నావైపు. ఇద్దరం కూర్చున్నాక 'సర్, నావైపు నుంచి మీకు హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నా..' అన్నాను.

'ఎందుకు' అడిగారాయన ముభావంగా.

'నాకు తెలియదు. ఎందుకనేది పెద్ద విషయం కాదు...' అన్నాను.

'నేను మీకెంతో సాయం చేశాను. ఎన్నో విషయాల్లో మద్దతుగా నిలిచాను. కాని మీరు దానికి తగినట్టు ప్రతిస్పందించలేదు. ఏ పనిలోనూ నాకు మద్దతివ్వలేదు మీరు..' అన్నారాయన.

‘దీన్ని నేను గుర్తుపెట్టుకుంటాను..’ అని చెప్పి ఆయన దగ్గర వీడ్కోలు తీసుకున్నాను.

ఇంత జరిగినా కూడా, నా పదవీకాలం ముగియడానికి రెండు నెలల ముందు గవర్నర్‌గా నన్ను మరో రెండేళ్లు పొడిగించాలని ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆలోచిస్తున్నట్టు రంగరాజన్ చెప్పారు నాకు.

‘ఇప్పటికే నాకు 67 ఏళ్లు. పైగా ఆర్థికమంత్రితో సంబంధాలు అంత గొప్పగా ఏమీ లేవు కూడా’ అన్నాను ఆయనతో.

‘మరి ఆయనకేం చెప్పమంటారు?’

‘సర్, నేనయితే రిలీవయిపోవాలనుకుంటున్నా. నాకు రెండేళ్లు కాదు, మూడేళ్లు ఎక్స్‌టెన్షన్ ఇవ్వమని చెప్పండి..’ అన్నా.

పొడిగింపు ఇస్తే నేను కొనసాగుతానని వదంతులు వచ్చాయి. కాని అది నా వల్ల కాదని అప్పటికే నా బంధుమిత్రులకు చెప్పేశాను. ఆ మాటనే చిదంబరానికీ చేరవేశాను.

2008 ఆగస్టు మొదట్లో ఆర్‌బీఐ బోర్డు సమావేశమయింది. నా తర్వాత గవర్నర్ ఎవరన్నది అప్పటికి తేలలేదు. నేను మరికొంత కాలం కొనసాగుతానని అందరూ అనుకున్నారు. కాని నేను మాత్రం అదేమీ లేదని చెప్పేశాను. నా వీడ్కోలుకు గుర్తుగా రాండీ పాష్ రాసిన ‘ద లాస్ట్ లెక్చర్’ పుస్తకాన్ని బోర్డు సభ్యులకు బహూకరించాను కూడా.

**తర్వాత....**

2008 ఆగస్టు నెలాఖర్లో అమెరికాలో అధికారిక పర్యటనలో ఉన్న డిప్యుటీ గవర్నర్ రాకేశ్ మోహన్ నాకు ఫోన్ చేశారు.

‘సర్, వెంటనే ఢిల్లీకి వచ్చి ఆర్థికమంత్రిని కలవమని వారి కార్యాలయం నుంచి నాకు కబురొచ్చింది. కారణమేమిటో తెలియడం లేదు..’ అని. నా తర్వాతి గవర్నర్ ఎవరు అనే విషయం చర్చించడానికి ఆయన్ని పిలిపించారని తర్వాత తెలిసింది.

రాకేశ్ మోహన్ గవర్నర్ అవుతారని నేను అనుకున్నాను. అలా జరగలేదు. దువ్వూరి సుబ్బారావు గవర్నర్‌గా ఎంపికైనట్టు వార్త అందింది. ఐఏఎస్ అధికారిగా

దువ్వూరి ఆంధ్రా కేడర్‌కే వచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మేం కొన్నాళ్లు కలిసి పనిచేశాం, కేంద్ర ఆర్థికశాఖలోనూ మేం కొన్నాళ్లు కలిసి పనిచేశాం. నేను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఉన్నప్పుడు, ఆయన ఫైనాన్స్ సెక్రెటరీగా ఉన్నారు. స్నేహపూర్వకమైన, విశ్వసనీయమైన బంధం మామధ్య ఉంది. అటువంటి వ్యక్తి గవర్నర్ అవుతున్నారంటే నాకు సంతోషం కలిగింది.

2008 సెప్టెంబరు 5న ఆర్‌బీఐ గవర్నరుగా పదవీ విరమణ చేశాను.

సాధారణంగా ఒక రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌కు మంచి కల ఏదంటే – ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్) తక్కువ, అభివృద్ధి (గ్రోత్) ఎక్కువ ఉండాలన్నదే. నేనున్న ఐదేళ్లలో చివరి సంవత్సరం తప్ప, ఆ కల పూర్తిగా నెరవేరింది!

అతి తక్కువ ఇన్‌ఫ్లేషన్, అత్యధిక అభివృద్ధి ఆ నాలుగేళ్లలో భారత్ సొంతమయ్యాయి. గడచిన యాభయ్యేళ్లలో లేనంతగా విదేశీమారకద్రవ్య నిల్వలు పెరిగాయి. ఎక్స్‌టర్నల్ సెక్టార్ బలం పుంజుకుంది. విదేశీ అప్పుల మీద ఆధారపడాల్సిన అవసరం తగ్గింది. ఎక్స్ఛేంజ్ రేటు స్థిరంగా ఉంది. వడ్డీ రేటు పెరిగినందువల్ల ఆర్థిక వ్యవస్థ పట్ల నమ్మకం పెరిగింది, సామాన్యుల సేవింగ్స్ పెరిగాయి. బ్యాంకింగ్ రంగం అనుకున్నదానికన్నా మంచి అభివృద్ధి సాధించింది. ఈ వెలుగులకు తోడు, బ్యాంకింగ్‌లో, ఎన్‌బీఎఫ్‌సీల్లో చీడపురుగులను ఏరేశాననే సంతృప్తి ఉంది.

ప్రభుత్వం 2010లో 'పద్మవిభూషణ్'తో సత్కరించినప్పుడు నేను ఆ సత్కారం రిజర్వ్‌బ్యాంకు సాధించిన విజయాలకు చెందాలని అనుకున్నాను.

చరిత్రలో నెపోలియన్ గురించి ఒక కథ చెబుతారు. ఒక సేనానిని నియమించాల్సి వచ్చిందట ఆయనకు.

'అతను సమర్థుడని నాకు తెలుసు. కాని అదృష్టవంతుడేనా కాదా? అది తెలియాలి' అని అడిగారట.

సదుద్దేశాలూ, సమర్థతా ఉన్నా అదృష్టం లేకపోతే కొన్ని సాధ్యం కావు. అలా చూసినప్పుడు నెపోలియన్ భాషలో నేను లక్కీ జనరల్‌ని. అదృష్టవంతుణ్ణి. అయితే అదృష్టాన్ని అందుకోవడానికి శ్రమించినవాణ్ణి!

# క్షణం తీరిక లేదు...

**తే**టతెలుగులో 'తానొకటి తలిస్తే దైవమొకటి తలిచాడు' అని ఉంది కదా. రిజర్వ్‌బ్యాంకు గవర్నరుగా నేను రిటైరయ్యాక జరిగిందదే. పదవీవిరమణ చేసిన తర్వాత సీరియస్ పనులేవీ పెట్టుకోకూడదని అనుకున్నాను. పెయింటింగ్ నేర్చుకుందామని సరదా పడితే 'ఈ వయసులో మీరు ఎక్కడికి వెళతారు' అంటూ మా అమ్మాయి కవిత – మా ఇంటికొచ్చి నాకు పెయింటింగ్ నేర్పేలా ఓ మలయాళం మాస్టారిని కుదిర్చింది. నేనింకా రంగులూ బ్రష్షూ చేతపట్టిన రెండు వారాలకే ఆ టీచరు కేరళ వెళ్లిపోయాడు! 'నీ విద్యకు భయపడి పారిపోయాడేమో నాన్నా' అని కవిత జోకులు వేసింది.

నేను సెప్టెంబరు 5న రిటైరయితే, రెండు వారాల్లోనే అమెరికాలో లేమాన్ బ్రదర్స్ కుప్పకూలింది. గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లు సంక్షోభం బారినపడ్డాయి. ఆ సమయంలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మా ఇంటికి ఫోన్ చేశారు. అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలను చర్చిస్తూ నేనేమైనా సాయపడుతూ సలహానివ్వగలనా అని అడిగారాయన నన్ను.

'ప్రభుత్వమూ, ఆర్‌బీఐ స్పందిస్తున్న తీరు సరిగ్గానే ఉంది, గవర్నరు, డిప్యుటీ గవర్నర్లు ఎప్పుడు కావాలన్నా నేను అందుబాటులోనే ఉన్నాను' అని చెప్పానాయనకు.

అక్టోబరులో నేను మా మనవరాళ్లతో ఆడుకుంటూ ఉండగా, న్యూయార్క్ నుంచి కబురు వచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభానికి కారణాలేమిటని విశ్లేషించేందుకు, పరిణామాలను చర్చించేందుకు ఆర్థిక రంగ నిపుణులతో ఒక కమిటీని వెయ్యాలనుకుంటున్నారని, దానిలో సభ్యుడిగా ఉండేందుకు నా అంగీకారాన్ని తెలియజెయ్యమన్నారనేది ఆ ఫోన్‌కాల్ సారాంశం.

జీవితాన్ని సాధారణంగా గడిపెయ్యాలన్న నా ఆలోచనను పక్కకు పెట్టి నేను ఆ కమిటీలో ఉండేందుకు అంగీకరించాను. ఎందుకంటే ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ జోసెఫ్ స్టిగ్లిజ్ ఆ కమిటీకి ఛైర్మన్. నేనుగాక ఆ కమిటీలో పదిహేనుమంది సభ్యులు.

ఒక్కొక్కరిదీ ఒక్కొక్క దేశం, విభిన్నమైన నేపథ్యం, భిన్నమైన దృక్కోణం. వాటన్నిటినీ అవగాహన చేసుకుంటూ, అంతర్జాతీయ ద్రవ్య – ఆర్థిక విధానాల మీద కసరత్తు చేసే అవకాశం వచ్చినప్పుడు వదులుకోకూడదనిపించింది. అలా గ్లోబల్ క్రైసిస్ వల్ల నేను వానప్రస్థాశ్రమాన్ని వదిలేసి మళ్లీ పనిలోకి దిగాను.

## సంక్షోభం ఎలా వచ్చిందంటే...

అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభానికి మూలం అమెరికాలో పడింది. భవిష్యత్తులో తమకు లాభాలొస్తాయని ఊహిస్తూ ప్రజలు రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్ చెయ్యడం, దానికి బ్యాంకులు వంతపాడటంతో హౌసింగ్ రంగంలో బుడగ పెరిగింది. బ్యాంకులు తామిచ్చిన లోన్లను కొత్తగా వచ్చిన ఫైనాన్షియల్ ఇన్నొవేషన్స్ ద్వారా అమ్మేశాయి. ఆస్తుల విలువ ఒకస్థాయికి చేరాక ఇక పెరిగే అవకాశం లేకపోయింది. ప్రజలు రుణాలు కట్టలేకపోయారు, బ్యాంకులు కూడా ఆ భారాన్ని మొయ్యలేకపోయాయి.

అమెరికా బ్యాంకులకు యూరప్‌లోని ఆర్థిక సంస్థల సహకారం ఉందిగనక అవి కూడా నష్టాలబాట పట్టాయి. ఈ నేపథ్యంలో 2008 సెప్టెంబరులో లేమాన్ బ్రదర్స్ కుప్పకూలింది. సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి. అంతర్జాతీయంగా టాప్ 20 ఫైనాన్షియల్ కాంగ్లొమెరేట్స్ ఒకదానిమీద ఒకటి నమ్మకాన్ని పోగొట్టుకుని వ్యాపారలావాదేవీలను మొత్తంగా నిలిపేశాయి. దాంతో అమెరికాలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా డబ్బు ఆడక గ్లోబల్ లిక్విడిటీ క్రైసిస్ సంభవించింది. వ్యవస్థ నడవడానికి అవసరమైన సొమ్మును ఆయా దేశాల రిజర్వ్‌బ్యాంకులు విడుదల చేశాయి. దీనికి ఎవరో ఒకరు పూనుకుంటే చాలదు, అందువల్ల ప్రపంచంలో ముఖ్యమైన 20 దేశాలు (జి 20) రంగంలోకి దిగాయి. ఆయా ప్రభుత్వాలు ఆర్థిక ఉద్దీపనలివ్వడం, పన్నులు తగ్గించడం వంటి చర్యలను చేపట్టాయి.

వాణిజ్య వ్యాపారాలకు డబ్బు స్తంభించిపోవడంతో అభివృద్ధి చెందుతున్న దేశాలు సైతం సంక్షోభం కోరలకు చిక్కాయి.

## ప్రమాదాన్ని పసిగట్టాం..

లేమాన్ బ్రదర్స్ కుప్పకూలి, అంతర్జాతీయ సంక్షోభం అంత త్వరగా సంభవించడం వల్లనే రిజర్వ్‌బ్యాంకులో నేను చేపట్టిన రక్షణ చర్యలకు ప్రాముఖ్యం వచ్చింది. అది నేను రిటైరయిన కొద్ది నెలల తర్వాత అయితేగనక నా కృషికి గుర్తింపు

వచ్చేది కాదు. అలాగాక నేను పదవిలో ఉన్నప్పుడే గనక అది వచ్చుంటే నా పని ఏమయ్యేదో!

ఆర్‌బీఐ గవర్నరుగా నేను వడ్డీరేట్లు, రిస్క్ వెయిట్లు పెంచినప్పుడు బ్యాంకర్లందరూ కోపోద్రిక్తులయ్యారు. సంక్షోభం తర్వాత వాళ్లే 'రెడ్డిగారు మమ్మల్ని రక్షించారు' అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారట. వారి మాటలను ఉదహరిస్తూ 2008 డిసెంబరు 19న 'సంక్షోభం నుంచి ఇండియా తప్పించుకున్న తీరు ఇదీ' అంటూ జో నోసెరా న్యూయార్క్ టైమ్స్ పత్రికలో ఒక వ్యాసం రాశారు. దాన్ని చూసి దేశవిదేశాల్లో ఉన్న ఆర్థికరంగ మిత్రులంతా నన్ను అభినందిస్తూ మాట్లాడారు. ఆ తర్వాత మరో మూడు రోజుల్లో ప్రొఫెసర్ జోసెఫ్ స్టిగ్లిజ్ 'అమెరికాకు రెడ్డిలాంటి గవర్నర్ ఉంటే ఈ దేశం ఇంత సంక్షోభం బారినపడేది కాదు..' అన్నారట. ప్రపంచవ్యాప్తంగా అది వార్తల్లో ప్రముఖంగా ప్రసారమైంది. ఆయన వ్యాఖ్యలతో మన దేశంలో ఎంతోమందికి నా కృషిపట్ల నమ్మకం కలిగింది.

దానికి నిదర్శనంగా 2009లో మీడియా, సాంస్కృతిక, ఆర్థిక రంగ సంస్థల నుంచి అవార్డులు వచ్చాయి. నేను పదవిలో ఉన్నంత కాలం అవార్డులనూ, సత్కారాలనూ అంగీకరించలేదు. పదవీవిరమణ చేశాక అన్నీ ఒక్కసారి వెల్లువగా వచ్చిపడ్డాయి. సీఎన్‌బీసీ టీవీ 18, ఎకనామిక్ టైమ్స్, బిజినెస్ స్టాండర్డ్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి సంస్థలు అవార్డులనిచ్చాయి.

'ఆర్‌బీఐ గవర్నరుగా డాక్టర్ రెడ్డి ఉండటం గొప్ప వరం. అధిక రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటూ కూడా ఆయన మంచి పాలసీలను రూపొందించారు. రెడ్డి నేతృత్వంలో ఆర్‌బీఐ ప్రదర్శించిన విజ్ఞానం, ధైర్యం వల్ల ఇండియా లాభపడింది' అంటూ ప్రశంసించారు మోర్గాన్ స్టాన్లీ చీఫ్ ఎకనమిస్టు సీఫెన్ రాక్ 2009 నవంబరులో. ఆయన తన మరో వ్యాసంలో 'ప్రపంచంలో అసెట్ బబుల్స్ ప్రమాదాన్ని ముందుగా ఊహించినవాళ్లు ఇద్దరంటే ఇద్దరే. ఒకరు యూరోపియన్ సెంట్రల్ బ్యాంకర్ ట్రిచెట్, రెండోవారు రెడ్డి. అయితే రెడ్డికి దానికి తగిన కట్టుదిట్టాలు చేసే ధైర్యముంది' అని ప్రశంసించారు.

2010 జనవరి 25న నేను చెన్నైలో ఒక సమావేశానికని బయల్దేరాను. చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి సమావేశ స్థలానికి వెళుతుండగా హోమ్‌శాఖ సెక్రెటరీ ఫోన్ చేశారు. రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మవిభూషణ్ అందుకోవడానికి నా అంగీకారం

కోసం చేసిన ఫోన్ అది. అంతటి విశిష్టమైన పురస్కారానికి నా పేరు ఎవరు ప్రతిపాదించారన్న ఆసక్తి నాలో కలగడం సహజం కదా. ఆ ప్రశ్నే ఆయన్ని అడిగాను. దానికి సమాధానంగా ఆయన 'మీ పేరు కమిటీ ముందుకు వచ్చినప్పుడు మేమందరం సంతోషంగా అంగీకరించాం' అని చెప్పారు.

పద్మవిభూషణ్ కోసం నా పేరును డాక్టర్ రంగరాజన్ ప్రతిపాదించి ఉండొచ్చన్న ఆలోచన నాకు వచ్చింది. ఆయనను అడిగితే 'లేదు. నేను దానిగురించి ఏమీ అనుకోలేదు. బహుశా మన్మోహన్ ప్రతిపాదించారేమో' అన్నారు.

నేను రిటైరయిన రెండేళ్ల తర్వాతనైనా సరే, ప్రభుత్వం నా కృషిని గుర్తించింది – అన్న సంతోషం కలిగింది అప్పుడు నాకు.

ఇంటాబయటా వచ్చిన గుర్తింపు వల్ల చాలా దేశాల్లోని అకడమిక్స్, పాలసీమేకర్స్, నాన్‌గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఉపన్యాసాలివ్వమంటూ నన్ను ఆహ్వానించేవారు.

ఈ తరహా సానుకూల వాతావరణం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రొఫెసర్ స్టిగ్లిజ్ కమిషన్‌లో సభ్యుడిగా అంతర్జాతీయ ద్రవ్య విధానాల మీద, ఆర్థిక విధానాల గురించి పనిచెయ్యడంతో మొదలైన నా కృషి తర్వాత విస్తృతమైంది. నెలకు పదిహేను రోజులు వివిధ దేశాల్లో ఉపన్యాసాలివ్వడంతోనే గడిచిపోయేది!

## స్టిగ్లిజ్ కమిషన్ ఏం చేసిందంటే

కమిషన్‌లోని సభ్యుల్లో కొందరు ఆయా దేశాల రిజర్వ్‌బ్యాంకుల గవర్నర్లు, ఆర్థికమంత్రులు, ఉన్నత విద్యావంతులు. జెనీవా, న్యూయార్క్, కౌలా లంపూర్, బెర్లిన్, ద హేగ్ వంటి నగరాల్లో మా సమావేశాలు క్రమం తప్పక జరిగేవి.

ముందుగా కొన్ని ప్రశ్నలకు సమాధానాలను విశ్లేషించడంతో మా పని మొదలయ్యింది. అసలు గ్లోబల్ క్రైసిస్ ఎందుకు సంభవించింది? ఆర్థిక విధానాల్లో ఎక్కడ లోపాలున్నాయి? అంతర్జాతీయ స్థాయిలో ఏయే ఒప్పందాలు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయి? ఏవి ఈ సంక్షోభానికి దారితీశాయి? అస్థిరత ఎక్కడ మొదలైంది? ఇకపై ఏం చెయ్యాలి? మరోసారి ఇలాంటిది జరగకుండా తీసుకోవలసిన చర్యలేమిటి? సంస్కరణలు ఎలాంటివి? నియంత్రణ వ్యవస్థలు ఎలా ఉండాలి? వాటికి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు ఎలాంటి భరోసానివ్వగలవు... ఈ తరహా ఆలోచనలను మథించాం.

ప్రపంచవ్యాప్తంగా ఎకనామిక్ గ్లోబలైజేషన్ అందుకున్న వేగాన్ని రాజకీయ వ్యవస్థలు అందుకోలేదు. చాలా దేశాల్లో ఆర్థిక అంతరాలు ప్రస్ఫుటంగా పెరుగుతున్నాయి. వివిధ దేశాల ఆర్థికవ్యవస్థలన్నీ ఒకలాగ లేవు. వాటి బలాబలాలు, ఎదుర్కొంటున్న సమస్యలు విభిన్నమైనవి. కాని ప్రపంచీకరణ వల్ల అవన్నీ ఒకదానితో ఒకటి ఎంతోకొంత అనుసంధానమై, ఆధారపడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో సంక్షోభాన్ని ఏదో కొన్ని దేశాలకు, ఒక ప్రాంతానికి పరిమితమైనదిగా చూడకూడదు. దాన్ని అధ్యయనం చేసేటప్పుడు పూర్తిస్థాయి అంతర్జాతీయ దృక్పథాన్ని కనబరచక తప్పదు. అనేక అంశాలను క్రోడీకరించి విశ్లేషించాక, స్టిగ్లిజ్ కమిషన్ ఆర్థిక వ్యవస్థల మెరుగుదలకు విలువైన సూచనలు చేసింది. ప్రపంచీకరణ దుష్ప్రభావాలను తగ్గిస్తూ దాని ప్రయోజనాలు మాత్రం అందరికీ అందే చర్యలను ప్రతిపాదించింది మా కమిషన్.

2009 జనరల్ అసెంబ్లీలో మా నివేదికను చర్చించి ఒక స్టేట్‌మెంట్‌ను విడుదల చేసింది ఐక్యరాజ్యసమితి. తమ పరిధిలోని అంశాల్లోకి ఐక్యరాజ్యసమితి కలగజేసుకోవడం పట్ల అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్), ప్రపంచబ్యాంకు వంటి సంస్థలు అసౌకర్యంగా ఫీలయ్యాయి. కమిషన్ రికమెండేషన్లను గుర్తించినా కూడా, దానిమీద వాళ్లే చర్యలూ తీసుకోలేదు. కాని మా కృషి వాళ్లలో ఆత్మపరిశీలనను రేకెత్తించిందని చెప్పుకోవచ్చు.

స్టిగ్లిజ్ కమిషన్‌లో పనిచెయ్యడం వల్ల చిరస్థాయిగా నిలిచే మంచి వ్యక్తుల స్నేహం పొందగలిగాను. డబ్బు, ఆర్థికవిధానాలు, భారతదేశం ఈ పరిధులను దాటి విశాలమైన ప్రపంచం వైపు దృష్టి సారించే అవకాశం కలిగింది.

## ఐఎమ్ఎఫ్ బాధ్యత ఎంత?

తన సభ్యదేశాల ఆర్థికవ్యవస్థలు ఎలా నడుస్తున్నాయి, వాటికేమైనా ప్రమాదాలు పొంచి ఉన్నాయా – అన్నవాటిని నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత ఐఎమ్ఎఫ్‌కు ఉంది. మరి ఆ బాధ్యతను నెరవేర్చడంలో ఆ సంస్థ ఎక్కడ, ఎందుకు విఫలమయ్యింది? దీన్ని విశ్లేషించడానికి ఐఎమ్ఎఫ్‌లోని ఇండిపెండెంట్ ఎవాల్యుయేషన్ ఆఫీస్ (ఐఈఓ) నడుంబిగించింది. దానికోసం ఓ అడ్వైజరీ గ్రూపును ఏర్పరచింది. అందులో పదిమంది సభ్యులు. అనుభవజ్ఞులైన ఆర్థికవేత్తలు, దాదాపు అందరూ ఆయా దేశాల రిజర్వ్ బ్యాంకుల గవర్నర్లుగా పనిచేసినవారే. ఆ బృందంలో నేనూ ఒకణ్ణి. మేమంతా విశ్లేషించి, రూపొందించిన నమూనా నివేదికను 2010 అక్టోబరు 5న పారిస్‌లో సమావేశమై చర్చించాం.

మాకు ప్రముఖంగా తోచింది ఏమంటే – ఐఎమ్ఎఫ్ ఆర్థిక అంశాల విశ్లేషణలో బలహీనపడిందని! ఫైనాన్షియల్ – రియల్ సెక్టార్ల మధ్య సంబంధాలను విశ్లేషించడంలో అది విఫలమైంది. ముందే కొందరు హెచ్చరించినా పెడచెవిన పెట్టింది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలు సంక్షోభం బారిన పడే అవకాశమే ఉండదని భావించింది.

ఆర్థికవేత్తలు అప్రియమైనా సత్యాన్ని చెప్పాలని, ఐఎమ్ఎఫ్ తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, పారదర్శకంగా వ్యవహరిస్తూ, ఇతరుల విశ్లేషణలను సైతం జాగ్రత్తగా వినాలని సూచించాం. అప్పటివరకూ అది అవలంబిస్తూ వచ్చిన సంస్కృతి, మోడల్స్ మారాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పాం.

దీనితర్వాత అంతర్జాతీయ సంక్షోభం నేపథ్యంలో తన పాత్ర గురించి మరింత అర్థం చేసుకునేందుకు 2011 మార్చిలో ఐఎమ్ఎఫ్ ఒక భారీ సమావేశాన్ని నిర్వహించింది. దానికి ప్రపంచ ప్రఖ్యాత అర్థశాస్త్ర పండితులను ఆహ్వానించింది. ఎకనామిక్ కౌన్సిలర్ ఓలివర్ బ్లాన్షార్డ్ దీన్ని ముందుండి నడిపించారు.

'క్రైసిస్‌కు పూర్వమున్న పరిస్థితి వేరు. తర్వాతి స్థితిగతులు వేరు. అప్పుడు వేసుకున్న ప్రశ్నలే వేసుకుని, అవే సమాధానాలు వస్తే, మరోసారి సంక్షోభం బారిన పడతాం, అంతే. మారిన పరిస్థితులను అర్థం చేసుకుని, మనల్ని మనం కొత్త ప్రశ్నలు వేసుకోవాలి. ఫైనాన్షియల్ సెక్టార్ పాలసీలు మానెటరీ, ఫిస్కల్ విధానాలను ప్రభావితం చేస్తాయి. వాటిమధ్యనున్న ఆ సంబంధాలను అర్థం చేసుకోవాలి. మనలాగే అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలూ ఒకలాగ ఉండవు, సమస్యలకు ఒకలాగ స్పందించవు. అలాంటప్పుడు అన్నిటినీ ఒకేగాటన కట్టి ఒకే తరహా నిబంధనలు సూచించడం కుదరదు. ప్రతి దేశమూ జాతీయ – అంతర్జాతీయ పరిస్థితులను బేరీజు వేస్తూ ముందుకు సాగాలి..' అని నేను చెప్పాను. చివర్లో బ్లాంచార్డ్ కూడా ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తూ – రాజకీయ ప్రభావాలను దృష్టిలో పెట్టుకోవాలని, కొత్త ఉపకరణాలను వాడటానికి ముందుకురావాలనీ అన్నారు.

## కరెన్సీ నాది – సమస్య మీది

స్టిగ్లిజ్ కమిషన్, ఐఎమ్ఎఫ్ సమావేశ నివేదికల వల్ల స్పష్టంగా తెలిసింది ఏమంటే – ఆర్థికరంగంలో ప్రపంచీకరణ శరవేగంగా జరుగుతున్నప్పుడు కొత్తగా

పుట్టుకొస్తున్న సవాళ్లను ఎదుర్కొనే శక్తియుక్తులు అంతర్జాతీయ ద్రవ్య వ్యవస్థకు లేదు – అనేదే. 2010లో టొరంటోలో సమావేశమైన ఇరవై దేశాల కూటమి – జి 20 దాన్ని గ్రహించింది. మరోసారి సంక్షోభం బారిన పడకుండా ఉండేలా సమర్థమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాల్సిన అవసరాన్ని అది గుర్తించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు సర్కోజీ చొరవ చేసి, పదిమంది నిపుణులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి సలహా అడిగారు. దానికి సంబంధించి 2011లో సమావేశాన్ని నిర్వహించారు. దానికి ఆహ్వానిస్తే నేనూ వెళ్లాను. అక్కడ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికన్ డాలరు పోషిస్తున్న పాత్ర గురించి చర్చించాం.

అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభంలో మానెటరీ నాన్ సిస్టమ్ ప్రధాన పాత్ర పోషించిందన్నది అందరికీ అర్థమయ్యింది. అంటే – ప్రపంచవ్యాప్తంగా వ్యాపార వాణిజ్యాలు, ఆస్తులు, విదేశీమారకనిల్వలు – అన్నిటినీ అమెరికన్ డాలర్లలోనే విలువ కడుతుంది ప్రపంచం. ఒక్కమాటలో చెప్పాలంటే అది గ్లోబల్ కరెన్సీ అయిపోయింది. దానివల్ల ఇంటాబయటా పెరిగే డిమాండును అమెరికా తట్టుకోగలగాలి. డాలరు గ్లోబల్ కరెన్సీ కావడం, అది పూర్తిగా అమెరికా చెప్పుచేతల్లో ఉండటం తమకు గర్వకారణం, ప్రయోజనకరం అని కొందరనుకుంటారు. అదేం కాదు, అలా కావడం పెనుభారమని మరికొందరి భావన. తనది కాని భారాన్ని ఇష్టంగానో, అయిష్టంగానో తలకెత్తుకున్న డాలర్ పాత్రనే మానెటరీ నాన్ సిస్టమ్ అంటారు. దానికి ప్రత్యామ్నాయం ఏమిటి? దీన్ని అన్వేషించడానికి 'పాలాయిస్ – రాయల్ కమిటీ' ఏర్పడింది. అందులో సభ్యుడిగా నేను విలువైన విషయాలను తెలుసుకున్నాను.

డాలరుకు ప్రత్యామ్నాయం ఉండాలన్న ఆలోచనను చైనా, యూరప్ గట్టిగా ప్రతిపాదించాయి. అమెరికాలో కూడా అటువైపే మొగ్గారు. కాని అమెరికా మాత్రం తన పద్ధతి వల్ల లాభమోనష్టమో ఏదున్నా దాన్ని కొనసాగించడానికే ఇష్టపడిందిగాని మార్పు రావాలని కోరుకోలేదు. ఒక్కముక్కలో చెప్పాలంటే 'కరెన్సీ నాది – సమస్య మీది' అన్న ధోరణిని అమెరికా కొనసాగించింది.

## మన దేశ పరిస్థితులు..

గ్లోబల్ క్రైసిస్ మన దేశాన్ని మరీ అంతగా అతలాకుతలం చెయ్యలేదనే చెప్పుకోవచ్చు. ఎందుకంటే మన ఎక్స్‌టర్నల్ అకౌంట్‌లో మరీ ఎక్కువ నిల్వ లేదా మరీ లోటు లేకుండా జాగ్రత్తపడ్డాం. మన విదేశీమారకద్రవ్యనిల్వలు ప్రమాణాలకు

తగినట్టు ఉన్నాయి. రెండోది, మన మానెటరీ పాలసీ అనేది కేవలం ద్రవ్యోల్బణాన్ని అదుపు చెయ్యడం ఒక్కటే లక్ష్యంగా అప్పుడు పెట్టుకోలేదు. ఎక్స్టర్నల్ – ఫైనాన్షియల్ సెక్టార్లు నిలకడగా ఉండటం మీద దృష్టిపెట్టాం. మన జీడీపీ 9 శాతానికి మించుతున్నప్పుడు 'ఓవర్ హీటింగ్'ను గుర్తించి అదుపు చేశాం. క్యాపిటల్ ఫ్లోస్ స్థిరంగా లేనప్పుడు 'మార్కెట్ స్టెబిలైజేషన్ స్కీమ్'ను ప్రవేశపెట్టాం. బ్యాంకింగ్ రంగం, క్రెడిట్ కల్చర్ బలపడే చర్యలు తీసుకున్నాం. మనం అవలంబించిన కౌంటర్ సైక్లికల్ పాలసీల వల్ల మనం సంక్షోభం కోరలకు చిక్కకుండా తప్పించుకున్నాం.

అసలు సమస్య అభివృద్ధి చెందిన దేశాల్లో ఉంది. కాని కాపిటల్ ఇక్కడ నుంచి తరలిపోయింది. అందువల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్ని కొరియా, సింగపూర్ వంటివి ఎక్కువ ఇబ్బందులపాలయ్యాయి.

కాపిటల్ తరలిపోవడం వల్ల సంక్షోభ సమయంలో అక్టోబరుకల్లా మన ఫైనాన్షియల్ మార్కెట్లు (వీటిలో ఈక్విటీ, మనీ, ఫారిన్ ఎక్స్ఛేంజ్, క్రెడిట్ మార్కెట్లు ఉంటాయి) ఊగిసలాడాయి. కాల్మనీ మార్కెట్ స్తంభించిపోయింది. మన ఎగుమతులు తగ్గిపోయాయి. పారిశ్రామిక పెరుగుదల క్షీణించింది. ఎక్స్టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్, ట్రేడ్ క్రెడిట్ – అంటే అప్పులు పెరిగాయి. జీడీపీ కాస్త తగ్గింది. ఆ సమయంలో రిజర్వ్ బ్యాంక్ గవర్నర్గా దువ్వూరి సుబ్బారావు వచ్చారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో, మార్కెట్లకు అవసరమైన ఉద్దీపన (స్టిమ్యులస్) ఇవ్వడంలో ఆయన ప్రభుత్వంతో కలిసి నడిచారు.

సంక్షోభానికి ముందు – సంక్షోభానికి తర్వాత ఆర్బీఐ తీసుకున్న విధాన నిర్ణయాల పట్ల విమర్శలు రాకపోలేదు. కౌంటర్ సైక్లికల్ పాలసీలు ఎంతసేపూ రక్షణ చర్యల గురించే ఆలోచించాయి తప్ప, అభివృద్ధిపథంలో దూసుకుపోవడం మీద దృష్టిపెట్టలేదన్నది వాటిలో ప్రధానమైనది. ఫైనాన్షియల్ సెక్టార్ విషయంలో నేను అవలంబించిన నియంత్రణ చర్యలు మరీ సంప్రదాయమైనవని, వాటివల్లే ఆ మార్కెట్లు అనుకున్నంతగా అభివృద్ధి చెందలేదని, అసలు మొత్తం ఆర్థిక అభివృద్ధికే నేను అడ్డుకట్ట వేశానంటూ కొందరు దుయ్యబట్టారు.

ఇక సంక్షోభ సమయంలో ఆర్బీఐ అందించిన ఆర్థిక ఉద్దీపనలను విమర్శించారు. సంక్షోభ ప్రభావం పెద్దగా లేకపోయినా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనవసరంగా స్టిమ్యులస్ ఇచ్చారన్నది వాటిలో ప్రధానం. ఆర్థిక ఉద్దీపనతో పాటు

ప్రభుత్వం ప్రకటించి ఫిస్కల్ స్టిమ్యులస్ (ద్రవ్య ఉద్దీపన), నియంత్రణలను తగ్గించిన తీరు – ఇవి విమర్శల పాలయ్యాయి.

సంక్షోభం మొదలై ఇప్పటికి ఎనిమిదేళ్లయ్యింది. అంతకు ముందు ఎనిమిదేళ్లూ కలిపి వెరసి గడచిన 15 – 16 ఏళ్ల సమయాన్ని చూస్తే, అభివృద్ధితో పాటు స్థిరత్వం మనదగ్గరే ఎక్కువగా కనిపిస్తుంది. సమస్యలూ కొన్ని లేకపోలేదు.

## కొత్త ఆలోచనలు అవసరం

ఆర్థికశాస్త్రాన్ని కొత్త పద్ధతుల్లో చదవాలని, విభిన్నంగా అర్థం చేసుకోవాలన్న ఆలోచన అందర్లోనూ వచ్చింది, సంక్షోభం తర్వాత! దాని కోసం 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ న్యూ ఎకనామిక్ థింకింగ్' (ఐనెట్) ఏర్పడింది. ఐనెట్‌కు సంబంధించిన అడ్వైజరీ గ్రూపులో నేనూ ఉన్నాను, వాళ్ల సమావేశాలకు హాజరవడంలో కొత్త విషయాలను తెలుసుకోగలిగాను.

ప్రయాణాలు, సమావేశాలు – వీటన్నిటి మధ్యా నాకు గుండెకు సంబంధించిన ఇబ్బంది తలెత్తింది. శస్త్రచికిత్స అవసరమన్నారు వైద్యులు. కాని ముందు కొంత కాలం మందులు వాడి చూద్దామనుకున్నాం.

ఆరోగ్యానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే నేను అకడెమిక్ పని కొనసాగించాను. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా అక్కడ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నెలకొల్పడానికి కృషి చేశాను. గ్లోబల్ క్రైసిస్ ఇచ్చిన అవగాహనతో నాలుగు పుస్తకాలు రాశాను. పుట్టపర్తిలోని సత్యసాయి విశ్వవిద్యాలయం, ఐఐటీ మద్రాసు, కొలంబియా యూనివర్సిటీల్లో లెక్చర్లు ఇస్తూ ప్రొఫెసర్లతో, విద్యార్థులతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, ఫైనాన్షియల్ ఆర్కిటెక్చర్ మీద నా ఆలోచనలను పంచుకునేవాణ్ణి.

## అంతులేని క్రైసిస్

గ్లోబల్ క్రైసిస్ నుంచి ఏం నేర్చుకున్నాం, సంక్షోభాన్ని నిలవరించడానికి తీసుకున్న చర్యల పర్యవసానాలు ఎలా ఉంటాయి, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితుల మీద సంక్షోభం ఎలాంటి ప్రభావం చూపించింది – వీటిని క్షుణ్ణంగా తెలుసుకుంటే మన ఆర్థిక విధానాలు ఎలా ఉండాలో అర్థమవుతుంది.

ఇంతకూ గ్లోబల్ క్రైసిస్ అంతమయిపోయిందని చెప్పడానికి లేదు. అగ్రదేశాల్లో ఇప్పటికీ వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయి, నిరుద్యోగం ఎక్కువగా ఉంది. ఉత్పత్తి పెరగలేదు, అభివృద్ధి బాట పట్టలేదు. అసలు అన్ని దేశాలూ సంక్షోభం నుంచి ఒక్క తీరున కోలుకోలేదు, కొన్ని తొందరగా కోలుకున్నాయి, మరికొన్ని దేశాల మీద సంక్షోభం ప్రభావం ఇప్పటికీ ఏదోరకంగా కనిపిస్తూనే ఉన్నాయి. అలాగే మానెటరీ నాన్ సిస్టమ్ – అంటే అమెరికన్ డాలరు ఆధిపత్యం తొలగిపోవడం ఇప్పట్లో అయ్యేది కాదు. దానికి బలమైన ప్రత్యామ్నాయ వ్యవస్థ ఇంకా రూపుదిద్దుకోలేదు. గ్లోబల్ కరెన్సీ అన్న భావన బాగుంటుంది కాని దాన్ని నియంత్రించేందుకు, నిర్వహించేందుకు తగిన వ్యవస్థ లేనప్పుడు అది సాధ్యమయ్యే పని కాదు.

ఐఎమ్ఎఫ్, ప్రపంచ బ్యాంకు, జి 20 లతో కూడిన ఫైనాన్షియల్ ఆర్కిటెక్చర్‌కు కొన్ని పరిమితులున్నాయి. భవిష్యత్తులోనూ ఈ సంస్థలు గొప్ప పాత్రను పోషిస్తాయన్న నమ్మకమేమీ లేదు.

లావాదేవీలు – సమస్యలు అంతర్జాతీయ స్థాయిలో జరుగుతూ ఉంటే, వాటిని నిర్వహించాల్సిన లేదా పరిష్కారాలు చూపవలసిన వ్యవస్థల (ఫైనాన్షియల్ సిస్టమ్స్) ను మాత్రం ఏ దేశానికి ఆ దేశం విడివిడిగా ఉంచుతోంది. ఆర్థిక వ్యవహారాలను పరిష్కరించడానికి అంతర్జాతీయ స్థాయి న్యాయస్థానాలు, చట్టాలు లేవు.

ప్రపంచంలో అధికారం పడమటి నుంచి తూర్పు దేశాలకు – అంటే అమెరికా నుంచి ఆసియా ఖండానికి మారిపోతుందని అందరూ అంచనా వేస్తున్నారుగాని, అదికూడా ఇప్పటికిప్పుడే అయ్యే పని కాదు.

ఉదాహరణకు చైనా సూపర్ పవర్‌గా ఎదుగుతుందని, అమెరికాను మించిపోతుందని అంటారు కొందరు. అది సుదూర స్వప్నమే. ఎందుకంటే సరుకుల ఉత్పత్తి పెరగడం, వాటిని ఎగుమతి చెయ్యడం ముఖ్యమైన అంశాలేగాని, నైపుణ్యమూ, సమర్థతా కలగలిసిన మానవ వనరులను తయారుచెయ్యడం, ఇబ్బందులను తట్టుకోగలిగే బలమైన వ్యవస్థలను రూపొందించడం – వాటికన్న ఎంతో ముఖ్యమైన కార్యం. ఆసియా దేశాల్లో అది జరగవలసినంత వేగంగా, పద్ధతిగా జరగడం లేదు. పనిచేసేవారి శక్తిసామర్థ్యాలు, నైపుణ్యాలు పరిగణనలోకి తీసుకున్నప్పుడు పాశ్చాత్య దేశాలు మనకన్నా ఎంతో ముందున్నాయి.

అధికార కేంద్రం ప్రపంచంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారడం ఆషామాషీ విషయమేం కాదు. దానికి దోహదం చేసే సామాజిక సాంస్కృతిక అంశాలెన్నో ఉంటాయి. ఆర్థిక శక్తి కేంద్రం వాటిమీద ఆధారపడి ఉంటుంది. అది మారడానికి ముందు, విభిన్న సమాజాలు, సంస్కృతులు తీవ్రమైన మార్పులకు లోనవుతాయి. దానివల్ల రకరకాల సమస్యలు తలెత్తుతాయి. వాటిని తట్టుకొని ముందుకెళితేనే సూపర్ పవర్‌గా ఆవిర్భవించగలదు ఒక దేశం. ఇదంతా మన దేశానికీ వర్తిస్తుంది.

**ఇక ఓపిక లేదు**

ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త పీర్ జాకబ్‌సన్ లెక్చర్ ఇవ్వమంటూ ఆహ్వానం రావడం చాలా విశిష్టమైనది. నాకా అవకాశం 2012 జూన్ 14న వచ్చింది. స్విట్జర్లాండ్‌లోని భాసిల్‌లో సెంట్రల్ బ్యాంకు గవర్నర్ల సమావేశంలో ఉపన్యసించాను.

'రాజకీయ, ఆర్థిక రంగాలు తక్షణ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తాయి. కాని నాకు ఆర్థిక రంగ ప్రగతి అంటే సమాజ ప్రగతే. సామాన్యుల అభివృద్ధి కోసమే ఆర్థిక విధానాల రూపకల్పన సాగాలి. ఏం చేసినా అది సమాజం కోసమే అన్న స్పృహతో సాగాలి ఆర్థిక నిపుణులు. అది నా నమ్మకం' అంటూ చెప్పాను.

ఆ తర్వాత 'అమ్మయ్య, ఇకచాలు, ఓపికలేదు' అని – 'ఇదే నా లాస్ట్ లెక్చర్' అనుకున్నా.

గడచిన ఐదేళ్ల కాలాన్ని సింహావలోకనం చేసుకున్నాను.

రిజర్వ్‌బ్యాంకు గవర్నర్‌గా రిటైరయ్యాక తీరిగ్గా కాలాన్ని గడపాలన్న నా ప్రణాళిక అంతా తలకిందులయింది. రిటైరయిన కొన్ని వారాల్లోనే నేను పనిలోకి దిగాను, 2012 వరకూ నాలుగేళ్లపాటు పనిలోనే తలమునకలుగా ఉన్నాను. ఒక్కటే తేడా. నాకు పని ఉంది – ఉద్యోగం లేదు. నేనెవరికీ బాసును కాను, నాకెవరూ బాస్ లేరు. అన్నిటికీ మించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పుష్కలంగా లభించింది. అంతర్జాతీయంగా భిన్నమైన దృక్కోణాలను, పాలసీమేకింగ్ పద్ధతులను తెలుసుకునే వీలు కలిగింది. ప్రభుత్వంలో నిర్దిష్టంగా ఒక పదవిలో అంటూ లేనుగాని, వాళ్లకు అవసరమైనప్పుడల్లా సలహాలనిస్తూ వచ్చాను. మా అమ్మ తరచూ అనేది 'క్షణం తీరిక లేదు, దమ్మిడీ ఆదాయం లేదు అన్న సామెత లాగా ఉంటుందిరా నీ పని..' అని. ఆ ఐదేళ్లూ అలాగే గడిచాయి.

# ఆటతీరు మారిందా?

అది జులై 2012. కెనడాలోని టొరంటోలో మా మనవరాళ్లిద్దరితో ప్రశాంతంగా గడుపుతూ ఉండగా ఫైనాన్స్ సెక్రెటరీ గోపాలన్ నాకు ఫోన్ చేశారు.

'పద్నాలుగో ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా ఉండటానికి మీ అంగీకారం తీసుకోమని ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చెప్పారు..' అన్నారాయన.

'అరె, దానిగురించి నాకేమీ తెలియదే.. అయినా ఈ వయసులో నేనంత భారాన్ని నిర్వహించలేను. ఆ విషయం ఆయనకు నెమ్మదిగా చెప్పండి..' అన్నాను గోపాలన్‌తో.

'నేను చెప్పడం బాగుండదు. ముఖాముఖి కలిసినప్పుడు మీరే చెబితే బాగుంటుంది..' అని సూచించారాయన.

నేను కెనడా నుంచి తిరిగొచ్చాక ఢిల్లీలో ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌ను కలిశాను. అప్పుడు వారు ఆర్థికమంత్రి కూడా. ఫైనాన్స్ కమిషన్ గురించి ప్రస్తావిస్తూ, 'నా పేరు ప్రతిపాదించినప్పుడు నన్నెవరూ సంప్రదించనే లేదు సర్' అన్నాను.

'అప్పటి ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీకి మీ తరపున నేను అంగీకారం ఇచ్చేశాను. దానితర్వాతనే ఆయన మీ పేరు ప్రతిపాదించారు...' అన్నారాయన నవ్వుతూ.

కాసేపు వేరే విషయాలు మాట్లాడుకున్నాక ముగింపు సమయంలో మళ్లీ ఫైనాన్స్ కమిషన్ ప్రస్తావన తెచ్చాను. ' నా ఆరోగ్యం సంగతి మీకు తెలుసు కదా సర్' అంటూ నేను హైదరాబాద్‌లో స్థిరపడ్డానని చెబుతూ 'నన్నేం చెయ్యమంటారు?' అనడిగాను.

'గోపాలన్‌కు మీ అంగీకారం తెలియజెయ్యండి..' అన్నారాయన. ఆ తర్వాత కమిషన్ చెయ్యాల్సిన పని గురించి మాట్లాడారు. ఈ సంభాషణ అయిన కొద్ది రోజుల్లో పి. చిదంబరం ఆర్థికమంత్రి అయ్యారు. ఆ తర్వాత కొద్ది నెలలు ఉలుకూపలుకూ లేదు.

రాజకీయపరంగా చూస్తే, అప్పుడున్న ముఖ్యమంత్రుల్లో ఓ ముగ్గురు నలుగురు తాము ప్రధానికి సమానమన్న ధోరణిలో ఉన్నారు. కేంద్ర నాయకత్వాన్ని సవాలు

చేస్తున్నారు. భావజాలపరంగా చూసినప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండాలా – సోషలిజమా అన్న ప్రశ్న లేదు. వామపక్షమా – విపక్షమా అన్న మీమాంస లేదు. మహలనోబిస్ మోడలా – బ్రహ్మానంద మోడలా అన్న చర్చలు కాకుండా, అభివృద్ధికి బీహార్ మోడలా, గుజరాత్ మోడలా, తమిళనాడు మోడలా అని చర్చించుకుంటున్న సమయమది.

గ్లోబల్ క్రైసిస్ ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి, వాణిజ్యాల మీద ప్రభావాన్ని చూపిస్తోంది. మన ఆర్థికవ్యవస్థ గురించి అంతకు ముందు అనుకున్నవి సరైనవి కావనే గ్రహింపు కలిగింది. వివిధ విషయాల్లో అనిశ్చితి తీవ్రంగా ఉంది. రాష్ట్రాలు క్రమశిక్షణ పాటించి తమ ఆర్థిక పరిస్థితులను అభివృద్ధిపథంలో నడిపించుకున్నాయి. అదే సమయంలో కేంద్ర ఆర్థిక పరిస్థితి అంత మెరుగ్గా లేదు.

'ఈ నేపథ్యంలో కేంద్ర – రాష్ట్రాల మధ్య సంబంధాలను రీబ్యాలెన్స్ చెయ్యడం పద్నాలుగో ఆర్థిక సంఘం తక్షణ కర్తవ్యం. ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా ఉండే వ్యక్తి అన్ని రాజకీయ పార్టీలకూ సమ్మతమై ఉండాలి. అందరూ గౌరవించదగ్గ వ్యక్తిత్వం ఉండాలి' అంటూ నన్ను ఒప్పించారు.

ఆ తర్వాత నవంబరులో నేను లండన్‌లో ఉండగా ఆర్థికమంత్రి చిదంబరం ఫోన్ చేసి 'పద్నాలుగో ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా మిమ్మల్ని ఆధికారికంగా ఆహ్వానిస్తున్నాను. ఆర్థిక సంఘంలో సభ్యులెవరుండాలి, విధివిధానాలేమిటో మాట్లాడాలి రండి' అంటూ పిలిచారు. అప్పటికే ప్రధానితో మాట్లాడి ఉన్నాను కాబట్టి, 'మీరేది నిర్ణయిస్తే అదే..' అంటూ ఒక్కముక్కలో తేల్చేశాను. అలా పద్నాలుగో ఆర్థిక సంఘానికి ఛైర్మన్నయ్యాను నేను!

పదో సంఘం వరకూ అనుభవజ్ఞులైన రాజకీయనాయకులు, మాజీ ముఖ్యమంత్రులు ఛైర్మన్లుగా వ్యవహరించారు. ఒక రిటైర్డ్ జడ్జి, ఓ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కూడా ఛైర్మన్‌గా ఉన్నారు. కాని ఐఏఎస్‌ల నుంచి మొదటిసారిగా ఛైర్మన్ అయింది నేనే. ఈ మాటన్నానో లేదో 'ఆ, ఐఏఎస్‌లు తమ కులంలో మిమ్మల్ని కలుపుకోవడం మానేసి చాలా కాలమైంది లెండి..' అంటూ నవ్వారు చిదంబరం.

ఆర్థిక సంఘంలో ఛైర్మన్‌గాక నలుగురు నిపుణులు సభ్యులుగా ఉంటారు. మా కమిషన్‌లో ప్రొఫెసర్ ఎమ్. గోవిందరావు, ప్రొఫెసర్ సుదీప్తో మండెల్, మరో ప్రొఫెసర్ అభిజిత్ సేన్ – ముగ్గురూ ఆర్థిక రంగంలో నిష్ణాతులు. ఐఏఎస్ అధికారిణి

సుష్మానాథ్ (ఫైనాన్స్ సెక్రెటరీ) సభ్యులు. కమిషన్ రికమెండేషన్ ప్రకారం డాక్టర్ పినాకి చక్రవర్తిని ఎకనామిక్ అడ్వైజర్‌గా నియమించింది ప్రభుత్వం.

పని ప్రారంభించే ముందు మేమంతా మాట్లాడుకుంటున్నాం. 'మనం ఎంత విలువైన సూచనలు చేసినా అందరినీ సమానంగా సంతోషపెట్టడం అయ్యే పని కాదు. కాని కొందరికి సంతోషం, కొందరికి దుఃఖం కాకుండా, అసంతృప్తిని అందరికీ సమానంగా పంచుదాం' అని హాస్యంగా చెప్పాన్నేను.

మా సంఘం 2013 జనవరి 2న ఏర్పాటైంది. 2014 అక్టోబరు వరకు దాని పదవీకాలం.

## ప్రశ్నలతో ప్రారంభించాం..

కమిషన్ పనిని మూడు దశలుగా విభజించి చెప్పుకోవచ్చు. అసలు సరైన ప్రశ్నలేమిటి? వేటికి సమాధానాలు రాబట్టాలి అనేది ముందు నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వాలు, నాయకులను, కేంద్ర ప్రభుత్వ శాఖలను కలవడం, వినడం, అర్థం చేసుకోవడం రెండో దశ. వీటి ఆధారంగా చెయ్యాల్సిన సూత్రీకరణల గురించి చర్చించడం, ఏకాభిప్రాయానికి రావడం మూడో దశ.

కేంద్ర – రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండే ఆర్థిక సంబంధాల గురించి అధ్యయనం చేసి. 1970లు, 80ల్లో నేనొక అవగాహన ఏర్పరచుకున్నాను. 90ల్లో ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో ఆ రెండిటి మధ్యా బ్యాలెన్స్ మారి, మల్టీలెవెల్ ప్లానింగ్ దృష్టితో చూడాల్సిన అవసరం కనిపించింది. అనేక కోణాల్లోంచి చూసినప్పుడు రాష్ట్రాల పరిధి విస్తృతం కావాలి, కేంద్రం మీద ఆధారపడటం తగ్గాలి. ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం ఉంటేనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నది నా అభిప్రాయం.

మా కమిషన్ ముందు ఎన్నో ప్రశ్నలు.

కేంద్రం, రాష్ట్రాల అవసరాలు వేర్వేరు. వాటికి తగినన్ని నిధులు, వనరులు ఉన్నాయా? వీటి గురించి పూర్వం పనిచేసిన జాతీయ కమిటీలు ఏం చెప్పాయి? అవి మా కమిషన్‌కు ఎంతవరకూ ఉపయోగపడతాయి? నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, ప్లానింగ్ కమిషన్ వంటివి కేంద్ర – రాష్ట్రాల సంబంధాలను ఎంతవరకూ ప్రభావితం చే స్తున్నాయి? విద్య, వైద్యం, ఉపాధి వంటి విషయాల్లో పథకాలను రూపొందించడానికి తగిన పరిజ్ఞానం రాష్ట్రాలకు ఎక్కువా – కేంద్రానికా? అడవులు,

స్పెక్ట్రమ్ కేటాయింపులు, బొగ్గు వేలం వంటి కేంద్ర చర్యల వల్ల రాష్ట్రాల మీద ఎలాంటి భారం పడుతుంది? దేనికెంత కేటాయింపులు జరగాలనేది ఫైనాన్స్ కమిషన్ ఎలా నిర్ణయించగలుగుతుంది? ఇలాంటి మౌలికమైన ప్రశ్నలను లేవనెత్తాను నేను. ఇవే కాదు, ఇంకా ఎన్నో ప్రశ్నలు. అందువల్ల కమిషన్ మొదటి దశలో వీటికి సరైన సమాధానాలు వెతకడంలో నిమగ్నమైంది.

రెండో దశలో కమిషన్ రాష్ట్రాల్లో పర్యటనకు పూనుకుంది. వెళ్లబోయే రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక స్థితిగతులను పూర్తిగా అధ్యయనం చేసి, అకౌంటెంట్ జనరల్‌తో సమావేశమై మరీ వెళ్లేవాళ్లం. రాష్ట్రాలతో సమావేశాలు మాకు మరపురాని మంచి అనుభవాలు!

మొత్తం 28 రాష్ట్రాలు – ఆంధ్రా తెలంగాణ విడిపోవడంతో ఆ సంఖ్య 29కి పెరిగింది. ప్రతి రాజధానిలోనూ రెండుమూడు రోజులుండి కనీసం నాలుగు సమావేశాలు నిర్వహించేవాళ్లం. రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, స్థానిక నాయకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలు – ఇలా అందరినీ కలిసేవాళ్లం. చివరకు ముఖ్యమంత్రితో సమావేశమై వాళ్ల ఆలోచన లేమిటో తెలుసుకునేవాళ్లం. కొన్నిసార్లు కొందరు కమిషన్ పరిధిలో లేని విషయాలను ప్రస్తావించేవారు. ఎవ్వరేం చెప్పినా శ్రద్ధగా ఆలకించడమే మా పనిగా పెట్టుకున్నాం. ఏదో సంజాయిషీ కోరుతున్నట్టుగాక, తమ సమస్యల పట్ల శ్రద్ధ చూపిస్తున్నందుకు వాళ్లంతా చాలా సంతోషించేవాళ్లు.

## ముఖ్యమంత్రుల ముచ్చట్లు

ఎక్కడికి వెళ్లినా, అక్కడి ముఖ్యమంత్రి నేపథ్యం, అనుభవం, ఆలోచనల తీరు అన్నీ ముందుగానే తెలుసుకునేవాణ్ణి. దానివల్ల వారితో సంభాషణకు మార్గం సుగమమయ్యేది. మన ముఖ్యమంత్రుల్లో ఎంత వైవిధ్యముందో! వయసు, కులమతాలు, విద్యార్హతలే కాక, రాజకీయ అనుభవం, అవగాహనలు ఎవరివి వారికే ప్రత్యేకం. సీఎమ్‌గా కొందరు చాలా అనుభవజ్ఞులు, మరికొందరు అదే తొలిసారి సీఎమ్ కావడం. అత్యవసర పరిస్థితి విధించినప్పుడు జైలుకెళ్లినవారు కొందరు. స్థానిక పార్టీగా ఆవిర్భవించి తిరుగులేని మెజారిటీని సొంతం చేసుకున్నవారు కొందరు.

ఇక మహిళాముఖ్యమంత్రుల్లో ఒకరికొకరు దేనిలోనూ తీసిపోరు. తమ ప్రాంతం, ప్రజల పట్ల వారికున్న అవగాహన, పరిజ్ఞానం, కమ్యూనికేషన్ – అపారం. ఉదాహరణకు తమిళనాడు సీఎమ్ జయలలిత సమావేశ స్థలానికి ఒక

మహారాణిలాగా వచ్చారు. చేతిలో ఒక్క కాగితమైనా లేకుండానే ఆమె ఆ రాష్ట్ర గణాంకాలను, తమకేం కావాలనేదాన్ని వివరంగా చెప్పడం కమిషన్ సభ్యులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. స్పష్టమైన ఇంగ్లిష్‌లో, చక్కటి ఉచ్చారణతో మాట్లాడిన ఆమె తీరు అందరినీ మంత్రముగ్ధులను చేసింది!

ఇక పశ్చిమబెంగాల్లో మమతా బెనర్జీ అద్భుతమైన ఉపన్యాసాన్నిచ్చారు. చాలా శక్తిమంతమైన మహిళ, అక్కడి పరిస్థితులు, వ్యక్తుల మీద పట్టున్న మనిషి. సామాన్యుల బాగుకు నిబద్ధమైన సీఎమ్ అనిపించారు.

ఇక వసుంధరా రాజె నేను ఆర్‌బీఐ గవర్నర్‌గా ఉన్నప్పుడు తెలుసు. ఆమె చిన్నప్పటి విద్యాభ్యాసం తమిళనాట సాగింది. అందువల్ల ఆమె అప్పట్లో నాతో తమిళంలో మాట్లాడేవారు. విద్యాధికురాలైన ఆమె ముఖ్యమంత్రిగా రాజస్థాన్‌లో రాజకీయ అరాచకాన్ని అదుపులో పెట్టారు. ఏ విషయాన్నయినా ఇట్టే గ్రహించగల తెలివితేటలున్న వసుంధరా రాజె కూడా తన ప్రెజెంటేషన్‌తో కమిషన్‌ను ఆకట్టుకున్నారు.

అప్పటికి గుజరాత్ సీఎమ్‌గా ఉన్న నరేంద్ర మోడీ వ్యవహార శైలి ఒక కార్పొరేట్ సంస్థ సీఈఓలాగా అనిపించింది. అన్ని వివరాలతో ఒక పత్రాన్ని ఆయన ముందుగానే కమిటీకి అందజేశారు. 'మీరంతా అది చదివి ఉంటారు కనుక, మిగిలిన వివరాల్లోకి వెళదాం..' అంటూ సమయాన్ని ఆదా చేశారాయన. కమిషన్ తమకేం చెయ్యగలదో చెబితే వినాలనుకున్నారు. 'మేం వచ్చింది వినడానికే, ఇప్పటికిప్పుడు మీకే అంశంలోనూ హామీలివ్వలేం...' అని చెప్పినా సరే ఆయన పట్టు వదల్లేదు. కమిషన్ సభ్యుల్లో ఎవరు ఏ రంగంలో నిష్ణాతులో ఆయనకు బాగా తెలుసు. అందువల్ల ఆయా రంగాలకు సంబంధించిన వివరాలు వాళ్లకు తెలియజేశారు.

అస్సామ్, నాగాలాండ్ వంటి సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు తమ రాష్ట్ర పరిస్థితులే కాదు, ఇతర దేశాలతో సంబంధాలు, అవి తమను ప్రభావితం చేస్తున్న తీరు మీద కూడా మంచి అవగాహన ఉంది.

వివిధ సీఎమ్‌లు ఫైనాన్స్ కమిషన్‌తో వ్యవహరించిన తీరు కూడా విభిన్నంగా ఉండేది. చాలా ఫార్మల్‌గా లేదా ఇన్‌ఫార్మల్‌గా, లేదా అవసరమైన మటుకే అన్నట్టుండేవారు. కొందరు సమావేశాల తర్వాత లంచ్, డిన్నర్, సాంస్కృతిక కార్యక్రమాల వంటివాటికీ కమిషన్ సభ్యులతో పాటు ఉండేవారు, జోకులేసేవారు.

కొంతమంది మాత్రం తమ పని చక్కబెట్టుకుని వెళ్లిపోయేవారు. కొంతమంది సీఎమ్‌లు ప్రభుత్వాన్ని, అధికారులనూ కార్పొరేట్ శైలిలో నడిపిస్తే, కొందరు తమదే గుత్తాధిపత్యం అన్నట్టు, మరికొందరు ప్రజాస్వామికంగానూ ఉండటాన్ని మేం గమనించాం.

అన్నిచోట్లా రాజకీయ పార్టీలు తమ భావజాలాలకు అనుగుణంగా మాట్లాడేవి. ఒకటిరెండు చోట్ల ప్రతిపక్షాలసలు కమిటీ దగ్గరకు రానేలేదు, మరికొన్నిచోట్ల వచ్చి అధికారపార్టీ గురించి ఫిర్యాదులు చెప్పి వెళ్లాయి. కొన్నిచోట్ల చర్చ చక్కగా సాగితే, మరికొన్నిచోట్ల వాడిగా సాగి వేడెక్కిపోయేది. మొత్తమ్మీద దాదాపుగా అన్ని రాజకీయ పక్షాలూ తమ రాష్ట్ర ప్రయోజనాల కోసమే పట్టుపట్టేవి.

పంచాయితీ, మునిసిపాలిటీల పెద్దలు చెప్పిన విషయాల నుంచి పద్నాలుగో ఆర్థిక సంఘం అనేక విషయాలను గ్రహించగలిగిందని చెప్పడం అతిశయోక్తి కాదు! తమకేం కావాలో, స్థానిక అవసరాలేమిటో వాళ్లకు స్పష్టంగా తెలుసు.

ఇక ఆంధ్రప్రదేశ్‌లో మేం పర్యటించే సమయానికి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అప్పటికి రాజకీయంగా విభేదాలు తీవ్రం కావడంతో ఆ సమావేశంలోనే ఆంధ్ర – తెలంగాణ నాయకులు ఎవరికి వారు తమ వాదనను వినిపించారు. విభజన తర్వాత 'మాకు అన్యాయం జరిగింది' అన్నట్టుగా ఆంధ్ర సీఎమ్ చంద్రబాబునాయుడు వాపోతే, 'ఇకపై జరగాల్సినదిదీ' అంటూ ఒక విస్పష్టమైన ఆలోచనను కమిషన్ ముందు పెట్టారు తెలంగాణ సీఎమ్ కేసీఆర్.

### విభజన చిక్కులిన్నిన్ని కాదయా...

రాష్ట్రాల పరిధులను పునర్నిర్వచించే అధికారం రాజ్యాంగపరంగా కేంద్రానికి ఉంది. మామూలుగా అయితే అది ఆర్థిక సంఘం పనికి అడ్డం రాదు. కాని మా ఫైనాన్స్ కమిషన్ ఏర్పడేనాటికి ఆంధ్రప్రదేశ్ విభజన జరగలేదు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంగానే ఉంది. అందువల్ల మేం ఆంధ్రప్రదేశ్‌ను ఒక రాష్ట్రంగానే పరిగణించాం. 2013 సెప్టెంబరు 11 – 14 తేదీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో సమావేశాలు జరిపింది ఆర్థికసంఘం. కాని మేము నివేదికనిచ్చే ముందే రాష్ట్రవిభజన జరిగింది. చట్టంలోని నిబంధనల ప్రకారం కొత్త రాష్ట్రాలు రెండింటినీ విడివిడిగా పరిగణించి వేర్వేరుగా నివేదిక ఇవ్వాలని రాష్ట్రపతి చెప్పారు. మేం మళ్లీ మా పని ప్రారంభించాం. తుది నివేదికనివ్వడానికి మూడు నెలల గడువు పొడిగించారు.

దీనికి ఒక నేపథ్యం ఉంది.

విభజన చట్టంలో – ఆర్థిక విషయాలను పద్నాలుగో ఆర్థికసంఘానికి నివేదిస్తామని చేర్చుతున్నట్టు వార్తాపత్రికల్లో వచ్చింది. అది మంచిది కాదని నాకు అనిపించింది. ఎందుకంటే అడిషనల్ టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఏమున్నా అవి ఆర్థిక సంఘానికి రాష్ట్రపతి నేరుగా చెబుతారు. కేంద్ర మంత్రిమండలి ద్వారా అది చేరుతుంది. అందువల్ల ఆంధ్ర విభజన బిల్లులో పద్నాలుగో ఆర్థిక సంఘం ప్రస్తావనే అనవసరం, సంప్రదాయం కాదు. అదీగాక, ఆ ప్రస్తావన వల్ల ఇతర రాష్ట్రాలు తమకు అన్యాయం జరుగుతుందేమోనని భయపడతాయి, ఇటు ఆంధ్ర ప్రజల్లో తమకేదో ప్రత్యేకంగా ఒరుగుతుందని ఆశలు రేకెత్తుతాయి. రెండూ మంచివి కావు. నాలో ఇంకో భయం ఏమిటంటే – ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ఉండగా అసాధారణ ప్రక్రియలను అంగీకరించడం, అందునా నేను ఆంధ్రప్రదేశ్‌వాడినవడం ఇతరులకు అపార్థాలకు తావిచ్చినట్టు అవుతుంది.

అందువల్ల ఈ వార్తలను చూసిన వెంటనే నేను అత్యున్నతస్థాయి వర్గాలకు నా ఇబ్బందిని తెలియజేశాను. ‘పద్ధతి ప్రకారం చెయ్యవలసింది తప్ప మీరు కొత్తగాగాని, అదనంగాగాని ఏమీ చెయ్యనవసరం లేదు’ అని హామీనిచ్చారు. విభజన బిల్లును సైతం ఆ హామీకి తగినట్టే రూపొందించారు.

2014 సెప్టెంబరులో ఆంధ్ర ప్రభుత్వంతో తిరుపతిలోనూ, తెలంగాణ ప్రభుత్వంతో హైదరాబాద్‌లోనూ కమిషన్ మళ్లీ సమావేశమై వారివారి అవసరాలు, ఆలోచనలను స్పష్టంగా తెలుసుకుంది.

సాధారణంగా అన్ని రాష్ట్రాలూ గతంలో కనీసం ఐదేళ్లలో తమ ఆదాయం – ఖర్చులూ చెబుతాయి. భవిష్యత్ ఆదాయమూ, అవసరాలేమిటో చెబుతాయి ఫైనాన్స్ కమిషన్‌కు. కొత్తగా ఏర్పడిన రెండు రాష్ట్రాలకూ ఉమ్మడిగా తప్ప విడివిడిగా గత కాలపు లెక్కలు లేవు. ఆ పునాది లేనప్పుడు భవిష్యదవసరాలను లెక్కవెయ్యడం క్లిష్టమైన ప్రక్రియ అయికూర్చుంది. రాజకీయవర్గాలు దేనికీ ఒప్పుకోవు, అలాగని గట్టిగా అభ్యంతరాలు చెప్పవు. దానివల్ల ఫైనాన్స్ కమిషన్ ఈ రెండు కొత్త రాష్ట్రాలను మిగిలిన అన్నిటితో పోల్చి చూసి ఒక నిష్పత్తి ప్రకారం పంపకాలు చెయ్యడానికి శ్రమ పడాల్సి వచ్చింది.

విభజన బిల్లులో ఆర్థిక సంఘం గురించి ప్రస్తావించడం వల్ల – ఇరు రాష్ట్రాల ప్రజలూ ఆర్థికసంఘం తమకు ప్రత్యేకంగా ఏవో కొన్ని ప్రయోజనాలు ఇస్తుందన్న భావనలోకి వెళ్లారు.

ఆ సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా గురించిన చర్చలు జోరందుకున్నాయి. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధానమంత్రి పార్లమెంటులో వాగ్దానం చేశారు.

1960ల చివర్లో కొన్ని ప్రత్యేక పరిస్థితులున్న రాష్ట్రాలకు కేంద్రం నుంచి సాయం అందించేందుకు ప్రత్యేక హోదా లభించింది. అది పర్వత ప్రాంతమై ఉండాలి, తక్కువ జనసాంద్రత ఉండాలి, సరిహద్దుల్లో ఉండాలి, ఆర్థిక వెనుకబాటుతనం ఉండాలి – ఇవన్నీ ఉంటేనే ప్రత్యేక హోదా వస్తుంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదానివ్వాలంటూ ప్లానింగ్ కమిషన్ ప్రతిపాదిస్తుంది, దానికి నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అంగీకరిస్తే, కేంద్రప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఆర్థిక సంఘాలకు ఎలాంటి పాత్రా లేదు. ప్రత్యేక హోదా అనేది పూర్తిగా ఆర్థిక సంఘం పరిధిలో లేని విషయం. దీన్ని అతిక్రమించి ముందుకెళ్లాల్సిన అవసరం, అవకాశం, అధికారం – మూడూ ఆర్థిక సంఘానికి లేవు.

అయినా సరే, విభజన వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతోందని, ఖర్చులు పెరుగుతున్నాయని ఫైనాన్స్ కమిషన్ లెక్కల్లో తేలింది. ఆ లోటును భర్తీ చెయ్యడానికి 22 వేల కోట్ల రూపాయల గ్రాంట్‌ను ఇచ్చింది. ఆంధ్రతో పాటు కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు కూడా ఈ తరహా గ్రాంట్‌ను ఇచ్చింది.

## నేనొప్పుకోకుంటే బాగుండేదేమో!

కేంద్ర – రాష్ట్రాలు 2015 – 16 బడ్జెట్లను ప్రవేశపెట్టడానికి ముందు కమిషన్ కేటాయింపులేమిటో తేల్చాలని మేమనుకున్నాం. అది మామూలు పని కాదు. క్లిష్టమైన ప్రక్రియ. దాన్ని సకాలంలో, సవ్యంగా చెయ్యడానికి మా కమిషన్ బాగా కష్టపడింది.

2014 మే 26వ తేదీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ పదవీస్వీకారం చేశారు. ఆర్థిక మంత్రిగా అరుణ్ జైట్లీ వచ్చారు. సంప్రదాయం ప్రకారం వాళ్ల అపాయింట్‌మెంట్లు తీసుకుని కలిశాం. జైట్లీ మమ్మల్ని సాదరంగా స్వాగతించారు, మా పనెలా సాగుతోందో చెబితే విన్నారు.

కేంద్ర ప్రభుత్వంలోని దాదాపు 30 శాఖలు పద్నాలుగో ఆర్థిక సంఘం ముందు తమ ప్రెజెంటేషన్లనిచ్చాయి.

కమిషన్‌లోని సభ్యులంతా వివిధ అంశాల మీద తీవ్రంగా చర్చలు సాగించేవాళ్లం, అభిప్రాయాలు పంచుకునేవాళ్లం. అభిప్రాయ భేదాలుండేవిగాని, అహంకారాలు లేనందువల్ల చర్చల ద్వారా ఏకాభిప్రాయానికి రాగలిగేవాళ్లం. అంటే అంతా ఆడుతూపాడుతూ పనిచేశామని కాదు. ఉద్విగ్న క్షణాలు కొన్ని లేకపోలేదు. ఒకసారి ఒక సభ్యుడు 'చస్తే మరో మీటింగుకు రానేరాను' అంటూ బయటికొచ్చేశారు. బుజ్జగించిన తర్వాత మళ్లీ వచ్చారు.

'ఆర్థికవేత్తల వాదులాటలు చూస్తుంటే రాజకీయనాయకుల మీద గౌరవం పెరుగుతోంది నాకు..' అన్నాను ఒకసారి! అంతలా వాళ్లు ఒకర్నొకరు ఖండించుకునేవారు. ఇలాంటి వైరుధ్యాలున్నప్పుడంతా సుష్మానాథ్ పరిస్థితిని చక్కబెట్టేది. వాస్తవానికి దగ్గరగా ఆలోచిస్తూ, ఆలోచించి నిర్ణయాలు తీసుకునే తన తీరుతో అందరినీ ఏకతాటిమీద నడిపించేవారామె.

'అసలు ఈ బాధ్యతను నెత్తికెత్తుకోకపోయి ఉంటే బాగుండేది..' అని నేనెన్నోసార్లు అనుకున్నాను. 'మన్మోహన్‌సింగ్‌గారికి ఆనాడే నో చెప్పేసి ఉంటే ఈ తలనొప్పంతా లేకపోను కదా' అనుకునేవాణ్ణి.

## 'నా నమ్మకం వమ్ము కాలేదు'

2014 డిసెంబరుకల్లా తుది నివేదికను సిద్ధం చేసింది మా కమిషన్. సంప్రదాయం ప్రకారం మేం రాష్ట్రపతికి దాన్ని సమర్పించాం. కమిషన్ ఏర్పడటానికి ముందు ఆర్థికమంత్రిగా ఉన్న ప్రణబ్‌ముఖర్జీ నివేదిక అందించేనాటికి రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. పద్నాలుగో ఆర్థిక సంఘం ఛైర్మన్‌గా నేను ఉండాలని తానెంతగా పట్టుపట్టారో చెబుతూ 'నా నమ్మకాన్ని నిలబెట్టారు మీరు' అంటూ ప్రశంసించారాయన. ముప్ఫయ్యేళ్లుగా దాదాపు ఆరు ఆర్థిక సంఘాలతో పనిచేసిన అనుభవజ్ఞుడాయన. అందువల్ల మా నివేదికలోని అంశాలన్నిటినీ కూలంకషంగా చర్చించారు. మా పూర్వ పరిచయాన్నంతా గుర్తు చేసుకున్నాం. నేను సెలవు తీసుకుని వచ్చేస్తూ ఉండగా 'కంగ్రాచ్యులేషన్స్, మీరు చాలా ప్రాథమికమైన విషయాల మీద శ్రద్ధ పెట్టారు..' అన్నారు చిరునవ్వుతో.

**చెప్పినవీ – చేసినవీ**

కేంద్ర – రాష్ట్రాల మధ్య పన్నుల పంపకం, వివిధ రాష్ట్రాల మధ్య పంపకాలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ వంటి అతి ముఖ్యమైన మా ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. మిగిలినవాటిని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. 2015 ఫిబ్రవరిలో 'యాక్షన్ టేకెన్ రిపోర్టు'ను పార్లమెంటులో పెట్టింది. పద్నాలుగో ఆర్థిక సంఘం చేసిన ప్రతిపాదనలు విలక్షణంగా ఉన్నాయంటూ మెచ్చుకున్నారు మేధావులు.

కేంద్ర – రాష్ట్రాల మధ్య నిధుల పంపకం తీరును సమూలంగా మార్చేసింది మా కమిషన్. పన్నుల్లో కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావలసిన వాటాను 32 శాతం నుంచి ఏకంగా 42 శాతానికి పెంచేశాం! అదివరకు కమిషన్లన్నీ కేవలం ఒక శాతమో రెండు శాతమో తప్ప పెంచలేదు.

మా రికమెండేషన్ వల్ల రాష్ట్రాలకు నిధుల ప్రవాహం పెరిగింది. అవి తమకు అనువైన పథకాల రూపకల్పన చేసుకునే వీలు కలిగింది. కేంద్రం 'తన విచక్షణ'తో నిధులివ్వగలిగే వీలును తగ్గించాం. ఫలితంగా – రాజకీయ ప్రభావాలతో కేంద్రం రాష్ట్రాల విధాన నిర్ణయాల్లో జోక్యం చేసుకునే వీలు తగ్గిపోయింది!

మరొక సంచలనాత్మక నిర్ణయం ఏమంటే – అప్పటివరకూ 1971 జనాభానే అన్ని లెక్కలకూ ఆధారంగా ఉండేది. మా కమిషన్ 2011 జనాభాను కూడా ప్రాతిపదికగా తీసుకోవడంతో వివిధ ప్రాంతాల అవసరాలు వాస్తవంగా వెలుగులోకి వచ్చాయి.

దశాబ్దాలుగా ప్రణాళిక – ప్రణాళికేతర (ప్లాన్ – నాన్ ప్లాన్) అంటూ ఖర్చులు రెండుగా ఉండేవి మన దేశంలో. అది సరికాదని కొన్నిసార్లు వినిపించినా, దానిమీద ఎవరూ ఎలాంటి చర్యా తీసుకోలేదు. మా కమిషన్ మాత్రం ప్లాన్ – నాన్ ప్లాన్ ఏం లేదని, అన్నీ కలిపే చూస్తామని తేల్చిచెప్పింది! దీనివల్ల రెవెన్యూ ఎక్స్‌పెండిచర్ అంతా ఫైనాన్స్ కమిషన్ పరిధిలోకి వచ్చింది, బడ్జెట్ ప్రకారం కేటాయింపులు చేసే వీలు కలిగింది. దశాబ్దాలుగా తరబడి ఉన్న అనిశ్చితికి మేం మంగళం పాడేశామన్న మాట.అలాగే 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా దాదాపు మూడు లక్షల కోట్లు స్థానిక ప్రభుత్వాలకు నిధులుగా లభించాయి. ఇది కేంద్రానికి పన్నులుగా వచ్చే ఆదాయంలో దాదాపు 3.5 శాతం! మొత్తానికి ఈ ప్రక్రియలో రాష్ట్రాల ఆర్థిక సంఘాల పాత్ర కీలకంగా మారింది. అలాగే ఆర్థిక విషయాల్లో రాష్ట్రాలు మరింత బాధ్యతగా

మెలగాల్సిన సమయం వచ్చింది. సాధారణంగా ఆర్థిక సంఘాలు అవార్డు ఇస్తూనే కండిషన్లూ పెడతాయి. కాని మా సంఘం కండిషన్ల జోలికే పోలేదు.

## మేం చెప్పినవీ – ఇంకా చెయ్యనివీ..

అయితే నేను అనుకుని చెయ్యలేకపోయిన విషయమూ ఒకటుంది. వ్యక్తుల ఆదాయపన్ను మీద ఒక పరిమితికి లోబడి ఒక సర్‌ఛార్జీ విధిస్తే అది రాష్ట్రాలకు ఆదాయవనరు అవుతుందని ఆలోచించాను. కాని అది కుదరలేదు.

మా కమిషన్ చేసిన కొన్ని సూచనలను ఇప్పటికీ పరిశీలిస్తూనే ఉన్నారు!

వాటిల్లో మొదటిది – కేంద్ర బడ్జెట్‌ను ప్రతిపాదించడానికి ముందు, అందులో ఏముందో చూసి పార్లమెంటేరియన్లందరికీ అర్థమయ్యేలా వివరంగా చెప్పేలా ఒక నిపుణుల సంఘం (ఫిస్కల్ కౌన్సిల్) ఉండాలని సూచించాం. చాలా దేశాల్లో అలాంటి ఏర్పాటు ఉంటుంది, దానివల్ల పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడు అర్థవంతమైన చర్చ జరుగుతుంది. కాని ఇప్పటికీ ఇటువంటి కౌన్సిల్ ఏర్పాటు జరగలేదు.

కొన్ని పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహణ లోపభూయిష్ఠంగా ఉంది, అవి నష్టాలబాటన నడుస్తున్నాయి. వాటిని అలానే కొనసాగిస్తూ నష్టాలను చూడటమంటే పన్నులు కట్టే ప్రజల సొమ్మును వృథా చేస్తున్నట్టే. వాటిలో కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులను, పాత్రనూ సరిచూసుకోవాలి. అవసరమైతే ఉపసంహరించుకోవాలి. దీనికి కేంద్రం ఊ కొట్టిందిగాని ఆచరణలోకి రాలేదు.

ఇక మూడో అంశం – బ్యాంకులకు ప్రభుత్వం క్యాపిటల్ సమకూర్చడం గురించి. ఏయే బ్యాంకులకు, ఏ ప్రాతిపదికన అది అందుతుందో ప్రజలకు తెలియాలి. భారీ రుణాలు తీసుకుని కొందరు వ్యక్తులు బోర్డు తిప్పేస్తే బ్యాంకులు నష్టపోతే, అది ప్రజల సొమ్మే కదా. మరి దానికి ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలి, జవాబుదారీగా ఉండాలి. దీని విషయంలో ఓ కమిషన్‌ను పెట్టమని చెప్పాం. కాని ఈ దిశగా ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

అసలు మన కేంద్రం, వివిధ రాష్ట్రాలు చేసిన అప్పులు ఎంత? ఆర్‌బీఐ, ప్రభుత్వమూ కలిసి తీసుకున్న అప్పులు ఎన్నో ఇది ప్రజలకు తెలియాలి. ఆ లెక్కలు బహిర్గతపరచాలని సూచించింది మా కమిషన్. అది జరగలేదు.

విలువైన వనరులు – నీరు, విద్యుత్తు వంటివి ఎవరెవరు ఎంత వాడుతున్నారో తెలిసేలా వంద శాతం మీటరింగ్ పక్కాగా జరగాలని, అప్పుడే సబ్సిడీలు ఎవరికి, ఎప్పుడు, ఎంతెంత ఇస్తున్నారని తెలుస్తుందని సూచించాం. ఆ విషయంలో ఎవ్వరూ అడుగు ముందుకు వేసిందే లేదు.

వనరులు – ఆదాయాల పంపకాల్లో వివిధ రాష్ట్రాలను సమన్వయం చేసేందుకు నిపుణుల బృందం ఉండాలని, దానికో పద్ధతి ఉండాలనీ చెప్పాం. ఆ ప్రయత్నం సాగలేదు.

**విమర్శలూ ఉన్నాయి..**

పద్నాలుగో ఆర్థిక సంఘం చేసిన ప్రతిపాదనలపై కొన్ని అభ్యంతరాలూ, విమర్శలూ రాకపోలేదు. ముఖ్యంగా కేంద్రం తన పథకాలను రూపొందించుకునే వీలు తగ్గిపోవడం కొన్ని వర్గాలకు నచ్చలేదు.

'పథకాల రూపకల్పన, నిధుల కేటాయింపులు వంటి విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడానికి రాష్ట్రాల కన్న కేంద్రానికి పరిజ్ఞానం ఎక్కువ ఉంటుందా? రాజ్యాంగంలోగాని, థియరీలోగాని అలా చెప్పబడి ఉందా? ఇక్కడి అధికారులే అక్కడా పనిచేస్తారు తప్ప, వారికి ప్రత్యేకమైన శిక్షణ, నైపుణ్యం ఉన్నాయా?' అంటూ నేను లేవనెత్తిన ప్రశ్నలు ఆ వర్గాలను ఇరకాటంలోకి నెట్టాయి.

అలాగే 'వివిధ పథకాలను రాష్ట్రాలు నిర్వహించే తీరు నాసిగా ఉంటుంది.. అందువల్ల సంక్షేమ పథకాలన్నిటినీ కేంద్రమే నిర్వహించాలి' అన్న అభిప్రాయానికి విరుద్ధంగా నేను మాట్లాడటం ఎక్కువమందిని ఇబ్బంది పెట్టింది.

నేనన్నదేమంటే – కేంద్ర ప్రభుత్వ పథకాలను నిర్వహించడానికి వేరేగా సిబ్బంది లేరు కదా? దేన్నైనా రాష్ట్ర అధికారులే చేయిస్తారు. అలాంటప్పుడు అదే రకమైన పథకాలను రాష్ట్రాలు చేపడితే తప్పేముంది? వాటినీ ఆ సిబ్బందే నిర్వహిస్తారు! అందువల్ల కేంద్ర పథకాల నిర్వహణ బాగుంటుందని, రాష్ట్ర స్థాయి పథకాల నిర్వహణ నాసిరకంగా ఉంటుందని మనమెలా అంటాం?

ప్లాన్ – నాన్ ప్లాన్ అంటూ విడివిడిగా ఏమీ లేదని మేం తేల్చెయ్యడం వల్ల ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు ఒకాయనకు చాలా కోపమొచ్చింది. 'ఆర్థిక సంఘం తన పరిధిని దాటి పాలసీ విషయాల్లోకి చొచ్చుకొస్తోంది' అంటూ వ్యాఖ్యానించాడాయన.

### అనుకున్నంతా అయింది

ఆట తీరు మారిపోవడం కొందరికి నచ్చుతుంది, కొందరికి నచ్చదు.

'జనాభాను అరికట్టి, ఆర్థికాభివృద్ధి పథంలో దూసుకెళుతున్నందుకు మాకు మంచి శాస్తే జరిగింది, మాకు నిధులు తగ్గించేశారు' అని గోలపెట్టింది తమిళనాడు.

'మాకిది పెద్ద షాక్. మేమెంతో వెనకబడి ఉన్నాం, అయినా మాకు రెవెన్యూ డెఫిసిట్ గ్రాంట్లు రానేలేదు. అదే మాకన్నా బాగున్న ఏపీ, కేరళ, పశ్చిమబెంగాళ్లకు మాత్రం ఇచ్చారు..' అని ఆక్రోశించింది బీహార్.

'తెలంగాణలో ఖర్చులు తక్కువ, మిగులు ఎక్కువ అని కమిషన్ లెక్కలు నిరూపిస్తున్నాయి. చూశారా, గతంలో మా సొమ్ములన్నిటినీ ఆంధ్ర ప్రభుత్వం ఎలా వాడుకుందో? పెద్దమనుషుల ఒప్పందాన్ని ఎలా ఉల్లంఘించారో ఇంతకు మించిన సాక్ష్యం ఏం కావాలి' అన్నది తెలంగాణ. 'విభజన వల్ల ఎంతో నష్టం జరిగింది. మాకెలాంటి పరిహారమూ అందలేదు. మాకు న్యాయం జరగలేదు' అన్నది ఆంధ్రప్రదేశ్.

'ఆంధ్రప్రదేశ్ విభజన జరగకుండా ఉంటే ఆ రాష్ట్రానికి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రాదు. అప్పుడు ఆ సొమ్ము మా అందరికీ వచ్చి ఉండేది. తెలుగువాళ్లు దెబ్బలాడుకుని లాభపడ్డారు, వాళ్ల దెబ్బలాటల వల్ల మేమంతా నష్టపోయాం' అని ఆక్రోశించాయి మిగిలిన రాష్ట్రాలు.

'పన్నుల్లో మాకు రావలసినదాన్ని పదిశాతం తగ్గించేశారు, అదిగాక పూర్వంలాగే అన్ని పథకాలకూ డబ్బు కావాలంటాయి రాష్ట్రాలు. ప్రత్యేక నిధుల్విడానికి వీలే లేదు. మా ఆర్థికపరిస్థితి ఏం కావాలి?' అంటూ బాధపడింది కేంద్ర ప్రభుత్వం.

మొత్తమ్మీద పద్నాలుగో ఆర్థిక సంఘం అందరికీ సమానంగా అసంతృప్తిని పంచింది!

# కలిసి ఎదుగుదాం

ప్రియమైన పాఠకులకు,

ఈ పుస్తకంలో నా వ్యక్తిగత, వృత్తిపరమైన జ్ఞాపకాలను రాశాను. అయితే అవన్నీ దేనికది విడివిడిగా కాకుండా కలగలిసే ఉంటాయి. మా కుటుంబం, నేను కలిసిన వ్యక్తులు, ఎదుర్కొన్న సంఘటనలు – అన్నిటినీ గుర్తున్నంత వరకూ చెప్పాను. వీటిని చదివితే – నేను దేనికెంత విలువనిచ్చానో, ఎటువంటి విలువలు పాటించానో మీరు సులువుగా అర్థం చేసుకోగలుగుతారు. నిజజీవితంలో వ్యక్తులు, స్వభావాలు, విధానాలు, మంచీ చెడూ అన్నీ కలగలిసే ఉంటాయి. దాన్ని అర్థం చేసుకుంటే నా ప్రయత్నం సఫలమైనట్టే.

వృత్తిరీత్యా నేను వివిధ స్థానాల్లో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలు కొన్నింటిని విపులంగా, కొన్నింటిని క్లుప్తంగా చెప్పాను. అన్నిటికీ వివరణ ఇవ్వాలంటే ఈ పుస్తకం చాలదు. అందువల్ల ప్రత్యక్షంగానో పరోక్షంగానో నా పాత్ర ఉన్నవాటిని మాత్రం ప్రస్తావించాను. వివిధ సందర్భాల్లో అధికారగణం ఎలా స్పందిస్తుంది, విధాననిర్ణయాలు ఎలా రూపుదిద్దుకుంటాయో చెప్పాను.

నేను గవర్నర్‌గా రిటైరయిన తర్వాత జరిగిన ఆర్థిక పరిణామాలు, విధానాల మీద నా అభిప్రాయాలను చెప్పలేదు. అలా చెప్పాలంటే అక్కడ వాస్తవంగా మారుతున్న పరిస్థితులు తెలియాలి, ఆయా అంశాల పట్ల తగినంత అధ్యయనం ఉండాలి. అవి లేకుండా ఏదో ఒకటి చెప్పడమంటే ఆయా వ్యక్తులను, సంస్థలను ఇబ్బంది పెట్టడమే అవుతుంది.

'మీ అనుభవాన్నుంచి మన దేశ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో చెప్పండి. మనం అభివృద్ధి చెందిన దేశంగా నిలబడతామా?' అని నన్ను కొందరు అడుగుతూ ఉంటారు.

కొన్ని శతాబ్దాలుగా మన దేశ ఆర్థిక వ్యవస్థ ఏయే మార్పులకు లోనయ్యింది, ఎటువంటి అంశాలు దాన్ని ప్రభావితం చేశాయో తెలుసుకుంటే మన ఆర్థిక విధానాలను అంచనావెయ్యడానికి పనికొస్తుంది.

మూడు వందల ఏళ్ల క్రితం ప్రపంచ ఆదాయంలో మన దేశ ఆదాయం 25శాతంగా ఉండేది. అదే రెండొందల ఏళ్ల తర్వాత – అంటే 1900ల్లో మన వాటా కేవలం 5శాతం కన్నా తక్కువ. అంటే దాదాపు రెండు వందల ఏళ్ల పాటు ప్రపంచమంతా పురోగమిస్తూ ఉంటే మనం మాత్రం వెనక్కిపోయాం. 1900 – 1950 వరకూ మన ఆదాయం సగటున 0.9శాతం చొప్పున పెరుగుతూ వచ్చింది. అయితే జనాభా దానికన్నా వేగంగా పెరిగింది. అందువల్ల అభివృద్ధి ఏమీ కనిపించలేదు. 1950–80 మధ్య ఆదాయం మూడు శాతం చొప్పున, 90ల్లో ఆరుశాతం చొప్పున పెరిగింది. ఇది ఆర్థికంగా మనం ప్రగతి సాధించిన కాలం.

2003–08లో మన జాతీయ ఆదాయం పెరుగుదల 8.8 శాతానికి చేరుకుంది! గడచిన రెండు వందల ఏళ్లలో మనం అత్యంత అభివృద్ధిని సాధించిన కాలం అది. తర్వాత గ్లోబల్ క్రైసిస్ విరుచుకుపడటంతో అది 7 శాతానికి వచ్చింది. అయినప్పటికీ ప్రపంచంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా మనం ముందంజలోనే ఉన్నాం.

1980ల్లో సరళీకత ఆర్థిక విధానాల వల్ల కొంత అభివృద్ధి జరిగినట్టు కనిపించినా అది సంక్షోభానికి దారితీసింది. సంక్షోభం తర్వాత 1992 నుంచి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు మన దేశ ముఖచిత్రాన్ని మార్చేశాయి. 1961లో ఇందిరాగాంధీ తాను స్వయంగా ప్రధానమంత్రి కుమార్తె అయినా సరే, తన కుమారుడు రాజీవ్‌గాంధీ చదువుకు అవసరమైన ఎనిమిది వేల రూపాయలకు విదేశీ మారక ద్రవ్యం కావాలని రిజర్వ్‌బ్యాంకును అభ్యర్థిస్తూ లేఖ రాస్తేనే, అది వచ్చింది!

మరి ఇప్పుడు?

ఎంత సామాన్యులైనా ప్రపంచంలో తమకు నచ్చినచోట చదువుకునేందుకు వీలుంది, దానికి అవసరమైన సొమ్ము సులభంగా సమకూరుతోంది! ఒక్క చదువే కాదు, వైద్యం, పర్యటకం – దేనికైనా తమ తాహతు మేరకు సొమ్మును ఖర్చుపెట్టుకోవచ్చు.

1991లో అత్యవసర దిగుమతులకు సైతం కటకట పడాల్సిన స్థితి, బంగారాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి. అదే 2005కల్లా మన విదేశీమారకద్రవ్య నిల్వలు పుంజుకున్నాయి. 2008కి మూడొందల బిలియన్ డాలర్ల నిల్వ పేరుకుంది!

**మన బలాలు**

మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు 'ఈ దేశంలో ఇన్ని కులమతాలు, వేర్వేరు ప్రాంతాలు, వేర్వేలు వేషభాషలు, వేర్వేరు ఆహారపుటలవాట్లు ఉండగా అసలు వీళ్లంతా ఒక దేశంగా కలిసి ఉండటం సాధ్యమేనా?' అని అనుమానపడేది ప్రపంచం. కాని అవన్నీ అలాగే ఉన్నా, భిన్నత్వంలో ఏకత్వాన్ని, జాతీయ ఐకమత్యాన్ని సాధించాం, ఒక దేశంగా నిలబడ్డాం. ఇప్పుడు యూరప్‌లో, బ్రిటన్‌లో తలెత్తిన తరహా వేర్పాటు భావనలేమీ మనలో లేవు. ఒక దేశంగా మనకిది పెద్ద విజయం.

వేషభాషలు, సంస్కృతీసంప్రదాయాల్లో భిన్నత్వాన్ని నిలుపుకోవడం కూడా విజయమనే చెప్పుకోవాలి.

'సర్వేజనా స్సుఖినోభవంతు' అనేదొక విలువగా మనం ఆచరణలో చూపించాం! రాష్ట్రపతి, ప్రధానమంత్రి వంటి అత్యున్నతస్థాయి పదవుల్లో మెజారిటీ వర్గాలకు చెందని వ్యక్తులు రాణించడం మన దేశానికి ప్రపంచంలో గౌరవాన్ని తీసుకొచ్చింది.

ఎప్పుడైనా ప్రపంచమంతా ఒక్కటై ప్రపంచ ప్రభుత్వం అనేదొకటి ఏర్పడితే గనుక, దాన్ని నడపడానికి భారతదేశమే ఒక ఉదాహరణగా నిలబడుతుంది.

కొన్ని ఒడుదొడుకులున్నా, మన ప్రజాస్వామ్యమూ రాజకీయ వ్యవస్థా స్థిరమైనవి. అధికారంలో మార్పు సాఫీగా జరిగిపోతుంది. సంకీర్ణ ప్రభుత్వాలు మంచివి కాదనుకోవడం పొరపాటే. సుస్థిరత, సమర్థత, స్వచ్ఛత ఉన్న ప్రభుత్వాలు దేశానికి మేలు చేస్తాయి.

మన దగ్గర కేంద్ర – రాష్ట్ర సంబంధాలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి, దానివల్ల వృద్ధి విషయంలో పోటాపోటీగా ఉంటాయి.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి శాంతిని ఒక విలువగా చాటుతోంది మన దేశం. 1972 తర్వాత కార్గిల్ యుద్ధం తప్ప, యుద్ధకాంక్ష లేకుండా అభివృద్ధిపథంలో పరుగు పెడుతున్నాం.

మన బాలీవుడ్, యోగా, బుద్ధిజం వంటివి ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

మన దేశం మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నది. డాక్టర్లు, ఇంజినీర్లలో మన దేశంలో ఉన్నంతమంది స్త్రీలు మిగిలిన దేశాల్లో ఉండటం అరుదు. వాళ్లు ఎంత స్థాయికైనా ఎదిగే అవకాశం ఉంది.

మన ప్రైవేట్ రంగం చురుగ్గా ఉంది. మన కార్పొరేట్లు బహుళజాతి సంస్థలుగా అవతరిస్తున్నాయి.

ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో (గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటివి) భారతీయులు అగ్రస్థానాల్లో కనిపిస్తున్నారు.

ఎన్నో కొత్త సృజనలు వస్తున్నాయి.

మన దేశంలో జనాభా వైవిధ్యమూ ఉంది. ఉదాహరణకు ఇతర దేశాల్లో ఒకేసారి ఎక్కువమంది వృద్ధులైపోవడమో లేదంటే ఒకేసారి యువతరం రావడమో జరుగుతోంది. కాని మన దగ్గర ఒక రాష్ట్రంలో వృద్ధుల సంఖ్య ఎక్కువ ఉంటే మరో రాష్ట్రంలో యువత సంఖ్య ఎక్కువ ఉంటుంది. దానివల్ల వస్తువులు, సేవలు మెరుగ్గా లభిస్తున్నాయి.

**సవాళ్లూ ఉన్నాయి**

త్వరగా ఎదిగి వస్తున్న యువతను సానుకూల శక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత మనమీదే ఉంది. వాళ్ల శక్తిసామర్థ్యాలకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించగలగాలి. కాని దురదష్టవశాత్తు మన విద్యాప్రమాణాలు ప్రపంచ ప్రమాణాలతో పోలిస్తే చాలా తక్కువ. వాటిని మెరుగుపరుచుకుంటేనే మన యువతను నిపుణులైన, విద్యావంతులైన పౌరులుగా రూపొందించుకోగలం.

మన జాతీయ ఆదాయంలో వ్యవసాయానిది 15 శాతం. అది ఏటా 3శాతం పెరుగుతుందని అంచనా. కాని దానిమీద ఆధారపడిన వారు 50 శాతం. అందువల్ల ఎక్కువమందిని దాన్నుంచి వేరే ఉపాధి రంగాలవైపు మళ్లించాలి. ఇది పెద్ద సవాలు.

మన ప్రభుత్వాలు ప్రజాసంక్షేమానికి పెద్దపీట వెయ్యాలి. అంటే రహదారులు, స్ట్రీట్‌లైట్లు, తాగునీరు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వంటివాటి నిర్వహణ అత్యున్నత స్థాయిలో జరగాలి. కాని మన దగ్గర ప్రజాకర్షక పథకాల పట్ల మోజెక్కువ.

అలాగే మనకున్న సహజ వనరులను సంరక్షించుకోవాలి. నీరు, గాలి, వాతావరణం కలుషితం కాకుండా జాగ్రత్తపడాలి.

మన నగరాల అభివృద్ధి నాణ్యంగా ఉండేట్టు, గ్రామీణ – పట్టణ అసమానతలు పెరగకుండా జాగ్రత్త పడాలి.

'మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్' అంటే మధ్యతరగతి దేశంగా మారే సమయంలో వచ్చే ఇక్కట్ల నుంచి మనల్ని మనం రక్షించుకోవాలి. లంచగొండితనం, నల్లధనం, ఎన్నికల్లో ప్రలోభాల వంటి చీడపురుగులను ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మేలు.

**భవిష్యత్తు...**

టెక్నాలజీ పెరుగుతోంది కనుక ప్రపంచీకరణ కూడా పెరుగుతుంది. దానికి దేశీయంగా బలంగా ఉండాలి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సరైన సంబంధాలు ఉండటం ముఖ్యం. గ్లోబల్ క్రైసిస్ తర్వాత అన్ని దేశాలూ ప్రపంచీకరణకు జంకుతున్నాయి. కాని మనకు ప్రపంచీకరణ వల్ల లాభం కలిగింది కనుక, ఇంకా అంతర్గతంగా బలం పెంచుకుంటే మనకిది మరింత లాభదాయకమవుతుంది. దానికి తగిన వ్యూహాలు రచించుకోవాలి. ఇతర దేశాలతో మన వ్యాపారం పెరగాలి, ప్రజల రాకపోకలు, సేవలు ఇచ్చిపుచ్చుకోవడాలూ పెరగాలి.


కాని ఫైనాన్స్ అంటే విదేశీ రుణాలు, పెట్టుబడుల విషయంలో మాత్రం అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఏ కారణం వల్లనైనా అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఇతర దేశాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన పరిస్థితి వస్తే, దాన్నుంచి కోలుకోవడం అత్యంత కష్టమని చరిత్ర చెబుతోంది.

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ మనది. ముందుముందు మన దేశ యువతకు అపారమైన అవకాశాలు వస్తాయి. జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

ఆ వెలుగులను మనం అందుకుంటామని, నైతికంగా, ఆర్థికంగా మనం సాధించే వ్యక్తిగత అభివృద్ధితో మన దేశాన్ని మరింత సుసంపన్నం చేస్తామని నా నమ్మకం.

మీ


**యాగా వేణుగోపాల రెడ్డి**




కుటుంబ ఛాయాచిత్రం (ఎడమనుండి) ప్రమీల (చెల్లెలు), అమణ్ణమ్మ (తల్లి), రమేశ్ కొండా రెడ్డి (చిన్నతమ్ముడు), యాగా పిచ్చి రెడ్డి (నాన్న), మధుసూదన్ రెడ్డి (తమ్ముడు)



2016లో కుటుంబ సభ్యులతో



1956 లో అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రదర్శించిన
ఒక నాటకంలో కానిస్టేబుల్‌గా నటించిన వైవిరెడ్డి



1959లో వివేకానంద కాలేజీ హాస్టల్‌లో కామరాజ్ నాడార్‌తో




*1969 ఏప్రిల్ 24న వైవి రెడ్డి, గీతల వివాహం*



*1969 లో రాష్ట్రపతి వివి గిరి గారితో ఒంగోలు రైల్వే స్టేషన్లో భూమిలేని నిరుపేదలకు భూమి పట్టాలు పంచుతున్న సందర్భం.*



*1969లో ముఖ్యమంత్రి కాసుబ్రహ్మానందరెడ్డిని పుష్పమాలతో అలంకరిస్తూ.*



*1974 లో జిల్లాకలెక్టరుగా నల్గొండలో రిపబ్లిక్‌డే పరేడ్‌ను సంబోధించి మాట్లాడుతూ*



*1985లో ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు,*
*ఇంటెలిజెన్స్ చీఫ్ రామమోహనరావు ఐపిఎస్ గార్లతో*



*1998లో ఆంధ్రప్రదేశ్ గవర్నరు, తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఛాన్సలర్*
*సి.రంగరాజన్ గారితో*



ఆర్‌బిఐలో తెలుగు గవర్నర్ల దశాబ్దం (2003–2013) వైవి రెడ్డి, దువ్వూరి సుబ్బారావు




2004లో ఆర్థిక రంగంలో తన ఆత్మీయ మిత్రులు
ఆర్‌బిఐ మాజీ డిప్యుటీ గవర్నర్ ఎస్.ఎస్. తారాపోర్,
మాజీ ఎస్.బి.ఐ ఎం.డి., యూనియన్ బాంకు చైర్మన్ ఎం.జి. బిదేలతో.



*2004లో నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారితో*



*ముంబైలో 2006లో ప్రధానమంత్రి ప్రొఫెసర్ మన్మోహన్ సింగ్‌తో*



ఐదుగురు మాజీ ఆర్‌బిఐ గవర్నర్లు (ఎడమనుండి) ఎస్. వెంకటరమణన్, సి. రంగరాజన్, మన్మోహన్ సింగ్, నరసింహం, జలాన్‌లతో అప్పటి ఆర్‌బిఐ గవర్నర్ వై.వి. రెడ్డి



నాటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితతో వై.వి. రెడ్డి




*2008లో రిజర్వుబ్యాంకు బోర్డు డైరెక్టర్లతో*



*2010 లో నాటి రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభాపాటిల్ నుండి*
*పద్మవిభూషణ్ పురస్కారం స్వీకరిస్తూ*

వై.వి. రెడ్డిగా ప్రసిద్ధుడైన యాగా వేణుగోపాల రెడ్డి 1941 ఆగస్టు 17 న కడప జిల్లా, రాజంపేట తాలూకాలోని పాటూరు అనే పల్లెటూళ్లో జన్మించారు. వీరిది చదువు విలువ తెలిసిన కుటుంబం. ఆర్థికశాస్త్రంలో ఎం.ఏ చేసిన తరువాత సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి, ఐఏఎస్‌కు 1964 లో ఎంపికయ్యారు. రాష్ట్ర కేంద్ర సర్వీసులలో కీలకమైన పదవులు నిర్వహించారు. స్నాతక, స్నాతకోత్తర స్థాయిల్లోనూ, పరిశోధనలోనూ ఆయన అధ్యయనాంశమైన ఆర్థికశాస్త్రం ఆయన జీవితాన్నంతా నడిపించింది. ఉద్యోగజీవితంలో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. భారతీయ రిజర్వుబ్యాంకు డిప్యుటీ గవర్నర్‌గా, గవర్నర్‌గా పనిచేశారు. ఐదేళ్ల పాటు రిజర్వు బ్యాంకు గవర్నరు పదవిని నిర్వహించిన తొలి తెలుగువాడు వై.వి. రెడ్డి. తరువాత 14వ ఆర్థిక సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ఆర్థిక రంగానికి సంబంధించి ఇంగ్లీషులో అనేక ప్రామాణిక గ్రంథాలను రచించారు. 2010 లో పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఒక పల్లెటూరిలో సాధారణ కుటుంబంలో జన్మించి, దేశంలోనే అత్యున్నతమైన పదవులను అధిరోహించి, తన ఉద్యోగ జీవితమంతా సామాన్యుడి మేలు గురించే ఆలోచించిన వై.వి. రెడ్డిగారి ఆత్మకథే ఈ 'నా జ్ఞాపకాలు'.

☆☆☆

సాధారణంగా రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్లకు ఏదో ఒక పక్షం నుంచి ఇబ్బంది ఉంటూనే ఉంటుంది. ఆ విషయంలో నేను అదృష్టవంతుణ్ణనే అనుకుంటాను. నామీద నమ్మకంతో ఎన్డీయే ఐదేళ్ల పదవీకాలాన్నివ్వడం, యూపీయేలో సైతం అందరూ తెలిసినవారే కావడం, మరోవైపు వామపక్షాలు నన్ను తమవాడిగా భావించడం – దీనివల్ల నేను ఎన్నో కీలకమైన అంశాల్లో సంస్థకు నాయకుడిగా ముందడుగు వెయ్యగలిగాను!

రూ. 175/-

EBQ002

ఎమెస్కో బుక్స్

ISBN 978-93-86327-27-7

9 789386 327277